సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 4 । జూలై । 2025

ఎంపీపీ పాఠశాల సందర్శన
రంపచోడవరం ఎస్టీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను అమరావతికి చెందిన విద్యాశాఖ అధికారుల బృందం సందర్శించింది. 8లో



పరశురాముడిగా జగన్నాథుడు
విశాఖ టర్నర్ చౌల్ట్రీలో వేంచేసియున్న జగన్నాథస్వామి గురువారం పరశురామ అవతారంలో దర్శనమిచ్చారు. 8లో

ఘనంగా పంచామృతాభిషేకం
విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 8లో

న్యూస్‌రీల్

బాబు గారూ..కళాకారుల బకాయిలు చెల్లించండి

- మన్యసీమ కళాజాత అధ్యక్షుడు అప్పలరాజు అభ్యర్థన

డుంబ్రిగుడ: గత 2017–18లో జన్మభూమి గ్రామదర్శిని కార్యక్రమాలకు కళాజాత ద్వారా ప్రదర్శించిన బకాయి సొమ్మును సీఎం చంద్రబాబు తక్షణమే చెల్లించాలని మన్యసీమ కళ జాత బృందం అధ్యక్షుడు ఎం. అప్పలరాజు చేతులు జోడించి అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గత 2017–18లో టీడీపీ తరపున అనేక కార్యక్రమాలతో పాటు మారుమూల గ్రామాల్లో జన్మభూమి, గ్రామదర్శిని కార్యక్రమాలను కళా రూపంలో గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. దీనికి సంబంధించిన బకాయి సొమ్ము నేటి వరకు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కళాకారులకు ఇప్పటి వరకు బకాయి సొమ్ము చెల్లించకపోవడం తీవ్ర విచారకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కళాకారుల బకాయి సొమ్మును చెల్లించాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

స్థలాల సందర్శనకు నిర్వాసితులు

చింతూరు/కూనవరం: పోలవరం ముంపులో భాగంగా నిర్వాసితులవుతున్న కూనవరం, టేకులబోరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులు కాలనీల నిర్మాణ నిమిత్తం కావాల్సిన స్థలాలు సందర్శించేందుకు శుక్రవారం మూడు బస్సులు ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు గ్రామాలకు చెందిన నిర్వాసితులు తాడవాయిలో ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించి త్వరితగతిన తమ అభిప్రాయాలు తెలియజేస్తే తదుపరి ప్రతిపాదనల నిమిత్తం కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

- అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

గడుగుపల్లిలో అంగన్‌వాడి సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

హుకుంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ కె. సాహిత్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని కులుపాడు,గడుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బాలచంద్రమణిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో గిరిజనుడి మృతి

చింతపల్లి: మండలంలోని అంజలిశనివారం పంచాయతీ పాలమామిడిలో గెమ్మిలి వాసు పాము కాటుకు గురై మృతి చెందాడు. బుధవారం రాత్రి బాత్‌రూంకు వెళ్తుండగా పాము కాటుకు గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే వారు ద్విచక్ర వాహనంపై తాజంగి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఉన్నత వైద్యానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య వలసి, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతుడు వాసు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం మండల ప్రతినిధులు సాగిన చిరంజీవి పడాల్ కోరారు. పాలమామిడి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల అంబులెన్సు రాక సకాలంలో వైద్యం అందలేదన్నారు. దీనివల్ల వాసు మృతి చెందాడని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ (విశాఖ) : ఎన్‌ఏసీ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని... 18 ఏళ్లు నిండి 45 ఏళ్ల లో పు వారు అర్హులన్నారు. వసతి, స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 8309003957లో సంప్రదించాలని కోరారు.

మన్యంలో పైనాపిల్ రైతులు ధరలేక ఉసూరు మంటున్నారు. వర్షాల వల్ల వ్యాపారులు రావడం లేదు. అరకొరగా వచ్చిన వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఒక పైనాపిల్ సైజును బట్టి సగటున రూ.10 వరకు ధర చెల్లిస్తున్నారు. మైదాన ప్రాంతాలకు తరలించి మూడింటిని రూ.90 నుంచి రూ.100కు విక్రయించి ఆదాయం పొందుతున్నారు. వ్యాపారుల పరిస్థితి లాభసాటిగా ఉండగా ఆరుగాలం కష్టపడి పండించిన గిరి రైతులు మాత్రం పెట్టుబడి రాక నష్టాలు పాలవుతున్నారు.

ఇక్కడ రూ.10.. అక్కడ రూ.30

ధర పతనంతో పైనాపిల్ రైతు ఉసూరు

- తీవ్ర నష్టం కలిగిస్తున్న వర్షాలు
- ఏకధాటిగా కురుస్తుండటంతో కానరాని వ్యాపారులు
- మార్కెటింగ్ లేక నష్టపోతున్న గిరి రైతులు
- గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి

పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయి ప్రాంతంలో పైనాపిల్‌ను అమ్ముతున్న గిరిజన మహిళ

సాక్షి,పాడేరు: మన్యంలో పైనాపిల్ రైతుకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తుండటంతో వ్యాపారులు రాకపోవడంతో రైతులు మార్కెటింగ్ సమస్య ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ధర కూడా పతనమైంది. మరో పక్క పంటను కోయకుండా వదిలేయడంతో వర్షాలకు కాయలు కుళ్లిపోతుండటంతో గిరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

దిగుబడి బాగున్నా..

ఏజెన్సీలోని పాడేరు, అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, చింతపల్లి మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో 610 ఎకరాల విస్తీర్ణంలో పైనాపిల్‌ను సాగు చేస్తున్నారు. కొండపోడు, మెట్ట భూముల్లో సేంద్రియ విధానంలో పండించడం వల్ల రుచిలో నంబర్ వన్‌గా నిలుస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు పంట దిగుబడి ఉంటుంది. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజన రైతులు ఉసూరుమంటున్నారు.

ఈ ఏడాది దారుణంగా..

ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది పైనాపిల్ ధరలను వ్యాపారులు పతనం చేశారు. గత నెల సీజన్ ప్రారంభంలో ఒకొక్క కాయను రూ.20నుంచి రూ.25 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధరను బాగా తగ్గించేశారు. గత పది రోజుల నుంచి సైజునుబట్టి రూ.5 నుంచి రూ.13కు కొనుగోలు చేస్తుండటంతో గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. సమీపంలోని అనకాపల్లి జిల్లా వి.మాడుగుల సంతకు నేరుగా తీసుకువెళ్లినా అక్కడ వ్యాపారులు కూడా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని వారు వాపోతున్నారు.

గిట్టుబాటు ధరకు నోచుకోని పైనాపిల్

పులుసుమామిడి ప్రాంతంలో పైనాపిల్ సాగు

ముందుకురాని వ్యాపారులు : పైనాపిల్ సీజన్ ప్రారంభమైనప్పటికీ వ్యాపారుల రాక తగ్గింది. గతంలో తుని, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చేవారు. ఈ ఏడాది వ్యాపారుల నుంచి డిమాండ్ కూడా తగ్గింది.దీంతోపాటు వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పైనాపిల్‌ను కొనుగోలు చేసే వారు కరువయ్యారని గిరి రైతులు వాపోతున్నారు.

- పైనాపిల్ సాగుకు పేరొందిన వంట్లమామిడి, సలుగు, దేవాపురం, ఐనాడ పంచాయతీల పరిధిలోని గిరిజనులకు ఏటా ఈ పంట ద్వారా ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది కనీసం రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారుల వద్దకు తీసుకెళ్లినా తక్కువ ధరే..

అనకాపల్లి జిల్లా వి.మాడుగుల సంతలో కూడా పైనాపిల్‌కు తక్కువ ధరే లభిస్తోంది. వ్యాపారులు రూ.12కు మించి కొనుగోలు చేయడం లేదు. గత ఏడాది రూ.20కి అమ్ముకున్నాం. ఈ ఏడాది మాత్రం గిట్టుబాటు ధర కరువైంది. ప్రభుత్వం స్పందించి రైతుబజార్లకు తరలించి అమ్ముకునేలా ఏర్పాట్లు చేయాలి.

– కిముడుబోయిన శ్రీరాములు, పైనాపిల్ రైతు, కందులపాలెం, పాడేరు మండలం

ఐటీడీఏ మార్కెటింగ్ చేయాలి

ఈఏడాది పైనాపిల్‌కు గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. చిన్న కాయను రూ.5కు కొంటున్నారు. మైదాన ప్రాంతాల వ్యాపారులు గ్రామాలకు రావడం లేదు. మైదాన ప్రాంతాలకు రైతులు పైనాపిల్‌ను తరలించి అమ్ముకునే విధంగా ఐటీడీఏ మార్కెటింగ్‌కు సహకరించాలి. ఇలా చేయగలిగితే నష్టాల నుంచి బయటపడగలుగుతాం.

– కిల్లు కృష్ణ, గిరిజన రైతు, పులుసుమామిడి, పాడేరు మండలం

ఆర్కా రిసార్ట్స్‌పై చర్యలు తీసుకోండి

రంపచోడవరం ఐడీటీఏ పీవో, సబ్‌కలెక్టర్‌కు సీపీఎం నేతల ఫిర్యాదు

సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి ఫిర్యాదు అందజేస్తున్న సీపీఎం నాయకులు

రంపచోడవరం: పట్టణంలోని ఆర్కా రిసార్ట్స్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంభం శాంతిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలను కలిసి ఫిర్యాదు చేశారు. రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లో గిరిజనేతరులు బినామీలుగా ఉండి అక్రమంగా టూరిజం, రెస్టారెంట్లు, లాడ్జీలు, రిసార్ట్స్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ ప్రాంతాలకు 1996 పీసా, పంచాయతీ రాజ్ చట్టం అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ కట్టడాలు, వ్యాపారాలు చేయకూడదన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్కా రిసార్ట్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆదివాసీలతో ఆ స్థలాన్ని ఆక్రమిస్తామని వారు హెచ్చరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థుల ఆరోగ్యం, వైద్యసేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంభందిత అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కాకూడదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, మందులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థుల మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని పక్కాగా అమలుజేయాలన్నారు. విద్యార్థుల హెల్త్ రికార్డులపై ఉపాధ్యాయులు,వైద్యాధికారులకు అవగాహన ఉండడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ఆశ్రమ పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు సూక్ష్మ ప్రణాళికలు రుపొందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నివేదికలను ప్రతి నెలా పంపాలన్నారు. క్లాస్ టీచర్, వైద్యాధికారి, సూపర్‌వైజర్లు ఆర్‌బీఎస్‌కే పుస్తకంలో సంతకం చేయని పక్షంలో షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మానటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. గోమంగి మినీ గురుగులంతో పాటు ఇతర పాఠశాలల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలపై కలెక్టర్ ఆరా తీశారు. అన్ని పాఠశాలల్లో సిక్ రూమ్‌లు ఏర్పాటుతో పాటు సికిల్‌సెల్ ఎనీమియా కేసులకు అదనపు పౌష్టికాహారం అందజేయాలన్నారు. కీటక జనిత మలేరియా,డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండవ విడత దోమల నివారణ మందు పిచికారి పనులను వచ్చే నెల 31వరకు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, డీఎంహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, జిల్లా మలేరియాశాఖ అధికారి తులసి, డీఈవో బ్రహ్మాజీరావు, ఇన్‌చార్జి డీడీ రజని,డీసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వచ్చే నెలాఖరు నాటికి హోంస్టేల నిర్మాణం

వచ్చే నెలాఖరునాటికి జిల్లాలో హోంస్టేల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి టూరిజం కమిటీ ప్రతినిధులు,ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. హోంస్టేల కోసం గుర్తించిన గృహాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు.పర్యాటకులకు వసతితో పాటు అల్పాహారం.భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.హోం స్టే ప్యాకేజీలు అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులతో మండలస్థాయి టూరిజం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.పర్యాటక ప్రాంతాలలో ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లు,కవర్లను నియంత్రించాలని ఆదేశించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా పర్యాటక అధికారి దాసు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, డీఎల్‌పీవో కుమార్, సీపీవో ప్రసాద్, ఏపీఎఫ్‌డీసీ డీఎం కృష్ణబాబు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటితో శబరి కళకళ

చింతూరు: నిన్నటివరకు ఇసుక తిన్నెలతో కనిపించిన శబరినది ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో జలకళ సంతరించుకుంది. మంగళవారం నుంచి కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు సీలేరు నది ద్వారా వస్తున్న వరదనీరు చేరడంతో గురువారం ప్రవాహం పెరిగింది. చీకటివాగు ఎగపోటుకు గురై పొలాల్లోకి ఎగదన్నింది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో సోకిలేరువాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. శబరినది మరింత పెరిగితే సోకిలేరు వాగు వరద నీరు చింతూరు, వీఆర్‌పురం రహదారిపై ప్రవహించే అవకాశముంది. పొల్లూరులోని టైగ్రిస్ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. శబరినదిలో కొత్త నీరు చేరడంతో విరివిగా చేపలు వలలకు చిక్కి జాలర్ల పంట పండుతోంది. గురువారం చింతూరులో 12 నుండి 15 కిలోల బరువు కలిగిన చేపలను రెండు నుంచి 3 క్వింటాళ్ల వరకు విక్రయించారు.

చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది

శబరినది ఉధృతికి ఎగపోటుకు గురైన చీకటివాగు

వరదనీటితో పరవళ్లు తొక్కుతున్న పొల్లూరు జలపాతం

తగ్గని వర్షాలు.. పొంగిన గెడ్డలు

పాడేరు చింతలవీధి జంక్షన్‌లో జాతీయ రహదారి దిగువున ముంపులో ఇల్లు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఐదు రోజుల నుంచి కుండపోత వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.గురువారం కూడా పాడేరుతో పాటు సమీప ప్రాంతాల్లో ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. పాడేరు మండలం గుత్తులపుట్టు,జి.మాడుగుల మండలం బొయితిలి సంతకు వెళ్లే గిరిజనులు వర్షంతో అవస్థలు పడ్డారు. జోలాపుట్టు జలాశయానికి నీరందించే మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డ, చాపరాయి, కురిడి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.హుకుంపేట మండలంలోని చీడిపుట్టు రోడ్డులో రాళ్లగెడ్డ కాజ్‌వే మీదుగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గెడ్డ ప్రమాదకరంగా ఉన్నప్పటికి గిరిజనులు ప్రాణాలకు తెగించి గెడ్డను దాటుతున్నారు.

జిల్లాలో 620.4 ఎంఎం వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా గురువారం 620.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో80.2, హుకుంపేటలో 46.8, పెదబయలులో 41.2, మారేడుమిల్లిలో 39.4, జి.మాడుగులలో 37.4, వై.రామవరంలో 36.4, చింతూరులో 34.6, అరకులోయలో 32.6, అడ్డతీగలలో 30.8, చింతపల్లిలో 28.4, గంగవరంలో 26.6, కూనవరంలో 25.4, దేవీపట్నంలో 24.6, రాజవొమ్మంగిలో 24.2, వీఆర్ పురంలో 22.2, డుంబ్రిగుడలో 20.8, ఎటపాకలో 18.4, రంపచోడవరంలో 18.2, కొయ్యూరులో 16.2, అనంతగిరిలో 9.2, జీకేవీధిలో 4.2, పాడేరులో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

ముంపులో ఇల్లు

పాడేరు మండలం చింతలవీధి జంక్షన్‌లో కిల్లో డొమై అనే గిరిజన మహిళకు చెందిన ఇల్లు ముంపునకు గురైంది. గురువారం ఇంటిలోకి వరదనీరు ప్రవహించడంతో ఆందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి నిర్మాణంతో దిగువున ఉన్న నివాసాలన్నీ వర్షం పడినప్పుడల్లా ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. డ్రైనేజీలు నిర్మించకపోవడం వల్ల ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల బుంగాపుట్టు, రంగబయలు, వనుగుమ్మ, భూసిపుట్టు, కుమడ, దొడిపుట్టు పంచాయతీల్లో వాగులు,గెడ్డలు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కించాయిపుట్టు పంచాయతీ వర్కుగుమ్మి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాల గిరిజనులు రెండు గంటల పాటు నిరీక్షించిన అనంతరం అతికష్టం మీద వాగును దాటారు.కుమడ గ్రామ సమీపంలో కల్వర్టుపై నుంచి వరదనీరు భారీగా పారింది. వనుగుమ్మ పంచాయతీ తర్లగూడ వద్ద కల్వర్టుపై వరద నీరు ప్రవహించడంతో గ్రామ గిరిజనులు రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదర్, దొడిపుట్టు పంచాయతీ బిడిచంపా వద్ద వాగులు ఉధృతంగా ప్రవహించడంతో గిరిజనులు గ్రామాలకు పరిమితం అయ్యారు. రంగబయలు పంచాయతీ జోడిగుమ్మలో కొర్ర పూయు అనే గిరిజనుడి ఇల్లు వర్షానికి స్వల్పంగా దెబ్బతింది.

పెదబయలు: మండలంలోని జామిగుడ, గిన్నెలకోట, మత్స్యగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదకోడాపల్లి పరదానిపుట్టు సమీపంలోని వంతెనను తాకుతూ ప్రవహిస్తున్నాయి. కిముడుపల్లి పంచాయతీ గేదెగెడ్డ కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో గురువారం ఉదయం మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. జామిగుడ పంచాయతీలో పలు గ్రామాల ప్రజలు పొంగి ప్రవహిస్తున్న గెడ్డను దాటేందుకు అవస్థలు పడుతున్నారు.

జి.మాడుగుల: మండలంలోని కుంబిడిసింగికి వెళ్లే రోడ్డు మార్గంతోపాటు గడుతూరు పంచాయతీలోని వసమామిడి మార్గంలో గెడ్డలు పొంగి ప్రవహించడం వల్ల మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి జలపాతం, సొలభం పంచాయతీ ఎగకంతవరం సమీపంలోని అక్కాచెల్లెళ్ల గుమ్మి జలపాతం, కుంబిడిసింగి–పెదలోచలి పంచాయతీల్లో గుర్రాయి వద్ద గల రాళ్లగెడ్డ జలపాతం వరదనీటితో ప్రవాహం ప్రమాదకరంగా మారింది.

కాజ్‌వే మీదుగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్న రాళ్లగెడ్డను దాటుతున్న గిరిజనులు

వర్కుగుమ్మి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

కోసంగి గెడ్డలో ప్రాణాలకు తెగించి రాకపోకలు

తర్లగూడ వద్ద ప్రవాహాన్ని దాటుతున్న మహిళలు

పొంగిపొర్లుతున్న కొత్తపల్లి జలపాతం

చేదుపుట్టు కాజ్‌వేపై నుంచి వరద ప్రవాహం

మృత్యు మలుపు

- ప్రమాదకరంగా కప్పకొండ టర్నింగ్
- పెరుగుతున్న యాక్సిడెంట్లు
- ఆందోళనలో స్థానికులు

ప్రమాదకర మలుపు వద్ద ఆర్టీసీ బస్సు కింద పడిన యువకుడు (ఫైల్)

పనసలపాలెం, చవిటిదిబ్బలు గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు

వై.రామవరం: మండలంలోని ప్రధాన మార్గంలో పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పనసలపాలెం, చవిటిదిబ్బల గ్రామాల మధ్య ఉన్న కప్పకొండ టర్నింగు వద్ద వాహనాలపై ప్రయాణించేదుకు మండలవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మలుపు వద్ద ఎన్నో వాహనాలు ఢీకొని దశాబ్దాలుగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృత్యువాతకు గురువుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో సరైన విధంగా డిజైన్ చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్టు పలువురు చెబుతున్నారు. ఈ మలుపును ఆనుకొని ఉన్న ఎత్తుగా ఉన్న గుట్టను తొలగించి, నేరుగా రోడ్డు నిర్మించి ఉంటే ప్రమాదాలకు తావు ఉండేది కాదన్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యమేనని విమర్శిస్తున్నారు.

అతివేగమే కారణం

అంతేకాకుండా ఈ మలుపు వద్ద జరిగిన ఎన్నో ప్రమాదాల మృత్యువాతలు వెలుగులోకి రాలేదు. ఇంత జరుగుతున్న ఇంజనీరింగు అధికారులు ఈ మలుపును సరిచేయడంలో విఫలమైనట్టు మండల వాసులు విమర్శిస్తున్నారు. ఓ వైపు పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రతీ గ్రామంలోను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అయిన ప్పటికీ యువత అతివేగంగా ఈ మలుపు వద్ద వాహనాలు నడుపుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రధాన రహదారిలోని ప్రతీ ప్రమాదకరమైన టర్నింగులోను హెచ్చరిక బోర్డులు, డ్రమ్ములు ఏర్పాటుచేసినప్పటికీ వాహనచోదకుల నిర్లక్ష్యం, వేగం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఇంజినీరింగు అధికారులు స్పందించి, ఈ మలుపు వద్ద ఉన్న చిన్న కొండను తొలగించి ప్రమాదాల జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతీ గ్రామంలోను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రతి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, వేగాన్ని అదుపుచేయడానికి స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– బి రామకృష్ణ, ఎస్ఐ, వై.రామవరం

ప్రమాదాలివీ...

- ఈ మలుపు వద్ద సుమారు 30 ఏళ్ల క్రితం విధి నిర్వహణలో వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్తున్న సత్యనారాయణ అనే పోలీసు కానిస్టేబుల్ బైక్ ప్రమాదంలో మృతి చెందారు.
- 20 ఏళ్ల క్రితం మండలంలోని చవిటిదిబ్బలు గ్రామానికి చెందిన గొర్లె కృపానంద మృతి చెందారు.
- పదేళ్ల క్రితం పులుసుమామిడి గ్రామానికి చెందిన బ్రహ్మం అనే వ్యక్తి ఈ మలుపు వద్ద బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో మృతి చెందారు.
- ఈ ఏడాది జూన్21న స్థానిక వీఆర్‌ఓ కాంతమ్మ భర్త చోడే సీతారామయ్య మృతి చెందారు.
- జూన్ 28న కిచ్చల రామకృష్ణారెడ్డి, పల్లాల శ్రీనివాసురెడ్డిలు మృతి చెందారు.
- జూన్ 25న పల్లాల నాగిరెడ్డి అనే వ్యక్తి ఈ మలుపు వద్ద బైక్‌తో ఆర్టీసీ బస్సు కింద పడి, చికిత్స పొందుతూ మృతి చెందారు.

ప్రమాదాలను అరికట్టాలి

ఈ మార్గంలో మలుపు లేకుండా రోడ్డు నిర్మించడంలో అప్పటి ఇంజనీరింగు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఈ మార్గంలో ఉన్న చిన్నకొండను (గుట్టను) తొలగించి రోడ్డు నిర్మించి ప్రమాదాలను అరికట్టాలి. – **కడబాల ఆనందరావు**, ఎంపీపీ

అధికారులు స్పందించాలి

ఈ ప్రమాదకర మలుపు వద్ద దశాబ్దాలుగా జరుగుతున్న ప్రమాదాల్లో అనేక మంది మృతి చెందుతున్నారు. దీన్ని అరికట్టడానికి తక్షణమే ఇంజనీరింగు అధికారులు చర్యలు తీసుకోవాలి.ఈ మేరకు ఈ ప్రాంతంలో మార్పులు చేసి రహదారి నిర్మించాలి.

– **వీరమళ్ళ సుబ్బలక్ష్మి**, ఎంపీటీసీ సభ్యురాలు, వై.రామవరం

బెంగళూరు-నారంగి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–నారంగి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు–నారంగి (06559) స్పెషల్ రైలు ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 8, 15వ తేదీల్లో రాత్రి 11.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడకు, ఆ మరు సటి రోజు ఉదయం 5 గంటలకు నారంగి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నారంగి–ఎస్ఎంవీ బెంగళూరు(06560) స్పెషల్ ఈ నెల 12, 19వ తేదీల్లో ఉదయం 5.30 గంటలకు నా రంగిలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడకు, ఆ మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్ : లారీని నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమాన విధిస్తూ నగరంలోని జ్యుడీషియల్ ప్రధాన మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పు నిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాగర్‌నగర్‌కు చెందిన పల్లా అప్పలరాజు (40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జార్ఖండ్‌కు చెందిన జనార్దన్ ఝూ 2022 డిసెంబర్ 21వ తేదీన విశాఖ ఓడరేవు ప్రాంతంలోని లక్ష్మీ కాటా దగ్గరకు వచ్చి తన లారీలోని సరుకును తూస్తున్నాడు. అప్పలరాజు మరో టిప్పర్‌లో వెనుక నుంచి వచ్చి బలంగా లారీని ఢీకొన్నాడు. పక్కనే ఉన్న డ్రైవర్ జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. హార్బర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.సత్యనారాయణ శ్రీనివాస్ కేసు విచారణ జరిపి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై పైవిధంగా తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

ఎంపీపీ పాఠశాల సందర్శన

రంపచోడవరం: స్థానిక ఎస్టీ కాలనీ(ఎస్‌టీఆర్)లోని ఎంపీపీ పాఠశాలను అమరావతికి చెందిన విద్యాశాఖ రాష్ట్ర స్థాయి సభ్యులు మల్లికార్జునరావు, సంధ్య, కోటేశ్వరరావు గురువారం సందర్శించారు. పాఠశాల భవనాలు, విద్యార్థుల వివరాలు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. గతంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించే వారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానం లేకుండా ఏకపక్షంగా తొలగించారని వారు వివరించారు. 3,4,5 తరగతులు చదువుకునేందుకు విద్యార్థులు కిలోమీటరున్నర దూరంలోని పాఠశాలకు అవస్థలు పడుతూ వెళ్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు బృందం దృష్టికి తీసుకువెళ్లారు.

ఘనంగా పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరశురాముడిగా జగన్నాథుడు

డాబాగార్డెన్స్ (విశాఖ): టర్నర్ చౌల్ట్రీలో వేంచేసియున్న జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు బారులు తీరారు. దీంతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దశవతారాల్లో భాగంగా స్వామి పరశురామవాతరంలో దర్శనమివ్వగా.. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రథయాత్రలో భాగంగా శుక్రవారం జగన్నాథస్వామి శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో తెలిపారు.

సత్తాచాటిన రైల్వే బాక్సింగ్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : ఎలైట్ వుమెన్ జాతీయ స్థాయి టోర్నీలో భారత రైల్వేస్ బాక్సింగ్ జట్టు 32 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. జ్యోతి ఫ్లైవెయిట్‌లో, ఎన్‌బి చాను ఫెదర్ వెయిట్‌లో, ప్రాచీ లైట్‌వెయిట్ కేటగిరిలో విజేతలుగా నిలిచి స్వర్ణాలందుకున్నారు. శశిచోప్రా లైట్‌వెల్టర్‌లో, లాషు మిడిల్‌వెయిట్‌లో, అల్ఫీ హెవీ వెయిట్‌లో రజత పతకాలను సొంతం చేసుకున్నారు. మంజు రాణి లైట్ ఫ్లైలో, శిక్ష బాంటమ్‌లో, నేహా సూపర్‌హెవీవెయిట్‌లో కాంస్య పతకాలందుకున్నారు. ఈ పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి.

పార్టీలకతీతంగా జెడ్పీ నిధుల కేటాయింపు

- మంజూరైన పనులను 6 నెలల్లోగా పూర్తి చేయాలి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మండల పరిషత్ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

కోటవురట్ల: గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా జెడ్పీ నిధులు కేటాయిస్తున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎంపీడీవో చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ నిధుల వినియోగం, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రారంభించని పనుల గురించి ఆరా తీశారు. నిధులు మంజూరైన పనులను 6 నెలల్లోగా పూర్తి చేయాలని సూచించారు. చేపట్టే పనులపై తప్పనిసరిగా తీర్మానం చేయాలన్నారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో డ్రైనేజీల నిర్మాణాల కోసం ప్రతి జెడ్పీటీసీకి రూ.20 కోట్లు కేటాయించామని తెలిపారు. కోటవురట్ల మండలానికి జెడ్పీటీసీ నిధులు కాకుండా అదనంగా తన నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. వీటితో అవసరమైన చోట డ్రైనేజీలు నిర్మించారని తెలిపారు. కిలోమీటరు పొడవున్న బీటీ రోడ్డు శిథిలమైందని, నిధులు కేటాయించాలని వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు తన దృష్టికి తీసుకొచ్చారని, దానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

జనరల్ ఫండ్ బిల్లులు నిలిపివేసిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు జనరల్ ఫండ్ బిల్లులు నిలిపివేశారని తెలిపారు. ఇలా సుమారు రూ.10 కోట్ల నిధులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయని తెలిపారు. దీని వల్ల జనరల్ ఫండ్ నిధులు ఇవ్వాలంటే భయమేస్తోందని, పనులు చేసినవారు ఇబ్బంది పడతారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన మరుక్షణం కూటమి ప్రభుత్వం వాటిని వెనక్కి లాగేసుకుని తల్లికి వందనం డబ్బులు జమ చేసిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ మాజీ చైర్మన్ పైల రమేష్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పాల్గొన్నారు.

చిట్టీల మోసం కేసులో ముగ్గురి అరెస్ట్

కె.కోటపాడు: చిట్టీల పేరిట మోసం చేసి పరారైన కేసులో మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. గురువారం కె.కోటపాడు పోలీసు స్టేషన్లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చౌడువాడకు చెందిన పెదిరెడ్ల పద్మజ ఏడేళ్లుగా చిట్టీలను నిర్వహిస్తోంది. ఈమె 15 గ్రూపులను నడుపుతూ గరిష్టంగా రూ.4 లక్షల వరకు చిట్టీలు కట్టించుకునేది. సుమారు 300 మంది వరకూ సభ్యులు ప్రతి నెలా చిట్టీలు కడుతున్నారు. ఇటీవల ఈమె గ్రామంలో కనిపించకుండా పోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చిట్టీల నిర్వాహకురాలు పద్మజతోపాటు, ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి కోటిన్నర కలిగిన ఆస్తులను గుర్తించి వశపరుచుకున్నట్లు కోర్టుకు వివరాలు సమర్పించారు. నిందితులు ముగ్గురికి కోర్టు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

బదిలీలు చేసినా పోస్టింగ్‌లు ఇవ్వలేదు

- వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల గగ్గోలు
- ఐటీడీఏ పరిధిలో పీహెచ్‌సీ సిబ్బంది బదిలీల ప్రక్రియ పూర్తి
- ఏజెన్సీలో సిబ్బందిని రిలీవ్ చేయకపోవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో వివిధ కేటగిరీల్లో 39 మంది ఉద్యోగులకు బదిలీలు పూర్తయ్యాయి. అయితే కొన్ని విభాగాల్లో ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకుండా, కొత్తవారిని విధుల్లో చేరనీయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో బదిలీలు పొందిన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలా కాలంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేసి, మైదాన ప్రాంతాలకు బదిలీ అయినవారిని, తమ స్థానాల్లో కొత్తవారు వచ్చేవరకు కూడా రిలీవ్ చేయడం లేదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. తమ స్థానాల్లో కొత్తవారు చేరే వరకు ప్రస్తుత స్థానాల్లోనే పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా, అధికారుల నుంచి సానుకూల స్పందన లేదని వారు వాపోతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాధారాణి బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఐటీడీఏ అధికారులు వాటిని అమలు చేయకపోవడంపై ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ కూడా ఐటీడీఏ పీఓలకు లేఖ రాసినా ఎటువంటి స్పందన లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పోలీసు భవనాలకు రాజకీయ గ్రహణం

రూ.కోట్ల వ్యయంతో నాతవరం, గొలుగొండ, కేడీపేట స్టేషన్లకు అదనపు భవనాలు

- నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం
- హోంమంత్రి, అసెంబ్లీ స్పీకరు మధ్య సమన్వయలోపమే కారణం?

డిసెంబరులోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన నాతవరం పోలీసుస్టేషన్ అదనపు భవనం

నాతవరం: పోలీసుస్టేషన్లకు నూతనంగా నిర్మించిన అదనపు భవనాల ప్రారంభోత్సవానికి రాజకీయ గ్రహణం వెంటాడుతోంది. నాతవరం పోలీసుస్టేషన్‌కు నూతన భవన నిర్మాణం పనులు పూర్తి చేసి గత డిసెంబరులోనే ప్రారంభించడానికి పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. గొలుగొండ మండలంలో కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీసుస్టేషన్లకు రెండు చోట్ల అదనపు భవనాలు నిర్మించినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. నియోజకవర్గంలో నాతవరం, గొలుగొండ మండలాల్లో పోలీసుస్టేషన్లకు నిర్మించిన అదనపు భవనాలు మార్చి నెలలోనే ప్రారంభించేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా భవనాలను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత ఇతర ఉన్నతాధికారులతో ఈ భవనాల ప్రారంభోత్సవం ఉంటుందని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ దిశగా మూడు పర్యాయాలు ఎస్ఐ సిహెచ్.భీమరాజు, రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినా ఆఖరు సమయంలో ప్రారంభోత్సవాలు వాయిదా పడిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో అదనపు భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఆయా భవనాల ప్రారంభోత్సవాలకు హోంమంత్రి వంగలపూడి అనిత విచ్చేస్తారని అంటున్నారు. నాతవరం, గొలుగొండ మండలాలు అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఆయన ఆహ్వానం మేరకే హోంమంత్రి తన నియోజకవర్గంలో పోలీసు స్టేషన్ అదనపు భవనాల ప్రారంభోత్సవానికి విచ్చేయాల్సి ఉంది. అయితే స్పీకర్, హోంమంత్రి మధ్య సమన్వయ లోపం కారణంగా భవనాలు ప్రారంభోత్సవంలో జాప్యం జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. పోలీసుస్టేషన్లకు అదనపు భవన నిర్మాణాలకు 2018లో అప్పటి ప్రభుత్వం రూ.2.50 కోట్లు చొప్పున మంజూరు చేసింది. భవనాల పనులు ప్రారంభించాక కరోనా కారణంగా చాలా కాలంగా పనులు నిలిపివేశారు. నిర్మాణ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు టీడీపీ నేత కావడంతో గత ప్రభుత్వంలో పనులు పూర్తి చేస్తేవైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో జాప్యం చేశాడు. ప్రస్తుతం భవనాల నిర్మాణం పూర్తయినా రాజకీయ గ్రహణం చోటు చేసుకుంది. దీంతో నెలల తరబడి నూతన భవనాలు ప్రారంభోత్సవాలకు నోచుకోలేదు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న, నాతవరం, గొలుగొండ మండలాల పర్యటనకు తరుచూ విచ్చేస్తున్నారు. నెలల తరబడి అలంకార ప్రాయంగా కళ్ల ముందే కన్పిస్తున్నా ఆ భవనాల ప్రారంభోత్సవం వైపు కన్నెత్తి చూడలేదు. ఈ విషయంపై నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజును వివరణ కోరగా మూడు సార్లు భవనం ప్రారంభోత్సవాలకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనివార్య కారణాల వల్ల ఆఖరు సమయంలో రద్దయ్యాయన్నారు.

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : కోరాపుట్–కిరండూల్ లైన్‌లో కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో శుక్రవారం విశాఖపట్నం నుంచి బయల్దేరే కిరండూల్ రైళ్ల గమ్యం కుదించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. 4వ తేదీన విశాఖపట్నం–కిరండూల్(58501)పాసింజర్ అరకు వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. గురువారం రాత్రి విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడిచింది. తిరుగు ప్రయాణంలో 4వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక డ్రైవ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయిలపై రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు డీసీపీ–1 అనిత వేజెండ్ల తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లలో నగర పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ పి.రామచంద్రరావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు, రైల్వే భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ కల్యాణి నేతృత్వంలో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీలు, కోచ్‌లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ పరిధిలో నిరంతరం తనిఖీలు చేస్తామని జీఆర్పీ సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

RESTAURENT FOR SALE
Excellent Running Hyderabadi Non Veg. Restaurant (40 seating) for sale. Near Rama talkies, Visakhapatnam. Ph : 95733 37307 [V- 14053]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

Wanted Office Assistant Female with Knowledge of Cash, Minimum Accounts and Computer Knowledge 8:30 am to 6pm. Cont : 93930 03003 [V- 14046]

సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/- మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర॥ 96032 16460/63007 25191. [V- 3577]

రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

విశాఖపట్నం టౌన్ నందు గడ్డి కటింగ్ చేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం: 15,000 / ESI, PF కలవు. సంప్రదించండి: 7993893331, 80744 34160. [SCA25005899]

Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

ఇ-వేలం ద్వారా మెషినరీ అమ్మకం (హైపోథికేషన్ ప్రకారం)

ఋణగ్రహీత: రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా:** రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా: శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి: లేటు ఎస్. అప్పన్న, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా: శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.2-38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, డి.నెం.2-38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

మెషినరీ వివరములు

వ.నెం.	ఐటమ్‌ల వివరములు	నెం.
1	Eastman EC-3NL	1
2	Eastman 629"8" Straight Knife Cutting Machine	1
3	Hashima HP - 450 ms Fusing Press	1
4	Jack JK - 8560 WPL Sewing Machine with Complete set	2
5	Juki MS 1190MF - AA Sewing Machine with Complete set and std ace	1
6	Kansai DFB 1404 PSF Industrial Sewing Machine with Complete set and std	1
7	SGPB - 06 Duo Auto Seam Generator	1
8	SGVT 125 x 80 N Potable Vaccum Iron Table	4
9	ES - 300 Silver Star	2
10	ES - 300 Teflon Shoe	2
11	Juki DDL - 8100 EB - AAP Sewing Machines with Complete set	30
12	JUki DDL - 900 BSWBK - AA Sewing Machine with Complets set	2
13	Juki DLM5200ND-ACP Sewing Machine with Complete set	1
14	Juki M06816SDE430HE35/SM55A/KE10A Sewing Machine with Complete set and std acces	2
15	Juki LK-1903BNSS301/MC672KNN-AA4 Sewing Machine with Complete set	1
16	Juki LBH-1790ANS/MC602KN Sewing Machine with Complete set and std acc	1
17	Juki LK - 1900BNSS000/MC672K NN-AA4 Sewing Machine with Complete set and std acc	1
18	Line Centre Table of size 8x2x2.5 ft.,	10
19	Stool Model ST 02 03 ft	42
20	Inspection Table 4x3x3 ft	2
21	Spreading Table 8.4" 1.8"09 mtr	1
22	END Line Checking Table	1
23	62.5 Kva KOEL Green DG Sets with acoustic enclouser Engine No:T4- 8907 - 1820514 Altmo: LBS3K18C40764 Kirloskar	1

రిజర్వు ధర : రూ.17,82,000/- ధరావత్తు : రూ.1,78,200/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ-వేలం తేది : 21-07-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

నియమ నిబంధనలు : 1) మెషినరీ ఖచ్చితంగా "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు మెషినరీ అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకతతో ఆధార్ కార్డు / ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. ఇవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 5) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 6) తేది.05-07-2025 నుండి 20-07-2025 వరకు బ్యాంక్ పనివేళలలో మెషినరీ తనిఖీ చేసుకోగలరు. మెషినరీ తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 8099444378 & 9666909050. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID: support.baanknet@psballiance.comను సంప్రదించండి.

తేది: 03-07-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

అన్నదానం

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆమదాలవలస: పట్టణంలోని కొత్తకంద్రపేటలో గల జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యులు గురువారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

10న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన అన్ని పాఠశాలల్లోనూ తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని డిప్యూటీ ఈఓ విజయకుమారి అన్నారు. మండలంలోని బాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. తల్లిదండ్రుల సమావేశం విధివిధానాలను వివరించారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి స్కూల్ నిర్వహణ, తరగతుల బోధన, 10న తల్లిదండ్రుల సమావేశం నిర్వహణపై పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులందరూ సమావేశానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎలక్షన్ డీటీ నారాయణరావు

పాతపట్నం: పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డీటీగా కె.నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సంతబొమ్మాళి మండలంలో డీటీగా పనిచేస్తూ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎలక్షన్ డీటీగా పనిచేసిన వాన శంకర్ నందిగాం మండలం డీటీగా బదిలీపై వెళ్లారు. ఇక్కడకు వచ్చిన నారాయణరావుకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

సీఆర్‌ఎంటీలకు తీవ్ర అన్యాయం

పాగోటి లక్ష్మణరావు

నరసన్నపేట: సర్వశిక్ష అభియాన్‌లో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఆర్‌ఎంటీ సంఘం ప్రతినిధి పాగోటి లక్ష్మణరావు అన్నారు. నరసన్నపేటలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా పైసా కూడా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం గత నెలలో ఐదుగురిని సాగనంపిందన్నారు. అనియత విద్యా పథకంలో పర్యవేక్షకునిగా 1986 నుంచి 2001 వరకు పనిచేశామని, తరువాత సర్వశిక్ష అభియాన్‌లో వివిధ హోదాల్లో పని చేస్తున్నామన్నారు. 60 ఏళ్లకు ఉద్యోగ విరమణ పొందుతున్నా కనీసం గ్రాట్యుటీ అయినా ఇవ్వడం లేదన్నారు. 2011లో విద్యా హక్కు చట్టంలో భాగంగా సర్వశిక్ష అభియాన్‌లోనికి వచ్చామన్నారు. 1986లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని సెలెక్షన్ కమిటీ తమను అనియత విద్యా పర్యవేక్షలుగా నియమించిందన్నారు. ప్రస్తుతం ఎంఈఓ పరిధిలో సీఆర్‌ఎంటీలుగా పనిచేస్తున్నామని, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణతోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రాట్యుటీ, పీఎఫ్ చెల్లించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మురుగు కాలువను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

బూర్జ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దపేట పంచాయతీ బొమ్మిక గిరిజన గ్రామాన్ని గురువారం పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన పాలక భవాని మలేరియా జ్వరం బారినపడి కోలుకుంది. గ్రామంలో వైరల్ జ్వరాలతో ఐదుగురు బాధపడుతుంటతో రక్త నమూనాలు సేకరించి మందులు అందజేశారు. గ్రామంలో మురుగు కాలువలు, కుళాయిలు చుట్టూ శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ సూర్యం, బూర్జ పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్లు టి.తేజారావు, లఖినాన సరోజిని, పంచాయతీ కార్యదర్శి జి.కల్యాణ్ బాబు, ఏఎన్‌ఎం రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పి.శ్రావ్య, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం.. ఆచరణలో విఫలం

బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు (ఫైల్)

- యువతకు అందని బీసీ కార్పొరేషన్ రుణాలు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- పట్టించుకోని పాలకులు

హిరమండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

హిరమండలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలపై ప్రచార ఆర్భాటమే తప్ప.. ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ పథకాల గురించి అలా ఉంచితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కార్పొరేషన్ రుణాల మంజూరు పేరుతో హడావిడి చేసింది. క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. కారణాలు ఏమైనా బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు ఉత్తుత్తి ప్రచారమనే విమర్శలు వస్తున్నాయి. నిరుద్యోగులకు స్వయం ఉపాధిని కల్పించేందుకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాల్సి ఉంది. అధికార పార్టీ నాయకుల చెప్పిన వారికే రుణాలు అందుతాయని ప్రచారం జరుగుతోంది. దీంతో అర్హులైన వారికి రుణాల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది.

పాతపట్నం నియోజకవర్గానికి మంజూరైన యూనిట్ల వివరాలు					
మండలం	హిరమండలం	పాతపట్నం	కొత్తూరు	మెళియాపుట్టి	ఎల్.ఎన్.పేట
యూనిట్లు	68	84	64	69	36
దరఖాస్తుదారులు	428	624	468	363	225

ఎప్పుడు మంజూరు చేస్తారో..?

ఈ ఏడాది జనవరి 28న ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సబ్సిడీ రుణాలపై జీఓ జారీ చేసింది. దీని ప్రకారం నియోజకవర్గాల వారీగా మార్చి 10 నుంచి 20వ తేదీ వరకు మంజూరైన యూనిట్లను ప్రారంభించాలని జీఓలో పేర్కొంది. ఇంతవరకు కనీసం యూనిట్లను ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొంది. పాతపట్నం నియోజకవర్గంలో 321 యూనిట్లకు 2,108 మంది దరఖాస్తు చేశారు. చాలామంది నిరుద్యోగులు పైరవీలు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కొంతమంది పలుకుబడి ఉపయోగించి డబ్బు కూడా ఖర్చు చేసినట్లు సమాచారం. 3 నెలలు కావస్తున్నా నేటికీ నిరుద్యోగులకు రుణాలు మంజూరు కాలేదు. అర్హులు బ్యాంకులు, ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జాబితా పంపించాం

రెండు నెలల క్రితం బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల జాబితాను సంబంధిత బ్యాంకు, జిల్లా అధికారులకు పంపించాం. బ్యాంకు అధికారులు యూనిట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. లబ్ధిదారులకు యూనిట్లు అందజేసే విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఆర్.కాశీప్రసాద్, ఎంపీడీఓ, హిరమండలం

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

నరసన్నపేట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్యం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వినియోగం తగ్గించాలని డిగ్రీ కళాశాల పి.లత అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం మిగిల్చాలంటే ఇప్పటినుంచి అయినా ప్లాస్టిక్ బ్యాగ్స్‌ను నిరోధించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, అధ్యాపకులు రవికుమార్, ఎస్.పరమేశ్వరరావు, బి.గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కరజాడలో..

మెళియాపుట్టి: పాలిథిన్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వి.రమణమూర్తి అన్నారు. పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాలిథిన్ బ్యాగ్ నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల క్లబ్‌ల ట్రైనర్ వెంకటాచలం మాట్లాడుతూ పాలిథిన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలియజేశారు. పాలిథిన్ వినియోగంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాలిథిన్ వినియోగం లేకుండా చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

ఆమదాలవలస: బ్యాంకుల్లో అమలవుతున్న బీమా పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పొన్నంపేటలో జన సురక్ష ఫైనాన్షియల్ ఇన్ క్లూజన్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జులై 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జన సురక్ష–ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కార్యక్రమాలు జిల్లాలోని 917 గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్.ఎస్.టి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలను వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ కె.ఉమాశంకర్, వెలుగు ఏపీఎం గురుగుబెల్లి నారాయణరావు, జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సీ సువ్వారి రవిబాబు, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్స్ చిగురుపల్లి వెంకటేష్, బొడ్డేపల్లి చంద్రశేఖర్, సీఎఫ్‌ఎల్ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

బూర్జ: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై ఎరువులను ఏఓ డి.ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం రైతులుకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులు రైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. సర్పంచ్ ఏగు అనురాధ, ఎంపీటీసీ చొక్కర పోలినాయుడు, వీఆర్వో అప్పలనాయుడు, పలువురు నాయకులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వసంత, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం

- ఇళ్ల వద్ద నిల్వ నీటిని తొలగించాలి
- ప్రతీ శుక్రవారం డ్రై డేను విధిగా పాటించాలి
- దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు ముఖ్యం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దోమలు ఉండే ప్రదేశం

పాతపట్నం: వర్షా కాలం కావడంతో సీజనల్ వ్యాధులు దండయాత్ర చేయడానికి పొంచి ఉన్నాయి. వాటిలో డెంగీ జ్వరం ఒకటి. దోమకాటుతో సంక్రమించే ఈ వ్యాధిని పరిశుభ్రత అనే ఆయుధంతోనే తరిమికొట్టాలని వైద్యులు పిలుపునిస్తున్నారు. జిల్లా, వైద్య, ఆరోగ్య, మలేరియా నిర్మూలన శాఖలు ప్రజలకు డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్నాయి. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ నెలల్లో డెంగీ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. వాతావరణం తేమగా ఉంటే వీటి సంఖ్య మరింతగా పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

డెంగీ లక్షణాలు

- హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తల నొప్పి.
- కండరాలు, కీళ్ల నొప్పులు.
- ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై దద్దుర్లు.
- కనుగుడ్లు కదపలేనంతగా నొప్పి.
- ఒక్కొక్కసారి వంట్లో రక్తస్రావం జరిగి ప్రాణాలకు ముప్పు.

నివారణ చర్యలు...

- పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటి వద్ద చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- పూలకుండీల్లో, ఫ్రిడ్జ్ కింద నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- తాగిపడేసిన కొబ్బరి బొండాలను పూర్తిగా నిర్మూలించాలి.
- సెప్టిక్ ట్యాంకుల మూతలకు తీగ జల్లెడ అమర్చాలి.
- పాతటైర్లు, ప్లాస్టిక్ టీ కప్పులను తొలగించాలి.
- దశల వారీగా దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి.
- దోమ తెరలను వినియోగించాలి.
- ప్రతీ శుక్రవారం డ్రై డేను విధిగా పాటించాలి.

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

డెంగీ వ్యాధిని అశ్రద్ధ చేయవద్దు. ఈ వ్యాధి మూడు దశల్లో ఉంటుంది. డెంగీ హేమరేజిక్ జ్వరంగా మారకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోయే ప్రమాదం. వేసవిలో సాధారణంగా కొబ్బరి బొండాలు తాగి పడవేస్తుంటారు. వీటిలోనే ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతాయి. పరిసరాల పరిశుభ్రతతో దోమకాటు నుంచి తప్పించుకోవచ్చు, జ్వరం, కీళ్లనొప్పులు, వాంతులు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– కె.పూర్ణిమ, గంగువాడ పీహెచ్‌సీ వైద్యురాలు, పాతపట్నం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పార్టీ మండల ఉపాధ్యక్షుడు, పాలవలస సర్పంచ్ గజ్జన మోహన్‌రావు అన్నారు. పార్టీ పదవి దక్కడంపై అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలంలో పార్టీ కేడర్‌ను మరింత సమాయత్తం చేసి ప్రజల పక్షాన పోరాటాలు చేస్తానన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించండి

నరసన్నపేట: ఎరువుల రిటేల్, హోల్‌సేల్ వ్యాపారులు విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, రైతులకు బిల్లులు ఇవ్వాలని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ వెంకటమధు అన్నారు. నరసన్నపేటలోని ఎరువుల డీలర్లు గురువారం మర్యాదపూర్వకంగా ఏడీని కలిశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రానున్న సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు నాణ్యమైనవే తీసుకురావాలని, అధీకృత డీలర్ల నుంచే ఎరువులు విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు అమ్మవద్దని, కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. స్టాక్ నిల్వల రికార్డులకు అనుగుణంగా ఉండాలన్నారు. రైతుల శ్రేయస్సే ప్రధానంగా వ్యాపారం నిర్వహించాలని సూచించారు.డీలర్లు శ్రీధర్, అనిల్, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి

ఆమదాలవలస: ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డ్‌లో సీఐటీయూ మండల కమిటీ కన్వీనర్ పంచాది లతాదేవి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకుడు తారకేశ్వరరావు, తపాలా విభాగం నాయకుడు బి.శ్రీరామ్మూర్తి, జన విజ్ఞాన వేదిక నాయకుడు షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామంలో జూదం ఆడుతున్న 8 మందిని గురువారం శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6,960 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక కోవెల వీధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. బీపీ, సుగర్ తనిఖీలు చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సారవకోట: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సారవకోట మండలంలోని మదనాపురం, జరాళి, చంద్రయ్యపేట, తదతర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇటీవల నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

చెత్త తొలగింపు..

సారవకోట మండలంలోని నౌతళ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలుండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని వెంటనే తొలగించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో గురువారం ఉదయమే గ్రామానికి అధికారులు చేరుకుని జేసీబీతో చెత్తకుప్పలు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య పనులను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. – సారవకోట

చెరువు కాదు.. రోడ్డే..

సారవకోట మండలం వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సారవకోట మండలంలోని చీడిపూడి కోవిల వీధి సమీపంలో రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షం నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. – సారవకోట

సన్మానం..

ఏడీని సత్కరిస్తున్న ఈఈ, తదితరులు

నరసన్నపేట: స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేసి బదిలీ అయిన కె.ఇందిరను సిబ్బంది గురువారం సత్కరించారు. టెక్కలి డివిజన్‌లో నరసన్నపేట ఏడీ కార్యాలయాన్ని నంబర్ వన్‌గా నిలిపారని, సీఎండీ చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారని ఏడీని అభినందించారు. టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు, డీఈలు కృష్ణమూర్తి, నరసన్నపేట డీఈ శ్రీధర్, ఏఈలు కోటేశ్వరరావు, బాలకృష్ణ, సిబ్బంది లోకేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ రంగాన్ని ప్రోత్సహించాలి

ఆమదాలవలస: ర్యాలీ నిర్వహిస్తున్న మెకానిక్‌లు

కొత్తూరు: కేక్ కట్ చేస్తున్న బైక్ మెకానిక్‌లు

హిరమండలం: మెకానిక్ డే నిర్వహిస్తున్న టూవీలర్స్ మెకానిక్‌లు

ఆమదాలవలస: వివిధ విభాగాలకు చెందిన మెకానిక్ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలని శ్రీఆంజనేయ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి ఆదినారాయణ అన్నారు. గురువారం ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా ఆమదాలవలస పట్టణంలోని ఒన్ వే జంక్షన్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద సమావేశం ఏర్పాటు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఇన్సూరెన్స్‌లు, ప్రభుత్వ పథకాలను కార్మికులు, మెకానిక్‌లకు అందజేయాలన్నారు. యూనియన్ నాయకుడు రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్ డే..

హిరమండలం: మండల కేంద్రంలో టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కరణం రమణ, అధ్యక్షుడు అరసవెల్లి సురేష్, ఉపాధ్యక్షుడు దూడి శేఖర్, కార్యదర్శి అంతరకొండ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బైక్ మెకానిక్ దినోత్సవం

కొత్తూరు: మండల కేంద్రంలో ప్రపంచ బైక్ మెకానిక్ దినోత్సవాన్ని గురువారం శ్రీవిజయ దుర్గా బైక్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు పైల భాస్కరరావు, సన్నిబోయిన వెంకటరమణ, అగతమూడి భాస్కరరావుతో పాటు పలువురు మెకానిక్‌లు కేక్ కట్ చేశారు. బైక్ మెకానిక్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఆకాంక్షించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పాతపట్నం: గ్రామ పంచాయతీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని తిడ్డిమి, రంకిణి, సరాలి, దశరథపురం గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ పనులు ప్రతీరోజు చేయించాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని ఆయా పంచాయతీల సెక్రటరీలకు ఆదేశించారు. సెక్రటరీలు జ్ఞానేశ్వరి, రాజేశ్వరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ చేపట్టాలి

హిరమండలం: ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. గురువారం అంబావిల్లిలో ఇంటింటా చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలన్నారు. సర్పంచ్ గూడెన శంకరరావు, నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724, 7075499517
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com

సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 4 । జూలై । 2025

పైనాపిల్ రైతు ఉసూరు

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు అనాస రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. సంతల్లో వ్యాపారులు కానరావడం లేదు. 8లో

ఎన్ఎస్టీఎల్ పరిశోధనలు

మద్దిలపాలెం: ఏయూతో కలిసి పరిశోధనలు జరపాలని ఎన్ఎస్టీఎల్ యోచిస్తోంది. వీసీ రాజశేఖర్‌తో శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు.

ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

న్యూస్‌రీల్

జపాన్ బృందం పర్యటన

స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల పరిశీలన

బోయపాడులో పర్యటిస్తున్న జపాన్ బృందం

నక్కపల్లి: ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన జపాన్ ప్రతినిధుల బృందం గురువారం నక్కపల్లి మండలంలో పర్యటించింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు భూములు కేటాయించిన రాజయ్యపేట, బోయపాడు, డీఎల్ పురం, అమలాపురం, తదితర గ్రామాలను ఈ బృంద సభ్యులు పరిశీలించారు. తమ ఉత్పత్తులు, ముడిసరుకు ఎగుమతి, దిగుమతుల కోసం క్యాప్టివ్ పోర్టు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి, ఇటీవల ప్రభుత్వం కేటాయించిన భూములను కంపెనీ ప్రతినిధుల బృందం పరిశీలించి అక్కడ భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. ఏపీఐఐసీ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ కోసం చేపట్టిన మౌలిక సదుపాయాలు, రోడ్ల నిర్మాణపు పనులను సైతం ఈ బృందం సభ్యులు పరిశీలించారు. రాజయ్యపేట, బోయపాడు తీరప్రాంతాలకు వెళ్లి పోర్టు నిర్మించే ప్రదేశాలను కూడా పరిశీలించినట్లు తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. వీరి వెంట సీఐ కుమారస్వామి, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

రామావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్‌రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథుడు గురువారం భక్తులకు రామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ మండపంలోని సిరి స్పందన నృత్యాలయం విద్యార్థి చేసిన జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు బంకుపల్లి సత్యానారాయణ, ఆలయ ఈవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి ఆచూకీ కనుగొనడంలో నిర్లక్ష్యం

నేవీ దళంతో గాలించాలని డిమాండ్

గాలింపు చర్యలు చేపట్టాలని కోరుతున్న మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం రూరల్: గల్లంతైన పూడిమడక గ్రామానికి చెందిన మత్స్యకారుడు చోడిపల్లి యర్రయ్య ఆచూకీ కనుగొనే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మత్స్యకార సంఘాల నాయకులు ఆగ్రహిస్తున్నారు. మత్స్యకారుని గల్లంతు విషయమై అధికారులు ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉండే కొడుకు కనిపించకపోవడంతో తల్లి ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. అధికారులు చొరవ తీసుకుని నావికాదళ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యకార నాయకులు, కుటుంబీకులు కోరుతున్నారు.

నేడు అల్లూరి విగ్రహావిష్కరణ

విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ ఏర్పాట్లను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం పరిశీలించారు. పట్టణంలో క్షత్రియ పరిషత్ వారు రూ.25 లక్షలతో అల్లూరి కాంస్య విగ్రహం తయారీతో పాటు మినీ పార్కు ఏర్పాటు చేశారు. శుక్రవారం జరగనున్న విగ్రహావిష్కరణ నేపథ్యంలో స్పీకర్ స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. పర్యవేక్షకుడు గణపతిరాజు సూర్యబంగార్రాజుకు పలు సూచనలు చేశారు. క్షత్రియ పరిషత్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారు చేయడానికి వాడుతున్న స్పిరిట్,రసాయనం

పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం

బెల్టు షాపులకు చాటుమాటున సరఫరా

- హైదరాబాద్‌లో స్పిరిట్ కొనుగోలు.. పరవాడలో తయారీ
- అచ్యుతాపురం, పరవాడల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు
- 72 లీటర్ల స్పిరిట్, యంత్ర సామగ్రి స్వాధీనం
- ఇద్దర్ని అరెస్ట్ చేసిన యలమంచిలి ఎక్సైజ్ పోలీసులు

కల్తీ మద్యం తయారీకి వినియోగిస్తున్న యంత్ర సామగ్రి

యలమంచిలి రూరల్: ఆస్పత్రుల్లో చేతులు శుభ్రపర్చుకునేందుకు ఉపయోగించే స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. పరవాడలో స్థావరం ఏర్పాటు చేసుకుని కల్తీ మద్యం తయారు చేస్తున్నారు. బెల్టు షాపులకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు పలుచోట్ల దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల దగ్గర్నుంచి 72 లీటర్ల స్పిరిట్, కల్తీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న యంత్ర సామగ్రి, ఖాళీ మద్యం బాటిళ్లు, స్టిక్కర్లు, రంగు కోసం కలిపే రసాయనం స్వాధీనపరుచుకున్నారు. యలమంచిలి ఎక్సైజ్ సీఐ పి.తేజో వెంకటకుమార్ గురువారం సాయంత్రం యలమంచిలిలో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేసిన వివరాలివి.. మాకవరపాలేనికి చెందిన రుత్తల రాము ఉపాధి నిమిత్తం అచ్యుతాపురంలో ఉంటున్నాడు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి కల్తీ మద్యం వ్యాపారం లాభదాయకంగా ఉంటుందని తెలుసుకున్నాడు. పరవాడకు చెందిన యలమంచిలి వెంకటేశ్వర్రావు అలియాస్ వెంకటేష్‌తో కలిసి కల్తీ మద్యం తయారీ చేస్తున్నాడు. ఇందుకోసం పరవాడలో అద్దెకు ఇంటిని తీసుకున్నారు. ఆ ఇంటిని స్థావరంగా చేసుకుని ఏసీ బ్లాక్ బ్రాండ్ కల్తీ మద్యం తయారు చేసి అచ్యుతాపురం సహా పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 2వ తేదీ బుధవారం సాయంత్రం అచ్యుతాపురంలో రుత్తల రాము అనే వ్యక్తిపై అనుమానంతో అతని ఇంటి వద్ద తనిఖీ చేయగా 5 లీటర్ల కల్తీ మద్యం క్యాన్లు పట్టుబడ్డాయి. తర్వాత అతడ్ని విచారించగా పరవాడలో ఒక ఇంటిలో కల్తీ మద్యం తయారు చేస్తున్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులు స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తున్నట్టు గుర్తించారు.

మీడియా ఎదుట ప్రవేశపెట్టిన కల్తీ మద్యం తయారు చేస్తున్న నిందితులు

హైదరాబాద్ టు పరవాడ

హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను 5 లీటర్ల క్యాన్లలో తెప్పించుకుని, దానిలో కారామిల్ అనే రసాయనం కలిపిన వెంటనే ఏసీ బ్లాక్ విస్కీలా రంగు మారిపోతుంది. దానిని మద్యం ఖాళీ క్వార్టర్ (180 మి.లీ.) బాటిళ్లలో వేసి అసలు విస్కీని పోలేలా స్టిక్కర్లు, మూతలు పెట్టి సీల్ చేస్తున్నారు. ఇలా తయారు చేసిన బాటిళ్లను బెల్టు షాపులకు ఒక్కో బాటిల్ రూ.120 నుంచి రూ.130కి విక్రయిస్తున్నారు. దాన్ని బెల్టు షాపుల వాళ్లు వినియోగదారులకు రూ.150 నుంచి రూ.180 వరకూ సరఫరా చేస్తున్నారు. ఈ కల్తీ మద్యం తయారీతో ఏడు రెట్లు లాభం పొందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 72 లీటర్ల స్పిరిట్, 455 ఖాళీ బాటిళ్లు, 1389 మూతలు, బాటిళ్లపై అతికించడానికి ముద్రించిన ఏసీ బ్లాక్ స్టిక్కర్లు, కారామిల్ రసాయనం, యంత్ర సామగ్రిని స్వాధీనపర్చుకున్నారు. నిందితులు ఒక లీటర్ స్పిరిట్ రూ.100కి కొనుగోలు చేస్తున్నారని, 5 లీటర్ల స్పిరిట్‌తో 27 కల్తీ మద్యం క్వార్టర్ బాటిళ్లు తయారు చేస్తున్నారని ఆయన తెలిపారు. కల్తీ మద్యం తాగితే కాలేయ సంబంధ వ్యాధుల బారిన పడతారని, చివరకు ప్రాణాంతకంగా మారుతుందని సీఐ తెలిపారు. ఇలాంటి కల్తీ మద్యం తయారీ ముఠాల సమాచారం తమకు అందించాలని ఆయన కోరారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఇంకా నిందితులెవరైనా ఉంటే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ మద్యం బాటిళ్లపై అతికించడానికి తయారు చేసిన స్టిక్కర్

స్వయం సహాయక బృందాల బలోపేతమే లక్ష్యం

- సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గ్రూపు సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రామీణ అభివృద్ధి సంస్థ సూక్ష్మ రుణాల ప్రణాళిక అమలుపై జిల్లా స్థాయి సహకార బృందాలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు వేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. పది రోజుల్లో గ్రాడింగ్ పని పూర్తి చేయాలని చెప్పారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు డిజిటలైజేషన్‌లో భాగంగా బయోమెట్రిక్ ప్రమాణీకంగా లబ్ధి చేకూర్చనున్నట్లు ఆమె తెలిపారు. సూక్ష్మ సంస్థలకు మద్దతు ద్వారా స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడం ఈ ప్రణాళిక లక్ష్యమన్నారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, వ్యవసాయం, ఉద్యానవనం, పట్టుపురుగుల పెంపకం, పశుసంవర్ధకం, మత్స్య సంపద, పరిశ్రమలు శాఖల అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజరు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మత్తు మందు వైద్య నిపుణుల సదస్సు

మహారాణిపేట (విశాఖ): మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజీ 40వ సౌత్ జోన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 30వ వార్షిక సదస్సు నిర్వహిస్తున్నట్లు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ కుచేల్ బాబు, చైర్మన్ డాక్టర్ డి.రాజశేఖర్, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కూర్మనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షిక సదస్సుకు ఏడు రాష్ట్రాల నుంచి 1,500 మందికి పైగా మత్తుమందు వైద్య నిపుణులు హాజరవుతారని డాక్టర్ కూర్మనాథ్ తెలిపారు.

పార్టీలకతీతంగా జెడ్పీ నిధుల కేటాయింపు

- మంజూరైన పనులను 6 నెలల్లోగా పూర్తి చేయాలి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మండల పరిషత్ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కోటవురట్ల: గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా జెడ్పీ నిధులు కేటాయిస్తున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎంపీడీవో చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ నిధుల వినియోగం, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రారంభించని పనుల గురించి ఆరా తీశారు. నిధులు మంజూరైన పనులను 6 నెలల్లోగా పూర్తి చేయాలని సూచించారు. చేపట్టే పనులపై తప్పనిసరిగా తీర్మానం చేయాలన్నారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో డ్రైనేజీల నిర్మాణాల కోసం ప్రతి జెడ్పీటీసీకి రూ.20 కోట్లు కేటాయించామని తెలిపారు. కోటవురట్ల మండలానికి జెడ్పీటీసీ నిధులు కాకుండా అదనంగా తన నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. వీటితో అవసరమైన చోట డ్రైనేజీలు నిర్మించారని తెలిపారు. కిలోమీటరు పొడవున్న బీటీ రోడ్డు శిథిలమైందని, నిధులు కేటాయించాలని వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు తన దృష్టికి తీసుకొచ్చారని, దానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

జనరల్ ఫండ్ బిల్లులు నిలిపివేసిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు జనరల్ ఫండ్ బిల్లులు నిలిపివేశారని తెలిపారు. ఇలా సుమారు రూ.10 కోట్ల నిధులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయని తెలిపారు. దీని వల్ల జనరల్ ఫండ్ నిధులు ఇవ్వాలంటే భయమేస్తోందని, పనులు చేసిన వారు ఇబ్బంది పడతారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన మరుక్షణం కూటమి ప్రభుత్వం వాటిని వెనక్కి లాగేసుకుని తల్లికి వందనం డబ్బులు జమ చేసిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ మాజీ చైర్మన్ పైల రమేష్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పాల్గొన్నారు.

పోలీసు భవనాలకు రాజకీయ గ్రహణం

రూ.కోట్ల వ్యయంతో నాతవరం, గొలుగొండ, కేడీపేట స్టేషన్లకు అదనపు భవనాలు

- నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం
- హోంమంత్రి, అసెంబ్లీ స్పీకరు మధ్య సమన్వయలోపమే కారణం?

నాతవరం: పోలీసుస్టేషన్లకు నూతనంగా నిర్మించిన అదనపు భవనాల ప్రారంభోత్సవానికి రాజకీయ గ్రహణం వెంటాడుతోంది. నాతవరం పోలీసుస్టేషన్‌కు నూతన భవన నిర్మాణం పనులు పూర్తి చేసి గత డిసెంబరులోనే ప్రారంభించడానికి పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. గొలుగొండ మండలంలో కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీసుస్టేషన్లకు రెండు చోట్ల అదనపు భవనాలు నిర్మించినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. నియోజకవర్గంలో నాతవరం, గొలుగొండ మండలాల్లో పోలీసుస్టేషన్లకు నిర్మించిన అదనపు భవనాలు మార్చి నెలలోనే ప్రారంభించేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా భవనాలను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత ఇతర ఉన్నతాధికారులతో ఈ భవనాల ప్రారంభోత్సవం ఉంటుందని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ దిశగా మూడు పర్యాయాలు ఎస్ఐ సిహెచ్.భీమరాజు, రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినా ఆఖరు సమయంలో ప్రారంభోత్సవాలు వాయిదా పడిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో అదనపు భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఆయా భవనాల ప్రారంభోత్సవాలకు హోంమంత్రి వంగలపూడి అనిత విచ్చేస్తారని అంటున్నారు. నాతవరం, గొలుగొండ మండలాలు అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఆయన ఆహ్వానం మేరకే హోంమంత్రి తన నియోజకవర్గంలో పోలీసు స్టేషన్ అదనపు భవనాల ప్రారంభోత్సవానికి విచ్చేయాల్సి ఉంది. అయితే స్పీకర్, హోంమంత్రి మధ్య సమన్వయ లోపం కారణంగా భవనాలు ప్రారంభోత్సవంలో జాప్యం జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. పోలీసుస్టేషన్లకు అదనపు భవన నిర్మాణాలకు 2018లో అప్పటి ప్రభుత్వం రూ.2.50 కోట్లు చొప్పున మంజూరు చేసింది. భవనాల పనులు ప్రారంభించాక కరోనా కారణంగా చాలా కాలంగా పనులు నిలిపివేశారు. నిర్మాణ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు టీడీపీ నేత కావడంతో గత ప్రభుత్వంలో పనులు పూర్తి చేస్తేవైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో జాప్యం చేశాడు. ప్రస్తుతం భవనాల నిర్మాణం పూర్తయినా రాజకీయ గ్రహణం చోటు చేసుకుంది. దీంతో నెలల తరబడి నూతన భవనాలు ప్రారంభోత్సవాలకు నోచుకోలేదు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న, నాతవరం, గొలుగొండ మండలాల పర్యటనకు తరుచూ విచ్చేస్తున్నారు. నెలల తరబడి అలంకార ప్రాయంగా కళ్ల ముందే కన్పిస్తున్నా ఆ భవనాల ప్రారంభోత్సవం వైపు కన్నెత్తి చూడలేదు. ఈ విషయంపై నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజును వివరణ కోరగా మూడుసార్లు భవనం ప్రారంభోత్సవాలకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనివార్య కారణాల వల్ల ఆఖరు సమయంలో రద్దయ్యాయన్నారు.

మార్చి 5న నాతవరంలో నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

డిసెంబరులోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన నాతవరం పోలీసుస్టేషన్ అదనపు భవనం

కొత్త లేఅవుట్లకు..మాస్టర్ స్ట్రోక్..!

బృహత్తర ప్రణాళిక పేరుతో కొత్త లేఅవుట్ల ప్లాన్లకు మోకాలడ్డు

కూటమి ప్రజాప్రతినిధుల కుయుక్తులు

- మాస్టర్‌ప్లాన్ రోడ్లు వస్తాయన్న నెపంతో లేఅవుట్లకు అనుమతుల నిరాకరణ
- దరఖాస్తు చేసుకునే వారితో మంతనాలు
- తమ వాటాలు ఇవ్వకుంటే ప్లాన్లు రాకుండా చేస్తామని హెచ్చరికలు
- స్థిరాస్తి వ్యాపారానికి గుదిబండలా ప్రజాప్రతినిధుల నిర్ణయాలు

విశాఖ సిటీ : కూటమి ప్రజాప్రతినిధుల 'మాస్టర్ ప్లాన్' స్థిరాస్తి రంగం ఊపిరి ఆపేసేలా ఉంది. బృహత్తర ప్రణాళిక పునఃపరిశీలన ప్రక్రియ విశాఖ రియల్ ఎస్టేట్‌ను వెంటిలేటర్‌పైకి ఎక్కించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో భూక్రయ, విక్రయాల్లో స్తబ్దత కొనసాగుతోంది. రాజకీయ స్వలాభం, స్వప్రయోజనాల కోసం కూటమి ప్రజాప్రతినిధులు వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్–2041 సవరణలకు పూనుకోవడం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మరింత శాపంగా పరిణమించింది. ప్రధానంగా బృహత్తర ప్రణాళిక రహదారుల పేరుతో కొత్త అవుట్లకు మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది స్థిరాస్తి వ్యాపారులకు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతోంది.

లేఅవుట్లకు అనుమతుల నిరాకరణ?

వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక–2041 పునః పరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. వాస్తవానికి గత నెలలోనే ఫిర్యాదుల స్వీకరణకు గడువు ముగిసింది. ఈ ప్రక్రియలో వేల సంఖ్యలో అభ్యంతరాలు వస్తాయని కూటమి ప్రజాప్రతినిధులు భావించారు. కానీ అనూహ్యంగా కేవలం 755 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. దీంతో అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 17వ తేదీ వరకు గడువు పొడిగించారు. మాస్టర్‌ప్లాన్‌లో సవరణల పేరుతో ప్రజాప్రతినిధులు భారీగా లబ్ధి పొందేందుకు స్కెచ్ వేస్తున్నారు. ఒకవైపు తమ భూముల ధరలు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూనే మరోవైపు ప్రైవేటు లేఅవుట్లకు అనుమతులు రాకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బృహత్తర ప్రణాళిక రహదారులు వస్తాయన్న నెపంతో కొత్త లేఅవుట్లను అనుమతులు ఇవ్వకుండా హోల్డ్‌లో పెడుతున్నట్లు రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాటాల కోసం మంతనాలు

మాస్టర్ ప్లాన్ పూర్తయినంత వరకు కొత్తగా లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయకూడదని కూటమి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బృహత్తర ప్రణాళికను పూర్తి చేసేందుకు మరో మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. దీన్ని అడ్డుపెట్టుకుని వారి అనుచరులు రియల్ వ్యాపారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. తమ వాటాలు ఇవ్వకుండా లేఅవుట్లకు అనుమతులు వచ్చే అవకాశం లేదని బేరసారాలు చేస్తున్నట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న స్థిరాస్తి రంగం.. కూటమి నేతల కారణంగా మరింత పతనమయ్యే ప్రమాదముందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

మందగమనంలో స్థిరాస్తి రంగం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో స్థిరాస్తి రంగం కుదేలైంది. భూముల క్రమవిక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనూ ఫ్లాట్లు, వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,526 కోట్లు లక్ష్యంగా కాగా.. కేవలం 75 శాతం మేర ఆదాయం మాత్రమే సమకూరడమే జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందనడానికి నిదర్శనం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.వెయ్యి కోట్లు లక్ష్యానికి మించి రూ.1060.03 కోట్లు సమకూరింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా వెంచర్లు, నిర్మాణాలకు ఎవరూ సాహసించడం లేదు. గత ఏడాది కాలంగా కొత్త లేఅవుట్ల అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవడం జిల్లాలో స్థిరాస్తి రంగ పరిస్థితికి అద్దం పడుతోంది. గతంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో పదుల సంఖ్యలో కొత్త లేఅవుట్లకు దరఖాస్తులు వచ్చేవి. ఇప్పుడు కేవలం ముగ్గురు, నలుగురు వ్యాపారులు మాత్రమే లేఅవుట్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటికి కూడా బృహత్తర ప్రణాళిక పేరుతో అడ్డంకులు సృష్టిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

మన్యంలో పైనాపిల్ రైతులు ధరలేక ఉసూరు మంటున్నారు. వర్షాల వల్ల వ్యాపారులు రావడం లేదు. అరకొరగా వచ్చిన వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఒక పైనాపిల్‌కు సైజును బట్టి సగటున రూ.10 వరకు ధర చెల్లిస్తున్నారు. మైదాన ప్రాంతాలకు తరలించి మూడింటిని రూ.90 నుంచి రూ.100కు విక్రయించి ఆదాయం పొందుతున్నారు. వ్యాపారుల పరిస్థితి లాభసాటిగా ఉండగా కష్టపడి పండించిన గిరి రైతులు మాత్రం పెట్టుబడి రాక నష్టాలు పాలవుతున్నారు.

ఇక్కడ రూ.10 అక్కడ రూ.30

ధర పతనంతో పైనాపిల్ రైతు ఉసూరు

- తీవ్ర నష్టం కలిగిస్తున్న వర్షాలు
- ఏకధాటిగా కురుస్తుండటంతో కానరాని వ్యాపారులు
- మార్కెటింగ్ లేక నష్టపోతున్న గిరి రైతులు
- గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి

పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయి ప్రాంతంలో పైనాపిల్ అమ్ముతున్న గిరిజన మహిళ

గిట్టుబాటు ధరకు నోచుకోని పైనాపిల్

సాక్షి,పాడేరు: మన్యంలో పైనాపిల్ రైతుకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తుండటంతో వ్యాపారులు రాకపోవడంతో రైతులు మార్కెటింగ్ సమస్య ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ధర కూడా పతనమైంది. మరో పక్క పంటను కోయకుండా వదిలేయడంతో వర్షాలకు కాయలు కుళ్లిపోతుండటంతో గిరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

దిగుబడి బాగున్నా..

ఏజెన్సీలోని పాడేరు, అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, చింతపల్లి మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో 610 ఎకరాల విస్తీర్ణంలో పైనాపిల్‌ను సాగు చేస్తున్నారు. కొండపోడు, మెట్ట భూముల్లో సేంద్రియ విధానంలో పండించడం వల్ల రుచిలో నంబర్ వన్‌గా నిలుస్తున్నాయి. జూన్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు పంట దిగుబడి ఉంటుంది. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజన రైతులు ఉసూరుమంటున్నారు.

ఈ ఏడాది దారుణంగా..

ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది పైనాపిల్ ధరలను వ్యాపారులు పతనం చేశారు. గత నెల సీజన్ ప్రారంభంలో ఒకొక్క కాయను రూ.20నుంచి రూ.25 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధరను బాగా తగ్గించేశారు. గత పది రోజుల నుంచి సైజునుబట్టి రూ.5 నుంచి రూ.13కు కొనుగోలు చేస్తుండటంతో గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. సమీపంలోని అనకాపల్లి జిల్లా వి.మాడుగుల సంతకు నేరుగా తీసుకువెళ్లినా అక్కడ వ్యాపారులు కూడా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని వారు వాపోతున్నారు.

ముందుకురాని వ్యాపారులు : పైనాపిల్ సీజన్ ప్రారంభమైనప్పటికీ వ్యాపారుల రాక తగ్గింది. గతంలో తుని, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చేవారు. ఈ ఏడాది వ్యాపారుల నుంచి డిమాండ్ కూడా తగ్గింది.దీంతోపాటు వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పైనాపిల్‌ను కొనుగోలు చేసే వారు కరువయ్యారని గిరి రైతులు వాపోతున్నారు.

పులుసుమామిడి ప్రాంతంలో పైనాపిల్ సాగు

- పైనాపిల్ సాగుకు పేరొందిన వంట్లమామిడి, సలుగు, దేవాపురం, ఐనాడ పంచాయతీల పరిధిలోని గిరిజనులకు ఏటా ఈ పంట ద్వారా ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది కనీసం రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారుల వద్దకు తీసుకెళ్లినా తక్కువ ధరే..

అనకాపల్లి జిల్లా వి.మాడుగుల సంతలో కూడా పైనాపిల్‌కు తక్కువ ధరే లభిస్తోంది. వ్యాపారులు రూ.12కు మించి కొనుగోలు చేయడం లేదు. గత ఏడాది రూ.20కి అమ్ముకున్నాం. ఈ ఏడాది మాత్రం గిట్టుబాటు ధర కరువైంది. ప్రభుత్వం స్పందించి రైతుబజార్లకు తరలించి అమ్ముకునేలా ఏర్పాట్లు చేయాలి.

– **కిముడుబోయిన శ్రీరాములు,** పైనాపిల్ రైతు, కందులపాలెం, పాడేరు మండలం

ఐటీడీఏ మార్కెటింగ్ చేయాలి

ఈఏడాది పైనాపిల్‌కు గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. చిన్న కాయను రూ.5కు కొంటున్నారు. మైదాన ప్రాంతాల వ్యాపారులు గ్రామాలకు రావడం లేదు. మైదాన ప్రాంతాలకు రైతులు పైనాపిల్‌ను తరలించి అమ్ముకునే విధంగా ఐటీడీఏ మార్కెటింగ్‌కు సహకరించాలి. ఇలా చేయగలిగితే నష్టాల నుంచి బయటపడగలుగుతాం.

– **కిల్లు కృష్ణ,** గిరిజన రైతు, పులుసుమామిడి, పాడేరు మండలం

తల్లి ఆశీస్సులతోనే ఉన్నత పదవి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు

గోపాలపట్నం: తల్లి దీవెనలతో భారతీయ జనతాపార్టీలో ఇంత ఉన్నతమైన పదవి దక్కడం ఎంతో గర్వంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తరువాత తొలిసారిగా గురువారం విశాఖ చేరుకున్న ఆయనకు ఎయిర్ పోర్టులో పార్టీ నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ దేశంలో బీజేపీని అగ్రగామిగా బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. విశాఖ వాసిగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను తాను సందర్శించానని, రాయలసీమ నుంచి శ్రీకాకుళం వరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తానని తెలిపారు. భవిష్యత్తులో బీజేపీని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా తయారు చేస్తానని మాధవ్ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం, ఆయన విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా నగరానికి చేరుకున్నారు.

జోగినాయుడుకు మాజీ సీఎం జగన్ ఫోన్లో పరామర్శ

జోగినాయుడును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు

నాతవరం: సినీ నటుడు, రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ మాజీ హెడ్ ఎల్.జోగినాయుడును మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్లో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సంతాపం తెలిపి మనోధైర్యం కల్పించారు. జోగినాయుడు మాతృమూర్తి సత్యవతి అనారోగ్యం బాధపడుతూ బుధవారం రాత్రి విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె అంత్యక్రియలు నాతవరం మండలం చెర్లోపాలెంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ జోగినాయుడును ఫోన్లో పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ జి. సుభద్ర, వైస్ చైర్మన్ బి. సత్యవతి జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు, గొలుగొండ, పరవాడ, ఎస్.రాయవరం, యలమంచిలి జెడ్పీటీసీ సభ్యులు సుర్ల గిరిబాబు, పైల సన్యాసినాయుడు, కాకర దేవి, వైఎస్సార్‌సీపీ కాకినాడ టౌన్ నాయకుడు గోపాల్, సర్పంచ్ పైల శిరీషా, మాజీ సర్పంచ్ బాబులు, మాజీ ఎంపీటీసీ నాని, గొలుగొండ మండలం సీనియర్ నేత కొల్లి శ్రీనివాస్, సినీ డైరెక్టరు పరశురామ్, పలువురు సినీ ప్రముఖులు జోగినాయుడును పరామర్శించారు.

చిట్టీల మోసం కేసులో ముగ్గురి అరెస్ట్

అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు: చిట్టీల పేరిట మోసం చేసి పరారైన కేసులో మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. గురువారం కె.కోటపాడు పోలీసు స్టేషన్లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చౌడువాడకు చెందిన పెదిరెడ్ల పద్మజ ఏడేళ్లుగా చిట్టీలను నిర్వహిస్తోంది. ఈమె 15 గ్రూపులను నడుపుతూ గరిష్టంగా రూ.4 లక్షల వరకు చిట్టీలు కట్టించుకునేది. సుమారు 300 మంది వరకూ సభ్యులు ప్రతి నెలా చిట్టీలు కడుతున్నారు. ఇటీవల ఈమె గ్రామంలో కనిపించకుండా పోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చిట్టీల నిర్వాహకురాలు పద్మజతో పాటు, ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి కోటిన్నర కలిగిన ఆస్తులను గుర్తించి వశపరుచుకున్నట్లు కోర్టుకు వివరాలు సమర్పించారు. నిందితులు ముగ్గురికి కోర్టు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు.

హైడ్రో పవర్ ప్లాంట్ జీవో ప్రతులు దహనం

దేవరాపల్లిలో సీపీఎం నాయకుల రాస్తారోకో

జీవో ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, వెంకన్న, తదితరులు

దేవరాపల్లి: అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చి రైవాడ ప్రాజెక్టు ఉసురు తీస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లిలో పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించి, హైడ్రో పవర్ ప్లాంట్‌కు ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ప్రజల తాగునీటి అవసరాలతోపాటు దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. ఇంతటి కీలకమైన రైవాడ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా పెదకోట తమటపు గెడ్డ వద్ద 1800 మెగావాట్లు, చింతలపూడి పంచాయతీ పరిధిలో శారదానదిపై 900 మెగావాట్లు సామర్థ్యం కలిగిన పవర్‌ప్లాంట్ నిర్మాణానికి జీవో నంబర్ 51ను ప్రభుత్వం విడుదల చేయడం దారుణమన్నారు. దీన్ని నిలుపుదల చేయకుంటే జలాశయంపై ఆధారపడ్డ వేలాది ఎకరాలు బీడుగా మారుతాయన్నారు. రైవాడ ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే జీవో నంబర్ 51ను రద్దు చేయాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, కర్రి సన్యాశినాయుడు, వేచలపు దొంగబాబు, జానా సన్నిబాబు, జె.ఈశ్వరరావు, జన్ని దేముడు, జె.పోతురాజు, గూట్లు దేముడు, జె.దేముడు, బి.నాగేశ్వరరావు, రామకృష్ణ, టి.శంకర్, సిహెచ్. చినదేముడు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీగా బొలిశెట్టి

నూతన ఎంపీపీ గోవిందరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నాయకులు

ఎస్.రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావుకు పార్టీ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి గత నెల 6న వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఎన్నిక జరిగే వరకు వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావుకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, జిల్లా కమిటీ సభ్యుడు కొణతాల శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, మైలపల్లి శ్రీనివాసరావు, శానాపతి శ్రీరాములు, మల్లే లోవరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

8 బైక్‌లు, రూ. 8,180 స్వాధీనం

నాతవరం: మండలంలోని రెండు గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. 11 మందిని అరెస్టు చేసి 8 బైక్‌లు, రూ. 8,180 స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు గురువారం తెలిపారు. పి.జగ్గంపేట సమీపంలో పేకాడుతున్నట్లు అందిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు నిందితులను పట్టుకుని, ఎనిమిది బైక్‌లు సీజ్ చేశామన్నారు. వారి నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. రామన్నపాలెం సమీపంలో పేకాడుతుండగా దాడి చేశామన్నారు. ఈ దాడిలో అయిదుగురు పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రూ.3,080 స్వాధీనం చేసుకున్నా మన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్

ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు

అచ్యుతాపురం రూరల్: కల్తీ మద్యం తయారుదారుల వివరాలు బయటపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి డిమాండ్ చేశారు. కల్తీ మద్యం నిర్వాహకులపై ఉక్కుపాదం మోపాలని ఐద్వాతోపాటు మహిళా సంఘాల నాయకులు గురువారం అచ్యుతాపురంలో ఆందోళన చేపట్టారు. కల్తీ మద్యం విక్రయాలతో శరీర అవయవాలు తొందరగా పాడైపోయి పలువురు మరణిస్తున్నారన్నారు. మత్తు పదార్థాలు, మద్యం అక్రమ విక్రయదారులను కఠినంగా శిక్షించాలన్నారు. బ్రాండ్ మద్యంలో స్పిరిట్ కల్తీ చేసి బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు నారాయణమ్మ, నాయకులు త్రిమూర్తులమ్మ, కాసులమ్మ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు బీఎన్ రోడ్డులో పర్యటించాలి

- వాహన చోదకుల కష్టాలు తెలుసుకోండి
- ఎన్నికల వాగ్దానం నిలబెట్టుకోండి
- సీపీఎం నాయకులు గోవింద, చిరంజీవి డిమాండ్

రోలుగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డులో చెరువును తలపిస్తున్న నీటిలో చేపల వేట (ఫైల్)

రోలుగుంట: పూర్తిస్థాయిలో దెబ్బతిన్న బీఎన్ రోడ్డులో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రయాణాలు చేసి ప్రయాణికులు, వాహనచోదకులు ఎదుర్కొంటున్న కష్టాలు తెలుసుకోవాలని, అధికారంలోకి రావడానికి రహదారుల అభివృద్ధిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు కె.గోవింద, ఇ.చిరంజీవి డిమాండ్ చేశారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. బీఎన్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని నూతులను తలపించే విధంగా ప్రమాదకరమైన భారీ గోతులున్నాయన్నారు. రోలుగుంటలో మండల కార్యాలయాల సముదాయం నుంచి స్థానిక ఎంపీపీ పాఠశాల వరకూ భారీ గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తుంది. పది రోజులుగా ఈ సమస్య ఉండడంతో ఈ దారిలో ప్రయాణించేవారి గోతుల్లో అదుపు తప్పి బోల్తా పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు మాసాల క్రితం కొత్తకోట నుంచి వస్తున్న ఆకుల వ్యాన్ మండల కార్యాలయం సముదాయం వద్ద గోతిలో పడి అదుపు తప్పి బోల్తాపడిన విషయం విదితమే. ఇక్కడ సమీపంలో గల చర్చి వద్ద గల గోతుల్లో ప్రతిరోజు వాహనాలు బోల్తా పడుతూనే ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్వయంగా ఈ రోడ్డుపై ప్రయాణించి సమస్యలు స్వయంగా తెలుసుకొని రోడ్డు బాగు చేయాలని కోరారు.

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టం

మాడుగుల రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, గురువారం నాటికి 136.40 మీటర్లకు చేరిందని జలాశయం జేఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. జలాశయం పరిసరాల్లో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 250 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని జేఈ తెలిపారు. జలాశయంలోకి చేరిన నీటి మట్టం దృష్టిలో పెట్టుకుని, స్పిల్‌వే గేట్ల ద్వారా రాత్రి 9 గంటల తర్వాత 100 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయనున్నట్టు జేఈ తెలిపారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

చెట్టుకు ఉరేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

పాయకరావుపేట: మండలంలో సీతారాంపురం శివారు పొలంలో మామిడి చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ జి.అప్పన్న గురువారం తెలిపారు. అతడి వయసు 45 ఏళ్లు ఉంటుందని, నేవీ బ్లూ కలర్ ప్యాంటు, తెలుపు నీలం రంగు గళ్ల చొక్కా శరీరంపై ఉందన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి మార్చురీకి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం స్ఫూర్తిదాయకం

జార్ఖండ్ రాష్ట్ర రైతు బృందం ప్రశంస

జీవామృతం గురించి జార్ఖండ్ రైతు బృందానికి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి అరుణ

కశింకోట: మండలంలో రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జార్ఖండ్ రాష్ట్రం రామ్‌గడ్ జిల్లాకు చెందిన రైతు బృందం ప్రశంసించింది. జాతీయ వనరుల సంస్థ (ఎన్ఆర్ఒ) ద్వారా నాబార్డ్ జీవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఈ బృందం మండలంలోని లాలంకొత్తూరు, జి.భీమవరం, సుందరయ్యపేట గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా లాలంకొత్తూరులో ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే జీవామృతం, ద్రవ్యాల తయారీని పరిశీలించారు. జీవామృతంతో వరి విత్తన శుద్ధి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగించారు. జి. భీమవరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి అక్కడ ఏటీఎం విధానంలో సాగవుతున్న నవ ధాన్యాలు, ఇతర విత్తనాల సాగును పరిశీలించింది. ప్రకృతి సాగుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యవంతమైన ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల చెట్ల సాగు వల్ల వచ్చే ఫలసాయం సొంత అవసరాలకు వినియోగించుకొని మిగిలిన వాటిని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న విధానాన్ని వివరించారు. సుందరయ్యపేటలో రైతులు 40 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్ మోడల్‌లో వేసిన నవ ధాన్య విత్తనాల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగుకు, పంటలపై వచ్చే తెగుళ్ల నివారణకు వాడే జీవామృతం తయారీ విధానాన్ని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి కూండ్రపు అరుణ వివరించగా బృందం అభినందనలు తెలిపింది. జార్ఖండ్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తుంటామని బృందం రైతులు తెలిపారు. ఏపీ రాష్ట్ర ఎన్ఆర్వో ప్రతినిధి ఎం.చందు, రీజనల్ ఆఫీస్ నార్త్ కోస్టల్ ఎన్ఎఫ్ఎ తరుణ్ ఆదిత్య, హేమలత, ఎన్ఎఫ్ఎ రామగోవిందు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/- మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్రః 96032 16460/63007 25191. [V- 3577]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ విశాఖపట్నం టౌన్ నందు గడ్డి కటింగ్ చేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం: 15,000 / ESI, PF కలవు. సంప్రదించండి: 7993893331, 80744 34160. [SCA25005899]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

Real Estate

RESTAURENT FOR SALE

■ Excellent Running Hyderabadi Non Veg. Restaurant (40 seating) for sale. Near Rama talkies, Visakhapatnam. Ph : 95733 37307 [V- 14053]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ Wanted Office Assistant Female with Knowledge of Cash, Minimum Accounts and Computer Knowledge 8:30 am to 6pm. Cont : 93930 03003 [V- 14046]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించ వలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

ఇ-వేలం ద్వారా మెషినరీ అమ్మకం (హైపోథికేషన్ ప్రకారం)

ఋణగ్రహీత: రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా: రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా: శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి: లేటు ఎస్. అప్పన్న, డి.నెం.30-83-19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. **వేరొక చిరునామా: శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం - 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.2-38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, డి.నెం.2-38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

మెషినరీ వివరములు

వ.నెం.	ఐటమ్‌ల వివరములు	నెం.
1	Eastman EC-3NL	1
2	Eastman 629"8" Straight Knife Cutting Machine	1
3	Hashima HP - 450 ms Fusing Press	1
4	Jack JK - 8560 WPL Sewing Machine with Complete set	2
5	Juki MS 1190MF - AA Sewing Machine with Complete set and std ace	1
6	Kansai DFB 1404 PSF Industrial Sewing Machine with Complete set and std	1
7	SGPB - 06 Duo Auto Seam Generator	1
8	SGVT 125 x 80 N Potable Vaccum Iron Table	4
9	ES - 300 Silver Star	2
10	ES - 300 Teflon Shoe	2
11	Juki DDL - 8100 EB - AAP Sewing Machines with Complete set	30
12	JUki DDL - 900 BSWBK - AA Sewing Machine with Complets set	2
13	Juki DLM5200ND-ACP Sewing Machine with Complete set	1
14	Juki M06816SDE430HE35/SM55A/KE10A Sewing Machine with Complete set and std acces	2
15	Juki LK-1903BNSS301/MC672KNN-AA4 Sewing Machine with Complete set	1
16	Juki LBH-1790ANS/MC602KN Sewing Machine with Complete set and std acc	1
17	Juki LK - 1900BNSS000/MC672K NN-AA4 Sewing Machine with Complete set and std acc	1
18	Line Centre Table of size 8x2x2.5 ft.,	10
19	Stool Model ST 02 03 ft	42
20	Inspection Table 4x3x3 ft	2
21	Spreading Table 8.4" 1.8"09 mtr	1
22	END Line Checking Table	1
23	62.5 Kva KOEL Green DG Sets with acoustic enclouser Engine No:T4- 8907 - 1820514 Altmo: LBS3K18C40764 Kirloskar	1

రిజర్వు ధర : రూ.17,82,000/- ధరావత్తు : రూ.1,78,200/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేది : 21-07-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

నియమ నిబంధనలు : 1) మెషినరీ ఖచ్చితంగా "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు మెషినరీ అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకతతో ఆధార్ కార్డు / ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. ఇవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 5) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 6) తేది.05-07-2025 నుండి 20-07-2025 వరకు బ్యాంక్ పనివేళలలో మెషినరీ తనిఖీ చేసుకోగలరు. మెషినరీ తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 8099444378 & 9666909050. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID: support.baanknet@psballiance.comను సంప్రదించండి.

తేది: 03-07-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

రామావతారంలో జగన్నాథుడు

రామావతారంలో వేణుగోపాలస్వామికి పూజలు

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం లో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి రామావతారం లో భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశా వతారాల్లో ఏడో అవతారంగా అలంకరించి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శిం చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారా మాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముందస్తు జాగ్రత్తతో క్షయ నియంత్రణ

క్షయ వ్యాధిపై అవగాహన ప్రదర్శన

అనకాపల్లి టౌన్: ముందస్తు జాగ్రత్తతో టీబీ వ్యాధిని అరికట్టవచ్చని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ హెచ్ఈవో బి. మం గమ్మ తెలిపారు. మండలంలోని పాపయ్య సంతపాలెం గ్రామంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగిం ది. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధి లక్షణాలను వివరించి అనుమాని తులను గుర్తించి తుమ్మపాల పీహెచ్‌సీకి పరీక్ష లకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

13న వాకర్స్ క్యాబినెట్ సమావేశం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదా రిలోని వివేకానంద ఫంక్షన్ హాల్లో ఈ నెల 13న జిల్లా 101 వాకర్స్ క్యాబినెట్ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అన కాపల్లి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాపేటి నారాయ ణరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు అందరూ తప్పనిస రిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం మేడపైన ఈ నెల 11న ఉదయం 10.30 గంట లకు మండల పరిషత్ 17వ సర్వసభ్య సమా వేశం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పి.ఆశాజ్యోతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 32 పంచాయతీ పరిధి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 13 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడో రకం	3,500	3,500

అనకాపల్లి సినిమాలు

రాజా	: కృష్ణుడికి కెంతో
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	కుబేర
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: చంద్రేశ్వర
శ్రీ సత్య	: 3బీహెచ్‌కే
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేం ద్రంలో 52 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-9, ఓ పాజిటివ్-29, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ 9703613706 నంబరును సంప్ర దించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురు వారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబ రును సంప్రదించవచ్చు.

ఫ్లై ‘ఓవర్ యాక్షన్’

- 20 సంవత్సరాలుగా పూర్తికాని బ్రిడ్జి
- రైల్వే స్థలంలో పూర్తయిన నిర్మాణం
- ఆర్అండ్‌బీ పరిధిలో జాప్యం
- పట్టణ ప్రజలకు తప్పని తిప్పలు

స్థల సమస్యా అంటే.. అదీ కాదు. పోనీ కోర్టు కేసులున్నాయా అంటే.. అబ్బే అటు వంటివేవీ లేవు. రైల్వే శాఖ జాప్యమా అంటే.. ఆ సంస్థ ఎప్పుడో తన పరిధిలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసింది. నిధులు సమస్య అంటే.. అప్పటి ప్రభుత్వమే ఆగ మేఘాల మీద పూర్తి చేయాలని పనులు ప్రారంభించింది. ఇది గడిచి దాదాపు 20 సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ లక్ష్మీదేవిపేట రైల్వే స్టేషన్ వద్ద చేపట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కాలేదు. పర్యవసానంగా పట్టణ వాసులకు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

అనకాపల్లి: పెరుగుతున్న పట్టణ జనాభాతోపాటు చుట్టు పక్కల మండలాల నుంచి వస్తున్న ప్రజ లతో నిత్యం రద్దీగా మారుతున్న అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ జఠిలమవుతోంది. ఈ నేపథ్యంలో 2005లో దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలనలో శ్రీకారం చుట్టిన లక్ష్మీదేవిపేట ఫ్లై ఓవర్ నేటికీ పూర్తి కాలేదు. అప్పట్లో శారదానది, ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిలు నిర్మించారు. అదే సమయం లో ముందుగా రైల్వే శాఖ లక్ష్మీదేవిపేట రైల్వే స్థలంలో బ్రిడ్జి పూర్తిస్థాయిలో నిర్మించింది. ఆర్అం డ్‌బీ స్థలంలో బ్రిడ్జి పనులు చేపట్టాలని అప్పటి ప్రభుత్వ అధికారులకు నివేదించింది. 20 సం వత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా బ్రిడ్జి నిర్మించకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లక్ష్మీదేవిపేట రైల్వే గేటు సమస్యతో ఇబ్బందులు....

స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి కింద అనకాపల్లి నుంచి చోడవరం, మాడు గుల, తదితర మండలాలతోపాటు అల్లూరు సీతారామరాజు జిల్లాకు వెళ్లే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాలు పడే సమయంలో ఈ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోయి వాహనాలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. పక్కనే రైల్వే స్టేషన్ వద్ద లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా వాహనాలు రాకపోకలు సాగించేవారు. ఈ నేపథ్యంలో లక్ష్మీ దేవిపేటలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్ణ యించారు. అందులో భాగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ఇంత వరకూ పూర్తి చేయలేదు. పైగా విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీ వాహనాలు వెళ్లే సమ యంలో రైల్వే ట్రాక్‌లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన పెద్ద గడ్డర్లను ఢీకొంటున్నాయి. మూడు మాసాలు క్రితం మార్టూరు నుంచి పెద్ద రాయితో బెంజ్ లారీ రాంబిల్లి మండలం నేవిల్ డాక్‌యార్డుకు వెళ్లే సమయంలో గడ్డర్‌ను ఢీకొన డంతో పట్టాలు పక్కకు జరిగిపోయాయి. దాం తో విజయవాడ నుంచి విశాఖ పోర్టుకు వెళ్లే గూడ్స్ రైలు డ్రైవర్ గమనించి రైలును నిలుపుదల చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిం ది. ఇంత జరిగినప్పటికీ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

లక్ష్మీదేవిపేటలో రైల్వే స్టేషన్లో నిర్మించిన ఫ్లై ఓవర్

ఆర్అండ్‌బీ స్థలంలో వేసిన పిల్లర్

ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి – విశాఖ మధ్య నిత్యం రైళ్ల రాకపోకల సమయంలో లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వేయడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడే సమయంలో విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు నిలిచిపోయి అనకాపల్లి పట్టణానికి వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. లక్ష్మీదేవిపేట ఫ్లై ఓవర్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్మించాలి. – పి.డి.గాంధీ, తుమ్మపాల, అనకాపల్లి మండలం

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు

రైల్వే స్థలంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి రైల్వే అధికారులు నిర్మిం చారు. గ్రామీణ ప్రాంతాల నుం చి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చే సమయంలో లక్ష్మీదేవిపేట గేటు వేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. వర్షాలు పడుతున్న సమయంలో సమస్య ఎక్కువగా ఉంటుంది.
– కె.కన్నబాబు, అనకాపల్లి

ధ్యానంతో ఏకాగ్రత

గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్యానం చేస్తున్న మహిళలు

కశింకోట: ధ్యానం ఆచరణతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని అనకాపల్లికి చెందిన కరుణా మయి పిరమిడ్ వ్యవస్థాపకురాలు ఆర్.బాలమ్మ తెలిపారు. స్థానిక గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కరుణామయి పిరమిడ్ సంస్థ తరపున ప్రతినిధి శరగడం వెంకట రావు ఆధ్వర్యంలో ‘ధ్యానంపై శ్వాస’ కార్యక్ర మాన్ని నిర్వహించారు. శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయాలన్నారు. దీనివల్ల ఏకాగ్రత కలుగు తుందని, మనస్సు ప్రశాంతంగా ఉంటుంద న్నారు. టీవీలు, సీరియళ్లు మానవ జీవనానికి హాని కలిగిస్తున్నాయని, వాటికి దూరంగా ఉండా లన్నారు. ధ్యానం, ఆధ్యాత్మికతపై దృష్టి సారించి జీవితాలను సుఖమయం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎక్కువ సంఖ్యలో హాజరైన మహిళలు, ప్రజలకు ధ్యానంపై అవగాహన కలిగించారు. ధ్యానం చేయించారు. ఈ సందర్భం గా బాలమ్మ దంపతులను కరుణామయి పిరమిడ్ ప్రతినిధులు, శిష్యులు దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజర య్యారు.

పిరమిడ్ వ్యవస్థాపకురాలు బాలమ్మ దంపతులను సత్కరిస్తున్న శిష్యులు, అభిమానులు

టారెత్తిన టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర టారెత్తించింది. కిలోకు అదనంగా రూ.20 పెరిగింది. గత వారం కిలో రూ.30 ఉండగా ఈ వారం కిలో రూ.50కి విక్రయాలు సాగాయి. ఉల్లి రూ.30, వంకాయ, బెండకాయ రూ.40, కేబేజి రూ.50, బీట్రూట్, క్యారెట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి. సొరకాయ ఒక్కొక్కటి రూ.20కి విక్రయించారు.

మూగ యువకుడి అదృశ్యం

వాసిరెడ్డి అర్జున్

కశింకోట: మండలంలో తీడ గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ కె. లక్ష్మణరావు తెలి పారు. తీడకు చెందిన వాసిరెడ్డి అర్జున్ (18) ఏడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. అతడు మూగవాడు కావడంతో పాటు అమాయకుడన్నారు. బంధువులు, ఇతర గ్రామాల్లో ఆచూకీ కోసం వెతికినా జాడ లేకపోవ డంతో తండ్రి నాగరాజు ఫిర్యాదు చేసిన మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

అక్రమ స్టోన్ క్రషర్లపై చర్యలకు డిమాండ్

అనకాపల్లి: మండలంలో మార్టూరు సర్వే నంబరు – 1లో మధుకాన్ ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, అవర్ణ క్వారీ క్రషర్, నవోదయ క్వారీ క్రషర్ అక్రమంగా నిర్వహిస్తున్నారని, దీనిపై కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తుందని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2002 నుంచి బోర్ బ్లాస్టింగ్లు చేయడం వల్ల గ్రామంలో గృహాలు బీటలు వారిపోయి, శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాపోయారు. మధుకాన్ క్వారీ పక్కన మెట్టభూమి రైతుల పంటలు పాడై పోతున్నాయన్నారు. ప్రజలు కిడ్నీలు, లంగ్స్ కేనర్ వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతున్నట్లు వాపోయారు. దీనిపై కలెక్టర్ విజయకృష్ణన్ తక్ష ణమే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా మైనిం గ్ అధికారి ప్రతాప్‌రెడ్డి 8 నెలల క్రితం క్వారీలను పరిశీలించి మధుకాన్ కంపెనీకి రూ. 40 కోట్లు, అపర్ణ కంపెనీకి రూ.19 కోట్లు, నవోదయ కంపె నీకి రూ. 8కోట్లు అపరాధ రుసుం విధించినప్ప టికీ క్వారీ అధికారుల్లో చలనం లేదన్నారు. దీనిపై గ్రామస్తులతో కలిసి ఉద్యమాలకు శ్రీకారం చుడ తామన్నారు.

హైస్కూలులో దాడి జన్మదిన వేడుకలా?

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో టీడీపీ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జన్మదిన వేడు కలు కూటమి నాయకులు గురువారం నిర్వహిం చడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలో రాజకీయ నేత వేడుక ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నేత వేగి పవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యా సంఘం ఛైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, సభ్యురాలు పెదపాటి కల్యాణి, టీడీపీ నాయకులు వేగి వెంకటరావు, దాసరి బాబు, బొబ్బరి పవన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి కృ ష్ణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి వైద్య పరికరాల వితరణ

అనకాపల్లి: వర్షాల సమయంలో గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయ ని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీసీహెచ్ఎస్ కె.శ్రీనివాసరావుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, వ్యాపారవేత్త ఆడారి రాజా ఆర్థిక సాయంతో రోగులకు ఉపయోగించే మూడు వీల్ చైర్లు, బీపీ చెకింగ్ మిషన్లు-5, నెబులైజర్ మిషన్ -1 గురు వారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అత్యవసరమైన పరి స్థితుల్లో అవసరమైన మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్స్ ఆళ్ల రామచంద్రరావు, తాడి కుమారి, గొర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావుకు వైద్య పరికరాలు అందజేస్తున్న డి.డి.నాయుడు

ఈలపాటతో అలరింపు

ఈలపాటలో అలరించిన విజయబాబు

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం రాత్రి అనకాపల్లికి చెందిన విజయబాబు ఈలపాటతో ఆహూతులను అలరించారు. వివిధ పాటలను తన ఈలపాటతో అవలీలగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామా చార్యులు ఆధ్వర్యంలో ఆయనను దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.

వివాదాస్పద వీఎంఆర్‌డీఏ భూమిలో రైతుల ఆందోళన

పరిహారం చెల్లించాలని డిమాండ్

పెందుర్తి: వేపగుంటలోని వీఎంఆర్‌డీఏ(వుడా) భూముల్లో వివాదం మళ్లీ రాజుకుంది. పరిహారం చెల్లించకుండా వీఎంఆర్‌డీఏ యంత్రాంగం పనులు చేపట్టడాన్ని బాధిత రైతులు ఆక్షేపిస్తున్నారు. తమకు తగిన న్యాయం చేయకుండా ఇక్కడ పనులు చేపట్టడానికి వీల్లేదంటూ గురువారం ఆం దోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు ముత్తా నాయుడు మాట్లాడుతూ దశా బ్దాలుగా ఇక్కడి భూముల్లో వివాదం నడుస్తోందని, భూముల ఫలసాయం పొందుతున్న రైతులకు పరి హారం విషయంలో తాత్సారం చేయడం దారుణమ న్నారు. యోగాంధ్ర పేరుతో వీఎంఆర్‌డీఏ భూము ల్ని చదును చేశారని, ఆ తరువాత రైతులు మొక్కలు వేసుకుంటే వీఎంఆర్‌డీఏ అధికారులు తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ వివాదా నికి పరిష్కారం చూపి 144 ఎకరాల్లో ఉన్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, రాపర్తి కన్నా, వివిధ పార్టీల నాయకులు, వేపగుంట గ్రామ పెద్దలు మద్దతుగా నిలిచారు.

ఆందోళన చేస్తున్న వేపగుంట రైతులు

వివాదాస్పద భూమి ఇదే..

బాలసదనంలో హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్

నర్సీపట్నం: మిషన్ వాత్సల్యం పథకంలో భాగం గా జిల్లా సత్వర చికిత్స కేంద్రం వారు నర్సీప ట్నం బీసీ కాలనీలోని బాలసదనంలో పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ శుక్రవారం నిర్వహిం చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.హైమావతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఎ స్తేర్‌రాణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు క్యాం ప్‌లో పాల్గొని పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలు, జనన లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులపై విద్యార్థులు స్క్రీనింగ్ పరీ క్షలు నిర్వహించి చికిత్స అందించారు.జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి తరలించి పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్తేర్‌రాణి తెలిపారు.

బాలసదనం విద్యార్థులతో బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది

నేడు మెగా రక్తదాన శిబిరం

కశింకోట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకొని శుక్రవారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆసరా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరం జరుగుతుం దన్నారు.

దేశవ్యాప్త సమ్మె గోడపత్రిక ఆవిష్కరణ

కె.కోటపాడు : ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెలో ప్రజలతో పాటు కార్మికులు, కర్షకులు పెద్ద సం ఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం మండల నాయకుడు యర్రా దేముడు అన్నారు. కె.కోటపాడులో గురువారం అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగులతో కలిసి ఆయన సమ్మెకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యర్రా దేముడు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి సమగ్ర చట్టాన్ని చేయాలని, భవన నిర్మాణ రంగంలో కార్మి కుల అందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతుల పం టలకు గిట్టుబాటు ధరలను ప్రకటించాలని, బీసీ లకు 50 ఏళ్లకే పింఛను అందిస్తామన్న హామీని వెం టనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కె.కోటపాడులో గోడపత్రికను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గ్రావెల్ దందా.. కూటమి అండ

- యథేచ్ఛగా మండలంలో గ్రావెల్ తవ్వకాలు
- ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలే లక్ష్యం
- సహకరిస్తున్న కూటమి పార్టీల నేతలు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

సబ్బవరం: మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపో తోంది. ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ లేఅవుట్‌లలో తవ్వకాలు చేపడుతూ గ్రావెల్, మట్టి యథేచ్ఛగా తరలించుకు పోతున్నారు. ప్రభుత్వం నుంచి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల్లేకపోవడంతో మం డలంలో గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొంది. దీన్ని ఆసరాగా తీసుకున్న గ్రావెల్ మాఫియా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీ మొత్తంలో దండుకుంటోంది. అనధికార తవ్వకాల నేపథ్యంలో ఒక్కో లోడ్ గ్రావెల్‌కు రూ.4 వేలు నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేస్తున్నారు. లోడింగ్ వ్యయం పోనూ లోడ్‌కు రూ.3 వేలు నుం చి రూ.5 వేలు మిగులుతుంది. దీంతో రోజుకు వం ద లోడ్లు వేసినా.. రూ.5 లక్షల ఆదాయం. దీన్లో అంద రికీ వాటాలున్నాయని సమాచారం.

సబ్బవరంలో గ్రావెల్‌తో ఫిల్ చేస్తున్న ఓ బేస్‌మెంట్

గ్రావెల్ దందా ప్రాంతాలివే..

మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరం, నంగినారపాడు, అజనగిరి, మండల కేంద్రం సబ్బవరంలోని అసకపల్లి సర్వే నెం.1లోని వజ్రాల కొండ, అంతకాపల్లి శివారు ఒమ్ము వాని పాలెం సమీపంలోని రైవాడ కాలువ వద్ద, నల్ల కొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం, గాలిభీమవరం, అయ్యన్నపాలెం, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం, ఎల్లుప్పి, అమృతపురం, రాయపుర అగ్రహారంలోని కొండవాలు ప్రాం తాలు, ప్రభుత్వ భూము లు, ప్రభుత్వ గృహ లేఅ వుట్లలో ఎక్కువగా గ్రావెల్, మట్టి దందా జరుగు తోంది. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట యథే చ్ఛగా గ్రావెల్, మట్టి తవ్వుకుపోతున్నారు. అధి కారులు, కూట మి నేతల అండదండలతో పాటు దారిపొడవునా తమ వేగుల్ని ఏర్పాటు చేసుకుని, దాడుల సమయంలో తప్పించుకుంటున్నారు.

రూ.లక్షల్లో ఫిల్లింగ్ కాంట్రాక్టులు

సబ్బవరం పరిసర ప్రాంతం వేగం గా అభివృద్ధి చెందుతోంది. దీంతో నిర్మాణ రంగం కాస్త ఊపందుకుంది. పలు లేవుట్లు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో బేస్‌మెంట్లు, లేఅవుట్‌ల ఫిల్లింగ్‌లో గ్రావెల్, మట్టికి విప రీతమైన డిమాండ్ ఉంది. వీరి అవసరాలను దృ ష్టిలో ఉంచుకుని గ్రావెల్ మాఫియా బేస్‌మెంట్లు, లేఅవుట్‌ల ఫిల్లింగ్ కాంట్రాక్టులు దక్కించుకుంటు న్నాయి. పొక్లెయిన్లు, టిప్పర్ లారీలతో రాత్రి పూట గంటల వ్యవధిలోనే సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి ఫిల్లింగ్ పూర్తి చేస్తున్నారు. వారి నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్నారు.

డంపర్లతో తరలించుకుపోతున్న గ్రావెల్

ఎమ్మెల్యే మౌనం వెనుక..

కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక పలు మార్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గ్రావెల్ అక్రమ తవ్వకాలపై బాహాటంగానే తన వ్యతిరేకతను వెల్లడిం చారు. ప్రధానంగా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవ ట్లేదని బహిరంగ ఆక్షేపణలు చేశారు. ప్రస్తుతం మండలంలో ఇంతగా గ్రావెల్ దం దా జరుగుతున్నా.. ఆయన నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కూటమి నేతల సహాయ సహకా రాలున్నాయని బహిరంగ విమర్శలు చేస్తున్నారు.

గంటల వ్యవధిలో వందల లోడ్లు

కాలం మారింది. తట్ట, పలుగు పట్టుకుని గ్రావెల్, మట్టి తరలిం చే రోజులు పోయాయి. ఆధునిక యంత్ర సామగ్రిని వినియోగిం చి అక్రమార్కులు గం టల వ్యవధిలోనే పని ముగించేస్తున్నారు. వందల లోడ్ల మట్టి, గ్రావెల్ తరలిస్తూ రోజూ రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరికి స్థానిక కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉండటం తో.. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడట్లే దన్న ఆక్షేపణ లున్నాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి : 9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com

సాక్షి
అనంతపురం
శుక్రవారం । 4 । జూలై । 2025

టన్ను చీనీ రూ.16,670

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,670 ప్రకారం ధర పలికాయి.

ఐదుగురిపై చార్జ్‌మెమో

అభియోగాలు ఎదుర్కొన్న ఐదుగురు అధికారులకు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.3°/23.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యారోగ్యశాఖ పనితీరుపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించేందుకు అనువుగా సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆరోగ్య శాఖ ద్వారా చేపట్టిన పనులు గడువులోపు పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, డీసీహెచ్ఎస్ డేవిడ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో సంతృప్తస్థాయి పెంచాలి

ప్రజల్లో సంతృప్తస్థాయి పెరిగేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు.డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, వైద్యారోగ్య, మునిసిపల్, రీ–సర్వే, తదితర అంశాలకు సంబంధించి ఐవీఆర్ఎస్ సర్వేపై కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాస్పందన సమీక్ష ఉన్నతస్థాయిలో జరుగుతోందన్నారు. ఈ అంశానికి సంబంధించి అన్ని శాఖలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయాలని చెప్పారు.

పొద్దున్నే పెన్షన్ ఇవ్వలేదని.. సచివాలయ సిబ్బందికి షోకాజ్

శింగనమల: మండలంలో 27 మంది సచివాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 1న ఉదయం 7.40 గంటలైనా పింఛన్ పంపిణీ ప్రారంభించకపోవడంపై 'షోకాజ్' ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు.

రేపు బీఎస్‌ఎన్‌ఎల్ జాతీయ లోక్ అదాలత్

అనంతపురం సిటీ: బీఎస్ఎన్ఎల్ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. బకాయి పడిన మొబైల్ వినియోగదారులకు ఇప్పటికే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నోటీసులు జారీ చేశామని, అటువంటి వారు కోర్టుకు హాజరు కాకుండానే జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై బకాయిలను రాయితీతో చెల్లించవచ్చని సూచించారు.

ఆ టీచర్లను రిలీవ్ చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: రెగ్యులర్ టీచర్లను రిలీవ్ చేయాలని డీఈఓ ప్రసాద్ ఎం. బాబు ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో కొందరని రిలీవర్ లేని కారణంగా రిలీవ్ చేయలేదని, దీంతో వారి పాఠశాలల్లో ఎంటీఎస్ టీచర్లు జాయిన్ అయ్యారని డీఈఓ పేర్కొన్నారు. బదిలీ అయిన రెగ్యులర్ ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. ఏదైనా పాఠశాలలో సంబంధిత సబ్జెక్టులో 50 శాతం కంటే తక్కువగా ఉపాధ్యాయులు ఉన్నట్లయితే ఆ సబ్జెక్టు టీచర్ బదిలీ అయినప్పటికీ వారు గతంలో పనిచేసిన పాఠశాలలోనే పని చేయాలన్నారు. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.

ఇచ్చిన హామీలే నీటిమూటలనుకుంటే ఇంటింటికీ సుపరిపాలన అంటూ ముద్రించిన కరపత్రాలు మరీ ఘోరంగా ఉన్నాయంటూ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల్లో చర్చ జరుగుతోంది. హామీలు నెరవేర్చామా లేదా అన్నది చెప్పకుండా చేయని పనులపై అబద్ధాలు అచ్చువేసి కరపత్రాలు పంచుతున్నారు. వీటిని చదువుతున్న సామాన్యులు కూడా అర్థం కాక బిక్కముఖం వేస్తున్న పరిస్థితి. 'సూపర్ సిక్స్'పై ఎక్కడా ఒక్కమాట కూడా చెప్పకనే.. ప్రజల చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.



అరాచకాలు దాచేసి.. అబద్ధాలు అచ్చేసి!

- 'సుపరిపాలన' కరపత్రాల్లో ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాయని ముద్రణ
- క్షేత్రస్థాయిలో భిన్నంగా పరిస్థితి
- 'ఉమ్మడి అనంత'లో పెరిగిన అత్యాచారాలు, హత్య ఘటనలు
- రైతులకు ఉచిత విద్యుత్ అంటూనే.. విపరీతంగా కోతలు
- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం అంటూ పత్రాల్లో భజన
- 'సూపర్‌సిక్స్' ఊసే ఎత్తని వైనం

అబద్ధాలతో అచ్చేసిన టీడీపీ కరపత్రం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూటమి ప్రభుత్వ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న కూటమి ఎమ్మెల్యేలు పంచుతున్న కరపత్రాల్లో ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళలపై దాడులు గణనీయంగా తగ్గాయని ముద్రించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో దళిత బాలికపై సామూహిక అత్యాచార ఘటన జరిగింది. అనంతపురంలో ఇంటర్ చదివే గిరిజన బాలిక తన్మయి దారుణ హత్యకు గురైంది. ఈ రెండు ఘటనలు జిల్లాలోనే కాదు... రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఇక.. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రిలో ఎస్సీ వర్గానికి చెందిన ఎంపీపీపై దారుణంగా దాడి చేశారు. రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఎస్సీ,ఎస్టీలపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. కానీ, వాటన్నింటినీ దాచి దాడులు తగ్గినట్టు చిత్రీకరించడం చర్చనీయాంశమైంది.

గంజాయి, డ్రగ్స్ ముఠా పేట్రేగి పోతున్నా

కూటమి ప్రభుత్వం వచ్చాక రాయదుర్గం ప్రాంతంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా గంజాయి సాగు చేస్తూ దొరికిపోయాడు. తాడిపత్రిలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తూ పోలీసులకు సవాలుగా మారింది. అనంతపురంలో ఇటీవలే గంజాయి బ్యాచ్ పోలీసులకు పట్టుబడింది. హిందూపురంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా అవుతోంది. ఇంత దారుణంగా రెండు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ కేసులు నమోదవుతుంటే.. సురక్షిత ఆంధ్రప్రదేశ్ అని, రౌడీషీటర్లు, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నట్టు ఏడాది పాలన కరపత్రాల్లో భజన చేశారు.

ముందే రెక్కీ..

ఆకస్మికంగా గ్రామాల పర్యటన చేసే పరిస్థితి కూటమి నేతలకు లేదు. ఎక్కడ పర్యటిస్తున్నారో ఆ ప్రాంతానికి ముందురోజే అనుచరులను పంపించి అక్కడ వ్యతిరేకులెవరైనా ఉంటే బుజ్జగిస్తున్నట్టు తెలిసింది. ఎవరైనా ప్రశ్నించే అవకాశం ఉంటే వారికి ముందే నచ్చజెప్పి వస్తున్నారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న సామాన్యులు వాట్సాప్ గ్రూపుల్లో సమస్యలను పోస్ట్ చేస్తున్నారు. డ్రైనేజీ, రోడ్లు, కరెంటు స్తంభాలు, డీపీలు, ఆస్పత్రుల్లో వసతులు ఇలా ఒకటేమిటి రకరకాల సమస్యలతో వాట్సాప్ గ్రూపులు మోత మోగుతున్నాయి.

గుంతల రోడ్లకు గంతలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతల రోడ్లకు కూటమి సర్కారు గంతలు కట్టింది. ఎక్కడ చూసినా రోడ్లు ఛిద్రమై వాహనదారులు ఆపసోపాలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు రూ.866 కోట్లు విడుదల చేశామని కరపత్రాల్లో పొగుడుకున్నారు. కానీ రోడ్లు బాగుపడకపోగా బిల్లులు మాత్రం టీడీపీ నేతల జేబుల్లోకి చేరాయి. మరోవైపు 9 గంటల ఉచిత విద్యుత్ రైతులకు ఇచ్చామని చెబుతున్నారు. కానీ ఇటీవల కరెంటు కోతలు ఏ జిల్లాలో లేనట్టుగా ఉమ్మడి 'అనంత'లో చోటు చేసుకుంటున్నాయి.

బదిలీలు ముగిసినా.. రాయ'బేరాలు'!

అనంతపురంలోని పీఆర్ సర్కిల్ కార్యాలయం

అనంతపురం సిటీ: పీఆర్‌లో బదిలీలు ముగిసినా రాయబేరాలు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అనంతపురంలోని పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, బదిలీల గడువు ముగిసినా ఆ శాఖలోని ఇద్దరు డీఈలు రాయ'బేరాలు' చేస్తున్నట్లు సచివాలయ ఉద్యోగులు అనుమానిస్తున్నారు. కోరుకున్న స్థానాలకు పోస్టింగ్ సర్దుతామంటూ పలువురికి హామీ ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. కొందరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రేయింబవళ్లు పీఆర్ సర్కిల్ కార్యాలయం వద్దే పడిగాపులు కాస్తున్నారు.వారితో 'సాక్షి' మాట్లాడగా.. కౌన్సెలింగ్‌లో తాము కోరుకున్న చోటు వచ్చినా, రాజకీయ సిఫారసుతో తమకు తెలియకుండానే ఆ స్థానాలు మారిపోతున్నాయని ఆరోపించారు. జెడ్పీ క్యాంపస్‌లోని ఈఈ కార్యాలయంలో పని చేసే ఓ డీఈఈతో పాటు మరో డీఈఈ బదిలీల్లో అన్నీ తామై వ్యవహరించారు. అందుకు తగ్గట్టు బాగానే వెనకేసుకున్నట్లు చర్చ సాగుతోంది. అయితే, ప్రక్రియ ముగిసినా పేర్లు తారుమారు చేయిస్తూ.. అందిన కాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నాలుగు రోజుల క్రితమే ముగిసింది. ఎస్ఈగా పని చేసిన మహమ్మద్ జహీర్ అస్లాం ఉద్యోగ విరమణ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆయన పర్యవేక్షణలోనే కొనసాగింది. జాబితా కూడా ఇప్పటికే కలెక్టర్‌కు సమర్పించాం. ఆరోపణల గురించి నాకు తెలియదు. ఎవరైనా డబ్బు వసూలు చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవు.

– ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ

తుంగభద్ర తుళ్లింత



తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల ద్వారా నదికి పోతున్న నీరు

- 20 క్రస్ట్ గేట్లు ఎత్తివేత
- 58,260 క్యూసెక్కుల నీరు నదికి

బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతుండటంతో గురువారం తుంగభద్ర జలాశయం 20 క్రస్ట్ గేట్లను బోర్డు అధికారులు ఎత్తివేశారు. రెండున్నర అడుగుల మేర ఎత్తి నదికి 58,260 క్యూసెక్కులు, వివిధ కాలువలకు 4,506 క్యూసెక్కులు కలిపి మొత్తం 62,766 క్యూసెక్కులను బయటికి పంపుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా ప్రస్తుతం 80 టీఎంసీలకు కుదించారు. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోపే ఆమేరకు నీరు చేరడం గమనార్హం. దీంతో డ్యాంలో 78.100 టీఎంసీలు నిల్వ ఉంచి మిగిలిన నీటిని నదికి వదులుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం..

గత ఏడాది డ్యాం 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోయినప్పుడు తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు అమర్చారు. అయితే, జలాశయం 33 క్రస్ట్ గేట్లకూ మరమ్మతులు చేయాలని అప్పట్లోనే నిపుణుల కమిటీ సూచించింది. అయినా పాలకులు సరైన నిర్ణయం తీసుకోకపోవడం రైతులకు శాపంగా మారింది. గత రబీలో కాలువలకు నీటి విడుదలను ఆపేసిన తర్వాత గేట్ల మరమ్మతు విషయంలో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కించాయి. దీంతోనే ఈ ఏడాది డ్యాంలో 100 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు నీటి నిల్వను కుదించే దుస్థితి ఏర్పడింది.

వరినార్లలో బిజీబిజీ

ప్రస్తుతం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 28,932 క్యూసెక్కులుగా నమోదవుతోంది. గురువారం ఉదయం 12 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో పెరగడంతో సాయంత్రానికి మరో 8 గేట్లు మొత్తంగా 20 గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతులు వరి నార్లు వేసుకుంటున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,625.34 అడుగులకు నీరు చేరుకుంది. అవుట్‌ఫ్లో 62,268 క్యూసెక్కులుగా ఉంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 78.100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,587.11 అడుగుల వద్ద 8.78 టీఎంసీల నీటి నిల్వతో, 10,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 296 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండిందని బోర్డు అధికారులు తెలిపారు.

దళితులకు అండగా ఉందాం

- ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్సీ సెల్ ముందుండాలి
- ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి బాబు మోసాలను వివరించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో దళిత సామాజిక వర్గంపై దాడులు పెరిగిపోయాయి. వైఎస్సార్ సీపీ దళితుల పక్షాన నిలబడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. జిల్లాలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎస్సీ సెల్ ముందుండాలి. ప్రభుత్వంపై సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలి' అని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు అధ్యక్షతన ఆ విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దళితుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ' అంటూ ఆయా వర్గాలను అక్కున చేర్చుకున్నారన్నారు. దళితుల అభ్యున్నతికి రూ.70 వేల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారన్నారు. పేద విద్యార్థుల ఉన్నత భవిత లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడలో 205 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.

భయపెట్టేందుకు అక్రమ కేసులు

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ కృషి చేయాలని 'అనంత' పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, అందులో వైఎస్సార్ సీపీ సత్తా చాటాలన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. దళితుల్లో నాయకత్వం లేకుండా చేయాలన్న కుట్రతో మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడ్డారన్నారు.

చంద్రబాబు మోసాలను తెలియజేద్దాం..

వైఎస్సార్ సీపీ చేపట్టిన 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ నెల 15 నుంచి గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరిద్దామని 'అనంత' పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో దళిత వర్గాలపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందన్నారు. మృగాళ్లతో ఇబ్బంది పడ్డ వారికి న్యాయం చేద్దామన్న ఆలోచన కూడా ప్రభుత్వం చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, అధికార ప్రతినిధి ఎగ్గుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరుగుతుంటే హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణం ఆమె పదవికి రాజీనామా చేయాలన్నారు. ఎమ్మెల్యేలుగా ఉన్న ఎంఎస్ రాజు, బండారు శ్రావణి దళితులకు జరిగిన అన్యాయంపై కనీసం మాట మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూటమి ప్రభుత్వ పెద్దల మోచేతి నీళ్లు తాగుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఎర్రిస్వామి, బీటీపీ గోవిందు, పసులూరు ఓబులేసు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పైపై పూత.. నిధుల మేత

కన్నెత్తి చూడరు.. నాణ్యత పరిశీలించరు

- అస్తవ్యస్తంగా హంద్రీ–నీవా లైనింగ్ పనులు
- పట్టించుకోని అధికారులు
- కొండల్లోని బండలు కొట్టి మొబైల్ క్రషర్ ద్వారా కంకర తయారీ
- అటువైపు చూడని మైనింగ్ శాఖ

స్టాక్ పాయింట్‌లో ఉంచిన ఇసుక

కాలువకు వేసిన లైనింగ్ కంకర తేలిన దృశ్యం, కాలువ పక్కన అక్రమంగా వెలసిన మొబైల్ క్రషర్

ఆత్మకూరు: హంద్రీ–నీవా కాలువ ద్వారా రాయలసీమలో 6 లక్షల ఎకరాలకు నీరు అందించి రైతుల కళ్లలో ఆనందం నింపాలని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చూస్తే.. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం మాత్రం హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ వేసి నేరుగా కుప్పానికి నీరు తీసుకెళ్లాలని శరవేగంగా పనులు చేయిస్తోంది. లైనింగ్ వద్దని ఓ వైపు రైతులు, మరో వైపు రాజకీయ పార్టీలు అభ్యంతరాలు చెబుతున్నా లెక్కచేయడం లేదు. పైగా పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాసిరకంగా పైపై పూత పూస్తున్నారు. కాలువకు వేసిన లైనింగ్ అప్పుడే కంకర తేలి కనిపిస్తోంది. లైనింగ్ పనులకు కంకర కొనుగోలు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. పంపనూరు వద్ద హంద్రీ–నీవా కాలువ పక్కన అటవీ ప్రాంతంలో కొండ వద్ద మొబైల్ క్రషర్ వేసి కొండల్లోని రాళ్లను కంకరగా మారుస్తున్నారు. రోజూ వందల టిప్పర్ల కంకరను పనుల కోసం తరలిస్తున్నారు. అలాగే, ఆత్మకూరు మండలానికి సమీపంలో ఉన్న కాలువపల్లి పెన్నా నది నుంచి రోజూ వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలించి పనులకు వాడుతున్నారు.

ఖజానాకు గండికొడుతున్నా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 183 కిలో మీటర్ల మేర పనులను 7 ప్యాకేజీలుగా చేపడుతున్నారు. 1 నుంచి 5వ ప్యాకేజీకి రూ.936.70 కోట్లు, 6,7 ప్యాకేజీలకు రూ.319 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. 1,2,3 ప్యాకేజీలు ఆర్‌వీఆర్ కంపెనీ, 4,5 ప్యాకేజీలు బీఎస్ఆర్ కంపెనీ, 6,7 ప్యాకేజీలు ఎస్ఆర్‌సీ కంపెనీలు చేపడుతున్నాయి. కాంట్రాక్టర్లందరూ అధికార పార్టీకి చెందిన వారే కావడంతో అధికారులు అటువైపు చూడడంలేదు. ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటివరకూ కనీసం క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా పరిశీలించలేదని తెలిసింది. ఈ క్రమంలో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు నీళ్లు పారించమని అడిగితే అధికార పార్టీ నేతలకు కాంట్రాక్టు ఇచ్చి నిధులు పారిస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. రూ. వందల కోట్ల పనులు జరుగుతున్నా హెచ్ఎల్‌సీ అధికారులు, మైనింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కనులపండువగా గూగూడు ఉత్సవాలు

నార్పల: మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయి స్వామి వార్షిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం 5 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా కలసిమెలసి కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు హుసేనప్ప ప్రత్యేకంగా అలంక రించి చక్కెర చదివింపులు చేశారు. భక్తుల రద్దీ పెరగడంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడవ సరిగెత్తు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

గూగూడులో కొలువుదీరిన పీర్లు

కదిలిన జగన్నాథ రథ చక్రాలు

- హైకోర్టు ఆదేశంతో లైన్ క్లియర్
- 5న అనంతలో రథయాత్ర
- తరలి రానున్న జాతీయ ఇస్కాన్ ప్రతినిధులు, సినీ ప్రముఖులు

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) ఆధ్వర్యంలో అనంత వేదికగా మరోసారి పూరీ జగన్నాథ రథయాత్ర వేడుకగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున జరుగుతున్న కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కళాకారులు, ఇస్కాన్ మందిరాల ప్రతినిధులు అనంతకు చేరుకుంటున్నారు. ఒకప్పుడు ఉత్తరాదికి మాత్రమే పరిమితమైన పూరీ రథయాత్రను 2015లో ఇస్కాన్ మందిరం అనంతలో ఘనంగా నిర్వహించింది. దేశంలోనే అతి పెద్దదైన పూరీ జగన్నాథుడి వేడుకలను దూరాభారం వల్ల చూడలేని వారికి.. వారి ముంగిటనే రథయాత్రను చూసే భాగ్యాన్ని ఇస్కాన్ తీసుకువచ్చింది. ఆ ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటి వరకూ ఆరు సార్లు వైభవంగా రథయాత్ర వేడుకలు జరిగాయి. ఈ నెల 5న సాగే వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

రథయాత్ర సాగుతుందిలా..

తొలుత రెండు రోజుల పాటు రథయాత్ర ఘనంగా నిర్వహించాలని ఇస్కాన్ ప్రతినిధులు కోరగా పోలీసులు అనుమతి నిరాకరించారు. కాగా ఒక్క రోజు మాత్రమే జిల్లా పోలీసు యంత్రాంగం అనుమతివ్వడంతో హైకోర్టును ఆశ్రయించి రథయాత్ర సజావుగా సాగేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో కళాకారుల, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేద పఠనం నడుమ జగన్నాథ రథయాత్ర శనివారం ఉదయం లలిత కళాపరిషత్తులో ప్రారంభం కానుంది. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు సాగుతాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక కేఎస్ఆర్ కాలేజ్ సమీపంలో మహా అభిషేకంతో రథయాత్ర ప్రారంభమవుతుంది. నగర పాలక సంస్థ కార్యాలయం, సుభాష్‌రోడ్, టవర్ క్లాక్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, పాతూరు మీదుగా బసవన్నకట్ట నుంచి మళ్లీ సప్తగిరి సర్కిల్ మీదుగా లలిత కళా పరిషత్తుకు చేరుకుంటుంది. విశిష్ట అతిథిగా శ్రీమాన్ సత్యగోవింద్ ప్రభు విచ్చేసి ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నారు. సినీ నటుడు సుమన్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి రథ యాత్రను ప్రారంభిస్తారు. అలాగే కళాకారులు పలువురు ప్రజాప్రతినిధులు ఆరంభిస్తారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచే కాకుండా కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కళాకారులు అనంతకు విచ్చేసి తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. నగర వీధుల్లో శోభాయమానంగా సాగే రథయాత్రలో అనంత వాసులు భాగస్వాములు కావాలని గురువారం ఇస్కాన్ మందిరంలో జరిగిన సమావేశంలో నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

అనంత నగరంలో సాగిపోతున్న జగన్నాథ రథయాత్ర (ఫైల్)

క్లుప్తంగా

'పశు' పథకాలు సక్రమంగా అమలు చేయండి

- వీసీలో పశు శాఖ జేడీ సుధాకర్ ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధకశాఖ పథకాలు సక్రమంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆ శాఖ జేడీ డాక్టర్ టీవీ సుధాకర్ ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ పథకాలపై ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు, పశు వైద్యులు (వీఏఎస్), ఇతర అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నట్టల నివారణ (డీవార్మింగ్), భైరటీయాసిస్ వ్యాధులకు సంబంధించి వ్యాక్సినేషన్ కార్యక్రమం టార్గెట్ మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పశుగ్రాస వారోత్సవాలు పటిష్టంగా నిర్వహించాలన్నారు. పశుగ్రాసం పెంపకం, వాటి వల్ల లాభాలపై పాడి రైతులు, జీవాల కాపర్లను చైతన్య పరచాలని ఆదేశించారు.

మార్కెట్ కమిటీలో ఐదుగురిపై చార్జ్‌మెమో

అనంతపురం అగ్రికల్చర్: అవినీతి నిరోధకశాఖ దాడులకు సంబంధించి అభియోగాలు ఎదుర్కొన్న ఐదుగురు అధికారులకు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ జారీ చేశారు. 2022 జనవరి 8న ఏసీబీ అధికారులు స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో జరిగిన జీవాల సంతకు సంబంధించి మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్న కౌంటర్‌లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లుల్లో చూపించిన మొత్తం కన్నా అధికంగా రూ.36,577 ఉన్నట్లు గుర్తించారు. దీనిపై అప్పటి మార్కెట్‌కమిటీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి (ప్రస్తుతం రిటైర్), సూపర్‌వైజర్లు నాగేంద్ర, కేశవకుమార్, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ ఈ.సుశీల, గ్రేడర్ వేణుగోపాల్ (ప్రస్తుతం రిటైర్) మీద కేసులు నమోదు చేశారు. డిపార్ట్‌మెంటల్ విచారణలో భాగంగా ఐదుగురికీ చార్జ్‌మెమో జారీ చేశారు.

'ఇన్‌స్పైర్'కు ప్రాజెక్టులు నమోదు చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డుల కోసం ప్రాజెక్టుల నమోదు చేయాలని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతికి కనీసం ఒక ప్రాజెక్ట్ చొప్పున మొత్తం 5 ప్రాజెక్టుల వివరాలను ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. శాస్త్రీయ విజ్ఞానంపై పాఠశాల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు, వారిలో శాస్త్రీయ దృక్పథం, పరిశోధన పట్ల ఆసక్తి, సమస్యలను శాస్త్రీయంగా పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించడానికి 'ఇన్‌స్పైర్ మనక్' చక్కటి వేదిక అన్నారు. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు రూ. 10 వేలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ నామినేషన్లు చేసిన జిల్లాగా మనం ముందుండేందుకు డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్కేయూ వీసీ నియామకంపై సెర్చ్ కమిటీ ఏర్పాటు

రామ్‌కుమార్ కాకాని, ఎన్.శివప్రసాద్, అలోక్‌కుమార్ రాయ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన వీసీ నియామకంపై సెర్చ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది. ముగ్గురు సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా డాక్టర్ రామ్‌కుమార్ కాకాని (డైరెక్టర్, ఐఐఎం రాయ్‌పూర్), పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ (వీసీ, గీతం వర్సిటీ), యూజీసీ నామినీగా ప్రొఫెసర్ అలోక్‌కుమార్ రాయ్ (వీసీ, యూనివర్సిటీ ఆఫ్ లక్నో బాబుగంజ్, లక్నో) వ్యవహరించనున్నారు. ఈ కమిటీలోని సభ్యులు సమావేశమై ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఈ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు గవర్నర్ తుది నియామకం చేయనున్నారు. కాగా, ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ బి.అనిత ప్రస్తుతం ఉన్నారు. ఇన్‌చార్జి పాలనలోనే ఏడాది పూర్తయింది. సాధారణ ఉద్యోగిని రిజిస్ట్రార్‌గా నియామకం చేశారు. కనీసం డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని నియామకం చేయాల్సి ఉండగా, నిబంధనలు బేఖాతరు చేస్తూ రీసెర్చ్‌కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్‌గా నియామకం చేశారు. ఏడాది కాలంలో వర్సిటీకి ఒక్క యూజీసీ ప్రాజెక్ట్ రాలేదు. కీలక నిర్ణయాలు అన్నీ జాప్యం కావడంతో వర్సిటీ పురోగతి మందగించింది. ఇలాంటి తరుణంలో పూర్తి స్థాయి వీసీ వస్తే వర్సిటీ పురోగతి గాడిన పడుతుందని ఉద్యోగులు, విద్యార్థులు భావిస్తున్నారు.

రిటైల్ సర్వీస్ అసోసియేట్‌పై నైపుణ్య శిక్షణ

అనంతపురం: ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు రిటైల్ సర్వీస్ అసోసియేట్ ఉద్యోగ నైపుణ్యంపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పల్లవి పేర్కొన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. 18 నుంచి 30 సంవత్సరాల వయసున్న వారు అర్హులు. ఆసక్తి గల వారు అనంతపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ వివరాలను జూలై 21లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9133443449 నెంబర్‌కు సంప్రదించవచ్చు.

వక్ఫ్ నూతన చట్టం రాజ్యాంగ విరుద్ధం

- సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- యునైటెడ్ జేఏసీ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యునైటెడ్ జేఏసీ సభ్యులు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ నూతన చట్టం పూర్తి రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తోందని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ధ్వజమెత్తారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ జాఫర్, సభ్యులు మేయర్ వసీం, నదీమ్ అహమ్మద్, తదితరులు మాట్లాడారు. ఇటీవల ఆమోదించిన వక్ఫ్ చట్టం.. 1995లోని సంకేతాలు, వివక్షతో కూడినవిగా ఉన్నాయని, ఇవి భారత రాజ్యాంగంలో పొందు పరిచిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. ముస్లిం మైనారిటీల అణచివేతనే లక్ష్యంగా చేసుకుని వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పరిపాలనలో ముస్లిమేతరులపై వివక్ష చూపడం ద్వారా ఆర్టికల్15 (వివక్ష నిషేధం)ను ఉల్లంఘించారన్నారు. భూ యజమానుల అనుమతి లేకుండా వక్ఫ్ బోర్డు భూములను స్వాధీనం చేసుకునేందుకు, ఆక్రమించుకునేందుకు అనుమతించడం ద్వారా ఆర్టికల్ 21 (జీవించే హక్కు, స్వేచ్ఛ)కు విరుద్ధంగా ఉందన్నారు. గతంలో బీజేపీ మద్దతు ఇచ్చిన వక్ఫ్ చట్టం 1995, వక్ఫ్ సవరణ చట్టం 2013ల ప్రకారం వక్ఫ్ బోర్డు విధివిధానాలను రూపొందించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందన్నారు. అయితే ప్రస్తుత సవరణ బిల్లు రాష్ట్రాల అధికారాలను తుంగలో తొక్కుతూ అన్ని అధికారాలను కేంద్రమే సొంతం చేసుకుందన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కాగజ్‌ఘర్ రిజ్వాన్, సైపుల్లాబేగ్, షంషుద్దీన్, అల్లీపీరా, కొర్రపాడు హుసేన్‌పీరా, షేక్ జావీద్, బంగారు బాషా, ఆవాజ్ వలి, యాసిర్ అహమ్మద్, హాజీపీరా, ముఫ్తి మహబూబ్‌రజా పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED TEACHERS
పామిడి పట్టణం నందు నర్సరీ నుండి 10వ తరగతి వరకు
తెలుగు, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్ట్స్ ఇంగ్లీష్ మీడియంలో
బోధించుటకు టీచర్స్ మరియు P.E.T. కావలెను.
Interviews on July 4th, 5th, 6th
SRI CHAITANYA SCHOOL, PAMIDI
Cell No: 8790612613, 9573736655

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM అడ్మిషన్స్
■ ఇంటర్మీడియట్ లో Any Group పాస్ స్టూడెంట్స్ కి G.N.M (Nursing), DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్) నందు గవర్నమెంట్ సీట్స్‌కి అడ్మిషన్స్ కలవు. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G. మురళి, 9030661651, అనంతపురం. [A-1665]

REAL ESTATE

TO-LET
■ అనంతపురం లోని రఘువీరా టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నెం : 38 గల షాపు (338 Sq feets) బాడుగకు కలదు. సంప్ర : 93981 98472, 8142938310. [SCA25005888]

SERVICES

శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం
■ మైసూర్‌కు చెందిన జ్యోతిష్యులైన జనార్ధన జోషి గారు మీ రెండు హస్త రేఖలు. జాతకం ఆధారంగా సంపూర్ణ భవిష్యత్తు చెప్పెదరు. ఎటువంటి సమస్యలున్నా శాస్త్రీయంగా శాశ్వతంగా, శీఘ్రముగా పరిష్కారం చూపెదరు. వాట్సాప్/ఫోన్: 9908626148. [SCA 25005361]

జ్యోతిష్యాలయం
■ కేరళ మాంత్రిక సాయి స్వరూప జోతిష్యం ప: వి. అయ్యప్పన్ (స్త్రీ.పు) వశీకరణం, సంతాన, ఉద్యోగ, ప్రేమ వివాహం, సతి-పతి కలహం, ప్రేమలో మోసపోవడం ఏలాంటి గుప్త కష్టకర నిఘాడ సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573677754. [SCA25005835]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

WANTED
■ బాయ్స్ హాస్టల్ వార్డన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి సెల్ : 9966333236, 9966334236. [A-7126]

■ Tutors (Gents), Bus Incharges, PET'S Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304. [A-4111]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-624]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 Hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF + ESI కలదు. శాలరీ 1st కి ఇవ్వబడును. ఫోన్ : 7013730900 / 9246543129 [SCA25005819]

■ Xstream Fiber అనంతపురం & గుంతకల్లు పట్టణంలో సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 16500+ఇన్సెంటివ్స్ Q: ఇంటర్ / డిగ్రీ. 2వీలర్ & లైసెన్స్. Ph: 9000029003. [HA-15081]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838. [B-1275575]

■ ATPలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ANM, GNM, B.Sc వారికి రూం ఫ్రీ, నర్సులు, ఆయాలు, సెక్యూరిటీ గార్డ్స్, రిసెప్షనిస్ట్ కావలెను. Q: 10th to డిగ్రీ, జీతం:10 to 22 వేలు. సంప్రదించండి సెల్: 9121296283. [SCA25005887]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురంలోని శ్రీనగర్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని జిల్లా ప్రజలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకెళ్లేందుకు రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రక్రియను సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని శ్రీశ్రీనగర్‌లో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఫిర్యాదు నేరుగా ముఖ్యమంత్రికి చేరుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ భారం మరింత పెరుగుతుందన్నారు. ఇప్పటికే భారంగా మారిన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలన్నారు. విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వలి, ప్రకాష్, జీవ, కుమార్, రాఘవ, హరికృష్ణ, పాల్, మాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు రెట్టింపు సంక్షేమం

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా...ప్రజలకు రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం ఆయన అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం మోపిడి గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాలనలో రాష్ట్రాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఛిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టి రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశాంతత, అభివృద్ధి కోరుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చామన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు ప్రారంభించామన్నారు.

కలుషిత నీరు తాగి 16 జీవాల మృతి

మృతి చెందిన గొర్రెలు, మేకలు

బెళుగుప్ప: కలుషిత నీరు తాగి 16 జీవాలు మృతి చెందిన ఘటన బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గురువారం ఉదయం తన మొక్కజొన్న పంటకు యూరియా కలిపిన నీటిని డ్రిప్ ద్వారా అందిస్తూ ఇతర పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో గొర్రెల మంద అక్కడకు చేరుకుంది. దాహంతో ఉన్న గొర్రెలు, మేకలు అప్పటికే తొట్టెలో ఉన్న యూరియా కలిపిన నీటిని తాగాయి. కాసేపటి తర్వాత ఒకదాని వెనుక మరొకటి చొప్పున 10 గొర్రెలు, 5 మేకలు, ఓ పొట్టేలు మృత్యువాత పడ్డాయి. కాపరులు తిప్పయ్య, మహేష్, వన్నూరుస్వామి, రామాంజనేయులు, అంజనప్ప, లింగన్న నుంచి సమాచారం అందుకున్న పశువైద్య సహాయకుడు ఎర్రిస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషమ పరిస్థితిలో ఉన్న జీవాలకు సత్వర చికిత్స అందించారు. గొర్రెల పోషణపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కాపరులు కోరారు.

డీఎస్పీ పదోన్నతుల సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం: డీఎస్పీ పదోన్నతులకు సంబంధించి తాత్కాలిక (అడహాక్) సీనియార్టీ జాబితాను అధికారులు విడుదల చేశారు. 2024–25 ప్యానల్‌లో సీనియార్టీ జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీఐలు ఉన్నారు. వీరిలో కె.దేవానంద్ (అనంతపురం), ఎం.ఆదినారాయణ (పీటీసీ అనంతపురం), కె.సాయినాథ్ (అనంతపురం), ఎస్వీ భాస్కర్‌గౌడ్ (అనంతపురం), పి.సత్యబాబు (అనంతపురం), శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని బి.మోహన్, కె.రాఘవన్, జి.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఉన్నారు.

ఓఎంసీలో చోరీలపై వీడిన మిస్టరీ

- సీజ్ చేసిన మైనింగ్ వాహనాలను కట్ చేసి తరలిస్తున్న ముఠా సభ్యుల అరెస్ట్

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం టౌన్: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో సీబీఐ అధికారులు సీజ్ చేసిన భారీ వాహనాల చోరీ కేసులో మిస్టరీ వీడింది. వాహనాలను ముక్కలుగా చేసి తరలిస్తున్న ముఠా సభ్యులను గురువారం డి.హీరేహాళ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సాయంత్రం రాయదుర్గం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ వెల్లడించారు. ఓఎంసీలో గురువారం ఉదయం అపరిచిత యువకుల సంచారాన్ని పసిగట్టిన స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి.. సిబ్బందితో కలసి అక్కడకు చేరుకున్నారు. ఐరన్ ఓర్‌ను వెలికి తీసేందుకు ఉపయోగించే భారీ యంత్రాలను ముక్కలుగా చేస్తున్న ఏడుగురు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఎల్‌పీజీ సిలిండర్, 2 ఆక్సిజన్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు, లగేజీ ఆటోను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. విచారణ అనంతరం పట్టుబడిన వారిలో బళ్లారి జిల్లా సండూరు తాలూకా కురేకుప్ప గ్రామానికి చెందిన వీరిలో మారుతి, వీరేష్, గాదెలింగప్ప, గణేష్ , హరిజన బసవరాజు, ఉమాపతి, దొడ్డబసప్ప ఉన్నారు. కాగా, వాహనాల విడి భాగాలను, తుక్కు కింద మార్చిన ఇనుమును కొనుగోలు చేసిన ఉచ్చప్ప, వీరేష్, ప్రకాష్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇప్పటికే మూడు వాహనాలు తుక్కుకు విక్రయం

కురేకుప్పకు చెందిన మారుతి ఓఎంసీలో సీబీఐ అధికారులు సీజ్ వాహనాలను తుక్కు కింద విక్రయించే పథకం రచించాడు. ఈ క్రమంలో గత నెల 27, 29 తేదీల్లో ఓఎంసీ గనుల్లో దూరి అక్కడ ఉన్న జేసీబీ, హిటాచీ, మొబైల్ క్రషర్‌లను గ్యాస్ కట్టర్లతో కోసి, లగేజీ ఆటోలలో తరలించి కర్ణాటకలోని ధర్మసాగరానికి చెందిన వీరేష్, ఉచ్చప్ప, ప్రకాష్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. తొలిసారి ఎవరూ గుర్తించక పోవడంతో మరోసారి ఓఎంసీలో వాహనాలను తుక్కుగా మార్చి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి ఓఎంసీ మైనింగ్‌లోకి అక్రమంగా ప్రవేశించి మొబైల్ క్రషర్‌ను కట్ చేసి గురువారం టాటా లగేజీ ఆటోలో తరలించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసు సిబ్బంది రామాంజనేయులు, మల్లికార్జున, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, నాగరాజు అక్కడు చేరుకుని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డీఎల్ లేని ఉద్యోగుల జీతాలు నిలిపి వేయండి

- పోలీసులకే డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే ఎలా?
- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ

తాడిపత్రి రూరల్: డ్రైవింగ్ లైసెన్స్‌లేని ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు తక్షణమే నిలిపి వేయాలని మున్సిపల్ అధికారులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. తాడిపత్రిలోని తన స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిపత్రి కేంద్రంగా పనిచేస్తున్న పోలీసులకే డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల స్కూటీ నడుపుతున్న మహిళా కానిస్టేబుల్‌ను ఆపి లైసెన్స్ గురించి అడిగితే.... లేదని సమాధానమిచ్చారని గుర్తు చేశారు. ఇలాంటి వారు ముందుగా డీఎల్ తీసుకోవాలని సూచించారు. తాడిపత్రిలోని వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 70 శాతం మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని, ఇలాంటి వారిని గుర్తించి వారి జీతాలు నిలిపివేయాలని ఆదేశించినట్లు గుర్తు చేశారు. ఆర్టీఏ, పోలీసు శాఖ సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఉచితంగానో లేదా నామమాత్రపు రుసుంతోనో ఎల్ఎల్ఆర్‌లు, డీఎల్‌లు జారీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంగా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని సచివాలయాల ద్వారా వాహనదారులకు ఎల్ఎల్ఆర్‌లు మంజూరు చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చేప @ 30 కిలోలు!

రాయదుర్గం టౌన్: స్థానిక చేపల మార్కెట్‌లో గురువారం 30 కిలోల బరువున్న కట్ల చేపను జాలర్లు విక్రయించారు. ఈ భారీ చేప బెళుగుప్ప మండలం జీడిపల్లి రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు చిక్కింది. అక్కడి నుంచి రాయదుర్గం పట్టణానికి చెందిన మత్స్యకారుడు, చేపల విక్రేత అజీమ్ తీసుకువచ్చి విక్రయానికి పెట్టాడు. ఈ భారీ చేపను చూసేందుకు గురువారం ఉదయం స్థానికులు ఎగబడ్డారు. గమనించిన బళ్లారికి చెందిన ఓ వ్యక్తి రూ.4 వేలు చెల్లించి ఈ చేపను కొనుగోలు చేశాడు.

ఇరువర్గాల ఘర్షణ.. ఒకరు మృతి

మృతి చెందిన శంకరయ్య

శింగనమల: ఇంటి రస్తా విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగగా... ఒకరు మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం శింగనమల మండల పరిధిలోని ఇరువెందల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... ఇరువెందల గ్రామంలో ఇంటి రస్తా విషయంలో ప్రభాకర్, మల్లికార్జున ఘర్షణ పడ్డారు. ఇరువురి బంధువులూ కలగజేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. ఈ క్రమంలో ఘర్షణ తీవ్రతరం కాగా ఇరువర్గాలు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఏడుగురు గాయపడగా... 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సగం ధరకే వాహనమంటూ కుచ్చుటోపీ

- తాడిపత్రి పోలీసుల అదుపులో మోసగాళ్లు?
- ఇప్పటి వరకూ 53 బైక్‌ల స్వాధీనం

పోలీసులు స్వాధీనం ద్విచక్ర వాహనాలు

తాడిపత్రి టౌన్: సగం ధరకే అంటూ ప్రజలను మోసం చేసి ద్విచక్ర వాహనాలను అంటగడుతున్న తాడిపత్రికి చెందిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో తాడిపత్రిలోనే వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, ఆటోలు విక్రయించినట్లు గుర్తించి, ఇప్పటి వరకూ 53 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వాహనాల కోసం పోలీసులు వల పన్నారు. కాగా, తాడిపత్రి పట్టణంలోని పెద్దబజార్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రధాన నిందితుడుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అతనితో పాటు మరో ఇద్దరిని దుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే పూర్తిగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకునేంత వరకూ వివరాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఒక్కసారిగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలు ప్రత్యక్షం కావడంతో పట్టణ వాసుల అవాక్కయ్యారు. కాగా, సగం ధరకే ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన వారిలో ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్ చుట్టూ ఉన్న వ్యాపార సముదాయాల యజమానులు, పోలీసులూ ఉన్నట్లు సమాచారం. తాడిపత్రికి చెందిన కొందరు ధనవంతులు సైతం కార్లు, లారీలు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

27న బెస్త కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక

అనంతపురం టవర్‌క్లాక్: గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 27న బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు కేవి రమణ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన బెస్త కులస్తులు వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 1వ మ్యారేజ్, రెండవ మ్యారేజ్ వధువు, వరుడుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. వివారాలకు 8989403476, 957393692, 9985785523 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రబాబు, పుల్లయ్య, గంగప్ప, నాగేంద్ర, హరినాథ్, వెంకటేష్, ఏబీ శ్రీనివాసులు, కే శ్రీనివాసులు, శంకర్, గంగాధర్, పాపన్న, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఖాలేషా, మౌలాలి పీర్ల పండుగ

ఐదో రోడ్డులో కొలువుదీరిన పీర్లు

అనంతపురం కల్చరల్: పెద్ద పీర్ల పండుగ (మొహర్రం) సందడిగా సాగుతోంది. ఐదో రోడ్డులో కొలువుదీరిన కసమూరు ఖాలేషా మస్తాన్‌వలి, హజరత్ మౌలాలి పీర్లను మకానం వద్ద బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామివారి చిన్న సరిగెత్తు, సోమవారం పానకాల జాతర, అగ్నిగుండం ఏర్పాటు, మంగళవారం అగ్నిగుండ ప్రవేశంతో పాటూ అదేరోజు సాయంత్రం జలధి, ఈనెల 10న చివరి దర్శనం, అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి

రాప్తాడు: మొహర్రం నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని రాప్తాడు సీఐ శ్రీహర్ష సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పీర్ల పండుగ చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గొడవలు జరిగినట్లయితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. మసీదులు, పీర్ల చావిడి వద్ద డీజేలు సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. తప్పతాగి డ్యాన్స్‌లు, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

వెండి గొడుగుల అలంకరణ

ఆత్మకూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో గురువారం పీర్ల స్వాములకు వెండి గొడుగులను అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా పీర్లకు ప్రత్యేకంగా చక్కెర చదివింపులు చేయించారు. స్థానిక సర్దార్‌వలి దర్గాలో భక్తులు పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు చేయించారు. శుక్రవారం చిన్న సరిగెత్తు, శనివారం విడిదినం, ఆదివారం పెద్ద సరిగెత్తు, సోమవారం జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పుస్తకాల నిల్వ ఉన్న గదుల సీజ్

పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఏబీవీపీ నాయకులు గురువారం అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. డీఈఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణను అక్కడికి పంపారు. పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనంతపురం నగరం, రూరల్ మండల ప్రాంతాల్లో చాలా ప్రైవేట్ పాఠశాలలు యథేచ్ఛగా పుస్తకాలు విక్రయిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విజయ్, భరత్ రెడ్డి, ధోని తదితరులు పాల్గొన్నారు.

అధికారుల చర్యతో ఆదాయానికి గండి

- అక్రమ లేఔట్లపై చర్యల కోసం ఇళ్ల నిర్మాణాల అనుమతులకు బ్రేక్
- నాలుగు నెలలుగా ఇదేతంతు
- నిర్మాణదారులు పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చినా పనిచేయని ఆన్‌లైన్
- చేతులెత్తేసిన పంచాయతీ అధికారులు
- పంచాయతీల ఆదాయానికి భారీగండి
- అనంతపురం రూరల్ మండలంలో ఇప్పటికే రూ.కోటికిపైగా నష్టం

రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లు

రాప్తాడురూరల్: అనుమతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా అక్రమంగా లేఔట్లు వేస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఎగరకొడుతున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ పైసా చెల్లించకుండా ప్రభుత్వానికి భారీ గండి పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా...అనంతపురం రూరల్ మండలంలో విలువైన భూములు కావడంతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఎగరకొడుతున్నారు. అక్రమంగా లేఔట్లు వేయడం ఆ తర్వాత పంచాయతీల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకునే క్రమంలో జిల్లా అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు నిలిపేశారు. నాలుగు నెలలుగా ఇదేతంతు కొనసాగుతోంది. 'కొండ నాలుకకు మందువేస్తే ఉన్న నాలుక పోయిన' చందంగా తయారయ్యాయి అధికారుల చర్యలు. పంచాయతీ కార్యాలయాల చుట్టూ ఎన్నిమార్లు తిరిగినా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో చాలామంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని పంచాయతీల్లో దాదాపు పూర్తయ్యాయి. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే భూమి విలువపై 14 శాతంతో పాటు బెటర్‌మెంట్ చార్జెస్, బిల్డింగ్ ఫీజు, లేబర్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన అనంతపురం రూరల్ మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒక ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కనీసం రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఎ.నారాయణపురం, రాచానపల్లి, రుద్రంపేట, కక్కలపల్లికాలనీ, ఆకుతోటపల్లి, కురుగుంట, అక్కంపల్లి, సోములదొడ్డి, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్, ఉప్పరపల్లి, కక్కలపల్లి పంచాయతీలు దాదాపు నగరానికి అనుకునే ఉంటాయి. శివారు పంచాయతీలు కావడంతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వందలాది ఇళ్లు పంచాయతీ అనుమతులు లేకుండానే నిర్మించుకుంటున్నారు. ఈ నాలుగు నెలల్లోనే ఆయా పంచాయతీలు సుమారు రూ.కోటికి పైగా నష్టపోయాయి. అధికారులు ఎటూ తేల్చకపోవడంతో పంచాయతీల ఆదాయానికి భారీ గండి పడుతోంది.

పూర్తయితే వసూళ్లు ఎలా?

సాధారణంగా అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. ఎవరైనా అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్నా పనులు ఆపేయిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం చెల్లిస్తేనే నిర్మాణాలకు అనుమతులిస్తారు. నిర్మాణ సమయంలోనైతే పంచాయతీల పరిధిలో ఉంటుంది. నిర్మాణాలన్నీ పూర్తయిన తర్వాత పన్నులు వసూళ్లు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని కార్యదర్శులు వాపోతున్నారు.

పంచాయతీల్లో పైసా లేదు : పంచాయతీ కార్యదర్శులు

ఈ విషయంపై కొందరు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అతి పెద్ద వనరు అయిన ఇళ్ల నిర్మాణాల అనుమతులు నిలబెట్టడంతో ఆదాయం లేక పంచాయతీ ఖాతాల్లో పైసాకూడా లేదు. కార్మికుల జీతాలకు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. నీటి కొళాయి పైపులు, లైట్లు రిపేరీకి అల్లాడిపోతున్నాం. ఇళ్ల నిర్మాణాల అనుమతుల విషయంలో మా చేతులు పూర్తిగా కట్టేశారు. ఉన్నతాధికారుల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. లేదంటే పంచాయతీల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎస్వీ కళాశాలలో 'సహకార వ్యవస్థ'పై అవగాహన

మాట్లాడుతున్న సహకార శిక్షణ కేంద్రం సీనియర్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'సహకార వ్యవస్థ'పై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సదస్సును రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం వారు ఏర్పాటు చేశారు. రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎంబీ మురళీమోహన్ సహకార రంగం అవసరం, వాటి ప్రాధాన్యతను తెలియజేశారు. వ్యవసాయ అభివృద్ధికి తక్కువ ధరలకే విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ చేయాలని సూచించారు. సహకార రంగంపై యువతలో చైతన్యం కల్పించేందుకు కళాశాలలో కోర్సులు నిర్వహించాలని కోరారు. అంతర్జాతీయ సహకార సమితి ఆదేశానుసారం 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార దినోత్సవంగా గుర్తించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌ఏవీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నీటి పారుదల, సాంఘిక సంక్షేమ, పశు సంవర్ధక, అటవీ, ఉద్యానవన, ఆర్టీసీ, కేజీబీవీ నుంచి అధికారులు హాజరు కాలేదు. మండలమీట్‌కు అధికారులు హాజరుకాకపోతే సమస్యలపై ఎవరితో చర్చించాలని సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల్లో ట్రాన్స్‌కో లైన్‌మెన్లు తక్కువగా ఉన్నారని, ఎక్కడైనా ట్రాన్స్‌కో సమస్యలు ఎదురైతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు సర్పంచులు ఫిర్యాదు చేశారు. గోకులం షెడ్లకు వెంటనే బిల్లులు పడేలా చూడాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు మన్నల వరలక్ష్మి, బోయ రామాంజనేయులు, తహసీల్దార్ విజయకుమారి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

మాట్లాడుతున్న గంగుల సుధీర్‌రెడ్డి

రాప్తాడురూరల్: సీఎం చంద్రబాబు మోసాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం నగర శివారులోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే రాప్తాడు నియోజకవర్గంలో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్లు గోవింద రెడ్డి, లింగారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బద్దలాపురం పెద్దిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, వలంటీర్ల విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు ముష్టికోవెల హరినాథరెడ్డి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్య సీటుకూ ఫీజు వసూలు

డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉచిత విద్య సీటుకూ రూ.5 వేల చొప్పున ప్రైవేటు పాఠశాలలు ఫీజు వసూలు చేస్తున్నాయని డబ్బు వసూలు అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) నాయకులు గురువారం డీఈఓ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ మాట్లాడుతూ ఉచిత సీట్లు పొందిన విద్యార్థులకు సంబంధించి పుస్తకాలు, యూనిఫాం పేరిట వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. అలాగే ఒక్కో విద్యార్థి నుంచి రూ. 5 వేలు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ఉచిత విద్యకు తూట్లు పొడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాయకులు విజయ్, అశోక్, హర్షవర్ధన్, కొండారెడ్డి, అరుణ్ కుమార్, కుళా ఉన్నారు.

ప్రతి ఒక్కరూ తల్లి పేరు మీద మొక్క నాటాలి

మొక్క నాటుతున్న చిన్నారి

అనంతపురం కల్చరల్: మై భారత్, ఎస్సార్ ఎడుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం యువతకు క్విజ్, పెయింటింగ్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. జిల్లా ఉపాధి కల్పన అధికారి పల్లవి, డ్వామా విజిలెన్సు ఆఫీసర్ శ్రీనివాసులు, మై భారత్ స్టేట్ కో ఆర్డినేటర్ బిసాతి భరత్ తదితరులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, గురువుల మీద భక్తి గౌరవాన్ని చాటుకోవడానికి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా క్విజ్, పెయింటింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన యువతీ యువకులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఇప్పటి వరకు వందలాది మొక్కలు నాటి కేంద్ర మంత్రుల ప్రశంసలందుకున్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని చిన్నారి నవనీతో కలిసి మొక్కలు నాటించి ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, సాయినాథ్, రూబీ, కార్తిక్, సక్షమ్ సంస్థ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు ఎత్తివేయాలి : ఏఐవైఎఫ్

ఎక్సైజ్ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్, మహిళ సమాఖ్య నాయకులు

అనంతపురం: జిల్లాలో బెల్ట్‌షాపులు, మద్యం అక్రమ విక్రయాలను అరికట్టాలని ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్) నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు సంతోష్‌కుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మావతి మాట్లాడారు. గ్రామాల నుంచి నగరం వరకూ బహిరంగంగా బెల్ట్ షాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు బెల్ట్ వ్యాపారానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహకారం అందిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమైన రెస్టారెంట్లలో 24 గంటలూ మద్యం విక్రయాలు విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. మద్యం మత్తులో గృహ హింసలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్న బెల్టు షాపులను తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న లిక్కర్ షాపుల లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ సీఐ జైనాథ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, నగర కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు జానకి, యశోదమ్మ, సురేంద్ర, కన్నా , నగేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వివరాలను అడిగి తెలుసుకుని, పెండింగ్ లో ఉన్న పన్ను బకాయి వెంటనే వసూలు చేయాలన్నారు. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ పాఠకులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.ఎర్రిస్వామి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్.. టెర్రర్

రామ్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయని దృశ్యం

బస్టాండ్ సమీపంలో రాజహంస ఆపార్ట్ మెంట్ వద్ద దుస్థితి

నగరంలో స్పీడ్ బ్రేకర్లు హడలెత్తిస్తున్నాయి. రద్దీగా ఉన్న రహదారుల్లో వాహనాల వేగం నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్లు వేస్తుంటారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని తెలిపేలా పెయింటింగ్ వేయాల్సి ఉన్నా ఆ విషయాన్ని అధికారులు మరిచిపోయారు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. స్పీడ్‌గా వచ్చి హఠాత్తుగా బ్రేకులు వేసి పడిపోతున్నారు. కుదుపులకు కొందరు వెన్నునొప్పులతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ యంత్రాంగం స్పందించి స్పీడ్ బ్రేకర్ల వద్ద తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

జడ్జి బంగ్లా సమీపంలోని ఎస్ఎస్ఎస్ కళాశాల వద్ద ఇలా..

విద్యుత్ నగర్ సర్కిల్‌లో..

అరవిందనగర్ రోడ్డులో దుస్థితి

విపత్తును ఎదుర్కొనేలా అవగాహన

మాక్ డ్రిల్‌లో పాల్గొన్న జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి

అనంతపురం: అగ్ని విపత్తును ఎదుర్కొనేలా జిల్లా అగ్నిమాపక అధికారులు, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వడియంపేటలోని సప్తగిరి క్యాంఫర్ ఫ్యాక్టరీలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఫ్యాక్టరీలో కెమిక్ స్టోరేజ్ యార్డ్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అక్కడ ఉన్న సిబ్బంది ఎలా స్పందించాలి? ఎవరెవరు ఏ కార్యక్రమాలు నిర్వహించాలి. క్షతగాత్రులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి వైద్య సేవలు అందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ హనీఫ్, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కేపీ లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం అర్బన్: భవన కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ మండిపడ్డారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిగంటలను పెంచిందన్నారు. భవన కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. క్లయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న తలపెట్టిన జాతీయ కార్మిక సమ్మెలో భవన కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు శీనా, లక్ష్మన్న, సంజీవులు, శివయ్య, అక్బర్, సుబ్బయ్య, ఎర్రిస్వామి, శివయ్య, తదితరులు పాల్గన్నారు.

పట్టాలెక్కిన 'రైల్వేవన్' యాప్!

ప్రయాణికులకు అన్ని రకాల సేవలందించేందుకు రైల్వేవన్‌యాప్‌ను రైల్వేశాఖ పట్టాలెక్కించింది. ఈ నెల 1 నుంచి ఈ యాప్ అమలులోకి వచ్చింది. -8లో

ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీవోను అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్లు డిమాండ్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.430
రెండోరకం	రూ.220	రూ.350

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1088 మెట్రిక్ టన్నులు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు: పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీషు పోస్టు కసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీషు పోస్టు (గెస్ట్ ఫ్యాకల్టీ) అర్హులైన వారి నుంచి ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీషు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈనెల 8వ తేదీ డెమో క్లాసులు కళాశాలలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. డెమో క్లాసుల అనంతరం ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నీరు భూమిలోకి ఇంకిపోవాలి

రెడ్డివారిపల్లెలో పర్యటిస్తున్న పీడీ వెంకటరత్నం

సంబేపల్లె: వర్షపు నీరు, మురికి నీరు భూమిలోకి ఇంకిపోయే విధంగా డ్రేనేజీలు ఉండాలని ఉపాధి పీడీ వెంకటరత్నం తెలిపారు. గురువారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లెలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మ్యాజిక్ డ్రైన్ గుర్తించారు. ఇళ్లలో నుంచి వస్తున్న నీరు మ్యాజిక్ డ్రైన్‌కు అనుసంధానం చేసి భూమిలోకి ఇంకిపోయే విధంగా నిర్మాణం చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇలాంటి మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలు ఎక్కడ అవసరమో చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మధబాబు, ఏపీఓ రెడ్డిజవహర్, జేఈ వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో రైతులకు డ్రోన్లు

మదనపల్లె రూరల్: వ్యవసాయాన్ని లాభసాటి చేయాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం 80 శాతం రాయితీతో రైతులకు డ్రోన్లను అందిస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా బాధ్యతల స్వీకరణ అనంతరం గురువారం తొలిసారిగా మదనపల్లె పర్యటనకు వచ్చిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. డ్రోన్ల సహాయంతో రైతులు ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. డ్రోన్ ఒకో యూనిట్ ధర రూ.9.80. ఇందులో రైతుల వాటారూ.1.96లక్షలు పోనూ, మిగిలిన రూ.8లక్షలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జిల్లాలో తొలిసారిగా పీటీఎం మండలంలో వెంకటేశ్వర గ్రూప్‌కు డ్రోన్ మంజూరుచేశామన్నారు. జిల్లాలో 97 శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు. అనంతరం ఏడీఏ ఆర్.రమేష్‌తో కలిసి మండలంలోని అంకిశెట్టిపల్లెలో రైతు లక్ష్మీ ఫీల్డ్ విజిట్‌లో పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించి భవిష్యత్తులో ఆర్థికంగా, సుస్థిరంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం డి.వెంకట్‌మోహన్, ఏఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి టెన్షన్!

- ఏడాదిలో ఏమి చేయకుండా ఎలా వెళ్లాలన్న ఆలోచనలో నేతలు
- ఎమ్మెల్యేలు కాకుండా ఇతర నాయకులు గ్రామాలకు వెళ్లేలా ప్రణాళిక
- సుపరిపాలనలో తొలి అడుగుకు తప్పని కష్టాలు

సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమానికి కష్టాలు తప్పలేదు. ఎంతో ఆర్భాటంగా ప్రభుత్వం ఏదో చేసినట్లు చెప్పుకోవాలన్న సంకల్పంతో ఏమి చేయకపోయినా ముందుకు వెళ్లే తీరుపై ఇప్పటికే విమర్శలు తలెత్తుతున్నాయి. అయితే టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సర్వేల పేరుతో భయపెడుతుండడం, మరోవైపు కచ్చితంగా చేసి తీరాలని అధిష్టానం నుంచి ఆదేశాల నేపథ్యంలో జిల్లాలోని పెద్ద నాయకులు సైతం అంతర్మథనంలో పడిపోయారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే పూర్తి స్థాయిలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లేందుకు సైతం నాయకులు వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రతి ఒక్క నియోజకవర్గ మంత్రి, ఎమ్మెల్యేలు అందరూ నియోజకవర్గంలోని ఇంటింటికి వెళ్లాలని గట్టిగా చెప్పడంతో...వెళ్లలేక, పెదబాబుకు చెప్పుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్‌కు దిక్కు లేకుండా పోయింది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎక్కడ చూసినా బహిరంగసభలతోపాటు అన్నిచోట్ల సమావేశాల్లోనూ ఊదరగొట్టిన చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్‌లు ప్రస్తుతం నోరు విప్పడం లేదు. అమలు చేస్తామంటూనే ఆర్థిక సమస్యలు ఉన్నాయని, ప్రజలకు వివరించాలని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా అనుకున్న సమయానికి గడువులోగానే చెప్పిన సమయంలో పథకాలకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేశారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం ఆర్థిక కష్టాల పేరుతో నెలల తరబడి వెనక్కి వెళుతుండడంపై విమర్శలు చెలరేగుతున్నాయి. పైగా ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పెన్షన్ పెంపును అమలు చేస్తున్నట్లు చెబుతున్నా..నిబంధనల పేరుతో అనేక మంది అర్హులకు ఎగనామం పెడుతున్నారు. ఏదో ఒక సాకు చెబుతూ లబ్ధి చేకూరకుండా చేస్తున్న వైనంపై ప్రజలు తిరుగుబాటు చేపట్టారు. ఇంకా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, ప్రతి మహిళకు రూ. 1500 ఆర్థికసాయం, నిరుద్యోగులకు భృతి అంటూ చెప్పినా నేటికీ అమలుచేసిన పాపాన పోలేదు. సర్కార్ ఏర్పడి ఏడాదవుతున్నా ఇప్పటికీ అనేక హామీలను అమలు చేయలేదు. అంతలోనే ప్రజల్లోకి వెళ్లాలంటూ చంద్రబాబు చెప్పడంతో కిందిస్థాయి నేతలు ఇంటింటికి వెళ్లలేక గ్రామస్థాయిలో వెనుకడుగు వేస్తున్నారు.

నేతల స్థానంలో కిందిస్థాయి క్యాడర్ వెళ్లేలా ప్రణాళిక

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రితోపాటు ఇతర ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో ఇళ్ల వద్దకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. పల్లెల్లోకి వెళితే ప్రమాదమనుకున్నారో లేక సమయం కుదరదని కిందిస్థాయి నాయకులతో చేయించుకోవాలనుకున్నారో తెలియదుగానీ ప్రతి ఇంటికి వెళ్లే బాధ్యతను ద్వితీయ శ్రేణి నాయకులకు అప్పగించారు. దీనికోసం ఒక ప్రణాళిక రూపొందించి అందుకు అనుగుణంగా తేదీల వారీగా నాయకులు ఇంటింటికి వెళ్లి వివరించేలా పథక రచన చేశారు. ఈ నేపథ్యంలో ద్వితీయ శ్రేణి నాయకులు కూడా గ్రామాల్లోకి వెళ్లినా ఇంటింటికి వెళ్లకుండా...కూటమి సర్కార్‌లోని సానుభూతి పరులు, అభిమానులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాసేపు గడిపి షరా మామూలే అన్నట్లు కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఇంటికి వెళితే ఎవరో ఒకరు హామీలపై నిలదీస్తారన్న ఆందోళన కిందిస్థాయి నాయకుల్లో వ్యక్తమవుతోంది.

అంతంత మాత్రమే..

జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వంలో భాగంగా రైల్వేకోడూరులో అడా చైర్మన్ రూపానందరెడ్డితో పాటు ఆయన సతీమణి వరలక్ష్మి, ఇతర నేతలు హంగామా సష్టించారు. ఇంకా మిగతా జిల్లాలో ఎక్కడా కూడా పెద్ద నేతల అడుగులు పెట్టలేదు. ఎమ్మెల్యేలతోపాటు ఇతర నేతలు కూడా అన్ని నియోజకవర్గాల్లో కొంతమేర కార్యక్రమంపై పెదవి విరుస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బాబూ.. ఇదేం సుపరిపాలన

- ఎన్నికల హామీలు తుంగలో
- అప్పులు తేవడం తప్ప సంక్షేమం లేదు
- బనకచర్లపై బాబు, రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని అమలు చేయకుండా, తగుదునమ్మా అంటూ 'సుపరిపాలనకు తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కడప జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన గురువారం కడపలో జరిగిన ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసు భద్రత లేకుండా వెళితే సుపరిపాలన గురించి ప్రజలే చెబుతారన్నారు. చంద్రబాబు మోసాలను గ్రామ గ్రామాన ఎండగడతామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచిపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చాక కిలో రూ. 2 బియ్యాన్ని రూ. 5.25కు, పెంచారని, మద్యనిషేధం ఎత్తేశారని, విద్యుత్ చార్జీలు ఐదుసార్లు పెంచారని వివరించారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు సైతం నెరవేర్చలేదన్నారు. గత ఎన్నికల్లో బాబు మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టగా హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసగించారని ఆరోపించారు. సంపద సృష్టిస్తానని చెప్పి విపరీతంగా అప్పులు చేస్తున్నారని, అయినా సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. సాంకేతిక కారణాల పేరిట తల్లికి వందనం పథకంలో భారీగా కోతలు విధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 50 ఏళ్లకు పైబడిన ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలు 69 లక్షల మంది ఉండగా, ఎంత మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చారంటూ నిలదీశారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా త్రికరణ శుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకున్నా కరోనా సమయంలో సైతం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామిలన్నీ నెరవేర్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబు పీ4 అంటున్నారని విమర్శించారు.

బాబు, రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

పోలవరం–బనకచర్ల విషయంలో గురు శిష్యులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఈ సందర్భంగా అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా అన్నారు. ప్రజల్లో తమ పాలన పట్ల ఉన్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు బనకచర్ల అంశాన్ని ఇరువురు వాడుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయాలన్న ఆలోచనే లేదన్నారు. 2014లో గోదావరి జలాలను పెన్నాకు తరలించే బృహత్తర కార్యక్రమాన్ని చేపడతామని హామీ ఇచ్చి మోసగించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే చిత్త శుద్ధి ఉందన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి: కలెక్టర్

సంబేపల్లె: మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో గురువారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. నారాయణరెడ్డిపల్లె గ్రామంలో ఎన్ని నివాసాలు ఉన్నాయి, రోజుకు ఎంత చెత్త వస్తుంది అనే విషయంపై ఆరాతీశారు. అనంతరం పొన్నేళ్ళవాండ్లపల్లెలో ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. చెత్త సేకరణకార్యక్రమం సక్రమంగా జరుగుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఓ రాధమ్మ, ఎంపీడీఓ రామచంద్ర ,పంచాయతీ కార్యదర్శి రవీంద్ర తదితరలు పాల్గొన్నారు.

నారాయణరెడ్డిపల్లెలో చెత్త సేకరణ గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్డు రోగులకు ఉచిత వైద్యం అందివ్వాలి

రాయచోటి: ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్డు ఉన్న రోగుల దగ్గర నుంచి ఆసుపత్రుల యాజమాన్యం ఎటువంటి నగదు తీసుకోకుండా ఉచిత వైద్యం అందివ్వాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ప్రొటోకాల్‌ను ట్రస్టుతో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ పక్కాగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఆరోగ్యశ్రీ క్రమశిక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్ జిల్లాలోని వివిధ ఆసుపత్రుల యాజమాన్యం పైన వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా అమరావతి హాస్పిటల్స్ యాజమాన్యం రూ.2500 తీసుకున్నారని, బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో రూ.16 వేలు, దేశాయ్ హాస్పిటల్స్‌లో తీసుకున్న నగదు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుతో ఎంప్యానల్ అయిన ఆసుపత్రులన్నీ ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ పథకంలో ఆసుపత్రుల యాజమాన్యం రక్తపరీక్ష, సీటీ స్కాన్ తదితర సేవలకు ఎటువంటి నగదును తీసుకోరాదన్నారు. కీళ్ల సమస్యల గురించి వచ్చే వారిని తప్పుదారి పట్టించరాదన్నారు. రోగులను మానవతా దృక్పథంతో చూడాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో జిల్లాలోని వివిధ రోగుల దగ్గర నుంచి అందిన ఫిర్యాదుపలై సమీక్షిస్తూ ఆసుపత్రుల యాజమాన్యం తీసుకున్న నగదును తిరిగి రోగులకు ఇచ్చేశారా లేదా అని అడగ్గా ఇచ్చేశామని సమాధానం ఇచ్చారు. అనంతరం ఆసుపత్రుల యాజమాన్యం తీసుకున్న నగదులో 50 శాతం జరిమానా వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త లోకవర్ధన్, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల నిర్వాహకులు, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ప్రణాళికల రూపకల్పనకు కృషి చేయాలి

జిల్లా, నియోజకవర్గ విజన్ ప్రణాళికల రూపకల్పనకు కమిటీలతో పటిష్టమైన సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.వీసీలో కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి

గాయపడిన వెంకటయ్య

ఒంటిమిట్ట: మండల పరిధిలోని చింతరాజుపల్లి అటవీ ప్రాంతంలో గురువారం అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ బొడ్డే వెంకటయ్య (48)పై ఎలుగుబంటి దాడి చేసింది. చింతరాజుపల్లి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగు నాయక్ కథనం మేరకు దాసర్లదొడ్డి వద్ద బేస్ క్యాంపు నిర్వహిస్తున్న ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లలో ఒకరైన బొడ్డే వెంకటయ్యపై రెండుపిల్లలను ప్రసవించిన ఎలుగుబండి దాడి చేసింది. అక్కడే ఉన్న బీట్ ఆఫీసర్ సుబ్రమణ్యంతో కలిసి మిగిలిన ప్రొటెక్షన్ వాచర్లు ముగ్గురు ఎలుగుబంటిని చెదరగొట్టారు. ఈ దాడిలో వెంకటయ్య కుడి మోకాలుకు తీవ్రగాయాలయ్యాయి. ఎఫ్‌బీఓ సుబ్రమణ్యం ఒంటిమిట్ట అటవీశాఖ కార్యాలయానికి సమాచారం అందించగా అటవీశాఖ వాహనంలో వెంకటయ్యను ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వెంకటయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నాగు నాయక్ తెలిపారు.

మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్(వైఎస్సార్ జిల్లా) : జిల్లాలోని మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. గురువారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ మహిళా సర్పంచులు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు చైతన్యవంతులు అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీ య న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లో సంప్రదించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ సి యామిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ గురువారం తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్.
కడప నగరము, కడప జిల్లా

ఖాళీ స్థలములు లీజు లైసెన్స్ హక్కునకు ఇ–టెండర్ మరియు సీల్డు టెండర్ (కం.)బహిరంగ వేలం ప్రకటన

కడప నగరములో నాగరాజు పల్లె (పాత బస్టాండ్ ప్రక్కన) వున్న శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప నగరములో నాగరాజు పల్లె సర్వే నెంబరు.6 లో గల 2 ప్లాట్స్ 1. ప్లాట్–A విస్తీర్ణం : (37.09 సెంట్స్ / 1,795 Sq. Yards), 2. ప్లాట్–B విస్తీర్ణం : (38.22 సెంట్స్ / 1,850 Sq. Yards) ఖాళీ స్థలములు 11 సంవత్సరములు కాలపరిమితికి లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఇ–టెండరు, సీల్డు టెండరు (కం.) బహిరంగ వేలము నిర్వహించబడును. ఈ టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేది. 17.07.2025, ఉదయం 10.00 గం॥కు. మరిన్ని వివరములకు www.eprocurement.gov.in ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు సోమవారం 14.07.2025 ఉదయం 10.00 గం॥ల నుండి బుధవారం 16.07.2025 సాయంత్రం 5.00 గం॥ల లోపల ప్రతి షెడ్యూలుకు రు.5,000.00 చెల్లించి శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ ఆఫీసు నందు (2) రెండు ప్లాట్స్ కు వేరు వేరు దరఖాస్తు ఫారాలు పొందగలరు. పూర్తి చేసిన సీల్డు టెండరు గురువారం 17.07.2025 ఉదయం 10.00 గం॥లకు సదరు ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము వద్ద టెండరు బాక్సు నందు వేయవలెను.

బహిరంగ వేలము పాట గురువారం 17.07.2025 ఉదయము 10.00.గం॥లకు శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము నందు జరుగును. ఇతర వివరములకు :+91 83318 90511 ను సంప్రదించగలరు.

వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు మరియు సెక్రటరీ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప.
ఆఫీస్ అడ్రస్ : ఫ్లాట్ నెం.301, 3rd ఫ్లోర్, 20/999-9-3-5, జొన్నలగడ్డ హైట్స్, కో–ఆపరేటివ్ కాలని, ఎదురు ACB ఆఫీస్, కడప–516001.

పురాతన ఆలయం.. సుమనోహర క్షేత్రం

- 5 నుంచి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు
- 11న కల్యాణోత్సవం
- 12న రోథోత్సవం
- భారీఎత్తున తరలిరానున్న భక్తులు

నందలూరు: అన్నమయ్య జిల్లా నందలూరులోని సౌమ్యనాథాలయం ఎంతో పురాతనమైనది. దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ ఆలయంగా పేరుగాంచింది. సుందర మనోహర క్షేత్రం..శిల్ప సౌందర్య సోయగం స్వామి భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్నారు. తెలుగురాష్ట్రాలతోపాటు తమిళనాడులోనూ భక్తులు ఉన్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 4న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. 5న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలివాహనం, 6న ఉదయం పల్లకీసేవ, రాత్రి హంసవాహనం, 7న ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహవాహనం, 8న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హనుమంతు వాహనం, 9న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ రాత్రికి చంద్రప్రభ వాహనం, 11న ఉదయం కళ్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 13న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 14న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.బ్రహ్మోత్సవాలకు వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతల నుంచి భక్తులు వేల సంఖ్యలో రానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

నందలూరు సౌమ్యనాథాలయం

ప్రత్యేకత: బ్రహ్మమానస పుత్రుడు, త్రిలోక సంచారి నారదుడు నందలూరు గ్రామంలో వెలసిన సౌమ్యనాథాలయలంలో స్వామి వారి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారని శాసనాలు ధృవీకరిస్తున్నాయి.

స్వామివారి మూలవిరాట్

సౌమ్యనాథుని గర్భగుడిలో ఎలాంటి దీపం లేకపోయినా మూలవిరాట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు దేదీప్యమానంగా వెలుగొందే విధంగా ఆలయాన్ని నిర్మించడం ఒక అద్భుతం.గర్భగుడి ప్రధాన ద్వారానికి వందగజాల దూరం నుంచి కూడా స్వామి చాలా స్పష్టంగా కనిపిస్తారు. ఏడాదిలో ఏదో ఒకరోజు సూర్యకిరణాలు స్వామి పాదాలపై ప్రసరించే విధంగా శిల్పులు నిర్మించారు.

- స్వామి వారి మూలవిరాట్‌ను గమనిస్తే

ఎటువంటి దీపం లేకున్నా..

తిరుమలలోని శ్రీనివాసుడు కటి హస్తంతో తన పాదాలను శరణు కోరండి పునీతులు కండి అని ప్రబోధిస్తుంటే నందలూరులోని శ్రీ సౌమ్యనాథుడు తనను నమ్మి శరణు వేడితే కోరిన కోర్కెలు తీరుస్తానంటూ అభయ హస్తంతో ప్రశాంత స్వరూపుడై దర్శనమిస్తాడు.ఆలయం లోపల విశాలమైన యాగశాల, యోగ నరసింహస్వామి, గణపతి, ఆంజనేయస్వామిలకు చెందిన చిన్న చిన్న ఆలయాలు ఉన్నాయి. దేవాలయ ప్రాంగణంలో ఒక పెద్ద కోనేరు ఉన్నది. స్వామి వారికి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు ఇక్కడ శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా దీనిని నిర్మించారు.ఆలయ కుడ్యాల పైభాగాన మత్స్య ఆకారం కనిపిస్తుంది. బహుదానది వరదల వల్ల ఆలయంలో ఉన్న మత్స్యం ప్రాణంతో నీటిలో కలిసిపోతుందని భక్తుల నమ్మకం.

కోర్కెలు తీర్చే దేవుడు

గర్భగుడి చుట్టూ 9 ప్రదక్షిణలు చేస్తే కోర్కెలు నెరవేరతాయనే విశ్వాసం భక్తుల్లో ప్రగాఢంగా ఉంది. కోర్కెలుతీరాక గర్భగుడి చుట్టూ 108 ప్రదక్షిణలు చేయడం క్షేత్ర సంప్రదాయంగా వస్తోంది. సంతానం కలగని వారు స్వామిని ప్రార్థిస్తే కలుగుతుందని భక్తులు నమ్ముతున్నారు.

శిల్పకళానైపుణ్యానికి ప్రతీక..

ఈ గుడి చోళుల శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా చెప్పవచ్చు.చోళరాజులు 11వ శతాబ్దంలో ఆలయం నిర్మించి స్వామికి 120 ఎకరాల మాన్యం ఇచ్చినట్లు శాసనాల్లో ఉంది. చోళ, పాండ్య రాజులు 17వ శతాబ్దం వరకు ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు గాలిగోపురం కట్టించాడు. నందలూరు, ఆడపూరు, మందరం, మన్నూరు, హస్తవరం గ్రామాలను దానంగా ఇచ్చినట్లు శాసనాల్లో ఉంది. కాగా నిరంత్ర అనే రాజు పూర్వం నిరంతపురం గ్రామాన్ని నిర్మించగా, గ్రామం బహుదానది వెల్లువలో కొట్టుకుపోయింది. తర్వాత నలంద అనే రాజు ఈ స్థలాన్ని సందర్శించి నందలూరు పేరుతో గ్రామాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. తాళ్లపాక అన్నమాచార్యులు వేంకటే శ్వరునిపై పలు శృంగార కీర్తనలు ఈ ఆలయంలో కూర్చొని రచించినట్లు ఆధారాలున్నాయి.

పట్టాలెక్కిన రైల్వేవన్ యాప్!

- స్పీడ్‌గా అన్ని రకాల సేవలు
- అందుబాటులోకి వచ్చిన యాప్
- ఐఆర్‌టీఎస్‌తో ఫుడ్ ఆర్డరింగ్
- నిమిషానికి 1.5 లక్షల టికెట్ల బుకింగ్ లక్ష్యం



రాజంపేట : భారతీయ రైల్వే ప్రయాణికులకు అన్ని రకాల సేవలందించేందుకు రైల్వేవన్‌యాప్‌ను రైల్వేశాఖ పట్టాలెక్కించింది. రైల్వేల ద్వారా మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు ఒకే యాప్‌ను డిజైన్ చేసింది. ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) పేరిట తీసుకొని.. ఈ యాప్ ద్వారా అన్ని సేవలను అత్యంత వేగంతో యాక్సిస్ చేసే వీలుంటుంది.

ప్రయాణికులకు అందే సేవలు

- టికెట్ బుకింగ్, రిజర్వేషన్, అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్ బుకింగ్
- ప్లాన్‌మై జర్నీ టూల్ ద్వారా వివిధ తరగతులలో కోటాలో టికెట్ల బుకింగ్
- అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్లపై 3 శాతం డిస్కౌంట్

రైలు స్థితి తెలుసుకోవడం ఎలా..

- రైలు స్థితి, ప్లాట్‌ఫాం నంబరు, ఆలస్యం తదితర వివరాలు
- కోచ్‌పొజిషన్ పీఎన్ఆర్ స్టేటస్, రీఫండ్
- ముందస్తు రిజర్వేషన్ టికెట్ ప్రస్తుత స్థితిగతులు, టికెట్ పీఎన్ఆర్ నంబరు ద్వారా సీటు కన్ఫర్మేషన్ స్టేటస్, రైళ్ల రద్దు, రిజర్వేషన్ రద్దు తదితర సేవలు

ఫుడ్ ఆర్డరింగ్..

- ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరజం కార్పొరేషన్ లిమిటెట్ (ఐఆర్‌టీసీ) యాప్ ద్వారా వివిధ రైల్వేస్టేషన్లకు చేరుకునేందుకు ముందుగా.. నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం, రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకున్నాక సీటు వద్దకే ఫుడ్ చేర్చడం

యాప్ ఎలా డౌన్‌లోడ్...

- ఆండ్రాయిడ్ ఫోన్లలోనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

httpr://pay.goofe.com/sotre/appr/detair?orf.crir.akam

ఐవోఎస్ యాప్ నుంచి...

httpr://appr.appe.com/in/app.raione/id 6473384334

ఉపయోగించే విధానం..

- యాప్‌ను డౌన్‌లోడ్ చేశాక. రైల్‌కనెక్ట్ లేదా యూటీఎస్ యాప్ లాగిన్ వివరాలతో లాగిన్ కావాలి.
- కొత్త వినియోగదారులు మొబైల్ నంబరు, ఓటీపీ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి.
- mPIN లేదా బయోమెట్రిక్ ద్వారా సులభంగా లాగిన్ కావచ్చు.
- ప్లాన్ మై జర్నీ లేదా మై బుకింగ్ వంటి ఆప్షన్లను ఉపయోగించి సేవలను యాక్సెస్ చేయవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ఒకే యాప్‌లో ఐఆర్‌టీఎస్ రైల్ కనెక్ట్, యూటీఎస్, రైల్‌మదద్, ఎన్‌టీఈఎస్, ఫుడ్ ఆన్ ట్రాక్ వంటి సేవలు
- బహుళ యాప్‌ల అవసరం తగ్గించి, డివైస్ స్టోరేజి ఆదా చేసుకోవచ్చు.
- సరళమైన ఇంటర్‌సేఫ్, సింగల్ సైన్-ఆన్ ద్వారా ఉపయోగం సులభతరం
- 2025 డిసెంబర్ నాటికి కొత్త పీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.5 లక్షల టికెట్స్ బుకింగ్, 40 లక్షల ఎంక్వైరీలు నిర్వహించగల సామర్థ్యం.

దేవదాయ ఆస్తులను కాపాడుకుందాం

మాట్లాడుతున్న తిరుపతి మల్టీజోన్ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్

రాయచోటి టౌన్ : దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు చెందిన ఆస్తులను కాపాడుకొనేందుకు మార్గదర్శకాలు అమలు చేస్తున్నట్లు తిరుపతి మల్టీజోన్ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ చెప్పారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌లతోపాటు అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి జిల్లాల దేవదాయ శాఖ, తనిఖీ, కార్యనిర్వహణ అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి మార్గదర్శకాలు సూచించారు. వాటిలో ముఖ్యమైనవి కింది విధంగా ఉన్నాయి.

- కార్యనిర్వహణ అధికారుల ఆధీనంలో ఉన్న దేవదాయల ప్రాపర్టీ రిజిస్టర్లపై పరిశీలన
- రెవెన్యూ వివరాలు నమోదు కాని వివరాల పరిశీలన
- ఆర్ఓఆర్ చట్టం ప్రకారం సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు అప్పీలు చేయవల్సిన వివరాల పైన..
- 1బి. పట్టాదార్ పాస్ పుస్తకాలలో దేవాలయాల పేర్లు చేర్చడం, దాని కోసం మీ సేవ ద్వారా తహసీల్దార్లకు అర్జీలు ఇవ్వడం
- సంస్థల సర్వీస్ ఇనామ్ వివరాలు (ఐఎఫ్ఆర్/ఇనామ్-బి రిజిస్టర్/ఆర్ఎస్ఆర్ ప్రకారం
- సంస్థల భూముల లీజు/ షాప్స్, ఇతరత్రా లైసెన్స్ ఆమోదం ఉత్తర్వులు
- దేవదాయ చట్టం సెక్షన్ 83 కింద ఇప్పటి వరకు ఆక్రమణదారులకు జారీ చేసిన (ఎవికే షన్ నోటీస్) తొలగింపు నోటీసులు
- 11/33 ఏళ్ల లీజు ప్రతిపాదనలు
- జీవో 60 ప్రకారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన భూరక్షణ కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాలు
- సామూహిక ఆక్రమణల (మాస్ ఎంక్రోచ్‌మెంట్) స్థితి వంటి విషయలపై చర్చించి అధికారులందరికీ మార్గదర్శకాలు జారీ చేశారు. వీటన్నింటినీ అమలు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన భాను, షఫిలకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు స్థానిక సరస్వతి విద్యా మందిరం సమీపంలో నివాసముంటున్నారు. షఫీ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తూ తమ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాను క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

పట్టుకున్న బియ్యం వద్ద విజిలెన్స్, రేషన్ అధికారులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలోని గోడౌన్‌లో అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివన్న, సివిల్ సప్లయ్ డీటీ సుధీర్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. ఈ సందర్భంగా 221 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. వెంటనే పులివెందులలోని ప్రభుత్వ గోదాముకు తరలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డి, వీఆర్ఓ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అయితే ఇదే గోడౌన్‌లో రెండు నెలల క్రితం అక్రమ రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అయినా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కలకడ : కలకడలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కలకడ ఇందిరమ్మ కాలనీకి చెందిన మేస్త్రీ కలాం తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఇందిరమ్మ కాలనీ నుంచి కలకడకు నడచి వెళ్తుండగా.. రాయచోటి నుంచి కలకడ వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని కలకడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
గుంటూరు మరియు కర్ణాటక (బాగల్కోట్ జిల్లా ఇల్‌కల్) నందు పనిచేయుటకు
అకౌంటెంట్స్ - 4
మైనింగ్ ఫస్ట్ క్లాస్ మేనేజర్ మరియు సెంకండ్ క్లాస్ మేనేజర్ కావలెను.
జీతం : 18,000/- & భోజనం+ రూమ్ వసతి
సంప్రదించండి
Veera Bhadra Minerals PVT.LTD
Hyderabad
CELL : 9542801919,9490216064
Mail id's : vbmhyd@yahoo.com and vbmpvtltd@yahoo.com

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366.

SERIVCES
జ్యోతిష్యాలయం
■ ఉచిత జ్యోతిష్య పీఠం. ఏ రకమైన సమస్యలకైనా 3 రోజుల్లో శాశ్వత పరిహారం. స్త్రీ/పురుషుల గుప్త, కఠిన సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం. సంప్ర: వై.సురేష్ గురూజీ, 9177882922.

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, BACHCHU VEERA RAGHVA S/O, BACHCHU VEERA BRAMHAIAH (OLD NAME) R/O. 18/285, SESHUGARI ST, PRODDATUR POST & MDL, YSR DIST, AP. Changed my Name as BACCHU VEERA RAGHAVA S/O, BACCHU VEERA BRAMHAIAH.
■ I, BACHCHU SUVARANA W/O, BACHCHU VEERA RAGVA (OLD NAME) R/O.18/285, SESHUGARI ST, PRODDATUR POST & MDL, YSR DIST, AP. Changed my name as BACCHU SUVARNA W/O, BACCHU VEERA RAGHAVA.
■ I, PORUMOMILLA SUSEELA D/o. PORUMOMILLA SUBBA RAO R/o. 20/28-5, Yerraguntla Road, Proddatur,have changed my name to PORUMOMILLA SUSEELA for all future purposes.

WANTED
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమం తుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999
■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లు

కమలాపురం : కమలాపురం మండలంలోని కంచన్నగారిపల్లె గ్రామ సమీపంలో పెన్నా నది వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. గురువారం ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్ఐ పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలసి పెన్నా నది వద్దకు చేరుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గాయపడిన ఈశ్వర్

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం కనంపల్లె - ఓదులపల్లి తండా గ్రామాల మధ్యలో గురువారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం ఉడుములకుర్తి నుంచి ద్విచక్ర వాహనంలో గంగరాజు తన కుమారులు ఈశ్వర్, దేవేంద్రతోపాటు భార్యతో కలిసి పులివెందులలోని సర్వజన ఆసుపత్రికి వస్తుండగా.. కనంపల్లె గ్రామ సమీపంలోని ఓదులపల్లె తండా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వర్, దేవేంద్రతోపాటు గంగరాజు, అతని భార్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు

వేంపల్లె : వేంపల్లె మండల పరిధిలోని తాళ్ళపల్లె - ముసల్‌రెడ్డిపల్లె మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాసం గంగరాజు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముసల్‌రెడ్డిపల్లెకు చెందిన గంగరాజు బైకుపై వేంపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని మోటార్ బైకులో గురువారం రాత్రి వేంపల్లె నుంచి గంగరాజు, దుగ్గన్నగారిపల్లెకు చెందిన బుసిరెడ్డి శివానందరెడ్డిలు ముసల్‌రెడ్డిపల్లెకు వెళ్తూ గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ వీరి మోటార్ బైకు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. దీంతో అక్కడికక్కడే బాసం గంగరాజు మృతి చెందాడు. బుసిరెడ్డి శివానందరెడ్డికి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన గంగరాజు, తీవ్రంగా గాయపడిన శివానందరెడ్డి

భవన నిర్మాణ కార్మికుడి హత్య

- రెండో భార్యపై అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ వెల్లడి

మృతి చెందిన చంద్రశేఖర

విచారణ చేస్తున్న సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె రూరల్ : భవన నిర్మాణ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు రెండో భార్య హత్య చేసిందంటూ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి మదనపల్లి మండలంలో వెలుగు చూసిన ఘటనకు సంబంధించి, కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం కొత్తవారిపల్లె పంచాయతీరెడ్డి గాని పల్లెకు చెందిన వీరభద్ర కుమారుడు వి.చంద్రశేఖర(42) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. పలమనేరుకు చెందిన మహిళతో వివాహం కాగా, కొంత కాలం క్రితం ఆమె చంద్రశేఖర్‌ను వదిలి వెళ్లిపోయింది. అనంతరం రమాదేవిని రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి దీక్షిత(9) చైతన్యకుమార్(5) సంతానం ఉన్నారు. ఈ క్రమంలో చంద్రశేఖర మద్యానికి బానిసై, పనులకు వెళ్లడం పూర్తిగా మానేశాడు. దీంతో కుటుంబంలో తరచు గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి వివాదం ఏర్పడి తీవ్ర గొడవ జరిగింది. గొడవ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన విషయం బయటకు తెలియలేదు. అయితే గురువారం రాత్రి చంద్రశేఖర ఇంట్లోనే మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. భార్య రమాదేవిని విచారణ చేస్తే సరైన సమాధానం ఇవ్వకపోగా, ఎప్పుడు చనిపోయాడు తనకు తెలియదంటూ సమాధానం దాటవేసింది. అంతేకాకుండా మృతుడి శరీరం, తలపై రక్త గాయాలు ఉండడంతో, అనుమానం వ్యక్తం చేస్తూ స్థానికులు వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తాలుకా సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర మృతిపై భార్య రమాదేవిని పోలీసులు ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు చంద్రశేఖర తమ్ముడు మహేష్ కుమార్ మాట్లాడుతూ... తన సోదరుడు మృతికి రమాదేవి కారణమని, మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కాగా వివాహేతర సంబంధం నేపథ్యంలోనే చంద్రశేఖర్ మృతి చెంది ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. అయితే మృతికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన

మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాయచోటి టౌన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 36 జీవోను అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్లు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి పట్టణం ఎన్‌జీవో కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎదుట తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేషన్ అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ పని గంటలు పెంచారు కానీ వేతనాలు మాత్రం రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. కార్మికులతో సమానంగా రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 ఏళ్లకు పెంచి అప్కాస్ కొనసాగించాలన్నారు. 6 ఏళ్లకు వయో పరిమితి పెంచకపోతే పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపోవడానికి కార్మికుల్ని దగా చేయడమేనన్నారు. అనంతరం కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అలాగే అప్కాస్ కొనసాగించి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఇంజినీరింగ్ కార్మికులు చెన్నయ్య, రాంబాబు, దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహ ధ్వంసంపై నిరసన

అంబేద్కర్ చిత్రపటం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాస్ నాయకులు

రాయచోటి టౌన్ : మదనపల్లె రూరల్ పరిధి అంకిశెట్టిపల్లె సమీపంలోని బుద్ధుడి కొండపై ఉన్న గౌతమ బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై రాయచోటిలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయ సముదాయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య మాట్లాడుతూ బుద్ధుడి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని ఆరోపించారు. గతంలో కూడా మూడు సార్లు ఇలాగే చేశారని, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అలాంటి దురాగతానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి రామాంజులు, బాస్ కుటుంబ సభ్యులు సి.రెడ్డెయ్య రాజు, పక్కీరయ్య, ఏ.నాగేశ్వరావు, సి.పామయ్య, జె.లక్ష్మమ్మయ్య, శ్రీరాములు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై మందుబాబు దాడి

తల్లిదండ్రులతో కలిసి మాట్లాడుతున్న విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిన్నమండెం : విద్యార్థులపై తాగుబోతు దాడి చేసిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బోనమల ప్రభుత్వ పాఠశాలలో పలువురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాబు(పుష్ప) మద్యం తాగి.. ఆ విద్యార్థులపై మధ్యాహ్నం ఉపాధ్యాయులు లేని సమయం చూసుకొని దాడి చేశాడు. దీంతో గాయపడ్డ పలువురు విద్యార్థులను వెంటనే 108 వాహనంలో రాయచోటి ఆస్పత్రికి తరలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు లేనిది చూసి తమను తాగుబోతు చేతులు మడమ తిప్పాడని పలువురు పిల్లలు ఆవేదన వ్యక్తం చేశారు.

మైదుకూరులో పట్టపగలే చోరీ

15 తులాల బంగారు, రూ.10 వేలు అపహరణ

చోరీ జరిగిన ఇంటిలో తెరిచిన బీరువా తలుపులు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో గురువారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. వేద వ్యాస హైస్కూల్ పక్కనే ఉన్న ములపాకు జంగంరెడ్డి చిన్న సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దుండగులు చొరబడి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయపల్లెకు చెందిన చిన్న సుబ్బారెడ్డి ఆరేళ్ల కిందట మైదుకూరులో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తెకు వివాహం కాగా, ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల ఉన్నారు. గురువారం చిన్న సుబ్బారెడ్డి భార్య మునెమ్మ వరి నాట్లకు వెళ్లగా, ఆయన గ్రామం వద్ద సాగు చేసిన పసుపు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు.. ఇంటి ప్రధాన ద్వారం తాళాన్ని గడెలతో సహా పెకలించి లోపలికి ప్రవేశించారు. ఇంటిలో కుడి వైపున బెడ్ రూమ్‌లో ఉన్న బీరువా తలుపులను పగులగొట్టి అందులో ఉంచిన 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న భార్యభర్తలు తలుపులు పగలగొట్టి ఉండటం చూసి.. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు వస్తువులు, నగదు కనిపించ లేదు. చోరీ జరిగిందని భావించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి బాధితుల ఇంటికి చేరుకుని పరిశీలించారు. కడప నుంచి వేలి ముద్రల నిపుణులను పిలిపించారు. వారు ఇంటిలోని బీరువా, ఇతర వస్తువులపై పడిన వేలి ముద్రలను సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

21 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

వేంపల్లి : బద్వేలులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభల జయప్రదానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గారి చంద్ర కోరారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతోందన్నారు. పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా సీపీఐ పోరాడుతోందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ హామీల అమలులో వైఫల్యాన్ని సీపీఐ ఎండగడుతోందన్నారు. విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరం పూర్తికి నిధులు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆర్థిక లోటు భర్తీ, విద్యా, వైద్య సంస్థల సాధనకై దశల వారీ పోరాటాలను సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, వేంపల్లి మండల కార్యదర్శి అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

చౌడసముద్రంలో ఉద్రిక్తత

బెల్టు షాపు నిర్వాహకుల మధ్య వివాదం

చౌడసముద్రంలో బెల్ట్ షాప్ నిర్వాహకుల గొడవ

మొలకలచెరువు: మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకుల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకున్న వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. మండలంలోని చౌడసముద్రంలో నాలుగు మద్యం బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకుంటూ రెచ్చిపోయారు. గ్రామస్తులు నాలుగు షాపులు మూసి వేయాల్సిందేనని పట్టుబట్టారు. నలుగురి మధ్య పోటీ నెలకొని ఒకరిపై ఒకరు బెల్టు షాపును తామే నడపాలంటే తామే నడపాలంటూ పోటీ పడ్డారు. రోడ్డు పైకొచ్చి గొడవకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. దాడులతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ ధరకు ఒకరు అమ్మగా మరో ముగ్గురు అధికారులకు మామూళ్లు ఇచ్చి రూ.20 అదనంగా అమ్ముతున్నారని వారికి వారే తమ బండారాన్ని బయట పెట్టుకున్నారు. ఈ ఘటన సంచలనం కలిగిస్తోంది.

సాక్షి
బాపట్ల
శుక్రవారం ı 4 ı జూలై ı 2025

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: జూలై 9న జరిగే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం తాడేపల్లిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,578 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

వైభవంగా సత్యసాయి రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం గురువారం నరసరావుపేట చేరుకుంది. భక్తులు సత్యసాయి పాదుకలను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఒరిగిన అమరేశ్వరాలయ రాజగోపురం తలుపు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానం దక్షిణరాజగోపురానికి అమర్చిన రెండు తలుపుల్లో ఒక తలుపు పక్కకు ఒరిగిపోయింది. బుధవారం రాత్రి దేవాలయ భద్రతా సిబ్బంది తలుపులు మూస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఆలయ కార్య నిర్వాహణాధికారి రేఖ మాట్లాడుతూ రాజగోపుర తలుపు మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో వేగంగా వచ్చిన ఓ కారు తలుపును ఢీ కొట్టటం వల్ల ఇనుపరాడ్ వంకర వచ్చిందన్నారు. ఈతరహా తలుపులు మరమ్మతులు చేసే వడ్రంగ నిపుణులను పిలిపించటానికి ఏర్పాట్లు చేశామని రెండుమూడు రోజులలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. అప్పటివరకు గాలిగోపురం వద్ద సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు. అలాగే పోలీసుల సహకారంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు రక్షణ కల్పిస్తామని తెలిపారు.

నేడు భూ సమీకరణ గ్రామ సభలు

తాడికొండ: తాడికొండ మండలం దామరపల్లి, ఫణిదరం, బండారుపల్లి గ్రామాల్లో భూ సమీకరణ కోసం ఎమ్మెల్యే అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తాడికొండ తహసీల్దార్ మెహర్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఫణిదరం, 11 గంటలకు దామరపల్లి, 12 గంటలకు బండారుపల్లి గ్రామాల్లో గ్రామ సభ జరగనుంది. రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

సీఎస్ సమీక్షకు హాజరైన కలెక్టర్

నరసరావుపేట: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే కలెక్టరేట్ నుంచి వర్చ్యువల్‌గా హాజరయ్యారు. పీ–4, పాజిటివ్ పబ్లిక్ పెర్సప్షన్, మహిళా స్వయం శక్తి సంఘాలకు వార్షిక క్రెడిట్ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్, మైక్రో క్రెడిట్ ప్లాన్, పోషణ్ ట్రాకర్, బాల సంజీవని లబ్ధిదారుల ఫేషియల్ అథంటికేషన్, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ప్రాజెక్టు, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, రుతుపవన సన్నాహక చర్యలు, అంశాలపై సమీక్ష చేశారు. దీనిలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ ఏకా మురళి, సీపీఓ శ్రీనివాసమూర్తి, పలువురు జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రేవుల్లో పడవలు తిప్పకొనేందుకు వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానది రేవుల్లో పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ అధ్యక్షతన సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించారు. ఆరు రేవులకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు హక్కుల కల్పిస్తూ సీల్డ్ టెండరు, బహిరంగ వేలంలో అచ్చంపేట, అమరావతి మండలాల్లోని నాలుగు రేవులను పాటదారులు దక్కించుకున్నారు. మాచవరం, కొల్లిపర మండలాల్లోని రేవులకు జరిగిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో వాటిని వాయిదా వేశారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని వివిధ రాష్ట్రాల అధికారులు గురువారం సందర్శించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సౌత్ క్యాంపస్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా పలు రాష్ట్రాల నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్లు, ఆయా రాష్ట్రాల రెవెన్యూ అధికారులు విచ్చేశారని తెలిపారు. ఏపీఎస్‌డీఎంఏ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ తిరుమల కుమార్, కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్ తనూజ, జీఐఎస్ ఎక్స్‌పర్ట్ హరీష్, ప్రాజెక్ట్ మేనేజర్లు బస్వంత్, కిషోర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భవనాశికి గ్రహణం

- నెరవేరని మంత్రుల హామీలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రాజెక్టు పూర్తయితే ఐదు వేల ఎకరాలకు సాగు నీరు

భవనాశి మినీ రిజర్వాయర్‌కు గ్రహణం పట్టింది. ఎన్నికలకు ముందు అద్దంకిలో పర్యటించిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు అధికారంలోకి వస్తే పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు.

అద్దంకి: కూటమి ప్రభుత్వం తీరుతో 5 వేల ఎకరాల మెట్ట రైతులు సాగునీటి ఆశలు ఆవిరౌతున్నాయి. దానికి తోడు బడ్జెట్‌లో రిజర్వాయరు కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించకపోవడంతో ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం లేదనేది తేటతెల్లం అయింది. బాపట్ల జిల్లాలోని శింగరకొండలో బ్రిటిష్ కాలంలో 250 ఎకరాల్లో భవనాశి చెరువు నిర్మాణం జరిగింది. ఈ చెరువు కింద ఇప్పటికీ హైలెవెల్, లో లెవెల్, ఫ్లగ్‌హోల్ కాలువల ద్వారా అద్దంకిలోని నర్రావారిపాలెం, వేలమూరిపాడు, మణికేశ్వరం, గోపాలపురం, చక్రాయపాలెం గ్రామాల్లోని 1197 ఎకరాల్లో మాగాణి సాగవుతోంది. గతంలో ఈ చెరువు పల్లంలో ఉండటంతో పరిసర గ్రామాల కొండలపై నుంచి వచ్చిన వర్షపు నీటితో కలకళలాడేది. పూడిక చేరడంతో నిల్వ సామర్థ్యం తగ్గడంతో సాగు అంతంతమాత్రంగా మారింది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా భవనాశి చెరువుకు బల్లికురవ మండలంలోని వెలమవారిపాలెం దగ్గర గుండ్లకమ్మ నదిపై చెక్ డ్యామ్ నిర్మించి, ఆ నీటిని ఫీడర్ చానల్ ద్వారా చెరువుకు తరలించి మినీ రిజర్వాయరుగా మార్చాలని భావించారు. రూ.27 కోట్లు కేటాయించడంతో 2013లో పనులు మొదలయ్యాయి. తరువాత టీడీపీ సర్కారు పట్టించుకోలేదు.

మినీ రిజర్వాయర్ నిర్మాణం జరిగేనా?

మినీ రిజర్వాయర్‌గా మారాల్సిన భవనాశి చెరువు

పెరిగిన వ్యయం

దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.45 కోట్లకు పెంచారు. వెలమారిపాలెం వద్ద చెక్‌డ్యామ్, భవనాశి కట్ట ఎత్తు పెంచడం, భవనాశి చెరువుకు నీరు చేరే విధంగా నది నుంచి ఫీడర్ చానల్ నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం చెక్‌డ్యామ్, చెరువు కట్ట ఎత్తు పెంచే పనులు పూర్తి కాగా.. 12.6 కిలోమీటర్ల మేర తవ్వాల్సిన ఫీడర్ చానల్ పనులు మూడొంతులు మాత్రమే పూర్తయ్యాయి. అలాగే చెరువు విస్తరణ పనులు పూర్తి కాలేదు. ఫలితంగా ప్రస్తుతం కాంట్రాక్టర్ క్లోజింగ్ ఇవ్వాలని వేడుకోలుతోపాటు, ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం, అవసరమైన భూమ సేకరణ కోసం మరో రూ. 40 కోట్లు అవసరం అవుతాయని ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంతో రూ.27 కోట్ల అంచనా పనులు ప్రస్తుతం వందకోట్లకు మించినా ఇది కలగానే మారిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుతం సాగువుతున్న 1197 ఎకరాలతోపాటు, తారకరామ ఎత్తిపోతల పథకానికి నీరు అంది, మొత్తం 5 వేల ఎకరాల మెట్ట భూములు మాగాణిగా మారతాయి.

చానల్ కనుమరుగే

భవనాశి మినీ రిజర్వాయర్ పూర్తయితే రైతులకు ఢోకా ఉండదు. పనులు సాగదీస్తూ వచ్చారు. ప్రస్తుతం ఫీడర్ చానల్ కట్టలు కూడా స్థానికులు మట్టి తరలింపుతో మాయం అవుతున్నాయి. కొన్ని రోజులు పోతే మరలా కాలువ తవ్వుకోవాల్సిన పరిస్థితి కలుగుతుంది. మినీ నిజర్వాయరును పూర్తి చేయించాలి.

– నగేశ్, చక్రాయపాలెం గ్రామ సర్పంచ్

మాట నిలబెట్టుకోవాలి

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఎప్పుడో పూర్తికావాల్సిన రిజర్వాయరు నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. ఫలితంగా సాధారణంగా సాగయ్యే భూములకు కూడా నీరు అందడం లేదు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి. అన్నదాతలకు ఉపయోగపడే నిర్ణయం ముఖ్యం.

– బొల్లా ఆంజనేయులు, చక్రాయపాలెం

సీఎంవోకు రాశాం

పనులు పూర్తి చేయడానికి, అవసరమైన భూసేకరణకు, చెరువు విస్తరణ కోసం మరో రూ.80 కోట్లు అవసరం అవుతాయని సీఎంఓకు నివేదిక పంపాం. ఇటీవల మైనర్ ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ ప్రాజెక్టును పరిశీలించి వెళ్లారు. నిధులు కేటాయిస్తే, ప్రస్తుత కాంట్రాక్టర్ క్లోజింగ్ అడుగుతున్నారు. అనుమతి రాగానే పనులు చేపడతాం.

– నారాయణ స్వామి, ఏఈ

ఏకపక్ష వైఖరికి కత్తెర పడేనా?

- చైర్‌పర్సన్ 'నిధుల మంజూరు' ధోరణిపై వైఎస్సార్ సీపీ సభ్యుల తీవ్ర అసంతృప్తి
- ఆమోదం కోసం నేటి సర్వసభ్య సమావేశం అజెండాలో పొందుపరిచిన అధికారులు

గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, అధికారులకు జెడ్పీ నుంచి ముందస్తుగా సమాచారాన్ని పంపారు. గత మార్చి 15న కోరం లేకపోవడంతో వాయిదా పడిన సమావేశం మరలా ఇప్పటి వరకూ జరగలేదు.

చైర్‌పర్సన్ ఏకపక్ష ధోరణిపై వ్యతిరేకత

ప్రజల ఓట్లతో గెలిచిన జెడ్పీటీసీలకు సముచిత గౌరవాన్ని ఇవ్వకపోవడంతోపాటు ముందస్తు అనుమతుల పేరుతోనూ జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు చేస్తున్న ధోరణికి వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు మార్చి 15న ఏర్పాటు చేసిన బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించారు. టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో రూ.కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తున్న తీరును ఖండించారు. వాటిలో కమీషన్లు, పర్సంటేజీ తీసుకుని అవినీతి, అక్రమాలతో జెడ్పీని నడుపుతున్నారని ఆరోపణాస్త్రాలు సంధించారు. మార్చిలో ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతోపాటు రూ.12 కోట్ల విలువైన పనులకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముందస్తు అనుమతులను ఇచ్చేయడంతో సమావేశానికి హాజరైన పక్షంలో సభ్యులు అంగీకారం తెలిపినట్లవుతుందనే కోణంలో గైర్హాజరయ్యారు. తద్వారా జెడ్పీటీసీలు తమ హక్కులను పరిరక్షించుకోవడంలో సఫలీకృతమయ్యారు.

అజెండాలో 'రూ.22 కోట్ల విలువైన పనులు'

చైర్‌పర్సన్ వైఖరితో జెడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారు. తాము గెలిచీ ప్రయోజనమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. చైర్‌పర్సన్ పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మార్చి 15న బడ్జెట్ సమావేశానికి గైర్హాజరు కావడంతో, అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపి ఆమోదింపజేసుకున్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో జెడ్పీటీసీలకు తెలియకుండా ముందస్తు అనుమతుల పేరుతో రూ.12 కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చేశారు. తాజా సమావేశంలో మరో రూ.10 కోట్ల మేరకు ముందస్తు అనుమతులు ఇచ్చారు. మొత్తం రూ.22 కోట్ల పనులను ఆమోదం కోసం శుక్రవారం జరగనున్న సర్వసభ్య సమావేశపు అజెండాలో పొందుపర్చారు.

అంగీకారం లేకుండానే పనులు

జెడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సభ్యుల అంగీకారం తప్పనిసరి. ఏ గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేపడుతున్నారనే విషయాన్ని అజెండాలో పొందుపర్చి, సర్వసభ్య సమావేశంలో చర్చించాలి. సభ్యులు అంగీకరించిన తరువాతే వాటిని ఆమోదిస్తారు. అయితే గుంటూరు జెడ్పీలో సభ్యుల అంగీకారం లేకుండా ఏకపక్షంగా పనులు కేటాయింపు వ్యవహారం నడుస్తోంది. చైర్‌పర్సన్ ముందస్తు అనుమతుల పేరుతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పనుల జాబితాను సిద్ధం చేసి, స్టాండింగ్ కమిటీలో పెట్టాక ఆమోదించేస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో 1వ, 7వ కమిటీలకు చైర్‌పర్సన్‌గా ఉన్న కత్తెర హెనీ క్రిస్టినా ఆమోదంతో సంబంధిత పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులను సహించం

- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- మండల పార్టీ అధ్యక్షుడి ఇంటిపై రాళ్లు విసిరిన దుండగులు
- సంఘటన స్థలం పరిశీలన అనంతరం బాధితుడికి అశోక్‌బాబు పరామర్శ

మోదుకూరు గ్రామంలో రఘురామి రెడ్డి ఇల్లును పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేసినా, వారి గురించి అసభ్యకరంగా మాట్లాడినా సహించబోమని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హెచ్చరించారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు అనపు రెడ్డి రఘురామి రెడ్డి ఇంటిపై రాళ్లు విసిరి విచక్షణరహితంగా కొందరు ప్రవర్తించారన్నారు. రఘురామి రెడ్డి ఇంటికి గురువారం ఆయన వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదుకూరు గ్రామంలో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. గంజాయి తాగి వైఎస్సార్‌సీపీ నాయకులపై కొందరు దాడులు చేసేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై రాళ్లు వేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టాలనే ఆలోచనలను వీడి, అందరూ కలిసి ఉండాలని కోరారు. తప్పు ఎవరు చేసినా అది తప్పేనని తెలిపారు. తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కులం అనే ముసుగు వేయకూడదని సూచించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాని కోరారు. రఘురామి రెడ్డి ఇంటిపై రెండు సార్లు దాడులు చేయడాన్ని ఖండించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తే ఊరుకోబోమని చెప్పారు. నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో లక్ష్యాలను సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన కలెక్టర్ చాంబర్‌లో దీనిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణాలలో పురోగతి లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకు 8,299 పక్కా గృహాలను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 3,687 గృహాలే పూర్తి కావడంతో మండల స్థాయి అధికారులను కలెక్టర్ నిలదీశారు. దీనికి కారణాలపై ఆరా తీశారు. చార్జి మెమోలు ఇచ్చినా పనితీరులో మార్పు లేదని అసహనం వ్యక్తపరిచారు. గృహ నిర్మాణ శాఖలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో 17వ స్థానంలో ఉన్న జిల్లాను 23వ స్థానానికి దిగజార్చారని ఆయన మండిపడ్డారు. లక్ష్యాలను సాధించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మండల ఈఈలు, డీఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన చంద్రబాబు

- చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం మన బాధ్యత
- వైఎస్సార్ సీపీ కుటుంబం మొత్తం కలిసికట్టుగా పోరాటం చేయాలి
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీపై గ్రామ గ్రామాన ప్రచారం తక్షణ అవసరం
- కూటమి ప్రభుత్వంపై యుద్ధానికి ఇది తొలిమెట్టు
- వేమూరులో కార్యక్రమం ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు పిలుపు

'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మేరుగ నాగార్జున, తూమాటి మాధవరావు, వరికూటి అశోక్‌బాబు తదితరులు

భట్టిప్రోలు (కొల్లూరు): ప్రజలను మోసగించడంలో చంద్రబాబు మాత్రమే అతిపెద్ద మోసగాడని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. గురువారం మండలంలోని అద్దేపల్లిలో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వేమూరు నియోజకవర్గ స్థాయిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తూ పథకాలను అమలు చేయకుండానే మభ్యపెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండానే ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు అబద్ధాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన తరుణం ఆసన్నమైందని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతాంగానికి, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నేడు చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ పాలనలో వరి రైతులకు ఉరి వేసకుని.. మిర్చి రైతులకు రైలు కింద పడి.. పొగాకు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తడం దురదృష్టకరమైన విషయమన్నారు. పంటలకు మద్దతు ధర ఇవ్వకుండా, ఇస్తానన్న పెట్టుబడి సాయం, ఇతర పథకాలు అందించకుండా సీఎం చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మేలు ఏంటో చెప్పాలని ఆయన నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేసిన సంక్షేమ పథకాల అమలును నేడు ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తెలియజేయడంతోపాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధి గురించి జగనన్న సైనికులందరూ ప్రతి గ్రామంలో వివరించాలని కోరారు. తద్వారా చంద్రబాబుపై యుద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.

ప్రజలకు బాకీ పడుతున్న చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీర్చలేని బాకీ పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చి ప్రతి ఇంటికీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరిస్తే, నేడు చంద్రబాబు ప్రజలను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అబద్ధపు హామీలను మండలస్థాయి, గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అధికారపార్టీ నాయకులు కేసులు పెడతార్న భయాలు, అపోహలు వద్దని సూచించారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తప్పుడు కేసులు పెడితే చివరకు పోలీసులపైనే ప్రయివేటు కేసులు పెట్టేందుకూ వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో'పై ఆయన కార్యకర్తలు, నాయకులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి లలితకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి నాయకులు కోగంటి లవకుమార్, హుసేన్, వైఎస్సార్ సీపీ భట్టిప్రోలు, వేమూరు, కొల్లూరు, చుండూరు, అమృతలూరు మండల కన్వీనర్‌లు పడమట శ్రీనివాసరావు, దాది సుబ్బారావు, సుగ్గున మల్లేశ్వరరావు, అన్నపరెడ్డి రఘురామరెడ్డి, హేమచంద్ర శ్రీనివాసరావు, వేమూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా అశోక్‌బాబు, నాయకుల ద్విచక్ర వాహన ర్యాలీ

ప్రతిపక్ష నేతలపై వేధింపులతో సరి

బాపట్ల పార్లమెంటరీ పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టడం, జైలుకు పంపడం అనే సంతృప్తి మినహా ఏడాది పాలనలో చేసిందేమీ లేదన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలతో చివరకు ఆ పార్టీ కార్యకర్తలే విసిగి వేసారే పరిస్థితి వచ్చిందన్న విషయం పచ్చి నిజమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాల వల్ల నేడు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆయనను తలచుకుంటున్నారని పేర్కొన్నారు. పాలిచ్చే గేదెను వదులుకొని పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామన్న ఆలోచన ప్రజలతోపాటు టీడీపీ కార్యకర్తలలోనే ఉందని చెప్పారు.

ఫెన్సింగ్‌లో చిన్నారి ప్రతిభ

అద్దంకి: ఫెన్సింగ్‌లో ఓ చిన్నారి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకొని అంతా ఔరా అనేలా చేసింది. సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన గంటెనపాటి సురేశ్, జ్యోతి కుమార్తె తన్మయ్ మూడో తరగతి చదువుతోంది. గత మూడు నెలల నుంచి గ్రామానికి చెందిన కోచ్ అశోక్ వద్ద ఫెన్సింగ్‌లో శిక్షణ పొందింది. తన్మయ్ ప్రతిభ కనబరుస్తుండడంతో కోచ్ ఆమెను విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించారు. ఈ పోటీల్లో తన్మయ్ సత్తా చాటడంతో ఈ నెల 5,6,7 తేదీల్లో మహారాష్ట్రలోని డివిజనల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మీనాభాయి థాకరే స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలకు రాష్ట్రం నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు.

తండ్రి, కోచ్‌లతో తన్మయ్

క్లుప్తంగా

భూగర్భ జల శాఖ ఏడీఏగా జి.సురేష్

బాపట్ల: భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులుగా జి.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్.జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇప్పటి వరకు ఇక్కడ సహాయ సంచాలకులుగా పని చేసిన కె.రామబాలాజీ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నుంచి పదోన్నతితో బదిలీపై వచ్చిన సురేష్‌కు అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పనిచేయాలి

చీరాల: నియోజకవర్గ అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, సహజ వనరులపై దృష్టి, స్వర్ణాంధ్ర -2047 ఉద్దేశమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో విజన్ ప్లాన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, సేవారంగం విస్తరిస్తేనే ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. భవిష్యత్తులో అదే కీలకమన్నారు. విజన్ ప్లాన్‌పై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

వేమూరు: మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్య షాపుల నిర్వాహకులు సమయ పాలన పాటించాలన్నారు. మద్యం ప్రభుత్వం ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. సీఐ రవి, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

'నల్లబర్లీ' పూర్తిగా కొనాల్సిందే..!

- నిబంధనల పేరుతో పొగాకు చెక్కులను వెనక్కి పంపితే సహించం
- ప్రభుత్వం వ్యాపార పరంగా కాకుండా, రైతులకు మేలు జరిగేలా కొనాలి
- రైతు సంఘం నాయకుల డిమాండ్

పొగాకు కొనుగోలు కేంద్రంలో బయ్యర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

జె.పంగులూరు: ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు డిమాండ్ చేశారు. పంగులూరులోని మార్కెట్ యార్డులు ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు. అక్కడ ఉన్న రైతుల వద్ద నుంచి సమాచారం తీసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు, వినోద్‌బాబులు మాట్లాడుతూ నిబంధనల పేరుతో పొగాకు చెక్కులను వెనక్కి పంపటం మానుకోవాలని, రైతులు తెచ్చిన పొగాకు చెక్కులు మొత్తం ఆలస్యం చేయకుండా కొనాలని కోరారు. రైతులు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి పొగాకు చెక్కులు కొనుగోలు కేంద్రానికి తీసుకొని వస్తే, ఇక్కడ నిబంధనల పేరుతో చెక్కులు వెనక్కి పంపుతున్నారని మండిపడ్డారు. మంచి గ్రేడ్ ఉన్న పొగాకు కూడా తక్కువ ధర వేస్తున్నారన్నారు.

వెనక్కి పంపితే మరింత భారం..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న పొగాకు చివరి ఆకు కూడా కొంటామని చెబుతోందని, కానీ కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న నిబంధనలు రైతులకు మేలు చేసేవిగా లేవన్నారు. రైతులు గత నాలుగు నెలలు నుంచి తమ పంటను అమ్ముకోవాలని చూశారన్నారు. ఇప్పుడు అవకాశం వచ్చి తమ పేరు రాగానే చెక్కులు తీసుకొని మార్కెట్ యార్డు వద్దకు రాగా వివిధ కారణాలతో సగానికి సగం చెక్కులు వెనక్కి పంపుతున్నారని ఆరోపించారు. గ్రేడ్ చేసు కొన్ని చెక్కులు తీసుకొని వస్తే, మళ్లీ వాటిని వెనక్కి పంపుతున్నారని, తిరిగి వాటిని గ్రేడ్ చేసి చెక్కులు తొక్కితే రైతులకు మరింత భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా మేలు చేసేవిధంగా చూడాలన్నారు. పొగాకు నాణ్యతను బట్టి మూడు గ్రేడ్లు చేసిన, ధరలు మాత్రం అతి తక్కువగా వేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సింగారావు దృష్టికి విషయాన్ని తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో రైతులు గుడిపాటి మల్లారెడ్డి, తానికొండ సుధాకర్, తలపనేని స్వామి, రావెళ్ల ఉమామహేశ్వరరావు, చుక్కా కాంతయ్య, మదాల సాంబశివరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు

- విచారణ లేకుండానే నేరుగా కోర్టుకు హాజరుపరుస్తాం
- మైనింగ్ శాఖ ఏజీఎం ఫణిరాజ్ కుమార్ సింహా

ఓలేరు ఇసుక క్వారీ వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏజీఎం ఫణిరాజ్ కుమార్ సింహా

భట్టిప్రోలు(కొల్లూరు): ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే ఎటువంటి విచారణ లేకుండానే నేరుగా కోర్టుకు హాజరుపరుస్తామని మైనింగ్ శాఖ ఏజీఎం పి.ఫణిరాజ్ కుమార్ సింహ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఓలేరులో కొన్ని నెలల క్రితం అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు ఆదేశాలతో మైనింగ్, రెవెన్యు శాఖాధికారులు విచారణ చేపట్టారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ఓలేరు ఉచిత ఇసుక క్వారీని మైనింగ్ శాఖ ఏజీఎం పరిశీలించి గ్రామస్తులను విచారించి వారి నుంచి వివరాలు సేకరించారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వాటిల్లుతున్న ముప్పును గ్రామస్తులు వివరించడంతో ఆయా అంశాలను నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ, తమ పరిశీలనలో వెలుగుచూసిన అంశాలను కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిపారు. మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.స్నేహ, తహసీల్దార్ మేక శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.శివయ్య ఉన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

అద్దంకి: దేశవ్యాప్తంగా వాపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కేర్ అండ్ క్యూర్ హోమియో క్లినిక్ ఆవరణలో బుధవారం జాతీయ సమ్మె పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సమావేశం కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ సమ్మెలో అన్ని ట్రేడ్ యూనియన్లు, ఎల్ఐసీ, కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు కలిసి సమ్మె చేస్తున్నట్లు వెల్లడించారు. కె.రఘుచంద్ మాట్లాడుతూ సమ్మెలో అందరూ పాలు పంచుకుని జయప్రదం చేయాలని కోరారు.

శింగరకొండ విచ్చేసిన పీఠాధిపతులు

శింగరకొండ దేవస్థానంలో పీఠాధిపతులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానానికి గురువారం అయోధ్య జానకి ఘాట్ జయ శరణ్‌జీ మహరాజ్, అయోధ్య విశ్వకుటుంబ ఆకార పీఠం ట్రస్ట్ చీఫ్ సూర్యప్రకాష్ సరస్వతి రుద్రదిండి, చినమస్తాన్‌దేవి పీఠాధిపతులు, మహా మండేశ్వరీ పద్మావతి, నారాయణ ప్రత్యంగి మహాదేవి విచ్చేశారు. దేవస్థాన అర్చకులు పీఠాధిపతులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శింగరకొండలో గల హరహర గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ హిందువులందరూ గోమాతను పూజించాలన్నారు. గోశాల సుబ్బారావు బృందం పీఠాధిపతులను సన్మానించారు. తదుపరి అద్దంకి పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, పోలేరమ్మ దేవాలయం, కాళికా కమలేశ్వర స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట విశ్వ కుటుంబ ధర్మ పరిరక్షణ అఖారా ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ వాకా వెంకట బాలగంగాధర్, చావా రామకృష్ణ, యామర్తి వెంకటేశ్వర్లు, అంకం నాగరాజు, గోశాల సుబ్బారావు, చెన్నుపల్లి శ్రీనివాసాచారి, పాపారావు, బ్రహ్మానందం, తదితరులున్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల వల్ల ఒక మహిళ ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. నూజెళ్ల మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన మరియకుమారి (35) అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. కుటుంబ కలహాలా.. లేదా ఇతర కారణాలనే అనే విషయం తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో'పై సమావేశం

రేపల్లె: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. సంవత్సర కాలంలో ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు తెలియజేసేందుకు 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి మాజీ మంత్రి, పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల పార్లమెంటరీ పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు హాజరవుతారన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు చీరాలలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

చీరాల: రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడంపై పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు గురువారం తెలిపారు. చీరాల మండలం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకులు తూమాటి మాధవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, చీరాల, వేటపాలెం మండలాల, పట్టణ అధ్యక్షులు, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపు ఇంకొల్లులో నియోజకవర్గ స్థాయి సమావేశం

పర్చూరు(చినగంజాం): బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ నియోజకవర్గ స్థాయి కార్యక్రమం ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పర్చూరు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల కన్వీనర్‌లు మాజీ మండల కన్వీనర్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అనుబంధ విభాగం అధ్యక్షుడు వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ కార్మికుల వేతనాలు పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని గత 15 రోజుల నుంచి శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. 4వ తేదీ నుంచి సమ్మెలో భాగంగా అత్యవసర సేవలైన నీటి, విద్యుత్ సరఫరా విధులలో కార్మికులు సైతం తమ సేవలను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ రేపల్లె అధ్యక్షుడు ప్రభాకరరావు, కార్యదర్శి రవిబాబు, కోశాధికారి రాఘవేంద్రరావు, సభ్యులు యువరాజు, రవి, ప్రభాకర్, అనూష, గీత తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల కోసం శవ పంచాయితీ

అంత్యక్రియలు అడ్డుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు

ఎర్రిబోయిన సురేష్ మృతదేహం

జె. పంగులూరు: మానవత్వం మంటగలిసింది. ఆస్తి పాస్తులకు ఉన్న విలువ మనిషికి లేదని మరోసారి నిరూపితమైంది. ఆస్తుల కోసం మృతదేహాన్ని ఇంటి ముందు పెట్టి, ఆస్తి పంచాయితీ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సంఘటన కలచి వేసింది. వివరాలు.. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన ఎర్రిబోయిన సురేష్ వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన సంఘటన పాఠకులకు తెలిసిందే.. కాగా మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించి మంగళవారం అప్పగించారు. అయితే అతని అంత్యక్రియలను భార్యతో పాటు, భార్య బంధువులు అడ్డుకున్నారు. సురేష్ తండ్రి అంజియ్య ఆస్తి పంపకాలు జరపలేదని, ఆస్తి పంచి.. సురేష్ భార్య తిరపతమ్మకు, ఆమె పిల్లలకు రాసి ఇచ్చేవరకు మృతదేహాన్ని కదిలించడానికి వీలు లేదని తెగేసి చెప్పడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. మృతుడు సురేష్ తండ్రి అంజయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. మనుమలు, మనువరాళ్లు కూడా పెద్దవారయ్యారు. అయితే వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ అంజయ్య ఆస్తిని కుమారులకు పంచేందుకు అంగీకరించ లేదు. దీంతో మంగళవారం నుంచి గురువారం వరకు రెండు రోజుల పాటు కుటుంబ సభ్యులకు, బంధువులకు వాగ్వాదం, గొడవలు జరిగాయి. చివరికి గురువారం మధ్యాహ్నం రేణింగవరం పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ చేరింది. అక్కడ ఎస్ఐ వినోద్‌బాబు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ కుదర్చేందుకు సాయంత్రం 4 గంటలు అయింది. పోలీస్ స్టేషన్ వద్దే పత్రాలు రాసుకుని బంధువులు, కుటుంబ సభ్యులు రామకూరు చేరి.. అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్తులు పంచకుండా తమ దగ్గరే ఉంచుకొని, వృద్ధాప్యంలో కూడా తన పెత్తనమే చెల్లాలని ఒక వ్యక్తి చేసిన ప్రయత్నానికి ఓ కుటుంబంలోని నాలుగు ప్రాణాలు బలైపోయిన ఘటన కూడా రామకూరు గ్రామంలోనే జరిగింది. ఇప్పుడు ఆస్తి కోసం అంత్యక్రియలు కూడా అడ్డుకున్న ఘటన కూడా ఇదే గ్రామంలో జరగడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE
PLOT FOR SALE
■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర।। ✆ 8790741166

WANTED
■ P/T, F/T 18సం।। నిండిన ఉత్సాహవంతులైన యువతి యువకులు కావలెను. భవిష్యత్తు నిర్మాణం నో టార్గెట్స్ నో బాస్. 9010803546
■ Urgent Requirement Comp:PAYTM* FSE: Sales Executive/Sr.Executive. Place Guntur. Sal: 18k to 32k+ Incentive Medical insurance+PF. 9912002213
■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం।।లోపు. 9133444988/ 89
■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ Gunturలో Field Executives కావలెను. Salary 15K & 20K + Incentives ✆ 72079 42933
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బీఎస్‌వీ హిమబిందు

మాట్లాడుతున్న బీఎస్‌వీ హిమబిందు

తాడికొండ: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంపైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్టు అండ్ సెషన్స్ జడ్జి) బీఎస్‌వీ హిమబిందు విజ్ఞప్తి చేశారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించేందుకు ఈ నెల 5న నిర్వహించే 2వ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.... జూలైలో పరిష్కరించదగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు, న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించనున్నట్లు చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా లేదా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు ఇరువురూ లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. రాజీపడ దగ్గ కేసులు రాష్ట్రంలో మొత్తం 1,15,071 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్ అమర రంగేశ్వర రావు మాట్లాడుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాటర్న్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవీనాథ్ తిలహరి సూచనల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సహాయ కార్యదర్శి ఎన్‌జే రావు సమావేశంలో పాల్గొన్నారు.

గాంధీ, అంబేడ్కర్‌లతో పోల్చుకునే అర్హత చంద్రబాబుకు లేదు

గాంధీ అధ్యయన కేంద్రం వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్

నరసరావుపేట: మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లతో పోల్చుకునే నైతిక అర్హత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏమాత్రం లేదని గాంధీ అధ్యయన కేంద్ర వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. నేను, గాంధీజీ, అంబేడ్కర్, ఎన్టీఆర్ అందరమూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారమే అయినా, అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకుని ఇంతస్థాయికి వచ్చామని కుప్పం సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్య విన్న జనాలు విస్తుపోయారన్నారు. సత్యం, అహింసల వంటి శాశ్వత విలువల కోసం సత్య హరిశ్చంద్రుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తుల స్ఫూర్తితో అహర్నిశలు శ్రమించిన గాంధీజీకి, నిత్యం నోరు తెరిస్తే అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు చేసే చంద్రబాబుకు పోలిక ఎక్కడని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల వైతాళికుడు అయిన అంబేడ్కర్ ఎక్కడ?.. రెడ్‌బుక్ రౌడీయిజపు రాజ్యాంగాన్ని అమలు చేయిస్తూ దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని కించపరచిన చంద్రబాబుకు పోలిక ఎక్కడని అన్నారు. గాంధీ, అంబేడ్కర్లలో ఒకరు స్వాతంత్ర్య ప్రదాతగా, మరొకరు అంతులేని జ్ఞాన, గుణ సంపదలఖనిగా, చరిత్రలో మహాపురుషులుగా నిలిచిపోయారని తెలిపారు. కానీ బాబు, అతని కుమారుడు మాత్రం అవకాశాలను దుర్మార్గంగా కిడ్నాప్ చేసి, పదవులు లాక్కొని అక్రమార్జనతో రూ.లక్ష కోట్లకు పడగలెత్తి దుష్పరిపాలన చేస్తూ చరిత్రహీనులుగా పతనమవుతున్నారన్నారు. గాంధీ అంబేడ్కర్‌ల వంటి త్యాగధనుల పేర్లను ఉచ్చరించే నైతిక అర్హత చంద్రబాబుకు లేదని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని తెలిపారు.

వ్యాధుల అంతమే ధ్యేయం

ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ

బాపట్ల: కీటక జనిత వ్యాధులను అంతం చేయటమే ధ్యేయమని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ పిలుపునిచ్చారు. డెంగీ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీఓ హోం నుంచి భారీ ర్యాలీని డాక్టర్ విజయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొబ్బరి బొండాలు, పాత కూలర్‌లు, రోళ్లు, గుంతలలో నీరు నిలవ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ నీటిలోనే దోమల లార్వాలు పెరుగుతాయనే విషయంపై ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాంటి నీటి నిల్వలను గుర్తించి అబేట్ ద్రావణం చల్లాలని పేర్కొన్నారు. ఫ్రైడే – డ్రై డే సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది ఖదీర్, షకీల్, రాంబాబు, జిలాని, సత్యంరాజు పాల్గొన్నారు.

పునీత థామస్‌వారి అడుగుజాడల్లో నడవాలి

1900లో నిర్మించిన అతి పురాతన పునీత థామస్ వారి చర్చి

- రెవ.ఫాదర్ రాజరత్నం
- వైభవంగా పునీత థామస్‌వారి చర్చి 125వ వార్షికోత్సవం

పునీత థామస్ వారి చర్చిలో పవిత్ర సమష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు

తుమృకోట(రెంటచింతల): క్రీస్తు సూక్తులను నిత్యం ఆచరిస్తూ పునీత థామస్‌వారు క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడలలో నడిచి సమాజంలో నిజమైన క్రైస్తవులుగా జీవించాలని రెవ.ఫాదర్ ఎం.రాజరత్నం అన్నారు. గురువారం తుమృకోట గ్రామంలో నున్న పునీత థామస్‌వారి చర్చి 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విచారణ గురువులు మాలై పవిత్రన్ ఆధ్వర్యంలో రెవ.ఫాదర్ కొణతం ఎలీషారాజుతో కలిసి సమష్టి దివ్యపూజాబలి సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోనే తుమృకోట చర్చి అతి పురాతనమైందన్నారు. అపోస్తులు 12 మందిలో ఒకరైన థామస్ వారు భారతదేశంలో మొట్టమొదటిసారి క్రీస్తు సువార్తను ప్రచారం చేశారని గుర్తుచేశారు. భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. పెద్దలు అశోక్, మల్లి, దుగ్గింపూడి శౌరి రాయపురెడ్డి, రెంటచింతల కానుకమాత చర్చి దళ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి చిత్తూరు
శుక్రవారం । 4 । జూలై । 2025



అనారోగ్య 'వసతి'
తిరుపతి జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలు అధ్వానంగా మారాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - 8లో

ఘనంగా ఐసీఎస్ఐ స్నాతకోత్సవం
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా స్నాతకోత్సవం పద్మావతి మహిళా వర్సిటీలో ఘనంగా జరిగింది. - 8లో

సిద్ధమవుతున్న ఓఆర్ఎం
చిత్తూరు జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్‌పీఎంలో నూతన ఓఆర్ఎం ఇన్‌స్టాలేషన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. - 8లో

న్యూస్‌రీల్

మొహర్రం సెలవుపై స్పష్టత ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్ : మొహర్రం సెలవుపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన ముస్లింల పండుగకు ప్రభుత్వం ఆప్షనల్ సెలవు ప్రకటించిందన్నారు. అయితే పాఠశాలలకు ఆప్షనల్ సెలవులు వాడుకోవచ్చా లేదా అనే సందిగ్ధం నెలకొందన్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తుంటే ఎలాంటి స్పందన లేదన్నారు. గత వారంలో రథయాత్రకు సైతం సెలవు ప్రకటించి చివరి నిమిషంలో రద్దు చేసి విధులు నిర్వహించాలన్నారు. ముందుగానే ఆప్షనల్ సెలవు పై నిర్ణయం ప్రకటించాలని కోరారు.

గిరిజన భవనం ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత శాఖా మంత్రి రాందాస్ అతవాలేకు వినతి పత్రం అందజేశారు. మంత్రితో వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలో గిరిజన భవనం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు.

మా బియ్యం ఎక్కడ?

– రేషన్ షాపు ఎదుట కార్డుదారుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యం 10వ నంబర్ రేషన్ షాపు వద్ద కార్డుదారులు నిరసన వ్యక్తం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ రేషన్ షాపు పరిధిలో ఎస్‌బీఆర్ పురం, రాచపాళ్యం, మణిపురం గ్రామాలకు చెందిన 320 రేషన్ కార్డుదారులు ఉన్నారు. గ్రామానికి కిలో మీటర్ల దూరంలోని పాలసముద్రం రైతు సేవా కేంద్రంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. రెండు రోజుల పాటు ఇక్కడ బియ్యం పంపిణీ చేశారు. ఆపై సుమారు 30 మందికిపైగా కార్డులకు బియ్యం పంపిణీ చేయలేదు. దీంతో కార్డుదారులు తమకు రావాల్సిన బియ్యం ఎక్కడ..? అంటూ రేషన్‌షాపు డీలర్‌ను నిలదీశారు. ఆపై షాపు ఎదుటే కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తమకు బియ్యం పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

6న బ్రహ్మోత్సవాలపై ఉభయదారుల సమావేశం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల 6వ తేదీన ఉభయదారులతో సమావేశం జరగనున్నట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. కాణిపాకంలోని శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఉభయదారులు పాల్గొన్నాలని ఆయన కోరారు.

తోతాపురి.. వద్దులే మరి!

యాదమరి: తోతాపురి రైతులు ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు. గిట్టుబాటు ధరలేక నానా అగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో తోతాపురిని వదిలించుకునేందుకు సిద్ధపడుతున్నారు. తోటల్లోని తోతాపురి చెట్లను తెగనరికి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి ఘటనే యాదమరి మండలంలో చోటు చేసుకుంది. మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామయ్య ఐదెకరాల్లో మామిడి పంటను సాగు చేశాడు. పదేళ్లపాటు కన్నబిడ్డల్లా పెంచాడు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన తోతాపురికి గిట్టుబాటు ధర వచ్చి తమకు రక్షణగా ఉంటుందని ఆశించారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. గుజ్జు పరిశ్రమలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేయడం.. దళారులు చెప్పిందే వేదంగా ఉండడంతో విసుగు చెందారు. ఎందుకొచ్చిన తంటలే అనుకుని తనకున్న ఐదెకరాల మామిడి తోటలో దాదాపు రెండు వందల తోతాపురి చెట్ల కొమ్మలను నరికేశాడు. ప్రత్యామ్నాయంగా దాని స్థానంలో వేరే రకాలను అంటు కట్టేందుకు సిద్ధపడ్డాడు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

'చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులు రోడ్డున పడ్డారు. గిట్టుబాటు ధర కల్పించకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. చేతికొచ్చిన పంట నోటికందకుండా రోడ్డుపాలు చేస్తున్నారు. ఇల్లూవాకిలి వదిలి పంటనెత్తుకుని జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద.. ర్యాంప్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇన్ని అవస్థలు పడుతున్నా సీఎం చంద్రబాబుకు కనిపించడం లేదు. గిట్టుబాటు ధర కల్పించి మామిడి రైతును ఆదుకోవాల్సింది పోయి వేధింపులకు దిగుతున్నారు. చెట్లు నరికివేస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుకుంటున్నారు. మామిడి రైతుకు అండగా నిలిచేందుకు నేనున్నానంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకొస్తున్నారు. ఈనెల 9న బంగారుపాళ్యానికి విచ్చేయనున్నారు. ఆయన పర్యటనను కలసి కట్టుగా విజయవంతం చేయాలి' అని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతిలో జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

నష్టాల్లో మామిడి రైతు

- మద్దతు ధర లేక రోడ్డు పాలుచేస్తున్న అన్నదాతలు
- వారికి అండగా నిలిచేందుకు ముందుకొస్తున్న మాజీ సీఎం వైఎస్.జగన్
- 9న బంగారుపాళ్యానికి రాక
- కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- పార్టీ శ్రేణులకు పెద్దిరెడ్డి, భూమన పిలుపు

మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటన సందర్భంగా హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మామిడి.. కుధరలేదా?

తిరుపతి మంగళం: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి మారుతీ నగర్‌లోని పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా లెక్కచేయకుండా ఈ నెల 9వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

మారానని చెప్పి ..
ధర పెంచకుండా మారాం చేస్తున్నారు!

ఆర్‌కే.రోజా మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పొగాకు, మిర్చి, మామిడి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రాకముందు తాను మారానని చెప్పి అధికారంలోకి వచ్చాక కుక్కతోకర వంకర లాగా బుద్ధి చూపుతారన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో మామిడి రైతులకు అండగా ఉండేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్నప్పుడే చంద్రబాబుకు రైతుల కష్టాలు గుర్తొస్తాయా? అని ప్రశ్నించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఏడాదిలో ఏదో పొడిచేసినట్లు కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈవీఎం మాయాజాలంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిందే తప్ప ప్రజల మద్దతుతో కాదన్నారు. ఈనెల 9వ తేదీన కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు పెట్టినా జగనన్న పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కే.రోజా, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూధన్‌రెడ్డి, వెంకటేగౌడ్, సునీల్ కుమార్, లలితకుమారి, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, నూకతోట రాజేష్, కృపాలక్ష్మి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కష్టాల్లో మామిడి రైతులు

మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు సొంత జిల్లాలో మామిడిని పండించే రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డు పక్కన పారబోస్తున్నారని చెప్పారు. ఇలాంటి కష్టాలు ఎల్లో మీడియాకు కనిపించవా? అని ప్రశ్నించారు. జగనన్న పాలనలోనే రైతు సంక్షేమమని గుర్తుచేశారు.

ఏ ప్రాంతానికెళ్లినా జన సునామీనే

భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జగన్‌మోహన్ రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్లినా అనూహ్యమైన జన స్పందన వస్తోందన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. మామిడి రైతులకు అండగా నిలిచేందుకు జగనన్న వెంట ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కూటమి కక్ష..మామిడి రైతుకు శిక్ష!

- గిట్టుబాటుగాని మామిడి చెట్లను తొలగిస్తున్న రైతులు
- చెట్లు తొలగించినందుకు జరిమానా తప్పదంటున్న అటవీశాఖ
- కూటమి నేతల ఒత్తిడితోనే ఇలా చేయిస్తున్నారని అనుమానం!

మామిడి చెట్లను జేసీబీతో తొలగిస్తున్న రైతు(ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: మామిడి రైతుపై కొందరు కూటమి నేతలు కక్షగట్టారు. మామిడి చెట్ల నరికివేతను సాకుచూపి వేధింపులకు గురిచేస్తున్నారు. అటవీశాఖ అధికారుల ద్వారా రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారు. వివరాలు.. చిత్తూరు మండలం, తుమ్మింద గ్రామానికి చెందిన మామిడి రైతు కుమార్ ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపారు. మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో తన భూమిలో పనస నాటుకోవాలని నిర్ణయించాడు. దీంతో బుధవారం కొన్ని మామిడి చెట్లను తొలగించారు. దీనిని సాకుగా చూపించి కొందరు కూటమి నేతలు అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ రైతుపై కేసు లేదా జరిమానా విధించేలా చర్యలు చేపట్టాలని హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో రంగలోకి దిగిన అటవీశాఖ అధికారులు పంటను పరిశీలించారు. ఆ తర్వాత రైతును కార్యాలయానికి పిలిపించి వాల్టా చట్టం ప్రకారం జరిమానా కట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. మళ్లీ శుక్రవారం కార్యాలయానికి రావాలని పంపిం చేశారు. ఇలా రైతును వేధించడంతో పాటు కార్యాలయానికి తిప్పించుకోవడంపై పలువురు మండిపడుతున్నారు. కూటమి నేతలు కక్ష పూరితంగానే ఇలా చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై రైతు సంఘ నేతలు, వివిధ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతులపై ఇలా ఆంక్షలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. చట్టంలో కూడా మామిడి పంటకు వెసులుబాటు ఉందని, ఇంత వరకు మామిడి రైతు చెట్టు నరికాడని కేసులు, జరిమానాలు విధించిన ఘటనలు లేవని పలువురు న్యాయవాదులు సైతం వివరిస్తున్నారు.

నా బిడ్డకు ప్రాణ భిక్ష పెట్టండి

- బోన్ క్యాన్సర్‌తో పోరాడుతున్న షాహిద్
- చిన్న వయసులోనే పెను విపత్తు
- దాతల చేయూత కోసం తల్లిదండ్రుల వేడుకోలు

కుమారుడు షాహిద్‌తో తల్లిదండ్రులు

చౌడేపల్లె: 'నాకు ఇద్దరు పిల్లలు. ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. కార్పెంటర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో నా కుమారుడు షాహిద్(16) 472 మార్కులు సాధించాడు. గత ఏడాది డిసెంబర్‌లో ఇంటి వద్ద పిల్లలతో కలిసి కబడ్డీ ఆడుతూ జారిపడ్డాడు. కుడి చెయ్యికి గాయమైంది. నొప్పి అధికం కావడంతో పుంగనూరు, మదనపల్లె, తిరుపతిలో చూపించాను. అయినా తగ్గలేదు. నొప్పి ఎక్కువ కావడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని కొలంబియా ఆస్పత్రికి తీసుకెళ్లాను. అక్కడి వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించారు. బోన్ క్యాన్సర్ ఉందని తేల్చారు. ఇప్పటికే అప్పూసప్పు చేసి రూ.3 లక్షలకు పైగా ఖర్చుచేశాను. ఇంకా రూ.5 లక్షలకు పైగా అవసరమవుతుందని వైద్యులు చెబుతున్నారు. అంత స్థోమత లేక.. ఏం చేయాలో దిక్కుతోచక అల్లాడిపోతున్నాను. బిడ్డను చూస్తే కళ్లల్లో నీళ్లు ఆగడం లేదు. కడుపు తరుక్కుపోతోంది. గుండె భారంగా మారుతోంది. బిడ్డను బతికించుకోవాలనే ఆరాటంతో కాళ్లూచేతులూ ఆడడం లేదు. దైవసమానులైన దాతలు ముందుకొచ్చి నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నాను' అని చౌడేపల్లి మండలం, గడ్డంవారిపల్లె రోడ్డు, జగనన్న కాలనీకి చెందిన షాజహాన్, నౌహీరా కోరుతున్నారు.

చేతులు కలపండి..
ప్రాణం పోయండి

షాజహాన్ (కెనరా బ్యాంకు) 31872200068371 సీఎన్ఆర్‌బి0013187)కు, ఫోన్‌పే 9705508805కు సహాయం చేయాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి చర్యలు

దివ్యాంగులకు ట్రై సైకిల్ అందజేస్తున్న కేంద్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

- ఉపకరణాల పంపిణీలో కేంద్ర మంత్రి రాందాస్ అతవాలే

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్నప్రతిభావంతుల శ్రేయస్సు, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత మంత్రి రాందాస్ అతవాలే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టాన్ని 27 డిసెంబర్ 2016లో అమలు చేసినట్టు వెల్లడించారు. ఈ చట్టంలో వైకల్య వర్గాలను 7 నుంచి 12కి పెంచామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు 3 నుంచి 4 శాతానికి పెంచినట్టు పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు 3 శాతం నుంచి 5 శాతానికి పెంచినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,314 ప్రభుత్వ భవనాలను దివ్యాంగుల కోసం సుగమ్య అభియాన్ పథకంలో నిర్మించినట్టు వెల్లడించారు. ఈ భవనాలకు రూ.563.85 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. మొత్తం 35 అంతర్జాతీయ, 55 దేశీయ విమానాశ్రయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. 709 రైల్వే స్టేషన్లు, 8,695 బస్సులు, 637 వెబ్‌సైట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. 8.34 లక్షల పాఠశాలల్లో ర్యాంప్‌లు, హ్యాండ్‌రైల్‌లు అందుబాటులో ఉండే మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏపీలో యాక్సెసిబుల్ ఇండియా ప్రచారం

ఆంధ్రప్రదేశ్‌లో యాక్సెసిబుల్ ఇండియా ప్రచారంలో 38 భవనాలకు రూ.29.60 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. విద్యా సాధికారత దిశగా స్కాలర్ షిప్ పథకంలో 2.81 లక్షల మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.921.50 కోట్లను మంజూరు చేశామన్నారు. స్కాలర్‌షిప్ నగదును నేరుగా అర్హులైన విద్యార్థుల ఖాతాలకు జమచేస్తున్నట్లు తెలిపారు. ఏపీలోని 7093 మంది దివ్యాంగులకు రూ.45.25 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. డీడీఎస్ పథకంలో 3.84 లక్షల మంది లబ్ధిదారులకు రూ.951.77 కోట్లకు పైగా ప్రయోజనం పొందారన్నారు. ఏపీలో రూ.193.92 కోట్లతో 60,488 మంది దివ్యాంగులకు ప్రయోజనం కలిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో ఏడీపీ, ఆర్‌వీవై పథకాల్లో నిర్వహించిన పరీక్ష శిబిరాల నుంచి మొత్తం 3,505 మంది లబ్ధిదారులను గుర్తించారన్నారు. వారందరికీ రూ.4.69 కోట్ల విలువైన 8,916 ఉపకరణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్, బీజేపీ నాయకులు చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, దివ్యాంగుల సంఘం నాయకులు మురళి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులు

మొగిలి ఘాట్‌లో మదపుటేనుగు

పలమనేరు: పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్‌లో జాతీయ రహదారిపైకి గురువారం రాత్రి మదపుటేనుగు వచ్చింది. ఈ ప్రాంతంలో తోతాపురి మామిడికి ధరలేక మార్కెట్‌కు తీసుకెళ్లిన కాయలు అమ్ముడుబోక పలువురు హైవే పక్కన పడేశారు. వాటిని తినేందుకు ఆ ఏనుగు వచ్చింది. ఆపై మామిడిని ఆరగించి అడవిలోకి వెళ్లినట్టు ఆ మార్గంలో ప్రయాణించిన వారు తెలిపారు.

హైవే పక్కన మామిడి కాయలు తింటున్న ఏనుగు

వెస్ట్ ఎఫ్ఆర్వోగా పట్టాభి

చిత్తూరు కార్పొరేషన్: అటవీశాఖ వెస్ట్ రేంజ్ ఎఫ్ఆర్వోగా పట్టాభి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎఫ్ఆర్వోగా ఉన్న బాలకృష్ణారెడ్డి పెనుగొండ సోషల్‌ఫారెస్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరులో ఎఫ్ఆర్వోగా ఉన్న పట్టాభి ఇక్కడికి వచ్చారు.

క్లుప్తంగా

సిద్ధమవుతున్న ఓఆర్ఎం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం)లో నూతన ఓఆర్ఎం(ఆయిల్ రీజనరేషన్ మిషన్) ఇన్‌స్టాలేషన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత ప్రభుత్వంలో రూ.50 లక్షల వ్యయంతో 2వేల లీటర్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్‌ను శుద్ధి చేసే మిషన్‌ను రేణిగుంటకు కేటాయించారు. అక్కడ ఎస్‌పీఎం మరమ్మతు పనులు జరుగుతుండడంతో వాటిని జిల్లాకు కేటాయించారు. రాయలసీమలోనే చిత్తూరులో మొదటి మిషన్‌ను పెట్టారు. కానీ దాదాపు 8 నెలలుగా ఇన్‌స్టాల్ చేయకుండా కాలయాపన చేశారు. వీటిని ఇన్‌స్టాల్ చేస్తే రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో బాగుచేసి పంపవచ్చు. కానీ ఎస్‌పీఎంలో నిరుయోగంగా వదిలివేయడంతో గతంలో 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. దీనిపై ఎట్టకేలకు స్పందించిన అధికారులు టెక్నీషియన్లను పిలిపించి ఇన్‌స్టాలేషన్ పనులు చేపట్టారు. పనులను టెక్నికల్ ఈఈ జగదీష్, ఎస్‌పీఎం డీఈ రవి, ఏఈ మోహన్‌శెట్టి పర్యవేక్షించారు. త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది.

ఉరి వేసుకుని మహిళ మృతి

పుంగనూరు(చౌడేపల్లె): మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ కథనం.. మండలంలోని పత్రపల్లెలో నివాసం ఉన్న శ్రీనివాసులు భార్య సరస్వతి(35) కుమార్తె ప్రేమలో పడి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైంది. సరస్వతి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

సమ్మెకు తాత్కాలిక బ్రేక్

రిలే దీక్షలు కొనసాగించనున్న స్విమ్స్ కార్మికులు

తిరుపతి తుడా : విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టిన స్విమ్స్ కార్మికుల దెబ్బకు అధికారులు దిగొచ్చారు. కార్మికులు సమ్మె చేస్తున్న ప్రాంతానికి గురువారం స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఏఎస్పీ మనోహరాచారి, ఆర్డీఓ రామ్మోహన్ చేరుకుని కార్మికుల డిమాండ్లు న్యాయ పరమైనవేనని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరవధిక సమ్మెను కార్మికులు తాత్కాలికంగా విరమించుకుని రిలే నిరాహార దీక్షను కొనసాగించనున్నట్లు ప్రకటించారు.

అత్తపై అల్లుడి దాడి

– అత్తకు తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్ : అల్లుడు మరో మహిళతో వివాహేతర సంబంధం గురించి అత్త ప్రశ్నించిదనే కోపంతో అత్తపై అల్లుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేట అరుంధతీ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. అగ్రహారపేటకు చెందిన మహేశ్వరి, ఆమె కుమార్తె మునికుమారిని తాళ్లురు రవీంద్రనాథ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే రవీంద్రనాథ్ మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలుసుకుని అల్లుడిని అత్త నిలదీసింది. దీంతో అత్తపై కోపంతో బుధవారం రాత్రి అగ్రహారపేటలో అత్త మహేశ్వరి ఇంటి వద్దకు వచ్చి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమెను తిరుపతి వైద్యశాలకు తరలించారు. బాధితురాలి భర్త మునీంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబి తెలిపారు.

రేణిగుంట బీసీ హాస్టల్‌లో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

అనారోగ్య వసతి

ప్రభుత్వ వసతి గృహ నిర్వాహకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాసిరకమైన వంటలు, అపరిశుభ్రమైన పరిసరాలు, పర్యవేక్షణ లేని అధికారుల తీరుతో వసతి గృహాల నిర్వహణ గాడితప్పింది. ప్రశ్నించే వారు లేరనే నిర్లక్ష్యంతో కొంత మంది నిర్వాహకులు కాసులకు కక్కుర్తిపడి విద్యార్థులను అర్ధాకలికి గురిచేస్తూ క్షోభ పెడుతున్నారు. వండిపెట్టే ఆహారం కూడా తరచూ కలుషితం కావడంతో విద్యార్థులు ఆస్పతుల పాలవుతున్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపంలా మారింది.

పేద విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపం

- సంక్షేమ వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజనింగ్
- నాసిరకం వంటకాలే కారణమా?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

ఏర్పేడు : ''ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న పేద విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపంగా మారింది. విద్యార్థులు తినే ఆహారంలో నాసిరకమైన వంట సరుకులు వాడుతుండ టంతో పాటు అపరిశుభ్రమైన పరిసరాలతో తరచూ విద్యార్థు లు విషాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతు న్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సంక్షేమ వసతి గృహాధికారులు పేద పిల్లలపై సవతి తల్లి ప్రేమ చూపు తూ వారికి ప్రభుత్వం ఇచ్చే నిధులను దిగమింగుతున్నారన్న విమర్శలకు ఈ ఘటనలు బలం చేకూరుస్తున్నాయి.''

శ్రీకాళహస్తి పట్టణంలో గతనెల 24వ తేదీన బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పులిసిన ఇడ్లీ పెట్టడంతో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. తాజాగా గురువారం శ్రీకాళహస్తి బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఉదయం పెట్టిన ఉప్మాలో జెర్రి ప్రత్యక్షం కావడంతో ముగ్గురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో 8 హాస్టళ్లు ఉన్నాయి. రెండు గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఇందులో సుమారు 2 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలు హాస్టళ్లకు వెళ్లి దత్తత తీసుకుని బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎప్పుడూ జరగని అభివృద్ధి చేస్తామని, హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు అధునాతన హంగులతో కూడిన వసతులను అందించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షణ ఉంటుందని డబ్బాలు కొట్టుకున్నారు. అయితే ఒకటి, రెండు హాస్టళ్ల గోడలకు సున్నం కొట్టించి అభివృద్ధి ప్రారంభమైందని సోషల్ మీడియాలో ఆర్భాటంగా ప్రచారం చేశారు.

పర్యవేక్షణ లోపించి..

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లలో విద్యార్థుల బాగోగులు చూసుకునే వార్డెన్ల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదు. హాస్టల్ , వంట గది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనికి తోడు మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయకుండా కొందరు వార్డెన్లు విద్యార్థుల మెతుకుల్లో కక్కుర్తి చూపుతూ విద్యార్థులను తరచూ అర్ధాకలికి గురి చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఏడాది కిందట రేణిగుంట బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రైవేటు ఫంక్షన్‌లో మిగిలిపోయిన అన్నం తీసుకొచ్చి పెట్టడంతో వాంతులు, విరేచనాలతో అప్పట్లో 20 మంది విద్యార్థులు ఆస్పత్రికి చేరారు. విద్యార్థులు తాగే నీటి తొట్లు పాచిపట్టి ఉన్నట్లు గుర్తించి అప్పట్లో ఉన్నతాధికారులు వార్డెన్ నిర్లక్ష్యంపై తీవ్రంగా మందలించారు. ఎప్పుడైన ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు మినహా మిగిలిన సమయాల్లో ఉన్నతాధికారులు హాస్టళ్ల పనితీరుపై తనిఖీలు చేయకపోవడంతో విద్యార్థులు సమస్యల లోగిళ్లలో చదువు బండి లాగుతున్నారు.

చికిత్స పొందుతున్న హాస్టల్ విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

వార్డెన్ సస్పెన్షన్

– ఇన్‌ఛార్జిగా విజయ

శ్రీకాళహస్తి : బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీలక్ష్మిని సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జిగా విజయను నియమించారు. వంటమనిషి అంకమ్మను విధులు నుంచి తొలగిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు.

వసతిగృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జగనన్న పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి కరికులం అందించి వారి ఉన్నతికి బాటలు వేసేలా విప్లవాత్మకమైన పథకాలను విద్యారంగంలో అమలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తోంది. హాస్టళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకమైన భోజనం అందిస్తున్నారు. సరుకులు నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారు. దీంతోనే మొన్న సాక్షాత్తూ రాష్ట్ర హోం మంత్రి అనిత బీసీ హాస్టల్‌లో విద్యార్థులతోపాటు తినేందుకు కూర్చుంటే ఆమెకు పెట్టిన ఆహారంలోనే బొద్దింక కనిపించడం రాష్ట్ర మంతా చూశారు. ఇక్కడ వరుసగా హాస్టళ్లలో విద్యార్థులు విషాహారం తిని ఆస్పత్రులపాలవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దాలి.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

హాస్టళ్లలో సిబ్బంది నిర్లక్ష్యమే

హాస్టళ్లలో తరచూ విద్యార్థులు విషాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతుండడం దురదృష్టకరం. చాలా హాస్టళ్లలో వంట సిబ్బంది కొరత ఉంది. ఉన్నచోట వారు రాకుండా సహాయకులను పెట్టుకుని జీతాలు తీసుకుంటున్నారు. దీంతోనే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదు. శ్రీకాళహస్తిలో హాస్టళ్లలో జరుగుతున్న వరుస ఘటనలపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు సరైన మౌలిక వసతులను కల్పించాలి.

– చంద్రశేఖర్, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్, శ్రీకాళహస్తి

రేషన్ బియ్యం పట్టివేత

– 20 టన్నుల బియ్యం స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నాయుడుపేటటౌన్ : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని గురువారం నాయుడుపేట అర్బన్ సీఐ బాబి సిబ్బందితో తనిఖీ చేపట్టి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. శ్రీకాళహస్తి నుంచి లారీలో అక్రమంగా రేషన్ తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ బాబి , సిబ్బందితో పట్టణ పరిధిలోని జాతీయ రహదారి కూడలిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బియ్యం బస్తాల లోడుతో వస్తున్న లారీని నిలిపి పరిశీలన చేశారు. లారీలో రేషన్ బియ్యం బస్తాలు ఉండడాన్ని సీఐ గుర్తించి బియ్యంతో పాటు లారీను స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ వేనాటి గజేంద్రను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. అలాగే దిలీప్‌రెడ్డి అనే వ్యక్తి రేషన్ బియ్యం తరలింపులో ప్రధాన సూత్రదారిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. పోలీసులు పట్టుకున్న బియ్యం లారీలో రేషన్ బియ్యం ప్రభుత్వం సరఫరా చేసే బస్తాలలోనే ఉండడంతో వాటిని రేషన్ షాపులు, లేదా నేరుగా గోదాముల నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న లారీ డ్రైవర్‌తో పాటు దిలీప్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు పట్టుకున్న 400 బస్తాల (20 టన్నులు) రేషన్ బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులకు అప్పగించడంతో వాటిని స్థానిక సివిల్ సప్లయి గోదాములో భద్రపరిచారు.

మెటీరియల్ సైన్స్ అనుసంధానంతో మార్పు

– తిరుపతి ఐఐటీలో ప్రారంభమైన 3వ అంతర్జాతీయ సమావేశం

ఏర్పేడు : మెటీరియల్ సైన్స్ అను సంధానంతో నిర్మాణ రంగంలో సుస్థిర మార్పు చోటు చేసుకుంటుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలోని లెక్చరర్ హాల్‌లో గురువారం ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణ సామగ్రి- నిర్మాణ రంగం-2025పై 3వ అంతర్జాతీయ సమావేశం ప్రారంభమైంది. దేశ, విదేశాల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని నిర్మాణ రంగంలో సాంకేతిక మేళ వింపుపై ప్రసంగించారు. వర్జీనియా టెక్ (యుఎస్ఎ), క్వీన్స్ యూనివర్సిటీ బెల్ఫాస్ట్ (యుకె), మోనాష్ యూనివర్సిటీ మలేషియా, ఐఐటీ బాంబే, ఎన్ఐటీ కాలికట్ వంటి ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. జాతీయ మౌలిక సదుపాయాల సవాళ్లను పరిష్కరించడంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం కీలక పాత్రను పోషిస్తోందన్నారు. డాక్టర్ బిజిలీ బాలకృష్ణన్, డాక్టర్ అలెగ్జాండర్ బ్రాండ్, డాక్టర్ నారాయణ్ నీతలత్, డాక్టర్ వెంకటేష్ కోడూర్, డాక్టర్ మైక్ ష్లైచ్, డాక్టర్ కె.వి.ఎల్. సుబ్రమణ్యం వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన నిపుణుల ప్రసంగిస్తూ నిర్మాణ శాస్త్రం పురోగతిని గురించి వివరించారు. సమావేశంలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సురేష్‌జైన్, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు

బాలిక మృతితో అప్రమత్తం

చంద్రగిరి : ఇందిరమ్మ కాలనీ సమీపంలోని బాలిక (16) విష జ్వరంతో బుధవారం మృతి చెందడంపై గురువారం వైద్యాధికారులు స్పందించారు. ఇందిరమ్మ కాలనీలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ ఫీవర్ సర్వేను చేపట్టారు. అదే విధంగా ప్రతి ఇంటి వద్ద యాంటి లార్వా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతానికి ఇందిరమ్మ కాలనీలో ఎవరికి ఎలాంటి జ్వరాలు లేవని వైద్యాధికారులు నిర్ధారించారన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని కాచి, చల్లార్చి తాగాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, దోమ తెరలను వినియోగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, వేడి ఆహారం, మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్

నేడు ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ఈఏపీసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియకు సాంకేతిక విద్యాశాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. దీంతో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాల కోసం సుదీర్ఘకాలం వేచి చూసిన విద్యార్థులకు కాస్త ఊరట లభించింది. విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపునకు అవకాశం ఇస్తూ 18 వరకు వెబ్ ఆప్షన్లకు ఎంట్రీకి అవకాశం కల్పించనున్నారు. 22న సీట్ల కేటాయింపు జాబితాను విడుదల చేయనున్నారు. 23 నుంచి 26వ తేదీ వరకు సీట్లు కేటాయించిన కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగష్టు 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. మే 21 నుంచి 27 వరకు ఈఏపీసెట్ (ఎంసెట్) పరీక్షలు నిర్వహించగా జూన్ 8న ఫలితాలు విడుదలయ్యాయి.

అందని పాఠ్య పుస్తకాలు

- టీటీడీ పాఠశాలల్లోనూ విద్యార్థుల అవస్థలు
- పుస్తకాలు లేక నామమాత్రంగా విద్యాబోధన

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని టీటీడీ పాఠశాలలు జూన్ 12వ తేదీన పునఃప్రారంభమయ్యాయి. అయితే ఎయిడెడ్ మినహాయించి అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు నేటి వరకు పాఠ్యపుస్తకాలను అందించలేదు. దీంతో విద్యార్థులకు నామమాత్రంగా విద్యాబోధన అందుతోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ టీటీడీ విద్యాశాఖ స్పందించకపోవడం గమనార్హం. ప్రతిష్టాత్మకమైన టీటీడీ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించడం అంటే సాక్షాత్తు కలియుగ దైవమైన శ్రీవారి సన్నిధిలో ఉన్నట్టుగా భావిస్తుంటారు. టీటీడీ విద్యాసంస్థల్లో చదువుకోవడం పూర్వజన్మ సుకృతమని సంతోష పడుతుంటారు. ఈ భావనతోనే తమ పిల్లలను టీటీడీ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపుతుంటారు. దీంతో టీటీడీ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ నెలకొంది. తిరుపతిలో టీటీడీకి సంబంధించి 7 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2,600 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో మూడు పాఠశాలలు (హైస్కూల్) మాత్రమే ప్రభుత్వ గుర్తింపు (ఎయిడెడ్) కలిగి ఉన్నాయి. ఈ హైస్కూళ్లకు ప్రభుత్వం అందించే స్టూడెంట్ కిట్లు అందాయి. మిగిలిన నాలుగు ఉన్నత పాఠశాలలు, వాటిలోనే ఉన్న 7ప్రాథమిక పాఠశాలలకు పుస్తకాలు నేటికీ అందలేదు. దీంతో ఇక్కడ చదివే విద్యార్థులు పాఠ్యపుస్తకాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వం టీటీడీ పాఠశాలలన్నింటికీ పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎయిడెడ్‌కు మాత్రమే పాఠ్యపుస్తకాలు అందించి చేతులు దులుపుకుంది. ఇటు కూటమి ప్రభుత్వం, అటు టీటీడీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం ఏమిటో అర్థం కాలేదని తల్లిదండ్రులు అయోమయ స్థితిని ఎదుర్కొంటున్నారు. వెంటనే టీటీడీ యాజమాన్యం స్పందించి పాఠ్యపుస్తకాలను అందించాలని కోరుతున్నారు.

ఎయిడెడ్‌కు అందించాం

నిబంధనల మేరకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన టీటీడీ ఉన్నత పాఠశాలలకు పాఠశాల తెరిచే నాటికే పాఠ్యపుస్తకాలను అందించాం. అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు టీటీడీ యాజమాన్యమే పాఠ్యపుస్తకాలను అందించాల్సి ఉంది.

–కేవీఎన్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), తిరుపతి

త్వరలోనే అందిస్తాం

టీటీడీ పాఠశాలలకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తుందని అనుకున్నాం. అయితే పాఠ్యపుస్తకాలను టీటీడీ కొనుగోలు చేసి పిల్లలకు అందించాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. దీంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించడంలో జాప్యం నెలకొంది. త్వరలోనే అందిస్తాం.

– వెంకట సునీల్, టీటీడీ విద్యాశాఖాధికారి, తిరుపతి

ఘనంగా ఐసీఎస్ఐ స్నాతకోత్సవం

తిరుపతి సిటీ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) స్నాతకోత్సం పద్మావతి మహిళా వర్సిటీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థలో కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పట్టాలను అతిథులు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కంపెనీ కార్యదర్శులుగా బహుముఖ పాత్రలు పోషించి దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఆర్థిక స్థితిని మదింపు చేసే కీలక బాధ్యతలు చేపట్టే ప్రధానమైన కోర్సును పూర్తి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ఉపాధ్యక్షులు పవన్ జి చందక్, కౌన్సిల్ సభ్యుడు సీఎస్ మోహన్ కుమార్, సీఎస్ వెంకటరమణ, ఐసీఎస్ఐ ఎస్ఐఆర్‌సి చైర్మన్ సీఎస్ మధుసూధనన్, ప్రీతి కౌశిక్ బెనర్జీ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా చర్యలు

బాలాజీ నగర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీలు చేపట్టారు. గురువారం సాయంత్రం తిరుమల పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ షాపింగ్ కాంప్లెక్స్ లేపాక్షి ఏరియా బాలాజీనగర్, కల్యాణకట్ట, అఖిలాండం, పీఏసీ-1, సీఆర్వో కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్లో బాంబ్ స్క్వాడ్‌తో ప్రత్యేకంగా తనిఖీలు జరిపారు. కార్యక్రమంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ డీఎస్పీ విజయ్ శేఖర్, సీఐలు విజయ్ కుమార్, శ్రీరాముడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..: వృద్ధుడి మృతి

మృతి చెందిన చెంచయ్య

గూడూరు రూరల్ : ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని విందూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు విందూరు ఎస్టీ కాలనీకి చెందిన చిల్లకూరు చెంచయ్య(69) సైదాపురం మండలం జోగిపల్లిలో పీర్ల ఉత్సవానికి మేళం వాయించేందుకు మరో నలుగురితో కలసి ఆటోలో బయలుదేరాడు. గ్రామ సమీపంలోని చర్చి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చెంచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గూడూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తపాలా బీమా ఏజెంట్ల ఉద్యోగాలకు అవకాశం

తిరుపతి సిటీ : తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సంస్థలో ఏజెంట్లుగా పనిచేసేందుకు ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తిరుపతి డివిజన్ తపాలా సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలియజేశారు. ఎంపికైన ఏజెంట్లకు ఆకర్షణీయమైన ఆర్థిక భరోసాతో పాటు ఇన్సెంటీవ్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయంలోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫీసులో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌ను 93907 36277 నంబర్ నందు సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల గడువును జులై నెలాఖరు వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఇంటర్ బోర్డు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,323 మంది, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 364 మంది ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ ఇది వరకు జూన్ 30వ తేదీ వరకున్న అడ్మిషన్ల గడువును పొడిగించారని, ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐఓ కోరారు.

ఐఐహెచ్‌టీ స్పాట్ అడ్మిషన్లు

వెంకటగిరి రూరల్:పట్టణంలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమో కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఓఎస్‌డీ గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. పదో తరగతిలో మార్కుల ప్రాతిపదికన సీట్లు కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 98661 69908, 90102 43054 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

- 10th Pass / Inter Fail అయిన విద్యార్థులు Nursing, MLT (Lab Technician) కోర్సులు చేసుకునే అవకాశం. సంప్రదించండి: 82474 57565.

Real Estate

PLOTS FOR SALE

- గేటెడ్ కమ్యూనిటీ తుడా అప్రూవల్ ప్లాట్లు ధర 3,50,000/- నుండి ప్రారంభం. సంప్రదించండి సెల్: 8333873430, 8297001234.
- నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే. సంప్రదించండి సెల్: 9502774175, 7995992114.
- అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సెల్: 9114561456.
- తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. సెల్: 95154 83527.

Wanted

- ప్రముఖ మ్యాట్రిమోనీ ఆఫీసుకు ఏదైనా Job లో 2 సం. అనుభవం గల స్త్రీలు , PRO & Tele Callers కావలెను. Quali: Any డిగ్రీ, Sal: 20 to 25K, Age: 35+, తిరుపతి, Contact Cell: 80193 05930.
- చిత్తూరు, తిరుపతి హెల్త్ ఇన్సూరెన్సులో జాబ్ చేయుటకు రిసెప్షనిస్ట్ అర్జెంట్‌గా కావలెను. అ: ఇంటర్, డిగ్రీ సెల్: 9640507055
- నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీ లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 20 to 25K. Q: Inter పైన, Age: 25 to 40Y. ఆసక్తిగల అభ్యర్థులు సంప్ర. సెల్: 91828 98446
- Wanted Civil Engineers to work at a well Reputed company in Tirupati Qual: Diploma/B.Tech/QC Engineer Min 2 yrs exp. Sal: 15K - 20K. Cont: 9542332862, 8985323604
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999
- Wanted Pre Primay , Primary & High School Teachers for a reputed School in Mangalam, Tirupati, Contact Cell: 81794 67247.
- Wanted for primary Teachers (Subject: English), depends upon skilss, Salary: Above 25K, Contact Cell: 7731809480
- ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర।। 99084 29239
- గూడూరు Phone Pay Company నందు పని చేయుటకు యువకులు కావలయును. అర్హత: 10th, శాలరి: 18,000/-, సంప్రదించండి సెల్: 9849141777.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 4 | జూలై | 2025

నేడే పట్టాభిషేకం

బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివిన వారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకి నాడ వేదిక అవుతోంది.

8 లో

నిలువ నీడేదీ!

అన్నవరం సత్యదేవుని ఆలయంలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి దాత ముందుకు వచ్చినా, అధికారులు నిర్ణయం తీసుకోవడం లేదు

కడలిలోకి 99,689 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 99,689 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి డెల్టా కాలువలకు 12,150 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రేషన్‌షాపులకు చేరని బియ్యం

అయినవిల్లిలో తాళాలు వేసి ఉన్న రేషన్ షాపు

అయినవిల్లి: ప్రతి నెలా ఒకటో తేదీనే రేషన్ బియ్యం లబ్ధిదారులకు చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల రేషన్ బియ్యం వ్యాన్‌ల ద్వారా రేషన్ బియ్యం ఇవ్వడం నిలిపేసి పాత విధానంలో డీలర్ల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వడం ప్రారంభించారు. ఈ నెల మూడోవ తేదీ దాటినా అయినవిల్లి మండలంలోని చాలా వరకూ షాపులకు రేషన్ బియ్యం దిగుమతి కాలేదు. దీంతో రేషన్‌షాపు యజమానులు చేసేది లేక లబ్ధిదారులను వెనుకకు తిరిగి పంపిస్తున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఒకటో తేదీనే రేషన్ బియ్యం ఇంటికి వచ్చేవని, కూటమి ప్రభుత్వం విధానం మార్చడంతో ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ షాపులకు వెళ్లి అక్కడ తలుపులకు తాళాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పలువురు రెవెన్యూ అధికారులకు పరిస్థితి వివరించారు. మండలంలోని 41 రేషన్ షాపులు ఉండగా 30 శాతం షాపులకు మాత్రమే రేషన్ బియ్యం సరఫరా చేసినట్లు చెబుతున్నారు. గోడౌన్‌లో బియ్య సరఫరా లేకపోవడంతో ఆలస్యం అయిన మాటా వాస్తవమేనని, స్టాకు రాగానే మిగిలిన 70శాతం షాపులకు బియ్యం సరఫరా చేస్తామన్నారు.

జగన్‌ను కలిసిన శిరీష్

తన తండ్రి ఫొటోపై జగన్ సంతకం చేస్తున్నప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్న శిరీష్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శిరీష్ తండ్రి దివంగత మిండగుదటి మోహన్ పార్టీ జిల్లా నేతగా ఆది నుంచి కరోనా వరకూ సేవలు అందించారు. అప్పట్లో జగన్‌ను కలిసినప్పుడు తీసిన ఫొటోను చూపించారు. అప్పుడు జగన్ ఆ ఫొటోపై తన ఆటోగ్రాఫ్ ఇచ్చారని శిరీష్ చెప్పారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

క్యూఆర్ కోడ్ పత్రాలను పరిశీలకులకు అందజేస్తున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడుగురు పరిశీలకులను నియమించినట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి గురువారం తెలిపారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని జగ్గిరెడ్డి స్వగృహంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన పరిశీలకుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఉన్న క్యూఆర్ కోడ్ ప్రతాలను వారికి అందజేశారు. వాటితో చంద్రబాబు ఇచ్చిన మోసపు హామీలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక పరిశీలకులను నియమించి వారి విధివిధానాలను క్లుప్తంగా వివరించారు. మండపేట నియోజకవర్గానికి పరిశీలకులుగా కటకంశెట్టి ఆదిత్య, రామచంద్రపురం – కుడిపూడి శ్రీనివాసరావు, ముమ్మిడివరం – మాత మురళి, అమలాపురం – పేరి శ్రీనివాస కామేశ్వరరావు, పి.గన్నవరం – పెన్మత్స చిన్న భద్రరాజు, రాజోలు– వంటెద్దు వెంకన్ననాయుడు, కొత్తపేట – సిరిపురపు శ్రీనివాసరావును నియమించినట్టు తెలిపారు.

ధనిక, పేద తారతమ్యం తగ్గాలి

అమలాపురం రూరల్: ప్రైవేట్ పీపుల్స్ ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారా ధనిక, పేదల మధ్య తారతమ్యం తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. వివిధ జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జేసీ టీ. నిశాంతి, డీఆర్‌ఓ రాజకుమారి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గత ఏడాది ఫిబ్రవరి నెలలో మలికిపురంలో రైల్వేలైన్‌కు భూసేకరణ సర్వే చేస్తున్న అధికారులు

రెండవ అలైన్‌మెంట్ కోసం జరుగుతున్న సర్వేలో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న జేసీ టి.నిశాంతి (ఫైల్)

కోనసీమ రైలుకు పచ్చజెండా

కోనసీమ రైల్వేలైన్ ప్రాజెక్టుకు చిక్కుముళ్లు వీడుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు సంబంధించి వేసిన కేసుల విషయంలో హైకోర్టు ఉదారంగా స్పందించింది. కొత్త, పాత అలైన్‌మెంట్‌కు సంబంధించి భూసేకరణ, సర్వేల విషయంలో ఉన్న స్టే లను ఎత్తివేసింది. దీంతో సర్వే పనులు వేగంగా జరుగనున్నాయి. మూడు నదీపాయలపై నిర్మించాల్సిన వంతెనలకు సంబంధించి పిల్లర్లు పూర్తి కాగా, రైల్వేలైన్ ఏర్పాటుకు భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు నిర్మాణం వేగం పుంజుకోనుంది.

- భూసేకరణకు వీడిన ఆటంకాలు
- కొత్త అలైన్‌మెంట్ సర్వేకు లైన్ క్లియర్ చేసిన హైకోర్టు
- సర్వేకు నిధులు కేటాయించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- అప్పుడే మలికిపురం.. అమలాపురం మండలాల్లో మొదలైన సర్వే
- ప్రతి ఏటా నిధులు సాధించిన జగన్ సర్కారు

గౌతమీ నదిపై పూర్తయిన పిల్లర్లు

సాక్షి, అమలాపురం: కోనసీమ రైల్వేకు ఉన్న ప్రధాన అడ్డంకి వీడింది. రైల్వేలైన్ భూసేకరణ, రీ అలైన్‌మెంట్ సర్వేల విషయంలో గతంలో విధించిన స్టేని హైకోర్టు ధర్మాసనం బుధవారం ఎత్తివేసింది. దీంతో సర్వే పనులు తిరిగి వేగం అందుకోనున్నాయి. రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి కొత్త ఆలైన్‌మెంట్ వల్ల భూములు కోల్పోతున్న వారు కోర్టును ఆశ్రయించారు. శానపల్లిలంక నుంచి అమలాపురం భట్నవిల్లి వరకు 20 ఏళ్ల క్రితం భూములు ఇచ్చిన వారు తమకు పరిహారం విషయంలో అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించారు. ఈ రెండు విషయాలపై గతంలో కోర్టు స్టే ఇచ్చింది. ఇప్పుడు వాటిని ఎత్తి వేయడంతో సర్వే పనులు జోరందుకోనున్నాయి.

కోనసీమ రైల్వేలైన్ నిర్మాణ పనులకు 2000లో శంకుస్థాపన జరిగింది. 2001లో తొలి అలైన్‌మెంట్ వచ్చింది. కాకినాడ నుంచి కోటిపల్లి, అమలాపురం, రాజోలు, సిద్ధాంతం మీదుగా నర్సాపురం వరకు ఈ రైల్వేలైన్ నిర్మాణం చేయాలని నాటి వాజ్‌పేయి సర్కార్ నిర్ణయించింది. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు పూర్తయిన రైల్వేలైన్ అక్కడ నుంచి నర్సాపురం వరకు రెండు దశాబ్దాలు అవుతున్నా ముందుకు సాగడం లేదు. ప్రాజెక్టు పనులు 2016 నుంచి తిరిగి ఊపందుకున్నాయి. గోదావరి మూడు నదీపాయలపై నిర్మించే వంతెనలకు సంబంధించి పిల్లర్ల పనులు పూర్తయ్యాయి. గౌతమీపై కోటిపల్లి– శానపల్లిలంకల మధ్య నిర్మిస్తున్న వంతెనకు గెడ్డర్లు, ఇతర ట్రాక్‌కు సంబంధించి టెండర్లు ఖరారై పనులు జరుగుతున్నాయి.

రైల్వేలైన్ మొత్తం పొడవు 102.507 కిమీలు. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు 45.30 కిమీల నిర్మాణం పూర్తికాగా, కోటిపల్లి నుంచి నర్సాపురం వరకు 57.207 కిమీల వరకు నిర్మించాల్సి ఉంది. కోటిపల్లి నుంచి అమలాపురం శివారు భట్నవిల్లి వరకు 12.05 కిమీల వరకు గతంలో భూసేకరణ సైతం పూర్తయ్యింది. అమలాపురం నుంచి నర్సాపురం వరకు 45.157 కిమీల వరకు నిర్మించాల్సిన రైల్వేలైన్‌కు భూసేకరణ పెండింగ్‌లో ఉంది. దీనిలో వైనతేయ, వశిష్ఠలపై వంతెన నిర్మాణాలకు భూసేకరణ జరిగింది. మిగిలిన రైల్వే ట్రాక్‌కు, స్టేషన్ల నిర్మాణాలకు భూమి సేకరించాల్సి ఉంది.

భూసేకరణకు నిధులిచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రైల్వే ప్రాజెక్టు భూసేకరణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. సుమారు 600 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అంచనా. నిధులు మంజూరు కావడంతో అప్పట్లోనే జిల్లా యంత్రాంగం అమలాపురం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో రైల్వేలైన్‌కు అవసరమైన భూమి గుర్తించేందుకు సర్వే చేపట్టింది. రైల్వేశాఖతోపాటు రెవెన్యూ అధికారులు కూడా ఈ సర్వేలో పాల్గొన్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2020–21 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.1,490 కోట్లు కేటాయించారు. అంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి సగటున రూ.300 కోట్లు కేటాయించినట్టు. గత టీడీపీ పాలనలో 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2019–20 వరకు రూ.1,035 కోట్లు అంటే సగటున రూ.207 కోట్ల చొప్పున కేటాయించడం విశేషం.

టీడీపీ సర్కారుకు ముందు చూపు లేక

- తొలుత ఈ రైల్వేలైన్‌కు అమలాపురం భట్లపాలెం వద్ద రైల్వేస్టేషన్ రావాల్సి ఉంది. యూపీఏ ప్రభుత్వం హయాంలో రైల్వేస్టేషన్‌కు శంకుస్థాపన కూడా జరిగింది. అక్కడ నుంచి భైరాజు ఫౌండేషన్ భవనం మీదుగా కామనగరువు, రోళ్లపాలెం, పేరూరు పేరమ్మ అగ్రహారం మీదుగా బోడసుకుర్రు చేరాల్సి ఉంది. ఇప్పుడున్న జాతీయ రహదారి 216 బైపాస్‌కు, అమలాపురం పట్టణం మధ్య నుంచి ఈ లైన్ వెళ్లాల్సి ఉంది.
- 2014–19 మధ్యలో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రైల్వేలైన్‌కు ఇబ్బంది ఏర్పడుతోందనే ముందు చూపు లేకుండా 216 బైపాస్ నిర్మాణం చేశారు. దీంతో పాత రెల్వే ఆలైన్‌మెంట్ ప్రకారం ట్రాక్ నిర్మాణం చేస్తే పలుచోట్ల బైపాస్ రోడ్డును ఆనుకుని వెళుతోంది. దీనివల్ల రైల్వే లైన్ నిర్మాణం సాధ్యం కాదు. పైగా బైపాస్ నుంచి ఎక్కడ రోడ్డు దిగినా రైల్వే ట్రాక్ దాటుకుని పట్టణంలోకి రావాల్సి ఉన్నందున రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయి.
- ఇబ్బందులు గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భట్నవిల్లి సమీపంలో బైపాస్ మొదలయ్యే ప్రాంతం కన్నా ముందు నుంచే రైల్వే లైన్ వెళ్లేలా చూడాలని నిర్ణయించింది. దీని ప్రకారం రైల్వేట్రాక్ నిర్మాణం జరిగేలా భూసేకరణకు ప్రతిపాదించింది. రైల్వేలైన్ భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు, పేరూరుపేట మీదుగా బోడసకుర్రు వెళ్లనుంది.
- దీనివల్ల కేవలం రెండుచోట్ల జాతీయ రహదారి 216 దాటాల్సి వస్తుంది. ఈ ఆలైన్‌మెంట్‌కు సంబంధించి అధికారులు సర్వే చేపట్టారు. సర్వే పనులు వేగంగా జరిగాయి. కొత్త ఆలైన్‌మెంట్‌లో అడ్డుగా వచ్చే రోడ్లు, పంట కాలువలు, విద్యుత్ లైన్‌లు, స్తంభాలు, ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల పైప్‌లైన్‌లు, నివాస గృహాలు, ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటి పథకం పైప్‌లైన్‌లను ఈ సర్వేలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణకు రాజోలు దీవిలో సర్వే వేగంగా చేశారు.

గురుకుల పాఠశాలలో ఉడకని అన్నం

– ఎస్సీ హాస్టల్లో రుచిలేని భోజనాలు

అమలాపురం రూరల్: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్, లక్ష్మిరెడ్డి బుధవారం రాత్రి అమలాపురం రూరల్ మండలం సమనస గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనాలు పెట్టే సమయంలో తనిఖీ చేయడంతో విస్తుబోయే నిజాలు వెలుగు చూశాయి. ఉడకని అన్నం విద్యార్థులకు పెట్టడాన్ని ఫుడ్ కమిషన్ సభ్యులు గుర్తించారు. విద్యార్థులు తినకుండా వదిలి వేయడంతో ఆరా తీసి ప్రశ్నించారు. దాంతో పలు లోపాలు ఉన్నట్లు ఫుడ్ కమిషన్ సభ్యులు గుర్తించారు. అనంతరం కామనగరువు బీవీ రమణయ్య కాలనీలో గల ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాన్ని ఫుడ్ కమిషన్ సభ్యుల బృందం తనిఖీ చేసింది. గురుకుల పాఠశాలలో గుర్తించిన లోపాల కంటే మరింతగా అక్కడ సమస్యలు ఉన్నట్లు ఫుడ్ కమిషన్ సభ్యులు గుర్తించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుంటే ఎస్సీ హాస్టల్లో మాత్రం గతంలో ఇచ్చిన బియ్యాన్ని వండి విద్యార్థులకు పెడుతున్నారు. అంతేకాకుండా వండిన కూరల్లో రుచి కనిపించలేదు. ఆ రుచి లేని ఆహారాన్ని విద్యార్థులకు పెట్టడం వల్ల పలువురు విద్యార్థులు భోజనాలు చేయనట్లుగా తనిఖీల్లో తేలింది. దాంతో ఫుడ్ కమిషన్ సభ్యులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఉపాధ్యాయులు, వార్డన్లపై చర్యలకు ఆదేశించారు.

సమనస గురుకుల పాఠశాలలో భోజనాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యులు

రామలక్ష్మిని రప్పించేందుకు ఏర్పాట్లు

అమలాపురం రూరల్: మస్కట్‌లో చిక్కుకున్న అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన సవరపు రామలక్ష్మిని స్వదేశానికి తీసుకురావాలన్న విన్నపంపై కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు స్పందించారు. విలసకు చెందిన రామలక్ష్మి మస్కట్లో చిక్కుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తనను రక్షించి స్వదేశానికి తీసుకు రావాలంటూ విలపిస్తూ ఓ వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ ఏజెంట్ ఈ ఏడాది మార్చి నెలలో ఉపాధి నిమిత్తం ఆమెను మస్కట్ పంపాడు. అక్కడ ఉద్యోగంలో చేరిన ప్పటి నుంచి ఇంటి యజమానులు తిండి సక్రమంగా పెట్టకుండా చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు వాపోయింది. మస్కట్లో రామలక్ష్మి అక్కడి భారత రాయబార కార్యాలయం వద్దకు వెళ్లినా ఎవరూ స్పందించలేదని, అధికారులు ప్రజాప్రతినిధులు తనను రక్షించి స్వదేశానికి తీసురావాలని వేడుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె కుమారుడు సతీష్ తెలిపాడు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారి రమేష్ తక్షణమే స్పందించి భారత రాయబారం కార్యాలయం నుంచి రెండు రోజులలో ఇండియాకు తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసినట్లు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి డీఆర్‌ఓ బీఎల్ఎన్ రాజకుమారి వెల్లడించారు.

రామలక్ష్మి కుమారుడితో మాట్లాడుతున్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారి రమేష్

ప్రయివేట్ ప్రాఠశాలల బంద్ విజయవంతం

కలెక్టరేట్ వద్ద ధర్నా

అమలాపురం రూరల్: రాష్ట్రంపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చుతో మూడో వంతు కన్న తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రయివేట్ పాఠశాలలను రక్షించాలని కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని అర్హుల జాబితా తయారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పకుండా పాటించాల కోరారు. తొలుత అమలాపురం గడియాస్తంభం సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టర్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలలు అన్నీ బంద్ చేశారు. డీఆర్ రాజకుమారికి వినతిపత్రం అందించారు. అమలాపురం డివిజన్ ప్రయివేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు పోత్తూరి లక్ష్మి శ్రీనివాసన్, సంఘ గౌరవ అధ్యక్షుడు ముమ్మిడి ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

ధనధైన్యాలు

- నెలలు గడుస్తున్నా ధాన్యం డబ్బులు ఇవ్వని సర్కారు
- ఉమ్మడి జిల్లాల్లో మొత్తం బకాయి రూ.399 కోట్లు
- ఖరీఫ్ పెట్టుబడికి రైతుల అగచాట్లు
- ధాన్యం సొమ్ము ఇస్తారా.. ఇవ్వరా అని ప్రశ్న

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నపూర్ణగా ఖ్యాతినొందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు పీకల్లోతు దైన్యంలో కూరుకుపోయారు. రబీ ధాన్యం డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న తీరని జాప్యం అన్నదాతలకు శాపంగా మారింది. ఒకటీ రెండూ రోజులు కాదు.. ఒకరో ఇద్దరో రైతులూ కారు.. వందా రెండు వందల రూపాయలు అంతకంటే కాదు.. ఏకంగా రెండు నెలలుగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకారం రూ.399 కోట్ల మేర ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో ఖరీఫ్ పంటకాలం ప్రారంభమైపోయింది. ఈ నెల 15లోగా నారుమళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ధాన్యం డబ్బులు ఇవ్వడం లేదు. మరోవైపు గత వైఎస్ జగన్ ప్రభుత్వం మాదిరిగా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కూడా అందించడం లేదు. పైగా ఈ పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చి రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల్లో గొప్పగా చెప్పారు. కానీ, ఇప్పటి వరకూ నయాపైసా కూడా ఇవ్వలేదు. దీంతో, సాగు పెట్టుబడి కోసం రైతులు నానా అగచాట్లూ పడుతున్నారు. ప్రభుత్వమే నెలల తరబడి ధాన్యం సొమ్ము తొక్కిపెడితే ఖరీఫ్ సాగు ఏవిధంగా చేయగలమని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ రైతును కదిలించినా ధాన్యం సొమ్ము రాలేదంటూ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు.

గొప్ప చెప్పి.. చిప్ప చూపి..

ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు కూటమి నేతలందరూ ధాన్యం అమ్మిన 24 లేదా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామమని గొప్పగా చెప్పారు. మంత్రి నాదెండ్ల అయితే ధాన్యం కొనుగోళ్లు జరిగిన సమయంలో ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ధాన్యం సొమ్ముపై రైతులకు ఆశలు కల్పించారు. కొనుగోళ్లు ప్రారంభమైన తొలి పక్షంలో మాత్రం ప్రచారార్భాటం కోసం రైతుల ఖాతాల్లో సొమ్ము వేశారు. మే మొదటి వారం నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రం డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోంది. దీంతో, కడుపు మండిన అన్నదాతలు ధాన్యం సొమ్ము కోసం ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. అంతే కాకుండా, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు, నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం రూరల్; కాకినాడ జిల్లా పెద్దాపురం; కోనసీమ జిల్లా అమలాపురం తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు.

రైతులు తక్కువలో తక్కువ ఎకరాకు 50 బస్తాల (75 కేజీలు) దిగుబడి సాధించారు. ఈ మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ప్రతి రైతుకు ఎకరానికి రూ.86 వేలు పైగా రావాలి. ఈవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం రూ.399 కోట్ల మేర ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఇది ఓవైపు ఖరీఫ్ ఖరీఫ్ సాగు ప్రారంభమైపోయినా ధాన్యం బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ పెద్దల నుంచి ఉలుకూపలుకూ లేదు. కాకినాడలో బుధవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు సైతం ప్రభుత్వ నిర్లక్ష్యంపై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు.

అప్పు పుట్టక..

కూటమి సర్కారు గద్దెనెక్కినప్పటి నుంచి మార్కెట్‌లో నగదు చలామణీ భారీగా పడిపోయింది. దాదాపు అన్ని వర్గాల వద్ద డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. ఏటా పంట పెట్టుబడిలు సమయంలో సొమ్ము సర్దుబాటు చేసే కమీషన్ ఏజెంట్లు కూడా ఈసారి చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు అప్పు పుట్టడం లేదు. ఖరీఫ్‌కు సమాయత్తమయ్యే తరుణంలో రైతులు ఇన్ని కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని రైతు నేతలు మండిపడుతున్నారు.

జిల్లాల వారీగా రబీ ధాన్యం బకాయిలు

కాకినాడ	రూ.80 కోట్లు
కోనసీమ	రూ.189 కోట్లు
తూర్పు గోదావరి	రూ.130 కోట్లు
మొత్తం	రూ.399 కోట్లు

నిడదవోలు మండలం డి.ముప్పవరంలో ధాన్యం సొమ్ము కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

అప్పులతోనే ఖరీఫ్ సాగు

అట్లపాడులో 9.2 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు రూ.45 వేల వరకూ పెట్టుబడి పెట్టి రబీ సాగు చేశాను. ఎకరాకు 49 బస్తాల దిగుబడి వచ్చింది. ఏప్రిల్ 27న రైస్‌మిల్లుకు తోలాను. రూ.7.60 లక్షల వరకూ రావాల్సి ఉంది. రెండు నెలలు గడచినా ప్రభుత్వం ఇంకా మా డబ్బులు జమ చేయలేదు. దీంతో, మళ్లీ అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేపట్టాను.

– కొత్తపల్లి సత్యనారాయణ, కౌలు రైతు, సమిశ్రగూడెం, నిడదవోలు మండలం

50 రోజులుగా ఎదురు చూపులు

నేను కొండగుంటూరులో ఐదెకరాల వరి సాగు చేశాను. మూడెకరాలు కౌలు, రెండు ఎకరాలు సొంత భూమి. మొత్తం ధాన్యాన్ని మే 13న విక్రయించాను. కౌలు భూమికి సంబంధించి రూ.2.29 లక్షలు, సొంత భూమికి సంబంధించి రూ.1.75 లక్షలు మొత్తం సుమారు రూ.4.04 లక్షలు రావాల్సి ఉంది. ధాన్యం అమ్మగానే త్వరలోనే మీ డబ్బులు చెల్లిస్తామంటూ మెసేజ్ వచ్చింది. 50 రోజులుగా ఎదురు చూస్తున్నా చిల్లిగవ్వ కూడా నా ఖాతాకు జమ కాలేదు. ట్రాక్టర్, ఎరువులు తదితర ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. ధాన్యం డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంతో సాగులో వచ్చేదంతా వడ్డీలకే పోయేటట్లు ఉంది.

– అద్దంకి వెంకట రమణ, కేశవరం, మండపేట మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఒక్క రూపాయీ రాలేదు

రబీలో పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.2.50 లక్షల వరకూ పెట్టుబడి అయ్యింది. దీని కోసం అప్పు చేశాను. ఎకరాకు 30 కాటాల (బస్తాల) దిగుబడి వచ్చింది. కాటాకు రూ.1,720 చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మే నెలలో అమ్మాను. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రాలేదు. సుమారు రూ.5 లక్షల వరకూ రావాల్సి ఉంది. శిస్తు చెల్లించడానికి డబ్బుల్లేకపోవడంతో ఖరీఫ్‌లో కౌలుకు ఇవ్వడానికి రైతులు ఇబ్బంది పెడుతున్నారు. ఖరీఫ్ పెట్టుబడులకు సైతం అప్పులు చేయాల్సి వస్తోంది. తక్షణమే ధాన్యం డబ్బులు చెల్లించాలి.

– రేవాడ వీరబాబు, కౌలు రైతు, గోకవరం

క్లుప్తంగా

8 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: డీసెట్–2025 ద్వారా రెండు సంవత్సరాలు డిప్లమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు మొదట విడత కౌన్సెలింగ్‌కి సంబంధించి అర్హత పొందిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఎం.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ జారీ చేస్తారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బొమ్మూరులోని డైట్, ప్రైవేటు డీఎడ్ కాలేజీలు, రంపచోడవరం ఐటీడీఏ డీఎడ్ కాలేజీలో ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ పొందిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు బొమ్మూరులోని డైట్‌కు హాజరై అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన తరువాత ఫైనల్ అడ్మిషన్ లెటర్ పొందాలని డైట్ ప్రిన్సిపాల్ కోరారు.

పోక్సో కేసులో 15 ఏళ్ల జైలు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి గ్రామానికి చెందిన వికలాంగ బాలికను గర్భవతిని చేసి ముఖం చాటేసిన వ్యక్తికి కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి కే శ్రీదేవి 15 ఏళ్ల జైలు శిక్ష, 11,000 జరిమానా విధించినట్లు పి.గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.భీమరాజు, ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన వనచర్ల సురేష్‌బాబు... అమలాపురం ఏఎస్ఎన్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న బాలికను మాయ మాటలతో మోసగించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. నాలుగుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అయినవిల్లి పోలీస్ స్టేషన్‌లో 2018 జూలై 8న ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై షేక్ జానీ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏడేళ్లు కేసు విచారణ సాగగా గురువారం కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించారు. పీపీలుగా కె వెంకట రత్నంబాబు, పి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

నేడే పట్టాభిషేకం

- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం
- వర్సిటీ కులపతి, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు

స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వర్సిటీ వీసీ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివినవారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వేదిక అవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలలో ఉన్న వారికి సైతం పట్టా అందుకోవడానికి వర్సిటీ ఆహ్వానాలు పంపింది. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పట్టా (ఒరిజనల్ డిగ్రీ) తీసుకోవడానికి ఏర్పాట్లు చేసింది. జీవితంలో మధురానుభూతిగా నిలిచే ఈ వేడుకలకు అర్హులైన వారు తమ వివరాలు వర్సిటీకు పంపించారు. గత ఏడాది డిసెంబర్‌లో స్నాతకోత్సవం నోటిఫికేషన్ జారీ చేసి గవర్నర్ అనుమతితో శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 11వ స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పట్టాలు అందజేస్తున్నారు. బీటెక్ విభాగంలో 41,258, బిఫార్మశీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఎంసీఏ 1115, ఎం ఫార్మశీ 458, బీబీఏ 115, ఫార్మడీ 274, బీఆర్క్ 83 ఓడీ (ఒరిజనల్ డిగ్రీ)లు విద్యార్థులు పొందనున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు 40మందికి, పీహెచ్‌డీలు 99 మందికి అందజేయనున్నట్టు వర్సిటీ వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థి కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్..

స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, అమెరికా బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. విజయవాడలో జన్మించిన ఈయన జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలలో బీటెక్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందారు. 1986లో అమెరికాలో బోస్టన్ గ్రూప్ స్థాపించి సుమారు 2,500 మందికి యూఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించి మలేషియా, ఇండోనేషియా, ఫిలిఫిన్స్ వంటి దేశాల్లో కార్యకలాపాలు ప్రారంభించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా జేఎన్‌టీయూకేలో సుబుకోటా ఫౌండేషన్ స్థాపించి కోటి రూపాయలు విరాళంగా అందజేశారు. ప్రతి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి నగదు బహుమతితో ప్రోత్సహిస్తున్నారు.

కోట సుబ్రహ్మణ్యం

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి

- ఓ కారు టైరు పేలి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టిన వైనం
- ఇద్దరికి గాయాలు

కార్లను క్రేన్ సాయంతో తొలగిస్తున్న హైవే సిబ్బంది

ప్రమాదంలో మృతి చెందిన నరసింహ గుప్తా

రావులపాలెం: కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి అవతల దారిలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. రావులపాలెం మండలంలో ఈతకోట టోల్ ప్లాజా సమీపంలో గురువారం జరిగిన ఈ ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన బొండాల నరసింహ గుప్తా (55) మృతి చెందారు. పాలకొల్లుకు చెందిన గుప్తా భార్య వీర వెంకట లక్ష్మీదేవితో కలిసి రాజమహేంద్రవరం బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈతకోట టోల్ ప్లాజా దాటాక కొంతదూరంలో కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన కేవీఎస్ఎస్ రామారెడ్డి, దివ్య పద్మజ్యోతి దంపతులు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. వీరు రాజమహేంద్రవరం నుంచి పాలకొల్లు బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుప్తా, అతని భార్య వీర వెంకట లక్ష్మీదేవి, మరో కారులో ఉన్న జ్యోతి గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గ మధ్యలో గుప్తా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలిని రావులపాలెం పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. హైవే టోల్ ప్లాజా సిబ్బంది క్రేన్ సాయంతో కార్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గాయపడిన లక్ష్మీదేవిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

గాయాలతో ఉన్న భార్య దివ్యపద్మజ్యోతితో భర్త రామారెడ్డి

పంట కాల్వలు కలుషితం

హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంట కాల్వల ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు మానవ తప్పిదాలతో కలుషిత అవుతున్నాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలో గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ మానవ నిర్లక్ష్యం, తప్పిదాలపై తాను హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కాల్వల ద్వారా ప్రవహించే గోదావరి జలాలతో పంటల సాగే కాకుండా పలు గ్రామాల్లో తాగునీటి ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని వివరించారు. కొందరు తమ ఇళ్ల మరుగుదొడ్ల గొట్టాలు కాల్వల్లోకి అమర్చుకొని కలుషితం చేస్తున్నారని, తద్వారా పంట కాల్వలు మానవ మల మూత్రాలతో ప్రవహిస్తున్నాయని ఎమ్మెల్సీ ఆందోళన వ్యక్తం చేశారు. సాగు, తాగునీరు కోసం కాటన్ దొర పంట కాల్వల వ్యవస్థను తీసుకుని వస్తే స్వార్థపరులు, కాల్వలను పర్యవేక్షించాల్సి అధికారుల నిర్లక్ష్యం వల్ల కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. కాల్వలను కలుషితం చేయవద్దని, వ్యర్థాలను వదల వద్దని న్యాయస్థానాలు హెచ్చరిస్తున్నాయని గుర్తు చేశారు. కాల్వలను కలుషిత చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పేర్కొన్నారు.

సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులపై దాడి దారుణం

హైకోర్టు న్యాయవాది సూర్యనారాయణ

సీటీఆర్ఐ: గోకవరం మండలం మల్లవరం గ్రామంలో సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులు, అర్చకత్వం చేస్తున్న వారిపై దాడికి పాల్పడి వారి గృహలను ధ్వంసం చేయడమే కాకుండా దేవుడి పూజా సామగ్రి, బంగారం, వెండి ఆభరణాల చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్య నారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గుడిలో అర్చకత్వం చేస్తున్న పసుపులేటి సింగారలక్ష్మి, వి.సీతామహలక్ష్మితో కలిసి మాట్లాడారు. సింగారమ్మ చింతగా పేరొందిన అది ప్రైవేటు ఆలయమే అయినప్పటికీ భక్తులు ఇటీవల భారీగా తరలివస్తున్నారని, అమ్మవారికి పూజలు చేస్తున్నారని తెలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ ఆలయాన్ని తమ చేతిలో పెట్టుకోవాలనే దురుద్దేశంతో ఏప్రిల్ 23వ తేదీ రాత్రి వట్టికూటి వీర రాఘవమ్మ, పసుపులేటి సింగారలక్ష్మిపై దాడి చేసి గృహలను, షాపులను కూల్చి వేశారని, సుమారు రూ.25 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను దోచుకుని పోయారని అన్నారు. గోకవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. తాము హైకోర్టులో జూన్‌ 20న రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. బాధితులు మే 26న జిల్లా కలెక్టర్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారని తెలిపారు. 1880 నాటి కాలంలో వారి ముత్తాత పసుపులేటి వెంకన్న, పసుపులేటి వీరరాఘవమ్మ దంపతులు చింతచెట్టు కింద వెలసిన సింగారమ్మ తల్లికి సుమారు 5 ఎకరాల అడవిని చదును చేసి ఆలయ ప్రాంగణంగా రూపొందించారన్నారు. వంశ పారంపర్యంగా ఆలయం వద్దనే నివాసాలు ఏర్పర్చుకుని పూజారులుగా, ట్రస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి గుడిని రక్షించాలని కోరుతున్నామన్నారు. వట్టికూటి దుర్గాప్రసాద్, వట్టికూటి జనార్ధనరావు, సీతామహలక్ష్మి, ఆలమూరు ధనలక్ష్మి, పసుపులేటి శ్రీ వెంకట సూర్య చక్ర ధనుష్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

హత్య కేసులో ఇద్దరికి జైలు

పిఠాపురం: హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి గురువారం తీర్పు చెప్పినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆరుగుళ్ళ శ్రీను, భార్య గంగకు సంసారంలో విభేదాలు తలెత్తాయి. దాని కారణంగా అతని భార్య మూడు నెలల క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో భర్త శ్రీను 2019 జనవరి 16వ తేదీన సంక్రాంతి పండగకు తన భార్యను, పిల్లలను తీసుకెళ్లేందుకు చేబ్రోలులో అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా అత్తింటి తరపు బంధువులకు, అతనికి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో బావ మరుదులైన దొండపాటి చంద్రబాబు, దొండపాటి అర్జున్, వదిన వరస అయిన నేదూరి రత్నం అతనిపై దాడి చేసి తలపై కొట్టగా శ్రీను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని అక్క దొండపాటి శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై బి రామకృష్ణ కేసు నమోదు చేయగా, అప్పటి పిఠాపురం సీఐ ఎస్.సూర్య అప్పారావు కేసు దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో దొండపాటి చంద్రబాబుకి రెండు సంవత్సరాల జైలు శిక్ష , జరిమానా, దొండపాడు అర్జునుడికి రెండు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. మూడవ ముద్దాయి అయిన రత్నంపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెపై కేసు కొట్టి వేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున విశ్వనాథరెడ్డి, వినయ్ తేజ వాదనలు వినిపించారు. సాక్షులను గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కోర్టులో హాజరు పర్చారు.

ఎయిర్ వాల్వ్‌లో పడిన కారు

తప్పిన ప్రమాదం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వెళ్తున్న ఒక కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న మంచినీటి పైపు లైన్ ఎయిర్ వాల్వ్ గోతిలో పడటంతో ముందు చక్రం విరిగి పోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం నుంచి కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువ నుంచి ముంగండ మంచినీటి ప్రాజక్టుకు వెళ్లే పైపులైన్లు గతంలో రోడ్డు మార్జిన్లో ఉండేవి. అయితే ఇటీవల రోడ్డును వెడల్పు చేశారు. దీంతో మూడుచోట్ల పైపు లైన్ల ఎయిర్ వాల్వ్‌లు సీసీ రోడ్డులోకి వచ్చాయి. దీంతో అక్కడ రంధ్రాలు ఏర్పడటంతో సిమెంట్ వరలు ఏర్పాటు చేశారు. ఆ వరలు విరిగిపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. వీటిని గమనించని వాహన చోదకులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలయ్యారు. తక్షణమే ఎయిర్ వాల్వ్‌లు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గోతిలో పడి విరిగిన కారు ముందు చక్రం

‘ఫోర్జరీ పోలీస్’ సస్పెన్షన్

కాకినాడ క్రైం: రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసిన హెడ్ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. విధుల నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం రాజమహేంద్రవరం జీఆర్‌పీ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు ఏకంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసి ఎస్ఐని అని ఓ నకిలీ ఐడీ కార్డును తన పేరుతో తయారు చేసుకున్నాడు. ఈ కార్డుని వాడుతూ, పలుచోట్ల బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ తరహాలోనే కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్‌లో ఓ కుటుంబ వివాదంలో విచారణ పేరుతో కామేశ్వరరావు జోక్యం చేసుకున్నాడు. విచారణ సమయంలో ఓ మహిళను తాను ఎస్ఐని అని చెబుతూ నకిలీ ఐడీ కార్డు చూపించి మరీ బెదిరించారు. అయితే, అప్పటికే కామేశ్వరరావుది హెడ్‌కానిస్టేబుల్ హోదా అని తెలుసుకున్న మహిళ నకిలీ ఐడీ కార్డు వ్యవహారాన్ని కాకినాడ జిల్లా ఎస్పీబిందుమాధవ్, ఇంటెలిజెన్స్ అధికారులకు వెల్లడించి, కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ మొదలు కాగా, ప్రాథమిక ఆధారాల ప్రాతిపదికగా రాజమహేంద్రవరం జీఆర్‌పీ నుంచి అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు కామేశ్వరరావును పంపారు. లోతైన విచారణ అనంతరం ఆరోపణలన్నీ వాస్తవాలని తేలడంతో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా కామేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కాకినాడ జిల్లా పోలీస్ శాఖకు సిఫారసు చేశారు. కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్ వద్ద మహిళను నకిలీ ఎస్ఐ ఐడీ కార్డుతో బెదిరించిన నేరంలో కామేశ్వరరావుకి సహకరించిన ఓ మహిళా కానిస్టేబుల్ పైనా చర్యలు తీసుకోవాలని, బదిలీపై తూర్పుగోదావరి జిల్లా పోలీస్ శాఖకు వెళుతున్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు అనకాపల్లి ఎస్పీ సిఫారసు చేశారు.

కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు

ప్రముఖ దేవాలయాల శానిటరీ టెండర్ వాయిదా?

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ ఆలయాలకు శానిటరీ మెటీరియల్‌తో సహ క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్‌డ్ ఈ ప్రొక్యూర్ రీ టెండర్ ఖరారు వాయిదా పడినట్లు సమాచారం. ఈ టెండర్‌కు సంబంధించి సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్ ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి లోయెస్ట్ టెండర్ కొటేషన్ ఖరారు చేయాల్సి ఉంది. అయితే గురువారం ఈ టెండర్ ప్రైస్ బిడ్‌ను అధికారులు ఓపెన్ చేయలేదని సమాచారం. ఈ నెల ఎనిమిదో తేదీన చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థల ప్రతినిధులతో ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ప్రైస్ బిడ్ ఓపెన్ చేస్తారని అధికారులు తెలిపారు. అయితే ఈ నెల తొమ్మిదో తేదీన సింహాచలం దేవస్థానం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉన్నందున దేవదాయశాఖ కమిషనర్‌తో సహా అధికారులు ఆ రోజు సింహాచలంలో ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ సమావేశం 11కి వాయిదా పడే అవకాశం ఉంది. ఆ రోజునే టెండర్ ఖరారు అవుతుందని అధికారులు అంటున్నారు.

9 నుంచి ‘నన్నయ’లో సెమినార్

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 9,10 తేదీలలో ఇంటర్నేషనల్ సెమినార్ జరుగనుంది. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్ అనలిటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్’ అనే అంశంపై జరిగే ఈ సెమినార్‌కి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం విడుదల చేశారు. ఈ సెమినార్‌లో స్పీకర్స్‌గా ప్రొఫెసర్ కేవీ రామానుజాచారి (యుఎస్ఏ), సైంటిస్టు డాక్టర్ ఎన్.నాగన్న (చైనా), ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు (వరంగల్), డాక్టర్ రాంబాబురెడ్డి (ఐఐటీ – ఖరగ్‌పూర్) పాల్గొంటారన్నారు. దీనికి కన్వీనర్‌గా డాక్టర్ బి. జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి, రాజవోలు దగ్గరలో శ్రీమాన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ సైట్స్, ఇండిపెండెంట్ హౌస్‌లు, విల్లాస్ మరియు అపార్ట్మెంట్స్ కొరకు సంప్రదించండి. JSR – ✆ : 70139 92077 [R-960]

Services

జ్యోతిష్యాలయం



■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

CHANGE OF NAME

■ I, Ramakrishna Reddy Nallamilli S/o. Ammi Reddy Nallamilli R/o. 3-8, Sivalayam Street, Near Satya Sai Nilayam, Ubalanka, East Godavari, Andhra Pradesh - 533237, have Changed the Name of My Minor Daughter Namely Nallamilli Papa (Aged 14 Years 2 Months). And She Shall Hereafter Be Known as Nallamilli Bhoomi for All Future Purposes [DA-39176]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]

■ ఫార్మసీ కంపెనీ చౌటుప్పల్, హైదరాబాద్ నందు లేబర్ వర్క్ చేయుటకు 20–30 సంవత్సరాలలోపు యువకులు కావలెను. జీతం: 12–15 వేలు. సంప్ర|| సెల్: 91773 12968, 98499 93684 [YA-2871]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిలువ నీడేదీ!

- పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణమెప్పుడో?
- 2023లో 60 గదుల సత్యదేవ సత్రం కూల్చివేత
- రూ.1.99 కోట్లతో షెడ్డు నిర్మాణానికి లారెస్ ఫార్మా సంసిద్ధత
- ఆ నిధులను మరో కార్యక్రమానికి వెచ్చించిన సంస్థ
- నీడ లేక సత్యదేవుని భక్తులకు ఇక్కట్లు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి 2023లో విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముందుకు వచ్చింది. రత్నగిరి రామాలయం పక్కన రేకులతో వేసిన విశ్రాంతి షెడ్డు లాగే ఇక్కడ కూడా నిర్మించాలని నిర్ణయించారు. అందుకు ఆ సంస్థ కూడా అంగీకరించింది. ఆ తర్వాత కొత్త ఈఓ రావడంతో ఆ ప్రతిపాదన కాస్తా అటకెక్కింది. దీంతో ఆ నిధులను సంస్థ మరో కార్యక్రమానికి వినియోగించింది. అనంతరం ఇక్కడ రేకుల షెడ్డు కాకుండా, ప్లాస్టిక్ క్లాత్‌లా టెన్సిల్ రూఫ్ షెడ్డు వేయాలని దేవస్థానం ప్రతిపాదించింది. దీనిపై ఆలోచన చేస్తామని సంస్థ యాజమాన్యం తెలిపింది. ఈ క్రమంలో నీడ లేక, చలువ పందిరిలో వర్షానికి తడిసి భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నీడ లేక అవస్థలు

పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గతంలో 60 గదులతో సత్యదేవ అతిథి గృహం (సత్రం) ఉండేది. భక్తుల కోసం (గ్యాలోరిమ్ టైల్స్ రూఫ్ షెడ్) విశ్రాంతి షెడ్డు నిర్మించాలనే ఆలోచనతో ఆ సత్రాన్ని 2023 అక్టోబర్‌లో తొలగించారు. అక్కడ విశాల షెడ్డు నిర్మించాలని అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రణాళిక రూపొందించారు. విశాఖపట్నానికి చెందిన లారెస్ సంస్థ రూ.1.99 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఆ ఏడాది కార్తిక మాసం ప్రారంభం కావడంతో తాత్కాలిక షెడ్డు నిర్మించారు. కార్తిక మాసం అనంతరం షెడ్డు నిర్మించడానికి ఆ సంస్థ మెటీరియల్ కూడా సిద్ధం చేసింది.

ఈఓ బదిలీతో..

కాగా, ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ఆయన స్థానంలో ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ బాధ్యతలు చేపట్టారు. రేకుల షెడ్డు నిర్మిస్తే రాజగోపురం కనిపించదని ఆయన ఆ ప్రతిపాదనకు అభ్యంతరం చెప్పారు. ఈ నేపథ్యంలోనే లారెస్ సంస్థ ఆ నిధులను వేరే పనులకు వినియోగించింది.

గత కార్తిక మాసంలో పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

పార్కింగ్‌గా షెడ్డు స్థలం

పశ్చిమ రాజగోపురం ఎదురుగా సత్రం కూల్చివేయడంతో, ఆ ప్రదేశం పార్కింగ్ స్థలంగా మారింది. దేవస్థానం బస్సులు కూడా ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడ నుంచి సత్యదేవుని ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. వేసవిలో భక్తుల కోసం చలువ పందిళ్లు వేస్తున్నారు. ఈ ఏడాదీ అలాగే చేశారు. వర్షం పడితే చలువ పందిళ్ల నుంచి నీరు కారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం వారు కనీసం షెడ్డు వేయలేరా అని ప్రశ్నిస్తున్నారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు గత ఫిబ్రవరిలో లారెస్ సంస్థ ప్రతినిధులను షెడ్డు నిర్మించాలని కోరారు. నాలుగు నెలలైనా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఆ సంస్థ ముందుకు రాకపోతే దేవస్థానం నిధులైనా వెచ్చించి, షెడ్డు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రావణ మాసంలో రద్దీ

ప్రస్తుతం ఆషాఢ మాసంలో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా.. జూలై 25 నుంచి శ్రావణ మాసంలో సత్యదేవుని ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. వివాహాల సీజన్ కావడంతో రాత్రి వేళల్లో కూడా పెద్ద సంఖ్యలో పెళ్లి బృందాలు వస్తాయి. అదే సమయంలో వర్షాలు కూడా అధికమవుతాయి. దీంతో భక్తుల అవస్థలు చెప్పనలవి కాదు.

అధికారులు ఏమన్నారంటే..

పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి లారెస్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. పూర్తి స్థాయిలో నిధులు లేవని తెలిపింది. చిన్న షెడ్డు నిర్మిస్తామని చెప్పింది. పూర్తి వివరాలు త్వరలో తెలియచేస్తామన్నారు. వారు అంగీకారం తెలిపిన వెంటనే దేవస్థానం చైర్మన్, ఈఓల అనుమతి తీసుకుని షెడ్డు నిర్మిస్తామన్నారు.

సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం | 4 | జూలై | 2025

నేడే పట్టాభిషేకం

బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివిన వారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వేదిక అవుతోంది.

8లో

నిలువ నీడేదీ!

అన్నవరం సత్యదేవుని ఆలయంలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి దాత ముందుకు వచ్చినా, అధికారులు నిర్ణయం తీసుకోవడం లేదు

కడలిలోకి 99,689 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 99,689 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి డెల్టా కాలువలకు 12,150 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఉద్యానవనశాఖ అధికారిగా మల్లికార్జునరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా నేతల మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన బి.సుజాత కుమారి గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో కాకినాడ జిల్లా నుంచి మల్లికార్జునరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలోని హార్టికల్చర్ రంగంలో అంతర పంటల సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సూక్ష్మ నీటిపారుదలశాఖ అధికారి ఎ.దుర్గేష్, విశ్రాంత డీహెచ్‌వో బి.సుజాత కుమారి, కొవ్వూరు మండల హార్టికల్చర్ అధికారి డి.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

10న మెగా పీటీఎం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈ నెల 10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0 కార్యక్రమాన్ని అన్ని విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు ఆదేశించారు. నారాయణపురంలోని నగరపాలక సంస్థ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ ఎస్.సుభాషిణి, ఏఎంఓ ఏ.గౌరీ శంకరరావు, సీఎంఓ శ్రీనివాసరావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయిని డి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడమ్మ ఆలయం మూసివేత

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి గురువారం విలేకర్లకు తెలిపారు. ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారికి కుంభం వేస్తారన్నారు. అందువలన ఆలయ తలుపులు మూసివేయడంతో శుక్రవారం అమ్మవారి దర్శనం ఉండదన్నారు. శనివారం వేకువజామున ఆలయం తెరచి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

రేషన్‌షాపులకు చేరని బియ్యం

అయినవిల్లి: ప్రతి నెలా ఒకటో తేదీనే రేషన్ బియ్యం లబ్ధిదారులకు చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల రేషన్ బియ్యం వ్యాన్‌ల ద్వారా రేషన్ బియ్యం ఇవ్వడం నిలిపేసి పాత విధానంలో డీలర్ల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వడం ప్రారంభించారు. ఈ నెల మూడోవ తేదీ దాటినా అయినవిల్లి మండలంలోని చాలా వరకూ షాపులకు రేషన్ బియ్యం దిగుమతి కాలేదు. దీంతో రేషన్‌షాపు యజమానులు చేసేది లేక లబ్ధిదారులను వెనుకకు తిరిగి పంపిస్తున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఒకటో తేదీనే రేషన్ బియ్యం ఇంటికి వచ్చేవని, కూటమి ప్రభుత్వం విధానం మార్చడంతో ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 41 రేషన్ షాపులు ఉండగా 30 శాతం షాపులకు మాత్రమే రేషన్ బియ్యం సరఫరా చేసినట్లు చెబుతున్నారు.

రైతు కంట చెమ్మ

యాదవోలు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన నిమ్మకాయలు

- పతనమైన నిమ్మ ధర
- కిలో రూ.7
- కోత కూలి కూడా రావడం లేదని ఆవేదన
- అంతంత మాత్రంగా ఎగుమతులు

దేవరపల్లి: నిమ్మకాయల ధర పతనమవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కిలో నిమ్మకాయలకు రూ.7 నుంచి రూ.10 మధ్య మాత్రమే రైతులకు దక్కుతోంది. అదే వినియోగదారుల వద్దకు వచ్చేసరికి కిలో రూ.50 నుంచి రూ.55 వరకూ పలుకుతోంది. సైజును బట్టి ఒక్కో నిమ్మకాయ ధర రూ.2 నుంచి రూ.5 వరకూ కూడా చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర భారీగా ఉన్నప్పటికీ తమకు మాత్రం దక్కుతున్నది చాలా స్వల్పంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ధర ఎంత మాత్రం గిట్టుబాటు కాదని, కోత కూలి డబ్బులు కూడా రావని ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కాయల కోతలు జరగడం లేదు. నిమ్మకాయలు చెట్ల కింద రాలిపోయి ఉన్నాయి. సాధారణంగా వర్షాకాలంలో వినియోగం తక్కువగా ఉండటంతో, ఎగుమతులు నిలిచి, నిమ్మకాయలకు ధర కూడా తక్కువగా పలుకుతుంది. ఇదే సమయంలో తోటల నుంచి లేత కాపులు ఒకేసారి అందుకోవడంతో మార్కెట్‌కు కాయలు ఎక్కువ మొత్తంలో వస్తున్నాయి. దీనికి తోడు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, టెక్కలి, నర్సన్నపేట ప్రాంతాల్లో వర్షాకాలంలో ఎక్కువగా మెట్ట నిమ్మకాయల దిగుబడి వస్తుంది. ఇవి అక్కడి మార్కెట్లను ముంచెత్తడంతో ఆయా ప్రాంతాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు ఉండవు. దిగుబడి ఎక్కువగా ఉండటం, డిమాండ్ లేక ఎగుమతులు తగ్గడంతో తమకు గిట్టుబాటు ధర దక్కడం లేదని, ప్రస్తుతం ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

వేసవిలో గిరాకీ

ఈ ఏడాది వేసవిలో నిమ్మకాయలకు మంచి గిరాకీ ఏర్పడింది. కిలోకు రూ.60 నుంచి రూ.70 వరకూ రైతుకు దక్కింది. దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చాయి. రైతులు పెట్టుబడులు, కౌలు డబ్బులు దక్కడంతో ఒడ్డెక్కారు. సాధారణంగా ఎండల తీవ్రత అధికంగా ఉండే ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ మార్కెట్లో నిమ్మకాయలకు గిరాకీ ఉంటుంది. జూలై నుంచి జనవరి వరకూ గిరాకీ అంతంత మాత్రంగానే ఉంటుంది. దేవరపల్లి మండలంలోని యాదవోలు మార్కెట్ నుంచి ప్రతి రోజూ వివిధ ప్రాంతాలకు నిమ్మకాయల రవాణా జరుగుతుంది. ఇక్కడ రైతులే వ్యాపారులుగా తయారై ఇతర రైతుల నుంచి ఎటువంటి కమీషన్ లేకుండా నిమ్మకాయలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుంటారు. దాదాపు 50 ఏళ్లుగా ఉన్న యాదవోలు నిమ్మ మార్కెట్‌కు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కూడా మంచి గుర్తింపు ఉంది. సీజన్‌లో ఇక్కడి నుంచి రోజుకు సుమారు 100 టన్నుల నిమ్మకాయలు వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. కొద్ది రోజుల కిందట 35 నుంచి 40 టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చేవి. ఇటీవలి వర్షాలకు రోజుకు 10 నుంచి 12 టన్నులు మాత్రమే వస్తున్నాయి. అయినప్పటికీ, డిమాండ్ లేకపోవడంతో రైతుకు ధర రావడం లేదు.

మంగు తెగులు

నిమ్మకాయలకు మంగు తెగులు, కాయ అడుగు భాగం మచ్చ (డాట్) వచ్చాయి. ప్రస్తుత వాతావరణానికి మంగు తెగులు ఎక్కువగా వ్యాపిస్తుంది. కాయలకు కోత కూలి డబ్బులు కూడా రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో ధర పతనమైంది. మే 1 నుంచి 10వ తేదీ వరకూ కిలో రూ.35 నుంచి రూ.42 మధ్య పలికిన ధర అనంతరం రూ.20కి తగ్గింది. ఈ ధర గత నెలలో రూ.7 నుంచి రూ.10 మధ్యకు పడిపోయింది. ప్రస్తుతం అదే ధర కొనసాగుతోంది.

– అనిశెట్టి సూర్యచంద్రరావు, రైతు, యాదవోలు

ఆయిల్‌పామ్.. షాక్

- దిగుమతి సుంకాన్ని భారీగా తగ్గించిన కేంద్రం
- టన్నుకు రూ.3,595 నష్టం
- ఆందోళనలో రైతులు
- కనీస ధర రూ.22 వేలుగా నిర్ణయించాలని డిమాండ్

రంగంపేట: ఉద్యాన పంటల్లో మొనగాడుగా పేరొందిన ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వ విధానాలతో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల 10 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం ఆయిల్‌పామ్ రైతులకు పిడుగుపాటుగా మారింది. దీనివలన వారు టన్నుకు రూ.3.595 మేర నష్టపోతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా రైతులు 90 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఈ ఉద్యాన పంట సాగులో ఉమ్మడి జిల్లా దేశంలోనే ద్వితీయ స్థానంలో ఉంది. మరో ఏడాదిలో ఈ విస్తీర్ణం లక్ష ఎకరాలు దాటుతుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొవ్వూరు, రాజమహేంద్రవరం, పెద్దాపురం, కాకినాడతో పాటు, రంపచోడవరం, రామచంద్రపురం, అమలాపురం డివిజన్లకు కూడా ఈ పంట విస్తరించింది. కొవ్వూరు డివిజన్‌లోనే 55,432 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. మండలాల వారీగా చూస్తే ప్రస్తుతం రాజానగరం, గండేపల్లి, రంగంపేట, పెద్దాపురం మండలాలు ఆయిల్‌పామ్ సాగులో ప్రథమ స్థానం కోసం పోటీ పడుతున్నాయి. రంగంపేట మండలంలోని మర్రిపూడి గ్రామంలోనైతే మొత్తం పంట భూమిలో 65 శాతం ఆయిల్‌పామ్ తోటలే ఉన్నాయని ఆ గ్రామ అభ్యుదయ రైతు పుట్టా సోమన్న చౌదరి చెప్పారు.

ఆరు నెలలుగా ఆయిల్‌పామ్ గెలల ధరలు (టన్నుకు రూ.లు)

నెల	ధర
జనవరి	20,050
ఫిబ్రవరి	20,727
మార్చి	20,935
ఏప్రిల్	20,123
మే	18,650
జూన్	17,340

ఆహార పంటల సాగులో కష్టనష్టాలు ఎదురవుతూండటంతో పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లిపోయారు.

పడిపోతున్న ధర

కొన్నేళ్లుగా ఆయిల్‌పామ్ గెలల ధర పడిపోతూండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2022 మే నెలలో టన్ను గెలలకు అత్యధికంగా రూ.22,500 ధర పలికింది. ఇప్పటి వరకూ ఇదే రికార్డు స్థాయి ధర. దీంతో, తోటల శిస్తులను రైతులు పెంచేశారు. అయితే, వివిధ కారణాలతో 2023, 2024 సంవత్సరాల్లో ఆయిల్‌పామ్ గెలల సగటు ధర ఏ దశలోనూ రూ.15 వేలకు చేరుకోలేదు. అటు శిస్తులు పెరిగిపోయి, ఇటు గెలల ధర పడిపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో ఆరు నెలలుగా టన్ను గెలల ధర రూ.20 వేల మార్కును దాటింది. గత మార్చి నెలలో రూ.20,935కు చేరింది. దీంతో, ఊపిరి పీల్చుకుంటున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఊహించని రీతిలో షాక్ ఇచ్చింది. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం రైతులకు పిడుగుపాటుగా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో ముడి పామాయిల్‌ను ఆయా కంపెనీలు తక్కువ ధరకే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా దేశీయంగా ఉత్పత్తి అవుతున్న ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.20,935 నుంచి ఏకంగా రూ.17,340కి పడిపోయింది. దీంతో, రైతులు టన్నుకు రూ.3,535 మేర నష్టపోతున్నారు. కేంద్రం వెంటనే దిగుమతి సుంకాన్ని పెంచాలని, 10 శాతంగానే కొనసాగిస్తే టన్ను గెలల ధర రూ.15 వేలకు పడిపోయి, తాము మరింతగా నష్టపోతామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక కమిటీ సూచించిన విధంగా ఆయిల్‌పామ్ గెలల కనీస ధరను టన్నుకు రూ.22 వేలుగా నిర్ణయించాలని సోమన్న చౌదరితో పాటు పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

వంట నూనెల కొరత దృష్ట్యా ఆయిల్‌పామ్ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. కనీస ప్రోత్సాహక ధరగా రూ.25 వేలు చెల్లించాలి. దిగుమతి సుంకాలతో ఆయిల్‌పామ్ గెలల ధరకు ముడి పెట్టకూడదు. వైట్ ఫ్లై (తెల్లదోమ) కారణంగా గెలల దిగుబడి తగ్గిపోవడం వలన కూడా రైతు నష్టపోతున్నాడు. నూనె శాతాన్ని నిర్ణయించే పెదవేగి ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించరాదు.

– పెండ్యాల బుజ్జిబాబు, తూర్పు గోదావరి జిల్లా ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు, రంగంపేట

కూటమి సర్కారుది దిగజారుడు రాజకీయాలు

- సంక్షేమం మరచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: దళితుడైన చీలి సింగయ్య మృతిలో కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, ఇది కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజమెత్తారు. చాగల్లు మండలం నందిగంపాడులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సింగయ్య మృతిపై అక్రమ కేసులు పెట్టి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారు కింద పడి, మరణించినట్లు చూపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. దానిలో భాగంగానే 37 సెకన్ల నిడివితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తయారు చేసిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారని, దాని ఆధారంగా అక్రమ కేసులు కట్టారని ఆరోపించారు. ఈ కేసులపై జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, కోర్టుకు ప్రభుత్వం ఇప్పటికీ ఆధారాలు చూపించలేక వాయిదాలు అడుగుతోందని అన్నారు. నిజంగా 4 టన్నుల బరువున్న జగన్ కారు కింద పడి చనిపోయి ఉంటే సింగయ్య తల నుజ్జునుజ్జు కాకుండా ఎలా ఉందో చంద్రబాబే చెప్పాలని ప్రశ్నించారు. కారు చక్రం ఎక్కి ఉంటే దాని తరువాత వీడియో కానీ, కారు కింద నుంచి సింగయ్యను బయటకు తీసిన వీడియో కానీ ప్రభుత్వం వద్ద ఎందుకు లేవని నిలదీశారు. వీడియోతో ప్రభుత్వం ఆడుతున్న నాటకాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ప్రమాదాలు జరిగితే వాహనం డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారిపై కేసులు పెట్టిన చరిత్ర ఎక్కడా ఎప్పుడూ లేదని, తొలిసారి కూటమి ప్రభుత్వమే ఆ రికార్డు కూడా నమోదు చేసుకుందని విమర్శించారు. బస్సు డ్రైవర్ యాక్సిడెంట్ చేస్తే అందులోని ప్రయాణికులందరిపై కేసు పెడతారా అని ప్రశ్నించారు. సింగయ్య మృతిపై సీబీఐ విచారణ జరిపి, దీని వెనుక ఉన్న కుట్రను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. కేవలం జగన్‌ను కేసులో ఇరికించే దురుద్దేశంతో కూటమి నాయకులు ఒక నిండు ప్రాణం బలిగొన్నారని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గతంలో గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు పబ్లిసిటీ కోసం 29 మంది ప్రాణాలు తీశారని, ఈ ఘటనలో మొదటి ముద్దాయి ఆయనేనని వెంకట్రావు ఆరోపించారు. ఎన్నికల ముందు ఇరుకు సందుల్లో మీటింగులు పెట్టి ఎనిమిది మంది మరణానికి, వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో ఆరుగురు భక్తుల మృతికి కారకులయ్యారని, వీటన్నింటికీ సంబంధించి చంద్రబాబుపై ఎందుకు కేసు పెట్టకూడదని ప్రశ్నించారు.

అక్రమ కేసులు

కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలవుతున్నా ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వెంకట్రావు దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే అక్రమ కేసులతో నందిగం సురేష్, వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పోసాని కృష్ణమురళి, జోగి రమేష్ కుమారుడిని అరెస్టు చేశారని గుర్తు చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన భార్య జయసుధపై అక్రమ కేసులు పెట్టి అరెస్టుకు ప్రయత్నించారన్నారు. అసలు జరగని లిక్కర్ స్కామ్‌ను జరిగినట్లు చూపించి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కూడా అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించారని చెప్పారు. ఐపీఎస్ అధికారులు, కొమ్మినేని శ్రీనివాసరావు వంటి జర్నలిస్టులను సైతం కేసులు, అరెస్టులతో కక్ష సాధిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు వైఎస్సార్ సీపీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు 240 మందిని జైళ్లకు పంపించారని చెప్పారు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని వెంకట్రావు అన్నారు.

జగన్‌ను కలిసిన శిరీష్

తన దివంగత తండ్రి ఫొటోపై జగన్ సంతకం చేస్తున్నప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్న శిరీష్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శిరీష్ తండ్రి దివంగత మిండగుదటి మోహన్ పార్టీ జిల్లా నేతగా ఆది నుంచి కరోనా వరకూ సేవలు అందించారు. అప్పట్లో జగన్‌ను కలిసినప్పుడు తీసిన ఫొటోను చూపించారు. అప్పుడు జగన్ ఆ ఫొటోపై తన ఆటోగ్రాఫ్ ఇచ్చారని శిరీష్ చెప్పారు.

ధన దైన్యాలు

- నెలలు గడుస్తున్నా ధాన్యం డబ్బులు ఇవ్వని సర్కారు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం బకాయి రూ.399 కోట్లు
- ఖరీఫ్ పెట్టుబడికి రైతుల అగచాట్లు
- ధాన్యం సొమ్ము ఇస్తారా.. ఇవ్వరా అని ప్రశ్న

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నపూర్ణగా ఖ్యాతినొందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు పీకల్లోతు దైన్యంలో కూరుకుపోయారు. రబీ ధాన్యం డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న తీరని జాప్యం అన్నదాతలకు శాపంగా మారింది. ఒకటీ రెండూ రోజులు కాదు.. ఒకరో ఇద్దరో రైతులూ కారు.. వందా రెండు వందల రూపాయలు అంతకంటే కాదు.. ఏకంగా రెండు నెలలుగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకారం రూ.399 కోట్ల మేర ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో ఖరీఫ్ పంటకాలం ప్రారంభమైపోయింది. ఈ నెల 15లోగా నారుమళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ధాన్యం డబ్బులు ఇవ్వడం లేదు. మరోవైపు గత వైఎస్ జగన్ ప్రభుత్వం మాదిరిగా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కూడా అందించడం లేదు. పైగా ఈ పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చి రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల్లో గొప్పగా చెప్పారు. కానీ, ఇప్పటి వరకూ నయాపైసా కూడా ఇవ్వలేదు. దీంతో, సాగు పెట్టుబడి కోసం రైతులు నానా అగచాట్లూ పడుతున్నారు. ప్రభుత్వమే నెలల తరబడి ధాన్యం సొమ్ము తొక్కిపెడితే ఖరీఫ్ సాగు ఏవిధంగా చేయగలమని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ రైతును కదిలించినా ధాన్యం సొమ్ము రాలేదంటూ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు.

గొప్ప చెప్పి.. చిప్ప చూపి..

ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు కూటమి నేతలందరూ ధాన్యం అమ్మిన 24 లేదా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామమని గొప్పగా చెప్పారు. మంత్రి నాదెండ్ల అయితే ధాన్యం కొనుగోళ్లు జరిగిన సమయంలో ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ధాన్యం సొమ్ముపై రైతులకు ఆశలు కల్పించారు. కొనుగోళ్లు ప్రారంభమైన తొలి పక్షంలో మాత్రం ప్రచారార్భాటం కోసం రైతుల ఖాతాల్లో సొమ్ము వేశారు. మే మొదటి వారం నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రం డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోంది. దీంతో, కడుపు మండిన అన్నదాతలు ధాన్యం సొమ్ము కోసం ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. అంతే కాకుండా, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు, నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం రూరల్; కాకినాడ జిల్లా పెద్దాపురం; కోనసీమ జిల్లా అమలాపురం తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు.

రైతులు తక్కువలో తక్కువ ఎకరాకు 50 బస్తాల (75 కేజీలు) దిగుబడి సాధించారు. ఈ మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ప్రతి రైతుకు ఎకరానికి రూ.86 వేలు పైగా రావాలి. ఈవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం రూ.399 కోట్ల మేర ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఇది ఓవైపు ఖరీఫ్ ఖరీఫ్ సాగు ప్రారంభమైపోయినా ధాన్యం బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ పెద్దల నుంచి ఉలుకూపలుకూ లేదు. కాకినాడలో బుధవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు సైతం ప్రభుత్వ నిర్లక్ష్యంపై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు.

జిల్లాల వారీగా రబీ ధాన్యం బకాయిలు

కాకినాడ	రూ.80 కోట్లు
కోనసీమ	రూ.189 కోట్లు
తూర్పు గోదావరి	రూ.130 కోట్లు
మొత్తం	రూ.399 కోట్లు



నిడదవోలు మండలం డి.ముప్పవరంలో ధాన్యం సొమ్ము కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

అప్పు పుట్టక..

కూటమి సర్కారు గద్దెనెక్కినప్పటి నుంచి మార్కెట్‌లో నగదు చలామణీ భారీగా పడిపోయింది. దాదాపు అన్ని వర్గాల వద్ద డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. ఏటా పంట పెట్టుబడిలు సమయంలో సొమ్ము సర్దుబాటు చేసే కమీషన్ ఏజెంట్లు కూడా ఈసారి చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు అప్పు పుట్టడం లేదు. ఖరీఫ్‌కు సమాయత్తమయ్యే తరుణంలో రైతులు ఇన్ని కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని రైతు నేతలు మండిపడుతున్నారు.

అప్పులతోనే ఖరీఫ్ సాగు

అట్లపాడులో 9.2 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు రూ.45 వేల వరకూ పెట్టుబడి పెట్టి రబీ సాగు చేశాను. ఎకరాకు 49 బస్తాల దిగుబడి వచ్చింది. ఏప్రిల్ 27న రైస్‌మిల్లుకు తోలాను. రూ.7.60 లక్షల వరకూ రావాల్సి ఉంది. రెండు నెలలు గడచినా ప్రభుత్వం ఇంకా మా డబ్బులు జమ చేయలేదు. దీంతో, మళ్లీ అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేపట్టాను.

– కొత్తపల్లి సత్యనారాయణ, కౌలు రైతు, సమిశ్రగూడెం, నిడదవోలు మండలం

ఒక్క రూపాయీ రాలేదు

రబీలో పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.2.50 లక్షల వరకూ పెట్టుబడి అయ్యింది. దీని కోసం అప్పు చేశాను. ఎకరాకు 30 కాటాల (బస్తాల) దిగుబడి వచ్చింది. కాటాకు రూ.1,720 చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మే నెలలో అమ్మాను. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రాలేదు. సుమారు రూ.5 లక్షల వరకూ రావాల్సి ఉంది. శిస్తు చెల్లించడానికి డబ్బుల్లేకపోవడంతో ఖరీఫ్‌లో కౌలుకు ఇవ్వడానికి రైతులు ఇబ్బంది పెడుతున్నారు. ఖరీఫ్ పెట్టుబడులకు సైతం అప్పులు చేయాల్సి వస్తోంది. తక్షణమే ధాన్యం డబ్బులు చెల్లించాలి.

– రేవాడ వీరబాబు, కౌలు రైతు, గోకవరం

50 రోజులుగా ఎదురు చూపులు

నేను కొండగుంటూరులో ఐదెకరాల వరి సాగు చేశాను. మూడెకరాలు కౌలు, రెండు ఎకరాలు సొంత భూమి. మొత్తం ధాన్యాన్ని మే 13న విక్రయించాను. కౌలు భూమికి సంబంధించి రూ.2.29 లక్షలు, సొంత భూమికి సంబంధించి రూ.1.75 లక్షలు మొత్తం సుమారు రూ.4.04 లక్షలు రావాల్సి ఉంది. ధాన్యం అమ్మగానే త్వరలోనే మీ డబ్బులు చెల్లిస్తామంటూ మెసేజ్ వచ్చింది. 50 రోజులుగా ఎదురు చూస్తున్నా చిల్లిగవ్వ కూడా నా ఖాతాకు జమ కాలేదు. ట్రాక్టర్, ఎరువులు తదితర ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. ధాన్యం డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంతో సాగులో వచ్చేదంతా వడ్డీలకే పోయేటట్లు ఉంది.

– అద్దంకి వెంకట రమణ, కేశవరం, మండపేట మండలం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

సమర్థవంతంగా నేరాల కట్టడి

- పోలీసు అధికారులు, సిబ్బంది సహకారం భేష్
- ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి
- నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాలో నేరాలను సమర్థంగా అరికట్టగలుగుతున్నామని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం అర్ధ సంవత్సర నేర సమీక్ష నిర్వహించారు. 2025లో ఇప్పటి వరకూ జరిగిన సంఘటనలు, చేపట్టిన వివిధ కార్యక్రమాలు, పోలీసులు ఛేదించిన కేసులు, సాధించిన విజయాలను చర్చించారు. కేసుల దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించాలని, బాధితులకు అండగా నిలవాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కట్టడి చేయాలన్నారు. ఈ సమీక్షలో గుర్తించిన లోపాలను సరిదిద్దుకొని, రాబోయే ఆరు నెలలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 9వతేదీన బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల ఏడవ తేదీన క్లస్టర్ స్థాయిలో జరిగే పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారు అర్హులన్నారు. జనాభా, కౌమార విద్య, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం పోటీలు నిర్వహిస్తామన్నారు. పొగాకు దుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిషేధంపై పెయింటింగ్ పోటీలు, లింగ సమానత్వం, గౌరవంపై వ్యాసరచన పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 11వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 98498 94917, 99632 11075 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

8 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: డీసెట్–2025 ద్వారా రెండు సంవత్సరాలు డిప్లమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు మొదట విడత కౌన్సెలింగ్‌కి సంబంధించి అర్హత పొందిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ జారీ చేస్తారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బొమ్మూరులోని డైట్, ప్రైవేటు డీఎడ్ కాలేజీలు, రంపచోడవరం ఐటీడీఏ డీఎడ్ కాలేజీలో ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ పొందిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు బొమ్మూరులోని డైట్‌కు హాజరై అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన తరువాత ఫైనల్ అడ్మిషన్ లెటర్ పొందాలని డైట్ ప్రిన్సిపాల్ కోరారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

నేడే పట్టాభిషేకం

- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం
- వర్సిటీ కులపతి, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు

స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వర్సిటీ వీసీ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివినవారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వేదిక అవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలలో ఉన్న వారికి సైతం పట్టా అందుకోవడానికి వర్సిటీ ఆహ్వానాలు పంపింది. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పట్టా (ఒరిజనల్ డిగ్రీ) తీసుకోవడానికి ఏర్పాట్లు చేసింది. జీవితంలో మధురానుభూతిగా నిలిచే ఈ వేడుకలకు అర్హులైన వారు తమ వివరాలు వర్సిటీకు పంపించారు. గత ఏడాది డిసెంబర్‌లో స్నాతకోత్సవం నోటిఫికేషన్ జారీ చేసి గవర్నర్ అనుమతితో శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 11వ స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పట్టాలు అందజేస్తున్నారు. బీటెక్ విభాగంలో 41,258, బిఫార్మశీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఎంసీఏ 1115, ఎంఫార్మశీ 458, బీబీఏ 115, ఫార్మడీ 274, బీఆర్క్ 83 ఓడీ (ఒరిజనల్ డిగ్రీ)లు విద్యార్థులు పొందనున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు 40మందికి, పీహెచ్‌డీలు 99 మందికి అందజేయనున్నట్టు వర్సిటీ వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థి కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్..

స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, అమెరికా బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. విజయవాడలో జన్మించిన ఈయన జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలలో బీటెక్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందారు. 1986లో అమెరికాలో బోస్టన్ గ్రూప్ స్థాపించి సుమారు 2,500 మందికి యూఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించి మలేషియా, ఇండోనేషియా, ఫిలిఫిన్స్ వంటి దేశాల్లో కార్యకలాపాలు ప్రారంభించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా జేఎన్‌టీయూకేలో సుబుకోటా ఫౌండేషన్ స్థాపించి కోటి రూపాయలు విరాళంగా అందజేశారు. ప్రతి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహిహించి నగదు బహుమతితో ప్రొత్సహిస్తున్నారు.

కోట సుబ్రహ్మణ్యం

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి

- ఓ కారు టైరు పేలి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టిన వైనం
- ఇద్దరికి గాయాలు

ప్రమాదంలో మృతి చెందిన నరసింహ గుప్తా

కార్లను క్రేన్ సాయంతో తొలగిస్తున్న హైవే సిబ్బంది

గాయపడిన లక్ష్మీదేవిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

గాయాలతో ఉన్న భార్య దివ్యపద్మజ్యోతితో భర్త రామారెడ్డి

రావులపాలెం: కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి అవతల దారిలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. రావులపాలెం మండలంలో ఈతకోట టోల్ ప్లాజా సమీపంలో గురువారం జరిగిన ఈ ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన బొండాల నరసింహ గుప్తా (55) మృతి చెందారు. పాలకొల్లుకు చెందిన గుప్తా భార్య వీర వెంకట లక్ష్మీదేవితో కలిసి రాజమహేంద్రవరం బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈతకోట టోల్ ప్లాజా దాటాక కొంతదూరంలో కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన కేవీఎస్‌ఎస్ రామారెడ్డి, దివ్య పద్మజ్యోతి దంపతులు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. వీరు రాజమహేంద్రవరం నుంచి పాలకొల్లు బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుప్తా, అతని భార్య వీర వెంకట లక్ష్మీదేవి, మరో కారులో ఉన్న జ్యోతి గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గ మధ్యలో గుప్తా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలిని రావులపాలెం పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. హైవే టోల్ ప్లాజా సిబ్బంది క్రేన్ సాయంతో కార్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పంట కాల్వలు కలుషితం

హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంట కాల్వల ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు మానవ తప్పిదాలతో కలుషిత అవుతున్నాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలో గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ మానవ నిర్లక్ష్యం, తప్పిదాలపై తాను హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కాల్వల ద్వారా ప్రవహించే గోదావరి జలాలతో పంటల సాగే కాకుండా పలు గ్రామాల్లో తాగునీటి ప్రాజెక్ట్‌లు నిర్వహిస్తున్నారని వివరించారు. కొందరు తమ ఇళ్ల మరుగుదొడ్ల గొట్టాలు కాల్వల్లోకి అమర్చుకొని కలుషితం చేస్తున్నారని, తద్వారా పంట కాల్వలు మానవ మల మూత్రాలతో ప్రవహిస్తున్నాయని ఎమ్మెల్సీ ఆందోళన వ్యక్తం చేశారు. సాగు, తాగునీరు కోసం కాటన్ దొర పంట కాల్వల వ్యవస్థను తీసుకుని వస్తే స్వార్థపరులు, కాల్వలను పర్యవేక్షించాల్సి అధికారుల నిర్లక్ష్యం వల్ల కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. కాల్వలను కలుషితం చేయవద్దని, వ్యర్థాలను వదల వద్దని న్యాయస్థానాలు హెచ్చరిస్తున్నాయని గుర్తు చేశారు. కాల్వలను కలుషిత చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పేర్కొన్నారు.

సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులపై దాడి దారుణం

హైకోర్టు న్యాయవాది సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: గోకవరం మండలం మల్లవరం గ్రామంలో సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులు, అర్చకత్వం చేస్తున్న వారిపై దాడికి పాల్పడి వారి గృహలను ధ్వంసం చేయడమే కాకుండా దేవుడి పూజా సామగ్రి, బంగారం, వెండి ఆభరణాల చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్య నారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గుడిలో అర్చకత్వం చేస్తున్న పసుపులేటి సింగారలక్ష్మి, వి.సీతామహలక్ష్మితో కలిసి మాట్లాడారు. సింగారమ్మ చింతగా పేరొందిన అది ప్రైవేటు ఆలయమే అయినప్పటికీ భక్తులు ఇటీవల భారీగా తరలివస్తున్నారని, అమ్మవారికి పూజలు చేస్తున్నారని తెలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ ఆలయాన్ని తమ చేతిలో పెట్టుకోవాలనే దురుద్దేశంతో ఏప్రిల్ 23వ తేదీ రాత్రి వట్టికూటి వీర రాఘవమ్మ, పసుపులేటి సింగారలక్ష్మిపై దాడి చేసి గృహలను, షాపులను కూల్చి వేశారని, సుమారు రూ.25 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను దోచుకుని పోయారని అన్నారు. గోకవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. తాము హైకోర్టులో జూన్‌20న రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. బాధితులు మే 26న జిల్లా కలెక్టర్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారని తెలిపారు. 1880 నాటి కాలంలో వారి ముత్తాత పసుపులేటి వెంకన్న, పసుపులేటి వీరరాఘవమ్మ దంపతులు చింతచెట్టు కింద వెలసిన సింగారమ్మ తల్లికి సుమారు 5 ఎకరాల అడవిని చదును చేసి ఆలయ ప్రాంగణంగా రూపొందించారన్నారు. వంశ పారంపర్యంగా ఆలయం వద్దనే నివాసాలు ఏర్పర్చుకుని పూజారులుగా, ట్రస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి గుడిని రక్షించాలని కోరుతున్నామన్నారు. వట్టికూటి దుర్గాప్రసాద్, వట్టికూటి జనార్ధనరావు, సీతామహలక్ష్మి, ఆలమూరు ధనలక్ష్మి, పసుపులేటి శ్రీ వెంకట సూర్య చక్ర ధనుష్‌కుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు

పిఠాపురం: హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి గురువారం తీర్పు చెప్పినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆరుగుళ్ళ శ్రీను, భార్య గంగకు సంసారంలో విభేదాలు తలెత్తాయి. దాని కారణంగా అతని భార్య మూడు నెలల క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో భర్త శ్రీను 2019 జనవరి 16వ తేదీన సంక్రాంతి పండగకు తన భార్యను, పిల్లలను తీసుకెళ్లేందుకు చేబ్రోలులో అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా అత్తింటి తరపు బంధువులకు, అతనికి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో బావ మరుదులైన దొండపాటి చంద్రబాబు, దొండపాటి అర్జున్, వదిన వరస అయిన నేదూరి రత్నం అతనిపై దాడి చేసి తలపై కొట్టగా శ్రీను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని అక్క దొండపాటి శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై బి రామకృష్ణ కేసు నమోదు చేయగా, అప్పటి పిఠాపురం సీఐ ఎస్.సూర్య అప్పారావు కేసు దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో దొండపాటి చంద్రబాబుకి రెండు సంవత్సరాల జైలు శిక్ష , జరిమానా, దొండపాడు అర్జునుడికి రెండు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. మూడవ ముద్దాయి అయిన రత్నంపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెపై కేసు కొట్టి వేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున విశ్వనాథరెడ్డి, వినయ్ తేజ వాదనలు వినిపించారు. సాక్షులను గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కోర్టులో హాజరు పర్చారు.

ఎయిర్ వాల్వ్‌లో పడిన కారు

తప్పిన ప్రమాదం

గోతిలో పడి విరిగిన కారు ముందు చక్రం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వెళ్తున్న ఒక కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న మంచినీటి పైపు లైన్ ఎయిర్ వాల్వ్ గోతిలో పడటంతో ముందు చక్రం విరిగి పోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం నుంచి కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువ నుంచి ముంగండ మంచినీటి ప్రాజక్టుకు వెళ్లే పైపులైన్లు గతంలో రోడ్డు మార్జిన్లో ఉండేవి. అయితే ఇటీవల రోడ్డును వెడల్పు చేశారు. దీంతో మూడుచోట్ల పైపు లైన్ల ఎయిర్ వాల్వ్‌లు సీసీ రోడ్డులోకి వచ్చాయి. దీంతో అక్కడ రంధ్రాలు ఏర్పడటంతో సిమెంట్ వరలు ఏర్పాటు చేశారు. ఆ వరలు విరిగిపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. వీటిని గమనించని వాహన చోదకులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలయ్యారు. తక్షణమే ఎయిర్ వాల్వ్‌లు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఫోర్జరీ పోలీస్' సస్పెన్షన్

కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు

కాకినాడ క్రైం: రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసిన హెడ్ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. విధుల నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం రాజమహేంద్రవరం జీఆర్‌పీ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు ఏకంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసి ఎస్ఐని అని ఓ నకిలీ ఐడీ కార్డును తన పేరుతో తయారు చేసుకున్నాడు. ఈ కార్డుని వాడుతూ, పలుచోట్ల బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ తరహాలోనే కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్‌లో ఓ కుటుంబ వివాదంలో విచారణ పేరుతో కామేశ్వరరావు జోక్యం చేసుకున్నాడు. విచారణ సమయంలో ఓ మహిళను తాను ఎస్ఐని అని చెబుతూ నకిలీ ఐడీ కార్డు చూపించి మరీ బెదిరించారు. అయితే, అప్పటికే కామేశ్వరరావుది హెడ్‌కానిస్టేబుల్ హోదా అని తెలుసుకున్న మహిళ నకిలీ ఐడీ కార్డు వ్యవహారాన్ని కాకినాడ జిల్లా ఎస్పీబిందుమాధవ్, ఇంటెలిజెన్స్ అధికారులకు వెల్లడించి, కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ మొదలు కాగా, ప్రాథమిక ఆధారాల ప్రాతిపదికగా రాజమహేంద్రవరం జీఆర్‌పీ నుంచి అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు కామేశ్వరరావును పంపారు. లోతైన విచారణ అనంతరం ఆరోపణలన్నీ వాస్తవాలని తేలడంతో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా కామేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కాకినాడ జిల్లా పోలీస్ శాఖకు సిఫారసు చేశారు. కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్ వద్ద మహిళను నకిలీ ఎస్ఐ ఐడీ కార్డుతో బెదిరించిన నేరంలో కామేశ్వరరావుకి సహకరించిన ఓ మహిళా కానిస్టేబుల్ పైనా చర్యలు తీసుకోవాలని, బదిలీపై తూర్పుగోదావరి జిల్లా పోలీస్ శాఖకు వెళుతున్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు అనకాపల్లి ఎస్పీ సిఫారసు చేశారు.

ప్రముఖ దేవాలయాల శానిటరీ టెండర్ వాయిదా?

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ ఆలయాలకు శానిటరీ మెటీరియల్‌తో సహ క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్‌డ్ ఈ ప్రొక్యూర్ రీ టెండర్ ఖరారు వాయిదా పడినట్లు సమాచారం. ఈ టెండర్‌కు సంబంధించి సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్ ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి లోయెస్ట్ టెండర్ కొటేషన్ ఖరారు చేయాల్సి ఉంది. అయితే గురువారం ఈ టెండర్ ప్రైస్ బిడ్‌ను అధికారులు ఓపెన్ చేయలేదని సమాచారం. ఈ నెల ఎనిమిదో తేదీన చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థల ప్రతినిధులతో ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ప్రైస్ బిడ్ ఓపెన్ చేస్తారని అధికారులు తెలిపారు. అయితే ఈ నెల తొమ్మిదో తేదీన సింహాచలం దేవస్థానం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉన్నందున దేవదాయశాఖ కమిషనర్‌తో సహా అధికారులు ఆ రోజు సింహాచలంలో ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ సమావేశం 11కి వాయిదా పడే అవకాశం ఉంది. ఆ రోజునే టెండర్ ఖరారు అవుతుందని అధికారులు అంటున్నారు.

9 నుంచి 'నన్నయ'లో సెమినార్

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 9,10 తేదీలలో ఇంటర్నేషనల్ సెమినార్ జరుగనుంది. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్ అనలిటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జరిగే ఈ సెమినార్‌కి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం విడుదల చేశారు. ఈ సెమినార్‌లో స్పీకర్స్‌గా ప్రొఫెసర్ కేవీ రామానుజాచారి (యుఎస్ఏ), సైంటిస్టు డాక్టర్ ఎన్.నాగన్న (చైనా), ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు (వరంగల్), డాక్టర్ రాంబాబురెడ్డి (ఐఐటీ – ఖరగ్‌పూర్) పాల్గొంటారన్నారు. దీనికి కన్వీనర్‌గా డాక్టర్ బి. జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తారు.

నిలువ నీడేదీ!

- పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణమెప్పుడో?
- 2023లో 60 గదుల సత్యదేవ సత్రం కూల్చివేత
- రూ.1.99 కోట్లతో షెడ్డు నిర్మాణానికి లారెస్ ఫార్మా సంసిద్ధత
- ఆ నిధులను మరో కార్యక్రమానికి వెచ్చించిన సంస్థ
- నీడ లేక సత్యదేవుని భక్తులకు ఇక్కట్లు

గత కార్తిక మాసంలో పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి 2023లో విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముందుకు వచ్చింది. రత్నగిరి రామాలయం పక్కన రేకులతో వేసిన విశ్రాంతి షెడ్డు లాగే ఇక్కడ కూడా నిర్మించాలని నిర్ణయించారు. అందుకు ఆ సంస్థ కూడా అంగీకరించింది. ఆ తర్వాత కొత్త ఈఓ రావడంతో ఆ ప్రతిపాదన కాస్తా అటకెక్కింది. దీంతో ఆ నిధులను సంస్థ మరో కార్యక్రమానికి వినియోగించింది. అనంతరం ఇక్కడ రేకుల షెడ్డు కాకుండా, ప్లాస్టిక్ క్లాత్‌లా టెన్సిల్ రూఫ్ షెడ్డు వేయాలని దేవస్థానం ప్రతిపాదించింది. దీనిపై ఆలోచన చేస్తామని సంస్థ యాజమాన్యం తెలిపింది. ఈ క్రమంలో నీడ లేక, చలువ పందిరిలో వర్షానికి తడిసి భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నీడ లేక అవస్థలు

పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గతంలో 60 గదులతో సత్యదేవ అతిథి గృహం (సత్రం) ఉండేది. భక్తుల కోసం (గ్యాలోరిమ్ టైల్స్ రూఫ్ షెడ్) విశ్రాంతి షెడ్డు నిర్మించాలనే ఆలోచనతో ఆ సత్రాన్ని 2023 అక్టోబర్‌లో తొలగించారు. అక్కడ విశాల షెడ్డు నిర్మించాలని అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రణాళిక రూపొందించారు. విశాఖపట్నానికి చెందిన లారెస్ సంస్థ రూ.1.99 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఆ ఏడాది కార్తిక మాసం ప్రారంభం కావడంతో తాత్కాలిక షెడ్డు నిర్మించారు. కార్తిక మాసం అనంతరం షెడ్డు నిర్మించడానికి ఆ సంస్థ మెటీరియల్ కూడా సిద్ధం చేసింది.

ఈఓ బదిలీతో..

కాగా, ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ఆయన స్థానంలో ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ బాధ్యతలు చేపట్టారు. రేకుల షెడ్డు నిర్మిస్తే రాజగోపురం కనిపించదని ఆయన ఆ ప్రతిపాదనకు అభ్యంతరం చెప్పారు. ఈ నేపథ్యంలోనే లారెస్ సంస్థ ఆ నిధులను వేరే పనులకు వినియోగించింది.

పార్కింగ్‌గా షెడ్డు స్థలం

పశ్చిమ రాజగోపురం ఎదురుగా సత్రం కూల్చివేయడంతో, ఆ ప్రదేశం పార్కింగ్ స్థలంగా మారింది. దేవస్థానం బస్సులు కూడా ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడ నుంచి సత్యదేవుని ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. వేసవిలో భక్తుల కోసం చలువ పందిళ్లు వేస్తున్నారు. ఈ ఏడాదీ అలాగే చేశారు. వర్షం పడితే చలువ పందిళ్ల నుంచి నీరు కారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం వారు కనీసం షెడ్డు వేయలేరా అని ప్రశ్నిస్తున్నారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు గత ఫిబ్రవరిలో లారెస్ సంస్థ ప్రతినిధులను షెడ్డు నిర్మించాలని కోరారు. నాలుగు నెలలైనా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఆ సంస్థ ముందుకు రాకపోతే దేవస్థానం నిధులైనా వెచ్చించి, షెడ్డు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రావణ మాసంలో రద్దీ

ప్రస్తుతం ఆషాఢ మాసంలో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా.. జూలై 25 నుంచి శ్రావణ మాసంలో సత్యదేవుని ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. వివాహాల సీజన్ కావడంతో రాత్రి వేళల్లో కూడా పెద్ద సంఖ్యలో పెళ్లి బృందాలు వస్తాయి. అదే సమయంలో వర్షాలు కూడా అధికమవుతాయి. దీంతో భక్తుల అవస్థలు చెప్పనలవి కాదు.

అధికారులు ఏమన్నారంటే..

పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి లారెస్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. పూర్తి స్థాయిలో నిధులు లేవని తెలిపింది. చిన్న షెడ్డు నిర్మిస్తామని చెప్పింది. పూర్తి వివరాలు త్వరలో తెలియచేస్తామన్నారు. వారు అంగీకారం తెలిపిన వెంటనే దేవస్థానం చైర్మన్, ఈఓల అనుమతి తీసుకుని షెడ్డు నిర్మిస్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి, రాజవోలు దగ్గరలో శ్రీమాన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ సైట్స్, ఇండిపెండెంట్ హౌస్‌లు, విల్లాస్ మరియు అపార్ట్మెంట్స్ కొరకు సంప్రదించండి. JSR – ✆ : 70139 92077 [R-960]

Services

జ్యోతిష్యాలయం



■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

CHANGE OF NAME

■ I, Ramakrishna Reddy Nallamilli S/o. Ammi Reddy Nallamilli R/o. 3-8, Sivalayam Street, Near Satya Sai Nilayam, Ubalanka, East Godavari, Andhra Pradesh - 533237, have Changed the Name of My Minor Daughter Namely Nallamilli Papa (Aged 14 Years 2 Months). And She Shall Hereafter Be Known as Nallamilli Bhoomi for All Future Purposes [DA-39176]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]

■ ఫార్మసీ కంపెనీ చౌటుప్పల్, హైదరాబాద్ నందు లేబర్ వర్క్ చేయుటకు 20–30 సంవత్సరాలలోపు యువకులు కావలెను. జీతం: 12–15 వేలు. సంప్ర।। సెల్: 91773 12968, 98499 93684 [YA-2871]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ఏలూరు

శుక్రవారం । 4 । జూలై । 2025

అప్రమత్తతతో రక్తహీనత దూరం

రక్తహీనత వల్ల మేత మానేసి పశువులు బలహీనంగా మారతాయి. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి సూచిస్తున్నారు. 8లో ▸

ఆటో, బ్యాటరీల దొంగల అరెస్ట్

ఆటోలు, బ్యాటరీ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.23 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

దోమలపై దండెత్తరే?

వర్షపు నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమల విజృంభణతో విష జ్వరాల బెడద ఆందోళనకు గురిచేస్తోంది. 8లో ▸

న్యూస్‌రీల్

ఐచ్ఛిక సెలవులకు అనుమతి ఇవ్వండి

డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు క్యాలెండర్ సంవత్సరం ప్రకారం ఐచ్ఛిక సెలవులకు అనుమతులివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు ఫ్యాప్టో నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 5వ తేదీన మొహర్రం, అక్టోబర్ 9న యజ్‌దహుకు షరీఫ్, నవంబర్ 5న కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 26న బాక్సింగ్ డేలను పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవులు తీసుకునేందుకు అనుమతులివ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించన వారిలో ఫ్యాప్టో ఛైర్మన్ జీ మోహన్‌రావు, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, ఫ్యాప్టో నాయకులు ఆర్.రవికుమార్, టీ రామారావు, సీహెచ్ శివరామ్ తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఏలూరులోని బాలికల హాస్టల్ నెంబర్ 1 ని తనిఖీ చేస్తున్న జేడీ

ఏలూరు (టూటౌన్): హాస్టల్‌లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వై.విశ్వమోహన్ రెడ్డి ఆదేశించారు. ఏలూరు నగరంలోని బాలికల హాస్టల్ నెంబర్ 1 ను గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో వసతులను, విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్లో సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. డ్రాప్ ఔట్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.

డ్రాపవుట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ విధిగా పాఠశాలలకు వెళ్లేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, అధికారులపై కూడా ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నేను బడికి పోతా కార్యక్రమం అమలుపై జిల్లాస్థాయి అవగాహన పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. డ్రాపవుట్స్‌కు సంబంధించి సమాచారం ఇచ్చేందుకు 95333 99981 నంబరుతో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పంటల బీమా పథకంపై అవగాహన

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినపుడు రైతును ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో సార్వా 2025కి వరి పంటకు గ్రామ యూనిట్‌గా, మినుములు పంటకు జిల్లా యూనిట్‌గా, పత్తి యాసిడ్ లైన్ పంటలకు మండల యూనిట్‌గా పంట బీమా అమలు చేయడం జరుగుతుందన్నారు.

నేడు మునిసిపల్ కార్మికుల మహాధర్నా

ఏలూరు (టూటౌన్): విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న మహాధర్నాకు మునిసిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, పారిశుధ్య విభాగం వారికి 17 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఉదయం 10 గంటలకు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఈ మహాధర్నా జరుగుతుందని ఆయన తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటన

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ పంచాయతీలు ఎంపికలో భాగంగా జిల్లాలో 25 గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రోజుకి రెండు గ్రామాల చొప్పున జిల్లాలోని 25 గ్రామాల్లో 20 రోజులు ఈ బృందం పర్యటిస్తోందన్నారు.

బాబు వంచనపై పోరుబాట

దగాపై ధర్మాగ్రహం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరిట వైఎస్సార్ సీపీ నిలదీత
- నేడు జిల్లాస్థాయి సమావేశాలకు రీజనల్ కోఆర్డినేటర్ బొత్స హాజరు
- ఉదయం కొండలరావుపాలెంలో ఏలూరు జిల్లాస్థాయి..
- మధ్యాహ్నం భీమవరంలో 'పశ్చిమ' జిల్లాస్థాయి సమావేశం
- రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో ఆవిష్కరణ
- ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి ప్రభుత్వం వంచనపై ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాటకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలుగాని, సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయని వైనంపై ప్రజా క్షేత్రంలో నిరంతర ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీ పిలుపుమేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో ఉమ్మడి పశ్చిమగోదావరిలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా జిల్లాస్థాయి సన్నాహక సమావేశాలు శుక్రవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ రెండు జిల్లాలో జరిగే సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు.

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న కార్యక్రమంపై సన్నాహక సమావేశం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు భీమవరంలోని ఆనంద్ ఇన్‌లో నిర్వహించనున్నారు. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్ర, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు మేకా వెంకట ప్రతాప అప్పారావు, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, మామిళ్ళపల్లి జయప్రకాష్, కంభం విజయరాజుతోపాటు పార్టీ ముఖ్యులు, మండల నియోజకవర్గ నేతలు పాల్గొంటారు. అలాగే మధ్యాహ్నం పశ్చిమగోదావరిలో జరిగే సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుతో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నియోజకవర్గ సమన్వయకర్తలు గుడాల గోపి, చినమిల్లి వెంకట్రాయుడు, పీవీఎల్ నర్సింహరాజుతో పాటు పార్టీ ముఖ్యులు హాజరుకానున్నారు.

దెందులూరులో టీడీపీ చిల్లర రాజకీయాలు

ఏలూరు జిల్లా స్థాయి సమావేశాన్ని అడ్డుకోవడానికి అధికార టీడీపీ చిల్లర రాజకీయాలకు తెరతీసింది. తొలుత పెదపాడు మండలంలోని వట్లూరులోని శ్రీకన్వెన్షన్‌లో సమావేశాన్ని ఖరారు చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి చిల్లర రాజకీయాలతో కన్వెన్షన్ నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చి సమావేశాన్ని అక్కడ జరగకుండా అడ్డుకున్నారు. అలాగే మరో రెండు ఫంక్షన్ హాల్స్‌కు కూడా ముందుస్తు హెచ్చరికలు జారీ చేసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో వేదికను పెదవేగి మండలంలోని కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో ఆవిష్కరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించడానికి వీలుగా రెండు జిల్లాల్లో జరిగే సమావేశాల్లో మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమం నిర్వహించాల్సిన తీరు విధి విధానాలపై శ్రేణులకు వివరించనున్నారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలు, రాష్ట్రస్థాయిలో లెక్కకు మించిన హామీలు, జిల్లా స్థాయిలో పదుల సంఖ్యలో హామీలిచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం, చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత రాజకీయాలు, ఎన్నికల సమయంలో ప్రతి పథకానికి ఎంత నగదు కుటుంబానికి జమ అవుతుందో వివరిస్తూ టీడీపీ ఇచ్చిన ఎన్నికల బాండ్ల మోసాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించేలా ఐదు వారాలు పాటు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా 4వ తేదీన దెందులూరు, 5న చింతలపూడి, పోలవరం, 6న నూజివీడు, 7న ఉంగుటూరు, 8న కైకలూరు, 10వ తేదీన ఏలూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా పార్టీ ముఖ్యులు నిర్ణయించారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' ప్రారంభం

జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసంపై ప్రజలకు వివరించేందుకు 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమాన్ని పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామంలో శుక్రవారం ప్రారంభిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. దెందులూరు పార్టీ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంప్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జిల్లా విస్తృత స్థాయి సమావేశం, దెందులూరు నియోజకవర్గ సమావేశం జరుగుతోందన్నారు. కైకలూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉదయం 8.00 గంటలకు కైకలూరు ఏలూరు రోడ్ పార్టీ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

పట్టిసీమ నీరు విడుదల

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం నీటిని విడుదల చేశారు. ముందుగా 24 పంపులకు పూజలు నిర్వహించి కుడి కాలువలోకి నీరు విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం రెండు పంపుల ద్వారా కుడి కాలువలోకి నీరు విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి విడుదలను క్రమేపీ పెంచే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. అనంతరం డెలివరీ సిస్టమ్ వద్ద గోదావరి నీటికి పూజలు నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయానికి తాళాలు

- టి.నరసాపురం సొసైటీ వద్ద రైతుల నిరసన
- డిపాజిట్ల సొమ్ములు చెల్లించడం లేదని ఆగ్రహం

టి.నరసాపురంలో సహకార సంఘ కార్యకలాపాలను స్తంభింపచేసిన రైతులు

టి.నరసాపురం: డిపాజిట్లు చెల్లించడం లేదని ఆగ్రహించిన రైతులు టి.నరసాపురం సహకార సంఘ కార్యకలాపాలను గురువారం స్తంభింపజేశారు. కార్యాలయ సిబ్బందిని బయటకు రప్పించి వారితోనే సంఘ కార్యాలయానికి తాళాలు వేయించారు. ఉన్నతాధికారులు స్పందించి డిపాజిట్లు చెల్లించేవరకు తమ నిరసన కొనసాగుతుందని, సంఘ కార్యకలాపాలు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. టి.నరసాపురం సహకార సంఘంలో అవకతవకలు బయట పడటంతో రెండేళ్ల క్రితం సహకార సంఘ పాలక వర్గాన్ని తొలగించి అప్పటి సీఈవోను సస్పెండ్ చేశారు. కొద్ది మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ప్రభుత్వ అధికారులను త్రిసభ్య కమిటీగా నియమించి సంఘ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. అయితే దాదాపు 370 డిపాజిట్లకు సంబంధించి రూ.15 కోట్లకు పైగా రైతులకు చెల్లించాల్సి ఉంది. రైతులకు ఆ బాండ్లకు సంబంధించి మెచ్యూరిటీ సొమ్ము చెల్లించడం గాని, బాండ్లు క్యాన్సిల్ చేసుకున్న సొమ్ము చెల్లించడం గాని, ఎస్‌బీ ఖాతాల్లో ఉన్న సొమ్ము నిల్వలు చెల్లించడం గాని చేయడం లేదు. గత మార్చి వరకు డిపాజిట్ల సొమ్మును బాకీదారుల బకాయిల్లో జమ చేసుకునేవారు. ఏప్రిల్ నుంచి ఆ డిపాజిట్ల సొమ్మును కూడా బాకీలకు జమ చేసుకోవడం నిలిపివేశారు. దాంతో ఆగ్రహించిన రైతులు తమ డిపాజిట్ల సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు కార్యాలయ కార్యకలాపాలు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. సీఈవో అగస్టీన్ మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితి ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, మరోసారి ఆయా అధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

గడువు తీరిన కందిపప్పు సరఫరా

గడువు తీరిన కందిపప్పు ప్యాకెట్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి జూలై నెలకు సంబంధించిన అంగన్‌వాడీ సరుకుల్లో గడువు తీరిన కందిపప్పును రేషన్ దుకాణాలకు చేరవేశారు. ప్రతినెలా రేషన్ దుకాణాలకు చెందిన సరుకులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన బియ్యం, కందిపప్పు, నూనె ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేస్తారు. అయితే ఈనెల పంపిన సరుకుల్లో కందిపప్పు ప్యాకెట్లు గడువు తీరిపోయినట్టు అంగన్‌వాడీ అధికారులు గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఇప్పటికే జంగారెడ్డిగూడెం మండలంలోని 54 రేషన్ దుకాణాలకు గత నెల 20 నుంచి అంగన్‌వాడీ సరుకులతో పాటు కందిపప్పును కూడా పంపించేశారు. కందిపప్పు ప్యాక్ చేసిన 5 నెలలలోపు వాడాలని ప్యాకెట్‌పై రాసి ఉంది. గత నెలలో డిసెంబర్‌లో ప్యాక్ చేసిన కందిపప్పును అంగన్‌వాడీ కేంద్రాలకు పంపగా అంగన్‌వాడీ అధికారులు గుర్తించి మార్చి తీసుకువచ్చారు. ఈ నెలలోనూ జనవరి నెలలో ప్యాక్ చేసిన కందిపప్పు ప్యాకెట్లను పంపించారు. ఈ కందిపప్పునూ వెనక్కి పంపాలని ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులు డీలర్లకు తెలిపారు. గడువు తీరిన కందిపప్పును డీలర్లకు పంపడం విమర్శలకు తావిస్తోంది. కాగా కొత్త కందిపప్పు కూడా ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు చేరుకుందని అధికారులు తెలిపారు.

మొరాయిస్తున్న బస్సులతో అవస్థలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సులు తరచూ మొరాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన బస్సులు ఇటీవల మార్గమధ్యలో ఆగిపోతుండడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అత్యవసర పనులపై వెళ్లే వారు ఆర్టీసీ అంటనే హడలెత్తిపోతున్నారు. తరచూగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా ఆర్టీసీ అధికారులు కొత్త బస్సులు ఏర్పాటు చేయడం లేదని, బస్సులకు సరైన మరమ్మతులు నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రయాణం నరకప్రాయం

ఏపీఎస్ ఆర్టీసీ అంటే పేద, బడుగు, బలహీన వర్గాల సొంత వాహనంగా పేరుంది. కాని నేడు ఆ బస్సుల్లో ప్రయాణించాలంటే నరకం చూడాల్సిన పరిస్థితి. నిత్యం ఎక్కడో చోట ఏదో ఒక బస్సు రోడ్డుపై ఆగిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ప్రకటనలు గుప్పిస్తోంది. కానీ తరచుగా బస్సులు బ్రేక్ డౌన్ కావడంతో ఉచిత బస్సు ప్రయాణం దేవుడెరుగు, కనీసం మంచి కండీషన్‌లో ఉన్న బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన పెళ్లి బస్సు (ఫైల్)

బస్సు బ్రేక్‌డౌన్‌తో ప్రయాణికుల అవస్థలు (ఫైల్)

ఆమ్మో ఆర్టీసీ

- ఇటీవల జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం నుంచి పెదవేగి మండలం కొండలరావుపాలెం పెళ్లి నిమిత్తం పెళ్లివారు బస్సును మాట్లాడుకున్నారు. మార్గమధ్యలో వడ్లపల్లి వద్ద బస్సు ఆగిపోయింది. దీంతో పెళ్లి సమయానికి బంధువులు వెళ్లలేకపోయారు. కాలం చెల్లిన బస్సులు పెళ్లి వారికి పంపించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.
- జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు కామవరపుకోట మండలం తడికలపూడి వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఆగిపోయింది. డ్రైవర్ గేరు మార్చుతుండగా గేర్ రాడ్ ఊడి డ్రైవర్ చేతిలోకి వచ్చేసింది. దీంతో బస్సు ఆగిపోయింది. రాత్రి సమయంలో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అరగంట తర్వాత జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన మరో బస్సులో ప్రయాణికులు ఏలూరు చేరుకుని ఊపిరి పీల్చుకున్నారు.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): కొల్లేరును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన 120 జీఓను రద్దు చేయాలని, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిని కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన గురువారం కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వారు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజలకు హానికరమైన ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. మూడో కాంటూరు నుంచి ఐదో కాంటూరు వరకు పది కిలో మీటర్ల దూరంలో సున్నితమైన పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలు విధించి మొత్తం కొల్లేరును పూర్తిగా అటవీ శాఖ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేటి ప్రాంతంలోని 89 గ్రామాలపై పడుతుందన్నారు. అధికారులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

ఆన్‌లైన్ బిజినెస్ పేరిట మోసం

- రూ.2.56 లక్షలు పోగొట్టుకున్న మహిళ
- కేసును ఛేదించి సొమ్ము రికవరీ చేసిన పోలీసులు
- మహిళకు సొమ్ము అందజేసిన ఎస్పీ

బాధిత మహిళకు సొమ్మును అందిస్తున్న జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఆన్‌లైన్ బిజినెస్ పేరుతో ప్రకటనలు చూసి పెట్టుబడి పెట్టిన ఓ మహిళ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంది. ఆమె నుంచి సైబర్ నేరగాళ్లు భారీగా సొమ్ములు కాజేశారు. తాను మోసపోయాయని గ్రహించిన బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించగా కేసును ఛేదించి సొమ్ము రికవరీ చేశారు. ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ సోషల్ మీడియాలో వాట్సాప్, టెలీగ్రామ్ గ్రూపుల్లో వచ్చిన ట్రేడింగ్, బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ పేర్లతో అధిక లాభాలు వస్తాయనే ఆశతో సొమ్ములు పెట్టుబడి పెట్టింది. బాధిత మహిళ నుంచి రూ.2,56,000 సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసు 290/2024 సెక్షన్ 318(4) బీఎన్‌ఎస్, 66(సీ)(డీ) ఐటీ యాక్ట్ నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్, ఎస్సై మధు వెంకటరాజా ఆధ్వర్యంలో సైబర్ సెల్ సీఐ దాసు, మహిళా ఎస్సై వల్లీపద్మ కేసును ఛేదించారు. సొమ్మును ఫ్రీజ్ చేయించి, తిరిగి రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. ఏదైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని చెప్పారు. నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్ పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

సర్కారు బడుల్లో టీచర్ల కొరత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కుక్కునూరు మండలంలోని సర్కారు బడుల్లో టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాల్లో 114 మంది టీచర్ల పోస్టులు ఉండగా రెగ్యులర్ టీచర్లు 20 మంది, డిప్యుటేషన్‌పై మరో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 77 మంది టీచర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగారం సెంటర్లలో ఉన్న 4 మోడల్ పాఠశాలల్లో 26 మంది టీచర్లకు గాను కేవలం 8 మంది టీచర్లతోనే పిల్లల చదువులు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల ఒక్క టీచర్ తోనే పాఠశాల కొనసాగడం దయనీయమైన పరిస్థితికి అద్దం పడుతోందన్నారు.

క్లుప్తంగా

సోలార్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు

గుబ్బల మంగమ్మ గుడి వద్ద సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని ప్రసిద్ధ గుబ్బల మంగమ్మ గుడికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సోలార్ ద్వారా లైట్స్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలతోపాటు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి కొర్సా గంగరాజు మాట్లాడుతూ తెల్లవారుజామునే ఇక్కడికి చేరుకునే భక్తులు చీకటిగా ఉండడంతో మంగమ్మతల్లిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో టెల్ టవర్స్ సోలార్ కంపెనీ ద్వారా మంగమ్మతల్లి ఆలయం వద్ద సోలార్ కరెంట్ సదుపాయం, సీసీ కెమెరా, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

14 నెలల తర్వాత బంగారం చోరీపై కేసు నమోదు

కైకలూరు: బంగారు గాజులు చోరీ జరిగిన 14 నెలల తర్వాత ఓ మహిళ కైకలూరు రూరల్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. రామవరం గ్రామానికి చెందిన సోము సీతామహాలక్ష్మి(62) భర్త ఆరేళ్ల క్రితం మరణించాడు. కుమారుడు ఇతర ప్రాంతంలో ఉంటాడు. ఆమె ఇంటి వద్ద కిరాణా దుకాణం నడుపుతోంది. అయితే 2024 ఫిబ్రవరి 13న ఆమె రెండు బంగారు గాజులు గల్లా పెట్టెలో వేసి స్నానానికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసుకునేసరికి కనిపించలేదు. కొన్నాళ్లు వెతికి ఊరుకుంది. ఇటీవల కుమారుడు ఇంటికి రావడంతో అతడికి విషయం చెప్పింది. దీంతో అతని సలహా మేరకు ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు రూరల్ ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై బ్లేడుతో దాడి

భీమవరం: స్థానిక టూ టౌన్ ఏరియా బైపాస్ రోడ్డు దగ్గర ఓ వ్యక్తిని బ్లేడుతో గొంతుకోసిన సంఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంకపేటకు చెందిన సీహెచ్ సాయిబాబు, ఎస్కే వినోద్ ఇద్దరూ ఓ చోట మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో ఇద్దరూ సరదా కబుర్లతో కోడిగుడ్లు విసురుకున్నారు. అంతలోనే వినోద్ కోపోద్రిక్తుడై బ్లేడుతో సాయిబాబు గొంతు కోసి పారిపోయాడు. బాధితుడు ప్రస్తుతం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ జి.కాళీచరణ్, పోలీసులు బృందాలుగా వెళ్లి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

దోమలపై దండెత్తరే?

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో ఇండస్ట్రీయల్ ఏరియా, చినరంగనిపాలెం, బందరుపుంత, గంగమ్మగుడి ఏరియా, హౌసింగ్‌బోర్డు కాలనీ, మెంటే వారితోట, టిడ్కో ప్లాట్లు తదితర డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల మురుగునీరు నిలిచిపోయి అపారిశుద్ధ్యంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. తమ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేదని, వారం పది రోజులకు డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నిర్మూలనకు పురపాలక సంఘం రూ. 10 లక్షలు బడ్జెట్‌లో కేటాయిస్తుండగా నివారణ చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయంటున్నారు. దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

- ప్రతికూల వాతావరణంలో పడకేసిన పారిశుద్ధ్యం
- గతంలో దోమలపై దండయాత్ర పేరిట హడావుడి చేసిన టీడీపీ ప్రభుత్వం

అండలూరులో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

సాక్షి, భీమవరం : ప్రస్తుతం రుతుపవనాల రాకతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా పట్టణాలు, పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతున్న దాఖలాలు లేవు. ఎక్కడికక్కడ డ్రెయినేజీలపై గడ్డి, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమల విజృంభణతో విష జ్వరాల బెడద ఆందోళనకు గురిచేస్తోంది. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాలు, ఆకివీడు నగర పంచాయతీల్లో దోమల నిర్మూలన పేరిట రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 409 పంచాయతీలు ఉండగా పెద్ద పంచాయతీల్లో రూ.రెండు లక్షలు వరకు, చిన్న పంచాయతీల్లో రూ. 25 వేలు నుంచి రూ. లక్ష వరకు వెచ్చిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రూ. 5 కోట్లకు పైగానే కేటాయిస్తున్నట్టు అంచనా.

కానరాని నిర్మూలన చర్యలు

దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా లార్వా దశలోనే వాటిని నిర్మూలించేందుకు డ్రెయినేజీలు, నీరు నిల్వ ఉండే ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయించి ఆయిల్ బాల్స్, కెమికల్స్ స్ప్రేయింగ్, సాయంత్ర వేళల్లో ఫాగింగ్ చేయించాలి. డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగునీరు పారే విధంగా ప్రతిరోజూ శుభ్రం చేయించాలి. క్షేత్రస్థాయిలో ఈ చర్యలు తూతూమంత్రంగానే ఉంటున్నాయి. నిధుల లేమితో పంచాయతీల్లో ఫాగింగ్ ఊసే ఉండటం లేదు. పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం పట్టణాల్లోనూ ఫాగింగ్ జరగడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో పట్టణాలు, గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దండయాత్ర ఊసేది?

'దోమలపై దండయాత్ర' అంటూ గతంలో టీడీపీ అధికారంలో ఉండగా సీఎం చంద్రబాబు హడావుడి చేసిన విషయం విధితమే. పట్టణాలు, గ్రామాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడం, తుప్పలు తొలగించడం, చెత్తను ఎత్తడం తదితర కార్యక్రమాలకు అప్పట్లో పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడికక్కడ ప్రచార ఆర్భాటంగానే దండయాత్ర సాగింది. పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీలు చేయించి మమ అనిపించడంతో అప్పట్లో ఈ కార్యక్రమంపై విమర్శలు వెల్లువెత్తాయి.

రోజుకు రూ.50 లక్షలకుపైగా ఖర్చు

జిల్లా జనాభా 18.48 లక్షలు. అర్బన్, రూరల్ ఏరియాల్లో నాలుగు లక్షలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. దాదాపు 4.62 లక్షల కుటుంబాలు నివసిస్తుండగా ఉపాధి కోసం ఒరిస్సా, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు మరో లక్షకు పైగా ఉంటారు. దోమల బెడద నుంచి ఉపశమనం కోసం కాయిల్స్, స్టిక్స్, కెమికల్స్ తదితర వాటిపై సగటున ఒక్కో కుటుంబం రోజుకు రూ.10 చొప్పున జిల్లావ్యాప్తంగా రూ.50 లక్షలకు పైగానే వెచ్చిస్తున్నట్టు అంచనా. ఇప్పటికైనా మున్సిపల్, పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ ద్వారా దోమల నిర్మూలన చర్యలు చేపట్టేవారు. డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్, స్ప్రేయింగ్ చేయించేవారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ జరిగేది. జ్వరపీడితులను గుర్తించేందుకు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందితో ఇంటింటా ఫీవర్ సర్వే చేయించి రోగులకు వైద్య సాయం అందించేవారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై వలంటీర్లతో ఇంటింటా అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు కానరావడం లేదని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

దోమల బెడద ఎక్కువగా ఉంది

భీమవరం టిడ్కో ప్లాట్లలో నివాసం ఉంటున్నాం. మా ప్రాంతంలో దోమలు బెడద ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంగాని, నివారణ చర్యలు తీసుకోవడం లేదు. దోమలతో రాత్రిళ్లు కంటిమీద కునుకు ఉండటం లేదు. రాత్రిళ్లు రెండు కాయిల్స్ వెలిగిస్తున్నా తర్వాత మామూలుగా వచ్చేస్తున్నాయి.

– వై.వీర్రాజు, భీమవరం

డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు

వర్షాకాలం కావడంతో ప్రస్తుతం దోమలు బెడద చాలా ఎక్కువగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వర్షాకాలంలో డ్రెయిన్లు శుభ్రం చేసేవారు. దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా చల్లేవారు. ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

– నలభ పోతురాజు, ఎఅఆర్‌పీ అగ్రహారం

అగ్గిపుల్లపై అల్లూరి



ఏలూరు (టూటౌన్) : అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ అగ్గిపుల్లపై ఆయన చిత్రాన్ని నిర్మించి అబ్బుర పరుస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆయా నాయకుల చిత్రాలను తనదైన శైలిలో నిర్మించి నివాళులర్పించడం సురేష్‌కు పరిపాటి. ఈ క్రమంలోనే ఈ నెల 4వ తేదీ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని అగ్గిపుల్లపై నిర్మించి నివాళి అర్పించారు.

ఏలూరులో ఈగల్ టీమ్ తనిఖీలు

ఏలూరు రైల్వే స్టేషన్‌లోతనిఖీలు చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : గంజాయి, మత్తు పదార్థాల రవాణా అడ్డుకునేందుకు ఈగల్ టీమ్, రైల్వే పోలీస్, జిల్లా పోలీస్ సంయుక్తంగా గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవికృష్ణ స్వయంగా తనిఖీల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఈగల్ టీమ్ ఎస్పీ నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఉన్నారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో రైల్వే స్టేషన్‌లో క్షుణ్ణంగా తనికీలు చేశారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైళ్ళలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్, రైల్వే పోలీస్ డీఎస్పీ రత్నరాజు, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలి

ఎస్వీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వనట చక్రవర్తి స్వర్గీయ ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్‌లో గురువారం ఎస్వీ రంగారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్వీఆర్ సేవా సమితి అధ్యక్షుడు భోగిరెడ్డి రాము మాట్లాడుతూ తెలుగు సినీ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పిన తొలి తెలుగు నటుడు ఎస్వీ రంగారావు అని కొనియాడారు. కాపునాడు అధ్యక్షుడు మాకా శ్రీనివాసరావు మాట్లాడుతూ అద్భుత నటనతో ప్రపంచాన్ని మెప్పించిన నటుడు ఎస్వీ రంగారావుకు తక్షణమే భారత రత్న అవార్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎస్వీ రంగారావు సర్కిల్ నుంచి ర్యాలీగా పోస్టాఫీస్ వరకు చేరుకున్నారు. భారతరత్న ఇవ్వాలనే విన్నపాన్ని రిజిస్టర్ పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ అడ్రస్‌కు పంపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, బండి రామస్వామి, గంధం రాజశేఖర్, జంగా రామ్‌రాయ్, పి.కుమార్‌స్వామి, సామినేటి రంగారావు, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బ్యాటరీల దొంగల అరెస్ట్

10 ఆటోలు, 65 బ్యాటరీల స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆటోలు, బ్యాటరీ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 23 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నటు ఏఎస్పీ వి భీమారావు చెప్పారు. గురువారం భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వీరవాసరం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీరామ్‌కుమార్ లారీలను కిరాయికి తిప్పుతుంటాడు. ఈ క్రమంలో పట్టణంలోని మెంటేవారితోట బైపాస్ రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద జూన్ 14న తన మూడు లారీల పార్క్‌చేసి ఉంచగా వాటిలోని 6 బ్యాటరీలు దొంగిలించారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై ఎస్వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ కేసులో పట్టణానికి చెందిన తీగల నరేంద్రభవాని, పైలా రాకేష్, యలగడ కోదండశివసాయివెంకట సత్యనారాయణలను అదుపులోనికి తీసుకుని విచారించగా భీమవరం వన్ టౌన్, భీమవరం టూ టౌన్, కాళ్ల, ఆకివీడు, ఉండి, వీరవాసరం, పాలకోడేరు పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగిలించిన 65 బ్యాటరీలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. దీంతో వారి వద్ద నుంచి సుమారు రూ. 6 లక్షల విలువైన 65 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ భీమారావు చెప్పారు.

ఇద్దరు ఆటోల దొంగల అరెస్టు

భీమవరం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఇటీవల ఆటో దొంగతనాలు ఎక్కువ జరగడంతో భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 2న కృష్ణా జిల్లా మండవల్లి మండలం పేరికిగూడెం గ్రామానికి చెందిన పరస నాగరాజును అరెస్ట్ చేసి విచారించారు. విచారణలో భీమవరం పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ఆకివీడు, అమలాపురం, వైజాగ్ వన్‌టౌన్, టూటౌన్, మండవల్లి ప్రాంతాల్లో 13 ఆటోలను దొంగతనాలు చేశానని నేరం అంగీకరించారు. దీంతో నాగరాజుతో పాటు అనకాపల్లి మండలం సబ్బవరం గ్రామానికి చెందిన పోలిశెట్టి గణేష్‌లను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 17 లక్షల విలువైన 10 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ భీమారావు చెప్పారు. సమావేశంలో భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, ఎస్సై కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

WANTED P.E.T.s
A well reputed School at Kaikaluru, Eluru (Dist) requires the following vacancies.
P.E.T. Male (1), Female (1)
Salary: 20.000/- to 25,000/-
Interested candidates can come directly to School with resume with in seven days.
TVNRM NATIONAL SCHOOL
Kaikaluru, Eluru Dist, AP-521333 ✆ 6303 602 774

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005740]

Services
జ్యోతిష్యాలయం
■కేరళ భగవతీ భద్రకాళి మాంత్రిక జోతిష్యం ప: వి.ఫణికర్, స్త్రీ/పు వశీకరణం, ప్రేమ పెళ్ళి, సంతానం, శత్రుబాధ, ప్రేమలో మోసపోవడం మీ ఎటువంటి కఠిన నిఘూడ వ్యక్తిగత గుప్త సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573872341 [SCA25005839]

Wanted
■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]
■ప్రముఖ కంపెనీవారి వ్యవసాయ ఉత్పత్తులు మండలాల వారిగా జీతం / కమీషన్‌పై పని చేయుటకు అనుభవం ఉన్న అభ్యర్థులు కావలెను. Qly 10th-డిగ్రీ జీతం 10-20 వేలు. 8885191948 [SCA 25005848]
■ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]
■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

ఇంటి స్థలం వివాదం.. ఇద్దరిపై దాడి

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరొకరి చేతికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోనాల నాగేంద్రబాబు(34), బోనాల దశరథ రామాంజనేయులు ఇద్దరూ అన్నదమ్ములు. వీళ్లతో పాటు వాళ్ల బాబాయ్ బోనాల శ్రీనివాసరావులకు కలిపి ఏడు సెంట్ల ఇళ్ల స్థలం ఉంది. దీనిలో చెరి సగం కాగా బోనాల శ్రీనివాసరావు మొత్తం నాదేనంటూ బోనాల నాగేంద్రబాబు, దశరథ రామాంజనేయులను రానీయడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇళ్ల స్థలంలోకి వెళ్లగా బోనాల శ్రీనివాసరావుతో పాటు అతని కుమారులు, భార్య కలిసి నాగేంద్రబాబు, బోనాల దశరథ రామాంజనేయులపై కత్తితో దాడి చేసి కొట్టారు. దీంతో నాగేంద్రబాబుకు తలపై తీవ్ర గాయమైంది. దశరథ రామాంజనేయులకు చేతిపై దెబ్బ తగిలింది. దీంతో స్థానికులు వారిని హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

51 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం వద్ద నిందితుడు, విజిలెన్స్ అధికారులు

నూజివీడు: పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ట్రక్కు వాహనంలో తరలిస్తున్న అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. వారికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బైపాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 51 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ బియ్యం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట ఏరియా నుంచి హనుమాన్ జంక్షన్‌కు రవాణా చేస్తున్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యాన్ని సీజ్ చేశారు. వాహన డ్రైవర్ నక్కా శివ, రేషన్ బియ్యం సరఫరాదారులు ధనికొండ గోపిరాజు, ధనికొండ గణేష్, వారికి సాయం చేస్తున్న ఖాసీంబాబు, వాహన యజమాని నక్కా నాగగోపాలకృష్ణలపై 6ఏ, 7(1)కేసులను నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్సై నాగరాజు, హెచ్‌సీ వెంకటేశ్వరరావు, సీఎస్ డీటీ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఉపాధ్యాయుడి మృతి

ఏలూరు టౌన్: నగరంలోని ఫిల్‌హౌస్ పేటకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నేతల చంద్రశేఖర్ ఆజాద్ (51) రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ ఫిల్‌హౌస్ పేటకు చెందిన చంద్రశేఖర్ ఆజాద్ శ్రీపర్రు జెడ్పీస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి విజయవాడలోని తన సోదరుడి ఇంటికి వెళ్లేందుకు ఏలూరు రైల్వేస్టేషన్‌లో కాకినాడ–తిరుపతి రైలు ఎక్కాడు. రైలు వట్లూరు సమీపానికి వచ్చేసరికి రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆజాద్ విజయవాడ చేరుకోలేదని తెలియడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులను ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం రైల్వే గ్యాంగ్‌మెన్ ఓ మృతదేహాన్ని గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్సై సైమన్ మృతుడిని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అప్రమత్తతతో రక్తహీనత దూరం

పాడి-పంట

రక్తహీనతతో బాధపడుతున్న ఆవు

జంగారెడ్డిగూడెం: రక్తహీనత అనేది మనుషులతో పాటు పశువులనూ ఇబ్బంది పెట్టే ప్రధాన వ్యాధి. పశువుల విషయానికి వస్తే ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గడం లేదా హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం వల్ల రక్తంలో ఆమ్లజనకం సరఫరా తగ్గిపోవడం వల్ల రక్తహీనత వేధిస్తుంది. రక్తహీనత వల్ల పశువులు మేత మానేసి, పనిలో బలహీనత ఉంటాయి. దీంతో ఆవులు, గేదెల రోగనిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. రక్తహీనత తగ్గించే చర్యలు చేపట్టి పాడి అభివృద్ధిని మెరుగుపరిచే సూచనలు, సలహాలు పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ వివరించారు.

రక్తహీనత లక్షణాలు

బలహీనత, అలసట, తెల్లబడ్డ లేదా పసుపు కొమ్ములు, మేత, నీరు తీసుకునే అలవాటు తగ్గిపోవడం, శ్వాసకష్టం, బరువు తగ్గడం, పని సామర్థ్యం తగ్గిపోవడం

చికిత్స విధానాలు

- **అల్లోపతి విధానంలో :** తీవ్ర రక్తహీనతకు రక్త మార్పిడి అవసరం కావచ్చు.
- ఐరన్ లోపం కారణంగా రక్తహీనత ఉన్నప్పుడు ఐరన్ సప్లిమెంట్స్ ఇవ్వాలి.
- కీటకాల నివారణ, పరాన్నజీవాల మీద కట్టడి చేయడం ద్వారా రక్తహీనత నివారించవచ్చు.
- బాక్టీరియా లేదా పకిటీరియా సంక్రమణకు యాంటీబయోటిక్స్ ఇవ్వాలి.

నేచరోపతి విధానంలో..

- పచ్చ కూరలు, ఆకుకూరలు, ఆహారంలో ఇనుము ఐరన్‌ను చేర్చాలి.
- హెర్బల్ చికిత్సా విధానంలో నెటిల్, స్పిరులినా వంటి ఐరన్ అధికంగా ఉన్న ఉత్పత్తులు ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి.
- ఆక్యు పంక్చర్ విధానంలో చికిత్స రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

హోమియోపతి విధానం

ఫెర్రఫోస్ఫొరికమ్ చికిత్సలో రక్తహీనత ప్రారంభ దశలో ఉత్పత్తి స్థాయిలు పెంచడానికి ఉపయోగపడుతుంది. చైనా ఆఫిసినాలిస్ చికిత్సలో రక్త పోత తర్వాత రక్తహీనత ఉన్న జంతువులకు ఇది ఇవ్వవచ్చు. నాట్రమ్ మురియాటికమ్ చికిత్సలో జిగురు తగ్గిన రక్తహీనతకు ఉపయోగపడుతుంది. ఆర్సెనికమ్ ఆల్బమ్ చికిత్సలో తీవ్ర బలహీనత, శ్వాసకష్టం ఉన్న రోగులకి ఇది ఇవ్వవచ్చు.

చికిత్సతో రక్తహీనత దూరం

రక్తహీనతకు సమయానుకూలంగా చికిత్స ఇవ్వడం చాలా ముఖ్యం. అల్లోపతి, నాచురోపతి, హోమియోపతి పద్ధతులను సమ్మిళితం చేసి, వెటర్నరీ డాక్టర్ సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే, రోగం నుంచి కోలుకోవడం సులభం.

– బీఆర్ శ్రీనివాసన్, పశు వైద్యాధికారి

యువతి అనుమానాస్పద మృతి?

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఒక యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. నగర శివారు శనివారపుపేటలోని ఒక ప్రాంతానికి చెందిన యువతి గురువారం ఓ యువతి ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే హడావుడిగా దహనసంస్కారాలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. యువతి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడింది? ఎవరైనా వేధించారా? లేక ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? లేకుంటే మరేదైనా కారణమా? అనేది సందేహంగా మారింది. ఈ సంఘటనపై ఏలూరు పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

వృద్ధురాలిపై కుక్క దాడి

యలమంచిలి: మండలంలోని కొంతేరు లేతమామిడితోట ప్రాథమిక పాఠశాల వద్ద వృద్ధురాలు బొంతు మరియమ్మపై గురువారం కుక్క దాడి చేసింది. దీంతో ఆమెకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఉన్న పాఠశాల విద్యార్థులు, మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక ఎల్‌ఎంటీ యూత్ సభ్యులు కుక్కను మట్టుబెట్టారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda)
నూజివీడు బ్రాంచ్, ఏలూరు జిల్లా

బంగారు నగలు వేలము ప్రకటన

[illegible] తేది: 22-07-2025న బ్యాంక్ ఆఫ్ బరోడా, నూజివీడు బ్రాంచ్ [illegible] (RBI [illegible]) [illegible] (KYC) [illegible] తేది: 22-07-2025, [illegible]
వేలం యొక్క మరిన్ని వివరముల కొరకు బ్యాంక్ ఆఫ్ బరోడా, నూజివీడు బ్రాంచ్ వారి మొబైల్ నెం. 9890275939, 7075166214 నందు సంప్రదించగలరు.

వ. నెం	ఖాతా నెంబరు	ఖాతాదారుల పేర్లు	ఎన్‌పిఏ/ఓవర్ డ్యూ తేది	బకాయి మొత్తం (రూ.లలో)	బంగారం బరువు (గ్రా.లలో)
1	45160600015848	[illegible], 2-339/బి, [illegible]	30.04.2025	3,27,013.96 పై + వడ్డీ	78.00
2	45160600021093	[illegible], డి.నెం. 321-31, [illegible], నూజివీడు మండలం	08.11.2024	26,197.02 పై + వడ్డీ	5.8
3	15160600021520	[illegible], 26-1-2, [illegible], నూజివీడు, కృష్ణాజిల్లా	08.10.2024	38,037.81 పై + వడ్డీ	10.1
4	45160600022682	[illegible], డి.నెం.4-73, [illegible], నూజివీడు మండలం	10.03.2025	2,17,206.05 పై + వడ్డీ	44.00
5	45160600022480	తూము మల్లేశ్వరి, భర్త : తూము [illegible], డి.నెం. 3-139, మల్లవల్లి, బాపులపాడు మండలం	08.01.2025	3,02,925.01 పై + వడ్డీ	56.00
6	15160600023241	తూము మల్లేశ్వరి, భర్త : తూము [illegible], డి.నెం. 3-139, మల్లవల్లి, బాపులపాడు మండలం	08.01.2025	1,58,207.59 పై + వడ్డీ	30.5

తేది : 03-07-2025 సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

సాక్షి
గుంటూరు
శుక్రవారం । 4 । జూలై । 2025

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: జూలై 9న జరిగే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం తాడేపల్లిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,578 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

వైభవంగా సత్యసాయి రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం గురువారం నరసరావుపేట చేరుకుంది. భక్తులు సత్యసాయి పాదుకలను దర్శించుకున్నారు.

ఏకపక్ష వైఖరికి కత్తెర పడేనా?

జెడ్పీటీసీల అంగీకారం లేకుండా అడ్డగోలుగా నిధులు కేటాయింపుపై వ్యతిరేకత

ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి జెడ్పీ చైర్‌పర్సన్ ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజావసరాలను గుర్తించి పనులకు సభ్యుల ఆమోదంతో నిధులు కేటాయించాల్సి ఉన్నా అడ్డదారిలో మంజూరు చేయడం కమీషన్ల కోసమేననే ఆరోపణలకు తావిస్తోంది. శుక్రవారం జరగబోయే సర్వసభ్య సమావేశంలో దీనిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు మరోమారు నిరసన గళం వినిపించే అవకాశం ఉంది.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- చైర్‌పర్సన్ ఏకపక్ష ధోరణిపై వైఎస్సార్ సీపీ సభ్యుల తీవ్ర అసంతృప్తి
- తాము గెలిచి ప్రయోజనమేంటని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీలు
- నిరసనగా గతంలో బడ్జెట్ సమావేశానికి గైర్హాజరు
- ప్రభుత్వానికి పంపి మరీ ఆమోదింపజేసుకున్న చైర్‌పర్సన్
- గతంలో జెడ్పీటీసీలకు తెలియకుండా రూ.12 కోట్ల పనులకు ముందస్తు అనుమతులు
- తాజాగా మరో రూ.10 కోట్ల మేరకు ఇదే తరహాలో అనుమతి

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, అధికారులకు జెడ్పీ నుంచి ముందస్తుగా సమాచారాన్ని పంపారు. గత మార్చి 15న కోరం లేకపోవడంతో వాయిదా పడిన సమావేశం మరలా ఇప్పటి వరకూ జరగలేదు. 2024–25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌తో పాటు 2025–26 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు కీలకమైన సర్వసభ్య సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీలు గైర్హాజరు కావడంతో నిరవధికంగా వాయిదా పడింది.

చైర్‌పర్సన్ ఏకపక్ష ధోరణిపై వ్యతిరేకత

ప్రజల ఓట్లతో గెలిచిన జెడ్పీటీసీలకు సముచిత గౌరవాన్ని ఇవ్వకపోవడంతోపాటు ముందస్తు అనుమతుల పేరుతోనూ జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు చేస్తున్న ధోరణికి వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు మార్చి 15న ఏర్పాటు చేసిన బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించారు. జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా, సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురాకుండా పనులు మంజూరు చేస్తున్నప్పుడు ఇక తమకు విలువ ఎక్కడిదని నిలదీశారు. టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో రూ.కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తున్న తీరును ఖండించారు. వాటిలో కమీషన్లు, పర్సంటేజీ తీసుకుని అవినీతి, అక్రమాలతో జెడ్పీని నడుపుతున్నారని ఆరోపణాస్త్రాలు సంధించారు. మార్చిలో ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతోపాటు రూ.12 కోట్ల విలువైన పనులకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముందస్తు అనుమతులను ఇచ్చేయడంతో సమావేశానికి హాజరైన పక్షంలో సభ్యులు అంగీకారం తెలిపినట్లవుతుందనే కోణంలో గైర్హాజరయ్యారు. తద్వారా జెడ్పీటీసీలు తమ హక్కులను పరిరక్షించుకోవడంలో సఫలీకృతమయ్యారు.

గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

అంగీకారం లేకుండానే పనులు

జెడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సభ్యుల అంగీకారం తప్పనిసరి. ఏ గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేపడుతున్నారనే విషయాన్ని అజెండాలో పొందుపర్చి, సర్వసభ్య సమావేశంలో చర్చించాలి. సభ్యులు అంగీకరించిన తరువాతే వాటిని ఆమోదిస్తారు. అయితే గుంటూరు జెడ్పీలో సభ్యుల అంగీకారం లేకుండా ఏకపక్షంగా పనులు కేటాయింపు వ్యవహారం నడుస్తోంది. చైర్‌పర్సన్ ముందస్తు అనుమతుల పేరుతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పనుల జాబితాను సిద్ధం చేసి, స్టాండింగ్ కమిటీలో పెట్టాక ఆమోదించేస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో 1వ, 7వ కమిటీలకు చైర్‌పర్సన్‌గా ఉన్న కత్తెర హెనీ క్రిస్టినా ఆమోదంతో సంబంధిత పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేస్తున్నారు.

అజెండాలో 'రూ.22 కోట్ల విలువైన పనులు'

చైర్‌పర్సన్ వైఖరితో మండలానికి ఒకరు చొప్పున ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న జెడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారు. తాము ప్రజా ప్రతినిధులుగా గెలిచీ ప్రయోజనమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. చైర్‌పర్సన్ ఏకపక్ష పోకడలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మార్చి 15న బడ్జెట్ సమావేశానికి గైర్హాజరు కావడంతో, అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపి ఆమోదింపజేసుకున్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో జెడ్పీటీసీలకు తెలియకుండా ముందస్తు అనుమతుల పేరుతో రూ.12 కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చేశారు. తాజా సమావేశంలో మరో రూ.10 కోట్ల మేరకు ముందస్తు అనుమతులు ఇచ్చారు. మొత్తం రూ.22 కోట్ల పనులను ఆమోదం కోసం శుక్రవారం జరగనున్న సర్వసభ్య సమావేశపు అజెండాలో పొందుపర్చారు.

న్యూస్‌రీల్

ఒరిగిన అమరేశ్వరాలయ రాజగోపురం తలుపు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానం దక్షిణరాజగోపురానికి అమర్చిన రెండు తలుపుల్లో ఒక తలుపు పక్కకు ఒరిగిపోయింది. బుధవారం రాత్రి దేవాలయ భద్రతా సిబ్బంది తలుపులు మూస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఆలయ కార్య నిర్వాహణాధికారి రేఖ మాట్లాడుతూ రాజగోపుర తలుపు మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో వేగంగా వచ్చిన ఓ కారు తలుపును ఢీ కొట్టటం వల్ల ఇనుపరాడ్ వంకర వచ్చిందన్నారు. ఈతరహా తలుపులు మరమ్మతులు చేసే వడ్రంగ నిపుణులను పిలిపించటానికి ఏర్పాట్లు చేశామని రెండుమూడు రోజులలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. అప్పటివరకు గాలిగోపురం వద్ద సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు. అలాగే పోలీసుల సహకారంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు రక్షణ కల్పిస్తామని తెలిపారు.

నేడు భూ సమీకరణ గ్రామ సభలు

తాడికొండ: తాడికొండ మండలం దామరపల్లి, ఫణిదరం, బండారుపల్లి గ్రామాల్లో భూ సమీకరణ కోసం ఎమ్మెల్యే అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తాడికొండ తహసీల్దార్ మెహర్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఫణిదరం, 11 గంటలకు దామరపల్లి, 12 గంటలకు బండారుపల్లి గ్రామాల్లో గ్రామ సభ జరగనుంది. రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

రేవుల్లో పడవలు తిప్పుకొనేందుకు వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానది రేవుల్లో పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ అధ్యక్షతన సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించారు. ఆరు రేవులకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు హక్కుల కల్పిస్తూ సీల్డ్ టెండరు, బహిరంగ వేలంలో అచ్చంపేట, అమరావతి మండలాల్లోని నాలుగు రేవులను పాటదారులు దక్కించుకున్నారు. మాచవరం, కొల్లిపర మండలాల్లోని రేవులకు జరిగిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో వాటిని వాయిదా వేశారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని వివిధ రాష్ట్రాల అధికారులు గురువారం సందర్శించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సౌత్ క్యాంపస్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు, హరియాణా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్లు, ఆయా రాష్ట్రాల రెవెన్యూ అధికారులు విచ్చేశారని తెలిపారు.

ఆలపాటికి తప్పని సమస్యల సెగ

తెనాలి టౌన్: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం రూరల్ మండలం కొలకలూరులో పర్యటించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కూడా సమస్యల సెగ తగిలింది. తొలుత రాజుల కాలనీలో ఆయన పర్యటించారు. కంపరాజు వెంకమరాజు అనే టీడీపీ కార్యకర్త తాను ప్రస్తుతం ఇస్తున్న రూ.4 వేలు పింఛన్ను రూ.6 వేలకు పెంచాలని ఆలపాటిని అభ్యర్థించారు. కంపరాజు మాల్యాద్రిరాజు అనే వృద్ధుడు తనకు కరెంటు బిల్లు ఎక్కువ రావడం వలన పింఛన్ నిలుపుదల చేశారని, కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని వాపోయారు. తన భర్త చనిపోయి పదకొండు నెలలైనా ఇంతవరకు పింఛను రాలేదని దంతలూరి విజయ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు మంజూరు చేయాలని అధిక శాతం మహిళలు కోరారు.

ప్రైవేటు పాఠశాలల బంద్ విజయవంతం

మూతపడిన అమరావతి రోడ్డులోని నారాయణ స్కూల్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ప్రవేశాల పేరుతో ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గురువారం విద్యాసంస్థలను మూసివేసి బంద్ పాటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు పిలుపు మేరకు గుంటూరు నగరంతోపాటు జిల్లాలోనూ పాఠశాలలు మూతపడ్డాయి. విద్యాహక్కుచట్టంలోని 12 (1) సీ ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విషయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, సీట్ల కేటాయింపు ప్రక్రియలో ప్రభుత్వం, విద్యాశాఖ పక్షపాత ధోరణితో వ్యవహరించడం, ఫీజుల చెల్లింపు విషయమై స్పష్టత లేకపోవడంతో పాటు విద్యాశాఖాధికారుల బెదిరింపు ధోరణులు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం, రాజకీయంగా ఒత్తిడి తెస్తున్న సంఘటనలను యాజమాన్యాలను తీవ్రంగా నిరసిస్తున్నాయి. దీంతో గురువారం శాంతియుతంగా బంద్ నిర్వహించాయి.

సాగర్, పులిచింతలలో చేపల వేట నిషేధం

నరసరావుపేట: జిల్లాలోని లైసెన్స్‌డ్ రిజర్వాయర్లు నాగార్జున సాగర్, కేఎల్ రావు పులిచింతలలో చేపల సంతానోత్పత్తి సమయమైన జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు (62 రోజులపాటు) వేట నిషేధం అమలులో ఉంటుందని పల్నాడు జిల్లా మత్స్య శాఖ అధికారి ఎస్. సంజీవ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రిజర్వాయర్లలో లైసెన్సు తీసుకొని వేట కొనసాగించే మత్స్యకారులు ఎవరూ ఆ సమయంలో వేటకు వెళ్లవద్దని సూచించారు.

టీడీపీ ఎమ్మెల్యే కుట్రతోనే సర్పంచ్‌పై హత్యాయత్నం

వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

- మన్నవ సర్పంచ్‌పై టీడీపీ గూండాల దాడికి ఖండన
- ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న సర్పంచ్‌కి పరామర్శ
- మూడు, నాలుగు నెలలుగా ఈ దారుణానికి కుట్ర పన్నారని ఆరోపణ
- దాడి చేసిన వారితోపాటు ఎమ్మెల్యే నరేంద్రపైనా చర్యలకు డిమాండ్

మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నేతలు వనమా బాల వజ్రబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

పొన్నూరు: పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావుపై గురువారం జరిగిన టీడీపీ గూండాల దాడి వెనుక స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రమేయం ఉందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. ప్రాణాపాయ స్థితిలో గుంటూరులోని రమేష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సర్పంచ్‌ని పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పలువురు నాయకులు పరామర్శించారు. దాడి వివరాలను తెలుసుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై జరిగిన హత్యాయత్నంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారన్నారు. పరిస్థితి విషమంగా మారిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రమేయంతోనే గత మూడు, నాలుగు నెలల నుంచి ఈ ప్రయత్నం జరుగుతోందని అన్నారు. అదే గ్రామానికి చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు కుటుంబ సభ్యులు స్వయంగా ఈ దాడిలో పాల్గొని ఇనుప రాడ్లతో విచక్షణరహితంగా కొట్టడం వల్లే నాగమల్లేశ్వరరావు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని చెప్పారు. బాబూరావు కుటుంబ సభ్యులు చేసిన దాడి దృశ్యాలు సీసీ ఫుటేజీలో స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్ర కుట్రతోనే ఈ హత్యాయత్నం జరిగిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి సీసీ ఫుటేజీలో ఉన్న దృశ్యాల ఆధారంగా బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. దాడి వెనుక ఉన్న ఎమ్మెల్యేపై కూడా కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ రూత్ రాణి, నాయకులు గులాం రసూల్, షేక్ నాజర్, బొనిగల రాజారావు, అమరేంద్ర, అంబటి వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకట సుబ్బయ్య, షేక్ మహ్మద్, చింతలపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేక హత్యకు కుట్ర : అంబటి రాంబాబు

సర్పంచ్‌ను పరామర్శించిన అనంతరం విలేకరులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని పోలీసులే క్షేమంగా అక్కడి నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. స్థానిక పోలీసులపై అపనమ్మకం ఉన్న పరిస్థితుల్లో ఈ హత్యాయత్నం కేసులో ఉన్న వ్యక్తులపై పోలీసు ఉన్నతాధికారులు ముమ్మర దర్యాప్తు చేయాలని కోరారు. సర్పంచ్ నాగమల్లేశ్వరరావు దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన వ్యక్తి అని, గ్రామంలో వారి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక అంతమొందించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు.

24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలి

– మోదుగుల వేణుగోపాలరెడ్డి

వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు ప్రోత్సాహంలోనే ఈ హత్యాయత్నం జరిగిందన్నారు. ఇనుప రాడ్లతో బలంగా కొట్టిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయని, బాధ్యులైన వ్యక్తులను ఆరెస్టు చేయలేరా? అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ టీడీపీ వారిని కాపాడేందుకే ఉందా? అని మండిపడ్డారు. లోకేష్ రెడ్‌బుక్ వ్యవస్థ కాదు... తామూ కూడా మూడు, నాలుగు వ్యవస్థలు తీసుకొస్తామన్నారు. 24 గంటల్లో దాడి చేసిన గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌పై జరిగిన దాడిని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పొన్నూరు ప్రజలకు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నిరంతరం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

కొలిక్కి రాని సచివాలయ ఉద్యోగుల బదిలీలు

- ఐదు ఆప్షన్లు ఇచ్చిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉద్యోగులు
- సిఫార్సు లేఖలు ఎక్కువగా రావడంతో తుది జాబితాపై అధికారుల కసరత్తు

సోషల్ వెల్ఫేర్ కార్యాలయం

నెహ్రూనగర్: సచివాలయ ఉద్యోగుల బదిలీలు గందరగోళంగా మారాయి. గుంటూరు అర్బన్ పరిధిలో జరిగిన బదిలీల్లో సిఫార్సు లేఖలతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఈ ప్రక్రియ చేపట్టారని ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. రూరల్ పరిధిలో కూడా ఇంకా గందరగోళం నెలకొంది. గ్రామ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బదిలీల ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఉమ్మడి జిల్లాలో వీరి బదిలీల ప్రక్రియ గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. మొత్తం 874 మంది ఉండగా.. సిఫార్సు లేఖలను దృష్టిలో పెట్టుకుని తమను ఎక్కడికి బదిలీ చేస్తారో అని వేచిచూస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు పిలవకుండానే...

అర్బన్ పరిధిలో పనిచేసే వార్డు సచివాలయ ఉద్యోగులకు గత నెల 28, 29వ తేదీల్లో గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ పరిధిలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ల బదిలీలకు సంబంధించి సోషల్ వెల్ఫేర్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. గూగుల్ ఫాంలో 5 ఆప్షన్లు ఇవ్వాలని వారం క్రితం సూచించారు. ఆ మేరకు ఉద్యోగులు నమోదు చేశారు. ఇంత వరకు దీనిపై సమాధానం రాకపోవడంతో ఉద్యోగులు వారిని సంప్రదించారు. బదిలీల ప్రక్రియ నడుస్తోంది.. సమాచారం అందిస్తామని నేటికీ అధికారులు సమాధానం దాటవేస్తున్నారు.

సిఫార్సు లేఖలతో మల్లగుల్లాలు

సాధారణంగా బదిలీల ప్రక్రియ జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలి. ఆ వివరాలను హోల్డ్‌లో ఉంచి ఫించన్ల పంపిణీ తరువాత విడుదల చేయాలి. సామాజికి ఫించన్ల పంపిణీ చాలా వరకు పూర్తయినప్పటికీ బదిలీల ప్రక్రియ మాత్రం కొలిక్కి రాలేదు. కోరుకున్న గ్రామ సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వాలని సిఫార్సు లేఖలు కుప్పలు కుప్పలుగా ఉద్యోగులు ఇవ్వడంతో లిస్ట్ ఫైనల్ అయినప్పటికీ మార్పుచేర్పులతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం. కార్యాలయంలో రాత్రుళ్లు కూడా దీనిపైనే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్యను దీనిపై వివరణ కోరేందుకు ఫోన్ చేయగా, ఆయన సమాధానం ఇవ్వలేదు.

పెదనందిపాడు ఎంపీడీవోపై ఎమ్మెల్యే బూర్ల ఫైర్

ప్రత్తిపాడు: పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవిపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఫైర్ అయ్యారు. ఆమె విధుల నిర్వహణ తీరు బాగా లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. పెదనందిపాడు రక్షిత తాగునీటి చెరువులో ఉన్న నీరు రంగు మారి దుర్వాసన వస్తున్నాయని, ఎప్పటి నుంచో చెబుతున్నా అధికారులు కనీసం చెరువులో బ్లీచింగ్ కూడా చల్లడం లేదని గ్రామస్తులు, స్థానిక టీడీపీ నాయకులు గురువారం ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తొలుత ఫోన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవోకు ఫోన్ చేసి ఆమె పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంచి నీటి చెరువులో బ్లీచింగ్ వంటివి చల్లక పోవడం ఏంటని ప్రశ్నించారు. కనీసం ఆమెగానీ, సెక్రటరీగానీ బాధ్యత తీసుకోకుంటే ఎలాగని నిలదీశారు. చిన్న పడవల్లో వెళ్లి మొత్తం చెరువులో బ్లీచింగ్ పౌడర్ కలపాలని గ్రామస్తులు అడుగుతున్నారని, ఏదో పై నుంచి ఊరికే బ్లీచింగ్ చల్లేస్తే ఎలాగన్నారు. 'నేను చెప్తున్నా. ఇప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో మాట్లాడాను. ఆయన టెక్నికల్‌గా నోట్ ఇస్తారు. మీరుగానీ పెర్ఫార్మ్ చేయకపోతే మీపైన, సెక్రటరీ మీద కేసు పెడతారు' అని ఎంపీడీవోను ఫోన్‌లో హెచ్చరించారు. ఇది ఎమర్జెన్సీ నీడ్ అని తెలిపారు. 'అది కాదమ్మా.. ఏమనుకుంటున్నారు మీరు? ఎంత డబ్బున్నా దీని కోసమే ఖర్చు పెట్టాలి. మీ దగ్గర డబ్బులు లేవంటే చెప్పండి. నేను మాట్లాడతా. లేదమ్మా.. మీకు కోఆర్డినేషన్ లేదు. నేను ఏడాదిగా క్లీన్ అబ్జర్వ్ చేస్తున్నా. మీ ఇష్టం. నేను రెండు, మూడు రోజులు చూసిన తరువాత తీసుకోవాల్సిన యాక్షన్ తీసుకుంటానని' హెచ్చరికలు జారీ చేశారు.

బ్లీచింగ్ చల్లించకుంటే కేసులు పెడతారు!



ఎంపీడీవోతో ఫోన్‌లో మాట్లాడుతున్న రామాంజనేయులు

బహిరంగ ప్రకటన

మా క్లయింటు ఆయిన గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ కాపురస్తుల 1)కొమ్మసాని [illegible] రెడ్డి గారి కుమారుడు కొమ్మసాని [illegible] 2)[illegible] జిల్లా [illegible] గారి భార్య [illegible] లక్ష్మీ [illegible] గారి [illegible] తెలియ చేయునది ఏమనగా..

[illegible] D.No.518/c 521/A 2.03 [illegible]

[illegible] 518/సి [illegible] 0.92 సెంట్లున్నూ, డీ.నెం. 521–ఎ [illegible] 1–11 సెంట్లు [illegible] 2–03 సెంట్ల భూమికి హద్దులు:– తూర్పు : [illegible] గారి భూమి హద్దు, దక్షిణం:– [illegible] గారి భూమి హద్దు, పడమర:– [illegible] గారి భూమి హద్దు, ఉత్తరం : [illegible] భూమి హద్దు.ఈ హద్దుల మధ్యగా గల [illegible] 2–03 సెంట్లు లేక హె. 100– 812 [illegible] భూమి మాత్రం.

[illegible] 9849262558.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	38,018
అమ్మకాలు	40,612
నిల్వ	7,525

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,200
273	రూ.10,000 – 13,500
341	రూ. 10,000 – 12,200
సూపర్ –10	రూ. 9,700 – 12,400

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,800
బాడిగ – 355	రూ. 10,000 – 12,700
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,400
ఆర్మూర్	రూ. 9,700 – 11,200
తాలుకాయలు	రూ. 5,000 – 6,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 12,800
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,400
4884	రూ. 10,000 – 13,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,700
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 379

కొమ్ములు : 272 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,400	10,300

కాయలు : 107 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,400	10,200

మొత్తం అమ్మకాలు : 284.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

చెవులకు చిల్లు.. గుండె గుభేల్..!

- ఇష్టానుసారంగా బైక్ సైలెన్సర్లు మారుస్తున్న ఆకతాయిలు
- రహదారులపై తిరుగుతూ భారీ శబ్దాలతో హల్‌చల్
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వ్యాపారులు
- కనీస చర్యలు తీసుకోవడంలో పోలీసుల ఉదాసీనత

భరించలేని భారీ శబ్దాలతో బుల్లెట్, ఇతర ద్విచక్రవాహనాలపై ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లేవారే కాదు.. ఇళ్లలోని వారి చెవులు కూడా చిల్లులు పడేలా, గుండె గుభేల్‌మనేలా దూసుకుపోతున్నారు. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

బుల్లెట్‌కు వినియోగిస్తున్న భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్‌లు

పట్నంబజారు: గుంటూరు నగరం వాహనాల రణగొణ ధ్వనులతో హోరెత్తుతోంది. నగరంలో సుమారు 2 లక్షలకుపైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో బుల్లెట్‌ల సంఖ్య 40 వేలకు పైమాటే. లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్, కొరిటెపాడు రోడ్డు, అరండల్‌పేట, బ్రాడీపేట, ఈస్ట్ పరిధిలోని కొత్తపేట, ఎత్తురోడ్డు సెంటర్, నల్లచెరువు, ఆర్టీసీ బస్టాండ్, నాజ్‌సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డు, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, అరవై అడుగుల రోడ్డు ప్రాంతాల్లో విచ్చలవిడిగా బైక్ సైలెన్సర్‌లు మార్చి ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నారు. అధిక శబ్దాన్నిచ్చే హారన్లు, సైలెన్సర్లతో దూసుకెళ్తున్నారు.

చట్టాలు ఏం చెబుతున్నాయంటే..

వాహనం ఏదైనా కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ తప్ప మరొకటి వాడకూడదని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయి. కేంద్ర మోటార్ వెహికల్ (ఎంవీఐ) చట్టం 1988 రూల్ నెంబర్ 120 ప్రకారం వాహనాల్లో వాడే సైలెన్సర్ నిర్దిష్ట నాయిస్ లిమిట్ కంటే ఎక్కువ శబ్దం చేయకూడదు. భారతీయ శబ్ద కాలుష్య నియంత్రణ చట్టం (నాయిస్ పొల్యూషన్, రెగ్యులేషన్ అండ్ కంట్రోల్) 2000 ప్రకారం భారీ సౌండ్ వచ్చే సైలెన్సర్‌లు నిషిద్ధం. ఎంవీఐ రూల్ 190(2) ప్రకారం చట్టబద్ధమైన రీతిలో వాహనాలు నడపకపోతే రూ.1000 నుంచి రూ. 10 వేల వరకు జరిమానాలు విధించే అవకాశం ఉంది. ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986, నాయిస్ పొల్యూషన్ రూల్స్ ప్రకారం సైలెన్సర్‌ల నుండి వచ్చే శబ్దం నిబంధనలకు లోబడి ఉండాలి.

ఆరోగ్యానికి చేటు

శబ్ద కాలుష్యం 100 డెసిబుల్స్‌కు మించి ఉండటం వలన వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. శబ్ద కాలుష్యం వలన ఆరోగ్యానికి ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణులకు హాని కలుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనుమతులు లేని మార్పులు ట్రాఫిక్ నిబంధనలకు పూర్తి విరుద్ధం. పోలీసులకు సదరు వాహనాన్ని సీజ్ చేసే అధికారం కూడా ఉంది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ తిరస్కరణకు అవకాశం లేకపోలేదు. ఎంవీఐ యాక్ట్ ప్రకారం పలు సందర్భాల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) రద్దు చేయటంతోపాటు వాహనాన్ని సీజ్ కూడా చేయొచ్చు.

కనీస తనిఖీలు తూచ్...

రూ.15 వేల నుంచి రూ. 40 వేల వరకు విలువైన సైలెన్సర్‌లను ఆకతాయిలు వాడుతున్నారు. మరోవైపు నగరంలో వీటి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ), ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను విక్రయించే వ్యాపారులు, దుకాణాదారులు, మెకానిక్‌లపైనా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఇలాంటి శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక తనిఖీలు చేపడతాం

నగరంలో శబ్ద కాలుష్యం కలిగించేలా బైక్ సైలెన్సర్‌లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వాహనాలు సీజ్ చేయటంతోపాటు కోర్టుకు హాజరుపరుస్తాం. పరిమిత స్థాయికి మించి సైలెన్సర్‌లు ఏర్పాటు చేయటం చట్ట విరుద్ధం. సైలెన్సర్లను విక్రయించే వారితోపాటు వాహనాలకు అమర్చుకునే వారిని కూడా ప్రత్యేక తనిఖీల ద్వారా గుర్తిస్తాం. వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. శబ్ద కాలుష్యం లేకుండా చూస్తాం.

– ఎం. రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్ విభాగం, గుంటూరు

రైళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

గంజాయి చాక్లెట్ల బ్యాగు గుర్తించిన పోలీస్ జాగిలం

తెనాలి రూరల్: తెనాలి రైల్వే స్టేషన్‌లో పోలీసులు గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెనాలి మీదుగా ప్రయాణించే పలు రైళ్లలో సోదాలు చేశారు. గుంటూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ డి. శ్రీనివాస్ రెడ్డి, తెనాలి డీఎస్పీ బి. జనార్దనరావు, త్రీటౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్‌ఐలు డి. రామకృష్ణ, ఎం. లక్ష్మీనారాయణరెడ్డి, ఎన్. ప్రకాశరావు, ఈగల్ టీమ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. డాగ్ స్క్వాడ్(మార్షల్)తో తనిఖీలు చేపట్టి అనుమానితులను విచారించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగును పోలీసు జాగిలం గుర్తించగా, తనిఖీ చేయడంతో గంజాయితో తయారు చేసిన చాక్లెట్లు లభించాయి. బ్యాగును స్వాధీనం చేసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయవాడ నుంచి తెనాలి వరకు రన్నింగ్ రైళ్లలో తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

గొప్ప మానవతావాది డాక్టర్ వైఎస్సార్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

గుంటూరు ఎడ్యుకేషన్: మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల మనస్సులు గెలిచిన గొప్ప మానవతావాది అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల అన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్, ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ కవి, రచయిత కాపిరెడ్డి కృష్ణారెడ్డి మోడరేటర్‌గా 'గొప్ప జ్ఞాపకాలు శీర్షికన – డాక్టర్ వైఎస్సార్ గొప్ప మానవతావాది' అనే అంశంపై గురువారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యామల మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ పాలన మానవీయతతో కొనసాగిందన్నారు. స్వతహాగా గొప్ప మానవతావాది కావడంతో ఆయన పాలనలో మానవీయత కనిపించిందన్నారు. ప్రజారంజకంగా పాలించి మాట ఇస్తే మడమ తిప్పకుండా చివరి వరకు ప్రజల కోసమే జీవించిన గొప్ప మనిషి అని కొనియాడారు. మరొక వక్త టీజే రమేష్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం వైద్యరంగంలో ప్రవేశపెట్టిన 108, ఆరోగ్య శ్రీ వంటి పథకాలను ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. కాపిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేరుతోపాటు మాట, మానవీయ కోణం, నడక, నడత, నవ్వు, ఆత్మీయత, పరిపాలనలో రాజసాన్ని ఒలికించిన మహానేత డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయుడని అన్నారు. జి.శాంతమూర్తి మాట్లాడుతూ వ్యక్తులను పేరు పెట్టి పిలవడం ఆయనకున్న విశిష్టమైన బలమని, ఒక నాయకుడు సామాన్యుడిని పేరు పెట్టి పిలిస్తే ఎంతో ఆనందం పొందుతారని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు చంద్రతేజ, రత్నరాజు, వెంకటరెడ్డి, డాక్టర్ లక్ష్మి, మల్లికార్జున్ రెడ్డి, విష్ణు, మనోహర్ రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను రైతులు వినియోగించుకోవాలి

మంగళగిరి: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు తెలిపారు. గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామంలో పొలాలను గురవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో రైతులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అనేక వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలతో అధిక లాభాలను పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మంగళగిరి ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి శైలజారాణి, డీపీఎం రాజకుమారి, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జల శాఖ ఏడీఏగా జి.సురేష్

బాపట్ల: భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులుగా జి.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్.జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇప్పటివరకు ఇక్కడ సహాయ సంచాలకులుగా పనిచేసిన కె.రామబాలాజీ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నుంచి పదోన్నతితో బదిలీపై వచ్చిన సురేష్‌కు అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎల్ఐసీని బలహీనపరచడం తగదు

సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్‌కుమార్

కార్యక్రమంలో జి.కిషోర్‌కుమార్, సురేష్, శ్రీనివాస్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం విడనాడాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర యూనియన్లు జూలై 9వ తేదీన ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె జరగనుందని తెలిపారు. 85 శాతానికిపైగా ఎల్ఐసీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కూడా సమ్మెలో భాగస్వామిగా ఉందన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రస్తుతం ఉన్న 74 శాతం నుంచి వంద శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఎల్ఐసీ ఐపీఓ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రజల పొదుపును ప్రోత్సహించాలని, విదేశీ పెట్టుబడులు ప్రత్యామ్నాయం కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులని చెప్పారు. ఈ సంస్థల్లో ప్రభుత్వ వాటాల విక్రయం దేశ ప్రయోజనాలకు హానికరం అని స్పష్టం చేశారు. ఎల్ఐసీలో వేల సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, క్లాస్ 3, 4 క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ వెంటనే చేపట్టాలని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించడం నష్టదాయకమని పేర్కొన్నారు. ఎల్ఐసీలో 1996 నోటిఫికేషన్ ద్వారా నియమించబడిన ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఫెడరేషన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ విధించడం పాలసీదారులపై ఆర్థిక భారాన్ని మోపడమేనని, పైగా ఇది ప్రజలకు బీమాను దూరం చేయడమేనన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని దుయ్యబట్టారు. ఈ సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలిపాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు ఆర్‌వీఎస్ శ్రీనివాస్, డి.సైదులు, ఐ.వెంకట్రావు, శివరామకృష్ణారావు, రాజశేఖర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

76 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన శ్యామ్ సునీల్ కొల్లూరులో రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలో లోడ్ చేసుకొని రాత్రి సమయంలో తరలించటానికి ప్రయత్నించాడు. సుమారు 76 బస్తాల రేషన్ బియ్యాన్ని వట్టిచెరుకూరు మండలంలోని రైస్ మిల్లుకు తరలించటానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని వివిధ కంపెనీలకు చెందిన గోతాలలో ప్యాక్ చేసి ఆటోలో తరలించే యత్నం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన శ్యాం సునీల్, బుల్లెద్దు శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ వార్డెన్‌కు విద్యార్థుల అప్పగింత

విద్యార్థులను వార్డెన్‌కు అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి

తెనాలి రూరల్: సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్న ముగ్గురు విద్యార్థులు ఉదయం టిఫిన్ చేసి స్కూలుకు అని బయలుదేరారు. కానీ వారు స్కూలుకు హాజరు కాలేదు. ఆ విషయం వార్డెన్‌కు కూడా తెలియదు. అనుమానాస్పదంగా రైల్వేస్టేషన్లో ఉండగా జీఆర్పీ కానిస్టేబుల్ గమనించారు. వెంటనే వార్డెన్‌కు సమాచారం ఇచ్చి క్షేమంగా విద్యార్థులను అప్పగించారు. ఎస్ఐ వెంకటాద్రి దీనిపై మాట్లాడుతూ.. కొల్లిపర మండలం దావులూరిపాలెంకు చెందిన ఎల్. కిషోర్ బాబు(12), వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన నాయుడు అభిరామ్ (13), రేపల్లె ఓల్డ్ టౌన్‌కు చెందిన ఎ.జితేంద్ర దర్శన్ (14) స్థానిక నాజరుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఉంటున్నారని తెలిపారు. స్కూలుకు వెళ్లకుండా స్టేషన్ వైపు వచ్చినట్లు చెప్పారు. వెంటనే వార్డెన్‌కు సమాచారం అందించి బాలలను అప్పగించినట్లు తెలిపారు. వార్డెన్ ఆదినారాయణను వివరణ కోరగా.. వారిలో ఇరువురికి ఇంకా స్కూలులో అడ్మిషన్ కాలేదన్నారు. హాస్టల్లో మాత్రం జాయిన్ అయ్యారని, చెప్పులు కొనుక్కునేందుకు ముగ్గురు స్టేషన్ సమీపంలోని షాపునకు వచ్చారన్నారు. అక్కడి నుంచి నీరు తాగేందుకు స్టేషన్‌లోకి వెళ్లగా పోలీసులు గమనించి తమకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బీఎస్‌వీ హిమబిందు

మాట్లాడుతున్న బీఎస్‌వీ హిమబిందు

తాడికొండ: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి) బీఎస్‌వీ హిమబిందు విజ్ఞప్తి చేశారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించేందుకు ఈ నెల 5న నిర్వహించే 2వ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.... జూలైలో పరిష్కరించదగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు, న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించనున్నట్లు చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా లేదా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు ఇరువురూ లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. రాజీపడ దగ్గ కేసులు రాష్ట్రంలో మొత్తం 1,15,071 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్ అమర రంగేశ్వర రావు మాట్లాడుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాటర్న్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవీనాథ్ తిలహరి సూచనల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సహాయ కార్యదర్శి ఎన్‌జే రావు సమావేశంలో పాల్గొన్నారు.

గాంధీ, అంబేడ్కర్‌లతో పోల్చుకునే అర్హత చంద్రబాబుకు లేదు

గాంధీ అధ్యయన కేంద్రం వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్

నరసరావుపేట: మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లతో పోల్చుకునే నైతిక అర్హత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏమాత్రం లేదని గాంధీ అధ్యయన కేంద్ర వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. నేను, గాంధీజీ, అంబేడ్కర్, ఎన్టీఆర్ అందరమూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారమే అయినా, అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకుని ఇంత స్థాయికి వచ్చామని కుప్పం సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్య విన్న జనాలు విస్తుపోయారన్నారు. సత్యం, అహింసల వంటి శాశ్వత విలువల కోసం సత్య హరిశ్చంద్రుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తుల స్ఫూర్తితో అహర్నిశలు శ్రమించిన గాంధీజీకి, నిత్యం నోరు తెరిస్తే అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు చేసే చంద్రబాబుకు పోలిక ఎక్కడని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల వైతాళికుడు అయిన అంబేడ్కర్ ఎక్కడ?.. రెడ్‌బుక్ రౌడీయిజపు రాజ్యాంగాన్ని అమలు చేయిస్తూ దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని కించపరచిన చంద్రబాబుకు పోలిక ఎక్కడని అన్నారు. గాంధీ, అంబేడ్కర్లలో ఒకరు స్వాతంత్ర్య ప్రదాతగా, మరొకరు అంతులేని జ్ఞాన, గుణ సంపదల ఖనిగా, చరిత్రలో మహాపురుషులుగా నిలిచిపోయారని తెలిపారు. కానీ బాబు, అతని కుమారుడు మాత్రం అవకాశాలను దుర్మార్గంగా కిడ్నాప్ చేసి, పదవులు లాక్కొని అక్రమార్జనతో రూ.లక్ష కోట్లకు పడగలెత్తి దుష్పరిపాలన చేస్తూ చరిత్రహీనులుగా పతనమవుతున్నారన్నారు. గాంధీ అంబేడ్కర్‌ల వంటి త్యాగధనుల పేర్లను ఉచ్చరించే నైతిక అర్హత చంద్రబాబుకు లేదని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని తెలిపారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

వేమూరు: మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్య షాపుల నిర్వాహకులు సమయ పాలన పాటించాలన్నారు. మద్యం ప్రభుత్వం ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. సీఐ రవి, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల వల్ల ఒక మహిళ ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. నూజెళ్ల మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన మరియకుమారి (35) అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తూ ఉంటుంది.

ఈ నేపథ్యంలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. కుటుంబ కలహాలా.. లేదా ఇతర కారణాలనే అనే విషయం తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇసుక రీచ్‌లలో లారీలు నడపలేం

గుంటూరులో లారీ ఓనర్లు, డ్రైవర్లు ధర్నా

అమరావతి రోడ్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: అధికారుల వేధింపులు తాళలేమని, ఇసుక రీచ్‌లలో లారీలు నడపలేమని లారీ ఓనర్లు, డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని హోసన్నా మందిరం సమీపంలో లారీలను నిలిపివేసి జిల్లా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. రవాణాశాఖ అధికారులు ఓవర్ టన్నేజీ తోలేందుకు అభ్యంతరం తెలుపుతున్నారని, అందుకు సమ్మతమేనని, కానీ దీనివల్ల వినియోగదారుడికి రూ.700కే ఇసుక అందించగలమని పేర్కొన్నారు. గతంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లామని, అందుకు అంగీకరించారని చెప్పారు. ఇప్పుడు ఆర్టీవో అధికారులు జరిమానా విధిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. లారీలకు ఈఎంఐలు కట్టలేక, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక ఇసుక లారీలను ఆపివేసినట్లు తెలిపారు. ఇసుక రీచ్‌లలో విచ్చలవిడిగా దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. 40 టన్నులు ఇసుక ఎత్తి 20 టన్నులకే బిల్లులు ఇస్తున్నారని, ఆర్టీవో అధికారులు వాహనాలను నిలిపి ఓవర్ టన్నేజీ కింద రూ. 50 వేలు ఫైన్ విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీ నియామకాలు త్వరగా చేపట్టాలి

చిలకలూరిపేట: డీఎస్సీ నియామకాలు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో వీలైనంత త్వరగా నియామకాలు నిర్వహించాలన్నారు. జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో డీఎస్సీ ఖాళీలు కూడా చూపించినందున మారుమూల ప్రాంతాలలో ఎక్కువ ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో త్వరగా మెరిట్ లిస్టు విడుదల చేసి తద్వారా సెలక్షన్ లిస్టు తయారు చేసి వెంటనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడకుండా నియామక ప్రక్రియ సత్వరం చేపట్టాలన్నారు.

కొన్ని పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేని కారణంగా రిలీవర్లు లేక బదిలీలు ఆగి పోయాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, బొంతా రవి, చిలకా వీరయ్యా, అట్లూరి శ్రీనివాసరావు, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్సిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE
PLOT FOR SALE
■నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES
BUSINESS OFFER
■ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE
■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
■P/T, F/T 18సం॥ నిండిన ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను. భవిష్యత్తు నిర్మాణం నో టార్గెట్స్ నో బాస్. 9010808546
■Urgent Requirement Comp:PAYTM' FSE: Sales Executive/Sr.Executive. Place Guntur. Sal: 18k to 32k+ Incentive Medical insurance+PF. 9912002213
■ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444988/ 89

■NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357
■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ Gunturలో Field Executives కావలెను. Salary 15K & 20K + Incentives ✆ 72079 42933
■ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు. కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడే పట్టాభిషేకం
బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివిన వారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వేదిక అవుతోంది.

8లో

నిలువ నీడేదీ!
అన్నవరం సత్యదేవుని ఆలయంలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి దాత ముందుకు వచ్చినా, అధికారులు నిర్ణయం తీసుకోవడం లేదు

కడలిలోకి 99,689 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 99,689 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి డెల్టా కాలువలకు 12,150 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

ధనదైన్యాలు

- నెలలు గడుస్తున్నా ధాన్యం డబ్బులు ఇవ్వని సర్కారు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం బకాయి రూ.399 కోట్లు
- ఖరీఫ్ పెట్టుబడికి రైతుల అగచాట్లు
- ధాన్యం సొమ్ము ఇస్తారా.. ఇవ్వరా అని ప్రశ్న

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నపూర్ణగా ఖ్యాతినొందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు పీకల్లోతు దైన్యంలో కూరుకుపోయారు. రబీ ధాన్యం డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న తీరని జాప్యం అన్నదాతలకు శాపంగా మారింది. ఒకటీ రెండూ రోజులు కాదు.. ఒకరో ఇద్దరో రైతులూ కారు.. వందా రెండు వందల రూపాయలు అంతకంటే కాదు.. ఏకంగా రెండు నెలలుగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకారం రూ.399 కోట్ల మేర ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో ఖరీఫ్ పంటకాలం ప్రారంభమైపోయింది. ఈ నెల 15లోగా నారుమళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ధాన్యం డబ్బులు ఇవ్వడం లేదు. మరోవైపు గత వైఎస్ జగన్ ప్రభుత్వం మాదిరిగా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కూడా అందించడం లేదు. పైగా ఈ పథకం పేరును అన్నదాతా సుఖీభవగా మార్చి రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల్లో గొప్పగా చెప్పారు. కానీ, ఇప్పటి వరకూ నయాపైసా కూడా ఇవ్వలేదు. దీంతో, సాగు పెట్టుబడి కోసం రైతులు నానా అగచాట్లూ పడుతున్నారు. ప్రభుత్వమే నెలల తరబడి ధాన్యం సొమ్ము తొక్కిపెడితే ఖరీఫ్ సాగు ఏవిధంగా చేయగలమంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

గొప్ప చెప్పి.. చిప్ప చూపి..

ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు కూటమి నేతలందరూ ధాన్యం అమ్మిన 24 లేదా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని గొప్పగా చెప్పారు. మంత్రి నాదెండ్ల అయితే ధాన్యం కొనుగోళ్లు జరిగిన సమయంలో ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ధాన్యం సొమ్ముపై రైతులకు ఆశలు కల్పించారు. కొనుగోళ్లు ప్రారంభమైన తొలి పక్షంలో మాత్రం ప్రచారార్భాటం కోసం రైతుల ఖాతాల్లో సొమ్ము వేశారు. మే మొదటి వారం నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రం డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోంది. దీంతో, కడుపు మండిన అన్నదాతలు ధాన్యం సొమ్ము కోసం ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. అంతే కాకుండా, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం

జిల్లాల వారీగా రబీ ధాన్యం బకాయిలు

కాకినాడ	రూ.80 కోట్లు
కోనసీమ	రూ.189 కోట్లు
తూర్పు గోదావరి	రూ.130 కోట్లు
మొత్తం	రూ.399 కోట్లు

నిడదవోలు మండలం డి.ముప్పవరంలో ధాన్యం సొమ్ము కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

కానూరు, నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం రూరల్; కాకినాడ జిల్లా పెద్దాపురం; కోనసీమ జిల్లా అమలాపురం తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు.

రైతులు తక్కువలో తక్కువ ఎకరాకు 50 బస్తాల (75 కేజీలు) దిగుబడి సాధించారు. ఈ మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ప్రతి రైతుకు ఎకరానికి రూ.86 వేలు పైగా రావాలి. ఈవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతులకు ప్రభుత్వం రూ.399 కోట్ల మేర ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఇది ఓవైపు ఖరీఫ్ ఖరీఫ్ సాగు ప్రారంభమైపోయినా ధాన్యం బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ పెద్దల నుంచి ఉలుకూపలుకూ లేదు. కాకినాడలో బుధవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు సైతం ప్రభుత్వ నిర్లక్ష్యంపై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు.

అప్పు పుట్టక..

కూటమి సర్కారు గద్దెనెక్కినప్పటి నుంచి దాదాపు అన్ని వర్గాల వద్ద డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. ఏటా పంట పెట్టుబడులు సమయంలో సొమ్ము సర్దుబాటు చేసే కమీషన్ ఏజెంట్లు కూడా ఈసారి చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు అప్పు పుట్టడం లేదు. ఖరీఫ్‌కు సమాయత్తమయ్యే తరుణంలో రైతులు ఇన్ని కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని రైతు నేతలు మండిపడుతున్నారు.

ధాన్యం అమ్మి 6 వారాలైనా..

రబీలో ఆరెకరాలు సాగు చేశాను. ధాన్యం 75 కిలోల బస్తాకు ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.1,725 కంటే వ్యాపారులు తక్కువకు అడుగుతున్నారని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ద్వారా ప్రభుత్వానికి విక్రయించాను. మే నెలలో 70 కిలోల ధాన్యం బస్తాలు 260 తూచాను. మద్దతు ధర ప్రకారం రూ.4,18,600 రావాలి. మా బ్యాంక్ అకౌంట్లకు ధాన్యం డబ్బులు 24 గంటల్లో జమవుతాయంటే అమ్మాను. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రాలేదు. ఆర్ఎస్‌కే, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాను. తొలకరి సీజన్ ప్రారంభమైపోయింది. విత్తనాలకు, నారుమడి దమ్ముకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఒకవైపు చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాతా సుఖీభవ పథకం అమలు కాక, ధాన్యం లెక్క (డబ్బులు) అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఒకవైపు కుటుంబ ఖర్చులు, మరోవైపు తొలకరి పెట్టుబడులకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తోంది. వెంటనే ధాన్యం డబ్బులు ఇవ్వాలి.

– **వెలుగుబంట్ల రవినాయుడు**, రైతు, కూరాడ, కరప మండలం

దారుణం

ధాన్యం విక్రయించిన 40 రోజులు గడచినా ఇప్పటి వరకూ నయాపైసా కూడా చేతికి రాలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సహాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పింది. ఏడాది గడచినా ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ఇటు ధాన్యం డబ్బులు, అటు పెట్టుబడి సాయం ఇవ్వపోతే రైతులు ఖరీఫ్ పంటలు ఎలా పండించగలరు? పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయడం కష్టంగా మారుతుంది. ఒకవైపు అతివృష్టి, అనావృష్టితో రైతులు ఇబ్బందులకు గురవుతూ ఉంటే ధాన్యం అమ్మిన సొమ్ము కూడా ఇవ్వకపోవడం దారుణంగా ఉంది.

– **వెలమర్తి బుల్లిరాజు**, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

న్యూస్‌రీల్

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ

రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

సామర్లకోట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వందేభారత్ రైలులో విజయవాడ నుంచి సామర్లకోట వచ్చి, కాకినాడ వెళ్తారనే సమాచారం మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ప్లాట్‌ఫాం, అక్కడి నుంచి బయటకు వచ్చే మార్గాన్ని పరిశీలించారు. ప్రధాన మార్గంలో అభివృద్ధి పనులు జరుగుతూ ఉండటంతో పార్సిల్ కార్యాలయం సమీపాన ఉన్న మార్గం నుంచి గవర్నర్ కాన్వాయ్ వచ్చే విధంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఆ మార్గంలోని వాహనాలను పూర్తిగా తొలగించాలని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు సూచించారు. గవర్నర్ వస్తారనే సమాచారం నేపథ్యంలో స్టేషన్ ఆవరణను శుభ్రం చేయించడంపై రమేష్‌తో కలసి మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పరిశీలన జరిపారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, టికెట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడమ్మ ఆలయం మూసివేత

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి గురువారం విలేకర్లకు తెలిపారు. ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారికి కుంభం వేస్తారన్నారు. అందువలన ఆలయ తలుపులు మూసివేయడంతో శుక్రవారం అమ్మవారి దర్శనం ఉండదన్నారు. శనివారం వేకువజామున ఆలయం తెరచి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

ఉద్యానవనశాఖ అధికారిగా మల్లికార్జునరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా నేతల మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన బి.సుజాత కుమారి గత నెల 30 ఉద్యోగ విమరణ చేశారు. దీంతో కాకినాడ జిల్లా నుంచి మల్లికార్జునరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలోని హార్టికల్చర్ రంగంలో అంతర పంటల సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదలశాఖ అధికారి ఎ.దుర్గేష్, విశ్రాంత డీహెచ్‌వో బి.సుజాత కుమారి, కొవ్వూరు మండల హార్టికల్చర్ అధికారి డి.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

సమర్థంగా నేరాల కట్టడి

- పోలీసు అధికారులు, సిబ్బంది సహకారం భేష్
- ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి
- నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాలో నేరాలను సమర్థంగా అరికట్టగలుగుతున్నామని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం అర్ధ సంవత్సర నేర సమీక్ష నిర్వహించారు. 2025లో ఇప్పటి వరకూ జరిగిన సంఘటనలు, చేపట్టిన వివిధ కార్యక్రమాలు, పోలీసులు ఛేదించిన కేసులు, సాధించిన విజయాలను చర్చించారు. కేసుల దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించాలని, బాధితులకు అండగా నిలవాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కట్టడి చేయాలన్నారు. ఈ సమీక్షలో గుర్తించిన లోపాలను సరిదిద్దుకొని, రాబోయే ఆరు నెలలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతం
కలెక్టరేట్ వద్ద ధర్నా

అమలాపురం రూరల్: రాష్ట్రంపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చుతో మూడో వంతు కన్న తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను రక్షించాలని కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని అర్హుల జాబితా తయారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పకుండా పాటించాల కోరారు. తొలుత అమలాపురం గడియాస్తంభం సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టర్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలలు అన్నీ బంద్ చేశారు. డీఆర్ రాజకుమారికి వినతిపత్రం అందించారు. అమలాపురం డివిజన్ ప్రయివేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు పోత్తూరి లక్ష్మి శ్రీనివాసన్, సంఘ గౌరవ అధ్యక్షుడు ముమ్మిడి ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ సిటీ: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకూ జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ, విశాఖపట్నం ఆర్మీ రిక్రూట్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన అగ్నిపథ్ స్కీమ్ కింద ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకూ ఉన్న 13 జిల్లాలతో పాటు యానాంకు చెందిన దాదాపు 22 వేల మంది అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వీరితో పాటు 145 మంది రిక్రూటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారన్నారు. రిక్రూట్‌మెంట్ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ మేరకు ఆయా శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ షణ్మోహన్ దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ సుమారు 800 మంది అభ్యర్థులు పాల్గొంటారన్నారు. వీరికి ఆహారం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, ఆసక్తి ఉన్నవారు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్‌ను 77020 03535 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీకి ఉచిత ప్రవేశాలు పూర్తి కావాలి

కాకినాడ సిటీ: ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలను ఈ నెల 9వ తేదీ నాటికి కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో కలెక్టరేట్‌లో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలు ఏదో ఒక కారణం చెప్పి తమ పిల్లలకు ఉచిత ప్రవేశాలు నిరాకరిస్తున్నాయంటూ తల్లిదండ్రుల నుంచి మూడు వారాలుగా గ్రీవెన్స్ సెల్‌కు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. ఉచిత ప్రవేశాలు కల్పించని పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేద విద్యార్థులు తల్లికి వందనం పథకం ప్రయోజనాలు కోల్పోకుండా ఈ నెల 9వ తేదీ లోగానే అర్హులైన అందరికీ ఉచిత ప్రవేశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరికైనా ఉచిత ప్రవేశం నిరాకరిస్తే అందుకు స్పష్టమైన కారణాలతో సంబంధిత ఎంఈఓకు వివరణ సమర్పించాలన్నారు. పాఠశాలలు తెలిపిన అభ్యంతరాలు, కారణాలను పునఃపరిశీలించి, తిరస్కరించిన విద్యార్థుల్లో అర్హులను ఎంఈఓలు మళ్లీ ఆయా పాఠశాలలకు కేటాయిస్తారని వివరించారు. ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా పేరెంట్, టీచర్ సమావేశాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో డీఈఓ పి.రమేష్, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ వేణుగోపాల్, ఎంఈఓలు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

పరిహారం ఇస్తేనే పచ్చజెండా

- భారత్ మాల రోడ్డుకు తీసుకున్న భూమికి డబ్బులివ్వాలి
- తర్వాతే నిర్మాణం మొదలుపెట్టాలి
- టెండర్ ప్రకటనతో అన్నవరం రైతుల ఆందోళన

అన్నవరం: తమ భూములకు పరిహారం చెల్లించకుండానే భారత్ మాల రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై అన్నవరం రైతులు ఆందోళన చెందుతున్నారు. భారత్ మాల పరియోజన మొదటి దశలో కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ నుంచి అన్నవరం వరకూ 40.621 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారి (ఎన్‌హెచ్–516ఎఫ్) నిర్మించాలని అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం 2020లో నిర్ణయించింది. సాగర తీరం వెంబడి పారిశ్రామికాభివృద్ధికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందని భావించింది. ఈ మేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు 2021లో ఒకసారి టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి, వివిధ కారణాలతో రద్దు చేశారు. తాజాగా మూడు రోజుల క్రితం రీ టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1,040 కోట్లతో అంచనా రూపొందించారు. ఈ రోడ్డు అన్నవరం వద్ద సత్యదేవుని నమూనా ఆలయం సమీపాన 16వ నంబర్ జాతీయ రహదారిని కలుస్తుంది. అక్కడ కత్తిపూడి హైవే సర్కిల్ మాదిరిగా అతి పెద్ద సర్క్యులర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఆ సర్కిల్ నుంచి రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కనిపిస్తుంది. అందువలన అక్కడ ప్రయాణికులు ఆగేందుకు వీలుగా రోడ్డు నిర్మించనున్నారు.

516హెచ్ హైవేకి ఆరెంపూడి - అన్నవరం గ్రామాల మధ్య సేకరించిన భూమి

2021 నుంచే వివాదం

ఈ రహదారి నిర్మాణానికి తమ వద్ద నుంచి రూ.కోట్ల విలువైన భూములను తీసుకున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తమకు పరిహారం చెల్లించకుండానే టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై అన్నవరం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ రహదారికి సంబంధించిన భూసేకరణ వివాదం 2021 నుంచే కొనసాగుతోంది. వాకలపూడి లైట్‌హౌస్ నుంచి కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల మీదుగా అన్నవరం వరకూ 516ఎఫ్ హైవే నిర్మాణం సాగుతుంది. దీని కోసం 2021లో అన్నవరం, ఆరెంపూడి గ్రామాల పరిధిలో 40 ఎకరాలు సేకరించారు. ఇందులో 20 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, మిగిలిన 20 ఎకరాలు చిన్న, సన్నకారు రైతులకు చెందినది. ఈ భూములు సత్యదేవుని పాత నమూనా ఆలయానికి సమీపాన 16వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. తమ భూములను 516ఎఫ్ హైవే కోసం సేకరించడంపై అప్పట్లోనే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమకున్న భూమే తక్కువని, అది కూడా భూసేకరణలో పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అన్నవరంలో హైవేని ఆనుకుని ఎకరం భూమి విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ.4 కోట్లు పైనే ఉంది. ఆరెంపూడి గ్రామంలో సర్వే నంబర్లు 177, 105, 108లో ఉన్న 20 మంది రైతులకు చెందిన పదెకరాలకు సంబంధించి ఎకరానికి రూ.కోటి చొప్పున ఇప్పటికే పరిహారం చెల్లించారు. అయితే, ఒకేచోట భూమి ఉన్నప్పటికీ రికార్డుల్లో గ్రామం పేరు, సర్వే నంబర్లు మారడంతో అన్నవరం రైతులకు మాత్రం పరిహారం చెల్లించలేదు. ఈవిధంగా సర్వే నంబర్ 91–1లోని సుమారు 20 రైతులకు చెందిన మరో పదెకరాలకు ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. ఈ విషయం తేలకుండానే రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రకటన విడుదల చేయడంతో ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిహారం ఇచ్చాకే నిర్మించాలి

భారత్ మాల రోడ్డుకు నా 2.5 ఎకరాల భూమి సేకరించారు. మా కుటుంబ సభ్యులది రెండెకరాలు తీసుకున్నారు. వాళ్ల భూమి ఆరెంపూడి గ్రామ పరిధిలో ఉండటంతో ఎకరానికి రూ.కోటి చొప్పున చెల్లించారు. నా భూమి అన్నవరం గ్రామ పరిధిలో ఉండటంతో పరిహారం ఇవ్వలేదు. రికార్డుల్లో సర్వే నంబర్లు, గ్రామాలు మారాయని, అందువలన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కొర్రీ వేశారని చెబుతున్నారు. దీనిపై కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం కూడా ఇచ్చాం. నాతోపాటు మరో 20 మంది చిన్నకారు రైతులకు కూడా పరిహారం ఇచ్చాకే రోడ్డు నిర్మించాలి.

– **బండారు ముత్యాలరావు**, రైతు

అధికారులకు కలెక్టర్ ఆదేశం



భారత్ మాల రోడ్డు నిర్మాణ భూసేకరణ సమయంలో నేను శంఖవరం మండల ఆర్ఐగా ఉన్నాను. చిన్న సాంకేతిక సమస్య కారణంగా అన్నవరం రైతులకు పరిహారం ఆలస్యమైంది. ఇటీవల ఆ రైతులతో పాటు జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను కలసి సమస్య వివరించాను. ఆ రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు.

– **బైరావజ్జుల ప్రసాద్**, విశ్రాంత ఆర్ఐ, శంఖవరం మండలం

కాకినాడలో జాతీయ జూనియర్ మహిళా హాకీ పోటీలు

కాకినాడ సిటీ: వచ్చే నెల 1 నుంచి 12వ తేదీ వరకూ కాకినాడలో జరగనున్న జాతీయ జూనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ పోటీల నిర్వహణపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా క్రీడా మైదానంలో ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. దీనికి 29 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది హాజరవుతారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా వసతి, భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస కుమార్, ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, హాకీ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ జి.హర్షవర్ధన్, జాయింట్ సెక్రటరీ బి.రవిరాజు, సెట్రాజ్ సీఈఓ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు చేరని బియ్యం

అయినవిల్లిలో తాళాలు వేసి ఉన్న రేషన్ షాపు

అయినవిల్లి: ప్రతి నెలా ఒకటో తేదీనే రేషన్ బియ్యం లబ్ధిదారులకు చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల రేషన్ బియ్యం వ్యాన్‌ల ద్వారా రేషన్ బియ్యం ఇవ్వడం నిలిపేసి పాత విధానంలో డీలర్ల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వడం ప్రారంభించారు. ఈ నెల మూడోవ తేదీ దాటినా అయినవిల్లి మండలంలోని చాలా వరకూ షాపులకు రేషన్ బియ్యం దిగుమతి కాలేదు. దీంతో రేషన్‌షాపు యజమానులు చేసేది లేక లబ్ధిదారులను వెనుకకు తిరిగి పంపిస్తున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఒకటో తేదీనే రేషన్ బియ్యం ఇంటికి వచ్చేవని, కూటమి ప్రభుత్వం విధానం మార్చడంతో ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ షాపులకు వెళ్లి అక్కడ తలుపులకు తాళాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పలువురు రెవెన్యూ అధికారులకు పరిస్థితి వివరించారు. మండలంలోని 41 రేషన్ షాపులు ఉండగా 30 శాతం షాపులకు మాత్రమే రేషన్ బియ్యం సరఫరా చేసినట్లు చెబుతున్నారు. గోడౌన్‌లో బియ్య సరఫరా లేకపోవడంతో ఆలస్యం అయిన మాటా వాస్తవమేనని, స్టాకు రాగానే మిగిలిన 70శాతం షాపులకు బియ్యం సరఫరా చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

క్యూఆర్ కోడ్ పత్రాలను పరిశీలకులకు అందజేస్తున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడుగురు పరిశీలకులను నియమించినట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి గురువారం తెలిపారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని జగ్గిరెడ్డి స్వగృహంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన పరిశీలకుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఉన్న క్యూఆర్ కోడ్ ప్రతాలను వారికి అందజేశారు. వాటితో చంద్రబాబు ఇచ్చిన మోసపు హామీలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక పరిశీలకులను నియమించి వారి విధివిధానాలను క్లుప్తంగా వివరించారు. మండపేట నియోజకవర్గానికి పరిశీలకులుగా కటకంశెట్టి ఆదిత్య, రామచంద్రపురం – కుడిపూడి శ్రీనివాసరావు, ముమ్మిడివరం – మాత మురళి, అమలాపురం – పేరి శ్రీనివాస కామేశ్వరరావు, పి.గన్నవరం – పెన్మత్స చిన్న భద్రరాజు, రాజోలు– వంటెద్దు వెంకన్ననాయుడు, కొత్తపేట – సిరిపురపు శ్రీనివాసరావును నియమించినట్టు తెలిపారు.

ధనిక, పేద తారతమ్యం తగ్గాలి

అమలాపురం రూరల్: ప్రైవేట్, పీపుల్స్, ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారా ధనిక, పేదల మధ్య తారతమ్యం తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 9వతేదీన బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల ఏడవ తేదీన క్లస్టర్ స్థాయిలో జరిగే పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారు అర్హులన్నారు. జనాభా, కౌమార విద్య, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం పోటీలు నిర్వహిస్తామన్నారు. పొగాకు దుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిషేధంపై పెయింటింగ్ పోటీలు, లింగ సమానత్వం, గౌరవంపై వ్యాసరచన పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 11వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 98498 94917, 99632 11075 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

8 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: డీసెట్–2025 ద్వారా రెండు సంవత్సరాలు డిప్లమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు మొదట విడత కౌన్సెలింగ్‌కి సంబంధించి అర్హత పొందిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ జారీ చేస్తారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బొమ్మూరులోని డైట్, ప్రైవేటు డీఎడ్ కాలేజీలు, రంపచోడవరం ఐటీడీఏ డీఎడ్ కాలేజీలో ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్ పొందిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు బొమ్మూరులోని డైట్‌కు హాజరై అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన తరువాత ఫైనల్ అడ్మిషన్ లెటర్ పొందాలని డైట్ ప్రిన్సిపాల్ కోరారు.

నేడే పట్టాభిషేకం

- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం
- వర్సిటీ కులపతి, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు

స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న వర్సిటీ వీసీ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బీటెక్ నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్లు చదివినవారికి గుర్తింపుగా యూనివర్సిటీ అందజేసే పట్టాల వేడుకలకు జేఎన్‌టీయూ కాకినాడ వేదిక అవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలలో ఉన్న వారికి సైతం పట్టా అందుకోవడానికి వర్సిటీ ఆహ్వానాలు పంపింది. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పట్టా (ఒరిజనల్ డిగ్రీ) తీసుకోవడానికి ఏర్పాట్లు చేసింది. జీవితంలో మధురానుభూతిగా నిలిచే ఈ వేడుకలకు అర్హులైన వారు తమ వివరాలు వర్సిటీకు పంపించారు. గత ఏడాది డిసెంబర్‌లో స్నాతకోత్సవం నోటిఫికేషన్ జారీ చేసి గవర్నర్ అనుమతితో శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 11వ స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పట్టాలు అందజేస్తున్నారు. బీటెక్ విభాగంలో 41,258, బిఫార్మశీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఎంసీఏ 1115, ఎం ఫార్మశీ 458, బీబీఏ 115, ఫార్మడీ 274, బీఆర్క్ 83 ఓడీ (ఒరిజనల్ డిగ్రీ)లు విద్యార్థులు పొందనున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు 40మందికి, పీహెచ్‌డీలు 99 మందికి అందజేయనున్నట్టు వర్సిటీ వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థి కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్..

స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, అమెరికా బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. విజయవాడలో జన్మించిన ఈయన జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలలో బీటెక్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందారు. 1986లో అమెరికాలో బోస్టన్ గ్రూప్ స్థాపించి సుమారు 2,500 మందికి యూఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించి మలేషియా, ఇండోనేషియా, ఫిలిఫిన్స్ వంటి దేశాల్లో కార్యకలాపాలు ప్రారంభించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా జేఎన్‌టీయూకేలో సుబుకోటా ఫౌండేషన్ స్థాపించి కోటి రూపాయలు విరాళంగా అందజేశారు. ప్రతి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి నగదు బహుమతితో ప్రోత్సహిస్తున్నారు.

కోట సుబ్రహ్మణ్యం

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి

- ఓ కారు టైరు పేలి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టిన వైనం
- ఇద్దరికి గాయాలు

కార్లను క్రేన్ సాయంతో తొలగిస్తున్న హైవే సిబ్బంది

ప్రమాదంలో మృతి చెందిన నరసింహ గుప్తా

రావులపాలెం: కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి అవతల దారిలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. రావులపాలెం మండలంలో ఈతకోట టోల్ ప్లాజా సమీపంలో గురువారం జరిగిన ఈ ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన బొండాల నరసింహ గుప్తా (55) మృతి చెందారు. పాలకొల్లుకు చెందిన గుప్తా భార్య వీర వెంకట లక్ష్మీదేవితో కలిసి రాజమహేంద్రవరం బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈతకోట టోల్ ప్లాజా దాటాక కొంతదూరంలో కారు టైరు పేలడంతో ఆ కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన కేవీఎస్ఎస్ రామారెడ్డి, దివ్య పద్మజ్యోతి దంపతులు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. వీరు రాజమహేంద్రవరం నుంచి పాలకొల్లు బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుప్తా, అతని భార్య వీర వెంకట లక్ష్మీదేవి, మరో కారులో ఉన్న జ్యోతి గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గ మధ్యలో గుప్తా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలిని రావులపాలెం పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. హైవే టోల్ ప్లాజా సిబ్బంది క్రేన్ సాయంతో కార్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గాయపడిన లక్ష్మీదేవిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

గాయాలతో ఉన్న భార్య దివ్యపద్మజ్యోతితో భర్త రామారెడ్డి

పంట కాల్వలు కలుషితం

హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంట కాల్వల ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు మానవ తప్పిదాలతో కలుషిత అవుతున్నాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలో గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ మానవ నిర్లక్ష్యం, తప్పిదాలపై తాను హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కాల్వల ద్వారా ప్రవహించే గోదావరి జలాలతో పంటల సాగే కాకుండా పలు గ్రామాల్లో తాగునీటి ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని వివరించారు. కొందరు తమ ఇళ్ల మరుగుదొడ్ల గొట్టాలు కాల్వల్లోకి అమర్చుకొని కలుషితం చేస్తున్నారని, తద్వారా పంట కాల్వలు మానవ మల మూత్రాలతో ప్రవహిస్తున్నాయని ఎమ్మెల్సీ ఆందోళన వ్యక్తం చేశారు. సాగు, తాగునీరు కోసం కాటన్ దొర పంట కాల్వల వ్యవస్థను తీసుకుని వస్తే స్వార్థపరులు, కాల్వలను పర్యవేక్షించాల్సి అధికారుల నిర్లక్ష్యం వల్ల కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. కాల్వలను కలుషితం చేయవద్దని, వ్యర్థాలను వదల వద్దని న్యాయస్థానాలు హెచ్చరిస్తున్నాయని గుర్తు చేశారు. కాల్వలను కలుషిత చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పేర్కొన్నారు.

సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులపై దాడి దారుణం

హైకోర్టు న్యాయవాది సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: గోకవరం మండలం మల్లవరం గ్రామంలో సింగారమ్మ తల్లి గుడి నిర్వాహకులు, అర్చకత్వం చేస్తున్న వారిపై దాడికి పాల్పడి వారి గృహలను ధ్వంసం చేయడమే కాకుండా దేవుడి పూజా సామగ్రి, బంగారం, వెండి ఆభరణాల చోరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్య నారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు గుడిలో అర్చకత్వం చేస్తున్న పసుపులేటి సింగారలక్ష్మి, వి.సీతామహలక్ష్మితో కలిసి మాట్లాడారు. సింగారమ్మ చింతగా పేరొందిన అది ప్రైవేటు ఆలయమే అయినప్పటికీ భక్తులు ఇటీవల భారీగా తరలివస్తున్నారని, అమ్మవారికి పూజలు చేస్తున్నారని తెలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ ఆలయాన్ని తమ చేతిలో పెట్టుకోవాలనే దురుద్దేశంతో ఏప్రిల్ 23వ తేదీ రాత్రి వట్టికూటి వీర రాఘవమ్మ, పసుపులేటి సింగారలక్ష్మిపై దాడి చేసి గృహలను, షాపులను కూల్చి వేశారని, సుమారు రూ.25 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను దోచుకుని పోయారని అన్నారు. గోకవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. తాము హైకోర్టులో జూన్‌20న రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. బాధితులు మే 26న జిల్లా కలెక్టర్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారని తెలిపారు. 1880 నాటి కాలంలో వారి ముత్తాత పసుపులేటి వెంకన్న, పసుపులేటి వీరరాఘవమ్మ దంపతులు చింతచెట్టు కింద వెలసిన సింగారమ్మ తల్లికి సుమారు 5 ఎకరాల అడవిని చదును చేసి ఆలయ ప్రాంగణంగా రూపొందించారన్నారు. వంశ పారంపర్యంగా ఆలయం వద్దనే నివాసాలు ఏర్పర్చుకుని పూజారులుగా, ట్రస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి గుడిని రక్షించాలని కోరుతున్నామన్నారు. వట్టికూటి దుర్గాప్రసాద్, వట్టికూటి జనార్ధనరావు, సీతామహలక్ష్మి, ఆలమూరు ధనలక్ష్మి, పసుపులేటి శ్రీ వెంకట సూర్య చక్ర ధనుష్‌కుమార్ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

హత్య కేసులో ఇద్దరికి జైలు

పిఠాపురం: హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి గురువారం తీర్పు చెప్పినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆరుగుళ్ళ శ్రీను, భార్య గంగకు సంసారంలో విభేదాలు తలెత్తాయి. దాని కారణంగా అతని భార్య మూడు నెలల క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో భర్త శ్రీను 2019 జనవరి 16వ తేదీన సంక్రాంతి పండగకు తన భార్యను, పిల్లలను తీసుకెళ్లేందుకు చేబ్రోలులో అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా అత్తింటి తరఫు బంధువులకు, అతనికి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో బావ మరుదులైన దొండపాటి చంద్రబాబు, దొండపాటి అర్జున్, వదిన వరస అయిన నేదూరి రత్నం అతనిపై దాడి చేసి తలపై కొట్టగా శ్రీను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని అక్క దొండపాటి శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై బి రామకృష్ణ కేసు నమోదు చేయగా, అప్పటి పిఠాపురం సీఐ ఎస్.సూర్య అప్పారావు కేసు దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో దొండపాటి చంద్రబాబుకి రెండు సంవత్సరాల జైలు శిక్ష , జరిమానా, దొండపాడు అర్జునుడికి రెండు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. మూడవ ముద్దాయి అయిన రత్నంపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెపై కేసు కొట్టి వేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున విశ్వనాథరెడ్డి, వినయ్ తేజ వాదనలు వినిపించారు. సాక్షులను గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కోర్టులో హాజరు పర్చారు.

ఎయిర్ వాల్వ్‌లో పడిన కారు

తప్పిన ప్రమాదం

గోతిలో పడి విరిగిన కారు ముందు చక్రం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వెళ్తున్న ఒక కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న మంచినీటి పైపు లైన్ ఎయిర్ వాల్వ్ గోతిలో పడటంతో ముందు చక్రం విరిగిపోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం నుంచి కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువ నుంచి ముంగండ మంచినీటి ప్రాజక్టుకు వెళ్లే పైపులైన్లు గతంలో రోడ్డు మార్జిన్లో ఉండేవి. అయితే ఇటీవల రోడ్డును వెడల్పు చేశారు. దీంతో మూడుచోట్ల పైపు లైన్ల ఎయిర్ వాల్వ్‌లు సీసీ రోడ్డులోకి వచ్చాయి. దీంతో అక్కడ రంధ్రాలు ఏర్పడటంతో సిమెంట్ వరలు ఏర్పాటు చేశారు. ఆ వరలు విరిగిపోవడంతో గోతులు ఏర్పడ్డాయి. వీటిని గమనించని వాహన చోదకులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాల పాలయ్యారు. తక్షణమే ఎయిర్ వాల్వ్‌లు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఫోర్జరీ పోలీస్' సస్పెన్షన్

కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు

కాకినాడ క్రైం: రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసిన హెడ్ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. విధుల నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం రాజమహేంద్రవరం జీఆర్‌పీ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన కొప్పిశెట్టి యోగి కామేశ్వరరావు ఏకంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసి ఎస్ఐని అని ఓ నకిలీ ఐడీ కార్డును తన పేరుతో తయారు చేసుకున్నాడు. ఈ కార్డుని వాడుతూ, పలుచోట్ల బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ తరహాలోనే కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్‌లో ఓ కుటుంబ వివాదంలో విచారణ పేరుతో కామేశ్వరరావు జోక్యం చేసుకున్నాడు. విచారణ సమయంలో ఓ మహిళను తాను ఎస్ఐని అని చెబుతూ నకిలీ ఐడీ కార్డు చూపించి మరీ బెదిరించారు. అయితే, అప్పటికే కామేశ్వరరావుది హెడ్‌కానిస్టేబుల్ హోదా అని తెలుసుకున్న మహిళ నకిలీ ఐడీ కార్డు వ్యవహారాన్ని కాకినాడ జిల్లా ఎస్పీబిందుమాధవ్, ఇంటెలిజెన్స్ అధికారులకు వెల్లడించి, కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ మొదలు కాగా, ప్రాథమిక ఆధారాల ప్రాతిపదికగా రాజమహేంద్రవరం జీఆర్‌పీ నుంచి అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు కామేశ్వరరావును పంపారు. లోతైన విచారణ అనంతరం ఆరోపణలన్నీ వాస్తవాలని తేలడంతో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా కామేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కాకినాడ జిల్లా పోలీస్ శాఖకు సిఫారసు చేశారు. కాకినాడలోని రైల్వే గెస్ట్ హౌస్ వద్ద మహిళను నకిలీ ఎస్ఐ ఐడీ కార్డుతో బెదిరించిన నేరంలో కామేశ్వరరావుకి సహకరించిన ఓ మహిళా కానిస్టేబుల్ పైనా చర్యలు తీసుకోవాలని, బదిలీపై తూర్పుగోదావరి జిల్లా పోలీస్ శాఖకు వెళుతున్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు అనకాపల్లి ఎస్పీ సిఫారసు చేశారు.

9 నుంచి 'నన్నయ'లో సెమినార్

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 9,10 తేదీలలో ఇంటర్నేషనల్ సెమినార్ జరుగనుంది. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్ అనలిటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జరిగే ఈ సెమినార్‌కి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం విడుదల చేశారు. ఈ సెమినార్‌లో స్పీకర్స్‌గా ప్రొఫెసర్ కేవీ రామానుజాచారి (యుఎస్ఏ), సైంటిస్టు డాక్టర్ ఎన్.నాగన్న (చైనా), ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు (వరంగల్), డాక్టర్ రాంబాబురెడ్డి (ఐఐటీ – ఖరగ్‌పూర్) పాల్గొంటారన్నారు. దీనికి కన్వీనర్‌గా డాక్టర్ బి. జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తారు.

ప్రముఖ దేవాలయాల శానిటరీ టెండర్ వాయిదా?

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ ఆలయాలకు శానిటరీ మెటీరియల్‌తో సహ క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్‌డ్ ఈ ప్రొక్యూర్ రీ టెండర్ ఖరారు వాయిదా పడినట్లు సమాచారం. ఈ టెండర్‌కు సంబంధించి సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్ ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి లోయెస్ట్ టెండర్ కొటేషన్ ఖరారు చేయాల్సి ఉంది. అయితే గురువారం ఈ టెండర్ ప్రైస్ బిడ్‌ను అధికారులు ఓపెన్ చేయలేదని సమాచారం. ఈ నెల ఎనిమిదో తేదీన చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థల ప్రతినిధులతో ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ప్రైస్ బిడ్ ఓపెన్ చేస్తారని అధికారులు తెలిపారు. అయితే ఈ నెల తొమ్మిదో తేదీన సింహాచలం దేవస్థానం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉన్నందున దేవదాయశాఖ కమిషనర్‌తో సహ అధికారులు ఆ రోజు సింహాచలంలో ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ సమావేశం 11కి వాయిదా పడే అవకాశం ఉంది. ఆ రోజునే టెండర్ ఖరారు అవుతుందని అధికారులు అంటున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి, రాజవోలు దగ్గరలో శ్రీమాన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ సైట్స్, ఇండిపెండెంట్ హౌస్‌లు, విల్లాస్ మరియు అపార్ట్మెంట్స్ కొరకు సంప్రదించండి. JSR - ✆ : 70139 92077 [R-960]

Services

జ్యోతిష్యాలయం



■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

CHANGE OF NAME

■ I, Ramakrishna Reddy Nallamilli S/o. Ammi Reddy Nallamilli R/o. 3-8, Sivalayam Street, Near Satya Sai Nilayam, Ubalanka, East Godavari, Andhra Pradesh - 533237, have Changed the Name of My Minor Daughter Namely Nallamilli Papa (Aged 14 Years 2 Months). And She Shall Hereafter Be Known as Nallamilli Bhoomi for All Future Purposes [DA-39176]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]

■ ఫార్మసీ కంపెనీ చౌటుప్పల్, హైదరాబాద్ నందు లేబర్ వర్క్ చేయుటకు 20–30 సంవత్సరాలలోపు యువకులు కావలెను. జీతం: 12–15 వేలు. సంప్ర|| సెల్: 91773 12968, 98499 93684 [YA-2871]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిలువ నీడేదీ!

- పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణమెప్పుడో?
- 2023లో 60 గదుల సత్యదేవ సత్రం కూల్చివేత
- రూ.1.99 కోట్లతో షెడ్డు నిర్మాణానికి లారెస్ ఫార్మా సంసిద్ధత
- ఆ నిధులను మరో కార్యక్రమానికి వెచ్చించిన సంస్థ
- నీడ లేక సత్యదేవుని భక్తులకు ఇక్కట్లు

గత కార్తిక మాసంలో పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి 2023లో విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముందుకు వచ్చింది. రత్నగిరి రామాలయం పక్కన రేకులతో వేసిన విశ్రాంతి షెడ్డు లాగే ఇక్కడ కూడా నిర్మించాలని నిర్ణయించారు. అందుకు ఆ సంస్థ కూడా అంగీకరించింది. ఆ తర్వాత కొత్త ఈఓ రావడంతో ఆ ప్రతిపాదన కాస్తా అటకెక్కింది. దీంతో ఆ నిధులను సంస్థ మరో కార్యక్రమానికి వినియోగించింది. అనంతరం ఇక్కడ రేకుల షెడ్డు కాకుండా, ప్లాస్టిక్ క్లాత్‌లా టెన్సిల్ రూఫ్ షెడ్డు వేయాలని దేవస్థానం ప్రతిపాదించింది. దీనిపై ఆలోచన చేస్తామని సంస్థ యాజమాన్యం తెలిపింది. ఈ క్రమంలో నీడ లేక, చలువ పందిరిలో వర్షానికి తడిసి భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

నీడ లేక అవస్థలు

పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గతంలో 60 గదులతో సత్యదేవ అతిథి గృహం (సత్రం) ఉండేది. భక్తుల కోసం (గ్యాలోరిమ్ టైల్స్ రూఫ్ షెడ్) విశ్రాంతి షెడ్డు నిర్మించాలనే ఆలోచనతో ఆ సత్రాన్ని 2023 అక్టోబర్‌లో తొలగించారు. అక్కడ విశాల షెడ్డు నిర్మించాలని అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రణాళిక రూపొందించారు. విశాఖపట్నానికి చెందిన లారెస్ సంస్థ రూ.1.99 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఆ ఏడాది కార్తిక మాసం ప్రారంభం కావడంతో తాత్కాలిక షెడ్డు నిర్మించారు. కార్తిక మాసం అనంతరం షెడ్డు నిర్మించడానికి ఆ సంస్థ మెటీరియల్ కూడా సిద్ధం చేసింది.

ఈఓ బదిలీతో..

కాగా, ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ఆయన స్థానంలో ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ బాధ్యతలు చేపట్టారు. రేకుల షెడ్డు నిర్మిస్తే రాజగోపురం కనిపించదని ఆయన ఆ ప్రతిపాదనకు అభ్యంతరం చెప్పారు. ఈ నేపథ్యంలోనే లారెస్ సంస్థ ఆ నిధులను వేరే పనులకు వినియోగించింది.

పార్కింగ్‌గా షెడ్డు స్థలం

పశ్చిమ రాజగోపురం ఎదురుగా సత్రం కూల్చివేయడంతో, ఆ ప్రదేశం పార్కింగ్ స్థలంగా మారింది. దేవస్థానం బస్సులు కూడా ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడ నుంచి సత్యదేవుని ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. వేసవిలో భక్తుల కోసం చలువ పందిళ్లు వేస్తున్నారు. ఈ ఏడాదీ అలాగే చేశారు. వర్షం పడితే చలువ పందిళ్ల నుంచి నీరు కారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం వారు కనీసం షెడ్డు వేయలేరా అని ప్రశ్నిస్తున్నారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు గత ఫిబ్రవరిలో లారెస్ సంస్థ ప్రతినిధులను షెడ్డు నిర్మించాలని కోరారు. నాలుగు నెలలైనా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఆ సంస్థ ముందుకు రాకపోతే దేవస్థానం నిధులైనా వెచ్చించి, షెడ్డు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రావణ మాసంలో రద్దీ

ప్రస్తుతం ఆషాఢ మాసంలో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా.. జూలై 25 నుంచి శ్రావణ మాసంలో సత్యదేవుని ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. వివాహాల సీజన్ కావడంతో రాత్రి వేళల్లో కూడా పెద్ద సంఖ్యలో పెళ్లి బృందాలు వస్తాయి. అదే సమయంలో వర్షాలు కూడా అధికమవుతాయి. దీంతో భక్తుల అవస్థలు చెప్పనలవి కాదు.

అధికారులు ఏమన్నారంటే..

పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి లారెస్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. పూర్తి స్థాయిలో నిధులు లేవని తెలిపింది. చిన్న షెడ్డు నిర్మిస్తామని చెప్పింది. పూర్తి వివరాలు త్వరలో తెలియచేస్తామన్నారు. వారు అంగీకారం తెలిపిన వెంటనే దేవస్థానం చైర్మన్, ఈఓల అనుమతి తీసుకుని షెడ్డు నిర్మిస్తామన్నారు.

సాక్షి కృష్ణాజిల్లా
శుక్రవారం, 4, జూలై, 2025

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

అభినందనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అన్యాయం చేశారు.. ఆదుకోండి

సుదూర ప్రాంతాలకు తమను బదిలీ చేశారని సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంచేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీని కోరారు. ▶8లో

ఆ ఇళ్లకే సుపరిపాలన

- అన్ని ఇళ్లనూ సందర్శించని టీడీపీ ఎమ్మెల్యేలు
- ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీస్తారని ఆందోళన
- తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్తున్న వైనం
- సమస్యలు వద్దు.. సంక్షేమ పథకాలు అందాయా లేదా అంటూ దాట వేత

తిరువూరు 9వ వార్డులో టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద కరపత్రం అందజేసి ఫొటో దిగుతున్న ఎమ్మెల్యే కొలికపూడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'ఇంటింటికీ వెళ్లి ప్రజలకు 'సుపరి పాలన'ను వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాం. వాటిని గాలికి వదిలేసి ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాం. సమస్యలు పరిష్కారం కాలేదంటూ అన్ని వర్గాల ప్రజలు రోడ్డుక్కుతున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు ఇలా ఎవరిని కదిపినా నిప్పులు చెరుగుతున్నారు. పింఛన్లను కుదించాం. అన్ని పథకాలకు మంగళం పాడేశాం. తల్లికి వందనంలో కోతలు పెట్టాం. ఇప్పుడు ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి? హామీలపై నిలదీస్తే వారికి ఏమని చెప్పాలి' అని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మొదలైన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్లి మొక్కుబడిగా ముగిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజులు ఎలా నెట్టుకురావాలా అని తలలు పట్టుకొంటున్నారు.

దందాలపై నిలదీస్తారని భయం

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకుల దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు వారు చేయని దందా లేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాతో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఊరూరా బెల్ట్ షాపులు, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆక్రమణలు, కబ్జాలు ఇబ్బడి ముబ్బడిగా చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులతో వేధించారు. వీటన్నింటితో ఐదేళ్ల తరువాత కనిపించాల్సిన ప్రభుత్వ వ్యతిరేకతను ఏడాదిలోని మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ముందుకెళ్లేందుకు ముఖం చెల్లక కొంత మంది ఎమ్మెల్యేలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, నందిగామ ఎమ్మెల్యేలు అందుబాటులో లేరు. నందిగామ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని చిన్ని సుపరిపాలనలో భాగంగా కంచకచర్లలో పాల్గొన్నారు. తమకు అనుకూలమైన ప్రాంతంలో కేవలం నామ మాత్రంగా కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి కార్యక్రమాన్ని గంటలోపే ముగించారు.

కృష్ణా జిల్లాలో..

- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మచిలీపట్నం 48వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. ఎంపిక చేసుకున్న ఇళ్లకు మాత్రమే మంత్రి వెళ్లి పథకాల గురించి వివరించారు. కొన్ని ఇళ్ల వద్ద ప్రజలు తమ ప్రాంతంలో నాలుగు నెలలుగా వీధిదీపాలు వెలగటం లేదని, తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదని మంత్రిని నిలదీశారు. పోతేపల్లి గ్రామంలో గురువారం ఇదే రీతిలో కార్యక్రమం సాగింది.
- అవనిగడ్డ నియోజకవర్గంలో మొక్కుబడిగా సుపరిపాలన కార్యక్రమం జరుగుతోంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూడళ్ల వద్ద, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఈ కార్యక్రమంపై టీడీపీ నాయకులకు సైతం ఆసక్తి లేకపోవటం గమనార్హం.
- పామర్రు నియోజకవర్గంలోని పామర్రు టౌన్‌లో జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ప్రకటించిన విధంగా ప్రతి ఇంటికి వెళ్లకుండా వారికి అనుయాయులుగా ఉన్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారితోనే సమయం గడుపుతున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే ఆందోళనతో కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.
- గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడలో సుపరిపాలన కార్యక్రమం తూతూ మంత్రంగా జరుగుతోంది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కార్యక్రమం జరుగుతుందనే సమాచారాన్ని ఎవరికీ ముందస్తుగా ఇవ్వకుండా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి రెండు ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు మండలం కాటూరు గ్రామాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పర్యటించారు. ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి టీడీపీ అనుకూల వ్యక్తుల ఇళ్లకు మాత్రమే వెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి 'మై టీడీపీ' యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కార్యక్రమం మొక్కుబడిగానే సాగింది.
- గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, రామవరప్పాడు గ్రామాల్లో సుపరిపాలన కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ కూడా టీడీపీ అనుకూల గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లి ఫొటోలు దిగి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. పెడన నియోజకవర్గంలో సైతం కార్యక్రమం మొక్కుబడిగా సాగింది.

సమస్యలు వద్దంటూ..

తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడికి సమస్యలతో ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. తిరువూరు మండలం, కోకిలంపాడులో రోడ్డు అధ్వానంగా ఉందని, మోకాలి లోతు గుంతలు, బురదతో నిండిందని, వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయని, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇప్పుడు వచ్చింది సమస్యల గురించి కాదని, సంక్షేమ పథకాల గురించి వచ్చామంటూ ఎమ్మెల్యే కొలికపూడి మాట దాటవేశారు. ఎమ్మెల్యే ముందు సమస్యల గురించి చెప్పకుండా జనాలను టీడీపీ స్థానిక నాయకులు వారించారు. గురువారం సైతం అదే తంతు జరిగింది. తిరువూరులోని తొమ్మిదో వార్డులో డ్రెయిన్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 'ఇప్పుడు సమస్యల గురించి వద్దు. మీకు తల్లికి వందనం వచ్చిందా? లేదా? అంటూ వారు అడిగిన సమస్యను ఎమ్మెల్యే దాట వేశారు. జగ్గయ్యపేటలో సైతం తమకు అనుకూలమైన వారి ఇళ్లకే టీడీపీ నాయకులు వెళ్లారు. విజయవాడ వెస్ట్‌లో ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలైంది. విజయవాడ ఈస్ట్, సెంట్రల్ నియోజకవర్గాల్లో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

ఈగల్ టీం ఐజీ రవికృష్ణ

గంజాయి చాక్లెట్లను చూపిస్తున్న ఐజీ రవికృష్ణ, డీసీపీ సరిత తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ టీం ఐజీ ఆరే రవికృష్ణ తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీం సభ్యులు, పోలీసులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా బిహార్ నుంచి చెన్నైకు గంజాయి చాక్లెట్లను తీసుకు వెళ్తన్న వ్యక్తిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గంజాయి కేసులకు సంబంధించి 80 శాతం ఒడిశా నుంచే ఇతర ప్రాంతాలకు రైళ్లలో సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, దీనిని అరికట్టేందుకు అన్ని రైల్వేస్టేషన్లలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సహకారంతో ఈగల్ టీంలు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాయని వివరించారు. డ్రోన్‌లు, శాటిలైట్ టెక్నాలజీని ఉపయోగించి అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను వదిలే ప్రసక్తే లేదని, వారి ఆస్తులను అటాచ్ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఇటువంటి తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సరిత, రైల్వే సీనియర్ డీఎస్సీ షణ్ముగ వడివేల్, జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు, సీఐలు జి.వి.రమణ, దుర్గారావు, ఆర్పీఎఫ్ సీఐ పతే అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కార్తికేయుని సేవలో ప్రముఖులు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పాండిచ్చేరి మాజీ మంత్రి, ఆ రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, చెన్నై వాసి, టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి, అనురాధ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, వేద పండితులు, అర్చక స్వాములు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కృష్ణమూర్తి, అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలను మల్లాడి కృష్ణారావు, కృష్ణమూర్తి, అనురాధకు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ పూజలు చేశారు.

యోగాను ఒలింపిక్ క్రీడల్లో చేర్చాలి

చిలకలపూడి(మచిలీపట్నం): యోగాను ఒలింపిక్ క్రీడల్లో చేర్చాలని ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ కోరారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మకు యోగా పోటీల ఆహ్వానపత్రికను ఆయన గురువారం అందజేశారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. యోగా ఆసియా క్రీడల్లో ఇప్పటికే చోటు దక్కించుకుందని, ఒలింపిక్ క్రీడల్లో కూడా చేర్చేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఆసియా క్రీడల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. జిల్లా స్థాయిలో ఈ నెల 19వ తేదీన ఉయ్యూరు దత్త కల్యాణ మండపంలో యోగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బెనర్జీ, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఎస్‌ఎన్‌ఎల్ నేషనల్ లోక్ అదాలత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఈ నెల ఐదో తేదీన బీఎస్‌ఎన్‌ఎల్ నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని సంస్థ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం కోర్టుల్లో 'నేషనల్ లోక్ అదాలత్' జరుగుతుందని పేర్కొన్నారు. క్లోజ్ చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ ఫోన్ల తాలూకు వినియోగదారులకు న్యాయసేవాధికార సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చామని, వారు కోర్టుకు హాజరుకాకుండా ముందుగానే బకాయిలు చెల్లించొచ్చని సూచించారు. ఈ నెల ఐదో తేదీలోపు వడ్డీ లేకుండా బకాయిలు చెల్లించొచ్చని, పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత తగిన రాయితీ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. బకాయిల తీర్మానం జరిగిన తర్వాత సర్వీసులను పునరుద్ధరణ చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 0866 – 2444266/ 83338 98997/ 94901 88990/ 94901 45222 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కృష్ణా డీఎస్‌ఓ పార్వతి బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.పార్వతిని బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను తూర్పుగోదావరి జిల్లా డీఎస్‌ఓగా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. ఆమె స్థానంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివరామప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

మేళతాళాలతో దుర్గమ్మకు సారె

అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మేళతాళాలు.. మంగళ వాద్యాలతో భక్తులు దుర్గమ్మ కొండకు తరలివస్తున్నారు. సకుటుంబ సమేతంగా అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. గురువారం సుమారు 40కి పైగా భక్త బృందాలు, 1200 మందికి పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సారెను సమర్పించేందుకు విచ్చేస్తున్న భక్త బృందాలు, భక్తులకు దేవస్థానం సకల సదుపాయాలను కల్పిస్తోంది. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి భక్తులు సారె సమర్పిస్తున్నారు. మహామండపం ఆరు, ఏడు అంతస్తుల్లో అమ్మవారికి సమర్పించిన పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, మిఠాయిలను మహిళలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. సారె సమర్పించిన భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాలతో పాటు ఉచిత ప్రసాదాలను దేవస్థానం అందించింది.

10వ తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు?

ఆషాఢం సారె, వారాంతం, శాకంబరీదేవి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసే యోచనలో ఉన్నట్లు ఆలయ ఈఓ శీనానాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం రోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలను ఈఓ నిలిపివేశారు. తాజాగా పదో తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు చేయాలనే ఆలోచన చేయడం గమనార్హం.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

- కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన జీఓ 120ను రద్దు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కొల్లేరును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన 120 జీఓను రద్దు చేయాలని, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిని కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన గురువారం కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వారు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజలకు హానికరమైన ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై. కేశవరావు మాట్లాడుతూ.. మూడో కాంటూరు నుంచి ఐదో కాంటూరు వరకు పది కిలోమీటర్ల దూరంలో సున్నితమైన పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలు విధించి మొత్తం కొల్లేరును పూర్తిగా అటవీ శాఖ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీని ప్రభావం ఏలూరు జిల్లాలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేటి ప్రాంతంలోని 89 గ్రామాలపై పడుతుందన్నారు. అధికారులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

ఎంఎంసీలో లెక్కలేనితనం

- మచిలీపట్నం నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగంలో అక్రమాలు
- కాంట్రాక్టర్ల నుంచి మినహాయించిన మొత్తాలను ఆయా శాఖలకు జమ చేయని వైనం
- బదిలీపై వచ్చిన కొత్త జేఏఓకు చార్జి అప్పగించని ఇన్‌చార్జి అకౌంటెంట్
- లోపాలు బయటపడతాయని కార్యాలయంలో కనిపించని ఇన్‌చార్జి ఏఓ!

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం అకౌంట్స్ విభాగం అవినీతికి అడ్డాగా మారిందనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. కమిషనర్ కనుసైగల్లోనే ఈ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేశారనేందుకు ఇక్కడ చోటు చేసుకున్న ఘటనలు బలం చేకూర్చుతున్నాయి. అకౌంటెంట్‌గా అనుభవం లేని, అర్హత లేని జూనియర్ అసిస్టెంట్ మోహనగోపాల్‌ను ఆ సీట్లో నియమించి రూ.లక్షల ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా చెల్లింపులు చేశారనేది ప్రధాన విమర్శ. కమిషనర్‌తో పాటు ఇంజినీర్లు, అకౌంట్ ఆఫీసర్ సైతం అడ్వాన్స్‌ల రూపంలో రూ.లక్షల్లో నిధుల డ్రా చేసుకోవటం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా కూటమి పెద్దల ఆదేశాలతో ఏడాది కాలంగా పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రం అత్యవసరం పేరుతో కౌన్సిల్ ఆమోదం లేకుండా బిల్లులు చెల్లించడం గమనార్హం.

చార్జి అప్పగించని ఇన్‌చార్జ్ అకౌంటెంట్

పెడన మునిసిపాలిటీలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసిన జేఏఓ మల్లేశ్వరరావు నెలన్నర క్రితం ఎంఎంసీకి బదిలీపై వచ్చారు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న మోహనగోపాల్‌ను రెవెన్యూ విభాగానికి కమిషనర్ బదిలీ చేశారు. అయితే జేఏఓకు అకౌంట్స్‌కు సంబంధించిన ఫైల్‌తో చార్జ్‌ని అప్పగించాల్సిన గోపాల్ నూతన ఏఓకు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. చార్జ్ అప్పగిస్తే ఈ అక్రమాల బాగోతం బయటపడుతాయనే అప్పగించటంలేదనే వాదనలు బాహాటంగానే వినవస్తున్నాయి. అందువల్లే గోపాల్ కార్యాలయంలో కూడా కనిపించడంలేదని సిబ్బంది సైతం పేర్కొంటున్నారు. చార్జ్ అప్పగించడంలో జాప్యం చేస్తున్నా కమిషనర్ కూడా మిన్నకుండి పోవటం విమర్శలకు తావిస్తోంది.

సకాలంలో జమకాని జీఎస్టీ, ఐటీ నిధులు

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిన అనంతరం జీఎస్టీ రెండు శాతం, ఐటీ ఒక శాతం నిధులను ఎంఎంసీ మినహాయిస్తుంది. ఈ మొత్తాన్ని సకాలంలో ఆయా శాఖలకు ఏఓ జమ చేయాలి. కానీ ఇక్కడ అలా జరగకపోవటంతో ఆయా శాఖలు సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తూ వసూళ్లకు పూనుకుంటున్నాయి. ఆయా శాఖలకు కార్పొరేషన్ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉన్నా ఏఓ ఇటీవల రూ.5 లక్షలను నగరంలోని ఓ అకౌంటెంట్ పేరుతో జమ చేయటం అనుమానాలకు తావిస్తోంది. నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరుగుతున్నా ఆడిట్, విజిలెన్స్, ఏసీబీ శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కనిపించని పలు ఎం బుక్‌లు, బిల్లుల ఫైళ్లు

ఎంఎంసీలోని అకౌంట్స్ విభాగంలో కొన్ని సంవత్సరాలకు సంబంధించిన పనుల ఎం బుక్‌లు, బిల్లుల ఫైళ్లు కనిపించడం లేదు. తమ బిల్లులు ఎప్పుడు చేస్తారంటూ వెళ్తున్న కాంట్రాక్టర్లకు ఆ ఫైళ్లు కనిపించటంలేదనే సమాధానం వినిపించడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ ఈ విషయమై ఫిర్యాదు చేయటంతో ఇన్‌చార్జ్ ఏఓ వెతకగా కొన్ని ఫైళ్లే దొరికాయని చెబుతున్నట్లు తెలిసింది. ఇంకా చాలా ఫైళ్లు మాయమయినట్లు సమాచారం. ఈ విషయంపై కాంట్రాక్టర్లు లింగం రవికిరణ్, ఎడమా నరేంద్ర ఇటీవల మునిసిపల్ కమిషనర్ బాపిరాజును కలిసి తమ గోడును వినిపించారు.

ఫైల్స్ మాయంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్లు రవికిరణ్, నరేంద్ర

చర్యలు తీసుకుంటా

ఏఓ మోహన గోపాల్ నూతన జేఏఓ నాగమల్లేశ్వరరావుకు చార్జి అప్పగించేలా చర్యలు తీసుకుంటా. నిబంధనల ప్రకారమే చెల్లింపులు జరిగాయి. ఎలాంటి అవకతవకలు జరగలేదు. ఫైళ్లు కనబడకుండా పోవు. అవి ఉంటాయి. సిబ్బందితో వెతికిస్తా.

– బాపిరాజు, మునిసిపల్ కమిషనర్, ఎంఎంసీ

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలి

జాతీయ రహదారిపై గుంతలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

కేసరపల్లి(గన్నవరం): చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై గుంతలు పూడ్చి, రెండు వైపులా పచ్చదనం పెంపొందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేసరపల్లి వరకు జాతీయ రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. విమానాశ్రయం నుంచి అమరావతికి నిత్యం వీవీఐపీలు, విదేశీ ప్రతినిధులు వస్తుంటారని, ఈ నేపథ్యంలో జాతీయ రహదారిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు. రహదారిపై ఏర్పడిన గుంతలు, బుడమేరు కాలువ వంతెనపై పగుళ్లను తక్షణం పూడ్చి రాకపోకలకు అనువుగా మార్చాలని ఆదేశించారు. సెంట్రల్ డివైడర్‌పై వెలగని ఎల్‌ఈడీ లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, రోడ్డుపైకి విస్తరించిన పొదలు, పిచ్చి మొక్కలను తక్షణం తొలగించి శుభ్రం చేయాలని, రోడ్డుకు రెండు వైపులా పూల కుండీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించాలని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థ సారథి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ విద్యాసాగర్, తహసీల్దారు కె.వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థం.. రైతుకు అనర్థం

- కొండపల్లి ఐడీఏ కంపెనీల వ్యర్థాలు తొమ్మండ్రం వాగులోకి విడుదల
- రసాయన వ్యర్థాలతో చవుడుబారుతున్న సాగు భూములు
- వ్యాధుల బారిన పడుతున్న కట్టుబడిపాలెం గ్రామస్తులు
- వాగులో నీరు తాగి మృత్యువాత పడుతున్న మూగజీవాలు

కవులూరు శివారులో తొమ్మండ్ర వాగు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

జి.కొండూరు: ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి పారిశ్రామికవాడలో ఉన్న పలు కంపెనీల నుంచి విడుదల వుతున్న రసాయన వ్యర్థాలను పక్కనే ఉన్న జి.కొండూరు మండలంలోని తొమ్మండ్రం వాగులో కలుస్తున్నాయి. ఈ వ్యర్థాల కారణంగా వాగుకు రెండువైపులా ఉన్న కట్టుబడి పాలెం గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. వాగులో నీరు తాగి మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. రసాయన వ్యర్థాలు తిష్టవేయడంతో కవులూరుకు చెందిన వందల ఎకరాల సాగు భూమి చవుడుబారు తోంది. కట్టుబడిపాలెం, కవులూరు గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఈ సమస్యపై పోరాడుతున్నా ఫలితం కనిపించ లేదు. అప్పుడప్పుడూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు హడావుడి చేయడం తప్ప రసాయన వ్యర్థాలను వాగులోకి విడుదల చేయకుండా అడ్డుకోలేకపోతున్నారని రెండు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు గ్రామాల ప్రజలు ఇటీవల వాగు వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఖరీఫ్ సాగు కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యం వేల లీటర్ల వ్యర్థాలు..

కొండపల్లి ఐడీఏలో నాలుగు వందల వరకు పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఫార్మా, కెమికల్ కంపెనీలు 12, ప్లాస్టిక్ కంపెనీలు మూడు, మడ్డి ఆయిల్ కంపెనీలు నాలుగు, టైర్ ఆయిల్ కంపెనీలు మూడు వరకు ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి రోజుకు వేల లీటర్లు రసాయన వ్యర్థాలు విడుదలవుతాయి. ఈ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు రసాయన పరిశ్రమల సొసైటీ ఆధ్వర్యంలో కొండపల్లి సమీపంలోనే రూ.8 కోట్లతో రీసైక్లింగ్ యూనిట్‌ను నిర్మించారు. అయితే ఈ వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఆయా కంపెనీల నిర్వాహకులు తమ ప్రాంగణాల్లోనే నిల్వ ఉంచి వర్షంపడినప్పుడు, రాత్రి వేళ, సెలవు రోజుల్లో పరిశ్రమలకు పక్కనే ఉన్న తొమ్మండ్రం వాగులోకి వదిలేస్తున్నారు.

రైతులకు తీవ్ర నష్టం

జి.కొండూరు మండలంలోని లోయ ప్రాంతంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన తొమ్మండ్రం వాగు కొండపల్లి పారిశ్రామిక వాడను ఆనుకొని కట్టుబడిపాలెం గ్రామం మీదుగా సైపన్ ద్వారా బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను దాటి కవులూరు శివారులోని వ్యవసాయ భూముల మీదుగా ప్రవహించి తారకరామా ఎత్తిపోతల పథకం ఎడమ కాలువలో కలుస్తుంది. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలు వాగులో కలిసి వ్యవసాయ భూముల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో కవులూరు పరిధిలో 600 ఎకరాల సాగు బూములు చవుడుబారి రైతులు నష్టపోయారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు, దోమల కారణంగా కట్టుబడిపాలెం గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కలుషిత నీరు తాగిన మేకలు, గేదెలు, ఆవులు, పందులు వంటి మూగజీవాలు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి.

తొమ్మండ్రం వాగులో రసాయన వ్యర్థాలతో కలిసి నీటి ప్రవాహం

చర్యలు తీసుకోకుంటే ఎడారే

తొమ్మండ్రం వాగులోకి రసాయన వ్యర్థాలను వదలడం వల్ల భూములు చవుడుబారుతున్నాయి. పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యపై ఎంత పోరాటం చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే వ్యవసాయ భూమి ఏడారిలా మారుతుంది.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు గ్రామం

పశువుల చూడి నిలవడంలేదు

తొమ్మండ్రం వాగులోకి ఐడీఏలోని కెమికల్స్‌ను వదలడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఆ నీటిని తాగిన గేదెలకు రోగాలు వస్తున్నాయి. చూడి వచ్చినా నిలవడం లేదు. ఈ నీరు మా పొలాల మీదుగా వెళ్లడం వల్ల పైరు ఎదగడం లేదు. ఖరీఫ్ మొదలైతున్నందున కెమికల్స్‌ను వాగులోకి వదలకుండా కట్టడి చేయాలి.

– సర్నాల వలరాజు, రైతు, కవులూరు గ్రామం

వాగులోకి వదలడం దుర్మార్గం

తొమ్మండ్రం వాగులోకి కెమికల్స్‌ని వదలడం వల్ల మా భూములు ఆరు వందల ఎకరాలకు పైగా పంట పండకుండా పోతున్నాయి. వాగు నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. వర్షం పడి వాగులో నీరు ప్రవహించే సమయంలో ఎక్కువగా వ్యర్థాలను వదులుతున్నారు. అధికారులు స్పందించి కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.

– చెరుకూరి వెంకట రమణారావు, రైతు, కవులూరు గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం..

ఐడీఏలోని కంపెనీల నుంచి రసాయన వ్యర్థాలను తొమ్మండ్రం వాగులోకి వదలడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ వాగులో నీరు మా పొలం మీదుగా వెళ్లడం వల్ల పైరులో ఎదుగుదల లోపించి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులు మా గోడును పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– బోగినేని బాలకృష్ణ, రైతు, కవులూరు గ్రామం

అన్ని రకాలుగా నష్టపోతున్నాం

తొమ్మండ్రం వాగులోకి రసాయనాలను వదలడం వల్ల పంట సక్రమంగా పండడం లేదు. పశువులు ఈ నీరు తాగడం వల్ల చూడి నిలవడంలేదు. పాల దిగుబడి తగ్గిపోతోంది. ఈ నీరు మా పొలాల్లో చేరడం వల్ల పొలం పని చేసినప్పుడు మాకు వ్యాధులు వస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

– ఈలప్రోలు రవి, రైతు, కవులూరు గ్రామం

స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రణాళికలు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): స్వర్ణాంధ్ర–2047 సాధన దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో పీ–4 తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు గురించి కలెక్టర్ వివరిస్తూ.. జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ కార్యాలయాలను, నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక కార్యాలయాలను నెలకొల్పుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 6వ తేదీన తొలి దశ సమావేశం ప్రజాప్రతినిధులతో నిర్వహించి యూనిట్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నామన్నారు. జేసీ గీతాంజలిశర్మ, ఇన్‌చార్జ్ డీఆర్వో శ్రీదేవి, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఇంజినీరింగ్(వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్) కార్మికులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. అర్ధనగ్నంగా మొలలకు వేప కొమ్మలు కట్టుకుని నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి నినాదాలు చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో విజయవాడ ధర్నా చౌక్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర అధ్యక్షుడు జ్యోతిబసు, నగర కోశాధికారి స్టీఫెన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా పరిహారం పొందేందుకు రైతులు స్వచ్ఛందంగా పంట బీమా పథకంలో చేరవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూమి ఉన్న యజమాని, సీసీఆర్‌సీ కార్డు పొందిన కార్డుదారులు ఈ పథకంలో చేరడానికి అర్హులన్నారు. పంట రుణం తీసుకున్న రైతులకు అదనంగా బీమా ప్రీమియం కూడా మంజూరు చేస్తామన్నారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి జాతీయ పంట బీమా పోర్టల్‌లో నమోదు చేసుకుని ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో కూడా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నోటిఫై చేసిన పంటలకు ఈ బీమా సౌకర్యం లభిస్తుందన్నారు.

అన్యాయం చేశారు.. ఆదుకోండి

కృష్ణా జిల్లా కలెక్టర్‌ను వేడుకున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వ్యవసాయ సహాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల నిర్వహించిన బదిలీల్లో సుదూర ప్రాంతాలకు తమను బదిలీ చేసి అన్యాయం చేశారని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లా పాపలతో ఉన్న తమను వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయటం ఎంతో బాధ కలిగించిందన్నారు. కలెక్టర్ డీకే బాలాజీని గురువారం రాత్రి కలిసి తమ గోడును వెలిబుచ్చారు. సచివాలయాల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న తమ వెసులుబాటు పట్టించుకోకుండా ఇష్టానుసారం బదిలీ చేశారని కలెక్టర్‌కు వివరించారు. అనారోగ్య సమస్యలు, స్పౌజ్ కేసులు, చంటి పిల్లలు ఉన్న తమను సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఎలా వెళ్లేదని విన్నవించారు.

వందల కిలోమీటర్ల దూరం..

జగ్గయ్యపేటలో పనిచేస్తున్న వారిని నాగాయలంకకు.. ఎ.కొండూరు నుంచి పమిడిముక్కల, మొవ్వ ప్రాంతాలకు బదిలీ చేయటంతో వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. తమకు వచ్చే జీతం చార్జీలకే సరిపోతుందని, జీవనం ఎలా గడుపుతామని కన్నీరు పెట్టుకున్నారు. రీకౌన్సెలింగ్ నిర్వహించి ర్యాంకుల ఆధారంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వ్యవసాయశాఖ సంచాలకులను పిలిచి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ సంచాలకులు గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతూ సమస్యలను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ

కార్యాలయ తలుపు గొళ్లెం పగులకొట్టిన దొంగలు

విచారిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ, క్రైం పోలీసులు

- రూ.13.56లక్షల విలువైన స్టాంప్‌లు అపహరణ
- గన్నవరంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

గన్నవరం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీ చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి దొంగలు కార్యాలయంలోకి చొరబడి సుమారు రూ. 13.56లక్షల విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, తోక బిళ్లలను అపహరించుకుపోయారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక చింతలపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. తిరిగి గురువారం విధులకు హాజరైన సిబ్బంది కార్యాలయ తలుపు గొళ్లెం పగులకొట్టి ఉండడం గమనించి సబ్‌రిజిస్ట్రార్ వీవీవీ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కార్యాలయానికి చేరుకున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డు రూమ్ తలుపులు తీసి ఉండి స్టాంపులు భద్రపరిచిన బీరువా పగులకొట్టి ఉండడటాన్ని గుర్తించారు.

ఆధారాల సేకరణ..

సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కార్యాలయాన్ని పరిశీలించారు. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ దొంగల వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ మూర్తి, డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐ బీవీ శివప్రసాద్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది నుంచి చోరీ ఘటనపై వివరాలు సేకరించారు. సీసీఎస్ సీఐ గోవిందరాజు నేతృత్వంలోని బృందం కార్యాలయ పరిసరాల్లోని సీసీ ఫుటేజ్‌లను సేకరించి దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనపై సబ్‌రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇవి మిస్సింగ్..

సుమారు రూ.13,56,300 విలువైన రూ. 50 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు 3,600, రూ.100 ధర కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు 3,600, తోక బిళ్లలు రూ.50 ధర కలిగినవి 12,500, రూ.100 ఖరీదు కలిగినవి 4,609 చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలు ఆఫ్ చేసి ఉండడం పట్ల ఆఫీస్‌లో పనిచేసే ప్రైవేట్ సిబ్బంది వ్యవహారశైలిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు..

ఈ చోరీ ఘటన వల్ల గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. చోరీకి సంబంధించి పోలీసులు ఆధారాలు సేకరణ, విచారణ కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయినట్లు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ తెలిపారు. తిరిగి శుక్రవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

వయస్సు 24.. చోరీలు 24

- నాలుగు నెలల్లో 12 దొంగతనాలు
- ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు
- రూ. 6లక్షలు విలువైన ఆభరణాలు స్వాధీనం

మాట్లాడుతున్న ఏసీపీ దామోదరరావు, సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాలుగు నెలలో 12 చోరీలు చేసిన నిందితుడు ఉయ్యాల రాజేష్(24)ను గుణదల పోలీసులు అరెస్టు చేసి రూ.6లక్షలు విలువ చేసే 60గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డి. దామోదరరావు తెలిపారు. స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అలా దొరికాడు..

గుణదల మురళీనగర్ కట్టమీద ఇటీవల చోరీ జరిగింది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుణదల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసిరెడ్డి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమానితులు, నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందానికి అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఒక యువకుడు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.

జల్సాలకు అలవాటు పడి..

విచారణలో నిందితుడు అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు ఉయ్యాల రాజేష్(24)గా గుర్తించామని ఏసీపీ చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన రాజేష్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడ్డాడన్నారు. ఈ క్రమంలో రాజేష్‌పై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేశామని చెప్పారు. 2024 సెప్టెంబర్‌లో దొంగతనం కేసులో గుణదల పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించామని తెలిపారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన రాజేష్ నేర ప్రవృత్తి మార్చుకోకుండా చోరీలకు పాల్పడ్డాడని.. నాలుగు నెలల వ్యవధిలో 12 దొంగతనాలు చేశాడని వివరించారు.

సాంకేతిక ఆధారాలు ఆధారంగా..

సాంకేతిక పరిజ్ఞానం, చోరీ జరిగిన ప్రాంతంలో వేలిముద్రలు పరిశీలించి పాత నేరస్తులతో పరిశీలించగా రాజేష్‌ను నిందితుడిగా గుర్తించామని ఏసీపీ చెప్పారు. రాజేష్‌పై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్‌లలో 12 కేసులు ఉన్నాయన్నారు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజేష్ చోరీలు చేశాడని వివరించారు. నేరస్తుడుని అరెస్టు చేయటంతో పాటు అతని వద్ద నుంచి రూ.6లక్షలు విలువచేసే ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


తిరువూరులో హత్య కేసు నిందితులను చూపుతున్న ఏసీపీ ప్రసాదరావు

తిరువూరు: ఎ.కొండూరు మండలం పాతరేపూడి తండాలో గత నెల 26న కోట రాము అనే వ్యక్తిని హత్య చేసిన ఇరువురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తిరువూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరానికికు చెందిన ఆదూరి చార్లెస్‌కు, రెడ్డిగూడెం మండలం కూనపరాజు పర్వకు చెందిన బత్తుల కుమారితో వివాహేతర సంబంధముంది. కొద్దికాలంగా కోట రాము కూడా కుమారిని తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని వేధిస్తున్నాడు.

అడ్డు తొలగించుకోవాలని..

కుమారి ఈ విషయాన్ని చార్లెస్‌కు చెప్పగా, ఇరువురూ కలసి రామును అడ్డు తొలగించుకోవాలని భావించారు. రామును కొత్త రేపూడి గ్రామశివారులోని మామిడి తోట వద్దకు కుమారి తీసుకురాగా, చార్లెస్ కర్రతో అతని తలపై బలంగా బాదాడు. రాము తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోగా.. కుమారి, చార్లెస్ పరారయ్యారు. తన భర్త మూడు రోజులుగా కనిపించట్లేదని హతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, 29న పాత రేపూడి మామిడితోటలో లభ్యమైన మృతదేహం రాముదిగా గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. కుమారి, చార్లెస్‌పై వెంకటేశ్వరమ్మ అనుమానం వ్యక్తం చేయగా.. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని తెలిపారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

అగార్ ఉడ్ మొక్కల సాగుతో అధిక లాభాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచంలోనే అత్యంత విలువైన చెట్టు అగార్ ఉడ్ అని, దీని సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని త్రిపుర ప్రభుత్వ ఎన్‌టీఎఫ్‌పీ డైరెక్టర్, ఐఎఫ్ఎస్ అధికారి ప్రసాదరావు అన్నారు. విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం మందిర డెవలపర్స్ ఆధ్వర్యంలో అగార్ ఉడ్‌పై వ్యవసాయ పెట్టుబడితో అధిక లాభాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాదరావు మాట్లాడుతూ అగార్ ఉడ్ ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదం, మెడిసిన్, సౌందర్య సాధనాలలో విరివిగా వాడుతున్నట్లు తెలిపారు. ఈశాన్య దేశాలలో పెరిగే అగార్ ఉడ్ మొక్కలను గత 10 నుంచి 15 ఏళ్లుగా కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో విరివిగా సాగు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమ్మకాలు ఎగుమతులు అన్ని క్లియరెన్సులు అందిస్తూ కొన్ని రూ. వేల కోట్లు బిజినెస్‌ను అంచనా వేస్తూ అగార్ ఉడ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మందిర డెవలపర్స్ చైర్మన్ జీవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు, ప్రయోక్త మల్లాది సూరిబాబు 80వ జన్మదిన వేడుకల సందర్భంగా సామగాన లహరి ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 10వ తేదీ గురువారం సాయంత్రం నుంచి నాలుగు రోజుల పాటు జాతీయ సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మల్లాది బ్రదర్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు పాల్గొంటారన్నారు. 13వ తేదీ సాయంత్రం సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబుకు సత్కారం ఉంటుందని వివరించారు. ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరారావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం, పలువురు సంగీత విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

STAFF WANTED
Required qualified and experienced English & Hindi high school staff
HOLY SPIRIT E.M. HIGH SCHOOL
Kuchipudi, Movva.
Cell : 96525 30580

WANTED P.E.T.s
A well reputed School at Kaikaluru, Eluru (Dist) requires the following vacancies.
P.E.T. Male (1), Female (1)
Salary: 20.000/- to 25,000/-
Interested candidates can come directly to School with resume with in seven days.
TVNRM NATIONAL SCHOOL
Kaikaluru, Eluru Dist, AP-521333 ✆ 6303 602 774

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

Real Estate

PLOT FOR SALE

■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' అడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర : ✆ 97034 34023, 96428 72122

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

Wanted

■ SBI Lifeలో పనిచేయుటకు Unit Managers కావలెను. Exp. Min. 2 yrs, Q : Any Graduate, Fixed Salary + PF + ESI + Travelling Allowance ✆ 98480 57524

■ క్లాస్ ఇన్‌ఛార్జెస్ (M) జీ : 12K హాస్టల్ వార్డెన్స్ (M), జీ : 10K వ : 25-45, అనుభవం గలవారు కావలెను. గౌతం డిగ్రీ కాలేజీ, మోడ్రన్ సూ.మార్కెట్ ఎదురు, బెంజ్‌సర్కిల్ ✆ 88971 72345

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ కేర్ ఆఫ్ హెల్త్ కార్డు ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000 + 2500 TA. సంప్రదించండి. ఫోన్: ✆ 70130 52798

■ విజయవాడ – తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60564, 72070 13418

■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : ✆ 88858 01357

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679

■ రామవరపాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M)లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: ✆ 98853 26279

■ ప్రముఖ కంపెనీవారి వ్యవసాయ ఉత్పత్తులు మండలాల వారిగా జీతం/కమీషన్‌పై పనిచేయుటకు అనుభవం ఉన్న అభ్యర్థులు కావలెను. Qly 10th-డిగ్రీ జీతం 10-20 వేలు. 88851 91948

■ కన్సల్టెన్సీ కాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు 40 వేలు, ఫ్రీ రూం + భోజనం. Hyd 7993583999

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2 వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781

గమనిక

7995092114
9912220547

సాక్షి
కర్నూలు
శుక్రవారం । 4 । జూలై । 2025

25 నుంచి శ్రావణ ఉత్సవాలు
ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు?
ఇంటర్ ఫలితాలు వచ్చినా డిగ్రీ ప్రవేశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. సింగిల్ మేజర్ సబ్జెక్టుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 8లో▸

పూర్వ డీఎంహెచ్‌ఓకు జైలు
లంచం తీసుకున్న కేసులో పూర్వ ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 8లో▸

న్యూస్‌రీల్

సర్వ దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్

భక్తుల సర్వదర్శనం కోసం ప్రధాన ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్

మంత్రాలయం: శ్రీమఠంలో సర్వదర్శనాలకు గురువారం ప్రత్యేక క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. దళారుల దందాను అరికట్టేందుకు శ్రీమఠం అధికారులు ఈ విధానాన్ని ఆచరణలోకి తెచ్చారు. సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది క్యూలైన్ల దరిదాపుల్లోకి రాకుండా అధికారులే ప్రత్యక్ష పర్యవేక్షణకు దిగారు. మఠం ప్రధాన ముఖ ద్వారం ముంగిట కారిడార్‌లో స్టాఫర్లతో క్యూలైన్ విధానం అమల్లోకి తెచ్చారు. మఠం మేనేజర్లు, సూపరింటెండెంట్స్ పర్యవేక్షణలో దర్శనాలకు అనుమతించారు. ఇక సేవా భక్తులు, గ్రామ భక్తులకు మాత్రం 6,7 నంబర్ల గేట్ల క్యూలైన్లలో దర్శనాలకు అవకాశం కల్పించారు. భక్తులు ఎవ్వరూ మోసపోకుండా ఉండేందుకు ఈ విధానం దోహదపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 184 వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 184 వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శనా క్షేత్రాలను వ్యవసాయ శాఖ రెగ్యులర్ ఏడీఏల ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ప్రదర్శన క్షేత్రానికి రూ.4 వేల ప్రకారం రూ.7.33 లక్షలు ఏడీఏలకు విడుదల చేసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, ఆదోని సబ్ డివిజన్‌లో 18, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ సబ్ డివిజన్‌లలో 17, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లలో 16 ప్రకారం వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా సబ్ డివిజన్‌లలో సాగు చేసే ప్రధాన పంటల్లో వీటిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కర్నూలు అర్బన్ బ్యాంక్ సీఈఓ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈఓగా పనిచేస్తున్న ఎస్‌ఏ రఫీక్‌ను విధుల నుంచి తొలగించినట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ నాగరమణయ్య తెలిపారు. ఈ నెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో ‘రూ.2.42 కోట్ల ప్రజాధనం స్వాహా’ శీర్షికన వార్త ప్రచురితం కావడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై నిర్వహించిన సెక్షన్ 51 విచారణలో ఎస్‌ఏ రఫీక్ పేరు కూడా ఉన్నందున విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు నాగరమణయ్య తెలిపారు. సంఘంలోని సభ్యులు, డైలీ డిపాజిట్ చేసే వారు.. ఇతరులు ఎవ్వరైన ఈయనకు ఎలాంటి నగదు చెల్లించవద్దని సూచించారు. ఎవ్వరైనా ఈయనకు నగదు చెల్లిస్తే సంఘం ఎలాంటి బాధ్యత వహించదని పేర్కొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా బి. రాధిక

నూతన డీడీ రాధికకు అభినందనలు తెలుపుతున్న సంక్షేమ అధికారులు

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బి.రాధిక గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జేడీగా విధులు నిర్వహించిన జె.రంగలక్ష్మీదేవి అమరావతి డైరెక్టరేట్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి డీడీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తు వచ్చారు. అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న బి.రాధికను ప్రభుత్వం గత నెల 6న ఇక్కడకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆమె డీడీగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా జిల్లాలోని సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

నీరున్నా.. రైతుకు కన్నీరే!

చుట్టూ నీరు ఉన్నా ‘చుక్క’ అందని దుస్థితి. బిరబిరా కృష్ణా నది పరుగులు తీస్తున్నా.. తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతున్నా.. పంట కాలువలకు సాగునీరు అందని దౌర్భాగ్యం. రైతుకు మేలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం స్వప్రయోజనాలకు ‘గేట్లు’ ఎత్తింది. పొలాలను తడిపి పైర్లకు జీవం పోయాల్సిన నీరు దిగువకు వెళ్తూ రైతుకు దుఃఖాన్ని మిగులుస్తోంది.



తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

- సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు అందని నీరు
- యథేచ్ఛగా దిగువకు వదిలేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- శ్రీశైలం ప్రాజెక్టులో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- గేట్ల భద్రత సాకుతో టీబీ డ్యాంలో తగ్గిన 80 టీఎంసీల నీరు
- టీబీడ్యాం 12 గేట్లు పైకెత్తిన ఇంజినీర్లు

కర్నూలు (సిటీ): ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి తుంగభద్ర, కృష్ణా నదికి వరదనీరు వస్తోంది. అయితే ఆ నీటిని సాగునీటి కాలువలకు విడుదల చేయడం లేదు. గేట్ల భద్రత పేరుతో తుంగభద్ర డ్యాం నుంచి జలాలను నదిలోకి వదిలేస్తున్నారు. శ్రీశైలం డ్యాంలోకి ముందుగానే వరద నీరు చేరింది. పోతిరెడ్డిపాడు ద్వారా నీరిస్తారని రైతులు ఆశించారు. అయితే విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటికి దిగువకు సాగర్‌కు వదిలేస్తున్నారు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కళ్లముందే నీరున్నా రైతుకు కన్నీరే మిగిలింది.

నిబంధనలకు విరుద్ధంగా..
కేఆర్‌ఎంబీ అనుమతి లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తి పేరుతో 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తోంది. రిజర్వాయర్ పూర్తిగా నిండేంతవరకు విద్యుత్ ఉత్పత్తి చేయవద్దని చెప్పాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాయలసీమ జిల్లాల ఆయకట్టుదారుల ప్రయోజనాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఏపీ ప్రభుత్వం సైతం కుడి విద్యుత్ కేంద్రం ద్వారా 23,263 క్యుసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం పెరగక..ఎగువ నుంచి వస్తున్న నీరంతా దిగువకు విడుదుల చేస్తున్నారు. రాయలసీమ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా టీడీపీ నేతలు నోరు మెదపడం లేదు. టీడీపీ నేతల నిర్లక్ష్య వైఖరిపై ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కష్టం.. నష్టం

శ్రీశైలం డ్యాంలో 167.48 టీఎంసీల నీరు ఉన్నాయి. అయినా హంద్రీ– నీవా కాలువకు నీరు ఇవ్వలేదు. కాలువ వెడల్పు పనులతో నీటి విడుదలను ఆపేశారు. ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు రావడంతో మే నెల చివరలో, జూన్ మొదటి వారంలో చాలా మంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, హంద్రీ– నీవా కాలువకు నీరు వదలకపోవడంతో పైర్లు ఎండి నష్టం వస్తోంది. కొంత మంది రైతులు కాలువలో ఊరిన నీటిని పైపులతో మోటార్ల ద్వారా పొలాలకు తరలించి పైర్లను కాపాడుకుంటున్నారు.

కృష్ణగిరి సమీపంలో హంద్రీ- నీవా కాలువలో ఊరిన నీటిని మోటర్ ద్వారా పంపింగ్ చేసుకుంటున్న రైతు

దైన్యం.. దయనీయం

తుంగభద్ర డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ దిగువకు నీటిని విడుదల చేయడంపై బోర్డు అధికారుల తీరుపై ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో పొలాలను బీళ్లు పెట్టుకోవాలా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. టీబీ డ్యాంలో సమృద్ధిగా నీరు ఉన్నా అందకపోవడం, ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం తదితర కారణాలతో ఎల్‌ఎల్‌సీ కింద రైతులు ఖరీఫ్ సాగు సన్నాహానికి ఏర్పాటు చేసుకోలేకపోయారు. నీరు సమృద్ధిగా ఉన్నా వెల్దుర్తి, గోనెగండ్ల, పెద్దకడుబూరు, మద్దికెర, మంత్రాలయం మండలంలో తాగునీటి సమస్య తలెత్తింది. దాహార్తితో కొన్ని గ్రామాల్లో ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన కూడా తెలిపారు. ప్ర‘జల’ కష్టాలను రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీసం ఎల్లెల్సీకి నీరు విడుదల చేయించేందుకు కార్యాచరణ కూడా రూపొందించలేదు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 875 అడుగులకు పైగా చేరుకుంది. తుంగభద్ర, హంద్రీ నది నుంచి వరదనీరు వస్తుండటంతో రిజర్వాయర్‌లో 167.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు గేట్ల నుంచి వారం రోజుల క్రితమే సాగు నీటిని విడుదల చేసే అవకాశం కలిగింది. శ్రీశైలం డ్యాంలో 854 అడుగులకు నీటిమట్టం చేరిన తర్వాత పోతిరెడ్డిపాడు నుంచి నీరిచ్చేందుకు అవకాశమున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పక్క రాష్ట్రానికి చెందిన ప్రభుత్వానికి భయపడి, కేఆర్‌ఎంబీ నిర్ణయం సాకు చూపించి, ప్రజలకు కనీసం తాగునీటికి సైతం విడుదల చేయలేపోయింది. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రూ. వందల కోట్ల నష్టం
పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌తో తెలుగుగంగ, కేసీ ఎస్కేప్, జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వలకు నీరు ఇవ్వవచ్చు. ఈ కాల్వల కింద 6.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం కంది, మినుము, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్స్ తదితర పంటలు వేశారు. కాలువలకు నీరు ఇవ్వకపోవడం, వర్షాలు కురవకపోవడంతో కొందరు పంటలను తొలగిస్తున్నారు. పెట్టుబడి అంతా మట్టిపాలై ఇప్పటికే రూ. వందల కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది.

నీటి నిల్వ తగ్గించి..
గతేడాది తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. నిపుణుల సలహా మేరకు అన్ని గేట్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తాత్కాలిక గేట్‌తో నీటిని నిల్వ చేస్తున్నారు. ఇటీవలే జరిగిన టీబీ బోర్డు సమావేశంలో డ్యాంలో నీటి సామర్థ్యాన్ని 105.3 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు తగ్గించారు. దీంతో గురువారం 20 క్రస్టు గేట్లు పైకెత్తి 56 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఏడాది పాలనకే ప్రజలు విసుగెత్తిపోయారు

- శ్రీశైలానికి వరద వచ్చినా పోతిరెడ్డిపాడు గేట్లు ఎందుకు ఎత్తడం లేదు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కాటసాని



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు మొత్తం అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆక్రమణలు, అక్రమార్జనే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయకపోగా.. తొలి అడుగు అంటూ ఊర్లకు వస్తున్న ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారన్నారు. గొప్పగా రూ. 4 వేలు పింఛన్ ఇచ్చామని చెప్పి మరో వైపు 3 లక్షల పింఛన్లు కోత పెట్టడం చంద్రబాబుకు చెల్లిందన్నారు. తల్లికి వందనం అందక రోజూ ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారన్నారు. బాబూ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ‘బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ కార్యక్రమం చేపట్టామన్నారు. ‘ప్రభుత్వం తొలి అడుగు’ పేరుతో ఇంటింటికీ వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల బాండ్లను చూపి నిలదీయాలన్నారు. గత ప్రభుత్వం వేసిన శిలాఫలకాలకు రంగులు మార్చి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని హడావుడి చేస్తున్నారన్నారు.

రాయలసీమకు తాగు, సాగు నీటిని అందించే శ్రీశైలం జలాశయానికి వరదొచ్చినా అధికారులు ఎందుకు పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తడం లేదని కాటసాని ప్రశ్నించారు. గత ఖరీఫ్, రబీలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు నష్టపోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. గాలేరు నగరి, హంద్రీనీవా పెండిగ్ పనులు పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యాలమంగా మార్చాలన్నారు. బాబు

నీళ్లొచ్చినా ఎందుకు వదలరు..

పాలనలో అమలు కాని పనులకు ప్రచార ఆర్భాటాలు ఉంటాయన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో భూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూముల్లో ఎందుకు నిర్మాణాలు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈనెల 5వ తేదీన తమ నివాసంలో నియోజకవర్గ స్థాయిలో ‘బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ’ పేరుతో నిర్వహించే సమావేశానికి నాయకులు, కార్యకర్తల భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రామలక్ష్మయ్య, మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు చాంద్‌బాషా, కృష్ణారెడ్డి, రాముడు, చందమామ బాబు, జగన్, అశోక్‌రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పనికిరాని బ్యాగులు.. రుచిలేని భోజనం!

- ఆలూరు ఎమ్మెల్యేకు కష్టాలు చెప్పిన విద్యార్థులు
- కూటమి పాలనలో అంతా అవినీతిమయం అయ్యిందని ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శ



విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు: ‘మాకు పనికిరాని బ్యాగులు ఇచ్చినారు.. మధ్యాహ్నం తినలేని, రుచిలేని భోజనం పెడుతున్నారు’ అని విద్యార్థులు ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షికి తమ కష్టాలను వివరించారు. ఆలూరు– ఎల్లార్తి రోడ్డు సమీపంలో ప్రభుత్వ బాలుర నం.1 హైస్కూల్‌ను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. తరగతి గదిలో వెళ్లి ‘పాఠాలు బాగా చెబుతున్నారా.. బాగా చదువుతున్నారా’ అని విద్యార్థులను ప్రశ్నించారు. ‘పాఠ్యపుస్తకాలు ఇచ్చారా.. సాక్సులు, బూట్లు, రెండు జతల యూనిఫాం అందిందా’ అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 675 మంది విద్యార్థులు ఉంటే కేవలం ఏడుగురు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు ముందుకు సాగడంలేదనే విషయం ఎమ్మెల్యేకు అర్థమైంది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన బ్యాగులు నాసిరకంగా ఉన్నాయనే విద్యార్థులే చెప్పారు. మధ్యాహ్నం భోజనానికి లావు బియ్యాన్ని వాడుతున్నట్లు తన పరిశీలనలో గమనించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి పాలనలో అంతా అవినీతిమయం అయ్యిందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు ప్రతి చిన్న పనిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించార తప్ప, ఎక్కడా అమలు చేయలేదన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ఏకోపాధ్యాయ ప్రభుత్వ పాఠశాలలు చాలా ఉన్నాయన్నారు. హెచ్‌ఎంలు సమావేశాలకు వెళ్లే ప్రభుత్వ బడులను మూత వేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, పెండింగ్‌లో ఉన్న తరగతి గదుల పనులను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వీరేష్, రాముడు, నాగేష, అనిల్‌రెడ్డి, నాగేంద్ర, రాజ్ , వరుణ్, బాబు, బాషా తదితరులు ఉన్నారు.

జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఆలూరు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లాలో 1.15 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. తాజా వర్షాల వల్ల పంటలు కోలుకునే అవకాశం ఏర్పడింది. జిల్లా మొత్తం మీద సగటున 17.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. మొదటి మూడు రోజుల్లో 8.8 మి.మీ వర్షం కురిసింది. వర్షాలు కురుస్తుండటంతో యూరియా, ఇతర రసాయన ఎరువులకు డిమాండ్ పెరిగింది.

మండలం	వర్షపాతం(మి.మీ)
కౌతాళం	44.6
పెద్దకడుబూరు	43.6
ఎమ్మిగనూరు	38.6
గోనెగండ్ల	25.6
గోనెగండ్ల	25.6
కోడుమూరు	23.6
క్రిష్ణగిరి	23.6
మద్దికెర	22.8
ఆదోని	21.6
సీ.బెళగల్	20.4
తుగ్గలి	18.8

స్పౌజ్ పింఛన్ల పంపిణీ ఇప్పట్లో లేనట్లే!

- విడుదల చేసిన నిధులు వెనక్కు పంపాలని ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్ల పంపిణీ కూడా ఇప్పట్లో లేనట్లేనని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం విడుదల చేసిన నిధులను కూడా వెనక్కు పంపాలని సెర్ప్ అధికారులు డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య కాలంలో వృద్ధాప్య పింఛను తీసుకుంటూ మరణించిన వారి స్థానాల్లో వారి భార్యలకు వితంతు పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు 2,319, నంద్యాల జిల్లాలో 2,463 ప్రకారం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసింది. ముందుగా ఇచ్చిన ఆదేశాల మేరకు ఈనెల 1న రెగ్యులర్ పింఛన్లతో కలిపి స్పౌజ్ పంఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం చివరి నిముషంలో వీటి పంపిణీని నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది. తీరా ఈ పింఛన్లకు సంబంధించిన నిధులను సైతం వెనక్కు పంపాలని ఆదేశించడం చూస్తే ఇప్పట్లో పంపిణీ చేసే ఉద్దేశం లేదనే విషయం స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 9,922 మంది పింఛన్లు తీసుకోలేకపోయారు.

‘నిషా’ చరులు!

- ఐదు నెలల కాలంలో 8,140 కేసుల నమోదు

బహిరంగ ప్రదేశాల్లో రాత్రి పూట మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కర్నూలు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారు ఎక్కువయ్యారు. జిల్లా వ్యాప్తంగా గత ఐదు నెలల కాలంలో మద్యంబాబులపై 8,140 కేసులు నమోదయ్యాయి. బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, నడకదారులు, పార్కులు, వ్యాపార సముదాయాలు, శివారు ప్రాంతాలు అడ్డాలుగా చేసుకుని మద్యం తాగుతున్న వారిపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా వేసి కేసులు నమోదు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలకు అసౌకర్యం కల్గిస్తే చర్యలు ఉంటాయని పోలీసులు తనిఖీల సందర్భంగా హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ నడకదారులు, పార్కులు, శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని మద్యం తాగడమే కాక ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నారు. పోలీసుల నిఘా తీవ్రం చేసి పబ్లిక్ న్యూసెన్స్ కింద చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు అసౌకర్యం కల్గిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఓపెన్ డ్రింకింగ్‌పై తనిఖీలు కొనసాగుతాయని హెచ్చరించారు.

మందుబాబులపై నెలవారీగా నమోదైన కేసులు

ఫిబ్రవరి	1,976
మార్చి	1,041
ఏప్రిల్	1,926
మే	1,435
జూన్	1,762
మొత్తం	8,140

యూఎల్‌బీల ఎంపికలో ప్రభుత్వం వివక్ష



మంత్రి నారాయణకు రాసిన లేఖను చూపుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ రాజేష్

కర్నూలు(టౌన్): యూఎల్‌బీలను(అర్బన్ లోకల్ బాడీ) బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 25 మున్సిపాల్టీలను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులైన మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, చైర్ పర్సన్లకు ఈ నెల 3, 4 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని గుర్‌గ్రామ్‌లో రెండు రోజులపాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల బలోపేతం దిశగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొనేందుకు ప్రభుత్వం ఇప్పటికే జీవో 643 జారీ చేసింది. అయితే అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించిన ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క మున్సిపాల్టీని కూడా ఎంపిక చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎంపిక చేసిన వాటిల్లో ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి తెలుగుదేశం కండువా కప్పుకున్న మున్సిపల్ చైర్మన్లు, చైరపర్సన్లకు పెద్దపీట వేసింది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆళ్లగడ్డ చైర్మన్, డోన్ వైస్ చైర్మన్‌లు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ రెండు మున్సిపాల్టీలను సైతం విస్మరించారు. ప్రభుత్వ ‘పచ్చ’పాత ధోరణిపై స్థానిక మంత్రులు కూడా నోరు మెదపకపోవడం గమనార్హం. ఇదిలాఉంటే ఉమ్మడి జిల్లాలను పూర్తిగా విస్మరించడంపై డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణకు లేఖ రాశారు. ఇది మంచి సంప్రదాయం కాదని, స్థానిక సంస్థల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ఎంతో కృషి చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కేవలం రాజకీయం కోణంలో ఈ ప్రభుత్వం యుఎల్‌బీలను ఎంపిక చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

క్లుప్తంగా

అంకిరెడ్డిపల్లెలో పిచ్చికుక్క దాడి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో గురువారం పిచ్చికుక్క దాడిలో 12 మంది గాయపడ్డారు. ఎస్సీ కాలనీ, ప్రధాన రహదారి, మెయిన్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని కాలనీలతో పాటు పలు వీధుల్లో పిచ్చికుక్క సంచరించి రామాంజనేయులు, పల్లె శివరామిరెడ్డి, మూగెన్న తదితరులపై దాడి చేసింది. గ్రామంలో కొద్ది సేపు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చిన్న పిల్లలను బయటకు పంపకుండా ఇంట్లోనే ఉంచారు. ఆవుపై కూడా పిచ్చికుక్క దాడి చేసింది. అయితే కొందరు వ్యక్తులు పిచ్చి కుక్కపై కట్టెలతో దాడి చేసి చంపేశారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రులకు తీసుకెళ్లారు.

యువకుడి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: లింగాపురం గ్రామంలో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పాతకోట చెన్నయ్య (30) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మానసికంగా కుంగిపోయి గురువారం తెల్లవారుజామున ఇంటిలో ఉరేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య అంకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

కోసిగి: చెట్టు పై నుంచి కింద పడి కోసిగి హనుమంతు (27) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గౌడుగల్లు గ్రామానికి చెందిన కోసిగి హనుమంతు గతనెల 28న తన పొలంలో ఉన్న నేరేడు పండ్లను రాల్చేందుకు చెట్టును ఎక్కాడు. పండ్లను రాల్చే సమయంలో కాలు జారి నుంచి కిందకు పడిపోయాడు. గాయాలు కావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు హస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. కోసిగి హనుమంతుకు భార్య నాగవేణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కోసిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుత్తి పెట్రోల్ బంకు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందారు. డోన్‌కు చెందిన లక్ష్మీదేవి, కుమారుడు సుదర్శన్ కర్నూలులోని వ్యవసాయ కార్యాలయంలో పని నిమిత్తం బైక్‌పై కర్నూలుకు వస్తుండగా మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి హైదరాబాదు వెళ్లే రోడ్డులో గుత్తి పెట్రోల్ బంకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మొదట్లో పల్సర్ బైక్ సర్వీస్ రోడ్డులోకి వస్తుండగా వెనుక వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీ, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక లక్ష్మీదేవి మృతిచెందింది. కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంకటరాముడు (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామానికి చెందిన ఈడిగ వెంకటరాముడు(55) అదృశ్యమైనట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మానసిక పరిస్థితి బాగోలేక గత నెల 29న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి ద్యర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ నంబరు 9121101067కు సమాచారం ఇవ్వాలన్నారు.

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు!

- రెండు నెలల క్రితం ఇంటర్ ఫలితాలు విడుదల
- డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వని కూటమి ప్రభుత్వం
- మేజర్ సబ్జెక్ట్ విధానంపై నిర్ణయంలో జాప్యం
- ప్రైవేట్ కళాశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు

నంద్యాల పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ కోర్సుల్లో నూతన అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభమవుతో తెలియక పోవడంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు డిగ్రీ ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలోని శ్రీశైలం, ఆత్మకూరు, నంద్యాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 11 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 55 ప్రైవేటు కళాశాలలు ఉండగా 66 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియను సులువుతరం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు 2022–23లో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు పొందేవారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి తిరిగి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టేందుకు కుట్ర పన్నుతున్నట్టు తెలుస్తోంది. ఇందు కోసమే అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిగ్రీ తరగతులపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఈ విషయంపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేక జాప్యం చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు కళాశాలకు అనుకూలం..

అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలలోజరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. రెండు నెలల క్రితమే ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విద్యార్థులను చేర్చుకోవడంతో పాటు మార్కుల జాబితాను, టీసీ, ఇతర సర్టిఫికెట్లను ప్రైవేట్ కళాశాలలు సేకరించాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాయి. ఇటీవల ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు కూడా విడుదలయ్యాయి. అయినా కూడా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుంది. గతంలో రెండు నెలల సమయం వరకు షెడ్యూల్ ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ నిర్వహించే వారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు షెడ్యూలే ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యే సరికి ఆగస్టు నెల వచ్చేస్తుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లాలో డిగ్రీ కళాశాలల వివరాలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	11
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	28
మొత్తం	39
ప్రభుత్వ డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న బాలురు	1,814
బాలికలు	1,841
మొత్తం	3655
ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు	
బాలురు	1,343
బాలికలు	1,544
మొత్తం	2,987

నోటిఫికేషన్ విడుదల చేయాలి

కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల అలసత్వ వైఖరి చూపించడం సరికాదు. డిగ్రీ కళాశాలలు ప్రారంభమై చాలా రోజులు అవుతున్నా ఇంత వరకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణం. ప్రైవేట్ కళాశాలలకు మేలు చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యం చేస్తోంది. వెంటనే అడ్మిషన్ల నోటిఫికేషను విడుదల చేయాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.

– సురేష్‌యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నంద్యాల జిల్లా

గంజాయి అక్రమ రవాణాపై పోలీసు నిఘా

కర్నూలు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు: నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. ఇందులో భాగంగా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్‌లో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈగల్ టీమ్, స్పెషల్ పార్టీ పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కర్ణాటక నుంచి ఉత్తరాఖండ్‌కు కర్నూలు మీదుగా వెళ్లే యశ్వంత్‌పూర్–యోగి నగరి రిషికేశ్ రైలు (ట్రైన్ నెం.06597)లో జనరల్ బోగి నుంచి ఏసీ బోగిల వరకు అన్నింటినీ తనిఖీ చేశారు. జిల్లాకు ఒక ట్రైన్‌ను కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలన్న పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌లోని పార్సిల్ కార్యాలయాల్లో కూడా డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ తెలిపారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు నాగరాజారావు, గుణశేఖర్ బాబు, ఎస్ఐ సతీష్ కుమార్ యాదవ్ తదితరులు తనిఖీ బృందాలకు నాయకత్వం వహించారు.

అక్రమంగా డీఏపీ నిల్వ

- సీజ్ చేసిన వ్యవసాయాధికారులు

దుకాణంలో నిల్వ ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన డీఏపీ

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామంలోని నబీ ట్రేడర్స్‌లో అక్రమంగా నిల్వ ఉన్న డీఏపీ ఎరువును సీజ్ చేసినట్లు ఆదోని మండల వ్యవసాయ అధికారులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం ఆకస్మికంగా దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తీసుకొచ్చిన డీఏపీ ఎరువు 76 బస్తాలు దుకాణంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని విలువ రూ.1,02,600 ఉంటుందన్నారు. నిల్వ ఉంచిన డీఏపీ ఎరువు అమ్మకాలు చేయకుండా నిలిపివేసినట్లు చెప్పారు. నాణ్యత పరీక్ష నిమిత్తం నమూనాలను సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఫలితాల అనంతరం దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: అవమాన భారంతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సర్వాయిపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శివరాముడు(74) అదే గ్రామానికి చెందిన రమేష్, మల్లికార్జునలకు చెందిన పొలం అగ్రిమెంట్ తయారు చేసుకుని కౌలుకార్డులు పొందేందుకు సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న పొలం రైతులు తమ అనుమతి లేకుండా ఎందుకు తీసుకున్నావని నిలదీశారు. అంతేగాకుండా స్థానిక తహసీల్దార్ కార్యాయంలో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు శివరాముడిని పిలించి అగ్రిమెంటు, కౌలుకార్డులను రద్దు చేశారు. దీంతో అవమానంగా భావించి బుధవారం రాత్రి ఎలుకల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు నంద్యాల తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

6న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ అండర్ 13 బాలబాలికలకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 5వ తేదీలోపు ఏపీ చెస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 2, 3 తేదీల్లో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 9010451585ను సంప్రదించాలన్నారు. సమావేశంలో కరస్పాండెంట్ కృష్ణసాయిరోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

కర్నూలు(అర్బన్): తల్లికి వందనం నిధులు విడుదల కాని 9, 10వ తరగతులకు చెందిన ఎస్సీ విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతా ఆధార్ నంబర్లకు ఎన్‌పీసీఐ లింకు చేయించాలని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారిణి బీ రాధిక తెలిపారు. జిల్లాలోని ఎంపీడీఓ, సహాయ సంక్షేమాధికారులు, గ్రామ/వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 9,10వ తరగతి విద్యార్థులకు సంబంధించి 99 మంది తల్లుల ఖాతాలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే 288 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. ఎస్సీ విద్యార్థులకు సింగిల్ బ్యాంకు అకౌంట్ మాత్రమే అదికూడా విద్యార్థి ఆధార్ లింకు ఉన్న బ్యాంకు ఖాతాకు తల్లికి వందనం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 4వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు.

ఉరుకుందలో 25 నుంచి శ్రావణ ఉత్సవాలు

- ఆగస్టు 23 వరకు నిర్వహణ
- భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తాం
- ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు

మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. దేవాలయం లోపలి భాగంలో ఫిల్టర్ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల విడిది కోసం 168 గదులు ఉన్నాయన్నారు. భక్తులకు ఎక్కడా బురద అంటకుండా దేవాలయం చుట్టూ సీసీ ఫెవర్స్ పరుస్తున్నామన్నారు. ఆలయ ఉత్తరం ద్వారం వద్ద వీఐపీ లాంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతరాలయం దర్శనం కోసం రూ.వెయ్యి టిక్కెట్ పెడుతున్నట్లు చెప్పారు.. అలాగే స్లాట్ దర్శనం కూడ ఏర్పాటు చేస్తామన్నారు. అన్నదాన సత్రంలోనే కాక మరో రెండు చోట్ల భోజన వసతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళల కోసం ప్రత్యేంగా మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. సమావేశంలో అర్చకులు శివన్న స్వామి, నాగరాజ్‌స్వామి, ఆలయ పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, ఇన్‌స్పెక్టర్ వీరేష్, సిబ్బంది కుమార్, కిరణ్ పలువురు పాల్గొన్నారు.

లంచం తీసుకున్న కేసులో పూర్వ డీఎంహెచ్‌ఓకి జైలుశిక్ష

కర్నూలు: నర్సింగ్ హోమ్, స్కానింగ్ సెంటర్‌కు రెన్యువల్ సర్టిఫికెట్ ఇవ్వడానికి పూర్వపు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.మీనాక్షి మహదేవ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య గురువారం తీర్పు చెప్పారు. 2017 జూన్ నెలలో కర్నూలు ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి ప్రిన్సిపాల్‌గా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించిన డాక్టర్ ఎం.మీనాక్షి మహదేవ్‌పై కర్నూలు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 2017 జూన్ 2వ తేదీన ఆదోని పట్టణానికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు ఆదిత్య నర్సింగ్ హోమ్, స్కానింగ్ సెంటర్‌కు రెన్యువల్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఫిర్యాదుదారుని నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి కేసును దర్యాప్తు చేశారు. కర్నూలు ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానంలో ఆమెపై చార్జిషీటు దాఖలు చేశారు. న్యాయస్థానం కేసును విచారణ చేసి మీనాక్షి మహదేవ్‌కు మూడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారునికి రూ.19,500 నష్టపరిహారంగా చెల్లించాలని ముద్దాయిని ఆదేశిస్తూ న్యాయమూర్తి శ్రీవిద్య తీర్పు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతున్నట్లయితే స్థానిక ఏసీబీ అధికారులకు, ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా ఏసీబీ మొబైల్ నెంబర్ 9440440057.. లేదా ఏసీబీ ఈమెయిల్ ఐడీ compaintrac b@ap.gov.inకు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు.

నారు మడికి జాలరీ రక్ష

పక్షుల నుంచి వరి నారుమడిని కాపాడుకునేందుకు ఓ రైతు జాలరీ ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండలం లాల్‌మాన్‌పల్లె గ్రామ సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ విధంగా చేయడం వల్ల కొంగలు, రాతి వేళల్లో పక్షులు బురద ఉంటే విత్తనాలు తినలేవు. దీంతో నారు బాగా పెరుగుతుంది. – కృష్ణగిరి

వజ్రాల వంకను చూసేందుకు వచ్చి..

- వాగులో పడి బాలుడి మృతి

మృతి చెందిన అజ్మతుల్లా

మహానంది: నల్లమలలోని వజ్రాల వంకలో వజ్రాలు దొరుకుతున్నాయని.. అందరూ అంటుంటే సరదాగా చూసేందుకు వచ్చిన ఇద్దరు కుమారులతో వచ్చిన తండ్రి ఓ కుమారుడిని పోగొట్టుకున్నాడు. ప్రమాదవశాత్తూ వాగులో పడి బాలుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు...నంద్యాలలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన యాకూబ్ ఖాన్, ఆయన కుమారుడు అజ్మతుల్లా, మరో కుమారుడు నల్లమలలోని సర్వనరసింహ స్వామి సమీపంలో ఉన్న వజ్రాల వాగు దగ్గరికి వచ్చారు. అక్కడ కాసేపు పిల్లలతో సరదాగా గడిపారు. అజ్మతుల్లా(15) బహిర్భూమికి అని వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడ్డాడు. కుమారుడిని కాపాడేందుకు యాకూబ్‌ఖాన్, మరో కుమారుడు వెళ్లగా కాలువ లోతు ఎక్కువగా ఉండటం వల్ల వారు బయటికి రాలేకపోయారు. స్థానికులు ఆ ఇద్దరిని కాపాడారు. నీటిలో మునిగిపోయిన అజ్మతుల్లా కొద్ది సేపటి తర్వాత శవమై తేలాడు. విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనా స్థలం శిరివెళ్ల పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తమకు ఎలాంటి కేసు వద్దని తల్లిదండ్రులు పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు కొనుగోలు చేసిన వాటికి విధిగా కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వాలని, మాన్యువల్ బిల్లులు ఇవ్వరాదని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యాపారం చేసుకోవాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు ఉద్యాన భవన్‌లో కల్లూరు రూరల్, అర్బన్ పరిధిలోని పురుగుమందులు, విత్తనాలు, రసాయన ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి డీలరు తమ షాపులో వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్‌ను బాగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. రసాయన ఎరువులు, విత్తనాలకు సంబంధించి ధరలు, స్టాక్ వివరాలను బోర్డుపై విధిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, సాంకేతిక ఏవో శ్రీవర్ధన్‌రెడ్డి , వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు తిప్పాయిపల్లె రోడ్డు మెయిన్ రోడ్డుకి నూతన వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో నెలసరి కంతులతో ఓపెన్ ప్లాట్లు కలవు. ✆ 92466 60444. [SCA25005818]

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

WANTED

■ ఆఫీస్ బాయ్‌గా వర్క్ చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థి కావలెను. వివరాలకు సంప్రదించండి: 73309 24873, 98854 85281. [SCA25005805]

■ Wisdom మెడికల్ అకాడమీలో అడ్మిషన్స్ చేయు చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్. మెడికల్ కాలేజీ ఎదురుగా కర్నూలు. సంప్ర: 7993491366. [SCA25005667]

■ మా సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. మంచి జీతం+ ESI, PF, TA, DA. వివరాలకు సంప్రదించండి: ✆ 79933 40702. [SCA25005900]

■ J.M.కంప్యూటర్స్‌లో పనిచేయుటకు 3 నుండి 5 సం॥ల అనుభవం ఉన్న అకౌంటెంట్ (Tally), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్. షాప్ నెం.1, opp: సౌత్ సెంటర్ షాపింగ్ మాల్, కర్నూలు. 9849041008. [SCA25005890]

■ Wanted Experienced JEE/NEET Faculty for Junior College and School. Details Cell: 9550590900, 9290748955. [L-546]

■ Wanted Experienced part-time teacher for Social. Vijetha High School, near krishna nagar ITC, knl. Send your resume via whatsapp: 9492198651. [SCA25005668]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051 [SCA25005825]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుత్ కోతలు.. ఎండుతున్న పంటలు

- మొక్కజొన్న సాగు చేసిన రైతులకు తప్పని తిప్పలు

సాగు నీరందక ఎండుతున్న మొక్కజొన్న పంట

బనగానపల్లె: అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఇల్లూరుకొత్తపేట, మిట్టపల్లి, తమ్మడపల్లి విద్యుత్ ఫీడర్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం తొమ్మిది గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలల పరిధిలో 250 వ్యవసాయ బోర్లు ఉండగా 1,300 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయగా.. మిగతా పొలాల్లో మినుము, పత్తిని విత్తారు. మరి కొన్ని రోజుల్లో రైతులు మిరప కూడా సాగు చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడం, గాలులు ఎక్కువగా ఉండటంతో మొక్కదశలో ఉన్న పైర్లు ఎండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు.

ఇదీ సమస్య..

- గత కొద్ది రోజులుగా మిట్టపల్లి విద్యుత్ ఫీడర్‌లో బ్రేకర్ సమస్యలు వస్తున్నాయి.
- త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేక ప్రజలకు మంచినీరు అందడం లేదు.
- విద్యుత్ సమస్య కారణంగా పొలాల్లో మోటార్లు పనిచేయక రైతులు ఇబ్బంది పడుతున్నారు.
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ బిల్లులు మాత్రం ఊహించని విధంగా వస్తున్నాయని, కరెంట్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం

కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. సాంకేతిక లోపాలను తొలగించే చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులేకుండా విద్యుత్ సరఫరాను అందిస్తాం.

–గర్జప్ప, బనగానపల్లె విద్యుత్ రూరల్ ఏఈ

ఇబ్బందిగా ఉంది

రెండు వ్యవసాయ బోర్ల కింద 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పైరు మొలకెత్తదశలో ఉండటంతో సాగునీరు అందించాలి. విద్యుత్ అందకపోవడంతో ఇబ్బందిగా ఉంది. పగలు సమయంలోనే త్రీఫేజ్ విద్యుత్ అందించాలి.

– పి వెంకటేశ్వర్లు, కాపులపల్లి

విద్యుత్ సరఫరాలో అంతరాయం



వ్యవసాయబోర్ల ఆధారంగా కొద్ది రోజులుగా మొక్కజొన్న సాగు చేశాం. పైరుకు సాగునీ రు అవసరం. కనీసం తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందించాలి. గత కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాగైతే పైర్లు ఎండిపోతాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఇల్లూరుకొత్తపేట

సాక్షి నంద్యాల
శుక్రవారం । 4 । జూలై । 2025

25 నుంచి శ్రావణ ఉత్సవాలు

ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు?

ఇంటర్ ఫలితాలు వచ్చినా డిగ్రీ ప్రవేశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. సింగిల్ మేజర్ సబ్జెక్టుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 8లో▸

పూర్వ డీఎంహెచ్ఓకు జైలు

లంచం తీసుకున్న కేసులో పూర్వ ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 8లో▸

న్యూస్‌రీల్

విత్తన దుకాణాలపై దాడులు

- రూ.21 లక్షల విలువ చేసే విత్తన అమ్మకాలు నిలుపుదల

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పలు విత్తన దుకాణాలపై గురువారం వ్యవసాయాధికారులు దాడులు నిర్వహించారు. ఏడీఏ ఆంజనేయ, ఏఓ ప్రసాదరావుల ఆధ్వర్యంలో విజయలక్ష్మి, సాయి హిమవర్ష దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, విత్తన నిల్వలు, అనుమతి పత్రాలను పరిశీలించారు. రెండు దుకాణాలకు సంబంధించి దాదాపు రూ.21 లక్షల విలువైన విత్తనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేనందున తాత్కాలికంగా అమ్మకాలను నిలిపివేసినట్లు ఏడీఏ తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే అమ్మకాలు జరపాలని, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సార్.. తాగునీటి బావి కలుషితమవుతోంది!

పాములపాడు: సుపరిపాలన – తొలి అడుగు అంటూ గ్రామీణ ప్రాంతాలకు వస్తున్న ఎమ్మెల్యేలకు ప్రజలు సమస్యలు ఏకరువు పెడుతున్నారు. గురువారం బానుముక్కల, వాడాల గ్రామాల్లో పర్యటించిన నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్యకు పలు చోట్ల ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. బానుముక్కల గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చెరువుకట్ట బావి వద్ద వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రంగా మారుతుందన్నారు. ఆ నీరంతా బావిలోకి చేరి నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆ బావి చుట్టు పక్కల 100 కుటుంబాలున్నాయని, వెంటనే మంచినీటి సౌకర్యం, నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.

26న రెడ్‌క్రాస్ జిల్లా సమావేశం

నంద్యాల(వ్యవసాయం): జిల్లా రెడ్‌క్రాస్ సాధారణ సమావేశం ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పీజీఆర్ఎస్ భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ప్యాట్రన్‌లు, వైస్ ప్యాట్రన్లు, అసోసియేట్ సభ్యుల సాధారణ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సొసైటీ మూడు సంవత్సరాల ఆడిట్ నివేదిక, నూతన కార్యనిర్వాహక కమిటీని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు గుర్తింపు కార్డులతో రావాలని సూచించారు.

డోన్‌లో ఐదు డెంగీ కేసులు

డోన్ టౌన్: పారిశుద్ధ్యం లోపించి డోన్‌లో ఐదు డెంగీ కేసులు నమోదయ్యాయి. పట్టణంలోని 1, 16వ సచివాలయం పరిధిలో ఇద్దరు వ్యక్తులతో పాటు ముగ్గురు చిన్నారులు డెంగీ జ్వరం బారిన పడ్డారు. స్థానిక శ్రీనివాస నగర్‌లో ఒకే ఇంటిలో ముగ్గురు చిన్నారులతో పాటు, ఓ వ్యక్తి, శ్రీనివాస థియేటర్ సమీపంలో ఒక ఇంటిలో మకొకరికి తీవ్రంగా జ్వరం ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగీ సోకినట్లు వైద్యులు నిర్ధారించారని మలేరియా డోన్ యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి ధ్రువీకరించారు. పట్టణంలో పారిశుద్ధ్యంలో లోపించి వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇళ్ల మధ్య మురుగు కూపాలు ఉన్నా తొలగించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కర్నూలు అర్బన్ బ్యాంక్ సీఈఓ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈఓగా పనిచేస్తున్న ఎస్ఏ రఫీక్‌ను విధుల నుంచి తొలగించినట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ నాగరమణయ్య తెలిపారు. ఈ నెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో 'రూ.2.42 కోట్ల ప్రజాధనం స్వాహా' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై నిర్వహించిన సెక్షన్ 51 విచారణలో ఎస్ఏ రఫీక్ పేరు కూడా ఉన్నందున విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు నాగరమణయ్య తెలిపారు. సంఘంలోని సభ్యులు, డైలీ డిపాజిట్ చేసే వారు.. ఇతరులు ఎవ్వరైన ఈయనకు ఎలాంటి నగదు చెల్లించవద్దని సూచించారు.

శ్రీమఠంలో ప్రత్యేక క్యూలైన్

మంత్రాలయం: శ్రీమఠంలో సర్వదర్శనాలకు గురువారం ప్రత్యేక క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది క్యూలైన్ల దరిదాపుల్లోకి రాకుండా అధికారులే ప్రత్యక్ష పర్యవేక్షణకు దిగారు. మఠం ప్రధాన ముఖ ద్వారం ముంగిట కారిడార్‌లో స్టాఫర్లతో క్యూలైన్ విధానం అమల్లోకి తెచ్చారు. మఠం మేనేజర్లు, సూపరింటెండెంట్స్ పర్యవేక్షణలో దర్శనాలకు అనుమతించారు. ఇక సేవా భక్తులు, గ్రామ భక్తులకు మాత్రం 6,7 నంబర్ల గేట్ల క్యూలైన్లలో దర్శనాలకు అవకాశం కల్పించారు. భక్తులు ఎవ్వరూ మోసపోకుండా ఉండేందుకు ఈ విధానం దోహదపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.



చుట్టూ నీరు ఉన్నా 'చుక్క' అందని దుస్థితి. బిరబిరా కృష్ణా నది పరుగులు తీస్తున్నా.. తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతున్నా.. పంట కాలువలకు సాగునీరు అందని దౌర్భాగ్యం. రైతుకు మేలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం స్వప్రయోజనాలకు 'గేట్లు' ఎత్తింది. పొలాలను తడిపి పైర్లకు జీవం పోయాల్సిన నీరు దిగువకు వెళ్తూ రైతుకు దుఃఖాన్ని మిగులుస్తోంది.

నీరున్నా.. రైతుకు కన్నీరే!

- సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు అందని నీరు
- యథేచ్ఛగా దిగువకు వదిలేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- శ్రీశైలం ప్రాజెక్టులో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- గేట్ల భద్రత సాకుతో టీబీ డ్యాంలో తగ్గిన 80 టీఎంసీల నీరు
- టీబీడ్యాం 12 గేట్లు పైకెత్తిన ఇంజినీర్లు

కర్నూలు (సిటీ): ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి తుంగభద్ర, కృష్ణా నదికి వరదనీరు వస్తోంది. అయితే ఆ నీటిని సాగునీటి కాలువలకు విడుదల చేయడం లేదు. గేట్ల భద్రత పేరుతో తుంగభద్ర డ్యాం నుంచి జలాలను నదిలోకి వదిలేస్తున్నారు. శ్రీశైలం డ్యాంలోకి ముందుగానే వరద నీరు చేరింది. పోతిరెడ్డిపాడు ద్వారా నీరిస్తారని రైతులు ఆశించారు. అయితే విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటికి దిగువకు సాగర్‌కు వదిలేస్తున్నారు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కళ్లముందే నీరున్నా రైతుకు కన్నీరే మిగింది.

నిబంధనలకు విరుద్ధంగా..

కేఆర్ఎంబీ అనుమతి లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తి పేరుతో 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తోంది. రిజర్వాయర్ పూర్తిగా నిండేంతవరకు విద్యుత్ ఉత్పత్తి చేయవద్దని చెప్పాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాయలసీమ జిల్లాల ఆయకట్టుదారుల ప్రయోజనాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఏపీ ప్రభుత్వం సైతం కుడి విద్యుత్ కేంద్రం ద్వారా 23,263 క్యూసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం పెరగక..ఎగువ నుంచి వస్తున్న నీరంతా దిగువకు విడుదుల చేస్తున్నారు. రాయలసీమ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా టీడీపీ నేతలు నోరు మెదపడం లేదు. టీడీపీ నేతల నిర్లక్ష్య వైఖరిపై ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కష్టం.. నష్టం

శ్రీశైలం డ్యాంలో 167.48 టీఎంసీల నీరు ఉన్నాయి. అయినా హంద్రీ– నీవా కాలువకు నీరు ఇవ్వలేదు. కాలువ వెడల్పు పనులతో నీటి విడుదలను ఆపేశారు. ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు రావడంతో మే నెల చివరలో, జూన్ మొదటి వారంలో చాలా మంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, హంద్రీ– నీవా కాలువకు నీరు వదలకపోవడంతో పైర్లు ఎండి నష్టం వస్తోంది. కొంత మంది రైతులు కాలువలో ఊరిన నీటిని పైపులతో మోటార్ల ద్వారా పొలాలకు తరలించి పైర్లను కాపాడుకుంటున్నారు.

కృష్ణగిరి సమీపంలో హంద్రీ- నీవా కాలువలో ఊరిన నీటిని మోటర్ ద్వారా పంపింగ్ చేసుకుంటున్న రైతు

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 875 అడుగులకు పైగా చేరుకుంది. తుంగభద్ర, హంద్రీ నది నుంచి వరదనీరు వస్తుండటంతో రిజర్వాయర్‌లో 167.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు గేట్ల నుంచి వారం రోజుల క్రితమే సాగు నీటిని విడుదల చేసే అవకాశం కలిగింది. శ్రీశైలం డ్యాంలో 854 అడుగులకు నీటిమట్టం చేరిన తర్వాత పోతిరెడ్డిపాడు నుంచి నీరిచ్చేందుకు అవకాశమున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పక్క రాష్ట్రానికి చెందిన ప్రభుత్వానికి భయపడి, కేఆర్ఎంబీ నిర్ణయం సాకు చూపించి, ప్రజలకు కనీసం తాగునీటికి సైతం విడుదల చేయలేపోయింది. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రూ. వందల కోట్ల నష్టం

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌తో తెలుగుగంగ, కేసీ ఎస్కేప్, జీఎన్ఎస్ఎస్ కాల్వలకు నీరు ఇవ్వవచ్చు. ఈ కాల్వల కింద 6.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం కంది, మినుము, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్స్ తదితర పంటలు వేశారు. కాలువలకు నీరు ఇవ్వకపోవడం, వర్షాలు కురవకపోవడంతో కొందరు పంటలను తొలగిస్తున్నారు. పెట్టుబడి అంతా మట్టిపాలై ఇప్పటికే రూ. వందల కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది.

నీటి నిల్వ తగ్గించి..

గతేడాది తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. నిపుణుల సలహా మేరకు అన్ని గేట్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తాత్కాలిక గేట్‌తో నీటిని నిల్వ చేస్తున్నారు. ఇటీవలే జరిగిన టీబీ బోర్డు సమావేశంలో డ్యాంలో నీటి సామర్థ్యాన్ని 105.3 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు తగ్గించారు. దీంతో గురువారం 20 క్రస్టు గేట్లు పైకెత్తి 56 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దైన్యం.. దయనీయం

తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ దిగువకు నీటిని విడుదల చేయడంపై బోర్డు అధికారుల తీరుపై ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో పొలాలను బీళ్లు పెట్టుకోవాలా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. టీబీ డ్యాంలో సమృద్ధిగా నీరు ఉన్నా అందకపోవడం, ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం తదితర కారణాలతో ఎల్ఎల్‌సీ కింద రైతులు ఖరీఫ్ సాగు సన్నాహానికి ఏర్పాటు చేసుకోలేకపోయారు. నీరు సమృద్ధిగా ఉన్నా వెల్దుర్తి, గోనెగండ్ల, పెద్దకడుబూరు, మద్దికెర, మంత్రాలయం మండలంలో తాగునీటి సమస్య తలెత్తింది. దాహార్తితో కొన్ని గ్రామాల్లో ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన కూడా తెలిపారు. ప్ర'జల' కష్టాలను రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీసం ఎల్లెల్సీకి నీరు విడుదల చేయించేందుకు కార్యాచరణ కూడా రూపొందించలేదు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ ఇప్పట్లో లేనట్లే!

- విడుదల చేసిన నిధులు వెనక్కు పంపాలని ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్ల పంపిణీ కూడా ఇప్పట్లో లేనట్లేనని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం విడుదల చేసిన నిధులను కూడా వెనక్కు పంపాలని సెర్ప్ అధికారులు డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య కాలంలో వృద్ధాప్య పింఛను తీసుకుంటూ మరణించిన వారి స్థానాల్లో వారి భార్యలకు వితంతు పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు 2,319, నంద్యాల జిల్లాలో 2,463 ప్రకారం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసింది. ముందుగా ఇచ్చిన ఆదేశాల మేరకు ఈనెల 1న రెగ్యులర్ పింఛన్లతో కలిపి స్పౌజ్ పంఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం చివరి నిముషంలో వీటి పంపిణీని నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది. తీరా ఈ పింఛన్లకు సంబంధించిన నిధులను సైతం వెనక్కు పంపాలని ఆదేశించడం చూస్తే ఇప్పట్లో పంపిణీ చేసే ఉద్దేశం లేదనే విషయం స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 9,922 మంది పింఛన్లు తీసుకోలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో 184 వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 184 వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శనా క్షేత్రాలను వ్యవసాయ శాఖ రెగ్యులర్ ఏడీఏల ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ప్రదర్శన క్షేత్రానికి రూ.4 వేల ప్రకారం రూ.7.33 లక్షలు ఏడీఏలకు విడుదల చేసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, ఆదోని సబ్ డివిజన్‌లో 18, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ సబ్ డివిజన్‌లలో 17, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లలో 16 ప్రకారం వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా సబ్ డివిజన్‌లలో సాగు చేసే ప్రధాన పంటల్లో వీటిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఏడాది పాలనకే ప్రజలు విసుగెత్తిపోయారు

- శ్రీశైలానికి వరద వచ్చినా పోతిరెడ్డిపాడు గేట్లు ఎందుకు ఎత్తడం లేదు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కాటసాని

విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు మొత్తం అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అక్రమణలు, అక్రమార్జనే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయకపోగా.. సుపరిపాలన తొలి అడుగు అంటూ ఊర్లకు వస్తున్న ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారన్నారు. గొప్పగా రూ. 4 వేలు పింఛన్ ఇచ్చామని చెప్పి మరో వైపు 3 లక్షల పింఛన్లు కోత పెట్టడం చంద్రబాబుకు చెల్లిందన్నారు. తల్లికి వందనం అందక రోజూ ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారన్నారు. బాబూ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టామన్నారు. 'ప్రభుత్వం తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల బాండ్లను చూపి నిలదీయాలన్నారు. గత ప్రభుత్వం వేసిన శిలాఫలకాలకు రంగులు మార్చి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని హడావుడి చేస్తున్నారని విమర్శించారు.

నీళ్లొచ్చినా ఎందుకు వదలరు..

రాయలసీమకు తాగు, సాగు నీటిని అందించే శ్రీశైలం జలాశయానికి వరదొచ్చినా అధికారులు ఎందుకు పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తడం లేదని కాటసాని ప్రశ్నించారు. గత ఖరీఫ్, రబీలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు నష్టపోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. గాలేరు నగరి, హంద్రీనీవా పెండిగ్ పనులు పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యాలమంగా మార్చాలన్నారు. బాబు పాలనలో అమలు కాని పనులకు ప్రచార ఆర్భాటాలు ఉంటాయన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో భూదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈనెల 5వ తేదీన తమ నివాసంలో నియోజకవర్గ స్థాయిలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పేరుతో నిర్వహించే సమావేశానికి నాయకులు, కార్యకర్తల భారీగా తరలి రావాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు రామలక్ష్మయ్య, మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సర్కారు భూమి భళే చవక!

- చాబోలులో అసైన్డ్ భూమి ఆక్రమణ
- కబ్జా చేసి విక్రయిస్తున్న టీడీపీ నేతలు
- సెంటు రూ.1.50 లక్షలుగా అమ్మకాలు
- అదే భూమిలో గత ప్రభుత్వంలో 72 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- స్థలాలు మాకే ఇవ్వాలంటూ పేదల ఆందోళన

అసైన్డ్ భూమిలో ప్లాట్లు వేసిన దృశ్యం

చాబోలులో అసైన్డ్ ల్యాండ్

నంద్యాల(అర్బన్): పచ్చ నేతలు భూ బకాసురులుగా మారుతున్నారు. అక్రమార్జనకు మరిగిన వీరు ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికిరాత్రే కబ్జా చేస్తున్నారు. ఇక ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములపై కనిపిస్తే ఇక ఊరుకుంటారా.. దర్జాగా రాళ్ల పాతి 'రండి బాబూ రండి.. ప్లాట్లు చవక.. చవక' అంటూ బేరం పెట్టారు. మంత్రి అనుచరులు కొందరు తలా కొంత పంచుకునేందుకు భూ దందాకు తెరలేపారు. ప్రభుత్వ భూములను ఏకంగా విక్రయానికి పెట్టారు. నంద్యాల మండలం చాబోలు గ్రామ సమీపంలోని ఇందిరా కాలనీ వద్ద సీలింగ్ యాక్టు ప్రకారం అప్పటి ప్రభుత్వం అయ్యలూరుకు చెందిన నందిరెడ్డి రైతు వద్ద నుంచి సర్వే నెం.109/1ఏలోని 1.84 ఎకరాల సీలింగ్ ల్యాండ్‌ను అప్పట్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1982లో స్థానిక పేదలకు ఇళ్ల స్థలాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆ భూములు సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు అప్పగించింది. గ్రామానికి చివర్లో ఉండటంతో స్థలాలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. 2021లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ పొలాన్ని గుర్తించి ఆ భూముల్లో ఆర్‌బీకే సెంటర్, అంగన్‌వాడీ, హెల్త్ క్లీనిక్‌లతో పాటు 72 మంది లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా లాటరీ పద్ధతిలో స్థలాలను కేటాయిస్తూ బుక్‌లెట్ పత్రాలను పంపిణీ చేసింది. అయితే లబ్ధిదారుల ఎంపిక సరిగా లేదంటూ తమకు ఎక్కువ ప్లాట్లు కావాలని కొంత మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు. అప్పటి ఎమ్మెల్యే శిల్పామోహన్‌రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే స్థలాలు అంటూ తేల్చి చెప్పడంతో కొందరు అసమ్మతి వాదులు మరికొంత మంది లబ్ధిదారులను కలుపుకొని తాత్కాలిక గుడిసెలు వేయించి కోర్టుకు వెళ్లారు. అయితే లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపాల్సిందేనని కోర్టు తీర్పు ఇచ్చింది. కాగా ఎన్నికల కోడ్ అడ్డురావడం, ఆ తర్వాత కూటమి నేతలు అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు రద్దు అయ్యాయి.

అధికారులకు తెలిసినా చర్యల్లేవ్..

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఇచ్చిన పట్టాలు రద్దు అయ్యాయి. కొత్త వారికి ఇస్తున్నామంటూ గ్రామంలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సెంటు రూ.1.50 లక్షలు తీసుకొని వస్తే పట్టాతో పాటు స్థలం కేటాయిస్తామంటూ నాయకులు బేరం పెట్టారు. దాదాపు రూ.2కోట్ల విలువ చేసే సీలింగ్ ల్యాండ్‌ను ఆక్రమించుకోవడమే కాకుండా అమ్మకాలకు పెట్టడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు మారాయన్న ఆరోపణలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీలింగ్ భూములను ఆక్రమించి లబ్ధిదారులకు కట్టబెట్టడంలో భారీ స్థాయిలో ముడుపులు అందడంతో పాటు అధికార పార్టీ పెద్దలు భరోసా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కూటమి నాయకులు దర్జాగా సీలింగ్ భూముల ఆక్రమణలు చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో కూటమి నేతలకు అనుకూలమైన అధికారులను రప్పించుకుని యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు చేస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

సీలింగ్ భూములు అమ్మినా..కొన్నా చర్యలు

సీలింగ్ భూములను ఎవరూ అమ్మినా.. కొన్నా చర్యలు తప్పవు. గతంలో ఆ భూముల్లో లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఆ భూముల అమ్మకాలు జరుగుతున్నాయని కొంత మంది మహిళలు మా దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అర్హులను గుర్తించి ఆ స్థలాల్లో లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశిస్తే స్థలం లేని పేదలందరి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. గతంలో ఎంపిక చేసిన వారికి సైతం ప్రాధాన్యతను ఇస్తాం. ఆ భూమి ఎవరూ అమ్మినా.. కొన్నా చట్టరీత్యా నేరమే.

– శ్రీనివాసులు, తహసీల్దార్, నంద్యాల

యూఎల్‌బీల ఎంపికలో ప్రభుత్వం వివక్ష

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క మున్సిపాలిటీకీ దక్కని అవకాశం
- మున్సిపల్ శాఖ మంత్రికి లేఖ రాసిన డోన్ మున్సిపల్ చైర్మన్

మున్సిపల్ శాఖ మంత్రికి రాసిన లేఖను చూపుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: యూఎల్‌బీలను(అర్బన్ లోకల్ బాడీ) బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 25 మున్సిపాల్టీలను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులైన మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, చైర్ పర్సన్లను స్థానిక సంస్థల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన, ఆర్థికంగా బలోపేతం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 3, 4 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని గుర్‌గ్రామ్‌లో రెండు రోజులపాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తోంది. స్థానిక సంస్థల బలోపేతం దిశగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొనేందుకు ప్రభుత్వం ఇప్పటికే 643 జీవో జారీ చేసింది. రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టీలకు చోటు కల్పించి ఉమ్మడి జిల్లాలను పూర్తిగా విస్మరించడంపై డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణకు లేఖ రాశారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ఎంతో కృషి చేస్తుందన్నారు.కేవలం రాజకీయం కోణంలో ఈ ప్రభుత్వం యుఎల్‌బీలను ఎంపిక చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి తప్పిదాలు చేయకుండా స్థానిక సంస్థల అభివృద్ధికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంతటి వివక్ష చూపడం మూలంగా స్థానిక సంస్థలు ఎలా బలోపేతమవుతాయని ఆయన మంత్రి నారాయణను లేఖలో నిలదీశారు.

ముమ్మరంగా రైళ్ల తనిఖీలు

డోన్ టౌన్: గంజాయి రవాణాను అరికట్టేందుకు ముమ్మరంగా రైళ్లను తనిఖీ చేస్తున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం డోన్ రైల్వే స్టేషన్‌తో పాటు పలు రైళ్లను ఈగల్ టీం, రైల్వే, స్థానిక పోలీసులు విస్తృత తనిఖీలు చేశామన్నారు. బోగీల్లో లగేజీ బ్యాగ్‌లను తనిఖీ చేయడంతో పాటు, అనుమానితుల వివరాలను సేకరించామన్నారు. వివిధ భాగాల్లోని సిబ్బంది మూడు టీంలుగా ఏర్పడి నంద్యాల నుంచి డోన్‌కు ట్రైన్ వచ్చే వరకు తనిఖీలు చేశారు.

ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

అంకిరెడ్డిపల్లెలో పిచ్చికుక్క దాడి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో గురువారం పిచ్చికుక్క దాడిలో 12 మంది గాయపడ్డారు. ఎస్సీ కాలనీ, ప్రధాన రహదారి, మెయిన్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని కాలనీలతో పాటు పలు వీధుల్లో పిచ్చికుక్క సంచరించి రామాంజనేయులు, పల్లె శివరామిరెడ్డి, మూగెన్న తదితరులపై దాడి చేసింది. గ్రామంలో కొద్ది సేపు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చిన్న పిల్లలను బయటకు పంపకుండా ఇంట్లోనే ఉంచారు. ఆవుపై కూడా పిచ్చికుక్క దాడి చేసింది. అయితే కొందరు వ్యక్తులు పిచ్చి కుక్కపై కట్టెలతో దాడి చేసి చంపేశారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రులకు తీసుకెళ్లారు.

యువకుడి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: లింగాపురం గ్రామంలో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పాతకోట చెన్నయ్య (30) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మానసికంగా కుంగిపోయి గురువారం తెల్లవారుజామున ఇంటిలో ఉరేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య అంకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

కోసిగి: చెట్టు పై నుంచి కింద పడి కోసిగి హనుమంతు (27) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గౌడుగల్లు గ్రామానికి చెందిన కోసిగి హనుమంతు గతనెల 28న తన పొలంలో ఉన్న నేరేడు పండ్లను రాల్చేందుకు చెట్టును ఎక్కాడు. పండ్లను రాల్చే సమయంలో కాలు జారి నుంచి కిందకు పడిపోయాడు. గాయాలు కావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు హస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. కోసిగి హనుమంతుకు భార్య నాగవేణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కోసిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుత్తి పెట్రోల్ బంకు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందారు. డోన్‌కు చెందిన లక్ష్మీదేవి, కుమారుడు సుదర్శన్ కర్నూలులోని వ్యవసాయ కార్యాలయంలో పని నిమిత్తం బైక్‌పై కర్నూలుకు వస్తుండగా మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి హైదరాబాదు వెళ్లే రోడ్డులో గుత్తి పెట్రోల్ బంకు పై ఓవర్ బ్రిడ్జి మొదట్లో పల్సర్ బైక్ సర్వీస్ రోడ్డులోకి వస్తుండగా వెనుక వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీ, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక లక్ష్మీదేవి మృతిచెందింది. కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంకటరాముడు (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామానికి చెందిన ఈడిగ వెంకటరాముడు(55) అదృశ్యమైనట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మానసిక పరిస్థితి బాగోలేక గత నెల 29న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ నంబరు 9121101067కు సమాచారం ఇవ్వాలన్నారు.

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు!

- రెండు నెలల క్రితం ఇంటర్ ఫలితాలు విడుదల
- డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వని కూటమి ప్రభుత్వం
- మేజర్ సబ్జెక్ట్ విధానంపై నిర్ణయంలో జాప్యం
- ప్రైవేట్ కళాశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు

నంద్యాల పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ కోర్సుల్లో నూతన అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభమవుతో తెలియక పోవడంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు డిగ్రీ ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలోని శ్రీశైలం, ఆత్మకూరు, నంద్యాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 11 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 55 ప్రైవేటు కళాశాలలు ఉండగా 66 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియను సులువుతరం చేసేందుకు గత వైఎస్సార్సీపీ సర్కారు 2022–23లో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు పొందేవారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి తిరిగి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టేందుకు కుట్ర పన్నుతున్నట్టు తెలుస్తోంది. ఇందు కోసమే అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిగ్రీ తరగతులపై గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఈ విషయంపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేక జాప్యం చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు కళాశాలకు అనుకూలం..

అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలలోజరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. రెండు నెలల క్రితమే ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విద్యార్థులను చేర్చుకోవడంతో పాటు మార్కుల జాబితాను, టీసీ, ఇతర సర్టిఫికెట్లను ప్రైవేట్ కళాశాలలు సేకరించాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాయి. ఇటీవల ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు కూడా విడుదలయ్యాయి. అయినా కూడా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుంది. గతంలో రెండు నెలల సమయం వరకు షెడ్యూల్ ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ నిర్వహించే వారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు షెడ్యూలే ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యే సరికి ఆగస్టు నెల వచ్చేస్తుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లాలో డిగ్రీ కళాశాలల వివరాలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	11
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	28
మొత్తం	39
ప్రభుత్వ డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న బాలురు	1,814
బాలికలు	1,841
మొత్తం	3655
ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు బాలురు	1,343
బాలికలు	1,544
మొత్తం	2,987

నోటిఫికేషన్ విడుదల చేయాలి

కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల అలసత్వ వైఖరి చూపించడం సరికాదు. డిగ్రీ కళాశాలలు ప్రారంభమై చాలా రోజులు అవుతున్నా ఇంత వరకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణం. ప్రైవేట్ కళాశాలలకు మేలు చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యం చేస్తోంది. వెంటనే అడ్మిషన్ల నోటిఫికేషను విడుదల చేయాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.

– సురేష్‌యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, నంద్యాల జిల్లా

గంజాయి అక్రమ రవాణాపై పోలీసు నిఘా

కర్నూలు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు: నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. ఇందులో భాగంగా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్‌లో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈగల్ టీమ్, స్పెషల్ పార్టీ పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కర్ణాటక నుంచి ఉత్తరాఖండ్‌కు కర్నూలు మీదుగా వెళ్లే యశ్వంత్‌పూర్–యోగి నగరి రిషికేశ్ రైలు (ట్రైన్ నెం.06597)లో జనరల్ బోగి నుంచి ఏసీ బోగిల వరకు అన్నింటినీ తనిఖీ చేశారు. జిల్లాకు ఒక ట్రైన్‌ను కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలన్న పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌లోని పార్సిల్ కార్యాలయాల్లో కూడా డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ తెలిపారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు నాగరాజారావు, గుణశేఖర్ బాబు, ఎస్ఐ సతీష్ కుమార్ యాదవ్ తదితరులు తనిఖీ బృందాలకు నాయకత్వం వహించారు.

అక్రమంగా డీఏపీ నిల్వ

- సీజ్ చేసిన వ్యవసాయాధికారులు

దుకాణంలో నిల్వ ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన డీఏపీ

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామంలోని నబీ ట్రేడర్స్‌లో అక్రమంగా నిల్వ ఉన్న డీఏపీ ఎరువును సీజ్ చేసినట్లు ఆదోని మండల వ్యవసాయ అధికారులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం ఆకస్మికంగా దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. అనుమతులు లేకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తీసుకొచ్చిన డీఏపీ ఎరువు 76 బస్తాలు దుకాణంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని విలువ రూ.1,02,600 ఉంటుందన్నారు. నిల్వ ఉంచిన డీఏపీ ఎరువు అమ్మకాలు చేయకుండా నిలిపివేసినట్లు చెప్పారు. నాణ్యత పరీక్ష నిమిత్తం నమూనాలను సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఫలితాల అనంతరం దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: అవమాన భారంతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సర్వాయిపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శివరాముడు(74) అదే గ్రామానికి చెందిన రమేష్, మల్లికార్జునలకు చెందిన పొలం అగ్రిమెంట్ తయారు చేసుకుని కౌలుకార్డులు పొందేందుకు సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న పొలం రైతులు తమ అనుమతి లేకుండా ఎందుకు తీసుకున్నావని నిలదీశారు. అంతేగాకుండా స్థానిక తహసీల్దార్ కార్యాయంలో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు శివరాముడిని పిలిచి అగ్రిమెంటు, కౌలుకార్డులను రద్దు చేశారు. దీంతో అవమానంగా భావించి బుధవారం రాత్రి ఎలుకల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు నంద్యాల తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

6న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ అండర్ 13 బాలబాలికలకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 5వ తేదీలోపు ఏపీ చెస్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 2, 3 తేదీల్లో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 9010451585ను సంప్రదించాలన్నారు. సమావేశంలో కరస్పాండెంట్ కృష్ణసాయిరోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

కర్నూలు(అర్బన్): తల్లికి వందనం నిధులు విడుదల కాని 9, 10వ తరగతులకు చెందిన ఎస్సీ విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతా ఆధార్ నంబర్లకు ఎన్‌పీసీఐ లింకు చేయించాలని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారిణి బీ రాధిక తెలిపారు. జిల్లాలోని ఎంపీడీఓ, సహాయ సంక్షేమాధికారులు, గ్రామ/వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 9,10వ తరగతి విద్యార్థులకు సంబంధించి 99 మంది తల్లుల ఖాతాలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే 288 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. ఎస్సీ విద్యార్థులకు సింగిల్ బ్యాంకు అకౌంట్ మాత్రమే అదికూడా విద్యార్థి ఆధార్ లింకు ఉన్న బ్యాంకు ఖాతాకు తల్లికి వందనం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 4వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు.

ఉరుకుందలో 25 నుంచి శ్రావణ ఉత్సవాలు

- ఆగస్టు 23 వరకు నిర్వహణ
- భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తాం
- ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు

మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. దేవాలయం లోపలి భాగంలో ఫిల్టర్ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల విడిది కోసం 168 గదులు ఉన్నాయన్నారు. భక్తులకు ఎక్కడా బురద అంటకుండా దేవాలయం చుట్టూ సీసీ ఫెవర్స్ పరుస్తున్నామన్నారు. ఆలయ ఉత్తరం ద్వారం వద్ద వీఐపీ లాంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతరాలయం దర్శనం కోసం రూ.వెయ్యి టిక్కెట్ పెడుతున్నట్లు చెప్పారు.. అలాగే స్లాట్ దర్శనం కూడ ఏర్పాటు చేస్తామన్నారు. అన్నదాన సత్రంలోనే కాక మరో రెండు చోట్ల భోజన వసతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళల కోసం ప్రత్యేంగా మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. సమావేశంలో అర్చకులు శివన్న స్వామి, నాగరాజ్‌స్వామి, ఆలయ పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, ఇన్‌స్పెక్టర్ వీరేష్, సిబ్బంది కుమార్, కిరణ్ పలువురు పాల్గొన్నారు.

లంచం తీసుకున్న కేసులో పూర్వ డీఎంహెచ్‌ఓకి జైలుశిక్ష

కర్నూలు: నర్సింగ్ హోమ్, స్కానింగ్ సెంటర్‌కు రెన్యువల్ సర్టిఫికెట్ ఇవ్వడానికి పూర్వపు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.మీనాక్షి మహదేవ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య గురువారం తీర్పు చెప్పారు. 2017 జూన్ నెలలో కర్నూలు ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి ప్రిన్సిపాల్‌గా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించిన డాక్టర్ ఎం.మీనాక్షి మహదేవ్‌పై కర్నూలు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 2017 జూన్ 2వ తేదీన ఆదోని పట్టణానికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు ఆదిత్య నర్సింగ్ హోమ్, స్కానింగ్ సెంటర్‌కు రెన్యువల్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఫిర్యాదుదారుని నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి కేసును దర్యాప్తు చేశారు. కర్నూలు ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానంలో ఆమెపై చార్జిషీటు దాఖలు చేశారు. న్యాయస్థానం కేసును విచారణ చేసి మీనాక్షి మహదేవ్‌కు మూడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారునికి రూ.19,500 నష్టపరిహారంగా చెల్లించాలని ముద్దాయిని ఆదేశిస్తూ న్యాయమూర్తి శ్రీవిద్య తీర్పు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతున్నట్లయితే స్థానిక ఏసీబీ అధికారులకు, ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా ఏసీబీ మొబైల్ నెంబర్ 9440440057.. లేదా ఏసీబీ ఈమెయిల్ ఐడీ compaintrac b@ap.gov.inకు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు.

నారు మడికి జాలరీ రక్ష

పక్షుల నుంచి వరి నారుమడిని కాపాడుకునేందుకు ఓ రైతు జాలరీ ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండలం లాల్‌మాన్‌పల్లె గ్రామ సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. ఈ విధంగా చేయడం వల్ల కొంగలు, రాతి వేళల్లో పక్షులు బురద ఉంటే విత్తనాలు తినలేవు. దీంతో నారు బాగా పెరుగుతుంది. – కృష్ణగిరి

వజ్రాల వంకను చూసేందుకు వచ్చి..

- వాగులో పడి బాలుడి మృతి

మృతి చెందిన అజ్మతుల్లా

మహానంది: నల్లమలలోని వజ్రాల వంకలో వజ్రాలు దొరుకుతున్నాయని.. అందరూ అంటుంటే సరదాగా చూసేందుకు వచ్చిన ఇద్దరు కుమారులతో వచ్చిన తండ్రి ఓ కుమారుడిని పోగొట్టుకున్నాడు. ప్రమాదవశాత్తూ వాగులో పడి బాలుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు...నంద్యాలలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన యాకూబ్ ఖాన్, ఆయన కుమారుడు అజ్మతుల్లా, మరో కుమారుడు నల్లమలలోని సర్వనరసింహ స్వామి సమీపంలో ఉన్న వజ్రాల వాగు దగ్గరికి వచ్చారు. అక్కడ కాసేపు పిల్లలతో సరదాగా గడిపారు. అజ్మతుల్లా(15) బహిర్భూమికి అని వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడ్డాడు. కుమారుడిని కాపాడేందుకు యాకూబ్‌ఖాన్, మరో కుమారుడు వెళ్లగా కాలువ లోతు ఎక్కువగా ఉండటం వల్ల వారు బయటికి రాలేకపోయారు. స్థానికులు ఆ ఇద్దరిని కాపాడారు. నీటిలో మునిగిపోయిన అజ్మతుల్లా కొద్ది సేపటి తర్వాత శవమై తేలాడు. విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనా స్థలం శిరివెళ్ల పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తమకు ఎలాంటి కేసు వద్దని తల్లిదండ్రులు పోలీసులకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు కొనుగోలు చేసిన వాటికి విధిగా కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వాలని, మాన్యువల్ బిల్లులు ఇవ్వరాదని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యాపారం చేసుకోవాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు ఉద్యాన భవన్‌లో కల్లూరు రూరల్, అర్బన్ పరిధిలోని పురుగుమందులు, విత్తనాలు, రసాయన ఎరువుల కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి డీలరు తమ షాపులో వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్‌ను బాగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. రసాయన ఎరువులు, విత్తనాలకు సంబంధించి ధరలు, స్టాక్ వివరాలను బోర్డుపై విధిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, సాంకేతిక ఏవో శ్రీవర్ధన్‌రెడ్డి , వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు తిప్పాయిపల్లె రోడ్డు మెయిన్ రోడ్డుకి నూతన వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో నెలసరి కంతులతో ఓపెన్ ప్లాట్లు కలవు. ✆ 92466 60444. [SCA25005818]

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

WANTED

■ ఆఫీస్ బాయ్‌గా వర్క్ చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థి కావలెను. వివరాలకు సంప్రదించండి: 73309 24873, 98854 85281. [SCA25005805]

■ Wisdom మెడికల్ అకాడమీలో అడ్మిషన్స్ చేయు చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్. మెడికల్ కాలేజీ ఎదురుగా కర్నూలు. సంప్ర: 7993491366. [SCA25005667]

■ మా సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. మంచి జీతం+ ESI, PF, TA, DA. వివరాలకు సంప్రదించండి: ✆ 79933 40702. [SCA25005900]

■ J.M.కంప్యూటర్స్‌లో పనిచేయుటకు 3 నుండి 5 సం॥ల అనుభవం ఉన్న అకౌంటెంట్ (Tally), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్. షాప్ నెం.1, opp: సౌత్ సెంటర్ షాపింగ్ మాల్, కర్నూలు. 9849041008. [SCA25005890]

■ Wanted Experienced JEE/NEET Faculty for Junior College and School. Details Cell: 9550590900, 9290748955. [L-546]

■ Wanted Experienced part-time teacher for Social. Vijetha High School, near krishna nagar ITC, knl. Send your resume via whatsapp: 9492198651. [SCA25005668]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051 [SCA25005825]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుత్ కోతలు.. ఎండుతున్న పంటలు

- మొక్కజొన్న సాగు చేసిన రైతులకు తప్పని తిప్పలు

సాగు నీరందక ఎండుతున్న మొక్కజొన్న పంట

బనగానపల్లె: అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఇల్లూరుకొత్తపేట, మిట్టపల్లి, తమ్మడపల్లి విద్యుత్ ఫీడర్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం తొమ్మిది గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలల పరిధిలో 250 వ్యవసాయ బోర్లు ఉండగా 1,300 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయగా.. మిగతా పొలాల్లో మినుము, పత్తిని విత్తారు. మరి కొన్ని రోజుల్లో రైతులు మిరప కూడా సాగు చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడం, గాలులు ఎక్కువగా ఉండటంతో మొక్కదశలో ఉన్న పైర్లు ఎండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు.

ఇదీ సమస్య..

- గత కొద్ది రోజులుగా మిట్టపల్లి విద్యుత్ ఫీడర్‌లో బ్రేకర్ సమస్యలు వస్తున్నాయి.
- త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేక ప్రజలకు మంచినీరు అందడం లేదు.
- విద్యుత్ సమస్య కారణంగా పొలాల్లో మోటార్లు పనిచేయక రైతులు ఇబ్బంది పడుతున్నారు.
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ బిల్లులు మాత్రం ఉహించని విధంగా వస్తున్నాయని, కరెంట్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం

కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. సాంకేతిక లోపాలను తొలగించే చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులేకుండా విద్యుత్ సరఫరాను అందిస్తాం.

–గర్జప్ప, బనగానపల్లె విద్యుత్ రూరల్ ఏఈ

ఇబ్బందిగా ఉంది

రెండు వ్యవసాయ బోర్ల కింద 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పైరు మొలకెత్తదశలో ఉండటంతో సాగునీరు అందించాలి. విద్యుత్ అందకపోవడంతో ఇబ్బందిగా ఉంది. పగలు సమయంలోనే త్రీఫేజ్ విద్యుత్ అందించాలి.

– పి వెంకటేశ్వర్లు, కాపులపల్లి

విద్యుత్ సరఫరాలో అంతరాయం



వ్యవసాయబోర్ల ఆధారంగా కొద్ది రోజులుగా మొక్కజొన్న సాగు చేశాం. పైరుకు సాగునీ రు అవసరం. కనీసం తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందించాలి. గత కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాగైతే పైర్లు ఎండిపోతాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఇల్లూరుకొత్తపేట

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

అభినందనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అన్యాయం చేశారు.. ఆదుకోండి

సుదూర ప్రాంతాలకు తమను బదిలీ చేశారని సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంచేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీని కోరారు. ▶8 లో

న్యూస్‌రీల్

కార్తికేయుని సేవలో ప్రముఖులు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పాండిచ్చేరి మాజీ మంత్రి, ఆ రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, చెన్నై వాసి, టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి, అనురాధ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, వేద పండితులు, అర్చక స్వాములు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కృష్ణమూర్తి, అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ పూజలు చేశారు.

పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు లోపభూయిష్టం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు అత్యంత లోపభూయిష్టమని ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి, విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తిప్పి పంపడం తాము ఊహించిందేనన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్‌తో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా వ్యవహరించకుండా విజ్ఞతతో పునరాలోచన చేయాలని సూచించారు. బనకచర్ల ప్రాజెక్టుతో కృష్ణా నదీ జలాలపై ఉన్న నీటి హక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేంతవరకు కొత్తవి చేపట్టకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. పోలవరం–బనకచర్లపై తమ వేదిక మీడియా ద్వారా ప్రభుత్వానికి తన అభిప్రాయాలను విన్నవించగా టీడీపీ అధికారిక యూట్యూబ్ చానల్‌లో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఆ చానల్ నిర్వాహకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రేపు బీఎస్ఎన్ఎల్ నేషనల్ లోక్ అదాలత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఈ నెల ఐదో తేదీన బీఎస్ఎన్ఎల్ నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని సంస్థ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం కోర్టుల్లో 'నేషనల్ లోక్ అదాలత్' జరుగుతుందని పేర్కొన్నారు. క్లోజ్ చేసిన బీఎస్ఎన్ఎల్ ఫోన్ల తాలూకు వినియోగదారులకు న్యాయసేవాధికార సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చామని, వారు కోర్టుకు హాజరు కాకుండా ముందుగానే బకాయిలు చెల్లించొచ్చని సూచించారు. ఈ నెల ఐదో తేదీలోపు వడ్డీ లేకుండా బకాయిలు చెల్లించొచ్చని, పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత తగిన రాయితీ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. బకాయిల తీర్మానం జరిగిన తర్వాత సర్వీసులను పునరుద్ధరణ చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 0866–2444266/ 83338 98997/ 94901 88990/ 94901 45222 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కృష్ణా డీఎస్ఓ పార్వతి బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.పార్వతిని బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను తూర్పుగోదావరి జిల్లా డీఎస్ఓగా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. ఆమె స్థానంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివరామప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ ఇళ్లకే సుపరిపాలన

- అన్ని ఇళ్లనూ సందర్శించని టీడీపీ ఎమ్మెల్యేలు
- ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీస్తారని ఆందోళన
- తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్తున్న వైనం
- సమస్యలు వద్దు.. సంక్షేమ పథకాలు అందాయా లేదా అంటూ దాట వేత

తిరువూరు 9వ వార్డులో టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద కరపత్రం అందజేసి ఫొటో దిగుతున్న ఎమ్మెల్యే కొలికపూడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'ఇంటింటికీ వెళ్లి ప్రజలకు 'సుపరి పాలన'ను వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాం. వాటిని గాలికి వదిలేసి ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాం. సమస్యలు పరిష్కారం కాలేదంటూ అన్ని వర్గాల ప్రజలు రోడ్డుక్కుతున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు ఇలా ఎవరిని కదిపినా నిప్పులు చెరుగుతున్నారు. పింఛన్లను కుదించాం. అన్ని పథకాలకు మంగళం పాడేశాం. తల్లికి వందనంలో కోతలు పెట్టాం. ఇప్పుడు ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి? హామీలపై నిలదీస్తే వారికి ఏమని చెప్పాలి' అని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మొదలైన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్లి మొక్కుబడిగా ముగిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజులు ఎలా నెట్టుకురావాలా అని తలలు పట్టుకొంటున్నారు.

దందాలపై నిలదీస్తారని భయం

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకుల దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు వారు చేయని దందా లేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాతో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఊరూరా బెల్ట్ షాపులు, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆక్రమణలు, కబ్జాలు ఇబ్బడి ముబ్బడిగా చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులతో వేధించారు. వీటన్నింటితో ఐదేళ్ల తరువాత కనిపించాల్సిన ప్రభుత్వ వ్యతిరేకతను ఏడాదిలోని మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ముందుకెళ్లేందుకు ముఖం చెల్లక కొంత మంది ఎమ్మెల్యేలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, నందిగామ ఎమ్మెల్యేలు అందుబాటులో లేరు. నందిగామ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని చిన్ని సుపరిపాలనలో భాగంగా కంచకచర్లలో పాల్గొన్నారు. తమకు అనుకూలమైన ప్రాంతంలో కేవలం నామమాత్రంగా కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి కార్యక్రమాన్ని గంటలోపే ముగించారు.

కృష్ణా జిల్లాలో..

- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మచిలీపట్నం 48వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. ఎంపిక చేసుకున్న ఇళ్లకు మాత్రమే మంత్రి వెళ్లి పథకాల గురించి వివరించారు. కొన్ని ఇళ్ల వద్ద ప్రజలు తమ ప్రాంతంలో నాలుగు నెలలుగా వీధిదీపాలు వెలగటం లేదని, తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదని మంత్రిని నిలదీశారు. పోతేపల్లి గ్రామంలో గురువారం ఇదే రీతిలో కార్యక్రమం సాగింది.
- అవనిగడ్డ నియోజకవర్గంలో మొక్కుబడిగా సుపరిపాలన కార్యక్రమం జరుగుతోంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూడళ్ల వద్ద, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఈ కార్యక్రమంపై టీడీపీ నాయకులకు సైతం ఆసక్తి లేకపోవటం గమనార్హం.
- పామర్రు నియోజకవర్గంలోని పామర్రు టౌన్‌లో జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ప్రకటించిన విధంగా ప్రతి ఇంటికి వెళ్లకుండా వారికి అనుయాయులుగా ఉన్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారితోనే సమయం గడుపుతున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే ఆందోళనతో కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.
- గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడలో సుపరిపాలన కార్యక్రమం తూతూ మంత్రంగా జరుగుతోంది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కార్యక్రమం జరుగుతుందనే సమాచారాన్ని ఎవరికీ ముందస్తుగా ఇవ్వకుండా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి రెండు ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు మండలం కాటూరు గ్రామాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పర్యటించారు. ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి టీడీపీ అనుకూల వ్యక్తుల ఇళ్లకు మాత్రమే వెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి 'మై టీడీపీ' యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కార్యక్రమం మొక్కుబడిగానే సాగింది.
- గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, రామవరప్పాడు గ్రామాల్లో సుపరిపాలన కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ కూడా టీడీపీ అనుకూల గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లి ఫొటోలు దిగి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. పెడన నియోజకవర్గంలో సైతం కార్యక్రమం మొక్కుబడిగా సాగింది.

సమస్యలు వద్దంటూ..

తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడికి సమస్యలతో ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. తిరువూరు మండలం, కోకిలంపాడులో రోడ్డు అధ్వానంగా ఉందని, మోకాలి లోతు గుంతలు, బురదతో నిండిందని, వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయని, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇప్పుడు వచ్చింది సమస్యల గురించి కాదని, సంక్షేమ పథకాల గురించి వచ్చామంటూ ఎమ్మెల్యే కొలికపూడి మాట దాటవేశారు. ఎమ్మెల్యే ముందు సమస్యల గురించి చెప్పకుండా జనాలను టీడీపీ స్థానిక నాయకులు వారించారు. గురువారం సైతం అదే తంతు జరిగింది. తిరువూరులోని తొమ్మిదో వార్డులో డ్రెయిన్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 'ఇప్పుడు సమస్యల గురించి వద్దు. మీకు తల్లికి వందనం వచ్చిందా? లేదా? అంటూ వారు అడిగిన సమస్యను ఎమ్మెల్యే దాట వేశారు. జగ్గయ్యపేటలో సైతం తమకు అనుకూలమైన వారి ఇళ్లకే టీడీపీ నాయకులు వెళ్లారు. విజయవాడ వెస్ట్‌లో ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలైంది. విజయవాడ ఈస్ట్, సెంట్రల్ నియోజకవర్గాల్లో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

ఈగల్ టీం ఐజీ రవికృష్ణ

గంజాయి చాక్లెట్లను చూపిస్తున్న ఐజీ రవికృష్ణ, డీసీపీ సరిత తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ టీం ఐజీ ఆరే రవికృష్ణ తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీం సభ్యులు, పోలీసులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా బిహార్ నుంచి చెన్నైకు గంజాయి చాక్లెట్లను తీసుకువెళ్తున్న వ్యక్తిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గంజాయి కేసులకు సంబంధించి 80 శాతం ఒడిశా నుంచే ఇతర ప్రాంతాలకు రైళ్లలో సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, దీనిని అరికట్టేందుకు అన్ని రైల్వేస్టేషన్లలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సహకారంతో ఈగల్ టీంలు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాయని వివరించారు. డ్రోన్‌లు, శాటిలైట్ టెక్నాలజీని ఉపయోగించి అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను వదిలే ప్రసక్తే లేదని, వారి ఆస్తులను అటాచ్ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఇటువంటి తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సరిత, రైల్వే సీనియర్ డీఎస్సీ షణ్ముగ వడివేల్, జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు, సీఐలు జి.వి.రమణ, దుర్గారావు, ఆర్‌పీఎఫ్ సీఐ పతే అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

మేళతాళాలతో దుర్గమ్మకు సారె

అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మేళతాళాలు.. మంగళ వాద్యాలతో భక్తులు దుర్గమ్మ కొండకు తరలివస్తున్నారు. సకుటుంబ సమేతంగా అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. గురువారం సుమారు 40కి పైగా భక్త బృందాలు, 1200 మందికి పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సారెను సమర్పించేందుకు విచ్చేస్తున్న భక్త బృందాలు, భక్తులకు దేవస్థానం సకల సదుపాయాలను కల్పిస్తోంది. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి భక్తులు సారె సమర్పిస్తున్నారు. మహామండపం ఆరు, ఏడు అంతస్తుల్లో అమ్మవారికి సమర్పించిన పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, మిఠాయిలను మహిళలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. సారె సమర్పించిన భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాలతో పాటు ఉచిత ప్రసాదాలను దేవస్థానం అందించింది.

10వ తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు?

ఆషాఢం సారె, వారాంతం, శాకంబరీదేవి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసే యోచనలో ఉన్నట్లు ఆలయ ఈఓ శీనానాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం రోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలను ఈఓ నిలిపివేశారు. తాజాగా పదో తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు చేయాలనే ఆలోచన చేయడం గమనార్హం.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

- కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన జీఓ 120ను రద్దు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కొల్లేరును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన 120 జీఓను రద్దు చేయాలని, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిని కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన గురువారం కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వారు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజలకు హానికరమైన ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై. కేశవరావు మాట్లాడుతూ.. మూడో కాంటూరు నుంచి ఐదో కాంటూరు వరకు పది కిలోమీటర్ల దూరంలో సున్నితమైన పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలు విధించి మొత్తం కొల్లేరును పూర్తిగా అటవీ శాఖ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీని ప్రభావం ఏలూరు జిల్లాలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేటి ప్రాంతంలోని 89 గ్రామాలపై పడుతుందన్నారు. అధికారులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

నిద్రలేమి.. పట్టదేమి?

- యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్న మిడ్‌నైట్ కల్చర్
- అర్ధరాత్రి దాటే వరకూ స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం
- ఫలితంగా మానసిక, శారీరక సమస్యల దాడి
- అప్రమత్తం కాకుంటే దీర్ఘకాలిక సమస్యగా మారే ప్రమాదం

ప్రస్తుతం మిడ్‌నైట్ కల్చర్ బాగా పెరిగింది. అర్ధరాత్రి వరకూ రోడ్లమీదే ఎక్కువ మంది గడిపేస్తున్నారు. యువతీయువకులు స్మార్ట్‌ఫోన్లతో అర్ధరాత్రి దాటే వరకూ కాలక్షేపం చేస్తున్నారు. ఫలితంగా తీవ్ర నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నిద్రలేమి అనేక ఆరోగ్య రుగ్మతలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరానికి శక్తి కోసం ఆహారం ఎంత అవసరమో, మెదడుకు నిద్ర అంత ముఖ్యం. మెదడు సక్రమంగా పనిచేయాలంటే రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నేటి యువతలో ఎక్కువ మంది నిద్రలేమి సమస్య ఎదుర్కొంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులతో పాటు, యువ ఉద్యోగులు సైతం అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకూ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయాన్నే నిద్రలేచి విధి నిర్వహణలో నిమగ్నమవుతున్నారు. నిద్రలేమి సమస్య ఉన్న ఉద్యోగులు విధినిర్వహణపై దృష్టి పెట్టలేకపోతున్నారు. చదివిన అంశాలు గుర్తుండక విద్యార్థులు సతమతమవుతున్నారు. అంతేకాదు వారు పలు శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారని ఇటీవలి అధ్యయనాల్లో వెల్లడైంది.

మంచి నిద్రపోవాలంటే..

- మనిషి శరీర తత్వాన్ని బట్టి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం.
- రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకేసమయానికి నిద్రలేవడం చేయాలి.
- ఒకేసారి ఏకకాలంలో నిద్రపోవాలి. నాలుగు గంటలకు ఒకసారి, రెండు గంటలు మరోసారి కాదు.
- మంచి నిద్రకోసం బెడ్‌రూమ్‌ను చీకటిగా ఉంచుకోవడంతో పాటు, శబ్దాలు లేకుండా చూసుకోవాలి.
- నిద్రలోనే మెదడులోని వ్యర్థాలు బయటకు వెళ్లి ఆరోగ్యంగా ఉండగలుగుతారు.
- విద్యార్థులకు సరిగా నిద్రలేక పోతే, రాత్రి చదివినవి ఉదయానికి గుర్తుండవు.

గుర్తించిన సమస్యలు ఇవీ..

- రాత్రివేళల్లో స్మార్ట్‌ఫోన్లు ఎక్కువ సేపు చూసే వారిలో కంటిలోని మెలకొనిన్ అనే పదార్థం కరిగిపోతుంది. అలాంటి వారికి నిద్రపట్టదు. క్రమేణా నిద్రలేమి దీర్ఘకాలిక సమస్యగా మారే ప్రమాదం ఉంది.
- నిద్రలేమికి గురయ్యే వారిలో కోపం, చిరాకు పెరిగిపోతాయి. నిస్సత్తువ ఆవహించి, తెల్లారి లేచిన తర్వాత పనిపై దృష్టి పెట్టలేరు. వేగంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతారు.
- పగలు చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తం కావాలంటే సరైన నిద్ర అవసరం. నిద్రలేమి సమస్య ఉన్న వారిలో చదివిన అంశాలు గుర్తుండని పరిస్థితి నెలకొంటోంది.
- ఒబెసిటీ ఉన్న వారు గురకతో రాత్రి వేళల్లో తరచూ తుళ్లిపడి లేస్తుంటారు. శ్వాసనాళాలు మూసుకుపోవడంతో గురకతో పాటు, ఒక్కోసారి గుండెపోటు, మెదడు పోటుకు కూడా గురయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి వారి ఆరోగ్య పరిస్థితిని స్లీప్ ల్యాబ్‌లో అధ్యయనం చేస్తారు.
- ప్రతి ఒక్కరికీ నాన్ రాపిడ్ ఐ మూమెంట్ (ఎన్ఆర్ఈఎం), రాపిడ్ ఐ మూమెంట్(ఆర్ఈఐ) అనే రెండు రకాల నిద్ర ఉంటుంది. ఇది గంటన్నరకు ఒకసారి సైకిల్ మారుతుంటుంది. కొందరికి రెండూ కలిసి పోవడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో నిద్రలోనే లేచి నడవడం వంటివి చేస్తుంటారు.

నిద్రలేమికి అనేక కారణాలు

నేటి యువత ఎక్కువగా నిద్రలేమి సమస్యతో బాధపడుతోంది. నిద్రలేమికి అనేక కారణాలున్నాయి. వాటిలో రోజూ ఒకే సమయానికి పడుకోకపోవడం, సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎక్కువగా టీవీలు, స్మార్ట్‌ఫోన్లు చూడటం, ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో పడుకోవడం, నిద్రలో గురక రావడం, నైట్‌స్లీప్ డిజార్డర్, రక్తహీనత వంటి కారణాలు ఉన్నాయి. నిద్రలేమి ఉన్న వారికి స్లీప్ ల్యాబ్‌లో స్టడీ చేస్తాం. ఆక్సిజన్ శాచురేషన్, బ్రెయిన్ యాక్టివిటీ, బాడీ యాక్టివిటీ, ఏ సైకిల్‌లో ఉన్నారో తెలుసుకుంటాం. నిద్రలేమికి కారణాలను అంచనా వేసి అవసరమైన వైద్యం చేయడం, సూచనలు ఇవ్వడమో చేస్తుంటాం. వైద్యుల సూచన లేకుండా నిద్రమాత్రలు వాడటం సరికాదు.

– డి.అనీల్‌కుమార్, న్యూరాలజిస్ట్

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలి

జాతీయ రహదారిపై గుంతలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

కేసరపల్లి(గన్నవరం): చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై గుంతలు పూడ్చి, రెండు వైపులా పచ్చదనం పెంపొందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేసరపల్లి వరకు జాతీయ రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. విమానాశ్రయం నుంచి అమరావతికి నిత్యం వీవీఐపీలు, విదేశీ ప్రతినిధులు వస్తుంటారని, ఈ నేపథ్యంలో జాతీయ రహదారిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు. రహదారిపై ఏర్పడిన గుంతలు, బుడమేరు కాలువ వంతెనపై పగుళ్లను తక్షణం పూడ్చి రాకపోకలకు అనువుగా మార్చాలని ఆదేశించారు. సెంట్రల్ డివైడర్‌పై వెలగని ఎల్ఈడీ లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, రోడ్డుపైకి విస్తరించిన పొదలు, పిచ్చి మొక్కలను తక్షణం తొలగించి శుభ్రం చేయాలని, రోడ్డుకు రెండువైపులా పూల కుండీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించాలని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, ఎన్‌హెచ్ఏఐ పీడీ విద్యాసాగర్, తహసీల్దారు కె.వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వాగుల ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

దొనబండలో కలెక్టర్ లక్ష్మీశకు రైతుల బాధలను తెలియజేస్తున్న రైతు నాయకుడు అబ్బూరి

కంచికచర్ల: నాగార్జున సాగర్, కాచేటి వాగులు ఆక్రమణకు గురయితే తక్షణమే తొలగించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల సమీపంలో గ్రామానికి చెందిన రైతులు నేషనల్ హైవే పక్కన ప్ల కార్డులు పట్టుకున్న రైతుల వద్దకు గురువారం కలెక్టర్ వెళ్లి విచారించారు. జిల్లా రైతు సంఘ నాయకుడు అబ్బూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పంట పొలాలు క్వారీ, క్రషర్ల సమీపంలో ఉన్నాయని ఆ క్వారీల వల్ల పంటలన్నీ దెబ్బతింటున్నాయని చెప్పారు. అంతేకాకుండా సాగునీటి కోసం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సాగర్ కాల్వను సైతం క్వారీ గుత్తేదారులు ఆక్రమించుకుని రోడ్డు వేశారని దీంతో సాగర్ జలాలు తమ పంటలకు రావటం లేదన్నారు. కాచేటి వాగును కూడా ఆక్రమించుకోవటంతో వరద నీరంతా పారుదల కాక పంటపొలాల్లోకి చేరుతున్నాయని వివరించారు. రైతుల బాధను విన్న కలెక్టర్ సాగర్ కాల్వను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని.. అదేవిధంగా వాగును, సాగర్ కాల్వలను పూడ్చివేతను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నందిగామ ఆర్డీఓ కె. బాలకృష్ణ, తహసీల్దార్ నరసింహారావు, ఆర్ఐ వెంకటరెడ్డి సీఐ చవాన్ రైతులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఇంజినీరింగ్(వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్) కార్మికులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. అర్ధనగ్నంగా మొలలకు వేప కొమ్మలు కట్టుకుని నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి నినాదాలు చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో విజయవాడ ధర్నా చౌక్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర అధ్యక్షుడు జ్యోతిబసు, నగర కోశాధికారి స్టీఫెన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

STAFF WANTED
Required qualified and experienced English & Hindi high school staff
HOLY SPIRIT E.M. HIGH SCHOOL
Kuchipudi, Movva.
Cell : 96525 30580

WANTED P.E.T.s
A well reputed School at Kaikaluru, Eluru (Dist) requires the following vacancies.
P.E.T. Male (1), Female (1)
Salary: 20.000/- to 25,000/-
Interested candidates can come directly to School with resume with in seven days.
TVNRM NATIONAL SCHOOL
Kaikaluru, Eluru Dist, AP-521333 ✆ 6303 602 774

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

Real Estate
PLOT FOR SALE
■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' అడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర : ✆ 97034 34023, 96428 72122

Services
GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్వాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

Wanted
■ SBI Lifeలో పనిచేయుటకు Unit Managers కావలెను. Exp. Min. 2 yrs, Q : Any Graduate, Fixed Salary + PF + ESI + Travelling Allowance ✆ 98480 57524
■ క్లాస్ ఇన్‌ఛార్జెస్ (M) జీ : 12K హాస్టల్ వార్డెన్స్ (M), జీ : 10K వ : 25-45, అనుభవం గలవారు కావలెను. గౌతం డిగ్రీ కాలేజ్, మోడ్రన్ సూపర్ మార్కెట్ ఎదురు, బెంజ్‌సర్కిల్ ✆ 88971 72345
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ కేర్ ఆఫ్ హెల్త్ కార్డు ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000 + 2500 TA. సంప్రదించండి. ఫోన్: ✆ 70130 52798
■ విజయవాడ - తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60564, 72070 13418
■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : ✆ 88858 01357
■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679
■ రామవరప్పాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M) లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: ✆ 98853 26279
■ ప్రముఖ కంపెనీవారి వ్యవసాయ ఉత్పత్తులు మండలాల వారిగా జీతం/కమీషన్‌పై పనిచేయుటకు అనుభవం ఉన్న అభ్యర్థులు కావలెను. Qly 10th-డిగ్రీ జీతం 10-20 వేలు. 88851 91948
■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు 40 వేలు, ఫ్రీ రూం + భోజనం. Hyd. 7993583999
■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2 వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781

గమనిక

రసాయన వ్యర్థం.. రైతుకు అనర్థం

- కొండపల్లి ఐడీఏ కంపెనీల వ్యర్థాలు తొమ్మండ్రం వాగులోకి విడుదల
- రసాయన వ్యర్థాలతో చవుడుబారుతున్న సాగు భూములు
- వ్యాధుల బారిన పడుతున్న కట్టుబడిపాలెం గ్రామస్తులు
- వాగులో నీరు తాగి మృత్యువాత పడుతున్న మూగజీవాలు

కవులూరు శివారులో తొమ్మండ్ర వాగు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

జి.కొండూరు: ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి పారిశ్రామికవాడలో ఉన్న పలు కంపెనీల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలను పక్కనే ఉన్న జి.కొండూరు మండలంలోని తొమ్మండ్రం వాగులో కలుస్తున్నాయి. ఈ వ్యర్థాల కారణంగా వాగుకు రెండువైపులా ఉన్న కట్టుబడిపాలెం గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. వాగులో నీరు తాగి మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. రసాయన వ్యర్థాలు తిష్టవేయడంతో కవులూరుకు చెందిన వందల ఎకరాల సాగు భూమి చవుడుబారుతోంది. కట్టుబడిపాలెం, కవులూరు గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఈ సమస్యపై పోరాడుతున్నా ఫలితం కనిపించలేదు. అప్పుడప్పుడూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు హడావుడి చేయడం తప్ప రసాయన వ్యర్థాలను వాగులోకి విడుదల చేయకుండా అడ్డుకోలేకపోతున్నారని రెండు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు గ్రామాల ప్రజలు ఇటీవల వాగు వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఖరీఫ్ సాగు కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిత్యం వేల లీటర్ల వ్యర్థాలు..

కొండపల్లి ఐడీఏలో నాలుగు వందల వరకు పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఫార్మా, కెమికల్ కంపెనీలు 12, ప్లాస్టిక్ కంపెనీలు మూడు, మడ్డి ఆయిల్ కంపెనీలు నాలుగు, టైర్ ఆయిల్ కంపెనీలు మూడు వరకు ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి రోజుకు వేల లీటర్లు రసాయన వ్యర్థాలు విడుదలవుతాయి. ఈ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు రసాయన పరిశ్రమల సొసైటీ ఆధ్వర్యంలో కొండపల్లి సమీపంలోనే రూ.8 కోట్లతో రీసైక్లింగ్ యూనిట్‌ను నిర్మించారు. అయితే ఈ వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఆయా కంపెనీల నిర్వాహకులు తమ ప్రాంగణాల్లోనే నిల్వ ఉంచి వర్షంపడినప్పుడు, రాత్రి వేళ, సెలవు రోజుల్లో పరిశ్రమలకు పక్కనే ఉన్న తొమ్మండ్రం వాగులోకి వదిలేస్తున్నారు.

రైతులకు తీవ్ర నష్టం

జి.కొండూరు మండలంలోని లోయ ప్రాంతంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన తొమ్మండ్రం వాగు కొండపల్లి పారిశ్రామిక వాడను ఆనుకొని కట్టుబడిపాలెం గ్రామం మీదుగా సైఫన్ ద్వారా బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను దాటి కవులూరు శివారులోని వ్యవసాయ భూముల మీదుగా ప్రవహించి తారకరామా ఎత్తిపోతల పథకం ఎడమ కాలువలో కలుస్తుంది. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలు వాగులో కలిసి వ్యవసాయ భూముల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో కవులూరు పరిధిలో 600 ఎకరాల సాగు బూములు చవుడుబారి రైతులు నష్టపోయారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు, దోమల కారణంగా కట్టుబడిపాలెం గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కలుషిత నీరు తాగిన మేకలు, గేదెలు, ఆవులు, పందులు వంటి మూగజీవాలు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి.

తొమ్మండ్రం వాగులో రసాయన వ్యర్థాలతో కలిసి నీటి ప్రవాహం

చర్యలు తీసుకోకుంటే ఎడారే

తొమ్మండ్రం వాగులోకి రసాయన వ్యర్థాలను వదలడం వల్ల భూములు చవుడుబారుతున్నాయి. పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యపై ఎంత పోరాటం చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే వ్యవసాయ భూమి ఏడారిలా మారుతుంది.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు గ్రామం

పశువుల చూడి నిలవడంలేదు

తొమ్మండ్రం వాగులోకి ఐడీఏలోని కెమికల్స్‌ను వదలడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఆ నీటిని తాగిన గేదెలకు రోగాలు వస్తున్నాయి. చూడి వచ్చినా నిలవడం లేదు. ఈ నీరు మా పొలాల మీదుగా వెళ్లడం వల్ల పైరు ఎదగడం లేదు. ఖరీఫ్ మొదలైతున్నందున కెమికల్స్‌ను వాగులోకి వదలకుండా కట్టడి చేయాలి.

– సర్నాల వలరాజు, రైతు, కవులూరు గ్రామం

వాగులోకి వదలడం దుర్మార్గం

తొమ్మండ్రం వాగులోకి కెమికల్స్‌ని వదలడం వల్ల మా భూములు ఆరు వందల ఎకరాలకు పైగా పంట పండకుండా పోతున్నాయి. వాగు నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. వర్షం పడి వాగులో నీరు ప్రవహించే సమయంలో ఎక్కువగా వ్యర్థాలను వదులుతున్నారు. అధికారులు స్పందించి కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.

– చెరుకూరి వెంకట రమణారావు, రైతు, కవులూరు గ్రామం

తీవ్రంగా నష్టపోతున్నాం

ఐడీఏలోని కంపెనీల నుంచి రసాయన వ్యర్థాలను తొమ్మండ్రం వాగులోకి వదలడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ వాగులో నీరు మా పొలం మీదుగా వెళ్లడం వల్ల పైరులో ఎదుగుదల లోపించి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులు మా గోడును పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– బోగినేని బాలకృష్ణ, రైతు, కవులూరు గ్రామం

అన్ని రకాలుగా నష్టపోతున్నాం

తొమ్మండ్రం వాగులోకి రసాయనాలను వదలడం వల్ల పంట సక్రమంగా పండడం లేదు. పశువులు ఈ నీరు తాగడం వల్ల చూడి నిలవడంలేదు. పాల దిగుబడి తగ్గిపోతోంది. ఈ నీరు మా పొలాల్లో చేరడం వల్ల పొలం పని చేసినప్పుడు మాకు వ్యాధులు వస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

– ఈలప్రోలు రవి, రైతు, కవులూరు గ్రామం

అన్యాయం చేశారు.. ఆదుకోండి

కలెక్టర్‌ను వేడుకున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల నిర్వహించిన బదిలీల్లో సుదూర ప్రాంతాలకు తమను బదిలీ చేసి అన్యాయం చేశారని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లా పాపలతో ఉన్న తమను వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయటం ఎంతో బాధ కలిగించిందన్నారు. కలెక్టర్ డీకే బాలాజీని గురువారం రాత్రి కలిసి తమ గోడును వెలిబుచ్చారు. సచివాలయాల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న తమ వెసులుబాటు పట్టించుకోకుండా ఇష్టానుసారం బదిలీ చేశారని కలెక్టర్‌కు వివరించారు. అనారోగ్య సమస్యలు, స్పౌజ్ కేసులు, చంటి పిల్లలు ఉన్న తమను సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఎలా వెళ్లేదని విన్నవించారు.

వందల కిలోమీటర్ల దూరం..

జగ్గయ్యపేటలో పనిచేస్తున్న వారిని నాగాయలంకకు.. ఎ.కొండూరు నుంచి పమిడిముక్కల, మొవ్వ ప్రాంతాలకు బదిలీ చేయటంతో వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. తమకు వచ్చే జీతం చార్జీలకే సరిపోతుందని, జీవనం ఎలా గడుపుతామని కన్నీరు పెట్టుకున్నారు. రీకౌన్సెలింగ్ నిర్వహించి ర్యాంకుల ఆధారంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వ్యవసాయశాఖ సంచాలకులను పిలిచి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ సంచాలకులు గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతూ సమస్యలను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు.

కలెక్టర్ డీకే బాలాజీకి సమస్యను వివరిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

ఆస్తి కోసమే ఘాతుకం

- తాతయ్యను కూడా చంపేందుకు స్కెచ్
- పోలీసుల అదుపులో నిందితుడు
- విచారణలో విస్తుపోయే వాస్తవాలు

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామంలో ఈ నెల ఒకటో తేదీన నాయనమ్మ ఉమ్మడి హైమావతిని హత్య చేసిన ఆమె మనవడు వేణుగోపాలరావు తాతయ్య చలపతిరావుని కూడా అంతమొందించేందుకు ప్రయత్నాలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్య చేసిన అనంతరం హైదరాబాద్ పారిపోయిన వేణుగోపాలరావును బుధవారం రాత్రి జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకొని మైలవరం తరలించారు. మైలవరంలో నిందితుడు వేణుగోపాలరావుని గురువారం విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడు హత్యకు గల కారణాలను వెల్లడించాడు. నాయనమ్మ హైమావతితో పాటు తాతయ్య ఉమ్మడి చలపతిరావుని కూడా హత్య చేసేందుకు ప్రయత్నించినప్పటికీ నాయనమ్మ ఒక్కటే ఒంటరిగా దొరకడంతో కర్రతో తీవ్రంగా కొట్టి స్పృహ తప్పి పడిపోయిన తర్వాత పెట్రోలు పోసి నిప్పంటించినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడు. ముందస్తు వ్యూహం ప్రకారమే నిందితుడు పెట్రోలు బాటిల్‌తోపాటు కర్రను కూడా వెంట తెచ్చుకున్నట్లు తేలింది. నిందితుడికి మరో వ్యక్తి కూడా సహకరించినట్లు పోలీసులు గుర్తించి.. అతనిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. హత్యలో అతను కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నాడా లేక పరోక్షంగా సహకరించాడా అన్న కోణంలో విచారిస్తున్నారు.

ఆస్తి మొత్తం మనవరాలికే ఇస్తున్నారనే కోపంతో..

మృతురాలు ఉమ్మడి హైమావతి, ఉమ్మడి చలపతిరావు దంపతులకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే చిన్న కుమార్తె ఉమ్మడి లీలా అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద కుమారుడు ఉమ్మడి శివ సచ్చీంద్రకుమార్ వివాహం అనంతరం ఆస్తి వివాదాలతో ఇంటి నుంచి వెళ్లిపోయి కంచికచర్ల మండల పరిధి పరిటాలలో నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉంటే పెద్ద కుమార్తె అరుణ కూతురైన అనితని చిన్న కుమారుడు ఉమ్మడి శివ సచ్చీంద్రప్రసాద్‌కి ఇచ్చి వివాహం చేయగా.. ఒక కుమారుడు పుట్టిన తర్వాత అనారోగ్యంతో శివసచ్చీంద్రప్రసాద్ మృతి చెందాడు. అప్పటి నుంచి చిన్నకుమారుడి భార్య అనిత హైమావతి, చలపతిరావు వద్దనే చెవుటూరులో ఉంటోంది. ఈ క్రమంలో చలపతిరావు, ఉమ్మడి హైమావతిల పేరుతో ఉన్న 1.30ఎకరాల వ్యవసాయ భూమి, 30సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు గతంలో వ్యవసాయ భూమి విక్రయించగా వచ్చిన డబ్బులు మొత్తం కూడా పంచకుండా చిన్నకొడుకు భార్య, మనవరాలైన అనితకే ఇస్తున్నాడనే నెపంతో పెద్ద కుమారుడు శివ సచ్చీంద్రకుమార్ కొడుకు వేణుగోపాలరావు నాయనమ్మ, తాతయ్యలపై కక్ష పెంచుకున్నాడు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి లేవలేని స్థితిలో ఉండగా ఆస్పత్రి ఖర్చులతో అప్పుల పాలైనప్పటికీ ఆస్తి పంచడం లేదనే కోపంతోనే హత్య చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు.

అగార్ ఉడ్ మొక్కల సాగుతో అధిక లాభాలు

త్రిపుర ప్రభుత్వ ఎన్‌టీఎఫ్‌పీ డైరెక్టర్ ప్రసాదరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచంలోనే అత్యంత విలువైన చెట్టు అగార్ ఉడ్ అని, దీని సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని త్రిపుర ప్రభుత్వ ఎన్‌టీఎఫ్‌పీ డైరెక్టర్, ఐఎఫ్ఎస్ అధికారి ప్రసాదరావు అన్నారు. విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం మందిర డెవలపర్స్ ఆధ్వర్యంలో అగార్ ఉడ్‌పై వ్యవసాయ పెట్టుబడితో అధిక లాభాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాదరావు మాట్లాడుతూ అగార్ ఉడ్ ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదం, మెడిసిన్, సౌందర్య సాధనాలలో విరివిగా వాడుతున్నట్లు తెలిపారు. ఈశాన్య దేశాలలో పెరిగే అగార్ ఉడ్ మొక్కలను గత 10 నుంచి 15 ఏళ్లుగా కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో విరివిగా సాగు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమ్మకాలు ఎగుమతులు అన్ని క్లియరెన్సులు అందిస్తూ కొన్ని రూ.వేల కోట్లు బిజినెస్‌ను అంచనా వేస్తూ అగార్ ఉడ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మందిర డెవలపర్స్ చైర్మన్ జీవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న త్రిపుర రాష్ట్ర ఫారెస్ట్ డైరెక్టర్ వడ్డరపు ప్రసాదరావు, జీవి శేషగిరి

వయస్సు 24.. చోరీలు 24

- నాలుగు నెలల్లో 12 దొంగతనాలు
- ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు
- రూ. 6లక్షలు విలువైన ఆభరణాలు స్వాధీనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాలుగు నెలలో 12 చోరీలు చేసిన నిందితుడు ఉయ్యాల రాజేష్(24)ను గుణదల పోలీసులు అరెస్టు చేసి రూ.6లక్షలు విలువ చేసే 60గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డి. దామోదరరావు తెలిపారు. స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అలా దొరికాడు..

గుణదల మురళీనగర్ కట్టమీద ఇటీవల చోరీ జరిగింది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుణదల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసిరెడ్డి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమానితులు, నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందానికి అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఒక యువకుడు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.

జల్సాలకు అలవాటు పడి..

విచారణలో నిందితుడు అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు ఉయ్యాల రాజేష్(24)గా గుర్తించామని ఏసీపీ చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన రాజేష్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడ్డాడన్నారు. ఈ క్రమంలో రాజేష్‌పై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేశామని చెప్పారు. 2024 సెప్టెంబర్‌లో దొంగతనం కేసులో గుణదల పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించామని తెలిపారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన రాజేష్ నేర ప్రవృత్తి మార్చుకోకుండా చోరీలకు పాల్పడ్డాడని.. నాలుగు నెలల వ్యవధిలో 12 దొంగతనాలు చేశాడని వివరించారు.

సాంకేతిక ఆధారాలు ఆధారంగా..

సాంకేతిక పరిజ్ఞానం, చోరీ జరిగిన ప్రాంతంలో వేలిముద్రలు పరిశీలించి పాత నేరస్తులతో పరిశీలించగా రాజేష్‌ను నిందితుడిగా గుర్తించామని ఏసీపీ చెప్పారు. రాజేష్‌పై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్‌లలో 12 కేసులు ఉన్నాయన్నారు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజేష్ చోరీలు చేశాడని వివరించారు. నేరస్తుడుని అరెస్టు చేయటంతో పాటు అతని వద్ద నుంచి రూ.6లక్షలు విలువచేసే ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

మాట్లాడుతున్న ఏసీపీ దామోదరరావు, సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

తిరువూరు: ఎ.కొండూరు మండలం పాతరేపూడి తండాలో గత నెల 26న కోట రాము అనే వ్యక్తిని హత్య చేసిన ఇరువురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తిరువూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరానికికు చెందిన ఆదూరి చార్లెస్‌కు, రెడ్డి గూడెం మండలం కూనపరాజు పర్వకు చెందిన బత్తు ల కుమారితో వివాహేతర సంబంధముంది. కొద్దికాలంగా కోట రాము కూడా కుమారిని తనతో వివా హేతర సంబంధం పెట్టుకోవాలని వేధిస్తున్నాడు.

అడ్డు తొలగించుకోవాలని..

కుమారి ఈ విషయాన్ని చార్లెస్‌కు చెప్పగా, ఇరువురూ కలసి రామును అడ్డు తొలగించుకోవాలని భావించారు. రామును కొత్త రేపూడి గ్రామశివారులోని మామిడి తోట వద్దకు కుమారి తీసుకురాగా, చార్లెస్ కర్రతో అతని తలపై బలంగా బాదాడు. రాము తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోగా.. కుమారి, చార్లెస్ పరారయ్యారు. తన భర్త మూడు రోజులుగా కనిపించట్లేదని హతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, 29న పాత రేపూడి మామిడితోటలో లభ్యమైన మృతదేహం రాముదిగా గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. కుమారి, చార్లెస్‌పై వెంకటేశ్వరమ్మ అనుమానం వ్యక్తం చేయగా.. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని తెలిపారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

తిరువూరులో హత్య కేసు నిందితులను చూపుతున్న ఏసీపీ ప్రసాదరావు

10 నుంచి సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు, ప్రయోక్త మల్లాది సూరిబాబు 80వ జన్మదిన వేడుకల సందర్భంగా సామగాన లహరి ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 10వ తేదీ గురువారం సాయంత్రం నుంచి నాలుగు రోజుల పాటు జాతీయ సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మల్లాది బ్రదర్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు పాల్గొంటారన్నారు. 13వ తేదీ సాయంత్రం సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబుకు సత్కారం ఉంటుందని వివరించారు. ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరారావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం, పలువురు సంగీత విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

7న బహిరంగ వేలం పాటలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల ఏడో తేదీ ఉదయం 11 గంటలకు పలు రకాల లైసెన్స్ హక్కులకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈవో పవన్‌కళ్యాణ్ గురువారం తెలిపారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు, ఆలయం వద్ద లడ్డూ ప్రసాదం, బ్రహ్మోత్సవాలు, పండుగలకు కిరాణా సరుకులు, శానిటరీ సరుకులు సరఫరా తదితర అంశాలకు సంబంధించి సీల్డు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు వేలంపాల్గొనాలని, పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఈవో సూచించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి గురువారం విజయవాడ, గుణదల ప్రాంతానికి చెందిన రావూరి సుబ్బారావు, అల్లూరమ్మ దంపతులు రూ.లక్ష విరాళం ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా దాతలు విరాళం నగదులో రూ.50వేలు నిత్యాన్నదాన పథకానికి, రూ.50 వేలు గోశాలలో గోవుల సంరక్షణకు వినియోగించాలని కోరారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పచ్చిరొట్ట సాగుపై రైతుల ఆసక్తి



పెనుగంచిప్రోలు: పచ్చిరొట్ట సాగుపై రైతులు ఇటీవల కాలంలో ఎంతో ఆసక్తిని చూపిస్తున్నారు. పంట సాగుకు ముందు రైతులు జీలుగ, పిల్లిపెసర వంటి వివిధ రకాల పచ్చిరొట్ట విత్తనాలు వేస్తున్నారు. పంట వేసే ముందు దానిని భూమిలో కలియదున్నుతున్నారు. దీంతో భూమి సారవంతంగా ఉంటుంది. పచ్చి రొట్ట సాగుతో భూములు ఆకుపచ్చగా కళకళలాడుతున్నాయి. అయితే ఈఏడాది కూటమి ప్రభుత్వం తమకు సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలు అందించలేదని రైతులు చెబుతుండటం గమనార్హం.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు

నందిగామటౌన్: భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ కోరారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో గురువారం అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం మెయిన్‌బజార్, గాంధీ సెంటర్‌లోని దుకాణదారులు, చిరు వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల్లోని ఆహార పదార్థాలను తింటే తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఇప్పటికైనా దుకాణదారులు పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ విక్రయాలను నిలుపుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో వేంచేసియున్న వారాహి అమ్మవారి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, మూలమంత్ర హోమం, అర్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఏడుగురికి రిమాండ్

కంచికచర్ల: మండలంలోని పరిటాల శివారు ఉమా హాలిడే ఇన్‌లో అక్రమంగా సుబాబుల్ కర్రను నరికి తరలిస్తున్నందుకు వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీ రాజు గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు పేరకలపాడు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఉమా హాలిడే ఇన్‌లో రెండు టన్నుల సుబాబుల్ కర్రను నరికి తరలించేందుకు ప్రయత్నించగా వాచ్‌మెన్ వారిని అడ్డుకుని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చెత్త ద్వారా సంపద సృష్టి కేంద్రం తనిఖీ

కంచికచర్ల: చెత్తశుద్ధితో సంపద సృష్టించేందుకు పంచాయతీ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. కంచికచర్లలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చెత్తద్వారా సంపద సృష్టిస్తే పల్లెలు కూడా పరిశుభ్రతకు నెలవులుగా ఉంటాయన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను చిత్తశుద్ధితో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర సాకారానికి కీలకమార్గమైన తడి, పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలన్నారు. సేంద్రీయ వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టును తయారు చేయడం ద్వారా సంపద సృష్టి జరుగుతోందని వివరించారు. జిల్లాలోని 286 గ్రామ పంచాయతీల్లో 264 షెడ్లు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని, కిలో రూ. 10లకు వర్మీ కంపోస్టును రైతులకు అందజేయాలని సూచించారు. బహుముఖ ప్రయోజనాలున్న టెర్రస్ కిచెన్ గార్డెన్‌లను చేపట్టేలా, వాటికి వర్మీ కంపోస్టును ఉపయోగించుకునేలా కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వికసిత్ భారత్, సుసంపన్న ఆరోగ్య స్వర్ణాంధ్ర సాకారానికి స్వచ్ఛతా మార్గం కీలకమని ఈ నేపథ్యంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణలో జిల్లాను నంబర్‌వన్‌గా నిలిపేందుకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ ఇందుపల్లి నానిబాబు పాల్గొన్నారు.

కంచికచర్లలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

కార్మికులకు వైద్యసేవలు అందించాలి...

కంచికచర్ల: కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు, సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మండలంలోని గండేపల్లి సెంటిని బయో స్మిరిట్ కర్మాగారంలో నిర్మించిన వైద్యశాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు కర్మాగారంలో పనిచేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే ప్రథమ చికిత్స అందజేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలన్నారు. కర్మాగారంలో నిత్యం డాక్టర్, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కర్మాగారం యాజమాన్యానికి సూచించారు. నంతరం కర్మాగారంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ కె. బాలకృష్ణ, సెంటినీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రసిడెంట్ అండ్ అడ్మినిస్టేటర్ డాక్టర్ ఎం.మధుసూధనరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్, సర్పంచి బొక్కా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలోని సెంటినీ కర్మాగారంలో మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

అధికారుల గైర్హాజరుపై ఎంపీటీసీల ఆగ్రహం

షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్

నందిగామరూరల్: ప్రజాసమస్యలపై చర్చించేందుకు నిర్వహించే మండల పరిషత్ సమావేశానికి ఆయాశాఖల అధికారులు గైర్హాజరుకావడం తగదని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశ ఏర్పాటు టీ, కాఫీలు తాగేందుకు కాదనే విషయాన్ని అధికారులంతా గుర్తించాలని నందిగామ వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. స్థానిక నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెసరమల్లి రమాదేవి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ సమావేశానికి ఆయాశాఖల నుంచి 40మంది అధికారులు హాజరుకావాల్సి ఉండగా, పట్టుమని పదిమంది కూడా హాజరుగాకపోతే ప్రజాసమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకావాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారో...

కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన డబ్బులు ప్రభుత్వం నుంచి అందకపోవటంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి ఖర్చుల కోసం గ్రామాల్లో రైతులు అవస్థలు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పంటకాల్వల్లో జమ్ము, పూడిక తీయించాలని కోరారు. కంచల ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య మాట్లాడుతూ వరి విత్తనాల కొరత రైతులను వేధిస్తోందన్నారు. ఎంటియు 1061 వరి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని ఏవో నాగేశ్వరరావును కోరారు. గోకులం షెడ్ల బిల్లులను మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశాలకు మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో శ్రీనివాసరావుకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు ప్రభుత్వం నగదు చెల్లించాలని కోరుతున్న సర్పంచ్ మేడా కోటేశ్వరరావు

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

నందిగామటౌన్: క్షయ వ్యాధి బారినపడి తి ఏటా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నందున, ప్రతిఒక్కరు క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే, శ్వాసకోశ వ్యాధి నిపుణుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిఈపి, భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక సాయి సమీర ఆస్పత్రిలో క్షయవ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలను వివరిస్తూ రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం ట్యుబర్కులోసిస్ అనే బ్యాక్టీరియా క్షయ వ్యాధి వస్తుందని, ఈ వ్యాధి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గటం వంటి లక్షణాలను గమనిస్తే, వెంటనే వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సర్వీస్ కోఆర్డినేటర్ నరసింహ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సెక్టార్ వారీగా స్థూల ఆదాయాన్ని పెంచే విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అగ్రికల్చర్, హార్టీకల్చర్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీస్ వంటి వ్యవసాయాధారిత రంగాల అభివృద్ధి ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగునకు పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ విభాగాలన్నీ దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ, ఉపాధిహామీ, వెలుగు, హౌసింగ్ శాఖల అధికారులంతా సామాజిక ఆర్థిక సమీకరణం కలిగించేలా పథకాలను అమలుచేయాలని సూచించారు. విద్య, వైద్య, ఆరోగ్య విభాగాలు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రతిశాఖ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరరావు, పేట మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, ఎకాడమీషియన్ కుసుమ కుమారి, పెనుగంచిప్రోలు ఎంపీడీవో శ్రీను, స్వర్ణాంధ్ర టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, పక్కన అధికారులు

'పాపోలు'కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చందర్లపాడు(నందిగామ రూరల్): వైద్యచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న చందర్లపాడు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాపోలు కోటేశ్వరరావును నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మెడికల్ రికార్డులను పరిశీలించారు. త్వరగా కోలుకుంటారంటూ ధైర్యం చెప్పారు. కోటేశ్వరరావును పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాపోలు కోటేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

సమస్యలను పరిష్కరించాలని వినతి

జగ్గయ్యపేటఅర్బన్: ఆరోవార్డులో గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరారు. మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ గురువారం ఆరోవార్డులో పర్యటించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలను సరిగా తొలగించడం లేదని, ఇళ్ల మధ్యనున్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించాలని, దోమల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వార్డుప్రజలు కమిషనర్‌ను కోరారు. అనంతరం కమిషనర్ వెంకట కృష్ణారావు స్పందిస్తూ ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీచేస్తామని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వివరించారు.

సారె సమర్పణ

పెనుగంచిప్రోలు: ఆషాడమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం అమ్మవార్లకు గ్రామంలోని భక్త సేవా సేవాసంఘం ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. మహిళలు స్థానిక కోదండ రామాలయం వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తరలివెళ్లి సారె సమర్పించగా, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు.

రూ.8 లక్షలు మంజూరు

సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: స్థానిక జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలపై ఈనెల ఒకటోతేదీన 'జగనన్న కాలనీపై కూటమి నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనా నికి ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ స్పందించారు. కంచికచర్ల జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు అభివృద్ధికి మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు, కల్వర్టు నిర్మాణానికి రూ.3లక్షలు కేటా యిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో త్వరలోనే జగనన్న కాలనీలో పనులు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాలలో మొహరం పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పండుగ వేడుకలలో భాగంగా మండలంలోని మాగల్లు గ్రామంలో గురువారం రాత్రి ఏడవ షరగత్‌ను నిర్వహించారు. ముందుగా పీర్లను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

డీవైఈవో కార్యాలయం తనిఖీ

నందిగామ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలా రాణి ఆదేశించారు. పట్టణంలోని డీవైఈవో కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా విధిగా బడికి వచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఈవైవో సాంబ శివరావుకు సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సంఖ్య, యూనిఫాం, పాఠ్యపుస్తకాల వివరాలు తదితర రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

జాతీయ సదస్సుకు చైర్మన్ రాఘవేంద్ర హాజరు

జగ్గయ్యపేట అర్బన్: 'ప్రజాస్వామ్యం, జాతీయ నిర్మాణంలో మున్సిపల్ సంస్థల పాత్ర' అనేఅంశంపై హర్యానాలో గురువారం నిర్వహించిన జాతీయ సదస్సుకు జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహిస్తున్న జగ్గయ్యపేట మున్సిపాలిటీలో శానిటేషన్, పచ్చదనం, మున్సిపల్ ఓపెన్ స్పేస్‌ల వినియోగం, మురుగునీటి నిర్వహణ, డిజిటల్ సేవలను అందుబాటులో ఉంచడం, యువతకు ప్రోత్సాహం తదితర ప్రజోపయోగ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు సదస్సులో వివరించానని తెలిపారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్

ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటియూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక వాటర్ ట్యాంకుల కేంద్రం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గురువారం ధర్నా చేశారు. పాలకులు తమ సమస్యలు పరిష్కరించకపోతుండటంతో శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలియజేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ లోవరాజుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం విజయవాడలో పెద్దఎత్తున ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు రూ.26వేల కనీసవేతనం ఇవ్వడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల నాలుగోతేదీ తర్వాత పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తామని ఇంజినీరింగ్ కార్మికులు హెచ్చరించారు. ఈ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, రవి, సంజయ్, సునీల్, వంశీ, కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రీకృత వంటశాలలను రద్దు చేయాలి : సీఐటీయూ

పెనుగంచిప్రోలు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు కోరారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక మండల వనరుల కార్యాలయ సిబ్బందికి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రీకృత వంటశాలలను రద్దు చేయాలని, వంటకు సరిపడా గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. 12నెలలకు వేతనం ఇవ్వాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రస్తుతం కార్మికులకు ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించకూడదని, ఇప్పటికే తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు సునీత, ఎల్లెమ్మ, డి వరలక్ష్మి, బి. తిరుపతమ్మ, జి.అరుణ, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

వినపతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు, వంట ఏజెన్సీ నిర్వహకులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి : సీఐ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో నిర్వాహకులు వెంటనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ పి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఉక్కు కళావేదికలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలతో పోలీసులు సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నేరనియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ జి.రాజు, పోలీసు సిబ్బంది, మత పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్ఐ రాజు

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ శాఖలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి అధికారి పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల నియామకం చేపడతామన్నారు. విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేట్, ట్రయిబుల్ స్టడీస్ లేదా సోషియాలజీ, సోషల్‌వర్క్, యాంత్రోలజీ(స్టడీ ఆఫ్ హ్యూమన్) పబ్లిక్ అడ్మినిస్టేషన్ లేదా రూరల్ డెవలప్‌మెంట్ ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక పోస్టు, జిల్లా స్థాయిలో నాలుగు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కార్యదర్శులతో సమావేశం

వీరులపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజు ఆదేశించారు. మండలంలోని జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాలలో నీటినిల్వలు లేకుండా ఉండేలా కార్యదర్శులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైన్‌లలో పూడికతీసి మురుగు పారుదలయ్యేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు.

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు ఘనసత్కారం

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను సత్కరిస్తున్న ఏసీపీ తిలక్, సీఐ నాయుడు

నందిగామటౌన్: క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని ఏసీపీ తిలక్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లు కేవీ ఆంజనేయులు, పి.శివ, మధుబాబు, సాయిబాబు, మస్తాన్‌రావు, జె.బాబు, తిరుపతిరావులను గురువారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పని చేయటం అదృష్టంగా భావించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని ఎక్కడ పనిచేస్తున్నామని కాకుండా ఎంతమందికి మేలు చేసేలా పని చేస్తున్నామనే విధంగా విధినిర్వహణ ఉండాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అవలంభిస్తూ నిస్వార్థ సేవలందించే ఉద్యోగులకు ప్రజల హృదయాల్లో ఎల్లవేళలా సుస్థిర స్థానం ఉంటుందని పేర్కొన్నారు. సీఐ వైవిఎల్ నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆగిరిపల్లి: మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంపీడీఓ బి.బార్గవి అన్నారు. ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వండిన పదార్థాలు రుచిగా ఉంటున్నాయా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ భార్గవి, ఎంఈఓ ఆనంద్ కుమార్ మధ్యాహ్నం భోజనం చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్పోస్టర్ల ఆవిష్కరణ

నూజివీడు: చింతలపూడిలో ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ ఏలూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు కోరారు. మహాసభల వాల్పోస్టర్లను నూజివీడు మండలం దిగవల్లిలో గురువారం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభల సందర్భంగా జులై 5న చింతలపూడిలో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. సీపీఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నదానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక దివ్యాంగుల సేవా సంస్థలో గురువారం అన్నదానం చేశారు. లయన్ డీవీ రామిరెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శి ఎ.సురేష్, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్లు బి.కృష్ణారెడ్డి, బుల్లిరాజు చౌదరి, నాగిరెడ్డి, సతీష్రెడ్డి, వెంకటేశ్వరరావు, నిర్వాహకురాలు బండి అమల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల వేడుక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి హజ్రత్ బోడ్లేసావలి దర్గా ఉరుసు మహోత్సం ముస్లింలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మొహర్రం పండుగ మాసం పురస్కరించుకుని పీర్ల పంజా వద్ద పీర్లను వివిధ రకాల పూలతో అలంకరించారు. పీర్లను చేతపట్టుకుని నిప్పుల గుండాలు తొక్కారు. సూఫీ మత గురువు సయ్యద్ అల్తాఫ్ రజా భక్తులకు పానకం, ప్రసాదం అందజేశారు. కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని అజింఖా పంజా వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

జి.కొండూరు: కవులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కె.రాజమణి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పినపాక పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తాను పనిచేసిన కవులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువ చేసే కంప్యూటర్ను గురువారం ప్రధానోపాధ్యాయుడు జీవీ రామకృష్ణ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ అక్బర్ పాషా, ఉపాధ్యాయుడు విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు బదిలీ అయిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు, ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు కృషి చేసిన ఉపాధ్యాయులు నరేంద్ర, ప్రియదర్శిని, భరతకుమారి, శారద, పద్మావతి, సావిత్రిలను అభినందించారు.

ఘనంగా జగన్నాథుని రథయాత్ర



ఆగిరిపల్లి: మండలంలో జగన్నాథ స్వామి రథయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథ స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. గోపాలపురం ఎన్ఆర్ఐ కళాశాల నుంచి నెక్కలం గొల్లగూడెం అడ్డ రోడ్డు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు స్వామి వారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ రావి వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజారులో దళారులదే రాజ్యం

- అధిక ధరలకు కూరగాయల విక్రయాలు
- వినియోగదారుల జేబులకు చిల్లు
- పట్టించుకోని అధికారులు
- అద్దె స్థలంలో రైతు బజారు నిర్వహణ

ఇబ్రహీంపట్నం రైతుబజారులోని దుకాణాలు (ఇన్సెట్) రైతుబజారు స్థలంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవన నిర్మాణం

ఇబ్రహీంపట్నం: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఇబ్రహీంపట్నం రైతుబజారు 2000లో ఏర్పాటు చేశారు. రైతు బజారులో రైతుల పేరుతో దళారులు రాజ్యమేలుతున్నారు. అధిక ధరలకు అమ్ముతూ వినియోగదారుల బేబులకు చిల్లు పెడతున్నారు. కూరగాయల ధరల బోర్డులు కూడా కనిపించకుండా చేసి ధరలు పెంచి వినియోగదారులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. రైతు బజారు స్థలం కూడా ఎన్టీటీపీఎస్ సంస్థది కావడంతో సంస్థ అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది. కూటమి నాయకుల పైరవీలు రైతు బజారుపై యథేచ్ఛగా కొనసాగడం గమనార్హం.

ధరల మాయాజాలం

రైతుబజారులో మార్కెటింగ్ శాఖ ప్రతి రోజూ నిర్ణయించే ధరలు ఇక్కడ అమలుకావడం లేదు. ధరల పట్టిక బోర్డు కూడా కనిపించకుండా మాయాజాలం చేయడంలో ఇక్కడి వ్యాపారులది అందెవేసిన చెయ్యి. ఒక వేళ బోర్డు కనిపించినా బోర్డులో ఉన్న రేట్ల కంటే రూ.4 నుంచి రూ.5 వరకు అదనంగా ధర పెంచి అమ్ముతుంటారు. ఇదేమిటని వినియోగదారులు ప్రశ్నిస్తే బోర్డుపై రేటుకు కుళ్లిపోయిన కూరగాయలు వస్తాయని బుకాయిస్తారు. ప్రశ్నించిన వినియోగదారులను హేళన చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. దళారులు అనే నింద తొలగించుకునేందుకు ఈమధ్య కాలంలో రైతు, వ్యాపారి(దళారి) పేరుతో ఐడీ కార్డులు సృష్టించి రైతు బదులుగా వ్యాపారి అమ్ముతున్నాడనే వింతపోకడలకు తెరతీశారు. నిజమైన రైతులు వాహనదారులను ఆసరాగా చేసుకుని నాలుగు కూడళ్ల కలిగిన రోడ్లపై కూరగాయలు అమ్ముకోవడం గమనార్హం.

లీజుతోనే రైతు బజారు నిర్వహణ

ఎన్టీటీపీఎస్ సంస్థ స్థలాన్ని లీజుకు తీసుకుని సుమారు 25 దుకాణాలతో రైతుబజారును 2000లో ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది లీజు ఆర్డర్ పొడిగించుకుంటున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రైతుబజారులో ఖాళీగా ఉన్న స్థలంలో వార్డు సచివాలయ భవన నిర్మాణం చేట్టారు. భవనం రెండస్తుల నిర్మాణం పూర్తయిన అనంతరం ఎన్టీటీపీఎస్ అధికారులు భవన నిర్మాణాన్ని నిలిపివేశారు. భవన నిర్మాణం జరిగి ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారేది. రైతు బజారును కూడా ఎప్పుడు ఖాళీ చేస్తారో తెలియని పరిస్థితి. రైతుబజారు భవిష్యత్ ఎన్టీటీపీఎస్ అధికారులు దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది.

కూటమి నాయకుల హవా

రైతుబజారు నిర్వహణలో కూటమి నాయకుల హవా కొనసాగుతోంది. వారు చెప్పిన వారికే షాపులు కేటాయింపు జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓ వ్యక్తి సొంతంగా దుకాణం నిర్మించుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఈ విషయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకున్నప్పటికీ ఆ వ్యక్తి కూటమికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ సమీప బంధువు కావడంతో మిన్నకుండిపోయారు. నిర్మాణం అనంతరం పలుకుబడి ఉపయోగించి అనుమతులు తెచ్చుకున్నారు. రూ.1.50 లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణం రెండేళ్ల తర్వాత షాపు అతనికి దక్కకుంటే ఖర్చు ఎవరు చెల్లిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది.

భవన నిర్మాణాన్ని అడ్డుకోవడం దుర్మార్గం

రైతుబజారు స్థలంలో నూతన సచివాలయ భవన నిర్మాణాన్ని అడ్డుకోవడం దుర్మార్గం. ఎన్టీటీపీఎస్ సంస్థ కూడా ప్రభుత్వ భాగస్వామ్యమే కదా. అలాంటప్పుడు సచివాలయ భవన నిర్మాణం ఎందుకు అడ్డుకున్నారు. భవన నిర్మాణం పూర్తయి ఉంటే అందులో ప్రజలు వివిధ రకాల సేవలు అందుకునే అవకాశం ఉండేది.

– కె.బసవయ్య, వినియోగదారుడు

లక్ష్యానికి దూరంగా రైతుబజార్లు

రైతుబజార్లు లక్ష్యానికి దూరంగా పనిచేస్తున్నాయి. రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు బజార్లు రైతులకు ఉపయోగపడటం లేదు. కనీసం గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదు. వ్యవసాయ పనుల సీజన్లో రైతులు కూర్చుని కూరగాయలు అమ్ముకోలేక పోవడం వలన దళారులు రాజ్యమేలుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– మల్నీడి యలమందరావు, రైతు సంఘం నాయకుడు

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్రాజ్

నూజివీడు: విపత్తుల సమయంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్రాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం డివిజన్లోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో విపత్తుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని, నష్టాన్ని సాధ్యమైనంత తక్కువకు తగ్గించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో వరదలు వచ్చే ప్రాంతాల్లో ముంపునకు గురికాకుండా గట్లు వేసుకోవాలని చెప్పారు. డివిజన్లో గతంలో చాలా చెరువులకు గండ్లు పడ్డాయని, ఆ గండ్లను త్వరితగతిన పూడ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, డివిజన్లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇరిగేషన్, విద్యాశాఖ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖాధికారులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

తిరువూరు: తమ వార్డులో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని తిరువూరు 9వ వార్డు వాసులు గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కోరారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 9వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యేకు మహిళలు సమస్యలు వివరించారు. మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకునే విధంగా నగర పంచాయతీ అధికారులను ఆదేశించాలని వారు కోరారు.

ఎమ్మెల్యే ఆదేశాల మేరకే అక్రమ కేసులు

సీపీఎం నేత పీవీ ఆంజనేయులు ధ్వజం

మాట్లాడుతున్న ఆంజనేయులు, సుధాకర్ తదితరులు

మైలవరం: రోడ్లను బాగుచేయమనడం నేరమా ఎమ్మెల్యే గారూ అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని అడిగినందుకే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీపీఎం నాయకుడిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షం ఉండకూడదనే ఉద్దేశంతోనే స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్పై కేసులు బనాయించారన్నారు. మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా దెబ్బతిని ఏడాది కావస్తోందని, ఈ క్రమంలో ప్రభుత్వం రోడ్డు వేస్తామని చెప్పి జేసీబీతో పూర్తిగా తొలగించి ఐదు నెలలుగా అలాగే వదిలివేసిందన్నారు. ప్రజల అవస్థలు గమనించిన సీపీఎం మైలవరం మండల కమిటీ వెల్వడం, గణపవరం, చంద్రాల గ్రామస్తులతో కలిసి రెండుసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. అయినా అధికారులు స్పందించలేదని, ఈ నేపథ్యంలోనే గత మంగళవారం గణపవరం అడ్డరోడ్డు వద్ద మరోసారి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీస్ అధికారులు దురుసుగా ప్రవర్తిస్తూ సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంచి పాత ఉద్యమ కేసులు అన్నీ కలిపి, నేర చరిత్ర చూపుతూ దుండగులు అనే పదాలు ఉపయోగిస్తూ బైండోవర్ కేసు బనాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తప్పుడు కేసులు బనాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన అటవీ భూముల ఆక్రమణ

ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ సభ్యులు

చాట్రాయి: భూ స్వాములు కబ్జా చేసిన అటవీ భూములను సీపీఐ ఎంఎల్ లిబరేషన్ స్వాధీనం చేసుకుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చీపురుగూడెం అటవీ భూమిలో సుమారు 10 ఎకరాలను కొంత మంది భూ స్వాములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ భూమిని లిబరేషన్ సభ్యులు అబ్బదాసరి సుందరం, తగరం తిరుపతిరావు, రేగుల రాముడు ఎర్ర జెండాలు పాతి స్వాధీనం చేసుకున్నారని, ఈ భూమిని ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకోవాలని పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 645–7ఏలో 51.25 ఎకరాల సీలింగ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలిచ్చిందని, ఆ భూములను సాగు చేసుకుంటున్న పేదలను ఫారెస్టు అధికారులు సాగు చేసుకోనీయకుండా వెళ్లకొట్టారని చెప్పారు. ఇప్పటికైనా భూ స్వాములు సాగు చేసుకుంటున్న అటవీ భూమలపై జాయింట్ సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండల సభ్యులు హెచ్.రాజేంద్ర ప్రసాద్, అబ్బదాసరి కిశోర్, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో డెంగీ నివారణ

ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆగిరిపల్లి: డెంగీ వ్యాధి నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి జాస్తి జగన్మోహన్రావు అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లిలో వైద్య సిబ్బందితో స్థానిక పీహెచ్సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ప్రదర్శన

తిరువూరు: డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా తిరువూరులో గురువారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన వీధుల మీదుగా సాగింది. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు మాట్లాడుతూ జూలై నెలను డెంగీ, మలేరియా వ్యతిరేక మాసంగా జరపాలని, డెంగీ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారి శ్రీనివాసరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబావలి, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పిటిషన్పై ఆర్డీఓ విచారణ

మైలవరం: రెడ్డిగూడెం శివారు గోపాలపురం గ్రామంలో చిన్నం సత్యనారాయణ దాఖలు చేసిన పీజీఆర్ఎస్ పిటిషన్పై విచారణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విజయవాడ టి.త్రివిక్రమరావు, తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం జాయింట్ ఇన్స్పెక్షన్ చేశారు. మండలంలోని ముచ్చనపల్లి గ్రామంలో 22ఏ ఫైల్ పర్సనల్ ఇన్స్పెక్షన్ కూడా ఆర్డీఓ మాధురి చేశారు. స్థానిక పెట్రోల్ బంక్లు, రేషన్ షాపు 13ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె. సుశాలాదేవి, తిరువూరు డీఐ సర్వే సారంగపాణి, పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శివనాగరాజు, మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయనపాడులో రైల్వే ఫ్లై ఓవర్ పరిశీలన

రాయనపాడులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన జాయింట్ ఇన్స్పెక్షన్ గురువారం జరిగింది. రాయనపాడు గ్రామంలో శాంతినగర్ నుంచి చెరువు అవతలి వైపునకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించే విధంగా అధికారులు ఒక ప్రైవేటు సంస్థ ద్వారా ఎలైన్మెంట్ తయారు చేయించారు. పాత ఎలైన్మెంట్లో వ్యవసాయ శాఖకు చెందిన రైతు సేవా కేంద్రం తొలగించే అవకాశం ఉంది. రైతు సేవా కేంద్రం యథావిధిగా ఉండేలా మార్పు చేసి ఎలైన్మెంట్ తయారుచేసే విధంగా అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్లో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అధికారుల సూచనలను గ్రామస్తులు సున్నితంగా వ్యతిరేకించి పాత ఎలైన్మెంటు ప్రకారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారులు, గ్రామస్తుల అభిప్రాయాలకు స్వల్ప తేడాలు ఉండటంతో అధికారులు ఆయా ప్రాంతాల పరిశీలనతో వెనక్కి వెళ్లారు. రైల్వే, రెవెన్యూ, ఆర్అండ్బీ, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ట్రాన్స్కో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యులు

తిరువూరు: ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. జూలై 10 వరకు అన్ని గ్రామాల్లో జీవాలకు ఈ మందు వేస్తామని పశుసంవర్ధక శాఖ ఎన్టీఆర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం. హనుమంతరావు తెలిపారు. జీవాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎ.కొండూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటక శివారెడ్డి, ఎ.కొండూరు మండల పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రామారావు, పశువైద్యాధికారి భరత్ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం తనిఖీ

ఆగిరిపల్లి: పోతవరప్పాడులోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఎంపీడీఓ బి.భార్గవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంపద తయారీ కేంద్రంలోని తొట్టిలో తయారవుతున్న వర్మీ కంపోస్ట్ సేంద్రియ ఎరువును పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసి దాని నుంచి పంచాయతీలు సంపద సృష్టించుకోవాలని సూచించారు.

హిందీ నేర్చుకుంటే ఉజ్వల భవిత

దక్షిణ భారత హిందీ ప్రచారసభ ప్రచారక్ రఘునందన్

విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తిరువూరు: విద్యార్థులు హిందీ భాషలో పట్టు సాధిస్తే దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందవచ్చని దక్షిణ భారత హిందీ ప్రచారసభ ప్రచారక్ రేపాక రఘునందన్ అన్నారు. స్థానిక శ్రీనిధి స్కూల్లో గురువారం ప్రచార సభ నిర్వహించిన హిందీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏటా రెండుసార్లు జరిగే హిందీ వార్షిక పరీక్షలకు హాజరై పదో తరగతి పూర్తయ్యే నాటికి అన్ని స్థాయిల పరీక్షలూ పాసైతే త్వరితగతిన ఉద్యోగం పొందవచ్చన్నారు. ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద పూర్వార్ధ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ ఆఫ్రీన్, హర్షియా, విష్ణుప్రియ, షణ్ముఖ వర్షిని, హాసిని, జోన్దేవ్ నాగ్, వోజశ్విత, నాగపుత్రిక, సాత్విక్లను రఘునందన్ అభినందించారు. పాఠశాల కరస్పాండెంటు కిశోర్, డైరెక్టర్ మహేష్, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, హిందీ ఉపాధ్యాయుడు షేక్ బాజీ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సంసిద్ధత మానిటరింగ్ అధికారి, డైట్ అధ్యాపకుడు ఎన్. జోజిబాబు గురువారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన జోజిబాబు గత విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు, మధ్యాహ్న భోజనం సరఫరా, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ, ఈ ఏడాది విద్యార్థుల చేరికలు తదితర వివరాలను పరిశీలించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కె. శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయాపై దాడికి నిరసన

తిరువూరు: విస్సన్నపేట మండలం రామానగరం అంగన్వాడీ కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న ఆయా కొమ్ము నాగమణిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల యూనియన్ డిమాండ్ చేసింది. ఆయాపై దాడిని నిరసిస్తూ తిరువూరు జంట సినిమాహాల్స్ సెంటర్లో యూనియన్ సభ్యులు గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయా నాగమణిపై దాడికి పాల్పడిన చిన్నోడు, ద్రాక్షావళి, జీనత్లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్లపై మాంసం విక్రయాలు నిషేధించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కొండపల్లిలోని మార్కాపురం ప్రాంతంలో రోడ్లపై నిర్వహిస్తున్న మాంసం విక్రయాలను నిలిపివేయాలని ఎంసీపీఐ మండల కార్యదర్శి కలకోటి బసవయ్య గురువారం ఒక ప్రకటనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారానికి మూడు రోజులు రోడ్లపై జరుపుతున్న మాంసం విక్రయాల వలన దుర్వాసనతో సమీపంలోని చర్చికి వచ్చే వారు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను గతంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి రోడ్లపై మాంసం విక్రయాలు నిలిపివేయాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడులో గురువారం హ్యూమన్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి కోట పుల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కోట పుల్లారావు శిబిరాన్ని ప్రారంభించారు. సాధారణ వ్యాధుల గుర్తింపునకు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు దారా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కార్మికులపై బెదిరింపులు ఆపాలి

తిరువూరు: తమ న్యాయమైన కోర్కెల సాధనకు ఆందోళన బాట పట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులపై అధికారులు బెదిరింపులకు పాల్పడటం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల యూనియన్ నిర్ణయం మేరకు ఆందోళనల్లో పాల్గొంటున్న తమపై మున్సిపల్ అధికారులు బెదిరింపులకు పాల్పడటాన్ని నిరసిస్తూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. శుక్రవారం చలో విజయవాడ కార్యక్రమం అనంతరం సమ్మెపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

బాలికల గురుకుల పాఠశాల పరిశీలన

ముసునూరు: సమాజంలో నెలకొన్న విపత్కర పరిస్థితులు, వింత పోకడల విషయంలో బాలికలంతా జాగ్రత్తగా నడుచుకోవాలని ఏపీ స్టేట్ మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గురువారం స్థానిక ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలను నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్రాజ్తో కలిసి ఆమె సందర్శించారు. పాఠశాల వసతులు, సౌకర్యాలు, అవసరాలపై ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ కేవీ రమణ, ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ పి.విజయకుమారి తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: జూలై 9న జరిగే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం తాడేపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,578 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

వైభవంగా సత్యసాయి రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం గురువారం నరసరావుపేట చేరుకుంది. భక్తులు సత్యసాయి పాదుకలను దర్శించుకున్నారు.

ఏకపక్ష వైఖరికి కత్తెర పడేనా?

జెడ్పీటీసీల అంగీకారం లేకుండా అడ్డగోలుగా పనులు కేటాయింపుపై వ్యతిరేకత

ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి జెడ్పీ చైర్‌పర్సన్ ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజావసరాలను గుర్తించి పనులకు సభ్యుల ఆమోదంతో నిధులు కేటాయించాల్సి ఉన్నా అడ్డదారిలో మంజూరు చేయడం కమీషన్ల కోసమేననే ఆరోపణలకు తావిస్తోంది. నేడు జరగబోయే సర్వసభ్య సమావేశంలో దీనిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు మరోమారు నిరసన గళం వినిపించే అవకాశం ఉంది.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- చైర్‌పర్సన్ ఏకపక్ష ధోరణిపై వైఎస్సార్ సీపీ సభ్యుల తీవ్ర అసంతృప్తి
- తాము గెలిచి ప్రయోజనమేంటని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీలు
- నిరసనగా గతంలో బడ్జెట్ సమావేశానికి గైర్హాజరు
- ప్రభుత్వానికి పంపి మరీ ఆమోదింపజేసుకున్న చైర్‌పర్సన్
- గతంలో జెడ్పీటీసీలకు తెలియకుండా రూ.12 కోట్ల పనులకు ముందస్తు అనుమతులు
- తాజాగా మరో రూ.10 కోట్ల మేరకు ఇదే తరహాలో అనుమతి

గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, అధికారులకు జెడ్పీ నుంచి ముందస్తుగా సమాచారాన్ని పంపారు. గత మార్చి 15న కోరం లేకపోవడంతో వాయిదా పడిన సమావేశం మరలా ఇప్పటి వరకూ జరగలేదు. 2024–25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌తో పాటు 2025–26 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు కీలకమైన సర్వసభ్య సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీలు గైర్హాజరు కావడంతో నిరవధికంగా వాయిదా పడింది.

చైర్‌పర్సన్ ఏకపక్ష ధోరణిపై వ్యతిరేకత

ప్రజల ఓట్లతో గెలిచిన జెడ్పీటీసీలకు సముచిత గౌరవాన్ని ఇవ్వకపోవడంతోపాటు ముందస్తు అనుమతుల పేరుతోనూ జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు చేస్తున్న ధోరణికి వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు మార్చి 15న ఏర్పాటు చేసిన బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించారు. జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా, సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురాకుండా పనులు మంజూరు చేస్తున్నప్పుడు ఇక తమకు విలువ ఎక్కడిదని నిలదీశారు. టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో రూ.కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తున్న తీరును ఖండించారు. వాటిలో కమీషన్లు, పర్సంటేజీ తీసుకుని అవినీతి, అక్రమాలతో జెడ్పీని నడుపుతున్నారని ఆరోపణాస్త్రాలు సంధించారు. మార్చిలో ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతోపాటు రూ.12 కోట్ల విలువైన పనులకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముందస్తు అనుమతులను ఇచ్చేయడంతో సమావేశానికి హాజరైన పక్షంలో సభ్యులు అంగీకారం తెలిపినట్లవుతుందనే కోణంలో గైర్హాజరయ్యారు. తద్వారా జెడ్పీటీసీలు తమ హక్కులను పరిరక్షించుకోవడంలో సఫలీకృతమయ్యారు.

అంగీకారం లేకుండానే పనులు

జెడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సభ్యుల అంగీకారం తప్పనిసరి. ఏ గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేపడుతున్నారనే విషయాన్ని అజెండాలో పొందుపర్చి, సర్వసభ్య సమావేశంలో చర్చించాలి. సభ్యులు అంగీకరించిన తరువాతే వాటిని ఆమోదిస్తారు. అయితే గుంటూరు జెడ్పీలో సభ్యుల అంగీకారం లేకుండా ఏకపక్షంగా పనులు కేటాయింపు వ్యవహారం నడుస్తోంది. చైర్‌పర్సన్ ముందస్తు అనుమతుల పేరుతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు పనుల జాబితాను సిద్ధం చేసి, స్టాండింగ్ కమిటీలో పెట్టాక ఆమోదించేస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో 1వ, 7వ కమిటీలకు చైర్‌పర్సన్‌గా ఉన్న కత్తెర హెనీ క్రిస్టినా ఆమోదంతో సంబంధిత పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేస్తున్నారు.

అజెండాలో 'రూ.22 కోట్ల విలువైన పనులు'

చైర్‌పర్సన్ వైఖరితో మండలానికి ఒకరు చొప్పున ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న జెడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నారు. తాము ప్రజా ప్రతినిధులుగా గెలిచి ప్రయోజనమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. చైర్‌పర్సన్ ఏకపక్ష పోకడలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మార్చి 15న బడ్జెట్ సమావేశానికి గైర్హాజరు కావడంతో, అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపి ఆమోదింపజేసుకున్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో జెడ్పీటీసీలకు తెలియకుండా ముందస్తు అనుమతుల పేరుతో రూ.12 కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చేశారు. తాజా సమావేశంలో మరో రూ.10 కోట్ల మేరకు ముందస్తు అనుమతులు ఇచ్చారు. మొత్తం రూ.22 కోట్ల పనులను ఆమోదం కోసం శుక్రవారం జరగనున్న సర్వసభ్య సమావేశపు అజెండాలో పొందుపర్చారు.



ప్రైవేటు పాఠశాలల బంద్ విజయవంతం

మూతపడిన గుంటూరు అమరావతి రోడ్డులోని నారాయణ స్కూల్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ప్రవేశాల పేరుతో ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గురువారం విద్యాసంస్థలను మూసివేసి బంద్ పాటించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు పిలుపు మేరకు గుంటూరు నగరంతోపాటు జిల్లాలోనూ పాఠశాలలు మూతపడ్డాయి. విద్యాహక్కుచట్టంలోని 12 (1) సీ ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విషయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, సీట్ల కేటాయింపు ప్రక్రియలో ప్రభుత్వం, విద్యాశాఖ పక్షపాత ధోరణితో వ్యవహరించడం, ఫీజుల చెల్లింపు విషయమై స్పష్టత లేకపోవడంతో పాటు విద్యాశాఖాధికారుల బెదిరింపు ధోరణులు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం, రాజకీయంగా ఒత్తిడి తెస్తున్న సంఘటనలను యాజమాన్యాలను తీవ్రంగా నిరసిస్తున్నాయి.

సాగర్, పులిచింతలలో చేపల వేట నిషేధం

నరసరావుపేట: జిల్లాలోని లైసెన్స్‌డ్ రిజర్వాయర్లు నాగార్జున సాగర్, కేఎల్ రావు పులిచింతలలో చేపల సంతానోత్పత్తి సమయమైన జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు (62 రోజులు) వేట నిషేధం అమలులో ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రిజర్వాయర్లో లైసెన్సు తీసుకొని వేట కొనసాగించే మత్స్యకారులు ఎవరూ ఆ సమయంలో వేటకు వెళ్లవద్దని, దానికి భిన్నంగా ఎవరైనా వేటకు ఉపక్రమిస్తే వారి లైసెన్సు రద్దుచేసి, అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

ఒరిగిన అమరేశ్వరాలయ రాజగోపురం తలుపు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానం దక్షిణరాజగోపురానికి అమర్చిన రెండు తలుపుల్లో ఒక తలుపు పక్కకు ఒరిగిపోయింది. బుధవారం రాత్రి దేవాలయ భద్రతా సిబ్బంది తలుపులు మూస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ మాట్లాడుతూ రాజగోపుర తలుపు మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో వేగంగా వచ్చిన ఓ కారు తలుపును ఢీ కొట్టటం వల్ల ఇనుపరాడ్ వంకర వచ్చిందన్నారు. ఈతరహా తలుపులు మరమ్మతులు చేసే వడ్రంగ నిపుణులను పిలిపించటానికి ఏర్పాట్లు చేశామని రెండుమూడు రోజులలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. అప్పటివరకు గాలిగోపురం వద్ద సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు. అలాగే పోలీసుల సహకారంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు రక్షణ కల్పిస్తామని తెలిపారు.

నేడు భూ సమీకరణ గ్రామ సభలు

తాడికొండ: తాడికొండ మండలం దామరపల్లి, ఫణిదరం, బండారుపల్లి గ్రామాల్లో భూ సమీకరణ కోసం ఎమ్మెల్యే అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తాడికొండ తహసీల్దార్ మెహర్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఫణిదరం, 11 గంటలకు దామరపల్లి, 12 గంటలకు బండారుపల్లి గ్రామాల్లో గ్రామ సభ జరగనుంది. రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

సీఎస్ సమీక్షకు హాజరైన కలెక్టర్

నరసరావుపేట: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే కలెక్టరేట్ నుంచి వర్చ్యువల్‌గా హాజరయ్యారు. పీ–4, పాజిటివ్ పబ్లిక్ పెర్సప్షన్, మహిళా స్వయం శక్తి సంఘాలకు వార్షిక క్రెడిట్ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్, మైక్రో క్రెడిట్ ప్లాన్, పోషణ్ ట్రాకర్, బాల సంజీవని లబ్ధిదారుల ఫేషియల్ అథంటికేషన్, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ప్రాజెక్టు, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, రుతుపవన సన్నాహక చర్యలు, అంశాలపై సమీక్ష చేశారు. దీనిలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ ఏకా మురళి, సీపీఓ శ్రీనివాసమూర్తి, పలువురు జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రేవుల్లో పడవలు తిప్పుకొనేందుకు వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కృష్ణానది రేవుల్లో పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ అధ్యక్షతన సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించారు. ఆరు రేవులకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పడవలు, బల్లకట్టు తిప్పుకొనేందుకు హక్కులు కల్పిస్తూ సీల్డ్ టెండరు, బహిరంగ వేలంలో అచ్చంపేట, అమరావతి మండలాల్లోని నాలుగు రేవులను పాటదారులు దక్కించుకున్నారు. మాచవరం, కొల్లిపర మండలాల్లోని రేవులకు జరిగిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో వాటిని వాయిదా వేశారు.

త్రికోటేశ్వరస్వామి ఆదాయం రూ.82.05 లక్షలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి 126 రోజుల హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. మొత్తం రూ.82,05,746లు ఆదాయం రాగా, వాటిలో కొండ పైభాగాన ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.74,54,621లు, మెట్ల మార్గంలో ఏర్పాటుచేసిన హుండీ ద్వారా రూ.1,72,385, అన్నదానానికి రూ.5,78,740 లభించిందని ఆలయ సహాయ కమిషనర్ డి.చంద్రశేఖరరావు వెల్లడించారు. బంగారం 28.500గ్రాములు, వెండి 562.500గ్రాములు భక్తులు సమర్పించారన్నారు. వివిధ దేశాల కరెన్సీ సైతం లభించిందన్నారు.

గుర్తింపు ఏదీ?

- నత్తనడకన కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీ
- ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా పావు వంతు మందికీ అందించని వైనం
- జిల్లాలో 2025-26 సీసీఆర్సీ కార్డుల జారీలక్ష్యం 67 వేలు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఇచ్చింది కేవలం 8వేలే..
- జిల్లావ్యాప్తంగా 421 రైతు సేవా కేంద్రాలు

సత్తెనపల్లి: జిల్లాలో కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది కౌలు రైతులకు అందించే సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్సీ) అందుతాయో లేదో అన్న బెంగ రైతులను వెంటాడుతోంది. సీసీఆర్‌సీ కార్డు లేకపోతే ప్రయోజనాలు అందవని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కౌలు రైతులకు అన్ని విధాల మేలు జరిగింది. వారికి సీసీఆర్‌సీ కార్డులు అందజేయడంతో పాటు విత్తనాలు, ఎరువులు కూడా అందించింది. అంతేకాకుండా సాధారణ రైతులకు ఇచ్చిన విధంగా వారికి వైఎస్సార్ రైతు భరోసా పథకం ఆర్థిక సహాయాన్ని అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

లక్ష్యానికి సుదూరం

ఈ ఏడాది 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 421 రైతుసేవా కేంద్రాల ద్వారా 67 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే ఇంతవరకు కేవలం 8,333 మందికి అంటే కేవలం 12.44 శాతం మందికి మాత్రమే సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలు కార్డులు అందాయి. ఇంకా 58,667 మందికి కార్డులు అందించాల్సి ఉంది. జిల్లాలో అత్యధికంగా సత్తెనపల్లి మండలంలో 2,137 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేయగా.. అత్యల్పంగా పిడుగురాళ్లలో కేవలం ఆరుగురు కౌలురైతులకు మాత్రమే కార్డులు పంపిణీ చేయడం గమనార్హం. ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రైతులు కొన్నిచోట్ల పంటల సాగుకు ఉపక్రమించగా, మరికొన్ని చోట్ల పొలాలను సిద్ధం చేస్తున్నారు. కార్డుల జారీలో ప్రభుత్వం అలసత్వంపై రైతులు ఆవేదన చెందుతున్నారు.



రెంటపాళ్లలో సీసీఆర్‌సీ కార్డు అందుకుంటున్న కౌలు రైతు

అవగాహన అవసరం

సీసీఆర్‌సీ కార్డుల మంజూరుకు సంబంధించి అసలు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు చొరవ చూపాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ కార్డు వల్ల కౌలు రైతుకు కేవలం 11 నెలల కాలంలో పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఉండదన్న విషయాన్ని వివరించాల్సి ఉంది. కార్డు ఉంటే విపత్తుల వేళ పంట నష్టపరిహారం పొందేందుకు, అలానే ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు వీలుంటుంది.

జిల్లాలో సీసీఆర్‌సీ కార్డులు జారీ ఇలా ...

డివిజన్	లక్ష్యం	పంపిణీ చేసినవి	పంపిణీ శాతం	చేయాల్సినవి
నరసరావుపేట	26,391	2,516	9.53	23,875
సత్తెనపల్లి	20,728	4,574	22.07	16,154
గురజాల	19,881	1,243	6.25	18,638
మొత్తం	67,000	8,333	12.44	58,667

కౌలు రైతులందరికీ కార్డులు

జిల్లాలో కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు అందచేస్తాం. పీఎం కిసాన్‌పై దృష్టి పెట్టాం. దీనిని కౌలు రైతులకు కూడా వర్తింప చేయనున్నాం. ఖరీఫ్ సీజన్‌కు ఇంకా సమయం ఉంది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అసలు నమోదు కాని వారి పై ప్రత్యేక దృష్టి పెట్టాం. వెబ్‌లాండ్ ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేయాల్సి ఉంది.

–ఎం.జగ్గారావు,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

రాయితీ నష్టపోయే ప్రమాదం

పంట కాలం 11 నెలలు కావడంతో బ్యాంకులు, సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు సరిగ్గా 11వ నెలలో తీసుకున్న మొత్తం వడ్డీతో కలిసి చెల్లిస్తే వెంటనే కొత్త రుణం జారీ చేస్తారు. ఆ తర్వాత వడ్డీ రాయితీ బ్యాంకులో జమవుతుంది. అయితే కార్డు జారీ మూడు వారాలు ఆలస్యం కావడంతో జూన్ మొదటి మూడు వారాల్లో రుణాలు తీసుకున్న రైతులకు రాయితీ ప్రయోజనం దక్కడం లేదని వాపోతున్నారు. కార్డుల జారీలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అక్కసుతో ధ్వంస రచన!

- వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేసిన రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన మున్సిపల్ సిబ్బంది
- టీడీపీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన శిలాఫలకం జోలికి వెళ్లని వైనం
- రాజకీయ కుట్రలో భాగంగానే అంటున్న పరిశీలకులు

పిడుగురాళ్ల: జానపాడు రోడ్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసిన జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని గురువారం మున్సిపల్ సిబ్బంది ధ్వంసం చేశారు. అయితే ఆ శిలాఫలకం ఎదురుగా కూటమి ప్రభుత్వం నేతలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు ఇటీవల ప్రారంభించిన శిలాఫలకం జోలికి వెళ్లకపోవడం గమనార్హం.

వైఎస్సార్ సీపీ గుర్తులు చెరిపేయాలనే కుట్ర..

జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులది.. తొలగించిన తర్వాత నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేపడతారు. ఈ క్రమంలోనే మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగిస్తూ వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన శిలాఫలకాన్ని కూడా ధ్వంసం చేశారు. దీనిపై స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకం ధ్వంసం రాజకీయ కుట్రలో భాగమేనని, కూటమి నాయకులు కావాలనే ఈ కుట్ర చేశారని ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలఫలకాలను ఇలా ధ్వంసం చేయటం సరికాదని, ఇది దుస్సంప్రదాయానికి దారితీస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

తొలగించకుండా అలాగే ఉంచిన కూటమి నేతలు ప్రారంభించిన శిలాఫలకం

ఆక్రమణల తొలగింపులో భాగంగానే..

దీనిపై మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులును వివరణ కోరగా జానపాడు బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నామని, అందులో భాగంగానే తమ సిబ్బందే శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రారంభించిన శిలాఫలకాన్ని ఎందుకు వదిలేశారని ప్రశ్నించగా త్వరలో దాన్ని కూడా తొలగిస్తామని తెలిపారు.

కొలిక్కి రాని సచివాలయ ఉద్యోగుల బదిలీలు

- ఐదు ఆప్షన్లు ఇచ్చిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉద్యోగులు
- సిఫార్సు లేఖలు ఎక్కువగా రావడంతో తుది జాబితాపై అధికారుల కసరత్తు

నెహ్రూనగర్: సచివాలయ ఉద్యోగుల బదిలీలు గందరగోళంగా మారాయి. గుంటూరు అర్బన్ పరిధిలో జరిగిన బదిలీల్లో సిఫార్సు లేఖలతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఈ ప్రక్రియ చేపట్టారని ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. రూరల్ పరిధిలో కూడా ఇంకా గందరగోళం నెలకొంది. గ్రామ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బదిలీల ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఉమ్మడి జిల్లాలో వీరి బదిలీల ప్రక్రియ గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. మొత్తం 874 మంది ఉండగా.. సిఫార్సు లేఖలను దృష్టిలో పెట్టుకుని తమను ఎక్కడికి బదిలీ చేస్తారో అని వేచిచూస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు పిలవకుండానే...

అర్బన్ పరిధిలో పనిచేసే వార్డు సచివాలయ ఉద్యోగులకు గత నెల 28, 29వ తేదీల్లో గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ పరిధిలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి సోషల్ వెల్ఫేర్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. గూగుల్ ఫాంలో 5 ఆప్షన్లు ఇవ్వాలని వారం క్రితం సూచించారు. ఆ మేరకు ఉద్యోగులు నమోదు చేశారు. ఇంత వరకు దీనిపై సమాధానం రాకపోవడంతో ఉద్యోగులు వారిని సంప్రదించారు. బదిలీల ప్రక్రియ నడుస్తోంది.. సమాచారం అందిస్తామని నేటికీ అధికారులు సమాధానం దాటవేస్తున్నారు.

సిఫార్సు లేఖలతో మల్లగుల్లాలు

సాధారణంగా బదిలీల ప్రక్రియ జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలి. ఆ వివరాలను హోల్డ్‌లో ఉంచి ఫించన్ల పంపిణీ తరువాత విడుదల చేయాలి. సామాజికి ఫించన్ల పంపిణీ చాలా వరకు పూర్తయినప్పటికీ బదిలీల ప్రక్రియ మాత్రం కొలిక్కి రాలేదు. కోరుకున్న గ్రామ సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వాలని సిఫార్సు లేఖలు కుప్పలు కుప్పలుగా ఉద్యోగులు ఇవ్వడంతో లిస్ట్ ఫైనల్ అయినప్పటికీ మార్పుచేర్పులతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం. కార్యాలయంలో రాత్రుళ్లు కూడా దీనిపైనే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్యను దీనిపై వివరణ కోరేందుకు ఫోన్ చేయగా, ఆయన సమాధానం ఇవ్వలేదు.

సోషల్ వెల్ఫేర్ కార్యాలయం

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని వివిధ రాష్ట్రాల అధికారులు గురువారం సందర్శించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సౌత్ క్యాంపస్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు, హరియాణా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్లు, ఆయా రాష్ట్రాల రెవెన్యూ అధికారులు విచ్చేశారని తెలిపారు. ఎస్‌టీఎంఏ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ తిరుమల కుమార్, కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్ తనూజ, జీఐఎస్ ఎక్స్‌పర్ట్ హరీష్, ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ

సత్తెనపల్లి: జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా 18వ మహాసభ ఈనెల 5వ తేదీ సాయంత్రం 3 గంటలకు సత్తెనపల్లిలోని ఎన్ఎస్ కెనాల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరుగుతుందని వేదిక సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు ఎం.ఏడుకొండలు గురువారం తెలిపారు. ఈ మహాసభకు వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. అందరూ పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

బెల్లంకొండ: మొహరం పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో పీర్ల పండగ సందడి మొదలైంది. గత నెల 26వ తేదీ నెలవంక దర్శనం ఇవ్వడంతో మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, వన్నాయపాలెం, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో పీర్ల పండగ ఏడవ సరిగెత్తు ఊరేగింపు కార్యక్రమాలను పీర్ల చావిడుల వద్ద వైభవంగా నిర్వహించారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల మొహరం. ఇదే నెలలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం జరిగింది. దీంతో ఆయన జ్ఞాపకార్థం పది రోజులపాటు సంతాప కార్యక్రమాలను జరుపుకొంటారు. ఇందులో భాగంగా ఊరూరా పీర్ల చావిడ్లలో పీర్లను కొలువుదీయించి, ప్రార్థనలు చేస్తారు. మండలంలోని గ్రామాల్లో మొహరం సందర్భంగా మతసామరస్యం వెల్లి విరుస్తుంది. కులమతాలకు అతీతంగా అందరూ పీర్ల ఊరేగింపులో పాల్గొంటారు. ఈనెల ఏడవ తేదీ సోమవారంతో మొహరం ఉత్సవాలు ముగుస్తాయని పీర్లచావిడిల నిర్వాహకులు తెలిపారు.

పథకాలను రైతులు వినియోగించుకోవాలి

మంగళగిరి: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామంలో పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో రైతులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అనేక వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలతో అధిక లాభాలను పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మంగళగిరి ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి శైలజారాణి, డీపీఎం రాజకుమారి, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఆదాయ పంటలపై దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే పంటలపై రైతులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. మండలంలోని నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో సాగు చేసిన ఉద్యాన పంటలను గురువారం పరిశీలించారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకొని రైతులు రెట్టింపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. సబ్సిడీలో అందించే సూక్ష్మ సేద్యం పరికరాల ద్వారా ఎరువుల వినియోగం, నీటి వినియోగం పొలంలో ప్రతి అంగుళానికి అందుతుందన్నారు. జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి పదివేల సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

■ రొంపిచర్ల మండలంలోని అన్నవరం గ్రామంలో రైతు లింగయ్యచౌదరి సాగు చేసిన జామతోటలో డ్రిప్పు సేద్యం పరికరాల పనితీరును పరిశీలించారు. నరసరావుపేట మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో పోతురాజు శివయ్య తోటలో వంగ, గులాబీ సాగును పరిశీలించారు. సూర్యఘర్ పథకం కింద తన ఇంటిపై సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేసుకున్న శివయ్యను జిల్లా కలెక్టర్ అభినందించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గుడ్లు, పాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని ఆదేశించారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఆంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖాధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ఎల్ఐసీని బలహీనపరచడం తగదు

కొరిటెపాడు(గుంటూరు): ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం విడనాడాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర యూనియన్లు జూలై 9వ తేదీన ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె జరగనుందని తెలిపారు. 85 శాతానికిపైగా ఎల్ఐసీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కూడా సమ్మెలో భాగస్వామిగా ఉందన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రస్తుతం ఉన్న 74 శాతం నుంచి వంద శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఎల్ఐసీ ఐపీఓ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రజల పొదుపును ప్రోత్సహించాలని, విదేశీ పెట్టుబడులు ప్రత్యామ్నాయం కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులని చెప్పారు. ఈ సంస్థల్లో ప్రభుత్వ వాటాల విక్రయం దేశ ప్రయోజనాలకు హానికరం అని స్పష్టం చేశారు. ఎల్ఐసీలో వేల సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, క్లాస్ 3, 4 క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ వెంటనే చేపట్టాలని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లకు తరలించడం నష్టదాయకమని పేర్కొన్నారు. ఎల్ఐసీలో 1996 నోటిఫికేషన్ ద్వారా నియమించబడిన ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఫెడరేషన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ విధించడం పాలసీదారులపై ఆర్థిక భారాన్ని మోపడమేనని, పైగా ఇది ప్రజలకు బీమాను దూరం చేయడమేనన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని దుయ్యబట్టారు. కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొనే ఈ సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలిపాలని కోరారు.

మాట్లాడుతున్న జి.కిషోర్‌కుమార్

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

అద్దంకి: దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు తిరుపతి రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కేర్ అండ్ క్యూర్ హోమియో క్లినిక్ ఆవరణలో బుధవారం జాతీయ సమ్మె పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సమావేశం కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ సమ్మెలో అన్ని ట్రేడ్ యూనియన్లు, ఎల్ఐసీ, కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు కలిసి సమ్మె చేస్తున్నట్లు వెల్లడించారు. కె.రఘుచంద్ మాట్లాడుతూ సమ్మెలో అందరూ పాలు పంచుకుని జయప్రదం చేయాలని కోరారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల వల్ల ఒక మహిళ ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. నూజిళ్ల మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన మరియకుమారి (35) అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. కుటుంబ కలహాలా.. లేదా ఇతర కారణాలనే అనే విషయం తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారంతో సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

76 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన శ్యామ్ సునీల్ కొల్లూరులో రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలో లోడ్ చేసుకొని రాత్రి సమయంలో తరలించటానికి ప్రయత్నించాడు. సుమారు 76 బస్తాల రేషన్ బియ్యాన్ని వట్టిచెరుకూరు మండలంలోని రైస్ మిల్లుకు తరలించటానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని వివిధ కంపెనీలకు చెందిన గోతాలలో ప్యాక్ చేసి ఆటోలో తరలించే యత్నం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన శ్యాం సునీల్, బుల్లెద్దు శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గాంధీ, అంబేడ్కర్‌లతో పోల్చుకునే అర్హత చంద్రబాబుకు లేదు

గాంధీ అధ్యయన కేంద్రం వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్

నరసరావుపేట: మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లతో పోల్చుకునే నైతిక అర్హత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏమాత్రం లేదని గాంధీ అధ్యయన కేంద్ర వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. నేను, గాంధీజీ, అంబేడ్కర్, ఎన్టీఆర్ అందరమూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారమే అయినా, అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకుని ఇంతస్థాయికి వచ్చామని కుప్పం సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్య విన్న జనాలు విస్తుపోయారన్నారు.

సత్యం, అహింసల వంటి శాశ్వత విలువల కోసం సత్య హరిశ్చంద్రుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తుల స్ఫూర్తితో అహర్నిశలు శ్రమించిన గాంధీజీకి, నిత్యం నోరు తెరిస్తే అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు చేసే చంద్రబాబుకు పోలిక ఎక్కడని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల వైతాళికుడు అయిన అంబేడ్కర్ ఎక్కడ?.. రెడ్ బుక్ రౌడీయిజపు రాజ్యాంగాన్ని అమలు చేయిస్తూ దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని కించపరచిన చంద్రబాబుకు పోలిక ఎక్కడని అన్నారు.

గాంధీ, అంబేడ్కర్లలో ఒకరు స్వాతంత్ర్య ప్రదాతగా, మరొకరు అంతులేని జ్ఞాన, గుణ సంపదల ఖనిగా, చరిత్రలో మహాపురుషులుగా నిలిచిపోయారని తెలిపారు. కానీ బాబు, అతని కుమారుడు మాత్రం అవకాశాలను దుర్మార్గంగా కిడ్నాప్ చేసి, పదవులు లాక్కొని అక్రమార్జనతో రూ.లక్ష కోట్లకు పడగలెత్తి దుష్పరిపాలన చేస్తూ చరిత్రహీనులుగా పతనమవుతున్నారన్నారు. గాంధీ అంబేడ్కర్‌ల వంటి త్యాగధనుల పేర్లను ఉచ్చరించే నైతిక అర్హత చంద్రబాబుకు లేదని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని హితవు పలికారు.

డీఎస్సీ నియామకాలు త్వరగా చేపట్టాలి

మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: డీఎస్సీ నియామకాలు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో వీలైనంత త్వరగా నియామకాలు నిర్వహించాలన్నారు. జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో డీఎస్సీ ఖాళీలు కూడా చూపించినందున మారుమూల ప్రాంతాలలో ఎక్కువ ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో త్వరగా మెరిట్ లిస్టు విడుదల చేసి తద్వారా సెలక్షన్ లిస్టు తయారు చేసి వెంటనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడకుండా నియామక ప్రక్రియ సత్వరం చేపట్టాలన్నారు. కొన్ని పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేని కారణంగా రిలీవర్లు లేక బదిలీలు ఆగి పోయాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, బొంతా రవి, చిలకా వీరయ్య, అట్లూరి శ్రీనివాసరావు, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ అవసరం

సీపీఆర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాజానాయక్

నరసరావుపేట: ట్రక్కు డ్రైవింగ్ నేర్చుకునే వారికి సీపీఆర్ ట్రైనింగ్ అవసరమని పల్నాడు జిల్లా రహదారి భద్రత కమిటీ మెంబర్ సెక్రటరీ, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.రాజానాయక్ అన్నారు. గురువారం రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను గురువారం సందర్శించి ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రీసెర్చ్ సెంటర్‌ను ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ట్రక్కు డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఆర్టీఓ ఆఫీసు పక్కనే ఉండటం వల్ల వాహనదారులకు లైసెన్సు మంజూరు సమయంలో నిర్వహించే పరీక్ష ఇక్కడ నిర్వహించుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వడానికి ఈ విభాగాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ పార్టనర్ కనకదుర్గ పద్మజ, ఎన్జీఓ సభ్యుడు బంగారయ్య పాల్గొన్నారు.

పునీత థామస్‌వారి అడుగుజాడల్లో నడవాలి

1900లో నిర్మించిన అతి పురాతన పునీత థామస్ వారి చర్చి

- రెవ.ఫాదర్ రాజరత్నం
- వైభవంగా పునీత థామస్‌వారి చర్చి 125వ వార్షికోత్సవం

పునీత థామస్ వారి చర్చిలో పవిత్ర సమష్టి దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు

తుమృకోట(రెంటచింతల): క్రీస్తు సూక్తులను నిత్యం ఆచరిస్తూ పునీత థామస్‌వారు క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడలలో నడిచి సమాజంలో నిజమైన క్రైస్తవులుగా జీవించాలని రెవ.ఫాదర్ ఎం.రాజరత్నం అన్నారు. గురువారం తుమృకోట గ్రామంలో నున్న పునీత థామస్‌వారి చర్చి 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విచారణ గురువులు మాలై పవిత్రన్ ఆధ్వర్యంలో రెవ.ఫాదర్ కొణతం ఎలీషారాజుతో కలిసి సమష్టి దివ్యపూజాబలి సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోనే తుమృకోట చర్చి అతి పురాతనమైందన్నారు. అపోస్తులు 12 మందిలో ఒకరైన థామస్ వారు భారతదేశంలో మొట్టమొదటిసారి క్రీస్తు సువార్తను ప్రచారం చేశారని గుర్తుచేశారు. భక్తులకు పులిహార పంపిణీ చేశారు. పెద్దలు అశోక్, మల్లి, దుగ్గింపూడి శౌరి రాయపురెడ్డి, రెంటచింతల కానుకమాత చర్చి దళ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టలు వార్డెన్‌కు విద్యార్థుల అప్పగింత

విద్యార్థులను వార్డెన్‌కు అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి

తెనాలి రూరల్: సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్న ముగ్గురు విద్యార్థులు ఉదయం టిఫిన్ చేసి స్కూలుకు అని బయలుదేరారు. కానీ వారు స్కూలుకు హాజరు కాలేదు. ఆ విషయం వార్డెన్‌కు కూడా తెలియదు. అనుమానాస్పదంగా రైల్వేస్టేషన్లో ఉండగా జీఆర్పీ కానిస్టేబుల్ గమనించారు. వెంటనే వార్డెన్‌కు సమాచారం ఇచ్చి క్షేమంగా విద్యార్థులను అప్పగించారు. ఎస్ఐ వెంకటాద్రి దీనిపై మాట్లాడుతూ.. కొల్లిపర మండలం దావులూరిపాలెంకు చెందిన ఎల్.కిషోర్ బాబు(12), వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన నాయుడు అభిరామ్ (13), రేపల్లె ఓల్డ్ టౌన్‌కు చెందిన ఎ.జితేంద్ర దర్శన్ (14) స్థానిక నాజరుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఉంటున్నారని తెలిపారు. స్కూలుకు వెళ్లకుండా స్టేషన్ వైపు వచ్చినట్లు చెప్పారు. వెంటనే వార్డెన్‌కు సమాచారం అందించి బాలలను అప్పగించినట్లు తెలిపారు. వార్డెన్ ఆదినారాయణను వివరణ కోరగా.. వారిలో ఇరువురికి ఇంకా స్కూలులో అడ్మిషన్ కాలేదన్నారు. హాస్టల్లో మాత్రం జాయిన్ అయ్యారని, చెప్పులు కొనుక్కునేందుకు ముగ్గురు స్టేషన్ సమీపంలోని షాపునకు వచ్చారన్నారు. అక్కడి నుంచి నీరు తాగేందుకు స్టేషన్‌లోకి వెళ్లగా పోలీసులు గమనించి తమకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

ఇసుక రీచ్‌లలో లారీలు నడపలేం

గుంటూరులో లారీ ఓనర్లు, డ్రైవర్ల ధర్నా

ప్రత్తిపాడు: అధికారుల వేధింపులు తాళలేమని, ఇసుక రీచ్‌లలో లారీలు నడపలేమని లారీ ఓనర్లు, డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని హోసన్నా మందిరం సమీపంలో లారీలను నిలిపివేసి జిల్లా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ రవాణాశాఖ అధికారులు ఓవర్ టన్నేజీ తోలేందుకు అభ్యంతరం తెలుపుతున్నారని, అందుకు సమ్మతమేనని, కానీ దీనివల్ల వినియోగదారుడికి రూ.700కే ఇసుక అందించగలమని పేర్కొన్నారు. గతంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లామని, అందుకు అంగీకరించారని చెప్పారు. ఇప్పుడు ఆర్టీవో అధికారులు జరిమానాలు విధిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. లారీలకు ఈఎంఐలు కట్టలేక, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక ఇసుక లారీలను ఆపివేసినట్లు తెలిపారు. ఇసుక రీచ్‌లలో విచ్చలవిడిగా దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. 40 టన్నులు ఇసుక ఎత్తి 20 టన్నులకే బిల్లులు ఇస్తున్నారని, ఆర్టీవో అధికారులు వాహనాలను నిలిపి ఓవర్ టన్నేజీ కింద రూ. 50 వేలు ఫైన్ విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బీఎస్‌వీ హిమబిందు

మాట్లాడుతున్న బీఎస్‌వీ హిమబిందు

తాడికొండ: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్టు అండ్ సెషన్స్ జడ్జి) బీఎస్‌వీ హిమబిందు విజ్ఞప్తి చేశారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించేందుకు ఈ నెల 5న నిర్వహించే 2వ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.... జూలైలో పరిష్కరించదగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు, న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించనున్నట్లు చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా లేదా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు ఇరువురూ లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. రాజీపడ దగ్గ కేసులు రాష్ట్రంలో మొత్తం 1,15,071 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్ అమర రంగేశ్వర రావు మాట్లాడుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవీనాథ్ తిలహరి సూచనల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సహాయ కార్యదర్శి ఎన్‌జే రావు సమావేశంలో పాల్గొన్నారు.

భూగర్భ జలశాఖ ఏడీఏగా జి.సురేష్

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన సురేష్

బాపట్ల: భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులుగా జి.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్.జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇప్పటివరకు ఇక్కడ సహాయ సంచాలకులుగా పనిచేసిన కె.రామబాలాజీ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నుంచి పదోన్నతితో బదిలీపై వచ్చిన సురేష్‌కు అధికారులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎక్సైజ్ డీసీ హేమంత్ నాగరాజు

వేమూరు: మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్య షాపుల నిర్వాహకులు సమయ పాలన పాటించాలన్నారు. మద్యం ప్రభుత్వం ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. సీఐ రవి, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

గంజాయి చాక్లెట్ల బ్యాగు గుర్తించిన పోలీస్ జాగిలం

తెనాలి రూరల్: తెనాలి రైల్వే స్టేషన్‌లో పోలీసులు గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెనాలి మీదుగా ప్రయాణించే పలు రైళ్లలో సోదాలు చేశారు. గుంటూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ డి. శ్రీనివాస్ రెడ్డి, తెనాలి డీఎస్పీ బి. జనార్దనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐలు డి. రామకృష్ణ, ఎం. లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్. ప్రకాశరావు, ఈగల్ టీమ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. డాగ్ స్క్వాడ్(మార్షల్)తో తనిఖీలు చేపట్టి అనుమానితులను విచారించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగును పోలీసు జాగిలం గుర్తించగా, తనిఖీ చేయడంతో గంజాయితో తయారు చేసిన చాక్లెట్లు లభించాయి. బ్యాగును స్వాధీనం చేసుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజయవాడ నుంచి తెనాలి వరకు రన్నింగ్ రైళ్లలో తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

PLOT FOR SALE

■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందండం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ P/T, F/T 18సం॥ నిండిన ఉత్సాహవంతులైన యువతి యువకులు కావలెను. భవిష్యత్తు నిర్మాణం నో టార్గెట్స్ నో బాస్. 9010803546

■ Urgent Requirement Comp:PAYTM' FSE: Sales Executive/Sr.Executive. Place Guntur. Sal: 18k to 32k+ Incentive Medical insurance+PF. 9912002213

■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444988/ 89

■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ Gunturలో Field Executives కావలెను. Salary 15K & 20K + Incentives ✆ 72079 42933

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు. కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ. 475/- మాత్రమే (లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 4 । జూలై । 2025

విద్యావ్యాపారం..!
ఇంటర్‌మీడియట్ విద్య కోట్ల ఆదాయాన్నిచ్చే వ్యాపారంగా మారింది
- 8లో

ఎమ్మెల్యేలు డుమ్మా - 8లో
ప్రతిష్టాత్మకంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047' ప్రణాళిక, పీ-4 కార్యక్రమాల తొలి సమీక్ష సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు.

ఎస్..మేమంటే మేమే..!
నెల్లిమర్ల నియోజక వర్గం కూటమి నేతల్లో ఆధిపత్య పోరుతో ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

విస్తృతస్థాయి సమావేశం విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: వైఎస్సార్‌సీపీ చేపడుతున్న పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు కోరారు. ఈ మేరకు గురువారం పాలకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5న పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజ్ అధ్యక్షతన పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల సభ్యులు సమావేశానికి విధిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నిలకడగా తోటపల్లి నీటి ప్రవాహం

తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద గురువారం సాయంత్రానికి 105 మీటర్ల లెవెల్‌కు గాను 104.5 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 3,558ల క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు ఒక గేటును ఎత్తివేసి 3వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకు గాను 2.216 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ ఏఈ కిశోర్ పర్యవేక్షిస్తున్నారు.

బ్లడ్ బ్యాంక్‌లకు షోకాజ్ నోటీసులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఐదు బ్లడ్ బ్యాంక్‌లకు ఔషధ నియంత్రణశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అధికారుల పరిశీలనలో బ్లడ్ బ్యాంక్‌ల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడం, కొన్ని నిబంధనలు పాటించకపోవడం వల్ల నోటీసులు జారీ చేసినట్టు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత తెలిపారు. విజయనగరంలోని న్యూ లైఫ్‌బ్లడ్ బ్యాంక్, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ , బొబ్బిలిలోని బొబ్బిలి బ్లడ్ బ్యాంక్, రాజాంలోని జీఎంఆర్ బ్లడ్ బ్యాంక్, నెల్లిమర్లలోని మిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లకు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు.

పార్వతీపురం రూరల్: గెడ్డ దాటుతున్న నరసయ్యపేట గ్రామ చిన్నారులు

పార్వతీపురం రూరల్: ములగ హైస్కూల్‌కు వరదనీరు, బురదలో వెళ్తున్న విద్యార్థులు

కొమరాడ: కొట్టు గ్రామం నుంచి కొమరాడ జిల్లా పరిషత్ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

చదువులకు అడ్డుగా గెడ్డ..!

చదువుకోవాలన్న ఆ గిరిజన చిన్నారుల ఆశలను గెడ్డ నీళ్లు అడ్డుతున్నాయి. పార్వతీపురం మండలంలోని నరసయ్య పేట గ్రామం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు గెడ్డల్లో తక్కువగా నీరు పారే సమయంలోనే హాజరయ్యే దుస్థితి గిరిజన విద్యార్థులది. రోజూ తమ చిన్నారులను పాఠశాలకు అప్పగించేందుకు పనులు మానుకుని సమయాన్ని కేటాయిస్తున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే మండలంలోని ఎన్.ములగ గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లాలంటే దాదాపు ఐదు గ్రామాలకు చెందిన విద్యార్థులు వరదనీటిలో బురదలో నడుచుకుంటూ పాఠశాలకు చేరాల్సిందే. సమీపంలో ఉన్న వ్యవసాయ కాలువ నుంచి ములగ గ్రామం వైపు నీరు పారడంతో ఆ దారి నిత్యం జలమయమై బురదతో నరకంలా తయారవుతుంది. ఈ దారిలోనే విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. క్రమంగా వర్షాలు కురిస్తే రాకపోకలు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు.
–పార్వతీపురం రూరల్/కొమరాడ

అక్కడే కంటైనర్ ఆస్పత్రి ఉన్నా..

మోత తప్పలే!

- డోలీ మోతలకు చెక్ పెట్టినట్లు చెప్పిన మంత్రులు
- కొద్దిరోజులకే సాలూరు నియోజకవర్గంలోనే మరో ఘటన
- ఆర్భాటంగా ప్రారంభించిన కంటైనర్ ఆస్పత్రికి సమీపంలోనే..

సాక్షి, పార్వతీపురం మన్యం:

సుపరిపాలనకు తొలి అడుగు అంటూ.. ఇటీవల కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, అధికారులు సమావేశమయ్యారు. గిరి ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెబుతూ.. డోలీ మోతలను అరికట్టామని మంత్రులు చెప్పారు. అలా చెప్పి ఎన్ని రోజులూ కాలేదు. మంత్రి సొంత నియోజకవర్గమైన సాలూరు మండలంలోనే మరో మహిళను డోలీలో ఆసుపత్రికి తరలించడం గమనార్హం.

ఆశ కార్యకర్తకే తప్పలేదు..

రెండు రోజుల కిందట సాలూరు మండలం కరడవలస పంచాయతీ ఎగువ కాషాయవలస గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కూనేటి శ్యామల వాంతులు, విరేచనాలతో బాధ పడటంతో కుటుంబ సభ్యులు.. డోలీ కట్టి.. కొండలు, గుట్టలు దిగి, సువర్ణముఖి నదిని దాటి సాలూరు ఆస్పత్రికి తరలించారు.

- కొద్దిరోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతున్న సాలూరు మండలం బొడ్డపాడు గిరిశిఖర గ్రామానికి చెందిన సీదరపు నాగేశ్వరరావు అనే గిరిజనుడిని పది కిలోమీటర్లు డోలీలో జిల్లేడువలస వరకు తీసుకొచ్చి, అక్కడ నుంచి ఆటోలో సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.
- విజయనగరం జిల్లా ఎస్.కోటలోని రేగపుణ్యగిరి గిరిజన గ్రామం నుంచి అర్జున్ అనే వ్యక్తిని చికిత్స నిమిత్తం సుమారు ఐదు కిలోమీటర్లు డోలీలో తరలించాల్సి వచ్చింది.
- కొన్నాళ్ల కిందట కొమరాడ మండలం చినఖేర్జిల పంచాయతీ సీసాడవలసకు చెందిన గర్భిణిని కుటుంబ సభ్యులు మంచంపై ఉంచి మైదాన ప్రాంతానికి తరలించారు. అక్కడ నుంచి 1089 వాహనంలో పార్వతీపురం ఆస్పత్రికి చేర్చారు.

డోలీలో ఆశ కార్యకర్త శ్యామలను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కాషాయవలస గ్రామస్తులు (ఫైల్)

కంటైనర్ ఆస్పత్రికి కిలోమీటరు దూరంలో ఉన్నా సరే...

మన్యం ప్రాంతాల్లో డోలీ మోతలకు స్వస్తి పలకాలని గిరిశిఖర ప్రాంతాల్లో కంటైనర్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే పైలట్ ప్రాజెక్టు కింద పార్వతీపురం మన్యం జిల్లాలో కంటైనర్ ఆస్పత్రిని ఇటీవల ప్రారంభించారు. పది గ్రామాల ప్రజలకు ఈ కంటైనర్ ద్వారా వైద్యసేవలు అందుతాయని ప్రకటించారు. సాలూరు మండలం తోణాం పంచాయతీ పరిధి గిరిశిఖర కరడవలసలో దీన్ని నెలకొల్పారు. అక్కడ సేవలు ఏ స్థాయిలో అందుతున్నాయో చెప్పడానికి బుధవారం జరిగిన డోలీ మోత ఘటనే నిదర్శనం. కరడవలసకు కేవలం కిలోమీటరు దూరంలోపునే బాధిత మహిళ గిరిజన గ్రామం ఉంది. అక్కడ సేవలు అందుబాటులో లేకపోవడంతోనే సుదూర ప్రాంతం తీసుకొచ్చి, సాలూరు ఆసుపత్రిలో చేర్చారు. డోలీల మోతలు లేకుండా చేస్తున్నామని.. గిరి ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని కొద్ది నెలల క్రితం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటన సందర్భంగా తెలిపారు. ఆయన శంకుస్థాపన చేసిన రహదారి నేటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం. కూరుకూటి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

పెట్రోల్ స్టేషన్‌ను ప్రారంభించిన డీఐజీ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని చర్చివీధి కూడలి సమీపంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డీఐజీ..విజిబుల్ పోలీసింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 41 కొత్త ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ రెగ్యులేషన్ విధులను విజిబుల్ పోలీస్ సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాకు ఈ ద్విచక్ర వాహనాలను ఆధునిక టెక్నాలజీతో రూపొందించి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ వాహనాల ద్వారా సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేసేందుకు రూపొందించారన్నారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్య తరచూ ఏర్పడుతున్న నేపథ్యంలో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రహదారి ప్రమాదాలు కూడా జరుగుతున్న క్రమంలో ఈ వాహనాలను కేటాయించినట్లు తెలిపారు.

మినీ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

పోలీస్‌వెల్ఫేర్ పెట్రోల్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ స్టేషన్ ప్రారంభం అనంతరం ఎస్పీ కార్యాలయంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో సోషల్‌మీడియా, సైబర్‌సెల్, మినీ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించి సైబర్ సెల్, ఐటీకోర్ టీం, సిబ్బందితో చర్చించి వారు నిర్వహించే విధుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్‌బీ సీఐ రంగనాథం, సీసీఎస్ సీఐ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్యలకు జాతీయ అవార్డులు

గంట్యాడ / రాజాం:

గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, సామాజిక సమీకరణ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించినందుకు గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలు ఆత్మనిర్భర్ అవార్డు–2024కు ఎంపికయ్యాయి. దీన దయాల్ అంత్యోదయ యోజన, జాతీయగ్రామీణ జీవనోపాధుల మిషన్ జాతీయ స్థాయిలో అవార్డులను ప్రకటించాయి. గంటాడ్య సమాఖ్య ఉత్తమ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్‌గా, రాజాం సమాఖ్య తృతీయ ఉత్తమ క్లస్టర్ ఫెడరేషన్‌గా అవార్డులను సొంతం చేసుకున్నాయి. వీటికి వరుసగా రూ.3 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు బహుమతి లభించనుంది. ఢిల్లీలో ఆగస్టు 15న జరిగే జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో కూడా గంట్యాడ మండల సమాఖ్య 2022, 2023 సంవత్సరాల్లో జాతీయ స్థాయి అవార్డులను సాధించింది.

రోడ్డు మీదకు ఏనుగుల గుంపు

మడ్డువలస వంతెన రోడ్డుపై వెళ్తున్న ఏనుగుల గుంపు

వంగర: మడ్డువలస వంతెన సమీపంలో రోడ్డుపై ఏనుగుల గుంపు గురువారం ఉదయం హల్‌చల్ చేశాయి. రోడ్డుపై ఏనుగులు సంచరించడంతో వాహనచోదకులు, రైతులు భయంతో పరుగులు తీశారు. అటవీ సిబ్బంది, ట్రాకర్స్ ఏనుగులను పంటపొలాలు వైపు దారిమళ్లించారు. చెరకు, మొక్కజొన్న, పామాయిల్ పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడతున్నారు. ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం మెడలు వంచుదాం..

హామీలు అమలు చేయిద్దాం

- పవిత్రమైన ఎన్నికల ప్రణాళిక అమల్లో కూటమి వైఫల్యం
- ప్రమాణాలు చేస్తున్నామంటూ ఇచ్చిన బాండ్‌లకు విలువ ఎక్కడ..?
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 5 వారాల బృహత్తర కార్యక్రమం
- హామీలు అమలుపై ప్రజలతో చర్చించి చైతన్యవంతులు చేయండి
- పార్టీ శ్రేణులకు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ పిలుపు
- వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేతలు
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం:

ఎన్నికలకు ముందు అధికార దాహంతో ఇచ్చిన హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధమని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఉద్ఘాటించారు. పవిత్రమైన ఎన్నికల ప్రణాళిక అమల్లో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. హామీల అమలుపై ప్రశ్నించేవారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఏడాది పాలనలో హామీల అమల్లో జరుగుతున్న మోసాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ప్రజలకు వివరించాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేస్తూ 5 వారాల బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ముందుగా నియోజకవర్గ స్థాయిలో సమన్వయకర్తల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని, అనంతరం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. అనంతరం మండల స్థాయి నాయకులు గ్రామగ్రామానికి వెళ్లి అక్కడి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేసిన అనంతరం ఆ గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి కూటమి పాలనను వివరించాలన్నారు. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడు ప్రజలే జగన్‌మోహన్‌రెడ్డి కావాలో.... చంద్రబాబు కావాలో నిర్ణయించుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన పూల్‌బాగ్‌లోని ఓ కల్యాణమండపంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులంతా పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పాల్గొన్న పార్టీ నేతలు

హామీలను విస్మరించడం దగా చేయడం కాదా..?

ప్రజాస్వామ్యంలో పవిత్రమైన ఎన్నికల ప్రణాళికలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎన్నికల ప్రణాళికలను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబుల్‌గా భావించి అమలు చేశాం. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అలానే అమలు చేస్తుందని 5 కోట్ల మంది ప్రజలు నమ్మి మోసపోయారు. ఏడాది కాలం మాయమాటలతో పబ్బంగడిపేసింది. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యంలో బాధ్యత గల ప్రతిపక్షంగా అధికారం పక్షం ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను మెడలు వంచి అమలు చేసేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ అనే మేము మన రాష్ట్ర ప్రజలు మా సమష్టి నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని త్రికరణ శుద్ధితో ప్రమాణం చేస్తున్నామంటూ బాండ్ పేపర్లు ఇచ్చారు. ఏడాదిగా ప్రతిజ్ఞను పక్కనపెట్టి మోసం చేస్తున్నారు. **– బొత్స సత్యనారాయణ, శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి**

భస్మాసురిడిలా లోకేశ్

ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేశ్ కూటమి ప్రభుత్వానికి భస్మాసురిడిలా తయారయ్యాడు. రెడ్ బుక్‌లో అందరి జాతకాలు ఉన్నాయంటూ చివరికి ఆ అస్త్రంతోనే కూటమి ప్రభుత్వాన్ని, తన పక్కనున్న వారిని భస్మం చేసే పరిస్థితి వస్తుంది. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్దాం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో ఉన్న అభిమానం చెక్కుచెదరలేదు. 2029 ఎన్నికల్లో మళ్లీ క్లీన్‌స్వీప్ చేస్తాం.
– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

గ్రామాల్లో చేసిన వాగ్దానాలను ప్రశ్నించాలి

కూటమి నాయకులు ఎన్నికలకు ముందు గ్రామాల్లోకి వచ్చి చేసిన వాగ్దానాలపై ప్రశ్నించాలి. చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను చెప్పేందుకే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం. జగన్‌మోహన్‌రెడ్డి న్యాయంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే.. కూటమి నేతలు మాయమాటలతో పాలన చేస్తున్నారు. 150 హామీలు ఎక్కడ అమలు చేశారో... ఎవరికి చేశారో చెప్పాలి. ప్రశ్నించే వారిపై రెడ్ బుక్ పేరిట భయపెడుతున్నారు. ఇటువంటి దుర్మార్గపు పాలనను ప్రజల్లో నిలదీయాలి.
– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం, సాలూరు

గంగరేగువలసలో బెంగ..!

- గ్రామంలో కేన్సర్ మహమ్మారి అంటూ అలజడి
- ఆందోళనలో గ్రామస్తులు

కొమరాడ:

మండలంలోని గంగరేగువలస పంచాయతీలోని సోమినాయుడువలస, చినగంగరేగువలస గ్రామాల్లో సుమారు 600 కుటుంబాలు, 2500మంది నివసిస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా కేన్సర్ బారిన పడుతూ పలువురు చనిపోతున్నారని పంచాయతీ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే నిత్యం పంటలతో సస్యశ్యామలంగా ఉన్న ఈ గ్రామానికి ఏమైందంటూ ప్రజాసంఘాలు, మేధావులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ముగ్గురు మాత్రమే కేన్సర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని ప్రభుత్వ వైద్యాధికారుల లెక్కల ప్రకారం చెబుతున్నారు. గ్రామంలో పలురకాల వ్యాధులతో సుమారు 20మంది మంచం పట్టి ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న గ్రామంలో కేన్సర్ మహమ్మారి అంటూ అలజడి సృష్టించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

ఇటీవల గ్రామంలో కేన్సర్ భూతం ఉందని అని ప్రచారం జరగడంతో గ్రామస్తులు, యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా అనిపించడం లేదు. వైద్యాధికారులు తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహించి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వ అధికారులు కేన్సర్ వ్యాధి రావడానికి కారణం ఏమిటో ఎందుకు నిర్ధారణ చేయడం లేదు? గ్రామంలో గాలి కాలుష్యమా? కలుషితమైన తాగునీరా? తినే ఆహారంలో మార్పులవల్ల కేన్సర్ వ్యాధి వస్తోందా? అని ప్రజల్లో ఉన్న అనుమానాలను అధికారులు ఎందుకు నివృత్తి చేయడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

గంగరేగువలస గ్రామం

గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారు

మా గ్రామ పంచాయతీలో పలు రకాల వ్యాధులతో మృతి చెందుతున్నారు. ప్రస్తుతం ముగ్గురు కేన్సర్ వ్యాధి గ్రస్తులు ఉన్నారు. గ్రామంలో ప్రత్యేకవైద్య నిపుణుల బృందం పూర్తిస్థాయిలో ఆహారం, నీరు, పరిసరాలను పరిశీలించి గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ప్రజల్లో ఉన్న భయాందోళన తొలగించాలి.
– కోడి తిరుపతిరావు, సర్పంచ్, గంగరేగువలస

పూర్తిస్థాయి నివేదిక రావాలి

గంగరేగువలస, సోమినాయుడువలస, చినగంగరేగువలస గ్రామాల్లో కేన్సర్ మహమ్మారి ఉందని గ్రామస్తుల్లో అలజడి సృష్టిస్తున్నా రు. వాస్తవానికి ముగ్గురు వ్యక్తులకు మాత్రమే కేన్సర్ వ్యాధి ఉంది. వారు కూడా చికిత్స పొందుతున్నారు. గతంలో కేన్సర్ బారిన పడి మృతి చెందారని ఆరోపిస్తున్న వాటికి పక్కా ఆధారాలు లేవు. ఈ గ్రామంలో కేన్సర్ వ్యాధికి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి నివేదిక పంపడానికి సమయం పడుతుంది.
– సీహెచ్ అరుణ్‌కుమార్, వైద్యాధికారి, కొమరాడ పీహెచ్‌సీ

క్లుప్తంగా

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో తోట విజయ్ ఉత్తీర్ణత

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తోట విజయ్

విజయనగరం: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఆధ్వర్యంలో గత నెలలో అహమ్మదాబాద్‌లో నిర్వహించిన బీసీసీఐ అంపైర్ల పరీక్షల్లో విజయనగరానికి చెందిన తోట విజయ్ ఉత్తీర్ణత సాధించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అంపైర్ల పరీక్షల్లో జిల్లా చరిత్రలో తోట విజయ్ అంపైర్ సర్టిఫికేషన్ పొందిన తొలి వ్యక్తిగా గుర్తింపు సాధించారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అర్హత పొందిన ఏకైక అభ్యర్థి కూడా ఆయనే. ఆయన సాధించిన విజయం విజయనగరం క్రికెట్‌కు గర్వకారణమే కాకుండా భవిష్యత్ అంపైర్లకు ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పటికే విజయ్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు స్కోరర్‌గా వ్యవహరిస్తున్నారు. తోట విజయ్ బీసీసీఐ అంపైర్ల పరీక్ష ఉత్తీర్ణత కావడంతో ఇకనుంచి దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు, రంజీ ట్రోఫీ, ఐపీఎల్, అంతర్‌రాష్ట్ర క్రికెట్ మ్యాచ్‌లకు ఎంపైరింగ్ చేసే అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా విజయ్‌కు జిల్లా క్రికెట్ అసోసియేషన్, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ ప్రతినిధులు, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

పీఎం జుగా నిధులతో పాఠశాలలకు భవనాల నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురం/మక్కువ: పీఎం జుగా, పీఎం జన్‌మన్ నిధులు మంజూరైన వెంటనే పాఠశాలలకు భవనాలను నిర్మిస్తామని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు గురువారం (జూలై 3న) ''సాక్షి'' దినపత్రికలో ''గిరిజన బిడ్డల చదువుల కష్టాలు'' శీర్షికన ప్రచురితమైన కథనం పట్ల ఆమె స్పందిస్తూ మక్కువ మండలంలోని ఎర్ర సామంతులవలస స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గిరిజన ప్రాథమిక పాఠశాల చిలకమెండంగిలో 8మంది విద్యార్థులు చదువుతున్నారని, రేకుల షెడ్డులో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 8 మండలాల్లో 352 పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 58గిరిజన ప్రాథమిక పాఠశాలలకు భవనాలు లేనందున పీఎం జుగా, పీఎం జన్‌మన్ కింద పాఠశాలల భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆమె స్పష్టం చేశారు.

వర్షాలకు కూలిన పెంకుటిళ్లు

జామిలో కూలిన పెంకుటిళ్లు

జామి: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రం జామి లో రెండు పెంకుటిళ్లు గురువారం కూలిపోయాయి. గ్రామానికి చెందిన రాజాన సీతారాం, సీరెడ్డి సింహాచలంల పెంకుటిళ్లు వర్షాలకు నానడంతో కూలిపోయాయని గ్రామస్తులు, బాధితులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తైక్వాండో విజేతలకు సత్కారం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం సత్కరించారు. అనంతపురం జిల్లా, తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ తరఫున ఉత్తర ఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జూన్ 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో అండర్ 25 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన షణ్ముఖ్ సిద్ధార్థ నాయుడు, అండర్ 48 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బుగత హర్షవర్ధన్, మహిళల విభాగంలో అండర్ 32 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ఇజ్జాడ వైష్ణవిదేవిలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వాడొద్దు

తనిఖీలు చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పలు దుకాణాలకు వెళ్లి, నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నదీ లేనిదీ తనిఖీలు చేశారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్‌లతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిషేధిత పాలిథిన్ కవర్లను విక్రయించవద్దని, ఎక్కడైనా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యావ్యాపారం..!

- అడిగినంత ఇస్తేనే సీటు
- బెంబేలెత్తిస్తున్న ఇంటర్ ఫీజులు
- రకరకాల పేర్లతో ప్రైవేట్ కళాశాలల వసూలు
- 105 కళాశాలల్లో 13 వేల మంది ఫస్ట్‌ఇయర్ ప్రవేశాలు



ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల వసూలు ఇలా..

ఎంపీసీ, బైపీసీ కోర్సులకు :	రూ.35,000 నుంచి 1,50,000
వాహన సౌకర్యం :	రూ.12,000
పుస్తకాలు :	రూ.8,000 నుంచి 10,000
యూనిఫాం (రెండు జతలు) :	రూ.1,600 నుంచి రూ.2,000
వసతి గృహం, భోజన సౌకర్యం :	రూ.6,000 (నెలకు)
ఐఐటీ, ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ :	రూ.50,000 నుంచి 1,00,000
ఏసీ గదికి అదనం :	రూ.12,000

విజయనగరం అర్బన్: ఇంటర్‌మీడియట్ విద్య కోట్ల ఆదాయాన్నిచ్చే వ్యాపారంగా మారింది. జిల్లా కేంద్రంలోను, జిల్లాలోని వివిధ పట్టణాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల పేర్లతో విద్యార్థుల నుంచి ఎడాపెడా దోచుకుంటున్నాయి. నీట్, జేఈఈ, ఎంసెట్ ఆశలు రేకెత్తిస్తూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజుల వసూళ్లకు తెగబడుతున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటే చాలని వారు చెప్పిన ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు రెండేళ్ల తరువాత లబోదిబోమంటున్నారు. అటు నీట్, జేఈఈ ర్యాంకులు రాక ఇటు ఇంటర్‌లో మార్కులు లేక మోసపోయామంటూ అధికశాతం కన్నవారు వాపోతున్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉంటోంది. పదో తరగతి ఫలితాలు రావడమే ఆలస్యం విద్యార్థుల ఇళ్ల ముంగిట వాలిపోతున్న యాజమాన్యాలు ర్యాంకుల పేరుతో ఊదరగొడుతున్నాయి. రూ.లక్షల్లో వసూలు చేసి పెద్ద ఎత్తున ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. వసతి గృహాల్లో ఎక్కువ మంది చేరుతుండగా ఇరుకుగదుల్లో కుక్కేస్తున్నారు. ఎక్కువ భాగం సొంతభవనాలు లేకపోయినా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆటస్థలాలు పూర్తిగా కరువయ్యాయి.

తాయిలాలకు తలొగ్గిన తనిఖీ అధికారులు

జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 105 ప్రైవేట్ కళాశాలలో ప్రతి ఏడాది 23 వేల మంది వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలుంటున్నాయి. ఇందులో ప్రైవేట్ కళాశాలల్లో ప్రతి ఏడాది చేరిన వారు 13 వేల మంది వరకు ఉంటున్నారు. వారి నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఐదు నుంచి పదిరెట్లకు పైగా వసూలు చేస్తున్నారు. కళాశాలల గుర్తింపు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో పెద్ద ఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోనే రీజనల్ అధికారి కార్యాలయం ఉన్నప్పటికీ అందులోని అధికారులు ప్రైవేట్ కళాశాలల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఉత్తుత్తి తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదులతో పాటు తాయిలాలతో సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బట్టీ చదువులతో సరి

నిరంతరం బట్టీ చదువులు తప్పితే ఏ అంశంలోనూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టి సారించడం లేదు. మెటీరియల్ రూపొందించి ఆ అంశాలనే విద్యార్థులతో వల్లెవేయిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఊసెత్తడం లేదు. అధ్యాపకుల ఏర్పాటులో వివక్ష చూపుతున్నారు. అందరి నుంచి ఒకే ఫీజు వసూలు చేసినా ఒకట్రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు మాత్రమే రూ.లక్షల్లో వేతనాలు చెల్లించి తరగతులు చెప్పిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. అందుకు తగిన రసీదులు ఇవ్వాలి. విద్యాశాఖ నిర్దేశించిన ఫీజులకు వ్యతిరేకంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. విశాలమైన భవనాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తప్పక ఉండాలి. ఎటువంటి లోపాలున్నా నోటీసులు ఇచ్చి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కళాశాలల గుర్తింపు రద్దు చేస్తాం.

ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ, విజయనగరం

ఆర్‌జేడీకి పీఆర్‌టీయూ నాయకుల వినతి

ఆర్‌జేడీ భాస్కరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పార్వతీపురం: పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై రీజనల్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కరరావుకు పీఆర్‌టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు పార్వతీపురం జీజే కళాశాలను ఆర్‌జేడీ సందర్శించిన సందర్భంగా వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత కూడా పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక బోధనకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆర్‌జేడీని కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు వి.తవిటినాయుడు, కె.విజయ్, ఎ.సూర్యనారాయణ, జె.రామినాయుడు, జి.రావినాయుడు, శంకరరావు, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ బలోపేతానికి కృషిచేయాలి

పార్వతీపురం: పీఆర్‌టీయూ బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరావు సూర్యనారాయణ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషిచేస్తున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం ఆదేశాలమేరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని అందుకు అందరు ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం మండలాల నుంచి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా నివారణకు తనిఖీలు

- పలు శాఖల సమన్వయంతో రైళ్లలో సోదాలు
- ఏఎస్పీ అంకిత సురానా

డాగ్ స్క్వాడ్‌తో ప్రయాణికుల లగేజీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురం రూరల్: ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించే రైళ్లలో గురువారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఈగల్ స్పెషల్ ఫోర్స్, లోకల్ పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ సమన్వయంతో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి తనిఖీలు చేపట్టినట్లు పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ముందుగా ప్లాట్‌ఫాంపై వేచిఉన్న ప్రయాణికుల లగేజీలను పలు శాఖల పోలీస్ అధికారులతో కలిసి డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. అనంతరం గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బోగీల వారీగా ముమ్మరంగా విజయనగరం వరకు సిబ్బంది తనిఖీలు చేశారు. ఎప్పటికప్పుడు మాదక ద్రవ్యాల నివారణకు ఈగల్ బృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పోలీసు శాఖలో పలు బృందాల సహకారంతో విస్తృతంగా తనిఖీలు చేపటుతున్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, సాగు, వినియోగం లేకుండా చేయడమే ఈగల్ బృందం ప్రధాన లక్ష్యమన్నారు. తనిఖీల్లో క్రైమ్‌స్టేషన్ సీఐ అప్పారావు, పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, మరికొంతమంది ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు డుమ్మా

మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047' ప్రణాళిక, పీ-4 కార్యక్రమాల తొలి సమీక్ష సమావేశానికి విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు మినహా మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఇది అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ విజన్ ప్రణాళిక అమలులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధి సాధించాలన్నదే లక్ష్యమన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యాన, వాణిజ్యపంటల సాగుకు రైతులు ఆసక్తిచూపేలా చూడాలన్నారు. సర్వీస్ సెక్టార్ కింద పర్యాటక రంగంలో సన్‌రే రిసార్ట్స్ రూ.150 కోట్లు, జీఎంఆర్ రూ.150 కోట్లు, ఆదాని గ్రూప్ రూ.100 కోట్లతో హోటళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయన్నారు. పీ-4లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని 264 పోలింగ్ బూత్‌ల నుంచి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు, రఘురాజు, ఎమ్మెల్యేలు అధితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జేసీ సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్, సీపీఓ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు శక్తియాప్ రక్షక కవచం

మహిళలకు రక్షక కవచంగా శక్తియాప్ నిలుస్తుందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో జరిగిన సమావేశంలో శక్తి యాప్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ తొలిత శక్తి యాప్ విధి విధానలను పీపీటీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల, ఆడపిల్లల రక్షణ కోసం రూపొందించిన ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతరకు 1.2 కోట్ల మంది వినియోగిస్తున్నారని, ప్రతి మహిళ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్..మేమంటే మేమే..!

- కూటమిలో ముదురు పాకాన పడిన వివాదాలు
- నెల్లిమర్ల నియోజకవర్గంలో ఆధిపత్య పోరు
- జనసేన ఎమ్మెల్యే స్పీడుకు తమ్ముళ్ల బ్రేక్
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న టీడీపీ నేతలు
- ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన వాయిదాలో టీడీపీ నాయకుల పాత్ర

పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజక వర్గం కూటమి నేతల్లో ఆధిపత్య పోరుతో ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే స్పీడుకు బ్రేకులు వేయకపోతే టీడీపీ బలహీనపడుతుందనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు.. జనసేన పార్టీ పుంజుకోవాలంటే నియోజకవర్గంలో టీడీపీకి చెక్ పెట్టి పార్టీని పటిష్ఠం చేయాలని ఎమ్మెల్యే లోకమాధవి ఇలా ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. పూసపాటిరేగ మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసేందుకు హోంమంత్రి అనిత నిర్ణయించారు. ఈ విషయం రుచించని టీడీపీ నాయకులు టీడీపీ అధిష్టానం సిఫార్సులతో శంకుస్థాపన కార్యక్రమం వాయిదా వేయించారు. ఇలా జనసేన అవునంటే అంటే టీడీపీ కాదని, టీడీపీ అవునంటే జనసేన కాదన్న చందంగా ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుని నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేస్తున్నారు. పదిరోజుల క్రితం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు టీడీపీ నేతల సిఫార్సులతోనే జరిగాయనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే ఏరికోరి తీసుకువచ్చిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ఏడాది తిరక్కముందే నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు బదిలీ చేయించినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లోను ఇదేవిధంగా జరిగినట్లు తెలుస్తోంది.

నిలిచిపోయిన ఏఎంసీ చైర్మన్ నియామకం

రెండునెలల క్రితం పూసపాటిరేగ ఏఎంసీ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించడంతో చైర్మన్ అభ్యర్థి ఎంపికను జనసేన పార్టీ పూర్తి చేసింది. మరికొన్ని రోజుల తరువాత జనసేనకు చెక్‌పెట్టి అధిష్టానం టీడీపీకే చైర్మన్ పదవి కేటాయించినట్లు నెల్లిమర్లలో నియోజకవర్గ టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించడంతో ఆశావహుల మధ్య తీవ్రపోటీ నెలకొనగా..వర్గపోరుతో అప్పట్లో చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయకుండానే సమావేశం వాయిదా వేశారు. నెల్లిమర్ల నగరపంచాయతీలో ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే పాల్గొన్న సర్వసభ్య సమావేశానికి టీడీపీ కౌన్సిలర్‌లు వ్యూహాత్మకంగానే పార్టీ అధిష్టానం ఆదేశాలతో డుమ్మా కొట్టడంతో కోరంలేక సమావేశం వాయిదా పడింది. సంక్షేమ కార్యక్రమాల అమలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు టీడీపీ నాయకులకు సమాచారం ఉండడం లేదని టీడీపీకి చెక్ పెట్టేందుకే ఎమ్మెల్యే యోచిస్తూ అధికారులు సమాచారం ఇవ్వకుండా చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధిష్టానం ఆదేశాలతోనే టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జికి జిల్లా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు బలంగా ప్రచారం సాగుతోంది. జనసేన ఎమ్మెల్యేకు ఇప్పటికైనా చెక్ పెట్టకపోతే నియోజకవర్గంలో టీడీపీ నిర్వీర్యం అవుతుందని టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతోనే ఎమ్మెల్యేకు చెక్‌పెట్టడానికి ఆదేశాలు వచ్చాయనే ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికైనా ఆధిపత్య పోరును వదిలి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పాపం పశువులు

ట్రాక్‌పై మృతిచెందిన పశువులను తరలిస్తున్న రైల్వే సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడ్స్ ఢీకొని 8 పశువులు మృతిచెందాయి. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలంలోని పరశురాంపురం గ్రామం నుంచి పార్వతీపురం సంతకు పశువులను తరలిస్తుండగా పార్వతీపురం సమీపంలో గల రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో రాయపూర్ పైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొనడంతో 8 పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. వెంటనే గూడ్స్‌ను డ్రైవర్ ఆపి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ఉన్న పశువులను పక్కకు తొలగించారు. ఈ విషయమై జీఆర్పీ సిబ్బందిని వివరాలు అడగ్గా ఎటువంటి ఫిర్యాదు అందక పోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఏటీఎంలో మృతి చెందిన ఆవు

ఏటీఎంలో ఆవు..

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం కేంద్రంలో ఒక ఆవు మృతిచెందింది. రెండురోజుల క్రితమే ఈ ఆవు మృతిచెంది ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఉదయం ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా తీసేందుకు వెళ్లిన బ్యాంకు ఖాతాదారులు విషయాన్ని గుర్తించి, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన గోవును పారిశుధ్య కార్మికుల ద్వారా ఏటీఎం కేంద్రంలోంచి బయటకు తీసుకొచ్చి డంపింగ్ యార్డు వద్ద ఖననం చేయించారు. రాజాం రోడ్లపై ఇటీవల ఆవులు అధికంగా సంచరిస్తున్నాయి. వర్షానికి ఏటీఎంలోకి ఆవు చేరి ఉంటుందని, కాలుజారి పడడంతో మృతిచెంది ఉంటుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అనుమానం వ్యక్తం చేశారు.

పాము కాటుతో యువకుడి మృతి

సీతంపేట: మండలంలోని పత్తికగూడ గ్రామానికి చెందిన నిమ్మక కిరణ్ (21) పాముకాటుకు గురై శ్రీకాకుళం రిమ్స్‌లో గురువారం మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు పరిశీలిస్తే..శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఫ్యాన్‌పై నుంచి విషసర్పం కిరణ్‌పై పడడంతో వెంటనే బయటకు విసిరివేశాడు. అప్పటికే పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి వెళ్లిన యువకుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు రమ, రాములు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది అరెస్ట్

పట్టుబడిన వారితో ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ, బీబీజీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు గురువారం తెలిపారు. డెంకాడ ఎస్ఐ, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి, జూదరులను పట్టుకున్నామని వారి నుంచి రూ.15 వేల నగదు, రెండు ఆటోలు, నాలుగు మోటార్‌బైక్‌లు, ఎనిమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

వకుల్‌జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్/రామభద్రపురం: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు చోరీ కేసుల్లో మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన ముద్దాయి జోకాడ భగవాన్(22)కు ఐదేళ్ల 10 నెలల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ సాలూరు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. ఈ కేసుల వివరాల్లోకి వెళ్తే.. 2023లో రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామంలో వి.కాంతమ్మ ఇంట్లో వారు నిద్రిస్తున్న సమయంలోను.. 2024లో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్‌లోను జోకాడ భగవాన్ చొరబడి రూ.లక్షా 60వేల నగదు, తులం చెవిదిద్దులు, ఒక ల్యాప్‌టాప్ దొంగిలించాడు. అప్పట్లో బాధితులు ఇచ్చిన సమాచారంపై రామభద్రపురం పోలీసులు రెండు చోరీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారణ చేపట్టిన జడ్జి నేరం రుజువుకావడంతో గురువారం పైవిధంగా జైలుశిక్ష, జరిమానా విధించారు. కాగా జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు మాసాలు సాధారణ జైలుశిక్షను అనుభవించాలని సాలూరు జైఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పులో పేర్కొన్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు. ఈ కేసులో వాదనలు వినిపించిన వీహెచ్‌కే శర్మ, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాద్‌లు సకాలంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు.

రెక్కీ నిర్వహించి హత్య

- మహిళ హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, ఎస్సైలు

బొబ్బిలి: తన భార్య చనిపోవడానికి, బిడ్డ అనారోగ్యంతో ఉండడానికి తన పక్కింట్లో ఉంటున్న పిన్నే కారణమని అనుమానించి రెక్కీ నిర్వహించి మరీ ఆమెను హత్య చేశాడో ఓ యువకుడు. బొబ్బిలి పట్టణంలోని బండారు వీధిలో కరగాని పద్మ అనే మహిళ గాయాలతో బుధవారం ఇంటి గుమ్మం వద్ద పడి మృతి చెందిన ఘటన తెలిసిందే. కాగా ఇది హత్యేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయమై డీఎస్పీ జి.భవ్యారెడ్డి గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మహిళ మృతి చెందడానికి కత్తిపీటపై పడిపోవడమేనని కుటుంబసభ్యులు చెప్పిన మాటలపై నమ్మకం కలగక దర్యాప్తు చేపట్టామన్నారు. వంటిపై గాయాలుండడం, మెడికల్ రిపోర్టు, క్లూస్‌టీమ్ వివరాలను సేకరించి హత్య అని నిర్ధారణకు వచ్చామని డీఎస్పీ చెప్పారు. హత్య చేసింది స్వయానా ఆమె బావ కుమారుడు కరగాని సంతోష్ కుమార్ అని తెలిపారు. సంతోష్ కుమార్ భార్య పావని ప్రసవ సమయంలో చనిపోయింది. అలాగే నెలన్నర రోజుల పసిబిడ్డ ఆరోగ్యం కూడా బాగాలేక ఆస్పత్రిలో చేర్చారు. ఈ రెండు సంఘటనలకు తన పిన్నే కారణమని భావించిన సంతోష్ గురువారం ఉదయం 11 గంటల సమయంలో రెక్కీ నిర్వహించాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో పిన్ని ఒంటరిగా ఉన్న సమయంలో పొడిచి హత్యకు పాల్పడినటుల డీఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు గురువారం అప్పగించామని, నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కె. సతీష్‌కుమార్, ఎస్సై ఆర్.రమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹94	₹154	₹164

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతుకు కష్టకాలం!

పచ్చిరొట్ట విత్తనాల ధరలు పెరగడం, జిల్లాలో అరకొరగా పంపిణీ చేస్తుండటంతో వాటి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. - 8లో..

రాజకీయ కక్షతో రచ్చబండ ధ్వంసం

అధికార పార్టీ నేతలు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. రాజకీయ కక్షలతో 20 ఏళ్లుగా ఉన్న రచ్చబండను పోలీసుల సాయంతోనే ధ్వంసం చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు అల్లూరి సీతారామరాజు జయంతి

ఒంగోలు వన్‌టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎల్.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని గిరిజన భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు.

రజక వృత్తిదారులకు పింఛన్లు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాయల

ఒంగోలు టౌన్: 50 ఏళ్లు దాటిన రజక వృత్తిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్బీజీ భవనంలో జిల్లా రజక వృత్తిదారుల సంఘం, అపార్ట్‌మెంట్ కమ్ ఇస్త్రీదారుల సంఘం సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డాక్టర్ రాచకొండ వెంకట కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాయల మాలకొండయ్య మాట్లాడుతూ.. ఇస్త్రీ యజమానులకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ సంఘం ప్రధాన కార్యదర్శి మంచికలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరంలో అనేక మంది అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లు అరకొర జీతంతో బతుకుబండి నడుపుతున్నారని తెలిపారు. ఇంటి పనివారిగా చిన్న ఇరుకు గదుల్లో కాలం నెట్టుకొస్తున్నారని, నెలకు రూ. 8 వేల నుంచి రూ.10 వేల జీతంతో బతుకుతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు ఆవుల మంద రమణమ్మ, ఏడుకొండలు, మిరియం వెంకటేశ్వర్లు, రఘుబాబు, సుబ్బారావు, గుర్రపుసాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సేవలో అహోబిల జీయర్‌స్వామి

ఒంగోలు మెట్రో: నగరంలోని మంగమూరు రోడ్డు మర్రిచెట్ల కాలనీలో వెలసిన పోలిమేర అభయాంజనేయస్వామికి త్రిదండి అహోబిల జీయర్‌స్వామి గురువారం పూజలు చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ సమీర్ వేదమంత్రాలు, పూర్ణకుంభంతో జీయర్‌స్వామికి స్వాగతం పలికారు. అనంతరం పొలిమేర అభయాంజనేయస్వామి పూజా క్రతువులో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జీయర్ స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఈసందర్భంగా జీయర్‌స్వామి దేవాలయ అభివృద్ధికి పాటుపడుతున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

పారని నిధులు.. మళ్లీ షోకులు!

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేసి షోలు చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారింది. దశాబ్దాలుగా తాగు, సాగునీటి కోసం అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం వాసులకు కృష్ణమ్మ జలాలను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తూనే.. మరోవైపు నీటి సరఫరాకు సంబంధించిన పనులను సైతం ప్రారంభించింది. గొట్టిపడియ దగ్గర ఇన్‌టెక్ వెల్ నిర్మాణ పనులను 90 శాతం పూర్తి చేసింది. ఇక అనుసంధాన పనులను సైతం ప్రారంభించింది. పనులు వేగం అందుకునే సమయంలో ఎన్నికలు రావడంతో వాటికి బ్రేక్ పడింది. ప్రస్తుతం ఆ పనులకు సంబంధించి కొత్తగా శంకుస్థాపన చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం వస్తున్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి జరుగుతున్న పనులకు మళ్లీ శంకుస్థాపన ఏంటీ అంటూ ప్రజా సంఘాలు, పలు రాజకీయపక్ష నేతలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



గొట్టిపడియ వద్ద ఇన్‌టెక్‌వెల్ ట్యాంకు (ఫైల్)

- వెలిగొండను గాలికొదిలేసి కొత్త డ్రామా మొదలెట్టిన కూటమి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పనులకు శంకుస్థాపన
- గొట్టిపడియ వద్ద 90 శాతం పూర్తయిన ఇంటెక్ నిర్మాణ పనులు
- మళ్లీ శంకుస్థాపన చేసేందుకు నేడు వస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఇదేం చోద్యమంటున్న పశ్చిమ ప్రకాశం ప్రజలు
- మార్కాపురం జిల్లా సంగతేంటి అంటున్న జనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 7 నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 1290 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. ఆర్థిక శాఖతో పాటు జ్యుడీషియల్ కమిటీ కూడా దీనికి ఆమోదం తెలిపింది. గొట్టిపడియ డ్యాం నుంచి 1.95 టీఎంసీల నీటిని పశ్చిమ ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి, కొండపితో పాటు శ్రీపొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మంచినీరు అందించేలా ప్రతిపాదనలు చేశారు. 2051 సంవత్సరం నాటికి పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకుని ఈ పథకానికి రూపకల్పన చేయడం నాటి ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమని చెప్పవచ్చు. ఇందులో భాగంగా 75 కోట్ల రూపాయలతో ఇన్‌టెక్ వెల్ కమ్ పంప్ హౌస్ పనులు శరవేగంగా జరిగాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. 71 మీటర్ల ఎత్తులో ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. 2800 కిలోమీటర్ల పొడవు పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే కూడా పూర్తి చేశారు. ఇది పూర్తయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య కూడా తీరుతుందని నాటి ప్రభుత్వం ఆలోచన చేసింది.

ఇప్పుడు కూటమి పాలకులు ఏం చేస్తున్నారంటే...

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలోని గ్రామీణ జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకం కింద పశ్చిమ ప్రాంతానికి కొత్తగా తాగునీటి పథకం మంజూరైనట్లు ప్రచారం చేస్తుండడంతో జిల్లా ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఈ పథకం కోసం జల్ జీవన్ పథకం ద్వారా రూ.1290 కోట్లు మంజూరు చేసినట్లు కూటమి పాలకులు చెప్పుకుంటున్నారు. గొట్టిపడియలోని వెలిగొండ ఆనకట్ట వద్ద 73 కోట్ల రూపాయలతో ఇన్‌టెక్ వెల్ నిర్మాణాలు చేసినట్లు, దీని ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు నీటిని సరఫరా చేయనున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఈ తాగునీటి పథకం శంకుస్థాపన కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం మార్కాపురం వస్తున్నట్లు కూటమి పాలకులు హడావిడి చేస్తున్నారు. ఇప్పటికే ఒకసారి ఈ తాగునీటి పథకానికి శంకుస్థాపన జరిగింది. ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టేసి మళ్లీ శంకుస్థాపన చేస్తుండడంపై జిల్లా వాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గన్నట్లు...

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడ్జెట్లో కేవలం 309.13 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. వాస్తవానికి పునరావాసం, ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు రూ.2 వేల కోట్లకుపైగా అవసరం అవుతాయని అధికార పార్టీ పెద్దలే చెబుతున్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిర్వాసితుల పరిహారం గురించి నోరు మెదపడంలేదు. పునరావాసం గురించి మాట్లాడడంలేదు. కానీ, గత ప్రభుత్వ హయాంలో విడుదలై పనులు పూర్తి చేసుకున్న తాగునీటి పథకాన్ని ప్రారంభించడానికి మాత్రం హంగామా చేస్తున్నారు. కూటమి పాలకుల తీరు నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఉందని ప్రజాసంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

మార్కాపురం జిల్లా సంగతేంటి సారూ...

మేము అధికారంలోకి వస్తే మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించిన తర్వాతే మార్కాపురంలో అడుగుపెడతామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని ఇక్కడి ప్రజలు గుర్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఇప్పటి దాకా మార్కాపురం జిల్లా గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కనీసం ఆ దిశగా ఎలాంటి అడుగులు పడలేదు. ఆ మధ్య మార్కాపురం వచ్చిన సీఎం చంద్రబాబు మార్కాపురం జిల్లా ఇప్పుడే కాదు.. దానికి ఇంకా సమయముందని చావుకబురు చల్లగా చెప్పారు. దాంతో మార్కాపురం ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని వాపోతున్నారు. జిల్లా సంగతి దేవుడెరుగు.. పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలకు మంగళం పాడారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై శరవేగంగా నిర్మాణాలు చేసుకుంటున్న వైద్య కళాశాల పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. బోధనాస్పత్రి కోసం నియమించిన ప్రొఫెసర్లు, స్పెషలిస్ట్ డాక్టర్లను బదిలీ చేసేశారు. మార్కాపురం అభివృద్ధికి చిల్లిగవ్వ కేటాయించకుండా ఒట్టిమాటలు చెబుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఇదేం విడ్డూరం

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న వాటర్‌గ్రిడ్ పనులకు జలజీవన్ మిషన్ పథకం పేరుతో మళ్లీ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉంది. పశ్చిమ ప్రకాశం పరిధిలోని నియోజకవర్గాల్లో ఫ్లోరైడ్ బాధిత ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టింది. అందులో భాగంగా రూ.75 కోట్లతో నిర్మించే ఇన్‌టెక్‌వెల్ పనులు చివరిదశకు చేరుకున్నాయి. శ్రీశైలం ఫ్లడ్‌వాటర్‌ను వెలిగొండ ప్రాజెక్టుకు విడుదల చేసి నల్లమల సాగర్ రిజర్వాయర్ నింపాల్సి ఉంది. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించండి. ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీళ్లు అందించండి.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు

మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు ఎందుకు.?

భోగాపురం ఎయిర్ పోర్టుకు మళ్లీ శంకుస్థాపన చేసినట్లు, వెలిగొండ ప్రాజెక్టుకు పదే పదే శంకుస్థాపన చేసినట్లు, తాగునీటి పథకానికి మళ్లీ శంకుస్థాపన చేయడం చెల్లికి మళ్లీ మళ్లీ పెళ్లి చేసినట్టుంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇక్కడకు వచ్చే ముందు వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి నీళ్లు ఇచ్చి ఉంటే బాగుండేది. ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలి. మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించిన తర్వాతే ఇక్కడ అడుగు పెట్టాలి. అంతేగానీ ఇప్పటికే ఒకసారి శంకుస్థాపన చేసిన పథకానికి మళ్లీ టెంకాయ కొట్టడం ఎందుకు? ఈ పథకానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.1,290 కోట్లు మంజూరు చేశాం. పాత ప్రాజెక్టులకు కొత్త పేరు పెట్టడం టీడీపీకి బాగా అలవాటు. గోబెల్స్ సిద్ధాంతాన్ని టీడీపీ ప్రభుత్వం పొలిటికల్ ఫిలాసఫీగా మార్చుకుంది. అబద్ధాన్ని నిజంగా, నిజాల్ని అబద్ధంగా పదే పదే ప్రచారం చేసుకుంటుంది. దీన్ని ప్రజలు ఏ మాత్రం హర్షించరు.

– తాటిపర్తి చంద్రశేఖర్, వై.పాలెం ఎమ్మెల్యే

నిర్వాసితుల సమస్య పట్టించుకోకుండా...

తాము అధికారంలోకి వస్తే ఏడాది తిరిగేసరికల్లా వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేస్తానని నాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. నేటికి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గతేడాది కాలంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఆయన ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. జాతికి అంకితం కూడా చేశారు. ఈ ప్రాజెక్టు కారణంగా 11 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. గొట్టిపడియ గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతుంది. మొత్తం మీద సుమారు 7270 కుటుంబాలు నిర్వాసితులవుతున్నారని అంచనా. ఇందుకుగానూ తొలి ప్రాధాన్యతగా నిర్వాసితుల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. చంద్రబాబు ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను గాలికివదిలేసినట్లే కనిపిస్తోందని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. 11 గ్రామాలకు చెందిన నిర్వాసితులలో కేవలం కొంతమందికి మాత్రమే తాత్కాలిక పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మిగిలిన వారికి ఒట్టి చేతులు చూపుతున్నారు. నిజానికి నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, పునరావాస కాలనీలను పూర్తి చేయకుండా ప్రాజెక్టులోకి నీరురావడం కష్టమేనని నీటి పారుదలశాఖ నిపుణులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వాసితుల పునరావాస కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించింది

ముంపునకు గురవుతున్న గొట్టిపడియ గ్రామం వ్యూ

కూటమి పాలనపై అధికారులకు విరక్తి

- చంద్రబాబు తీరుతో విసిగివేసారి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల రాజీనామాలు
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శలు

ఒంగోలు సిటీ:

కూటమి ప్రభుత్వ అధ్వానపు పాలనకు ప్రజలతో పాటు ఉన్నతాధికారులు సైతం విసిగివేసారి పోతున్నారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. చంద్రబాబు తీరుతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం వీఆర్ఎస్ ఇచ్చి వెళ్లిపోతున్నారన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి దుస్థితి లేదన్నారు. ఈ రాష్ట్రంలో ఉండలేమని కొందరు, ఇక్కడ ఉద్యోగాలు చేయలేమని మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజీనామాలు చేయడం చంద్రబాబు నిరంకుశ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. దీనిని బట్టి చూస్తే చంద్రబాబు పాలన ఎంత అధ్వానంగా ఉందో అర్థంచేసుకోవచ్చని తెలిపారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో అనుభవజ్ఞుడినని చెప్పుకునే చంద్రబాబు ఎంతగానో దిగజారిపోయారని, చివరికి ఎవరినైనా అంతం చేయాలని మాట్లాడే స్థాయికి చేరుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒకవైపు ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అసంతృప్తితో రగలిపోతున్నారని చెప్పారు. మరోవైపు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రంలోని ప్రజలను మోసం చేసిన కూటమి పాలకులు చేస్తున్న ఆగడాలు మితిమీరిపోయాయని చెప్పారు. జగనన్న ప్రజల్లోకి వెళతానంటే రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించలేని దుస్థితిలో ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్తే అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోందని మండిపడ్డారు. పల్నాడు జిల్లా పర్యటనలో జగన్ కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి మరణించినట్లు ఫేక్ వీడియోలు సృష్టించి కేసులు నమోదు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. చివరికి సర్వోన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేస్తేగానీ బుద్ధిరాలేదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో గత ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందని అన్నారు. అందుకు విరుద్ధంగా కూటమి పాలనలో సొంత మనుషులకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, అశ్రిత పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలను రాజ్యాంగబద్ధంగా అందించాల్సిన బాధ్యతను రాష్ట్రంలోని కూటమి పాలకులు మరిచి పోయారని చెప్పారు. రైతుల సంక్షేమానికి బీటలు వేయకుండా బాటలు వేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగ బద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులను కాపాడాలని మేరుగు నాగార్జున కోరారు.

డీఆర్‌ఓ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

మంచినీటి సమస్యను పరిష్కరించాలని డీఆర్వోకు వినతిపత్రం...

సంతనూతలపాడు నియోజకవర్గంలో గత 20 రోజుల నుంచి మంచినీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలకు మల్లవరం డ్యామ్ నుంచి నీరందించే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. మోటార్లు చెడిపోయాయని అధికారులు ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్నారన్నారు. అధికారులకు ఫోన్ చేస్తే సరైన స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌కు చెబుదామని వస్తే ఆమె సెలవులో ఉన్నారని, జేసీని కలుద్దామంటే ఆయన క్యాంపులో ఉన్నారని అన్నారు. చివరికి డీఆర్ఓ ఓబులేసును కలిసి సమస్య తీవ్రతను వివరించి వినతిపత్రం అందజేశారు. తక్షణమే అధికారులను అప్రమత్తం చేసి మద్దిపాడు, నాగులప్పలపాడు మండలాల ప్రజలకు మంచినీరు సరఫరా చేయాలని మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బెజవాడ శ్రీరామమూర్తి, బి.బాలాంజిరెడ్డి, తెల్లా పుల్లారావు, పల్లపాటి అన్వేష్, గుడ్డపాతల రవి, పైడిపాటి వెంకట్రావ్, బొమ్మల రామాంజనేయులు, నాదెండ్ల మహేష్, రాయపాటి విల్సన్, మందా ప్రసాద్, పైనం ప్రభాకర్, కంకణాల సురేష్, రమణమ్మ, అంజమ్మ, వినోద్, మందా చిన్న, మహేష్, పోలినేని కోటేశ్వరరావు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలడుగు రాజీవ్, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, తగిరస సుబ్బారావు, జెట్టి శ్రీనివాసరావు, పాలేరు నాగేశ్వరరావు, ఎస్సీ నాయకులు కందుల డేనియల్, సంతనూతలపాడు మండల ప్రెసిడెంట్ దుంపా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనే నాథుడే లేడు...

పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని ఆదుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చివెళ్లిన సమయంలో హడావిడి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆ తర్వాత గాలికొదిలేశారని మేరుగు నాగార్జున విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేస్తుందని, మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతుందని, కేంద్రానికి అప్పగిస్తుందని సీఎం చెప్పారని గుర్తు చేశారు. ఆయన చెప్పిన మాటలన్నీ ఒట్టిమాటలేనని తేలిందన్నారు. నేటికీ పొగాకు కొనే నాథుడే లేడన్నారు. వర్జీనియా పొగాకు, నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయడం లేదన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, తక్షణమే పొగాకు కొనుగోలు చేసేలా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారని చెప్పారు. మిర్చి రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. శనగ రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల మీద కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ రైతులను ఆదుకోవడంలో లేదని విమర్శించారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

- యువత భవితతో ఆడుకుంటే సహించేదిలేదు
- ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఎస్పీ దామోదర్ ఆకస్మిక తనిఖీలు

ఒంగోలు టౌన్: గంజాయి, డ్రగ్స్, తదితర మాదక ద్రవ్యాల ద్వారా యువత భవితతో చెలగాటమాడితే సహించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ అక్రమార్కులను హెచ్చరించారు. యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం లేకుండా వాటిపై ఉక్కుపాదం మోపేందుకు ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని కాలేజీలు, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిర్మూలించేందుకు ఈగల్ టీం, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులతో కలిసి ఒంగోలు రైల్వేస్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం టు కొల్లాం ఎక్స్‌ప్రెస్‌లో కొంత దూరం ప్రయాణించి రైలు బోగీలను తనిఖీ చేశారు. ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాలు, రైలు బోగీలు, పార్శిల్ సర్వీసు సెంటర్, అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి పార్శిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని డీ అడిక్షన్ సెంటర్లో చేర్పించి చికిత్స చేయించడం, మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం వంటి చర్యలను తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. రైల్వేస్టేషన్లు, బస్సు డిపోలు, పార్శిల్ సర్వీసులను తరచూ తనిఖీ చేస్తామన్నారు. ఇకపై నిరంతరాయంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అక్రమంగా మాదక ద్రవ్యాలు విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, స్థానిక పోలీసులు, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీలలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, మహిళా పీఎస్ సీఐ సుధాకర్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, తాలూకా సీఐ విజయకృష్ణ, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలా షరీఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, ఈగల్ టీం, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రైలులో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న జీఆర్‌పీ సిబ్బంది



ఒంగోలు రైల్వేస్టేషన్‌లో మాదకద్రవ్యాల తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు

రైతుకు కష్టకాలం!

- పెరిగిన పచ్చిరొట్ట విత్తనాల ధరలు
- పచ్చిరొట్ట సాగుపై అదనపు భారం
- జిల్లాలో అరకొరగా పంపిణీ

బేస్తవారిపేట:

వ్యవసాయాన్ని నమ్ముకున్న అన్నదాతకు ఏటా సాగు ప్రారంభం ముందు ఏదో ఒకరకంగా భారం పడుతోంది. ఓ పక్క పెరిగిన ఎరువుల ధరలు, మరో పక్క విత్తనాల ధరలతో సతమవుతున్న రైతన్నకు భూసారం పెంచే పచ్చిరొట్ట విత్తనాల ధరలు మరికొంత భారాన్ని మోపుతున్నాయి. రైతులు పంట సాగుకు ముందు భూమి సారవంతం పెంచుకునేందుకు పచ్చిరొట్టగా జీలుగ పంటను సాగు చేస్తారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా జీలుగ, జనుము, పిల్లిపెసర పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. జీలుగ సాగు నేల స్వభావాన్ని మెరుగుపరిచి, పంటల దిగుబడిని పెంచుతుంది. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత తెలుసుకున్న రైతులు తమ భూముల్లో పంట సాగుకు మందు ఈ పంటలు సాగు చేసేందుకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల ధరలను రెండింతలు పెంచింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూసారం పెంచేందుకే..

జీలుగ, జనుము, పిల్లిపెసరను పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి 45 రోజుల తర్వాత కలియదున్నడం ద్వారా నేల సారవంతం అవుతుంది. ఇది నీటి సామర్థ్యాన్ని పెంచి రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్పేట్, జింక్, క్యాల్షియం, ఐరన్ వంటి సూక్ష్మపోషకాలను పంటలకు అందిస్తుంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను తొలకరి వర్షాల తర్వాత విత్తి పూత దశలో దుక్కి దున్నడంతో అధిక స్థాయిలో ఎరువు తయారవుతుంది. టన్ను ఎరువులో ఆరు కిలోల నత్రజని, రెండు కిలోల భాస్వరం, మూడు కిలోల పొటాష్ లభిస్తుంది. ఇది రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి రైతుల పెట్టుబడి ఖర్చును తగ్గిస్తుంది.

అరకొరగా విత్తనాలు

రైతులు వర్షాలు పడిన వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అరకొరగానే జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల కేటాయించినట్లు తెలుస్తోంది. ఇవి 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేయనున్నారు. పెంచిన ధరలు తగ్గించడంతో పాటు రైతుల సాగుకు సరిపడా విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగులో ఉన్న జీలుగ పంట

పెరిగిన ధర

గతేడాది నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేయలేదు. ఈ ఏడాది ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేదు. అప్పుల్లో కూరకపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడికి అప్పులు తెచ్చుకుంటున్నారు. ఈ సమయంలో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల ధరలను ప్రభుత్వం పెంచింది.

విత్తనాల రకం	2024 ధర (10 కిలోలు)	2025లో ధర
పిల్లి పెసర	670	900
జీలుగ	440	610
జనుము	440	540

జీలుగ, పిల్లిపెసర, జనుము పంపిణీ వివరాలు

- జీలుగ విత్తనాల కోసం జిల్లాలోని 38 మండలాల్లో 1516 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 1210 మంది రైతులు నగదు చెల్లించారు. 1176 మంది రైతులకు 337.90 క్వింటాళ్లు పంపిణీ చేశారు.
- పిల్లిపెసర విత్తనాల కోసం జిల్లాలోని 11 మండలాల్లో 154 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 140 మంది నగదు చెల్లించారు.
- జనుము విత్తనాలకు 4,165 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 3,110 మంది రైతులు నగదు చెల్లించారు.

చెక్కు బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు

ఒంగోలు: చెక్కు బౌన్స్ కేసులో రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి కోమలవల్లి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అమ్మనబ్రోలుకు చెందిన పబ్బిశెట్టి సాయికృష్ణ వద్ద ఒంగోలుకు చెందిన ఎస్.సుబ్రహ్మణ్య వరప్రసాద్ కుటుంబ అవసరాల నిమిత్తం 2017 జూన్ 12న రూ.2లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుగాను నిందితుడు 2019 నవంబర్ 20న బాకీ నిమిత్తం రూ.2.50 లక్షలకు చెక్కు ఇవ్వగా ఫిర్యాది పబ్బిశెట్టి సాయికృష్ణ దానిని బ్యాంకులో దాఖలు చేశారు. చెక్కు బౌన్స్ అయినట్లు బ్యాంకు అధికారులు స్పష్టం చేయడంతో ఫిర్యాది కోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం నిందితునిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ ఫిర్యాదికి రూ.4లక్షలు పరిహారం చెల్లించాలని నిందితుడ్ని ఆదేశించారు. నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

స్త్రీనిధి బకాయిలు త్వరగా వసూలు చేయండి

మాట్లాడుతున్న సెర్ప్ డీజీఎం ఉమామహేశ్వరరావు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో స్త్రీనిధి బకాయిలు రూ.1.09 కోట్లు పేరుకుపోయాయని, ఈ నెల 15వ తేదీ లోగా రికవరీ చేయాలని సెర్ప్ డీజీఎం ఉమామహేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం స్త్రీ నిధి బకాయిలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిల వసూళ్లలో అవకతవకలకు పాల్పడినా, ఒకరిపై జమ కావాల్సిన గదు ఇతరులపై జమ చేసినా పూర్తిస్థాయి విచారణ చేసి అధికారుల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఏజీఎం ఉదయ్‌కుమార్, స్త్రీ నిధి మేనేజర్ ఎస్ పద్మావతి, ఏపీఎం డి.జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

- రాజుపాలెం నేషనల్ హైవేపై ప్రమాదం

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం రాజుపాలెం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..మార్కాపురం నుంచి గుంటూరు వైపు వెళుతున్న మినీ లారీని ఎదురుగా వస్తున్న లారీ ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి మినీ లారీని ఢీకొట్టింది. దీంతో వాహనంలో డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న కాయకాకుల రాము (35) మృతి చెందాడు. ఇతని స్వస్థలం మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీ. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్సై శివ బసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఎంపికైన వారిలో జి.వెంకట సౌమ్యశ్రీ(ఈపీ విభాగం గోల్డ్), డి.లక్ష్మీ షణ్ముక ప్రియ(ఈపీ విభాగం బ్రాంజ్), సీహెచ్ జైత్ర(ఈపీ విభాగం బ్రాంజ్), డి.చరణ్‌సాయి(ఈపీ విభాగం బ్రాంజ్)లు ఉన్నారు. వీరు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు మహారాష్ట్ర నాసిక్‌లోని డివిజినల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మినాతాయ్ ఠాకేర్ స్టేడియంలో జరిగే 7వ బాలల (అండర్ 10), 13వ మినీ(అండర్ 12) జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుర్రా భాస్కరరావు, కూనపరెడ్డి శివశంకర్ అభినందించారు.

శేష వాహనంపై సీతారామస్వామి

నగరోత్సవంలో శేష వాహనంపై సీతారామస్వామి

ఒంగోలు మెట్రో: నగరంలోని పప్పుబజారులో వేంచేసిన సీతారామస్వామి మందిర 65వ వార్షిక కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి నిర్వహించిన శేష వాహన సేవ నయన మనోహరంగా సాగింది. శేష వాహనంపై నగరోత్సవానికి బయలుదేరిన శ్రీరామచంద్ర స్వామికి భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రాజకీయ కక్షతో రచ్చబండ ధ్వంసం

- అధికార పార్టీ నేతలకు పోలీసుల మద్దతు
- కూల్చివేతను అడ్డుకున్న మహిళలపై పోలీసుల దురుసు ప్రవర్తన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికార అండగా గ్రామాల్లో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఏదో ఒక విధంగా అలజడులు సృష్టిస్తున్నారు. కొండపి మండలం జాళ్లపాలెంలో 20 ఏళ్లుగా ఉన్న రచ్చబండను పోలీసుల సాయంతో ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే..జాళ్లపాలెంలోని సర్వే నంబర్ 627లో 3.57 ఎకరాల భూమి ఉ.ది. గ్రామంలోని పాఠశాలలు, బోరుపంపులు, రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు పోను 50 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలానికి సుమారు 20 మంది హక్కు కలిగి ఉన్నారు. అందులోనే టీడీపీ సానుభూతిపరుడికి సెంటు స్థలం ఆన్‌లైన్‌లో ఉంది. ఆ 50 సెంట్ల స్థలంలోనే 20 ఏళ్లుగా రచ్చబండ ఏర్పాటు చేసి ఉన్నారు. 2023లో రచ్చబండను పంచాయతీ నిధులతో తిరిగి నిర్మించారు. అయితే రచ్చబండ స్థలంపై కన్నేసిన టీడీపీ సానుభూతిపరుడు నా సెంటు స్థలంలోనే రచ్చబండ ఉందని వాదిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పోలీసుల సాయంతో జేసీబీతో రచ్చబండను ధ్వంసం చేశారు. రచ్చబండ మధ్యలో

ధ్వంసమైన రచ్చబండ.

ఉన్న చెట్టును కూడా కూల్చివేయాలని చెట్టు కొమ్మలను కూడా కూల్చివేశారు. విషయం తెలుసుకున్న గ్రామ మహిళలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. అయితే పోలీసులు మహిళలను అడ్డుకొని వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. అసలు పట్టా భూమిలోకి పోలీసులు రావాల్సిన అవసరం లేదని, కేవలం మంత్రి స్వామి ఆదేశాలతోనే ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడులు సృష్టిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. టీడీపీ సానుభూతిపరుడికి ఉన్న సెంటు స్థలానికి రచ్చబండ ఉన్న ప్రాంతానికి ఎటువంటి సంబంధం లేదని, కేవలం రాజకీయ కక్ష్యతోనే ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా..50 సెంట్ల స్థలానికి సంబంధించి రెవెన్యూ శాఖ గానీ, సర్వే శాఖ గానీ నిర్ధారించలేదని, సివిల్ కోర్టుకు వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించామని తెలిపారు.

రచ్చబండ ధ్వంసాన్ని అడ్డుకుంటున్న మహిళలు

పవన్‌కల్యాణ్ పర్యటనకు స్కూళ్లు బంద్

సాక్షి నెట్‌వర్క్: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మార్కాపురం మండలం గొట్టిపడియ పర్యటన సందర్భంగా మార్కాపురంలోని ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కార్యక్రమానికి జనాలను తరలించేందుకు ప్రైవేట్ పాఠశాలల బస్సులను అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా బస్సులు తిరిగే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కంభం మండలంలో కూడా ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కొన్ని పాఠశాలలు పూర్తిగా సెలవు ప్రకటించగా, మరికొన్ని పాఠశాలలు పల్లెల నుంచి విద్యార్థులను పాఠశాలలకు తీసుకురాకుండా నడిపేలా చర్యలు తీసుకున్నారు. కాగా పవన్‌కల్యాణ్ పర్యటన కోసం సెలవు ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పవన్‌కల్యాణ్ పర్యటనకు పొదిలిలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను పంపాలని అధికారులు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఏం చేయాలో తెలియక పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు వచ్చే బస్సులను పంపిస్తే ఎలా అని మదనపడ్డారు. గిద్దలూరులోని ప్రైవేట్ పాఠశాలలకు ఒక్కో బస్సు చొప్పున పంపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యార్థులను పాఠశాలలకు ఎలా తీసుకురావాలో తెలియక పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నారు.

పశువుల దాణాపై వైద్యశాలలో విచారణ

- పశు వైద్య సిబ్బందిపై పాడి రైతులు ఆగ్రహం
- విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న ఏడీ
- పశుపోషకులకు దాణా పంపిణీ

మద్దిపూడి: మద్దిపూడి పశువైద్యశాలలో సిబ్బంది దాణా పేరుతో పశుపోషకుల వద్ద నగదు మింగేసిన వైనంపై ×దాణా సొమ్ము మేశారు₹ అన్న శీర్షికన సాక్షిలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. పాడిలి సహాయ సంచాలకుడు డాక్టర్ పి.వేణు గురువారం వైద్యశాలకు వచ్చారు. దాణా బస్తాల కోసం అప్పటికే గుంపులు కూడిన పశుపోషకులు ఒక్కసారిగా పశు వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాణా ఇవ్వనప్పుడు మా వద్ద నగదు ఎందుకు తీసుకున్నారని వైద్య సిబ్బందిని నిలదీశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులతో ఏడీ డాక్టర్ పి.వేణు మాట్లాడారు. ఎంత మంది రైతులు నగదు చెల్లించారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందిపై ఆయన మండిపడ్డారు. రైతులకు దాణా ఇచ్చాకే డబ్బులు తీసుకోవాలే గానీ ముందుగా ఎలాంటి నగదు తీసుకోవద్దని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. అన్నీ రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మలివిడతలో దాణా వస్తుందని, అప్పుడు మండలంలోని అన్నీ గ్రామాల పశుపోషకులకు పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు మంచెకల మణిశేఖర్, బ్రహ్మయ్య, పశుపోషకులు ఉన్నారు.



వైద్యశాలలో విచారణ చేస్తున్న పాడిలి సహాయ సంచాలకుడు డాక్టర్ వేణు

పరాకాష్టకు చేరిన రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్

మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పరాకాష్టకు చేరిందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పెద్ద కండ్లగుంట పంచాయతీ జాళ్లపాలెంలో గురువారం రచ్చబండ కూల్చడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ మంత్రి స్వామి ఆదేశాల మేరకు సర్వే నెంబర్ 627లో ఉన్న ఒక సెంటు స్థలంలో గ్రామస్తుల పంచాయతీ ఆమోదంతో నిర్మించుకున్న రచ్చబండను దౌర్జన్యంగా కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సైకి ఫోన్ చేసినా, మెసేజ్ చేసినా అందుబాటులోకి రాలేదన్నారు. అక్కడి దౌర్జన్యాలను వీడియో తీసి ఎస్పీ దామోదర్, డీఎస్పీ, వాట్సప్‌లో ఫిర్యాదు చేశామని, కొంత సమయం తర్వాత డీఎస్పీ స్పందించి ఎస్ఐతో మాట్లాడారని, ఆ తర్వాత ఎస్సై ప్రేమ్‌కుమార్ అక్కడి నుంచి తన సిబ్బందితో వెళ్లిపోయారన్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని, దీనికి బాధ్యులు ఎవరని సురేష్ ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీకి, ఐజీకి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తామని హెచ్చరించారు. కేవలం రాజకీయ కక్షతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే ఉద్దేశంతో అందరూ ఒకచోట కూర్చోకూడదనే కక్షతో రచ్చబండను కూల్చివేసే స్థాయికి టీడీపీ నేతలు దిగజారారని మండిపడ్డారు. హుందాగా వ్యవహరించాల్సిన పోలీసులు మంత్రి ఆదేశాలతో టీడీపీ నాయకులకు సహకరించారని, మహిళలను రచ్చబండ వద్దకు రాకుండా అడ్డుకున్నారన్నారు. అధికారులు కూడా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎప్పుడు ఒకే ప్రభుత్వం ఉండదని, తమ ప్రభుత్వం కూడా అధికారంలోకి వస్తుందని, నష్టపోయిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటామని, ప్రతి ఒక్కరికీ వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలపై, వైద్య విద్యార్థులపై దాడులు, అక్రమ కేసులు రెడ్‌బుక్‌లో భాగమేనన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేస్తున్నారని, కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కటీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గమనిస్తున్నారని మాజీ మంత్రి సురేష్ భరోసా ఇచ్చారు.

ఉపాధ్యాయుడి బదిలీ..ఊరంతా కదిలి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): ఉపాధ్యాయుడి బదిలీకి ఊరంతా తరలివచ్చింది. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ కలిసి తప్పెట్లు తాళాలతో పండుగ వాతావరణంలో టీచర్‌ను ఊరేగించారు. ఈ సంఘటన వెలిగండ్ల మండలం పద్మాపురం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..పద్మాపురం పాఠశాలలో 8 ఏళ్లు ఎస్‌జీటీ ఉపాధ్యాయునిగా పనిచేసిన ఎస్‌కే సందాని బాషా ఇటీవల జరిగిన బదిలీల్లో కొటాలపల్లికి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు టీచర్ సందాని బాషాకు బుధవారం రాత్రి బదిలీ సన్మాన కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓ దాసు ప్రసాద్‌లు మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తులతో మమేకమై ప్రజల మన్నలను పొందిన టీచర్ సందాని బాషా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయుడు హరిబాబు, ఉపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, రవి కుమార్, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, దేవసహాయం, చల్లా సత్యన్నారాయణ, రమణారెడ్డి, రమణయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలకృష్ణా, వైస్ చైర్మన్ సౌజన్య, చిన్నయ్య, లాభాను, ప్రసన్న, మాలకొండయ్య పాల్గొన్నారు.



ఊరేగింపుగా సాగనంపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు

మీటర్ ఏర్పాటు చేయకుండా కాలయాపన

- కూటమి నేతల ప్రోద్బలంతో విద్యుత్ లైన్ తొలగింపు

కొనకనమిట్ల: తమ పశువులకు నీరు అందించేందుకు బోరుకు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలంటూ గతంలో విద్యుత్ శాఖ అధికారులకు డీడీ కట్టామని, అయినా అధికారులు మీటర్ ఏర్పాటు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వెంగళపల్లికి చెందిన ఏదుబాటి వెంకట్రావుతో పాటు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోరు, రేకుల షెడ్‌కు సమీపంలో విద్యుత్ లైన్ కూడా ఉంది. డీడీ తీసిన తర్వాత బోరు నుంచి పశువులకు నీరు వాడుతున్నారు. ఇటీవల కూటమి నాయకుల ప్రోద్బలంతో విద్యుత్ అధికారులు లైన్ తొలగించారు. ఈ విషయమైన గత రెండు వారాల క్రితం సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం వెంకట్రావు అందజేశారు. స్పందించిన కలెక్టర్ మీటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అయినా కలెక్టర్ ఆదేశాలు లెక్కచేకుండా గురువారం ఏఈ బ్రహ్మం తన సిబ్బందితో వెంగళపల్లి వచ్చి ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగించారని వెంకట్రావు వాపోయారు. పక్కనే కూటమి నాయకులకు మాత్రం విద్యుత్ లైన్ ఏర్పాటు చేసిన అధికారులు తమకు కనెక్షన్ ఇవ్వడంలో ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకుల ప్రోద్బలంతో అధికారులు పక్షపాతవైఖరి అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి మీటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ బ్రహ్మం వివరణ ఇస్తూ విద్యుత్ లైన్‌కు 30 మీటర్ల పరిధిలో ఉంటే మీటర్ బిగిస్తామనిగానీ వెంకట్రావు రేకుల షెడ్ దూరంగా ఉండటంతో మీటర్ ఏర్పాటు చేయలేదన్నారు. రెండు స్తంభాలకు డీడీ తీస్తే కొత్త లైన్ వేసి మీటర్ ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న వెంకట్రావు, స్థానికులు

రెండు లారీలు ఢీ

- ముగ్గురికి గాయాలు

జరుగుమల్లి(సింగరాయకొండ): నిద్రమత్తులో రోడ్డు మార్జిన్‌లో ఆగిన లారీ వెనకభాగాన్ని కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటన గురువారం ఉదయం జరుగుమల్లి మండల పరిధిలోని జాతీయరహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద జరిగింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం..నెల్లూరు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ వాష్‌రూమ్ కోసం హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో లారీ ఆపి వాష్‌రూమ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో నిద్రమత్తులో ఉన్న కంటైనర్ లారీ డ్రైవర్ కృపాశంకర్ ఉపాధ్యాయ్ రోడ్డు పక్కన ఆగిన లారీ వెనకభాగాన్ని బలంగా ఢీకొన్నాడు. ఘటనలో కంటైనర్ లారీ ముందు భాగం తీవ్రంగా దెబ్బతినగా లారీ డ్రైవర్ కృపాశంకర్ ఉపాధ్యాయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై జరుగుమల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు వివరించారు.

ప్రమాదంలో దెబ్బతిన్న కంటైనర్ లారీ ముందు భాగం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-235]

Wanted

■ ఒంగోలుపట్టణ వివాహిత మహిళలకు (20మందికి మాత్రమే) ప్రముఖ కంపెనీలో పర్మినెంట్ జాబ్ అవకాశము Q:డిగ్రీ, వ.21-30సం. పైన, జీ.17000 సెల్.9848526399, 9247124530. [SCA25005892]

■ ఒంగోలు ఫర్నిచర్ షాప్‌లో పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను వయసు (18 టు 35) ఉండవలెను. జీ.12000/- ఇవ్వబడును. సెల్: 90305 90855. [SCA25005738]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర।। 99084 29239 [G-624]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 4 । జూలై । 2025



సోమశిలలో 30.97 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 30.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4555 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,230
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,073
3 శాతం జీఎస్టీతో	రూ.9,345
సవర (8 గ్రా)	రూ.74,760

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.4 /26.6

జిల్లాలో ఆకాశం శుక్రవారం మేఘావృతమై ఉంటుందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 57 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

వరికుంటపాడు: మండలంలోని తూర్పు బోయమడుగు ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంగయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను డీఈఓ బాలాజీరావు గురువారం జారీ చేశారు. దీన్ని ప్రధానోపాధ్యాయుడికి ఎంఈఓలు రమేష్, రమణయ్య అందజేశారు. పాఠశాలలో బాలికలతో వెంగయ్య అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ గ్రామస్తులు రెండు రోజుల క్రితం దేహశుద్ధి చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి నివేదిక పంపారు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటేశారు.

రొట్టెల పండగకు పటిష్ట బందోబస్తు

రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: రొట్టెల పండగకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. పరిసరాలు, కంట్రోల్ రూమ్, వాహన పార్కింగ్ ప్రదేశాల్లో చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్గా మార్గంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఘాట్ ఏరియా, రొట్టెల మార్పిడి చేసే ప్రదేశాలను సందర్శించారు. భక్తుల రద్దీకి తగిన విధంగా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

కాసులిచ్చుకో.. బ్రాంచీలు పెట్టుకో..!

జిల్లాలో కార్పొరేట్ యాజమాన్యాల ధనదాహానికి అడ్డే లేకుండాపోతోంది. ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండానే బ్రాంచీలను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఫీజులను ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నా, దానికి తగిన విధంగా వసతులను కల్పించడంలో దారుణంగా విఫలమవుతున్నారు. బోర్డు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్నా, ప్రేక్షకపాత్రకే అధికారులు పరిమితమవుతున్నారు. ముడుపులను పుచ్చుకుంటూ.. అంతా సక్రమమనే రీతిలో వారు వ్యవహరిస్తున్నారు.

ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండానే విచ్చలవిడిగా ఏర్పాటు

- నిర్మాణం జరుగుతుండగానే.. తరగతులు, హాస్టల్ నిర్వహణ
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- చివరికి అపార్ట్‌మెంట్లలోనూ క్లాసులు
- కార్పొరేట్ యాజమాన్యాల ఆగడాలు
- ముడుపులతో మౌనం వహిస్తున్న అధికారులు

అనుమతి లేకుండానే నిర్మాణంలో ఉన్న ఓవెల్ కళాశాల భవనం

నెల్లూరు(టౌన్): ఇంటర్ విద్యను రాష్ట్రంలో అపహాస్యం చేస్తున్నారు. కాసులు సమర్పిస్తే.. ఎక్కడైనా బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు గ్రీన్ సిగ్నలిస్తున్నారు. తమ పిల్లలు బాగా చదివి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తల్లిదండ్రుల ఆశలను చక్కగా క్యాష్ చేసుకుంటూ.. వారికి వసతులను కల్పించడంలో ఏ మాత్రం ఆసక్తి చూపడంలేదు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 140కుపైగా జూనియర్ కళాశాలలున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 45 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. నీట్, ఐఐటీ లాంగ్ టర్మ్ కోచింగ్‌ను మరో రెండు వేల మంది వరకు పొందుతున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందంగా కళాశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తూ జిల్లా వ్యాప్తంగా పలు బ్రాంచీలను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే వీటికి ప్రభుత్వ గుర్తింపు ఉండటం లేదు. మెయిన్ బ్రాంచీల్లో సెక్షన్లకే పర్మిషన్లు పొంది విడిగా బ్రాంచీలను ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువ మందిని చేర్చుకుంటున్నారు. గాలి, వెలుతురు లేకుండా అపార్ట్‌మెంట్లలో క్లాసులను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఫైర్, సౌండ్‌లెస్, ఎన్‌ఓసీ తదితర సర్టిఫికెట్లు వీటికి ఉండవు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల పరిస్థితి ఏమిటో అంతుచిక్కడంలేదు.

మంత్రి గారి కళాశాలలా.. వామ్మో

కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఆయా యాజమాన్యాలు వ్యాపార కేంద్రాలుగా మార్చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యాసంవత్సరంలో ఫీజులను 20 నుంచి 30 శాతం మేర పెంచేశారు. డే స్కాలర్, హాస్టల్, కళాశాలను బట్టి ఒక్కొక్కరి వద్ద రూ.35 వేల నుంచి రూ.మూడు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అదే మంత్రి నారాయణ కళాశాలల్లో అయితే వసూళ్లలో నియంత్రణే ఉండదు. దీంతో పాటు కాలేజీని బట్టి పుస్తకాలకు రూ.పది వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. యూనిఫారానికి రూ.ఆరు వేల నుంచి రూ.ఎనిమిది వేలు.. ల్యాబ్‌కు రూ.రెండు వేలను సమర్పించాల్సిందే. మరోవైపు కాలేజీల్లోనే క్యాంటీన్లను యాజమాన్యాలు ఏర్పాటు చేశాయి. బయట కంటే రెట్టింపు ధరలకు ఇక్కడ విక్రయిస్తున్నారు. విరామ సమయంలో విద్యార్థులను కళాశాల బయటకు అనుమతించకపోవడంతో గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ముడుపులతో.. గప్‌చుప్

కళాశాలలకు ప్రభుత్వ గుర్తింపు లేకపోయినా.. అధిక ఫీజులను వసూలు చేస్తున్నా.. నోటీస్ బోర్డులో వివరాలను ప్రదర్శించకపోయినా బోర్డు అధికారులు మిన్నకుండిపోతున్నారు. ముడుపులు అందుతుండటంతో ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్ అయిపోతున్నారు. ఈ వ్యవహారాలపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విద్యార్థి సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వీటిపై కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇదో ఉదాహరణ..

నెల్లూరు రూరల్ పరిధిలోని గొలగమూడి రోడ్డులో ఇథాకా స్కూల్ సమీపంలో ఓవెల్ జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ కాలేజీ భవన నిర్మాణం జరుగుతుండగా, అక్కడ దాని పేరే లేదు. మరోవైపు ప్రభుత్వ గుర్తింపు లేకపోయినా, సదరు భవనంలో తరగతులు, హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ భవన సముదాయంలో వందలాది మంది విద్యార్థులు నిత్యం తిరుగుతుంటారు. నిర్మాణ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి వారు ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాలోని పలు కార్పొరేట్ యాజమాన్యాలు ఇదే తరహాలో విచ్చలవిడిగా బ్రాంచీలను ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు తెలియజేసినా, లైట్ తీసుకుంటున్నారు.

నోటీసులను జారీ చేస్తాం

జిల్లాలో ఎలాంటి గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న కళాశాలలను పరిశీలించి, నోటీసులను జారీ చేస్తాం. తరగతులు, హాస్టల్‌ను నిలిపేయాలంటూ ఓవెల్ యాజమాన్యానికి తెలియజేశాం. అక్కడి నుంచి తొలగించకపోతే విషయాన్ని ఇంటర్ బోర్డు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. అనుమతుల్లేకుండా నిర్వహించకూడదు.

– వరప్రసాదరావు, ఆర్‌ఐఓ

భద్రతపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చంద్రపడియలో గల చిరాన్ యాక్టివ్ ఇంగ్రెడియంట్స్ పరిశ్రమలో కార్మికులు, సిబ్బందికి భద్రతపై అవగాహనను ఉప కర్మాగారాల తనిఖీ అధికారి ఈశ్వర్, తనిఖీ అధికారి శివశంకర్‌రెడ్డి కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి.. ఒక వేళ జరిగితే ఎలాంటి జాగ్రత్తలను పాటించాలనే అంశాలను తెలియజేశారు. పరిశ్రమలో ఉన్న సమస్యలపై ఆరాతీశారు. హెడ్ రామకృష్ణ, జీఎం ధర్మేంద్ర, అజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకాణిపై ఆగని కక్షసాధింపు

- తాజాగా మద్యం కేసులో పీటీ వారెంట్
- ఈ నెల 17 వరకు రిమాండ్
- ఆయనపై ఆరు అక్రమ కేసులు
- రెండు నెలల పాటు బయటకు రాకుండా అడ్డుకునేందుకు యత్నం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసుల పరంపర కొనసాగుతోంది. రిమాండ్‌లో ఉన్న ఆయన్ను మరికొన్ని రోజుల పాటు బయటకు రానీయకుండా మరిన్ని అక్రమ కేసులను నమోదు చేయాలని పోలీస్ అధికారులకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఎక్సైజ్ శాఖ సైతం తలదూర్చి అక్రమ కేసులు బనాయించి ముప్పుతిప్పలు పెడుతోంది. కాకాణిపై సర్కార్ పాల్పడుతున్న కుట్రలతో టీడీపీ శ్రేణులు భవిష్యత్తును తలుచుకొని బెంబేలెత్తుతున్నారు.

వైఫల్యాలను ప్రశ్నించడాన్ని తట్టుకోలేక..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి వారి వైఫల్యాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలను నిరంతరం ఎండగడుతూ వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన సమయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీస్ శాఖ తీరును తప్పుబట్టేవారు. ఈ పరిణామాలు రుచించని ఎమ్మెల్యే, ప్రభుత్వ పెద్దలు ఆయన్ను టార్గెట్ చేశారు. సర్కారు ఏర్పాటైన ఐదు నెలల్లో ఏడు కేసులు నమోదు చేయించారు.

అక్రమ మైనింగ్ చేశారంటూ..

ఇవన్నీ బెయిలబుల్ కిందికొచ్చేవి కావడంతో పొదలకూరు మండలం రుస్తుం మైన్‌లో అక్రమంగా మైనింగ్ జరిపారంటూ మరో కేసును నమోదు చేశారు. ఇందులో ముగ్గురికి హైకోర్టు ముందస్తు బెయిలిచ్చింది. ఏ – 4గా ఉన్న కాకాణికి బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా మరో కొత్త కుట్రను తెరపైకి తెచ్చారు. మైన్‌లో జిలెటిన్ స్టిక్స్ లాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించారని.. ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారని.. అట్రాసిటీ కేసును బనాయించి జైలుకు పంపారు. కాగా ఇదే కేసులో ఏ – 5గా ఉన్న టీడీపీ నేతను మాత్రం విచారణకు ఇప్పటికీ పిలవలేదు.

గ్రావెల్ తవ్వకాలకు జీఓ ఇచ్చినా..

వెంకటాచలం మండలంలోని కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలకు గత టీడీపీ ప్రభుత్వం జీఓను జారీ చేసింది. దీనికి అనుబంధంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల అవసరాల నిమిత్తం జీఓలను రెండుసార్లు విడుదల చేసింది. అందులో నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు జరిగాయి. అయితే కేసులో ఏ – 2గా చూపి రిమాండ్ పొడిగించేలా చేశారు. ప్రస్తుతం ఆ కేసులో పోలీస్ కస్టడీకి పిటిషన్ వేయడంతో సోమవారానికి వాయిదా వేశారు. ఎంపీ శ్రీనివాసులురెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు చేశారని మరో అక్రమ కేసు నమోదు చేసి రిమాండ్ పొడిగించారు. ఇందులోనూ కాకాణిని పోలీస్ కస్టడీకి తీసుకొని విచారణ పూర్తి చేశారు.

లేనిపోనివి తెరపైకి..

ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టు వద్ద లారీ ఓనర్స్, కంటైనర్, కృష్ణపట్నం లాజిస్టిక్ అసోసియేషన్లను గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఏర్పాటు చేసి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల నుంచి వసూలు చేశారని మరో అక్రమ కేసు నమోదు చేశారు. ఇందులోనూ విచారణను పూర్తి చేశారు.

మద్యం కేసును తిరగదోడి..

గత ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాళెం, పొదలకూరు మండలం విరువూరులో మద్యం కేసులు పట్టుబడ్డాయి. అప్పట్లో వీటిని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు. ఈసీ నిబంధనల మేరకు వీటిపై అధికారులు చార్జిషీట్‌ను దాఖలు చేయడంతో కేసులు ముగిశాయి. తాజాగా ఈ రెండింటినీ తిరగదోడి కాకాణిపై పీటీ వారెంట్‌ను జారీ చేయడం వేధింపుల పర్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ధైర్యంగా ఎదుర్కొంటున్న కాకాణి

ఈ కేసులు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్నాయి. అయితే రికార్డులను పోలీస్ శాఖ బిగించి ఎక్సైజ్ అధికారుల ద్వారా సంతకాలు చేయించి.. కాకాణి పేరును నమోదు చేసి కోర్టులో గురువారం హాజరుపర్చారు. ఈ కేసులో ఈ నెల 17 వరకు రిమాండ్ విధించారు. విరువూరు మద్యం కేసులో కాకాణిపై పీటీ వారెంట్‌ను సిద్ధం చేశారు. కస్టడీ పేరుతో బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఎన్ని అక్రమ కేసులను నమోదు చేసినా, కాకాణి మాత్రం ధైర్యంగా ఎదుర్కొంటున్నారు.

రెండు నెలల పాటు రాకూడదని..

కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

అక్రమ మైనింగ్ కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న కాకాణిని మరో రెండు నెలల పాటు బయటకు రానీయకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వ పెద్దలతో పాటు పోలీసులు మరో ఆరు అక్రమ కేసులు బనాయించారు. సోమిరెడ్డి ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యంగ్య చిత్రాలను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారని.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఎమ్మెల్యే అనుచరుడు మేకల సురేంద్ర ఫిర్యాదు మేరకు మంగళగిరిలోని సీఐడీ కార్యాలయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో గుంటూరు కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారు. అయితే తప్పుడు కేసు కావడంతో హైకోర్టు స్టే ఇచ్చింది.

17 వరకు జ్యుడీషియల్ రిమాండ్

నెల్లూరు (లీగల్): మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇందుకూరుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో జూలై 17 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధిస్తూ న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి పీటీ వారెంట్‌పై నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ (ఇన్‌చార్జి) కోర్టులో ఎక్సైజ్ పోలీసులు హాజరుపర్చారు. ఎక్సైజ్ తరపున ఏపీపీ లక్ష్మీనారాయణ.. కాకాణి తరపున రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సిద్ధన సుబ్బారెడ్డి, విజయలక్ష్మి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఇన్‌చార్జి న్యాయమూర్తి నిషాద్ నాజ్‌షేక్ జూలై 17 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఉత్తర్వులిచ్చారు. కాకాణి తరపున బెయిల్ పిటిషన్‌ను న్యాయవాదులు దాఖలు చేశారు.

మహిళా సమస్యలపై ఉద్యమాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళా సమస్యలపై ఉద్యమాలు చేపట్టేందుకు సంబంధించిన కార్యాచరణ నిమిత్తం ఐద్వా మహాసభలను నిర్వహిస్తున్నామని జిల్లా, నగర కార్యదర్శులు మస్తాన్‌బీ, కత్తి పద్మ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. ఐద్వా నగర 16వ మహాసభలను గుర్రాలమడుగు సంఘంలోని జక్కా పార్వతమ్మ, బీబీజాన్ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించి.. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ పేరుతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఐద్వా జిల్లా, నగరాధ్యక్షులు సుబ్బమ్మ, శివకుమారి, రూరల్ అధ్యక్షురాలు వరలక్ష్మి, నేతలు భాగ్యమ్మ, నాజున్నీ, ఆదిలక్ష్మి, మహ్మదా, షాహిన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రజిని, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మస్తాన్‌బీ

నిమ్మ రైతు కంట చెమ్మ

- నెలరోజులుగా తగ్గిన ఎగుమతులు
- తోటల్లో కాయలు వదిలేస్తున్న రైతులు
- ఎన్నడూ లేని విధంగా ధరలు పతనం
- తోటల లీజుదారులకు తీవ్ర నష్టాలు

పొదలకూరు: ఈ ఏడాది నిమ్మ రైతుల కంట చెమ్మ ఆరడం లేదు. నెలరోజులుగా తీవ్ర నష్టాలను చవి చూస్తూ తోటల్లో కాయలను కోయాలంటేనే భయపడుతున్నారు. ఒకవేళ కోసినా కూలీలు, ఆటో బాడుగలకు సరిపోతుండటంతో కష్టమే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులైనా పట్టించుకుని ధరలు పెరిగేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే కాయలను వ్యాపారులు ఏమి చేసుకోవాలో అర్థ కాని పరిస్థితిలో ఉన్నారు.

దశాబ్దాలుగా..

పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 4,500 హెక్టార్లలో నిమ్మతోటలున్నాయి. దానినే జీవనాధారంగా చేసుకుని చిన్న, సన్నకారు రైతులు జీవిస్తున్నారు. దశాబ్దాలుగా నిమ్మను మెట్టరైతుల నుంచి వేరు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే సాగు, అమ్మకాల్లో ఒడిదుడుకులున్నా ఈ ఏడాది నిమ్మ మార్కెట్ అతలాకుతలమైంది. తోటలను లీజుకు తీసుకున్న వారు సైతం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. సీజన్‌లో కాయలు లేవు. ఇప్పుడు విరగ్గాస్తుండటంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఉత్తరాదిన వర్షాల కారణంగా డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు.



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

వచ్చిన నగదు కూలీలకే..

సీజన్‌లో నిమ్మ తోటలో బస్తా కాయలు కోస్తే రైతుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఆదాయం ఉంటుంది. అయితే ఇప్పుడు కాయలు కోస్తే బస్తాకు రూ.300 నుంచి రూ.500 కూడా ఆదాయం ఉండటం లేదు. దీంతో చాలామంది తోటల్లో కాయలను వదిలివేస్తున్నారు. ఒక కూలీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాయలు కోస్తే ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 వరకు ఇస్తున్నారు. రోజుకు ఒక కూలీ టిక్కీ (45 కిలోలు) కాయలు మాత్రమే కోస్తున్నారు. ప్రస్తుతం కిలో కాయలు రూ.16 కూడా అమ్ముడుపోవడం లేదు. ఆటో బాడుగ బస్తాకు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన రైతులకు 45 కిలోల బస్తాకు ఇప్పుడు ధరల ప్రకారం కనీసం రూ.500 కూడా గిట్టుబాటు కాదు. దీంతో కాయలు కోయించేందుకు ఆసక్తి లేక చాలా మంది వదిలేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం కాయలు చెట్లకింద రాలిపోతే తెగుళ్లు పడతాయని కూలీలనే కోసుకుని అమ్ముకుని వచ్చే నగదును తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఫలితంగా నిమ్మ రైతు చేసిన అప్పులు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

అడిగే వారు లేరు

నిమ్మకాయలను అడిగే వారు లేరు. కాయలు కోయించడం వల్ల శ్రమ, నష్టం తప్పించి ఎలాంటి ఆదాయం ఉండటం లేదు. వ్యాపారులు సైతం కాయలు కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. దశాబ్దాలుగా నిమ్మపై ఆధారపడుతున్న రైతులకు పెద్ద కష్టం వచ్చింది.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

లీజుదారులకు నష్టం

తోటలను లీజుకు తీసుకున్న వారు సైతం నష్టపోయారు. గతంలో నిమ్మకు ఇంత పెద్ద కష్టం ఎప్పుడూ రాలేదు. ఈ ప్రాంతంలో నిమ్మ రైతులు సుభిక్షంగా ఉండేవారు. సీజన్‌లో కాయలున్న వారు కొంత కోలుకున్నా, మిగిలిన వారు తీవ్రంగా నష్టపోయారు.

– జి.రామయ్య, రైతు, చెర్లోపల్లి

కోలుకోలేని దెబ్బ

నిమ్మ రైతులకు ఈ ఏడాది కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉత్తరాదిన వర్షాలు తదితర కారణాలతో డిమాండ్ బాగా తగ్గింది. దీంతో ఎగుమతులు పడిపోయి కాయలు అడిగేవారు లేరు. తోటల్లో కాయలు కోస్తే నష్టపోవాల్సి వస్తోంది.

– పెంచల నారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

ఫ్యాక్టరీలకు పంపే ప్రయత్నం చేస్తాం

తమిళనాడు, గూడూరు సిట్రస్ ఫ్యాక్టరీలకు ఇక్కడి కాయలను పంపే ప్రయత్నం చేస్తాం. అయితే రైతులు ఇందుకు ఒప్పుకోవాల్సి ఉంటుంది. కాయలు నాణ్యత లేకపోవడంతో ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గినట్టుగా తెలుస్తోంది. అక్టోబర్ వరకు రైతులకు ఇలాంటి ఇబ్బందులు తప్పేలా లేవు.

– అనితా కుమారి, మార్కెటింగ్ ఏడీ, నెల్లూరు

క్లుప్తంగా

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి

మర్రిపాడు: మండలంలోని పొంగూరుకండ్రికలో గురువారం జనారణ్యంలోకి చుక్కల దుప్పి వచ్చింది. కుక్కలు దానిని వెంటాడి గాయపరిచాయి. దీంతో దుప్పి మృతిచెందగా గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

అనిల్ భద్ర మృతదేహం

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని గోపాలపురం సమీపం ఉన్న ఉప్పునీటి దొరువులో దూకి మహారాష్ట్రకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కృష్ణపట్నం పోర్టు ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన అనిల్ భద్ర (27), మరో ముగ్గురు వ్యక్తులు రెండురోజుల క్రితం గేట్‌వే కంపెనీలో చేరారు. వారంతా ముత్తుకూరులో ఓ హోటల్లో బసచేసి బుధవారం ఒక్కరోజే విధులు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున అనిల్‌భద్ర కనిపించకపోవడంతో మిగిలిన ముగ్గురు ఫోన్ చేశారు. అతను తన స్వస్థలానికి వెళ్లిపోతున్నానని చెప్పి కాల్ కట్ చేశాడు. ఈ నేపథ్యంలో గోపాలపురం వద్ద వాటర్ ట్యాంకర్ కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని అనిల్ ప్రయత్నించగా డ్రైవర్ చాకచక్యంగా తప్పించాడు. దీంతో పరిగెత్తుకుంటూ వెళ్లి ఉప్పునీటి దొరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

అనుమతి లేకుండా దుంగలు తరలిస్తుండగా..

- రెండు ట్రాక్టర్లను పట్టుకున్న అటవీ అధికారులు
- ఆ వాహనాలు టీడీపీ నేతవిగా గుర్తింపు

అటవీ శాఖ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

సైదాపురం: అనుమతి లేకుండా రెండు ట్రాక్టర్లలో వేప దుంగలు తరలిస్తుండగా గురువారం అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని లింగసముద్రం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, అధికారుల కథనం మేరకు.. ప్రకృతి సంపదన నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నెల్లూరు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. వారి ఆదేశాల మేరకు స్థానిక అధికారులు తనిఖీలు చేశారు. లింగసముద్రం గ్రామం నుంచి గూడూరుకు రెండు ట్రాక్టర్లలో వేప దుంగల్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. ట్రాక్టర్లు స్థానిక టీడీపీ నేతవిగా గుర్తించారు. ఈ సందర్భంగా నెల్లూరు అటవీ శాఖ రేంజర్ మాల్యాద్రి మాట్లాడుతూ అనుమతి లేకుండా దుంగల్ని రవాణా చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు ట్రాక్టర్ల విషయమై సమగ్రవిచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8

గ్రామసభలు పెట్టకుండా
భూములెలా ఇస్తారు?

- ఇండోసోల్ కంపెనీకి చంద్రబాబు బినామీనా?
- భూ కబ్జాదారులకు అండగా కూటమి ప్రభుత్వం
- వామపక్ష నేతలు

మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): '2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కంపెనీలకు కేటాయించాలంటే గ్రామసభలు నిర్వహించాలి. రైతుల అభిప్రాయాలు తీసుకుని వారి అనుమతితో భూములను కేటాయించాలి. కానీ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా రైతుల భూములు, గ్రామాలను ఇండోసోల్ సోలార్ కంపెనీకి కేటాయించడం చట్ట విరుద్ధం' అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) సీనియర్ నాయకులు రాంబాబు అన్నారు. నెల్లూరులోని బాలాజీ నగర్‌లో సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం కలెక్టర్ కరేడు గ్రామానికి వెళ్లనున్నారన్నారు. రైతులు, ప్రజల నుంచి వచ్చిన తీవ్ర నిరసనతో ఇప్పుడు ప్రభుత్వం గ్రామాల్లో అభిప్రాయసేకరణ చేపట్టేందుకు సిద్ధపడిందన్నారు. గతంలో కూడా జిల్లాలోని ముత్తుకూరు, రాచర్లపాడు గ్రామాల్లో కంపెనీలకు వందలాది ఎకరాలు కట్టబెట్టారని అయితే సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి పరిశ్రమలు రాలేదని ఆరోపించారు. ఈ భూములను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.వందల కోట్లు రుణాలు తీసుకుని ఎగనామం పెట్టే భూకబ్జాదారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని ఆరోపించారు. 8,464 ఎకరాలు ఇవ్వడం చూస్తుంటే సదరు కంపెనీకి చంద్రబాబు బినామీగా ఉన్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. ఒక సంస్థకు భూములు ఇవ్వాలంటే గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందుకు భిన్నంగా తాము ఎంత ఇస్తే అంతే తీసుకుని భూములు, గ్రామాలు ఖాళీ చేసి వెళ్లాలని బెదిరించి పోలీసు కేసులు పెట్టి భూములను స్వాధీనం చేసుకుంటామంటే ఒప్పుకొనేది లేదన్నారు. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు రైతులకు తన సొంత నగదుతో పాటు, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానని చెబుతున్నాడని, ఆయనే నియోజకవర్గ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా భూములు స్వాధీనం చేసుకునేందుకు పోలీసు కేసులు పెట్టి రైతులు, ప్రజలను బెదించడం సరికాదన్నారు. ప్రజలతో పెట్టుకుంటే ఎమ్మెల్యే నియోజకవర్గంలో తిరగలేడని హెచ్చరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భూములను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, ఎస్‌యూసీఐ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

తాగేందుకు నీళ్లివ్వండమ్మా..

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రజలు

కోవూరు: తాగేందుకు నీళ్లివ్వాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ప్రజలు అడిగారు. సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని గురువారం కోవూరు మండలమలోని రాళ్ల మిట్ట కాలనీలో నిర్వహించారు. మీరు గెలిచి ఏడాది పూర్తయిందని, నాలుగు నెలల నుంచి గుక్కెడు నీళ్ల కోసం అష్టకష్టాలు పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రశాంతిరెడ్డి అధికారులను పిలిచి తక్షణమే తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

భూసేకరణకు వ్యతిరేకంగా..

- అర్జీలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న రైతులు
- నేడు కరేడులో గ్రామసభ

గ్రామసభ కోసం అర్జీలు రాస్తున్న ప్రజా సంఘాలు

ఉలవపాడు: భూ సేకరణ కోసం ప్రభుత్వం శుక్రవారం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలో భారీగా అర్జీలు అందించి నిరసన తెలియజేయాలని రైతులు సిద్ధమవుతున్నారు. గురువారం కరేడు గ్రామంలో పెద్ద సంఖ్యలో అర్జీలు రాశారు. ప్రభుత్వం రైతులకు భూ సేకరణ గ్రామసభ ఉందని సమాచారం ఇవ్వకపోయినా.. వారు మాత్రం తెలుసుకుని మరీ తమ అభ్యంతరాలు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వడంపై రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తమ భూములు ఇవ్వమని రోడ్డెక్కడం తోనే ప్రభుత్వం దిగొచ్చి గ్రామసభను ఏర్పాటు చేసింది. ఈ పరిస్థితుల్లో సభను సంపూర్ణంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో రైతులున్నట్లు సమాచారం. ప్రతి ఒక్కరూ ఎవరికి వారే అభ్యంతరం తెలియజేయడానికి అర్జీలను రూపొందించుకుంటున్నారు. భూమి లేకపోతే తాము బతకలేమని, భూములు, ఇళ్లు ఇచ్చేది లేదని కచ్చితంగా చెప్పేలా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందాకైనా పోరాడేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు రైతులకు మద్దతు తెలుపుతున్నాయి.

గోడు వినిపించనున్న రైతులు

శుక్రవారం కరేడులో జరిగే గ్రామసభకు కలెక్టర్ ఆనంద్, సబ్ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దార్ శ్రీనివాసరావు వస్తున్నట్లు సమాచారం. ఇందులో రైతులు తమ బాధలను అర్జీల రూపంలో తెలియజేయనున్నారు. కరేడు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. కూటమి పార్టీలు తప్ప మిగిలినవి భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. ఆయా పార్టీలు కూడా అర్జీలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందుకోసం రైతులతో కలిసి మాట్లాడి వారి అభిప్రాయాన్ని పార్టీ తరపున అందజేయనున్నారు. వైఎస్సార్‌సీపీ కరేడు రైతుల కోసం ఎంత వరకైనా పోరాడడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో సభకు పోలీసు బందోబస్తు కూడా భారీగా ఉండే అవకాశం ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-235]

REAL ESTATE

PLOT FOR SALE

■ కోవూరులోని పాటూరు రోడ్‌లో గల DTCP లేఅవుట్ నందు 23అం।। ప్లాట్లు అన్ని వసతులతో అమ్మకానికి కలవు. వివరములకు సంప్రదించండి: 93805 44418. [NA-3069]

TO-LET

SERVICES

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

GOLD FINANCE

■ వివిధ తాకట్టు సంస్థలు, బ్యాంకుల నుండి బంగారు నగలు విడిపించి అమ్మి రొక్కం ఇప్పించబడును. బంగారు నగలు హోల్‌సేల్ రిటైల్‌తో సరఫరా చేయబడును. ఫోన్: 77290 47122. [V- 6763]

■ బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. ఫోన్ : 98851 82772, 62813 46878 [V- 6762]

TOURS & TRAVELS

■ రైలు యాత్ర : నేపాల్ తేది 6-9-25, 12 రో।। టికె 25,000, దసరా సెలవుల్లో రాజస్థాన్ యాత్ర తేది 23-9-25, 10 రో।। టిక్కెట్ 1కి 20,000/- కె.వాసు, నెల్లూరు. 9491340504. [NA-24203]

■ వాడపల్లి, బిక్కవోలు, పట్టిసీమ, వేయి స్తంభాల గుడి, అష్టలక్ష్మి తేది 11-07-25, 2 రోజులు టిక్కెట్ 1కి 3250/- (A/c బస్సు, రూం+భో) కె.వాసు, నెల్లూరు. 9491340504 [NA-24204]

WANTED

■ Wanted 1st Class Mother Teachers all subjects. Sal : Above 10,000/- Cont : Kids Kingdom E.M. School, Podalakur Road, Nellore. Ph : 94930 30638. [NA-2878]

■ Wanted Fresher / Exp. Business Development Manager / Counselor in Nellore attractive Salary. Contact : 83338 72869. [NA-883]

■ Wanted Lady Gynaecologist Qul : DGO / MS Gyn Experience : 3-4, Years con : Dr. Andal Hospital, Lakshmi Fertility Centre. Near S2 Cine Theater, Pogathota, Nellore. Ph : 99088 54316. [NA-2879]

■ నెల్లూరు, హాల్‌మార్క్‌లో కంప్యూటర్ ఆపరేటర్ గా ఏదైనా డిగ్రీ కల్గిన యువతీ యువకులు కావలెను. జీతం 10 వేలు to 12 వేలు. టైం. 10 AM to 9 PM. సంప్రదించండి. 9030313333 [NA-24268]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర।। 99084 29239 [G-624]

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ *KAVALI*లో *Field Executives* కావలెను. Salary 15K-20K + Inct ✆ 8790101229 [SCA25005852]

■ ఎలక్ట్రానిక్ కాటా షాపులో స్టోన్‌హౌస్ పేట, నెల్లూరు నందు పనిచేయుటకు అబ్బాలు కావలెను. Qlf : ఐఐటి, ఇంటర్, డిగ్రీ. సెల్ : 99123 08095. [SCA25005800]

■ ఆన్‌లైన్ & జెరాక్స్ సెంటర్ నందు పని చేయుటకు స్త్రీ/పు-2 కావలెను VRC Center, Nellore. Sal :10000 To 15000. సెల్ :7799514388. [SCA25005872]

■ ప్రముఖ Axis Max life insurance Company నందు work చేయుటకు Sales Managers కావలెను. Qual: any Degree, 8074045155, 9491339997. [NA-3702]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

ప్రకటన గోరంత స్పందన కొండంత

డాక్యుమెంట్ పోయినది

పైనం చార్లెస్ న్యూటన్ మోహన్ దాస్ S/o P. జోన్ దాస్ D.No:26-2-2369, వెంకటరెడ్డి నగర్, వేదాయపాళెం, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా, A.P. నా భార్య లేట్ మోడపోతల జ్యోతి కుసుమలతకు చెందిన ప్లాట్లు చిల్లకూరు మండలం కడివేడు సాయిహైవే సిటీలో 2 ప్లాట్లు కోట స।।రి।।లో డా।। నెం. 320/2009, 321/2009 రిజిష్టరు అయిన ఒరిజినల్ డాక్యుమెంట్‌లను జెరాక్స్ కొరకు నెల్లూరు, వేదాయపాళెం సెంటర్‌కు వెళుతుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల పై అడ్రస్ / ఫోనుకు అందజేయగలరు.

P.C.N మోహన్ దాస్, సెల్ : 9247170857

■ నెల్లూరు జిల్లాలో మండలాల వారీగా మార్కెటింగ్ మేనేజర్లు, ITI, Diploma విద్యార్హత గల ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం + PF + కమిషన్. 9000731560. [NA-7029]

■ మా షోరూంలో పని చేయుటకు సేల్స్ గర్ల్స్, సేల్స్‌బాయ్స్ కావలెను. మంచి జీతము, ఆకర్షణీయ కమీషన్ ఇవ్వబడును. శ్రీ దక్షిణామూర్తి టెక్స్‌టైల్స్, మినిబైపాస్ రోడ్డు, నెల్లూరు. 94411 32023. [NA-130]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

జన సందడి

ఈనెల 6వ తేదీ నుంచి నెల్లూరులో రొట్టెల పండగ జరుగుతుంది. ముందుగానే బారాషహీద్ దర్గాకు భక్తుల రాక మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారితో స్వర్ణాల చెరువు వద్ద సందడి నెలకొంది. అనేకమంది కోర్కెల రొట్టెలు స్వీకరిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం | 4 | జూలై | 2025

"కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలనే ఉద్దేశంతో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం రూపొందించలేదు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసి.. ప్రజల పక్షాన నిలబడేందుకే ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశాం. - శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

"ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే మెడలు వంచి ప్రశ్నిస్తాం. మీ బెదిరింపులకు భయపడేదే లేదు.

ప్రజలకు కూటమి ఇచ్చిన బాండును చూపిస్తున్న బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం నగరంలో జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో క్యూఆర్‌కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హామీలకు లేదు ష్యూరిటీ..

మోసాలే గ్యారెంటీ

- హామీలు అమలుచేయని మోసగాళ్లు చంద్రబాబు, పవన్: శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ
- ఏపీలో చంద్రన్న దగ...పగ అనే పథకాలు అమలవుతున్నాయ్: కురసాల కన్నబాబు
- బాబు ఏడాది పాలనలో కోట్లాది రూపాయిల బకాయి: కుంభా రవిబాబు
- వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ధ్వజమెత్తిన నేతలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

అధికార దాహంతో దారిన కనబడిన వారం దరితో చేతులు కలిపి, అధికారం చేతికి వచ్చాక ఇచ్చిన మాట మర్చిపోయిన మోసగాళ్లు చంద్రబాబు, పవన్ కల్యాణ్ అని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి ప్రజల పక్షాన నిలబడేందుకు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం రూపొందించామని ఆయన తెలిపారు. అధికార పక్ష బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు బెదిరిపోరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. తాము ఈవీఎంల ద్వారా ఓడిపోయామో, ఏ విధంగా ఓడిపోయామో ఆ దేవుడికే తెలుసని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరిట కార్యక్రమాన్ని ప్రజల్లో తీసుకెళ్లేందుకు.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ఇంటింటి ప్రచార కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. జిల్లా వ్యాప్తంగా 5 వారాల పాటు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి, అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వాల మోసాల్ని వివరించేందుకు కార్యాచరణ రూపొందించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ వైఎస్ జగన్ పరామర్శలకు వెళ్తున్నా బురద జల్లుతున్నారని విమర్శించారు. జిల్లాలోని మూలపేట పోర్టును చంద్రబాబే ప్రారంభించారని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పడం సిగ్గుచేటన్నారు.

సమావేశంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, తూర్పుకాపు, కాళింగ, కళింగవైశ్య కులాల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ స్వరూప్, జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల దివ్యభారతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ముత్తా విజయ్‌కుమార్, పిలక రాజ్యలక్ష్మి, కరిమి రాజేశ్వరరావు, గొండు కృష్ణమూర్తి, మూకళ్ల సుగుణ, పిన్నింటి సాయి, ఎన్ని ధనుంజయరావు, చిట్టి జనార్ధనరావు, సనపల నారాయణరావు, తంగుడు నాగేశ్వరరావు, బల్లాడ హేమమాలిని, జనార్ధనరావు, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, బొడ్డేపల్లి పద్మజ, సాధు వైకుంఠరావు, గుంట జ్యోతి, గద్దిబోయిన కృష్ణయాదవ్, కోట గోవిందరావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకటి చంద్రన్న దగా, రెండోది చంద్రన్న పగ

వంద అబద్ధాలాడైనా ఓ పెళ్లి చేయమని సామెత. అలా లక్ష అబద్ధాలాడైనా ముఖ్యమంత్రి కావాలన్నది చంద్రబాబు సొంత సామెత. వైఎస్ జగన్ రూపొందించిన పథకాలు అమలు చేయడం తప్ప చంద్రబాబు ఒక్క కొత్త పథకాన్ని అమలు చేయలేదు. రెడ్‌బుక్‌కు ఎవరూ భయపడరు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో మొదలుపెట్టక ముందే డైవర్షన్ పాలిటిక్స్ మొదలయ్యాయి. జగన్ రోడ్డు మీదకు వస్తానంటేనే భయపడిపోతున్నారు. నెల్లూరులో హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయం. రాష్ట్రంలో రెండే పథకాలు అమలవుతున్నాయి ఒకటి చంద్రన్న దగా, రెండోది చంద్రన్న పగ.
– కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త

విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు

కూటమి మోసాలు వివరిద్దాం..

వైఎస్సార్ సీపీ పాలనలో రెండేళ్లు కరోనాతో నష్టపోయినా మూడేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. జిల్లాలో కీలక ప్రాజెక్టులకు వైఎస్ రాజశేఖర రెడ్డి శ్రీకారం చుడితే ఆయన తనయుడు వైఎస్ జగన్ పూర్తి చేశారు. వెనుకబడ్డ జిల్లాను అభివృద్ధి చేయడానికి మూలపేట పోర్టు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం మొదలుపెట్టారు. కూటమి అబద్ధాలు, అక్రమాలు, మోసాలు అందరికి తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు.
– ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

మద్యం ఏరులై పారుతోంది..

రాష్ట్రంలో మంచినీళ్లు దొరక్కపోయినా గ్రామగ్రామాన మద్యం ఏరులై పారుతోంది. రాష్ట్రంలో 119 మంది ఐపీఎస్‌లకి పోస్టింగులు లేవు. కొందరిని సస్పెండ్ చేయడం మరీ దారుణం. నిన్న కాక మొన్న ఒక ఐపీఎస్ అధికారి రాజీనామా చేసి ఢిల్లీ వెళ్లిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చాలా మందిని అరెస్టు చేసి వారికి బెయిల్ ఇవ్వకుండా కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. చంద్రబాబు సంపద సృష్టించడానికే అప్పులు చేస్తున్నామని చెప్పడం విడ్డూరం. – తమ్మినేని సీతారాం, పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త

మోసగించారు

ఐదు కోట్ల మంది ఆంధ్రులను బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమంతో మోసగించారు. దేశ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. ఏడాది పాలనలో యువతకు రూ.38,400 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 5,85,082మందికి రూ.10,717కోట్లు, నిరుద్యోగ భృతి కింద రూ.7800కోట్లు, తల్లికి వందనం పేరిట రూ.13,111కోట్లు, దీపం పథకం కింద రూ.4900 కోట్లు బకాయి పడ్డారు. రాష్ట్రానికి జగన్ పాలన అవసరం. – కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ, పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు

కేంద్ర మంత్రి ఏం చేశారు..?

జిల్లాలో మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన రామ్మోహన్ నాయుడు ఈ జిల్లాకు తీసుకువచ్చిన ప్రాజెక్టులు ఏంటి? యుద్ధం వస్తే మొదటగా ఎఫెక్ట్ అయ్యేది విమానయాన రంగం. ఆపరేషన్ సిందూర్ అవుతుంటే.. మే 15న పాతపట్నంలో రూ. 15లక్షలతో సీసీ రోడ్డుకి శంకుస్థాపన చేసుకోవడం ఎంత హాస్యాస్పదం.
– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

బాబుకు బుద్ధి చెప్పాలి

చంద్రబాబుకు తన మామ ఎన్టీఆర్ మొదలుకుని నేటి వరకు అందరికీ వెన్నుపోటు పొడవడం అలవాటైపోయింది. ఏం పనులు చేశారని కూట మి నాయకులు ఇంటింటికీ వెళ్తారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఓటేయండని అడిగే దమ్ము ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే ఉంది.
– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

అచ్చెన్నా.. నీకంత సీనుందా..?

జగన్‌ను వెయ్యి అడుగుల లోతులో పాతేస్తావా.. అచ్చెన్నాయుడు నీకంత సీను ఉందా..? ఒకే కులం, ఒకే కుటుంబానికి మంత్రి పదవులు కట్టబెట్టడం చంద్రబాబుకే చెల్లింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాల వారికి న్యాయం చేశారు. జిల్లాకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మెడికల్ కాలేజీ, అంబేడ్కర్ యూనివర్సిటీ వంటివి తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిలదే.
– పేరాడ తిలక్, పార్టీ టెక్కలి సమన్వయకర్త

ప్రశ్నిస్తే నాలుక కోస్తారా..?

ఇచ్చిన హామీలు ఇవ్వకపోగా సూపర్–6 కోసం మాట్లాడితే నాలుక కోస్తానని సీఎం చంద్రబాబునాయుడు అనడం దారుణం. జిల్లాలో కూటమి నేతలంతా ఇసుక మాఫియాలా మారారు. హైటెక్ సిటీ పేరుతో వేలాది ఎకరాలు కాజేసిన చంద్రబాబు ఇప్పుడు అమరావతిలో రియల్ వ్యాపారం చేస్తున్నారు.
– చింతాడ రవికుమార్, పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త

బాబు ష్యూరిటీతో.. పేదల పతనం గ్యారెంటీ

బాబు ష్యూరిటీతో పేదల పతనం గ్యారెంటీ. దేశానికి ఓ రోల్‌మోడల్‌గా 2019 నుంచి 2024 వరకు పాలన జరిగింది. రైతుభరోసా కేంద్రాల్ని 200 దేశాలు అధ్యయనం చేశాయి. ఏడాదిగా జనానికి సంక్షేమం లేకుండా పోయింది.
– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

సాఫీగా రెండో రోజు అడ్మిషన్ల ప్రక్రియ

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు 2025–26 సంవత్సరానికి జరుగుతున్న అడ్మిషన్లలో భాగంగా నూజివీడు ఎస్ఏజీ ఆడిటోరియంలో రెండోరోజు గురువారం అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మొత్తం అడ్మిషన్ల ప్రక్రియను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అన్యాయంగా విధుల నుంచి తొలగించారు'

పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికురాలు

సరుబుజ్జిలి: అధికార పక్ష నేతలకు అనుకూలంగా వ్యవహరించలేదనే నెపంతో అన్యాయంగా విధుల నుంచి తొలగించారని సింధువాడ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు ఊటపల్లి చిన్నమ్మడు వాపోయారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. సుమారు 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. విద్యాశాఖ అధికారులు తన సంతకాన్ని తెల్లకాగితంపై తీసుకొని తనను మోసగించి అడ్డదారుల్లో విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఇదే వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నానని, అధికారులు న్యాయం చేయాలని కోరారు.

సేవలు సంతృప్తి కలిగించాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల సంతృప్తే ప్రభుత్వ పాలనకు ప్రామాణికమని, అందుకే ప్రతి శాఖ కూడా ప్రజల అభిప్రాయాలను నిక్షిప్తంగా గుర్తించి, సేవలను మరింత మెరుగుపరిచే దిశగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన వెలగపూడి సచివాలయం నుంచి గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ జిల్లా నుంచి ఆయా శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం సూర్య ఘర్, స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర, బంగారు కుటుంబం వంటి కార్యక్రమాల అమలు, ప్రజల్లో సానుకూల ధోరణి పెంపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖ ప్రజలకు సేవలందించే విధానం ఆత్మవిశ్వాసంతో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు.

కుదిరిన జీడి కార్మికుల వేతనాల ఒప్పందం

మందస: జీడి కార్మికుల వేతనాల ఒప్పందం గురువారం జరిగింది. గత ఏడాది మే నెలలో జరగాల్సిన వేతనాల ఒప్పందం చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి 41 రోజుల పాటు పని ఇవ్వకుండా కార్మికులకు ఇబ్బందులకు గురి చేసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు జరిగాయి. చివరికి యాజమాన్యం, కార్మికులకు మధ్య వేతనాల ఒప్పందం ఓ కొలిక్కి వచ్చింది. గతంలో ఇస్తున్న వేతనాలపై కిలోకు 2.50 పెంచుతూ రెండేళ్లకు ఒప్పందం జరిగింది.

చరణ్ అదరగొట్టాడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన అట్టాడ చరణ్ భారత వాలీబాల్ ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికయ్యాడు. బెంగళూరు వేదికగా ఎన్ఎస్ఎస్‌సీ అకాడమీలో జరగనున్న శిక్షణ శిబిరాల్లో పాల్గొనే ఇండియన్ ప్రాబబుల్స్ జాబితాను ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రామనాథ్ చౌదరి విడుదల చేశారు. ఈ యువ క్రీడాకారుడు పలాస మండలం అంతరకుడ్డ గ్రామం ప్రస్తుతం విశాఖపట్నంలోని సాయ్ స్పోర్ట్స్ స్కూల్/హాస్టల్‌లో ఇంటర్ చదువుతున్నాడు.

జీడి రైతు గగ్గోలు

కారుచౌకగా జీడి పిక్కల కొనుగోలు
- బస్తా పిక్కల ధర రూ.12,500
- గత ఏడాది ఇదే నెలలో రూ.13,500

పలాస:

ఉద్దానం ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పిక్కలను పలాస జీడి వ్యాపారులు కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. 80 కిలోల జీడి పిక్కల బస్తా ధర ప్రస్తుతం తప్పని పరిస్థితుల్లో రైతులు రూ.12,500లకు అమ్ముకుంటున్నారు. ఇటీవలే ఉద్దానం ప్రాంతంలోని మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి తదితర గ్రామాల్లో పలాస జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేశారు. అయితే నేరుగా జీడి వ్యాపారులు మాత్రం ఈ పిక్కలను కొనుగోలు చేయడం లేదు. గ్రామాల్లో ఉన్న చోటా నాయకులు దళారులుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో జీడి వ్యాపారులు తరపున పిక్కలను కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది ఇదే నెలలో రైతులు బస్తా జీడి పిక్కలను ఆయా గ్రామాల్లో రూ.13,500లకు విక్రయించారు.

ఈ ఏడాది ఇంకా జీడి పిక్కలధరలు పెరుగుతాయని ఆశించారు. అయితే దీన్ని పసి గట్టిన జీడి వ్యాపారులు తమ జీడి పప్పునకు డిమాండ్ లేదని, జీడి పప్పు నిల్వలు ఉండి పోయాయని తదితర కారణాలతో పలాసలో జీడి పరిశ్రమలను జూన్ 1 నుంచి నిరవధికంగా బంద్ చేశారు. దీంతో జీడి కార్మికులు రోడ్డున పడ్డారు. రైతులు తమ జీడి తోటల్లో సేకరించిన జీడి పిక్కలను ఇళ్లలో భద్రపరిచారు. పిక్కలను అమ్ముకోవడానికి నానా ప్రయత్నాలు చేశారు. జీడి రైతాంగ కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. జీడి కార్మికులు కూడా తమకు పనికల్పించాలని నిరాహార దీక్షలు చేశారు. అయినా పరిశ్రమదారులు మాత్రం దేన్ని పట్టించుకోలేదు. ఇటీవల కొద్ది రోజుల కిందట జీడి పరిశ్రమలు తెరిచారు. దీంతో గ్రామాల్లోకి ఎప్పటి లాగే జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయడానికి వస్తున్నారు. అయితే వారు నేరుగా జీడి రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదు. గ్రామాల్లో ఉన్న దళారులను పట్టుకొని వారి చేత పిక్కలను కొనుగోలు చేయిస్తున్నారు. ఈ దళారుల్లో అధికారపార్టీ నాయకులు ఎక్కువ మంది ఉన్నారు. అన్ని వర్గాల వారు దీనిపై ప్రేక్షక పాత్ర వహించడం విశేషం. మొత్తానికి జీడి పరిశ్రమల బంద్ పేరుతో వ్యాపారులు చేసి కార్యక్రమాలు వారికి అనుకూల ఫలితాలు చేకూర్చుతున్నాయి. మేనెలలో జీడి పిక్కలను అమ్ముకోవలసిన రైతులకు ఇప్పుడు ఈ పరిస్థితులు మింగుడు పడటం లేదు. జీడి పిక్కలు బాగా ఎండిపోవడం వల్ల తరుగు ఏర్పడింది. కనీసం బస్తా పిక్కల దగ్గర కనీసం 5కిలోల తరుగు వచ్చింది. అంతే కాకుండా ధర కూడా బాగా తగ్గిపోయింది.

మే నెలలో బస్తా పిక్కల ధర రూ.13500లు ఉండగా ప్రస్తుతం తప్పని పరిస్థితిలో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పాలక పార్టీ నాయకులు పట్టించుకోక పోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దానంలో జీడి పిక్కల అమ్మకాలు

పేరుకే సన్న బియ్యం.. నిండా పురుగులే

సన్న బియ్యంలో పురుగులు తీస్తున్న వంట మహిళ రుప్ప శాంత

నరసన్నపేట: పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కోసం పంపిణీ చేస్తున్న బియ్యం నిండా పురుగులు, నూకలు ఉంటున్నాయి. గురువారం స్థానిక జిల్లా పరిషత్(బోర్డు) ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో బియ్యంను పరిశీలించగా పురుగులు కనిపించాయి. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ ప్రతినిధులు కాంతమ్మ ,రుప్ప శాంతలు మాట్లాడుతూ బియ్యంలో పురుగులు ఉంటున్నాయని, అలాగే నూకల శాతం కూడా అధికంగా ఉందని తెలిపారు. ముక్కు వాసన వస్తున్నాయని అన్నారు. ఒకటికి రెండు మార్లు పరిశుభ్రం చేశాక వండుతున్నట్లు తెలిపారు.

పాఠశాల బియ్యం వెనక్కి..

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యాన్ని ఇటీవల పౌరసరఫరాల శాఖ నుంచి పంపిణీ చేశారు. అందులో ఒక బ్యాగ్ పూర్తిగా పాడైపోయి పురుగులు పట్టి, బియ్యం మొత్తం ఉండలు కట్టి ఉండటంతో దాన్ని గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయులు ఆ బియ్యాన్ని రెండు రోజులు కిందట వెనక్కి పంపించి దానిస్థానంలో మరో బియ్యం బ్యాగ్ తీసుకున్నారు.

నెలవంకలో..

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదపిల్లల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యం నాసిరకంగా మారింది. మండలంలోని నెలవంక ప్రాథమిక పాఠశాలలో 'సాక్షి' చేసిన పరిశీలనలో బియ్యం నాసిరకంగా ఉన్నట్లు తేలింది. అట్టకట్టిన బియ్యాన్ని వండలేక వాటిని ఏం చేయాలో అర్థం కాక వంట ఏజెన్సీ మహిళలు సతమతమయ్యారు. రెండు బస్తాల్లో ఈ తరహా బియ్యం వారికి కనిపించింది.

కవిటి: నెలవంక ప్రాథమిక పాఠశాలలో అట్టకట్టిన బియ్యం

క్లుప్తంగా

70 మద్యం బాటిళ్లు పట్టివేత

హిరమండలం: ఎల్ఎన్‌పేట మండలం కోవిలాం గ్రామానికి చెందిన బొమ్మాళి నవీన్ అనే యువకుడు గురువారం మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. ఎల్ఎన్‌పేట జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా 70 బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని కృష్ణాపురం తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. సరుబుజ్జిలి ఎస్సై బి.హైమావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగుపురంలో..

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో ఓ వైన్‌షాపు వద్ద అదే గ్రామానికి చెందిన ఉండ లక్ష్మణరావు 26 మద్యం బాటిళ్లు కొని బెల్ట్ షాపు ద్వారా అమ్మేందుకు వెళ్తుండగా రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూ.3,673 బాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము తెలిపారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

జి.సిగడాం: టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో గురువారం వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. గత నెల 19 నుంచి ఈ నెల 2 వరకు మొత్తం 59 మంది వైరల్ జ్వరాలతో బాధపడ్డారని, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే జ్వరాలతో ఉన్నారని వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఐదు బృందాలుగా సర్వే చేపట్టామన్నారు. మరో మూడు రోజులపాటు వైద్య సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రైవేటు కళాశాలలో తనిఖీలు

తనిఖీ అనంతరం వెళ్లిపోతున్న పలాస ఆర్డీఓ వెంకటేశ్

కవిటి: మండల కేంద్రం కవిటిలో జనసేన నాయకుడికి చెందిన కళ్యాణీ జూనియర్ కాలేజ్‌లో పలాస ఆర్డీఓ జి.వెంకటేష్ గురువారం తనిఖీలు నిర్వహించారు. కళాశాల నిర్వహణపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. అయితే ఫిర్యాదు ఎవరు చేశారు? తనిఖీల్లో లోపాలు ఏమైనా బయటపడ్డాయా? అనే విషయాలు తెలిపేందుకు అధికారులు నిరాకరించారు. మీడియాకు సైతం కాలేజీ నిర్వాహకులు అనుమతించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

మృతుడు లక్ష్మణ్

ఆమదాలవలస/ఎచ్చెర్ల: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చొట్టవానిపేట కాలనీలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చొట్టవానిపేట కాలనీలో గొర్లె పెంటయ్య ఇంటి నిర్మాణం జరుగుతోంది. లావేరు మండలం చిన్న మురపాకకు చెందిన గేదెల లక్ష్మణ్(40), మురపాక రమణ రాడ్ బెండింగ్ పనుల కోసం గురువారం వచ్చారు. ఇనుప రాడ్లను భవనంపైకి తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తగలగడంతో షాక్‌కు గురై కిందపడ్డారు. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందగా రమణ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమదాలవలస పోలీసులు తెలిపారు. మృతుడు లక్ష్మణ్‌కు భార్య అసిరితల్లి, ఇద్దరు కుమారులు భాస్కరరావు, బాలరాజు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఎక్కడ సభలు పెట్టాలన్నా.. ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, ఊరేగింపులు, బంద్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా పోలీసు శాఖ ముందస్తు అనుమతులు తప్పనిసరని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు, మత, కుల, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, ఇతరత్రా సంఘాలు కచ్చితంగా పాటించాలని, వారం రోజుల ముందే పరిధి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో (ఎస్ఐ/సీఐ)కి వివరాలు అందించాలన్నారు. హింసాత్మక పోస్టర్లను ప్రదర్శించబోమని రాతపూర్వక హామీ ఇవ్వాలని స్పష్టం చేశారు.

WANTED FACULTY
Faculty required to deal with the following subjects
➤ Computer Science
➤ Arithmetic & Reasoning
➤ General Studies ➤ Competitive
English & Communication Skills
HPN DEGREE COLLEGE
Opp: RTC Complex, Behind Judge Bunglow, SRIKAKULAM
9492266648, 9296257998

ఇండియన్ బ్యాంకు వద్ద కొచ్చెర్లకు చెందిన బాధిత మహిళలు

బ్యాగులు కట్ చేసి..

పొదుపు సొమ్ము దోచేసి..

రణస్థలం: కొచ్చెర్ల పంచాయతీకి చెందిన ఇద్దరు మహిళల నుంచి లక్ష రూపాయల నగదును గుర్తు తెలియని ముగ్గురు మహిళలు దోచుకున్నారు. జె.ఆర్.పురం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చెర్ల గ్రామంలో శ్రీశ్రీనివాస పొదుపు సంఘానికి చెందిన 10 మంది సభ్యులు గురువారం జె.ఆర్.పురం మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్‌కు వచ్చారు. రూ.20లక్షలు పొదుపు సొమ్ము విత్‌డ్రా చేశారు. ఒక్కొక్కరు రూ.2లక్షల చొప్పున బ్యాంకులోనే పంచుకున్నారు. బయటకు వచ్చాక వారిలో ముగ్గురు సభ్యులు బ్యాంకు సమీపంలోనే ఉన్న వస్త్ర దుకాణంలోకి వెళ్లారు. అప్పటికే వారితో సఖ్యతగా మెలిగిన గుర్తు తెలియని ముగ్గురు మహిళలు అదే దుస్తుల దుకాణంలో వెళ్లి డ్వాక్రా మహిళల బ్యాగులు చాకచక్యంగా కోసేశారు. వీరిలో బస్వ గురమ్మ, లంకపల్లి మాధురి బ్యాగుల్లో రూ.50వేలు చొప్పున లక్ష రూపాయలు దోచుకున్నారు. మరొకరి బ్యాగ్ కట్ చేసినా నగదు తీయడం సాధ్యంకాలేదు. అనంతరం చోరీ చేసిన మహిళలు బయటకు జారుకున్నారు. కొంతసేపటి తర్వాత చోరీ జరిగిన విషయం తెలుసుకుని బాధిత మహిళలు ఆందోళనకు గురై పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి జె.ఆర్.పురం పోలీసులు చేరుకుని సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. కాగా, గతంలో ఇదే వీధిలో కనకదుర్గా జ్యూయలర్స్‌లో వెండిని ఇలానే ముగ్గురు మహిళలు దోచుకున్నారు. మరోసారి ఇప్పుడు చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

బ్యాగ్ కట్ చేసి ఉన్న దృశ్యం

సీసీ కెమెరాల్లో నమోదైన మహిళా దొంగలు

గురుకులాలకు సరుకులు..

ఒత్తిళ్లతో నిలిచిన టెండర్లు

- సరుకుకు రూ.330కు కోట్ చేసిన టెండరుదారులు
- రూ.805కు కోట్ చేసిన డీసీఎంఎస్
- నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంఎస్‌కే అప్పగించేందుకు కుట్ర
- మంత్రి ఫోన్‌కు తలొగ్గి కాలయాపన చేస్తున్న అధికారులు!

శ్రీకాకుళం పాతబస్టాండ్ :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి విషయంలోనూ నిబంధనలకు తూట్లు పడుతునే ఉన్నాయి. ఇటు పథకాల వర్తింపు నుంచి అటు బదిలీల వరకు ప్రతిచోటా అర్హులకు అన్యాయం జరుగుతునే ఉంది. తాజాగా జిల్లాలోని గురుకుల విద్యాలయాలకు సరుకులు సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లలోనూ దిగజారుడు రాజకీయాలు చోటుచేసుకున్నాయి. తక్కువ మొత్తంలో కోట్ చేసిన వారికి కాకుండా కూటమి పాలకులు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలకే టెండర్ దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు. ఈ మేరకు అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు.

ఇదీ సంగతి..

జిల్లాలో 11 జ్యోతిరావు పూలే గురుకులాలు, రెండు ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు, 11 సాంఘిక సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. వీటిలో చదివే విద్యార్థులకు ఆహారాన్ని అందించేందుకు గాను కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్ వంటి సరుకులను సరఫరా చేసేందుకు గత నెలలో టెండర్లు పిలిచారు. ఈ మేరకు జిల్లాలో సుమారు 40 మంది టెండర్లు దాఖలు చేశారు. వీరంతా వ్యాపారులు కావడంతో వారికి అందుబాటు సరుకుల మేరకు తక్కువ ధరకు కోట్ చేశారు. జూన్ 28న జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో టెండర్ ప్రక్రియ నిర్వహించారు. తొలుత శ్రీకాకుళం డివిజన్‌లో ఐదు గురుకులాలకు సంబంధించి టెండర్లు ఓపెన్ చేశారు. ఇందులో ఎల్-1, ఎల్-2లను నిర్ణయిస్తుండగా డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ రంగంలోకి దిగారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన గురుకులాల టెండర్లు డీసీఎంఎస్‌కే కావాలని, తాను డీసీఎంఎస్ అధ్యక్షునిగా ఉన్నందున ఇంకెవరికి ఇవ్వరాదని అధికారులకు తేల్చిచెప్పారు. అందుకు అధికారులు అంగీకరించలేదు. దీంతో మంత్రికి సమాచారాన్ని చేరవేసినట్టు తెలిసింది. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు టెండర్ల ప్రక్రియను అర్ధంతరంగా ఆపేసి టెండర్‌దారులను పంపించేశారు. తదుపరి తేదీ తర్వాత ప్రకటిస్తామని చెప్పి అధికారులు వెళ్లిపోయారు. అయినా ఇంతవరకు అధికారులు స్పందించకపోవడంతో టెండరుదారులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలకు విరుద్ధం..

సరుకులకు సంబంధించి డీసీఎంఎస్ చాలా ఎక్కువ మొత్తానికి కోట్ చేసింది. ప్రైవేటు టెండరుదారులు ఓ సరుకుకు రూ.330 కోట్ చేయగా, అదే సరుకుకు డీసీఎంఎస్ ద్వారా రూ.805 కోట్ చేశారు. ఒక సరుకు విషయంలోనే సుమారు రూ.525 వ్యత్యాసం ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం ఎక్కువ కోట్ చేసిన డీసీఎంఎస్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ టెండరు ఖరారు చేయకూడదు. ఓవైపు నిబంధనలు, మరోవైపు మంత్రి స్థాయి నుంచి ఒత్తిళ్లు వెరసి ఏం చేయాలో తోచక అధికారులు టెండర్‌ను వాయిదా వేస్తున్నట్లు సమాచారం. మరోవైపు, మంత్రి ఒత్తిళ్లకు తలొగ్గి ఎక్కువ కోట్ చేసిన డీసీఎంఎస్‌కు టెండర్లు అప్పగిస్తే ఉద్యమం తప్పదని టెండరుదారులు హెచ్చరిస్తున్నారు.

గతంలో ఇలా లేదు

గురుకులాల సరుకుల సరఫరాకు సంబంధించి టెండర్ల ప్రక్రియలో నాకు పదేళ్ల అనుభవం ఉంది. గతంలో ఏ ప్రభుత్వం, ఏ అధికారుల ఆధ్వర్యంలోనూ ఇటువంటి పరిస్థితి జరగలేదు. నిబంధనల ప్రకారం తక్కువ ధరకు కోట్ చేసిన వారికే టెండర్లు ఇవ్వాలి. ఎల్1, ఎల్2లు నిర్ణయించి వారికే సరుకుల సరఫరా టెండర్లు అప్పగించాలి. రాజకీయ ప్రలోభాలతో ఎక్కువ కోట్ చేసిన వారికి టెండర్లు ఇస్తే అటు సంస్థలకు, ఇటు విద్యార్థులకు నష్టం జరుగుతుంది.

– వై.జనార్దన్‌రావు, టెండర్‌దారుడు

తక్కువ కోట్ చేసిన వారికే ఇవ్వాలి

నేను ప్రతి సంవత్సరం టెండర్‌లో పాల్గొంటున్నాను. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. ఒక సరుకుకు మేం రూ.330 కోట్ చేస్తే అదే సరుకుకు డీసీఎంఎస్ సంస్థ రూ.805కు కోట్ చేసింది. నిబంధనల ప్రకారం వారికి ఇవ్వడానికి అవకాశం లేదు, అయినా అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారు. ఎక్కువ కోడ్ చేసిన సంస్థకు టెండర్ ఇస్తే రూ.లక్షల్లో అవినీతి జరుగుతుంది. నిబంధనల ప్రకారం టెండర్లను ప్రకటించకపోతే 40 మంది టెండర్‌దారులు కలిసి ఉద్యమాలు చేస్తాం.

– సువ్వారి వేణుగోపాలరావు, టెండర్‌దారుడు

బలగవీధిలో ఇల్లు దగ్ధం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బోడెమ్మకోవెల సమీపంలో బలగవీధిలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి రూ.1.70 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి కె.శ్రీనుబాబు వెల్లడించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. గార మండలం కొర్లాం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న కుప్పిలి రామామణి బలగవీధిలో పెంకుటిల్లులో కుమారుడు లోకేష్‌తో కలిసి కొంతకాలంగా నివసిస్తున్నారు. లోకేష్ విశాఖలోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం విధుల నిమిత్తం రామామణి కొర్లాం వెళ్లింది.
దేవుని గుడిలో ఉన్న దీపం ప్రమిద మంచంపై పడి మంటలు, పొగ వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురై ఆర్పేందుకు యత్నించారు. ఈలోగా ఫైర్ సిబ్బంది జీవీకే నాయుడు, ఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, పి.జగన్నాథరావు, వై.పాపారావులు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో సామాన్లు కాలిపోయాయి.

మంటలను ఆర్పే ప్రయత్నంలో ఫైర్ సిబ్బంది

పాఠశాల యూనిట్‌గానే ఓహెచ్ ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐచ్ఛిక సెలవు(ఓహెచ్)లనేవి పాఠశాల యూనిట్‌గానే ఉండాలని, ఈ విషయంలో విద్యాశాఖ అధికారుల పెత్తనం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా విద్యాశాఖ మౌఖిక ఆదేశాలతో ఐచ్ఛిక సెలవులను రద్దుచేసి వ్యక్తిగతంగా ఉపాయోగించుకోమని చెప్పడం సబబుకాదన్నారు. ఇటీవల కాలంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని దుయ్యబట్టారు. 20 మంది ఉపాధ్యాయులు ఉన్న ఉన్నత పాఠశాలలో ఓహెచ్‌ను వ్యక్తిగతంగా వాడుకున్న సందర్భంలో పదిమంది ఒకేసారి సెలవు వినియోగించుకోగలరా? ఏకోపాధ్యాయ పాఠశాలలో అసలు ఐచ్ఛిక సెలవులను వినియోగించుకోగలరా? అని అధికారులను ప్రశ్నించారు.

వంతెన గోడను ఢీకొట్టిన వ్యాన్

- రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన అరటి గెలలు

రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న అరటి గెలలు

టెక్కలి రూరల్: బొప్పాయిపురం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాన్ వంతెన గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావులపాలెం నుంచి ఒడిశా వైపు అరటి గెలల లోడుతో వెళ్తున్న వ్యాన్ టెక్కలి సమీపంలో బొప్పాయిపురం వద్దకు వచ్చేసరికి ఇరుకు వంతెన ఉండటంతో గమనించక వంతెను గోడను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో డ్రైవర్ శాంతన్ శెట్టికి స్వల్ప గాయాలు కాగా.. వ్యాన్ రెండు భాగాలుగా విడిపోవడంతో అరటిగెలలు రోడ్డుపై పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ఎయిర్‌పోర్టు వద్దు.. పచ్చని భూములే ముద్దు

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మందస: తమకు ఎయిర్‌పోర్టు వద్దని, పచ్చని భూములే ముద్దు అని మందస మండలం టి.గంగువాడ గ్రామస్తులు తేల్చిచెప్పారు. గ్రామానికి చెందిన చిత్త గున్నయ్య ఆధ్వర్యంలో బాధిత రైతులు కమిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా గ్రామానికి కొందరు అధికారులు వచ్చి సర్వే పేరిట వచ్చి కొలతలు వేయడానికి మిషన్లు తీసుకురావడం బాధాకరమన్నారు. తమ భూములపై ఏ హక్కుతో కొలతలు వేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే శిరీష స్పందించి తమ భూములను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి మోహన్‌రావు, జోగి మోహన్‌రావు, రామారావు, పుక్కల్ల నారాయణ, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

విత్తన సమస్యలు తలెత్తకూడదు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- ఎరువులు సిద్ధం చేసుకోవాలి
- వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

రైతులకు సత్వరమే విత్తనాలు పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రైతులకు విత్తనాల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వరి విత్తనాలు పంపిణీపై ఆరా తీయగా.. ఖరీఫ్‌లో 33,622 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి వెల్లడించారు. 1520 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. యూరియా, డీఏపీ, తదితర ఎరువులు 69.05 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా, డీఏపీ వంటి ఎరువులు 13,495 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో మూడు సీహెచ్‌సీ గ్రూపులకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు సరఫరా చేసినట్లు తెలిపారు. ఏపీఎంఐపీ ఉప సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలాల వారీగా పంటల వివరాలను వివరించారు. పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్ చురుగ్గా జరుగుతోందని చెప్పారు. మత్స్య శాఖ ఉప సంచాలకుడు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 15,584 మందికి మత్స్యకార సేవ పథకం వర్తింపజేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సాహ యోజన కింద ఇప్పటికే 13 కో ఆపరేటివ్ సొసైటీలు అప్రూవల్ అయినట్లు వివరించారు సముద్రంలో నాచు పెంచడం అనేది జిల్లాలో ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద చేపడుతున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించడానికి భావనపాడు, బారువ ప్రాంతాలను గుర్తించామని, ఒక్కోచోట 30 మందికి జూలై 4 నుంచి 9 వరకు శిక్షణ ఇస్తామని డీడీ వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

సింగుపురంలో 9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న 9 మందిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతుపట్టని 'అధికారి' వ్యూహం

- అయోమయంగా సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు
- ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్లాలంటూ హుకుం!
- బదిలీల్లో రాష్ట్రం మొత్తం ఒక తీరు.. సిక్కోలులో మరో తీరు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ తీవ్ర వివాదాస్పదమవుతోంది. అంతుబట్టని 'అధికారి' వ్యూహంతో కౌన్సెలింగ్ అవ్వని మహిళా పోలీసులు ఉక్కిరిబిక్కిరవుతుండగా.. అయినవారు ఉసూరుమంటూ అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. మొన్నటికి మొన్న కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల బదిలీల్లో కూడా ఇలాంటి విమర్శలే సదరు అధికారి ఎదుర్కొన్నారు. జంబ్లింగ్ పద్ధతి పేరిట చేస్తున్న ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ అన్ని జిల్లాల్లో ఒక తీరులా.. శ్రీకాకుళం జిల్లాలో మరోలా జరుగుతోంది. ఎస్, నో క్యాటగిరీలుగా విభజించిన ఈ ప్రక్రియ కొందరికి నాలుగైదు మండలాల అవతలకు బదిలీ చేయగా.. మరికొందరికి పక్కపక్కన ఉన్న మండలాల్లోనే బదిలీ చేయడంతో అధికారి తీరు ఒకరికి మోదం.. మరొకరికి ఖేదంలా అనిపిస్తోంది. జిల్లాలో 930 గ్రామ సచివాలయాలు, 95 వార్డు సచివాలయాలకు గాను గురువారం రాత్రి దాదాపు 880 మంది మహిళా పోలీసులకు మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసినట్లు తెలిసింది.

నిబంధనలకు విరుద్ధంగా..

గతంలో ఆరోగ్య పరిస్థితి, ఇతర కారణాలతో నచ్చిన చోట పోస్టింగ్‌లకు రిక్వెస్టులుగా పెట్టుకోవడం, ఎంత కాలం చేశారన్న దాని ఆధారంగా కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసేది. ఇప్పుడు మాత్రం 'ఎస్, నో' అనే ఆప్షన్లు పెట్టారు. ఎస్ ఆప్షన్‌లో మూడు క్యాటగిరీలు ఉంటాయి.. 2500 మంది ఆ సచివాలయంలో జనాభా ఉంటే ఏ క్యాటగిరీ, ఆపై ఎక్కువ ఉంటే బీ, సీ క్యాటగిరీలుగా విభజించారు. నో ఆప్షన్ ప్రకారం ఆచోట భవిష్యత్తులో మహిళా పోలీసు ఉండరని అర్థం. దీని ప్రకారం రాత పరీక్షల్లో వచ్చే మార్కులు ఆధారంగా, ర్యాంకుల వారీగా ఆ మండలంలో వేరే చోట గానీ, పక్క మండలంలో కానీ బదిలీ అవ్వాలి. దానికి విరుద్ధంగా బుధవారం జరిగే కౌన్సిలింగ్‌లో 1 సంఖ్య నుంచి 120 సంఖ్య వరకు టాపర్స్‌లో ఉన్నవారిని సైతం నాలుగైదు మండలాలు దాటి బదిలీ చేయడం, 126 నుంచి 250, 300 సంఖ్య వరకు పక్కపక్క మండలాల్లోనే వేయడం, 300 నుంచి 500 మధ్యలో అధికారికి నచ్చినట్లు ఎక్కడ పడితే అక్కడికి బదిలీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

పంచాయతీలు పెట్టొద్దు..

- 'సర్ మా అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదు.. 60 కిలోమీటర్ల ఆవల నాకు బదిలీ చేశారు.. పక్కనున్న మండలంలో వేయాలి..' అని ఓ ఉద్యోగి అధికారిని వేడుకుంది. దానిపై సదరు అధికారి స్పందిస్తూ..'ఇక్కడ పంచాయతీలు పెట్టొద్దు. నన్ను తిట్టుకుంటే తిట్టుకోండి. ఎక్కడ అంటే అక్కడికి వెళ్లాల్సిందే. సిస్టమ్ ముందు 30 సెకన్లు కంటే ఎక్కువ ఉండటానికి వీల్లేదు' అంటూ హుకుం జారీ చేశారు.
- శ్రీకాకుళం నగరంలో పలు సచివాలయాల్లో ఉన్న సింగిల్ మహిళా పోలీసు(ఒంటరి/వితంతు)లను పొగిరి, పొందూరు, కొత్తపల్లి, చిలకపాలెం తదితర చోట్లకు బదిలీచేశారు.
- గతంలో సచివాలయంలో ఖాళీల వివరాలు బదిలీ కౌన్సెలింగ్‌కు ముందే బయటపెట్టేవారు. ప్రస్తుతం ఆప్షన్లు ముందుగా చూపించలేదు. దీంతో కౌన్సెలింగ్‌కు వెళ్లేవారికి నిరాశే ఎదురైంది. బదిలీ ప్రక్రియ టీడీపీ నాయకుల హవా కొనసాగిందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]

■ రామకృష్ణ ఓల్టేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు –40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాడుబడుతున్నా పట్టించుకోరా?

- గుంతకందాల గ్రామంలో నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- శిథిలావస్థలో పశువైద్యశాల భవనం
- చెత్త నుంచి సంపద కేంద్రాన్నిన్ని పట్టించుకోని అధికారులు

శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రం

మూతపడిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండటంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనాలు ప్రస్తుతం వృథాగా ఉంటున్నాయి. వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో దెబ్బతింటున్నాయి.

30 ఏళ్లుగా మూతపడిన పశువైద్య కేంద్రం

గ్రామంలో పశువులకు వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రం 30 ఏళ్లగా మూతపడింది. మరమ్మతులు చేస్తే ప్రజా అవసరాలకు ఉపయోగంలోకి వస్తుంది. గ్రామంలో పశువైద్య కేంద్రాన్ని పాలకులు పట్టించుకోకపోవడంతో పశువుల యజమానులు తీవ్ర అవస్థలు పడుతూ ..తమ పశువులకు వైద్యం చేయించుకునేందుకు వెలుగోడు, వేల్పనూరు గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది.

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రం

గ్రామంలో 2015వ సంవత్సరంలో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఓ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నాళ్ల తరువాత ఈ కేంద్రం నిర్వాహణను అధికారులు పట్టించుకోకపోవడంతో మూతపడింది. శివారు ప్రాంతంలో దీన్ని నిర్మించడంతో చెత్తంతా ఈ కేంద్రం పక్కనే పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయాలకు వినియోగించాలి

ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు మూతపడ్డాయి. ఆ భవనాలు వదిలేయకుండా ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్న భవనాలు అలాగే వదిలేస్తే శిథిలమవడం తప్పా ఏమాత్రం ఉపయోగపడవని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వేరే శాఖలకు అవసరమైన వాటిని వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పశువైద్య కేంద్రం పునరుద్ధరించాలి

30 ఏళ్లగా పశువైద్య కేంద్రం మూతపడటంతో పశువులకు వైద్యం కరువైంది. దూరప్రాంతాలకు పశువులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. పశువుల ఆసుపత్రిని బాగు చేసి, సిబ్బంది నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. చెత్త కేంద్రాన్ని కూడా వాడుకలోనికి తీసుకురావాలి.
– శివశంకర్, గుంతకందాల

క్లుప్తంగా

జీవాలను కాపాడుకోండి

గొర్రెలకు నట్టల నివారణ మందు తాపుతున్న పశువైద్యురాలు రాగసంధ్య

పగిడ్యాల: వర్షా కాలంలో సోకే వ్యాధుల నుంచి జీవాలను కాపాడుకోవాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినాయక్ యజమానులకు సూచించారు. గురువారం మండలంలోని పాత ముచ్చుమర్రిలో జీవాలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణ కార్యక్రమంలో ఏడీఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గొర్రెల కాపరులతో మాట్లాడుతూ జీవాలకు నాలుక నీలం రంగులోకి మారడం, జ్వరం, పుండ్లు, కుంటితనం, తదితర లక్షణాలు కనిపిస్తే పశు వైద్యులను సంప్రదించి వైద్యం చేయించాలన్నారు. అనంతరం నెహ్రూనగర్ ఆర్ఎల్‌యూ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు రాగసంధ్య, వీఎల్ఓ శ్రీనివాసులు, ఏహెచ్ఏ చరిత ఉన్నారు.

● **బండి ఆత్మకూరు:** మండల పరిధిలోని లింగాపురం, భోజనం, సింగవరం గ్రామాల్లో గురువారం వెటర్నరీ డాక్టర్లు అనూష, జ్యోత్స్న ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నట్టల నివారణ ముందు తాపడం ద్వారా గొర్రెలు, మేకల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జీవాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగోడు మండల సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను గురువారం జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శివ శంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని, మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అర్థమయ్యే రీతిలో బోధన సాగించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నూర్జహాన్ పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచాలి

వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: మున్సిపల్ ఒప్పంద కార్మికులకు వేతనాలు పెంచాలని సీపీఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఈసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల దీక్షకు తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, దొరస్వామి, రూతమ్మ, దానమయ్య, రాజు, శంకర్‌రావు పాల్గొన్నారు.

ఏడీ బాధ్యతల స్వీకరణ

విధుల్లో చేరిన గిరీష్

నందికొట్కూరు: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీగా గిరీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. పైర్లకు తెగుళ్లు సోకిన విషయాన్ని తమ దృష్టికి తెస్తే నివారణకు కావాల్సిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.

6న ఎడ్ల బండ లాగుడు పోటీలు

ఆత్మకూరు: మొహర్రం సందర్భంగా ఈనెల 6న మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో అంతర్‌రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ మొహర్రం కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 7 గంటల్లోపు ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9848614831, 6301485551 నంబర్లను సంప్రదించాలన్నారు.

పారదర్శకతకే సామాజిక తనిఖీ

రేగడగూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: ఉపాధిహామీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకే ఏటా సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజా వేదికలో సమీక్షిస్తున్నట్లు సామాజిక తనిఖీ సంస్థ డైరెక్టర్ జేఏస్ రాజు తెలిపారు. గురువారం రేగడగూడూరు గ్రామంలో సామాజిక తనిఖీపై ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ నాగజ్యోతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ వలసలు నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ర్యాలీలో సామాజిక తనిఖీ బృందం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ బృందం ఎస్ఆర్‌పీలు రాజు, లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు వెంకట కష్ణారెడ్డి, వెంకట మహేశ్వర రెడ్డి, శివశంకర్ రెడ్డి, భాస్కరరెడ్డి, రజినీ కాంతరెడ్డి, దామోదర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ షాజిద్‌ఖాన్ ఫీల్డ్ అసిస్టెంట్ మునింద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

మాట్లాడుతున్న నాగన్న

ఆత్మకూరు: మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు నాగన్న, నాగరాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో రెండోరోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న చేపట్టనున్న సమ్మెకు మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, మున్సిపల్ కార్మికులు రాజు, ప్రతాప్, జయన్న, చిన్ననాగరాజు, సువర్ణమ్మ పాల్గొన్నారు.

మురుగును తొలగించారు

సాక్షి ఎఫెక్ట్

ఆత్మకూరురూరల్: 'అప్పలరావు వీధిలో దుర్గంధం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఆత్మకూరు మున్సిపల్ అధికారులు సిబ్బందిని పంపి మురుగును తొలగించి చెత్తకుండీని శుభ్రం చేయించారు. అక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

అప్పలరావు వీధిలో మురుగును తొలగిస్తున్న సిబ్బంది

తొలగని దారిద్ర్యం

సంతజూటూరు - జి.సి పాలెం రహదారి దుస్థితి

రహదారులను అద్దంలా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టి ఏడాదైనా అతీగతీ లేదు. తమకు అనుకూలంగా ఉండే వీధుల్లో మాత్రం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమెంటు రోడ్లు వేసుకోవడంపై చూపిన శ్రద్ధ.. గ్రామీణ రహదారుల నిర్మాణంపై చూపకపోవడం సిగ్గుచేటు. కనీసం మరమ్మతుల కూడా చేపట్టకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షా కాలం కావడంతో గుంతల్లో నీళ్లు చేరి మడుగులను తలపిస్తున్నా పట్టించుకునే నాథుడే లేదు. బండిఆత్మకూరు నుంచి రామాపురం మీదుగా లింగాపురం వరకు వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. సంత జూటూరు నుంచి జీసీ పాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. వీటిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకముందే మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.
– బండి ఆత్మకూరు

గుంతలమయంగా ఉన్న బండి ఆత్మకూరు - రామాపురం రహదారి

లింగపురం వెళ్లే తారు రోడ్డుపై లేచిన కంకర

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: ఈనెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు ఎ.శోభరాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఉదయ్ భాగవతార్ వారిచే శివ లీలలుపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. తబలా సహకారాన్ని నటరాజు, కీ సహకారాన్ని శ్రీనివాసరాజు అందించారు.

ఐసీడీఎస్ నోటిఫికేషన్‌లో స్వల్పమార్పు

ఆత్మకూరురూరల్: ఐసీడీఎస్ అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్ పోస్ట్ కోసం వెలువడిన నోటిఫికేషన్‌లో స్వల్ప మార్పు చేసినట్లు సీడీపీఓ ఎన్ కోటేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కాపురం అంగన్‌వాడీ సెంటర్ –1లోని హెల్పర్ పోస్ట్‌కు ఎస్సీ అభ్యర్థులు అర్హులుగా ముందు పేర్కొన్నామని, తాజాగా ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎస్సీ గ్రూప్ – 3కి రోస్టర్ పాయింట్ కేటాయించామని, దరఖాస్తు చేసుకునే వారు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై నేడు అవగాహన

పాములపాడు: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ఆయిల్ పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి హరిచందన తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు సమావేశానికి హాజరై ఆయిల్ పామ్ పంటల సాగు, సబ్సిడీలు, దిగుబడి, ధర, మార్కెటింగ్ తదితర వివరాలు తెలుసుకోవాలన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాలు గురువారం తెలిపారు. సలాంబాషా, సమీర్‌బాషా, గొల్ల గోకారి పేకాట ఆడుతుండగా రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల నుంచి నగదు స్వాధీనం

మహానంది: అబ్బీపురంలో పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి రూ.2,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

కొత్తపల్లి: గ్రామాల్లోని ఎస్సీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు అధికారులను డిమాండ్ చేశారు. గురువారం కొక్కెరంచ ఎస్సీ కాలనీని సందర్శించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగు నీటి సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నుంచి కాలనీలోకి పైపులైను ఉన్నా కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు నిలికి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. దోమలు వృద్ధి చెంది కాలనీవాసులు వ్యాధుల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, నాగరాజు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 10న గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం 6 గంటలకు కాగడహారతి, 7.30 గంటలకు బాబాకు నవవిధ అభిషేకాలు, పుష్పార్చనలు, మహామంగళహారతి, 9 గంటలకు సాయివ్రతం, 10.30 గంటలకు బాబా ప్రత్యేక అలంకరణ, 11.30 గంటలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, గురువారం 3 గంటలకు బాబా రథోత్సవం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 9 గంటలకు శేష హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రహదారి ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సాయికుమార్, నాయకులు దిలీప్ కోరారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తోందన్నారు. కేజీబీవీకి రహదారి నిర్మించడంతోపాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

సబ్‌జైల్‌లో సమస్యలను అడిగి తెలుసు కుంటున్న కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ముద్దాయిలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి ఉచిత లాయర్‌ను నియమిస్తామన్నారు. ముద్దాయిలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన ముద్దాయిలకు, అనారోగ్యంతో బాధపడేవారికి ప్రత్యేక వైద్య సదుపాయలను న్యాయ సేవల ద్వారా పొందవచ్చన్నారు. ఏదేని న్యాయపరమైన సలహాలు, సూచనలకు కారాగారంలోని న్యాయ సేవా కేంద్రంలోని ఉచిత న్యాయవాది ద్వారా గానీ, లేదా ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా సేవలు పొందవచ్చన్నారు. అనంతరం ఖైదీలకు డాక్టర్ ఎస్.జేకి వైద్య పరీక్షలు చేశారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది వెంకటేశ్వర్లు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: ఈనెల 9న కార్మికులు చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం పట్టణంలోని వినోద్ మిశ్రా కార్యాలయంలో కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం తగదన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్న కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా, మున్సిపల్ వర్కర్లను, మధ్యాహ్న భోజన కార్మికులను, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్మికులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు షేక్షావలి, స్వామన్న, స్వాములు నాయుడు, మధు, మహబూబ్ బాషా, శివకుమార్, కృష్ణ, మల్లేశ్వరమ్మ, బీబీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజలతో మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

నందికొట్కూరు: మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామంలో రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసుతో కలిసి డీఎస్పీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మొహర్రంను జరుపుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయ భూములకు వేలంపాట

వేలం పాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంత జూటూరు, లింగాపురం గ్రామాల ఆలయ భూముల కౌలు వేలం పాటను గురువారం గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి ఈ నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత జూటూరు చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 46.96 ఎకరాలను రూ.7,77,000, లింగాపురం ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 3 ఎకరాలను రూ.13 వేలకు రైతులు వేలంపాటలో దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి, ఎస్ఐ జగన్ మోహన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనం నాటిస్తున్న రైతు, వ్యవసాయ కూలీలు

ఖరీఫ్ సాగులో అన్నదాత బిజీ

పగిడ్యాల: వర్షాలు కురుస్తుండటంతో మండలంలో విత్తనం వేసే పనుల్లో అన్నదాతలు బిజీ అయ్యారు. ఖరీఫ్ సాగు కింద మొక్కజొన్న, సోయాబిన్, పత్తి తదితర పంటలను సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా ఆశించిన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో విత్తనం నాటుకునేందుకు నెల రోజులు ఆలస్యమైందని ఈ అదును మళ్లీ దొరకదని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. వర్షధారం కింద మండలంలో దాదాపు 3 వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న విత్తనం నాటేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇంకా వరి, మిరప, ఉల్లి, టమాట, పచ్చిమిర్చి పంటల సాగుపై కూడా దృష్టి సారించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 4 । జూలై । 2025

టన్ను చీనీ రూ.16,670

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,670, కనిష్టం రూ.3,500 ప్రకారం ధర పలికాయి.

పద్మనాభుడి మాన్యం.. పరాధీనం

హిందూపురంలోని అనంత పద్మనాభుడి ఆలయ మాన్యం భూములు తమవంటూ ప్రైవేట్ వ్యక్తులు తెరపైకి రావడం వివాదాస్పదమైంది.

8లో

గరిష్టం/కనిష్టం

35.8°/22.6°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నగదు మళ్లింపు కేసులో నిందితులకు రిమాండ్

కదిరి అర్బన్: ఖాతాదారుల సొమ్మును అనధికారికంగా మరో ఖాతాకు మళ్లించిన కేసులో ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ)లో గతంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసిన వెంకటనాయుడు 2024 సంవత్సరంలో అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఆవుల భానుప్రవీణ్‌రెడ్డి అనే వ్యక్తికి క్రికెట్ బెట్టింగ్ నిమిత్తం స్వయం సహాయక సంఘాలు, తెలిసిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.67 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు. నగదు మళ్లింపు గురించి తెలిసిన తర్వాత రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు గత ఏడాది మార్చిలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిప్యూటీ మేనేజర్ వెంకటనాయుడు, ఆవుల భానుప్రవీణ్‌రెడ్డి, ఆవుల రమణారెడ్డి, అంకమబాబు, బాలప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా గతంలోనే వెంకట నాయుడును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న ఆవుల రమణారెడ్డి, అంకమబాబులను ఈ నెల 2న అరెస్ట్ చేసి, కదిరి కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వద్ద హాజరుపరిచారు. 14 రోజులు రిమాండ్ విధించడంతో నిందితులను సబ్‌జైలుకు తరలించారు.

18 మండలాల్లో వర్షం

పుట్టపర్తి టౌన్: ముంగారు పంటల సాగుకు అదను ఉన్నా ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. బుధవారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో వర్షం కురిసింది. ముదిగుబ్బ, కనగానపల్లి, హిందూపురం, మండకశిర మండలాల్లో అధికంగా, మరో తొమ్మిది మండలాల్లో మోస్తరుగా, ఐదు మండలాల్లో సాధారణంగా వర్షపాతం నమోదైంది. కాగా మిగిలిన మండలాల్లో పూర్తిగా నమోదు కాలేదు.

పొదుపు సొమ్ముతో పోస్టుమాస్టర్ పరార్

అమడగూరు: ఖాతాదారులు పైసాపైసా పోగు చేసి పొదుపు చేసిన సొమ్ముతో పోస్టుమాస్టర్ పరారైన ఘటన అమడగూరు మండలంలో వెలుగు చూసింది. పూలకుంటపల్లి తలాపా కార్యాలయంలో చాంద్‌బాషా పోస్ట్‌మాస్టర్‌గా పని చేస్తున్నారు. తపాలా కార్యాలయం పరిధిలోని పది గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు, పింఛన్‌దారులు, కూలీలు భవిష్యత్ అవసరాలకు పనికి వస్తాయని పొదుపు చేసుకోవడం కోసం పోస్టల్ అకౌంట్లు తెరిచారు. పోస్టుమాస్టర్ ఖాతాదారుల ఇళ్ల వద్దకే వెళ్లే డబ్బు కట్టించుకుని, పుస్తకాల్లో రాసేవారు. ఒక్క లోకోజుపల్లిలోనే ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు పొదుపు కట్టారు. మిగిలిన గ్రామాల్లోనూ రూ.లక్షల్లోనే చెల్లించారు. అయితే రెండు నెలల నుంచి పోస్టుమాస్టర్ కనిపించకపోవడంతో ఖాతాదారులకు ఆందోళన నెలకొంది. అనుమానం వచ్చి అమడగూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో వారి ఖాతాలను పరిశీలించగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ప్రతి నెలా తాము చెల్లిస్తున్న సొమ్ము ఖాతాల్లో జమకాలేదని తెలియడంతో లోకోజుపల్లి పొదుపుదారులు పద్మావతమ్మ, షకీనమ్మ, విహానుబాను, నారాయణప్ప, రజియా, శంకర్‌రెడ్డి, రమీజా, అలీమా లబోదిబోమన్నారు. గురువారం విలేకరుల వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. అక్కరకు వస్తుందన్న ఆశతో చేసుకున్న పొదుపును పోస్టుమాస్టర్ గద్దలా తన్నుకుపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమాస్టర్ కుటుంబ సభ్యులు కూడా గ్రామం వదిలి వెళ్లిపోయారని, ఇక ఎవరిని అడగాలని కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులే తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఖాశీంస్వామికి నిత్యపూజ నివేదన

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బత్తలపల్లి ఖాశీంస్వామికి గురువారం నిత్యపూజ నివేదన నిర్వహించారు. తెల్లవారుజామున ముజావర్లు మహబూబ్‌బాషా, ఖాశీంపీరా, ఫక్రుద్దీన్, ఖాశీంవలి చావిడిలో ఖాశీంస్వామి పీరుకు ఫాతిహా చేశారు.

పల్లెకు రాని వెలుగులు

- మడకశిర మండలం ఎల్లోటి గ్రామంలో 2 వేల మంది జనాభా ఉన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 25 మంది విద్యార్థులు ఆటోల్లో నాలుగు కిలోమీటర్ల దూరంలోని తడకలపల్లికి చేరుకుని, అక్కడి నుంచి బస్సులు ఎక్కాల్సి వస్తోంది.

- పరిగి మండల కేంద్రానికి 4 కి.మీ దూరంలో ఉన్న శ్రీరంగరాజుపల్లికి బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామంలో వందలాది మంది సమీపంలోని గార్మెంట్స్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరు రోజూ ఆటోల ద్వారా పనులకు వెళ్తున్నారు. ఇక మండలంలోని మోదా, పి.నరసాపురం, ఊటుకూరు, ఎర్రగుంట, శాసనకోట, బాలిరెడ్డిపల్లి, నేతలపల్లి, గణపతిపల్లి, కొత్త నరసాపురం పెద్దిరెడ్డిపల్లి గ్రామాలకు కూడా బస్సు సదుపాయం లేదు.

- సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లికి రూ.కోట్లు ఖర్చు చేసి తారు రోడ్డు నిర్మించారు. అయితే బస్సు ఏర్పాటు చేయడం మరిచారు. బస్సుల్లేక విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తుంగోడు, చిన్నబాబయ్యపల్లి, గుడిపల్లికి కూడా బస్సు లేదు. ఆటోల ద్వారా సోమందేపల్లి చేరుకుంటారు. చిన్నబాబయ్యపల్లి నుంచి రెండు కిలోమీటర్లు నడిచి తుంగోడు క్రాస్ చేరుకోవాలి. కొనతట్టుపల్లి గ్రామస్తులు 3 కిలోమీటర్లు నడిచి వెలిదడకలకు చేరుకుంటే బస్సులు అందుబాటులో ఉంటాయి.

- ఆర్టీసీ బస్సుల్లేక గ్రామీణుల అవస్థలు
- మెజారిటీ గ్రామాలకు చేరని ప్రగతి చక్రం
- ప్రమాదమని తెలిసినా ఆటోలు, జీపుల్లోనే ప్రయాణం
- పరిమితికి మించి ప్రయాణంతో నిత్యం ప్రమాదాలు
- ఊసే లేని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం

మడకశిర నుంచి గ్రామాలకు ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

సాక్షి, పుట్టపర్తి: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. సుశిక్షితులైన డ్రైవర్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటారు. అయితే జిల్లాలో చాలా గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ 'పల్లె వెలుగు' బస్సులు వెళ్లడం లేదు. దీంతో ప్రజలు, విద్యార్థులు, చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల మేర నడక లేదా ఆటోలో వెళ్తే కానీ బస్సులను అందుకోలేని దుస్థితి. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం గురించి పట్టించుకోలేదు. జిల్లాలో 32 మండలాలు ఉండగా.. బస్సులు వెళ్లని గ్రామాలున్న మండలాలు 25 ఉండటం విశేషం. మున్సిపాలిటీ కేంద్రాలు తప్ప.. మిగతా అన్ని మండలాల్లోనూ బస్సు సర్వీసుల కొరత వేధిస్తోంది. చాలా గ్రామాలకు 'ప్రగతి చక్రం' దూరమైంది.

ప్రైవేటు వాహనాలే దిక్కు

జిల్లాలోని ధర్మవరం, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, హిందూపురం, మడకశిర, పెనుకొండ.. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు ఉన్నాయి. కేవలం మున్సిపాలిటీ ప్రాంతాల్లో మాత్రమే బస్సు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో కర్ణాటక సరిహద్దున ఉండే చాలా గ్రామాలకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. ఎక్కడైనా ప్రయాణం చేయాలంటే రవాణా ఖర్చులు భరించాల్సిందే. గతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థ కొన్ని సర్వీసులను ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో నడిపేది. అయితే ఇటీవల సరైన ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉండటం లేదనే కారణంతో చాలా సర్వీసులను రద్దు చేశారు.

ఆర్టీసీ గణాంకాలు

జిల్లాలో మొత్తం బస్సులు	398		
లగ్జరీ	50	ఎక్స్‌ప్రెస్	120
ఇంద్ర	4	పల్లెవెలుగు	224
బస్సు డిపోలు -	6	డ్రైవర్లు	660
ఇతర సిబ్బంది	380	కండక్టర్లు	560
బస్సు రూట్‌లు	135		
రోజుకు ప్రయాణికుల సగటు సంఖ్య	3 లక్షలు		
ఆర్టీసీకి రోజుకు సగటున వసూలు	రూ.55 లక్షలు		

ప్రైవేటు వాహనాలపైనే ఆధారం

లేపాక్షి మండలంలో కోడిపల్లి పంచాయతీ మారుమూలన ఉంది. ఏ గ్రామానికి వెళ్లాలన్నా ఆటోలు, లేదా ద్విచక్రవాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు లేనందున దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. గతంలో మా పంచాయతీకి ఆర్టీసీ సంస్థ 10 సింగిల్స్ నడిపి.. కలెక్షన్లలో డిపోలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

– మల్లికార్జున, కోడిపల్లి, లేపాక్షి మండలం

బస్సే ఎరుగని గ్రామం

మండల కేంద్రం అమరాపురానికి మా గ్రామం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. బస్సుకు వెళ్లాలంటే గంట ముందే బయలుదేరాలి. తమ్మడేపల్లిలో బస్సు ఎక్కాలన్నా ఐదు కిలోమీటర్ల కాలి నడకన వెళ్లాలి. లేదంటే సొంత వాహనాల్లో చేరుకోవాలి. ప్రభుత్వాలు, పాలకులు మారినా మా ఊరి దుస్థితి మారలేదు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి మా గ్రామం ఆర్టీసీ బస్సే ఎరుగదు.

– సిద్దేశ్వర, నవగనపల్లి, అమరాపురం మండలం

ఊరు దాటి వెళ్తేనే బస్సు

మా ఊరి నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని రామాపురం చేరుకుంటే.. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులో వెళ్లవచ్చు. పిన్నదరి గ్రామం నుంచి 4 కిలోమీటర్లు వెళ్తే.. పుల్లంపల్లి చేరుకుని అక్కడి నుంచి తాడిమర్రికి బస్సులు ఉంటాయి. మోదుగులకుంట, శివంపల్లి, భీమరాయునిపేట వారు తాడిమర్రికి చేరుకుంటేనే బస్సు ఎక్కే పరిస్థితి. పాలకులు స్పందించి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– బాల ఓబులేసు, ఎం.అగ్రహారం, తాడిమర్రి మండలం

జిల్లా కేంద్రం దగ్గరే ఉన్నా..

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి సమీపానే పైలబోయినపల్లి ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేదు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలో పులేటిపల్లి, వెంకటాంపల్లి, ఓబుళంపల్లి, ఆమిదాలకుంట గ్రామాలు పుట్టపర్తికి 20 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. గతంలో ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేశారు. కొత్తచెరువు నుంచి ఆమిదాలకుంట మీదుగా చెన్నేకొత్తపల్లికి బస్సు ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– రాంగోపాల్‌రెడ్డి, పైలబోయినపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

హామీలతో నయవంచన

నాయకులతో కలిసి 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

- ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: సూపర్ సిక్స్ సహా 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. ఓట్లు వేయించుకుని.. అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారని విరుచుకుపడ్డారు. గోరంట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో–చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పోస్టర్లను జిల్లా అధ్యక్షురాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరి ఏడాది దాటినా హామీలు సంపూర్ణంగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేశారని దుయ్యబట్టారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఇంతవరకూ అందలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా.. నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. 18 ఏళ్ల నిండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించి, ఏ విధంగా మోసం చేశారో ప్రజలను చైతన్యవంతులను చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, పట్టణ కన్వీనర్ మేదర శంకర, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు గంపల వెంకటరమణారెడ్డి, ముఖ్యనాయకులు, బూదిలి రవీంద్రారెడ్డి, వానవోలు రాజేంద్రప్రసాద్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరాచకాలు దాచేసి.. అబద్ధాలు అచ్చేసి!

ఇచ్చిన హామీలే నీటిమూటలనుకుంటే ఇంటింటికీ సుపరిపాలన అంటూ ముద్రించిన కరపత్రాలు మరీ ఘోరంగా ఉన్నాయంటూ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల్లో చర్చ జరుగుతోంది. హామీలు నెరవేర్చామా లేదా అన్నది చెప్పకుండా చేయని పనులపై అబద్ధాలు అచ్చువేసి కరపత్రాలు పంచుతున్నారు. వీటిని చదువుతున్న సామాన్యులు కూడా అర్థం కాక బిక్కముఖం వేస్తున్న పరిస్థితి. 'సూపర్ సిక్స్'పై ఎక్కడా ఒక్కమాట కూడా చెప్పకనే.. ప్రజల చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

- 'సుపరిపాలన' కరపత్రాల్లో ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాయని ముద్రణ
- క్షేత్రస్థాయిలో భిన్నంగా పరిస్థితి
- 'ఉమ్మడి అనంత'లో పెరిగిన అత్యాచారాలు, హత్య ఘటనలు
- రైతులకు ఉచిత విద్యుత్ అంటూనే.. విపరీతంగా కోతలు
- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం అంటూ పత్రాల్లో భజన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూటమి ప్రభుత్వ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న కూటమి ఎమ్మెల్యేలు పంచుతున్న కరపత్రాల్లో ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళలపై దాడులు గణనీయంగా తగ్గాయని ముద్రించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో దళిత బాలికపై సామూహిక అత్యాచార ఘటన జరిగింది. అనంతపురంలో ఇంటర్ చదివే గిరిజన బాలిక తన్మయి దారుణ హత్యకు గురైంది. ఈ రెండు ఘటనలు జిల్లాలోనే కాదు... రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఇక.. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రిలో ఎస్సీ వర్గానికి చెందిన ఎంపీపీపై దారుణంగా దాడి చేశారు. రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఎస్సీ,ఎస్టీలపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. కానీ, వాటన్నింటినీ దాచి దాడులు తగ్గినట్టు చిత్రీకరించడం చర్చనీయాంశమైంది.

గంజాయి, డ్రగ్స్ ముఠా పేట్రేగి పోతున్నా

కూటమి ప్రభుత్వం వచ్చాక రాయదుర్గం ప్రాంతంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా గంజాయి సాగు చేస్తూ దొరికిపోయాడు. తాడిపత్రిలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తూ పోలీసులకు సవాలుగా మారింది. అనంతపురంలో ఇటీవలే గంజాయి బ్యాచ్ పోలీసులకు పట్టుబడింది. హిందూపురంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా అవుతోంది. ఇంత దారుణంగా రెండు జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్ కేసులు నమోదవుతుంటే.. సురక్షిత ఆంధ్రప్రదేశ్ అని, రౌడీషీటర్లు, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నట్టు ఏడాది పాలన కరపత్రాల్లో భజన చేశారు.

గుంతల రోడ్లకు గంతలు..

ఉమ్మడి జిల్లాలో గుంతలు పడిన రోడ్లకు కూటమి సర్కారు గంతలు కట్టింది. ఎక్కడ చూసినా రోడ్లు ఛిద్రమై వాహనదారులు ఆపసోపాలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు రూ.866 కోట్లు విడుదల చేశామని కరపత్రాల్లో పొగుడుకున్నారు. కానీ రోడ్లు బాగుపడకపోగా బిల్లులు మాత్రం టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయి. మరోవైపు రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ అంటూనే ఇటీవలి కాలంలో కరెంటు కోతలు విపరీతంగా విధించారు.

ముందే రెక్కీ..

ఆకస్మికంగా గ్రామాల పర్యటన చేసే పరిస్థితి కూటమి నేతలకు లేదు. ఎక్కడ పర్యటిస్తున్నారో ఆ ప్రాంతానికి ముందురోజే అనుచరులను పంపించి అక్కడ వ్యతిరేకులెవరైనా ఉంటే బుజ్జగిస్తున్నట్టు తెలిసింది. ఎవరైనా ప్రశ్నించే అవకాశం ఉంటే వారికి ముందే నచ్చజెప్పి వస్తున్నారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న సామాన్యులు వాట్సాప్ గ్రూపుల్లో సమస్యలను పోస్ట్ చేస్తున్నారు. డ్రైనేజీ, రోడ్లు, కరెంటు స్తంభాలు, డీపీలు, ఆస్పత్రుల్లో వసతులు ఇలా ఒక టేమిటి రకరకాల సమస్యలతో వాట్సాప్ గ్రూపులు మోత మోగుతున్నాయి.

పట్టుచీరల వ్యాపారి బలవన్మరణం

- చెడు అలవాట్లు, బెట్టింగ్‌తో విపరీతంగా అప్పులు

జగదీష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టుచీరల వ్యాపారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. చెడు అలవాట్లు, క్రికెట్ బెట్టింగ్ కోసం చేసిన అప్పులు పెరిగిపోవడం.. వ్యసనాలు మానుకోవాలని ప్రాధేయపడినా మారలేదని భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బండి జగదీష్ (30)కు నేసేపేటకు చెందిన అంజలితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. జగదీష్ పట్టుచీరల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే ఏడాది కిందటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో క్రికెట్ బెట్టింగ్‌లో సంపాదించిన సొమ్ముతో పాటు బయట అప్పులు చేసి మరీ పెట్టి.. నష్టపోయాడు. పద్ధతి తప్పిన భర్తను తిరిగి మార్చుకోవడానికి భార్య ఎన్నో విధాలుగా ప్రయత్నించింది. మందలించినా, ప్రాధేయపడినా అతనిలో మార్పు కనిపించలేదు. చేసేది లేక ఆమె నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటికీ జగదీష్ వ్యసనాలను వదులుకోలేదు. భార్య తిరిగి కాపురానికి రాకపోవడం, వ్యసనాలను వీడలేకపోవడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లోని బాత్రూమ్‌లోకి వెళ్లి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే జగదీష్ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తుంగభద్ర తుళ్లింత

క్రస్ట్ గేట్లు ఎత్తిన వేళ విద్యుత్ వెలుగుల్లో తుంగభద్ర జలాశయం

- 20 క్రస్ట్ గేట్లు ఎత్తివేత
- 58,260 క్యూసెక్కుల నీరు నదికి

బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతుండటంతో గురువారం తుంగభద్ర జలాశయం 20 క్రస్ట్ గేట్లను బోర్డు అధికారులు ఎత్తివేశారు. రెండున్నర అడుగుల మేర ఎత్తి నదికి 58,260 క్యూసెక్కులు, వివిధ కాలువలకు 4,506 క్యూసెక్కులు కలిపి మొత్తం 62,766 క్యూసెక్కులను బయటికి పంపుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా ప్రస్తుతం 80 టీఎంసీలకు కుదించారు. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోపే ఆమేరకు నీరు చేరడం గమనార్హం. దీంతో డ్యాంలో 78.100 టీఎంసీలు నిల్వ ఉంచి మిగిలిన నీటిని నదికి వదులుతున్నారు.

క్లుప్తంగా

స్వర్ణాంధ్ర ఫౌండేషన్‌పై మంత్రి సమీక్ష

అధికారులతో వీసీలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: స్థానిక నియోజకవర్గ పరిధిలో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌పై అధికారులతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ గురువారం సమీక్షించారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన ఈ ప్రక్రియలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆర్డీఓ మహేష్, ఎంపీడీఓ సాయి మనోహర్, విద్యావేత్త సురేంద్రనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, సమగ్ర సామాజిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్క రంగంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

బ్లాక్ స్పాట్ల పరిశీలన

ఎంవీఐ రాణితో చర్చిస్తున్న జేటీసీ కృష్ణవేణి

ధర్మవరం అర్బన్: ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ మరింత నిఘా ఉంచాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి, సిబ్బందికి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.కృష్ణవేణి సూచించారు. ధర్మవరంలోని ఆర్‌టీఓ కార్యాలయాన్ని గురువారం జేటీసీ సందర్శించారు. పట్టణంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలతో పాటు జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయంలో ఎంవీఐతో సమావేశమై మాట్లాడారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పద్మనాభుడి మాన్యం.. పరాధీనం

- రూ.80 కోట్ల విలువైన ఆ భూమి తమ పూర్వీకులదంటూ తెరపైకి ప్రైవేట్ వ్యక్తులు
- ఆధారాలు సృష్టించి దక్కించుకున్న వైనం
- ఆలయ మాన్యం వదలబోమంటున్న దేవదాయ శాఖ

చిలమత్తూరు: హిందూపురంలోని నానెప్ప సత్రం ఎదురుగా ఉన్న సుప్రసిద్ధ అనంత పద్మనాభస్వామి ఆలయానికి సంబంధించిన మాన్యం భూములు వివాదంలో చిక్కుకున్నాయి. శ్రీకంఠపురం పరిధిలోని సర్వే నంబరు 131–3సీలో తనకున్న 17 ఎకరాల్లో రెండు ఎకరాలను 1925లో స్థానిక వైద్యుడు నానెప్ప అనే బ్రాహ్మణుడు అనంత పద్మనాభస్వామి ఆలయానికి దానం చేశారు. మిగిలిన 15 ఎకరాల భూమిలో ఎస్డీజీఎస్ కళాశాల ఉంది. తనకు వారసులెవరూ లేకపోవడంతో ఉన్న భూమిని దానం చేశారు. అప్పటి నుంచి ఆ భూమిలో కొన్నేళ్ల పాటు అక్కడే ఉన్న చంద్రవంక బావి నుంచి నీటిని వినియోగించుకుని పూల మొక్కలు పెంచుతూ వాటి పూలను స్వామి వారి సేవకు వినియోగిస్తూ వస్తున్నారు. కాలక్రమేణ ఆ భూమిలో దేవదాయశాఖ అనుమతితో కొందరు వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని ప్రతి నెలా అద్దెను అప్పటి నుంచి ఇప్పటి వరకూ చెల్లిస్తూ వస్తున్నారు.

రూ.80 కోట్ల విలువైన మాన్యంపై కన్నేసి..

హిందూపురం పరిసరాల్లో భూముల విలువ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో పద్మనాభస్వామి ఆలయ మాన్యం విలువ రూ.80 కోట్లకు పైగా చేరుకుంది. దీంతో ఆలయానికి చెందిన రెండు ఎకరాలపై కొందరు ప్రైవేట్ వ్యక్తులు కన్నేశారు. లేని వారసులను సృష్టించి ఆ భూమి తమదంటూ కోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులను లోబర్చుకుని సృష్టించిన పత్రాలను న్యాయస్థానంలో సమర్పించి చివరకు ఆ భూమిని తమ వశం చేసుకున్నారు. ఆ భూమి ఆలయానిదేనంటూ కోర్టుకు దేవదాయశాఖ విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. ఇదే అంశంపై ఆ భూమిలో దుకాణాలు నిర్వహిస్తున్న పలువురు హిందూ సంఘాల నాయకులతో కలసి ఉద్యమాలు చేపట్టారు. అన్యాక్రాంతమైన ఆ భూమిని తిరిగి ఆలయానికి దక్కేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

అనంత పద్మనాభస్వామి మాన్యం భూములను కాపాడాలని దేవదాయశాఖ ఈఓ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అన్యాక్రాంతమైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న హిందూపురం వాసులు (ఫైల్)

ప్రజాప్రతినిధులకు పట్టని దురాక్రమణ..

అనంత పద్మనాభస్వామి ఆలయ మాన్యం దురాక్రమణపై ప్రజాప్రతినిధులు సైతం పెదవి విప్పకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చివరకు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. రూ.80 కోట్లు విలువైన ఆలయ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రభుత్వం సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. కోర్టుకు నకిలీ ప్రత్రాలు సమర్పించి తప్పుదోవ పట్టించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ ప్రజాప్రతినిధులు సైతం అక్రమార్కులకే వంత పాడుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

బావిలో నిధులు కాజేందుకేనా?

ఆలయ మాన్యంలోని చంద్రవంక బావిలో అనంత పద్మనాభుడికి చెందిన అపారమైన నిధి, నిక్షేపాలు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పూర్వం సుల్తానుల బారి నుంచి ఆలయాన్ని కాపాడుకునేందుకు అప్పట్లో విలువైన వజ్ర, వైఢూర్యాలు, బంగారం, ఇతర విలువైన సామగ్రిని బావిలో దాచినట్లుగా స్థానికులు విశ్వసిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు బావిలో నిధులు కాజేందుకు కోర్టును తప్పుదోవ పట్టించి ఆలయ మాన్యం భూములను తమ వశం చేసుకున్నారని, ఆ తర్వాత నింపాదిగా బావిలోని నిధి నిక్షేపాలను వెలికి తీసి సొంతం చేసుకునే కుట్రకు తెరలేపారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బావిని పురావస్తు శాఖ స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్ సైతం స్థానికుల నుంచి వినిపిస్తోంది.

రోడ్డున పడనున్న 50 కుటుంబాలు..

స్వామి మాన్యంలో సుమారు 46 నుంచి 50 దుకాణాలు వెలశాయి. వీరు ప్రతి నెలా సత్రానికి అద్దె కూడా చెల్లిస్తున్నారు. వివిధ రకాలుచిరు వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం భూమిని తమ వశం చేసుకున్న వారు అక్కడున్న దుకాణాలను ఖాళీ చేయించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగించేందుకు సిద్ధమయ్యారు. నోటీసులు ఇస్తే దాదాపు ఆరు దశాబ్దాలుగా అక్కడ దుకాణాలు నిర్వహిస్తున్న వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశముండడంతో పోలీసులను ప్రయోగిస్తున్నారు.

ఈఓ బదిలీకి కుట్ర..

అన్యాక్రాంతమైన అనంత పద్మనాభస్వామి ఆలయ మాన్యం భూములను తిరిగి ఎలాగైనా ఆలయానికే దక్కేలా చేయడానికి ఆలయ ఈఓ నాగేంద్రుడు పోరాటం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఆలయ ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ అంశం ఆలయ మాన్యం దక్కించుకున్న ప్రైవేట్ వ్యక్తులకు గిట్టలేదు. దీంతో ఎలాగైనా ఈఓను అక్కడి నుంచి బదిలీ చేయించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లుగా సమాచారం.

మహారాష్ట్ర భక్తుల పర్తి యాత్ర

పాదయాత్రగా పుట్టపర్తికి వెళుతున్న మహారాష్ట్ర భక్తులు

ధర్మవరం అర్బన్: పర్తి యాత్రలో భాగంగా ధర్మవరం రైల్వే స్టేషన్‌కు గురువారం చేరుకున్న మహారాష్ట్ర వాసులు పాదయాత్రగా పుట్టపర్తికి తరలివెళ్లారు. దాదాపు 500 మందికి పైగా భక్తులు వారి సంప్రదాయ రీతిలో భజనలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ వెళుతుండగా పట్టణ ప్రజలు సాదరస్వాగతం పలికారు.

ఇద్దరిపై కేసు నమోదు

కదిరి అర్బన్: యువకుడిపై రాళ్లతో దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను సీఐ నారాయణరెడ్డి గురువారం వెల్లడించారు. కదిరిలోని నిజాంవలీ కాలనీకి చెందిన కేదార్ మహేష్‌కుమార్‌పై అదే కాలనీకి చెందిన రాకేష్, నగేష్ రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. స్నేహితులైన ఈ ముగ్గురి మధ్య చిన్నపాటి గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మహేష్‌కుమార్‌పై వారు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాకేష్, నగేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి ఎస్‌ఐ రంగడు యాదవ్ గురువారం మోదా పంచాయతీ పరిధిలోని బందార్లపల్లి శివారున తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించగానే పేకాటరాయులు పారిపోయారు. పోలీసులు వెంటాడి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.70,500 నగదు, 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. జూదరులపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీ లక్షణాలతో మృతి

తిప్పన్న (ఫైల్)

గుడిబండ: మండలంలోని కొంకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిప్పన్న (65) డెంగీ లక్షణాలతో మృతి చెందారు. ఈ మేరకు గురువారం కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందారు. జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో మెరుగైన వైద్యం కోసం రెండు రోజుల క్రితం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం ఆయన మృతి చెందాడు.

ఏకపక్షం.. భూసేకరణ సమావేశం

- తహసీల్దార్ తప్ప ఇతర అధికారులు కనిపించని వైనం
- వేదికను ఆక్రమించుకున్న టీడీపీ నేతలు
- రైతుల గొంతు నొక్కే ప్రయత్నం

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు గ్రామంలో సెజ్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశం టీడీపీ నేతల నేతృత్వంలో ఏకపక్షంగా సాగింది. ఆర్డీఓ వస్తున్నారని రైతులంతా రావాలని హాజరు కావాలని ముందస్తుగా అధికారులు ప్రకటించారు. అయితే గురువారం ఉదయం సమావేశానికి స్థానిక తహసీల్దార్ తప్ప మరే అధికారి హాజరు కాలేదు. మొత్తం సమావేశాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు శ్రీనివాసరావు, సురేంద్రబాబు దగ్గరుండి నడిపించారు. వేదికపై తహసీల్దార్ ఒక్కరే అధికారి కాగా, మిగిలిన వారందరూ టీడీపీ నాయకులు ఆక్రమించేశారు. రైతులకు అనుకూలంగా మాట్లాడాల్సిన నాయకులు బెదిరింపు ధోరణితో రైతుల గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. పక్క నియోజకవర్గాల్లో భూములు తక్కువ ధరకే వస్తున్నాయని, ఇక్కడ రైతులు కూడా ప్రభుత్వం అందించే స్వల్పపాటి పరిహారం తీసుకొని భూములు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. పారదర్శకంగా నిర్వహించాల్సిన గ్రామ సభ కాస్త పక్కదారి పట్టడంతో రైతుల్లో అసహనం వ్యక్తమైంది. తక్కువ ధరకే దౌర్జన్యంగా భూములు కొట్టేయాలని చూస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సెజ్ ఏర్పాటుకు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చొరవ తీసుకున్నారని, ప్రస్తుతం రూ.12 లక్షలకే భూములు అప్పగించాలంటూ ఒత్తిడి చేయడం సబబు కాదని పలువురు రైతులు వాపోయారు. కాగా, సెజ్ ఏర్పాటుకు భూములు సేకరిస్తే నిర్వాసితులకు ఆయా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమావేశంలో తహసీల్దార్ నటరాజ్‌కు సీపీఎం నేత ప్రవీణ్‌కుమార్ వినతి పత్రం అందజేసి, మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలయ్య పీఏ శ్రీనివాసరావు (పక్కన) తల వంచుకుని కూర్చొన్న తహసీల్దార్ నటరాజ్

నిబంధనల ఉల్లంఘునులపై కఠిన చర్యలు

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి మద్యం షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం దకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచాలన్నారు. బార్లలలో రాత్రి 11 గంటల వరకు మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. ప్రతి మద్యం షాపులోనూ 21 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే మద్యం విక్రయించాలన్నారు. ఒకరికి 3 కంటే ఎక్కువ మద్యం సీసాలు విక్రయించరాదన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు చేయరాదన్నారు. .సుంకం చెల్లించని మద్యం, కల్తీ మద్యం విక్రయించిన దుకాణ యజమానులపై హత్యాయత్నం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డీఎస్పీ పదోన్నతుల సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం: డీఎస్పీ పదోన్నతులకు సంబంధించి తాత్కాలిక (అడహక్) సీనియార్టీ జాబితాను అధికారులు విడుదల చేశారు. 2024–25 ప్యానల్‌లో సీనియార్టీ జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీఐలు ఉన్నారు. వీరిలో కె.దేవానంద్ (అనంతపురం), ఎం.ఆదినారాయణ (పీటీసీ అనంతపురం), బి.మోహన్ (శ్రీసత్యసాయి), కె.సాయినాథ్ (అనంతపురం), ఎస్వీ భాస్కర్‌గౌడ్ (అనంతపురం), కె.రాఘవన్ (శ్రీసత్యసాయి), పి.సత్యబాబు (అనంతపురం), జి.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి (శ్రీసత్యసాయి) ఉన్నారు.

కలుషిత నీరు తాగి 16 జీవాల మృతి

బెళుగుప్ప: కలుషిత నీరు తాగి 16 జీవాలు మృతి చెందిన ఘటన బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తన మొక్కజొన్న పంటకు యూరియా కలిపిన నీటిని డ్రిప్ ద్వారా అందించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గొర్రెల మంద అక్కడకు చేరుకుంది. దాహంతో ఉన్న గొర్రెలు, మేకలు అప్పటికే తొట్టెలో ఉన్న యూరియా కలిపిన నీటిని తాగాయి. కాసేపటి తర్వాత 10 గొర్రెలు, 5 మేకలు, ఓ పొట్టేలు మృత్యువాత పడడంతో కాపరులు తిప్పయ్య, మహేష్, వన్నూరుస్వామి, రామాంజనేయులు, అంజనప్ప, లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్కేయూ వీసీ నియామకంపై సెర్చ్ కమిటీ ఏర్పాటు

ప్రొ. రామ్‌కుమార్ కాకాని, ప్రొ. ఎన్.శివప్రసాద్, ప్రొ. అలోక్‌కుమార్ రాయ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన వీసీ నియామకంపై సెర్చ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది. ముగ్గురు సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా డాక్టర్ రామ్ కుమార్ కాకాని (డైరెక్టర్, ఐఐఎం రాయ్‌పూర్), పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ (వీసీ, గీతం వర్సిటీ), యూజీసీ నామినీగా ప్రొఫెసర్ అలోక్‌కుమార్ రాయ్ (వీసీ, యూనివర్సిటీ ఆఫ్ లక్నో బాబుగంజ్, లక్నో) వ్యవహరించనున్నారు. ఈ కమిటీలోని సభ్యులు సమావేశమై ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఈ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు గవర్నర్ తుది నియామకం చేయనున్నారు. కాగా, ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ బి.అనిత ప్రస్తుతం ఉన్నారు. ఇన్‌చార్జి పాలనలోనే ఏడాది పూర్తయింది. సాధారణ ఉద్యోగిని రిజిస్ట్రార్‌గా నియామకం చేశారు. కనీసం డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని నియామకం చేయాల్సి ఉండగా, నిబంధనలు బేఖాతరు చేస్తూ రీసెర్చ్‌కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను రిజిస్ట్రార్‌గా నియామకం చేశారు. ఏడాది కాలంలో వర్సిటీకి ఒక్క యూజీసీ ప్రాజెక్ట్ రాలేదు. కీలక నిర్ణయాలు అన్నీ జాప్యం కావడంతో వర్సిటీ పురోగతి మందగించింది. ఇలాంటి తరుణంలో పూర్తి స్థాయి వీసీ వస్తే వర్సిటీ పురోగతి గాడిన పడుతుందని ఉద్యోగులు, విద్యార్థులు భావిస్తున్నారు.

సగం ధరకే వాహనమంటూ కుచ్చుటోపీ

- తాడిపత్రి పోలీసుల అదుపులో మోసగాళ్లు?
- ఇప్పటి వరకూ 53 ద్విచక్ర వాహనాల స్వాధీనం

పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిలిపిన ద్విచక్ర వాహనాలు

తాడిపత్రి టౌన్: సగం ధరకే అంటూ ప్రజలను మోసం చేసి ద్విచక్ర వాహనాలను అంటగడుతున్న తాడిపత్రికి చెందిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో తాడిపత్రిలోనే వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, ఆటోలు విక్రయించినట్లు గుర్తించి, ఇప్పటి వరకూ 53 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వాహనాల కోసం పోలీసులు వల పన్నారు. కాగా, తాడిపత్రి పట్టణంలోని పెద్దబజార్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రధాన నిందితుడుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అతనితో పాటు మరో ఇద్దరిని దుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే పూర్తిగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకునేంత వరకూ వివరాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఒక్కసారిగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెద్ద ఎత్తున ద్విచక్రవాహనాలు ప్రత్యక్షం కావడంతో పట్టణ వాసుల అవాక్కయ్యారు. కాగా, సగం ధరకే ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన వారిలో ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్ చుట్టూ ఉన్న వ్యాపార సముదాయాల యజమానులు, పోలీసులూ ఉన్నట్లు సమాచారం. తాడిపత్రికి చెందిన కొందరు ధనవంతులు సైతం కార్లు, లారీలు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

రేపు 'అనంత'లో జగన్నాథ యాత్ర

- తరలి రానున్న జాతీయ ఇస్కాన్ సభ్యులు, సినీ ప్రముఖులు
- హైకోర్టు ఆదేశంతో ముందుకు కదలనున్న రథచక్రాలు

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) ఆధ్వర్యంలో అనంత వేదికగా మరోసారి పూరీ జగన్నాథ రథయాత్ర వేడుకలకు సర్వాంగ సుందరంగా సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున జరుగుతున్న కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కళాకారులు, ఇస్కాన్ మందిరాల ప్రతినిధులు అనంతకు చేరుకుంటున్నారు. ఒకప్పుడు ఉత్తరాదికి మాత్రమే పరిమితమైన పూరీ రథయాత్రను 2015లో ఇస్కాన్ మందిరం అనంతలో ఘనంగా నిర్వహించింది. దేశంలోనే అతి పెద్దదైన పూరీ జగన్నాథుడి వేడుకలను దూరాభారం వల్ల చూడలేని వారికి.. వారి ముంగిటనే రథయాత్రను చూసే భాగ్యాన్ని ఇస్కాన్ తీసుకువచ్చింది. ఆ ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటి వరకూ ఆరు సార్లు వైభవంగా రథయాత్ర వేడుకలు జరిగాయి. ఈ నెల 5న సాగే వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

రథయాత్ర సాగుతుందిలా..

తొలుత రెండు రోజుల పాటూ రథయాత్ర ఘనంగా నిర్వహించాలని ఇస్కాన్ ప్రతినిధులు భావించారు. కానీ ఒక్కరోజు యాత్రకు కూడా జిల్లా పోలీసు యంత్రాంగం అనుమతివ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి రథయాత్ర సజావుగా సాగేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో కళాజాత, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేద పఠనం నడుమ జగన్నాథ రథయాత్ర శనివారం ఉదయం లలిత కళా పరిషత్తులో ప్రారంభం కానుంది. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు సాగుతాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక కేఎస్‌ఆర్ కాలేజ్ సమీపంలో మహా అభిషేకంతో రథయాత్ర ప్రారంభమవుతుంది. నగర పాలక సంస్థ కార్యాలయం, సుభాష్ రోడ్, టవర్‌క్లాక్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, పాతూరు మీదుగా బసవన్నకట్ట నుంచి మళ్లీ సప్తగిరి సర్కిల్ మీదుగా లలిత కళాపరిషత్తుకు చేరుకుంటుంది. విశిష్ట అతిథిగా శ్రీమాన్ సత్యగోపీనాథ్ ప్రభు విచ్చేసి ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నారు. సినీనటుడు సుమన్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి రథయాత్రను ప్రారంభిస్తారు. అలాగే కళాజాతను పలువురు ప్రజాప్రతినిధులు ఆరంభిస్తారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచే కాకుండా కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కళాకారులు అనంతకు విచ్చేసి తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. నగర వీధుల్లో శోభాయమానంగా సాగే రథయాత్రలో అనంత వాసులు భాగస్వాములు కావాలని గురువారం ఇస్కాన్ మందిరంలో జరిగిన సమావేశంలో నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

అనంత నగరంలో సాగిపోతున్న జగన్నాథ రథయాత్ర (ఫైల్)

ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

ప్రశాంతి నిలయం: ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలని, సంపూర్ణ ఆరోగ్యంతోనే చక్కగా జీవించవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార పదార్థాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కిలో కంది పప్పు, కిలో రాగిపిండి, కిలో గోధుమపిండి, కిలో శనగపిండి, కిలో వేరుశనగ, నూనె, 30 కోడిగుడ్లు, 250 గ్రాముల చిక్కీ బర్ఫీలు, కిలో శనగలు, 8 రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడి కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,172 మంది టీబీ రోగులకు చికిత్స పొందుతున్నారన్నారు. వారికి జిల్లాలో గల రెండు కంపెనీల సహకారంతో పౌష్టికాహారం ఆరు నెలలకు ఒకసారి చొప్పున అందించనున్నట్లు చెఆప్పరు. పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా మందులు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో దాతలు సింగ్వా కంపెనీ ప్రతినిధులు ఆదిత్య, డీఎస్‌ఓ వంశీకృష్ణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్, డీఎస్‌ఏటీఓ డాక్టర్ ఎస్.ఎ.సునీల్ కుమార్, ఎంఓడీటీసీ డాక్టర్ గాయత్రి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న కలెక్టర్ చేతన్

చేప @ 30 కిలోలు

రాయదుర్గంలోని చేపల మార్కెట్‌లో విక్రయించిన 30 కిలోల బరువున్న చేప

రాయదుర్గం టౌన్: స్థానిక చేపల మార్కెట్‌లో గురువారం 30 కిలోల బరువున్న కట్ల చేపను జాలర్లు విక్రయించారు. ఈ భారీ చేప బెళుగుప్ప మండలం జీడిపల్లి రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు చిక్కింది. అక్కడి నుంచి రాయదుర్గం పట్టణానికి చెందిన మత్స్యకారుడు, చేపల విక్రేత అజీమ్ తీసుకువచ్చి విక్రయానికి పెట్టాడు. ఈ భారీ చేపను చూసేందుకు గురువారం ఉదయం స్థానికులు ఎగబడ్డారు. గమనించిన బళ్లారికి చెందిన ఓ వ్యక్తి రూ.4 వేలు చెల్లించి ఈ చేపను కొనుగోలు చేశాడు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED TEACHERS
పామిడి పట్టణం నందు నర్సరీ నుండి 10వ తరగతి వరకు
తెలుగు, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్ట్స్ ఇంగ్లీష్ మీడియంలో
బోధించుటకు టీచర్స్ మరియు P.E.T. కావలెను.
Interviews on July 4th, 5th, 6th
SRI CHAITANYA SCHOOL, PAMIDI
Cell No: 8790612613, 9573736655

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
GNM అడ్మిషన్స్
■ ఇంటర్మీడియట్ లో Any Group పాస్ స్టూడెంట్స్ కి G.N.M (Nursing), DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్) నందు గవర్నమెంట్ సీట్స్‌కి అడ్మిషన్స్ కలవు. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G. మురళి, 9030661651, అనంతపురం. [A-1665]

REAL ESTATE
TO-LET
■ అనంతపురం లోని రఘువీరా టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నెం : 38 గల షాపు (338 Sq feets) బాడుగకు కలదు. సంప్ర : 93981 98472, 8142938310. [SCA25005888]

SERVICES
శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం
■ మైసూర్‌కు చెందిన జ్యోతిష్యులైన జనార్ధన జోషి గారు మీ రెండు హస్త రేఖలు, జాతకం ఆధారంగా సంపూర్ణ భవిష్యత్తు చెప్పెదరు. ఎటువంటి సమస్యలున్నా శాస్త్రీయంగా శాశ్వతంగా, శీఘ్రముగా పరిష్కారం చూపెదరు. వాట్సాప్/ఫోన్: 9908626148. [SCA 25005361]

జ్యోతిష్యాలయం
■కేరళ మాంత్రిక సాయి స్వరూప జోతిష్యం ప: వి. అయ్యప్పన్ (స్త్రీ.పు) వశీకరణం, సంతాన, ఉద్యోగ, ప్రేమ వివాహం, సతి-పతి కలహం, ప్రేమలో మోసపోవడం ఏలాంటి గుప్త కష్టకర నిఘాడ సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573677754. [SCA25005835]

WANTED
■ బాయ్స్ హాస్టల్ వార్డన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి సెల్ : 9966333236, 9966334236. [A-7126]
■ Tutors (Gents), Bus Incharges, PET'S Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304. [A-4111]
■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర।। 99084 29239 [G-624]
■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 Hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF + ESI కలదు. శాలరీ 1st కి ఇవ్వబడును. ఫోన్ : 7013730900 / 9246543129 [SCA25005819]
■ Xstream Fiber అనంతపురం & గుంతకల్లు పట్టణంలో సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 16500+ఇన్సెంటివ్స్ Q: ఇంటర్ / డిగ్రీ. 2వీలర్ & లైసెన్స్. Ph: 9000029003. [HA-15081]
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838. [B-1275575]
■ ATPలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ANM, GNM, B.Sc వారికి రూం ఫ్రీ, నర్సులు, ఆయాలు, సెక్యూరిటీ గార్డ్స్, రిసెప్షనిస్ట్ కావలెను. Q: 10th to డిగ్రీ, జీతం:10 to 22 వేలు. సంప్రదించండి సెల్: 9121296283. [SCA25005887]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
అద్దెకు
అమ్మకం
రియల్ ఎస్టేట్
ఫర్నీచర్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
కావలెను
4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సచివాలయాల పరిశీలన

కంచిలి: మండలంలోని తలతంపర, మండపల్లి గ్రామ సచివాలయాల పనితీరును తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో సచివాలయాల్లో అందిస్తున్న సేవలు గూర్చి సమీక్షించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ

కాశీబుగ్గ: పలాస మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతం డెర్లి, చినపలియా, లొత్తూరు గ్రామాలకు చెందిన నిరుపేదలకు గురువారం చినబడం క్రిస్టియన్ ప్రెయర్ టెంపుల్ ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. బిసప్ డీఎస్‌వీఎస్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బిజి రాజు, రెవరల్ ఎస్.ఈశ్రాయల్, ఇమాన్యూయల్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి


దేవ లక్ష్మణమూర్తి (ఫైల్)

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దేవ లక్ష్మణమూర్తి (64) గుండెపోటుతో మృతి చెందారు. కాశీబుగ్గ న్యూకాలనీలో ఉన్నటువంటి తన నివాసంలో గురువారం వేకువజామున మరణించారు. మున్సిపాలిటీ ఏర్పడిన అనంతరం కౌన్సిలర్‌గా జంట పట్టణాల అభివృద్ధికి కృషి చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు సంతాపం తెలిపారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

రైలులో తనిఖీలు చేపడుతున్న డాగ్ స్క్వాడ్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో గురువారం కాశీబుగ్గ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మూడు ప్లాట్‌ఫారంలతో పాటు, పలు రైళ్లలో గంజాయి, ఇతర అనుమానిత పదార్థాల కోసం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని బడేకుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ సభ్యులు దాతృత్వం చాటుకున్నారు. మరువాడ పంచాయతీ చొక్కారవానిపేట గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ మూగు రాజు అనారోగ్యంతో బాధపడుతుండడంతో రూ.10 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు షణ్ముఖరావు, నరసాపురం సర్పంచ్ భూషణరెడ్డి, సురాడ జోగారావు, చొక్కర గణపతి, రవి, అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాల రికార్డులు స్వాధీనం

టెక్కలి: స్థానిక రవీంద్ర భారతి పాఠశాల రికార్డులను విద్యాశాఖాధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పాఠశాలకు అనుమతులు లేని కారణంగా ఇటీవల మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్, మండల విద్యాశాఖాధికారి బి.తులసీరెడ్డి తదితరులు రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన వివిధ రకాల రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు.

రైతులతో సమావేశం

మందస: మండలంలోని భైరి సారింగిపురం గ్రామంలో వంశధార సాగునీరు సాధక కమిటీ సభ్యులు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. వంశధార జలాలు మండలం వైపు మళ్లిస్తే రైతుల సాగుకు ఎంతో మేలు జరుగుతుందని, వంశధార కాలువ సాధన కోసం ఉద్ధృత పోరాట చేయాలని ఎంపీటీసీ మట్ట షణ్ముఖరావు పేర్కొన్నారు.

ఎదురుచూపులు..!

- అందని పశుగ్రాసం విత్తనాలు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో సరఫరా

సోంపేట:

మూలపొలంలో సాగు చేసిన పశుగ్రాసం



రైతుల సంక్షేమమే ధ్యేయమని, అన్నివిధాలుగా ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదని అన్నదాత వాపోతున్నాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం వరకు జిల్లాలోని రైతులకు పశుగ్రాసానికి అంతగా ఇబ్బందులు ఉండవు. పశువులు పొలాల మీదకు మేతకు వెళ్తుండడం వలన కొంతవరకు పశుగ్రాసం కొరత తీరుతుంది. అయితే ఖరీఫ్ వరిసాగు ప్రారంభమైతే పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. దీంతో రైతులు పశుగ్రాసం సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. దీనికోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో పశుగ్రాస విత్తనాలు రాయితీపై సరఫరా చేసేవారు. రైతులు తమ భూమిలో సుమారు 10 నుంచి 20 సెంట్లు వరకు సాగుచేసి పశుగ్రాసం కొరత తీర్చుకునేవారు. అయితే ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై చాలారోజులు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయలేదు. దీంతో విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసి బెంకిలిలో సాగు చేసిన పశుగ్రాసం

70 శాతం రాయితీపై సరఫరా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, పశుసంవర్ధక సహాయకులను నియమించింది. వీరి ద్వారా రైతులకు అవసరమైన పశుగ్రాసం విత్తనాలు అందజేసింది. 70 శాతం రాయితీతో రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వరి పంటను ఎక్కువగా యాంత్రీకరణ విధానంలో మిషన్లతో నూర్పులు చేస్తున్నారు. దీంతో ఎండుగడ్డి దొరికే పరిస్థితి లేదు. తక్కువ మంది రైతులు కూలీలతో కోతలు చేసి నూర్పులు చేస్తున్నారు. అలాంటి ఎండుగడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఫలితంగా ట్రాక్టర్ గడ్డి రూ.20 వేల ధర పలికే పరిస్థితి వచ్చింది. దీనిని అధిగమించడానికి రైతులు తమ పంట భూముల్లో వర్షాకాలంలో పశుగ్రాసం పెంచడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో విత్తనాలు చల్లుకుంటే మరలా వరి కోతలు అయ్యేవరకు పశుగ్రాసం వివిధ దఫాలుగా కోతకు వస్తుంది.

విత్తనాలు పంపిణీ

గత ప్రభుత్వ హయంలో ఏక వార్షిక, బహువార్షిక విత్తనాలు సరఫరా చేసేవారు. ఏకవార్షిక విత్తనాలు 60 రోజులకు కోతకు వచ్చి మూడు పర్యాయాలు గడ్డి ఉత్పత్తి చేస్తుంది. బహువార్షిక విత్తనాలు 70 రోజులకు కోతకు వచ్చి ప్రతీ సంవత్సరం ఐదు నుంచి ఆరుసార్లు గడ్డి ఉత్పత్తి చేస్తాయి. ఇవి రైతులకు చాలా ఉపయోగపడతాయి. అందువలన ప్రభుత్వం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాలు సరఫరా చేయాలి

ప్రభుత్వం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయాలి. బయట కొనుగోలు చేయాలంటే అధిక ధరలు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తే పశుగ్రాసం కొరతను అధిగమించవచ్చు. వర్షాకాలంలో అందిస్తే బోర్లు లేకపోయినా రైతులు సాగు చేసుకునే వీలుంటుంది.

– పి.కేతకిరావు, జింకిభద్ర, సోంపేట

ప్రతిపాదనలు పంపించాం

పశుగ్రాస విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపించాం. 15 రోజుల్లో విత్తనాలు సోంపేట చేరుకునే అవకాశం ఉంది. విత్తనాలు చేరుకున్న వెంటనే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీపై పంపిణీ చేస్తాం.

– అప్పలస్వామి, పశుసంవర్ధక శాఖ ఏడీఏ, సోంపేట

పరామర్శ

మోహనరావును పరామర్శిస్తున్న మాజీమంత్రి సీదిరి

పలాస: మండలంలోని కిస్టుపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ జి.మోహనరావు అనారోగ్యంతో శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయనను ఆస్పత్రిలో వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఉంగ సాయికృష్ణ, పైల చిట్టిబాబు, బమ్మిడి దుర్యోధనరావు, మందస ఎంపీటీసీ డొక్కర దానయ్య, బత్తిన హేమేశ్వరరావు, బడగల బల్లయ్య, శిస్టు గోపి, కొర్ల సంతు, కొర్ల మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని కత్తివరం పంచాయతీ పరిధి కత్తివరం కాలనీలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.5.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ సామాజిక భవనాన్ని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పొందూరు మాధవి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుర్గాసి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, లడ్డుకేశవ పాత్రో, కొనపల సురేష్, తలగాన తిరుపతిరావు, మడ్డు వెంకటరావు, పలికల జయరాం, బెందాళం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

టెక్కలి: కోర్టులో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులకు సంబంధించి కక్షిదారులంతా మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకుని, కేసుల నుంచి విముక్తి పొందాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో స్థానిక కోర్టు ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై నుంచి 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డి.వి.వివేకానంద, సంపతిరావు దివాకర్, అంపోలు వైకుంఠరావు, దుంపల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నందిగాం: మండల పరిధిలోని నందిగాం పరిశ్రమల ఫీడర్, లట్టిగాం ఫీడర్‌లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం ఫీడర్ పరిధిలోని తామరాపల్లి, గొల్లూరు, శాసనాం, నర్సిపురం, దిమిలాడ, లఖిదాసుపురం, బూరగాం, లచ్చన్నపేట, మాకవరం, లట్టిగాం ఫీడర్ పరధిలోని లట్టిగాం, హరిదాసుసురం, సుభద్రాపురం, మాదిగాపురం, కామధేనువు, పాలవలస గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ఉద్యోగులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కె.రామారావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య, ఇంజినీరింగ్, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ముందస్తు చర్యలుగా గ్రామాల్లోని కాలువలు, బావుల వద్ద శానిటేషన్ చేయాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కూన విష్ణుమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ మురళీమోహన్, ఈదుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి వెచ్చా సంతోష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇటీవల నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

విశ్రాంత ఆర్మీ జవాన్‌కు సన్మానం

మాట్లాడుతున్న జగదీశ్వరరావు

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను పోతనపల్లి జగదీశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనను గ్రామస్తులు గురువారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. 24 ఏళ్లపాటు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ.. ఇక నుంచి గ్రామానికి సేవ చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బైక్ మెకానిక్ దినోత్సవం

కవిటిలో టూవీలర్స్ మెకానిక్స్ చైతన్య ర్యాలీ

కవిటి: ప్రపంచ టూవీలర్స్ మెకానిక్స్ డే వేడుకల్ని కవిటిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి టూవీలర్ మెకానిక్స్ యూనియన్ సభ్యులు కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు.

ఉద్దానంలో సీబీడీ బృందం పర్యటన

పెద్దశ్రీరాంపురం కొబ్బరి తోటల్లో మొక్కలను పరిశీలిస్తున్న సీడీబీ ప్రతినిధుల బృందం

కంచిలి: ఉద్దానం ప్రాంతం కంచిలి మండల పరిధి పెద్దశ్రీరాంపురం, కత్తివరం గ్రామాల్లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు చేపడుతున్న కొబ్బరి మొక్కలు నాటే ప్రక్రియను బృందం ప్రతినిధులు గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ పథకం కింద ఉద్దానం గ్రామాల్లో 8122 మంది రైతులకు 199.62 హెక్టార్ల విస్తీర్ణంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు. రైతులు తోట మెయింటెనెన్స్ కోసం ఒక హెక్టారుకు రూ.8750లు ఇస్తారు. ఈ ఏడాది 422 మంది రైతులకుగాను రూ.72,80,088లు అందజేశారు. కార్యక్రమంలో కోయంబత్తూర్ నుంచి సీబీడీ డైరెక్టర్లు ఇ.అరవజ్, కొచ్చి నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఆర్.జయనాథ్, ఎస్.కుమారవేల్, గుంటూరు నుంచి ఆర్.రామ్మోహన్ విచ్చేసి ఈ పథకం అమలు తీరుతెన్నులను స్వయంగా రైతుల్ని అడిగి పరిశీలించారు.

క్రీడల్..!

- పాఠశాలల్లో క్రీడా మైదానాలు కరువు
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

నందిగాం:

క్రీడా మైదానం లేని కాపు తెంబూరు బేసిక్ ప్రైమరీ పాఠశాల



విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. రానున్న రోజుల్లో క్రీడారంగంలో తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చి దిద్దుకోడానికి పాఠశాల దశ నుంచే విద్యార్థులు తమకు ఇష్టమైన ఆటలో సాధన చేసి నైపుణ్యం సాధించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మైదానాలు లేకపోవడంతో చిన్నారులు పూర్తిగా ఆటలకు దూరమవుతున్నారు. మండలంలో ప్రస్తుతం 99 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అయితే వీటిలో కాపు తెంబూరు, హర్షబడ, అన్నాపురం, చెరుకుపల్లి, దీనబంధుపురం, దిమ్మడిజోల, గొల్లూరు, రాంపురం, నందిగాం, లఖిదాసుపురం, దిమిలాడ తదితర 40 పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. దీంతో ఆయా పాఠశాలల్లో చదువుతున్న 4,301 మంది విద్యార్థుల్లో సగం మంది ఆటలకు దూరమవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రార్థనలు కూడా తరగతి గదుల్లోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు ఆటల పోటీలను సైతం గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో నిర్వహించాల్సి వస్తోంది. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో పాఠశాలలకు మైదానాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రికెట్ ఆడాలని ఉంది



పాఠశాలలో సాయంత్రం స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకోవాలని ఉంది. కానీ మా పాఠశాలకు గ్రౌండ్ లేదు. బయటకు వెళ్లి ఆడుకోలేకపోతున్నాము. అదే మైదానం ఉంటే అందరం చక్కగా ఆడుకునేవాళ్లం.

– పోలాకి జశ్వంత్, 5వ తరగతి, కాపు తెంబూరు

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండలంలోని కొన్ని స్కూళ్లకు మైదానాలు లేవు. దీంతో విద్యార్థులు ఆటలు ఆడుకునే స్వేచ్ఛ లేకుండా పోతోంది. ఇది చాలా బాధాకరమైన విషయం. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలాలను మైదానాలుగా కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– జి.నర్సింహులు, మండల విద్యాశాఖాధికారి–1, నందిగాం

ఆడుకోలేకపోతున్నాం

విరామ సమయంలో, సాయంత్రం ఆటలు ఆడాలని ఉంటుంది. కానీ అందుకు తగిన మైదానం లేకపోవడంతో ఆడుకోలేకపోతున్నాము. టీవీల్లో క్రికెట్, కబడ్డీ, రన్నింగ్ వంటివి వచ్చేటప్పుడు మాకు గ్రౌండ్ ఉంటే ఆడుకునేవాళ్లం కదా అనిపిస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవానికి వేరే చోటుకి తీసుకెళ్లి ఆటలు ఆడిపిస్తుంటారు.

– జీరు హర్షవర్ధన్, 4వ తరగతి, గొల్లూరు

రోడ్డుపైనే పశువులు

టెక్కలి పంచాయతీ అధికారులు రోడ్లపై తిరుగుతున్న పశువులను కట్టడి చేసేందుకు ఎంత ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఫలితం శూన్యంగానే ఉంటోంది. రోడ్లపై సంచరించే ఆవులను సమీప గోశాలకు తరలిస్తున్నా పెంపకందారుల్లో ఎటువంటి చలనం రావడం లేదు. ఎప్పటిలాగే ఆవులు రోడ్లపై తిరుగుతూ పలువురిపై దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా ఆవుల వలన నిత్యం ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – టెక్కలి రూరల్



అంధకారం

టెక్కలి మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగక రాత్రుళ్లు అంధకారం అలుముకుంటోంది. స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయం వెనుక వీధి మొత్తం వీధి దీపాలు వెలగక నెల తరబడి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవల గోపాల్ కోరారు. – టెక్కలి

నిత్యావసర సరుకులు పంపిణీ

ఇచ్ఛాపురం పట్టణంలో క్రైస్తవులంతా కలిసి క్రైస్తవ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 50 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో యూవీ జాన్సాన్, డి.ఎలియా, భీమో బెహరా, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం టౌన్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి 7093164422
పలాస/ఇచ్ఛాపురం 9010178979
Office mail : sklmadvt@gmail.com

సాక్షి తిరుపతి

శుక్రవారం । 4 । జూలై । 2025

మెటీరియల్ సైన్స్ అనుసంధానంతో..

మెటీరియల్ సైన్స్ అనుసంధానంతో నిర్మాణ రంగంలో సుస్థిర మార్పు చోటు చేసుకుంటుందని ఐఐటీ డెరెక్టర్ అన్నారు. - 8లో

సమ్మెకు తాత్కాలిక బ్రేక్

సమ్మెబాట పట్టిన స్విమ్స్ కార్మికుల దెబ్బకు అధికారులు దిగొచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. - 8లో

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

వైఎస్సార్‌సీపీ నరసింగాపురం పంచాయతీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌పై టీడీపీ కార్యకర్త కర్రలతో దాడిచేశాడు. - 8లో

న్యూస్‌రీల్

తపాలా బీమా ఏజెంట్ల ఉద్యోగాలకు అవకాశం

తిరుపతి సిటీ : తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సంస్థలో ఏజెంట్లుగా పనిచేసేందుకు ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తిరుపతి డివిజన్ తపాలా సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలియజేశారు. ఎంపికైన ఏజెంట్లకు ఆకర్షణీయమైన ఆర్థిక భరోసాతో పాటు ఇన్సెంటీవ్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయంలోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫీసులో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌ను 93907 36277 నంబర్ నందు సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల గడువును జులై నెలాఖరు వరకు పొడిగిస్తూ రాష్ట్ర ఇంటర్ బోర్డు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆర్‌ఐఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,323 మంది, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 364 మంది ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ ఇది వరకు జూన్ 30వ తేదీ వరకున్న అడ్మిషన్ల గడువును పొడిగించారని, ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఐఓ కోరారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా చర్యలు

బాలాజీ నగర్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీలు చేపట్టారు. గురువారం సాయంత్రం తిరుమల పోలీసు సిబ్బందితో కలిసి ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ లేపాక్షి ఏరియా బాలాజీనగర్, కల్యాణకట్ట, అఖిలాండం, పీఏస్–1, సీఆర్వో కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్లో బాంబ్ స్క్వాడ్‌తో ప్రత్యేకంగా తనిఖీలు జరిపారు. కార్యక్రమంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ డీఎస్పీ విజయ్ శేఖర్, సీఐలు విజయ్ కుమార్, శ్రీరాముడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులు రోడ్డున పడ్డారు. గిట్టుబాటు ధర కల్పించకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. చేతికొచ్చిన పంట నోటికందకుండా రోడ్డుపాలు చేస్తున్నారు. ఇల్లూవాకిలి వదిలి పంటనెత్తుకుని జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద.. ర్యాంప్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇన్ని అవస్థలు పడుతున్నా సీఎం చంద్రబాబుకు కనిపించడం లేదు. గిట్టుబాటు ధర కల్పించి మామిడి రైతును ఆదుకోవాల్సింది పోయి వేధింపులకు దిగుతున్నారు. చెట్లు నరికివేస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుకుంటున్నారు. మామిడి రైతుకు అండగా నిలిచేందుకు నేనున్నానంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకొస్తున్నారు. ఈనెల 9న బంగారుపాళ్యానికి విచ్చేయనున్నారు. ఆయన పర్యటనను కలసి కట్టుగా విజయవంతం చేయాలి' అని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతిలో జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

నష్టాల్లో మామిడి రైతు

- మద్దతు ధర లేక రోడ్డు పాలుచేస్తున్న అన్నదాతలు
- వారికి అండగా నిలిచేందుకు ముందుకొస్తున్న మాజీ సీఎం వైఎస్.జగన్
- 9న బంగారుపాళ్యానికి రాక
- కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- పార్టీ శ్రేణులకు పెద్దిరెడ్డి, భూమన పిలుపు

మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటన సందర్భంగా హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మామిడి.. కుధరలేదా?

తిరుపతి మంగళం: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి మారుతీ నగర్‌లోని పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా లెక్కచేయకుండా ఈ నెల 9వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

మారానని చెప్పి .. ధర పెంచకుండా మారాం చేస్తున్నారు!

ఆర్‌కే.రోజా మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పొగాకు, మిర్చి, మామిడి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రాకముందు తాను మారానని చెప్పి అధికారంలోకి వచ్చాక కుక్కతోకర వంకర లాగా బుద్ధి చూపుతారన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో మామిడి రైతులకు అండగా ఉండేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్నప్పుడే చంద్రబాబుకు రైతుల కష్టాలు గుర్తొస్తాయా? అని ప్రశ్నించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఏడాదిలో ఏదో పొడిచేసినట్లు కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈవీఎం మాయాజాలంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిందే తప్ప ప్రజల మద్దతుతో కాదన్నారు. ఈనెల 9వ తేదీన కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు పెట్టినా జగనన్న పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కే.రోజా, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూధన్‌రెడ్డి, వెంకటేగౌడ్, సునీల్ కుమార్, లలితకుమారి, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, నూకతోట రాజేష్, కృపాలక్ష్మి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కష్టాల్లో మామిడి రైతులు

మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు సొంత జిల్లాలో మామిడిని పండించే రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డు పక్కన పారబోస్తున్నారని చెప్పారు. ఇలాంటి కష్టాలు ఎల్లో మీడియాకు కనిపించవా? అని ప్రశ్నించారు. జగనన్న పాలనలోనే రైతు సంక్షేమమని గుర్తుచేశారు.

ఏ ప్రాంతానికెళ్లినా జన సునామీనే

భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జగన్‌మోహన్ రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్లినా అనూహ్యమైన జన స్పందన వస్తోందన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. మామిడి రైతులకు అండగా నిలిచేందుకు జగనన్న వెంట ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఘనంగా ఐసీఎస్ఐ స్నాతకోత్సవం

తిరుపతి సిటీ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) స్నాతకోత్సం పద్మావతి మహిళా వర్సిటీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థలో కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పట్టాలను అతిథులు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కంపెనీ కార్యదర్శులుగా బహుముఖ పాత్రలు పోషించి దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఆర్థిక స్థితిని మదింపు చేసే కీలక బాధ్యతలు చేపట్టే ప్రధానమైన కోర్సును పూర్తి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ఉపాధ్యక్షులు పవన్ జి చందక్, కౌన్సిల్ సభ్యుడు సీఎస్ మోహన్ కుమార్, సీఎస్ వెంకటరమణ, ఐసీఎస్ఐ ఎస్ఐఆర్‌సి చైర్మన్ సీఎస్ మధుసూధనన్, ప్రీతి కౌశిక్ బెనర్జీ పాల్గొన్నారు.

అభ్యర్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న వీసీ, సంస్థ ప్రతినిధులు

ఐఐహెచ్‌టీ స్పాట్ అడ్మిషన్లు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమో కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఓఎస్‌డీ గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. పదో తరగతిలో మార్కుల ప్రాతిపదికన సీట్లు కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 98661 69908, 90102 43054 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బీఎస్‌ఎన్‌ఎల్ అవగాహన సదస్సు రేపు

తిరుపతి సిటీ: తిరుపతి బిజినెస్ ఏరియా, భారత్ టెలికాం నియంత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు తమ ప్రధాన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్ వెంకోబరావు ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ హైజన్, సైబర్ మోసాల నివారణ అనే అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించడమే శిబిరం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పలు అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. వినియోగదారుల సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

వినండహో.. ఇది గ్రామస్తుల హెచ్చరిక

– ఇసుక ట్రాక్టర్ వస్తే..రూ.1000 జరిమానా

పాతకాల్వ శివారులో ట్యాంకుకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తిరుపతి రూరల్ : ఆ దారిలో ఇసుక ట్రాక్టర్లకు అనుమతి లేదు.. అలా కాదని వస్తే.. రూ.1000 జరిమానా విధించబడును.. అంటూ గ్రామ పంచాయతీ తరపున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.. బోర్డు పెట్టడమే కాదు.. ఆ గ్రామస్తులు ఇసుక ట్రాక్టర్లు వస్తే అందరూ ఏకమై అడ్డుకుంటున్నారు. తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ పంచాయతీలో ఇరుకు రోడ్లు ఉన్నప్పటికీ ఆ దారిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిస్తున్నారు. ఇళ్ల నుంచి పిల్లలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలన్నా ఇబ్బంది పడేవారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులతో కలసి తమ గ్రామంలోకి ఇసుక ట్రాక్టర్ వస్తే రూ.1000 లు జరిమానా విధించాలని నిర్ణయించారు. ఆ మేరకు గ్రామంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా సరే రాత్రివేళ ఆ దారిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అక్రమార్కులను గ్రామస్తులు అడ్డుకోవడంతో వివాదం చోటు చేసుకున్నట్టు సమాచారం. అయితే ఇసుక ట్రాక్టర్లు వస్తే రూ.1000 కచ్చితంగా వసూలు చేస్తుండటంతో చాలా మంది ఇసుక అక్రమార్కులు ఆ గ్రామం మీదుగా ట్రాక్టర్లు తీసుకురావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రభుత్వ వసతి గృహ నిర్వాహకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాసిరకమైన వంటలు, అపరిశుభ్రమైన పరిసరాలు, పర్యవేక్షణ లేని అధికారుల తీరుతో వసతి గృహాల నిర్వహణ గాడితప్పింది. ప్రశ్నించే వారు లేరనే నిర్లక్ష్యంతో కొంత మంది నిర్వాహకులు కాసులకు కక్కుర్తిపడి విద్యార్థులను అర్ధాకలికి గురిచేస్తూ క్షోభ పెడుతున్నారు. వండిపెట్టే ఆహారం కూడా తరచూ కలుషితం కావడంతో విద్యార్థులు ఆస్పతుల పాలవుతున్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపంలా మారింది.

రేణిగుంట బీసీ హాస్టల్‌లో శిథిలావస్థలో విద్యార్థుల మరుగుదొడ్లు (ఇన్‌సెట్) దెబ్బతిన్న బాత్‌రూమ్ తలుపులు

పేద విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపం

- సంక్షేమ వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజనింగ్
- నాసిరకం వంటకాలే కారణమా?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

అనారోగ్య వసతి

ఏర్పేడు : ''ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న పేద విద్యార్థుల ఆరోగ్యం గాల్లో దీపంగా మారింది. విద్యార్థులు తినే ఆహారంలో నాసిరకమైన వంట సరుకులు వాడుతుండటంతో పాటు అపరిశుభ్రమైన పరిసరాలతో తరచూ విద్యార్థులు విషాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సంక్షేమ వసతి గృహాధికారులు పేద పిల్లలపై సవతి తల్లి ప్రేమ చూపుతూ వారికి ప్రభుత్వం ఇచ్చే నిధులను దిగమింగుతున్నారన్న విమర్శలకు ఈ ఘటనలు బలం చేకూరుస్తున్నాయి.''

పర్యవేక్షణ లోపించి..

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లలో విద్యార్థుల బాగోగులు చూసుకునే వార్డెన్ల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. హాస్టల్ , వంట గది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయకుండా కొందరు వార్డెన్లు కక్కుర్తి చూపుతూ విద్యార్థులను అర్ధాకలికి గురిచేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఏడాది కిందట రేణిగుంట బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రైవేటు ఫంక్షన్‌లో మిగిలిపోయిన అన్నం తీసుకొచ్చి పెట్టడంతో వాంతులు, విరేచనాలతో అప్పట్లో 20 మంది ఆస్పత్రికి చేరారు. తాగే నీటి తొట్లు పాచిపట్టి ఉన్నట్లు గుర్తించి అప్పట్లో ఉన్నతాధికారులు వార్డెన్ నిర్లక్ష్యంపై తీవ్రంగా మందలించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు మినహా మిగిలిన సమయాల్లో ఉన్నతాధికారులు తనిఖీలు చేయకపోవడం గమనార్హం.

శ్రీకాళహస్తిలో ఆస్పత్రిపాలైన హాస్టల్ విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి పట్టణంలో గతనెల 24వ తేదీన బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పులిసిన ఇడ్లీ పెట్టడంతో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. తాజాగా గురువారం శ్రీకాళహస్తి బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఉదయం పెట్టిన ఉప్మాలో జెర్రి ప్రత్యక్షం కావడంతో ముగ్గురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో 8 హాస్టళ్లు ఉన్నాయి. రెండు గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఇందులో సుమారు 2 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలు హాస్టళ్లకు వెళ్లి దత్తత తీసుకుని బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎప్పుడూ జరగని అభివృద్ధి చేస్తామని, హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు అధునాతన హంగులతో కూడిన వసతులను అందించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షణ ఉంటుందని డబ్బాలు కొట్టుకున్నారు. అయితే ఒకటి, రెండు హాస్టళ్ల గోడలకు సున్నం కొట్టించి అభివృద్ధి ప్రారంభమైందని సోషల్ మీడియాలో ఆర్భాటంగా ప్రచారం చేశారు.

వార్డెన్ సస్పెన్షన్

– ఇన్‌చార్జిగా విజయ

శ్రీకాళహస్తి : బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీలక్ష్మిని సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా విజయను నియమించారు. వంట మనిషి అంకమ్మను విధులు నుంచి తొలగిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు.

వసతిగృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జగనన్న పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి కరికులం అందించి వారి ఉన్నతికి బాటలు వేసేలా విప్లవాత్మకమైన పథకాలను విద్యా రంగంలో అమలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తోంది. హాస్టళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకమైన భోజనం అందిస్తున్నారు. సరుకులు నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారు. దీంతోనే మొన్న సాక్షాత్తూ రాష్ట్ర హోం మంత్రి అనిత బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో పాటు తినేందుకు కూర్చుంటే ఆమెకు పెట్టిన ఆహారంలోనే బొద్దింక కనిపించడం రాష్ట్రమంతా చూశారు. ఇక్కడ వరుసగా హాస్టళ్లలో విద్యార్థులు విషాహారం తిని ఆస్పత్రులపాలవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దాలి.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

హాస్టళ్లలో సిబ్బంది నిర్లక్ష్యమే

హాస్టళ్లలో తరచూ విద్యార్థులు విషాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతుండడం దురదృష్టకరం. చాలా హాస్టళ్లలో వంట సిబ్బంది కొరత ఉంది. ఉన్నచోట వారు రాకుండా సహాయకులను పెట్టుకుని జీతాలు తీసుకుంటున్నారు. దీంతోనే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదు. శ్రీకాళహస్తిలో హాస్టళ్లలో జరుగుతున్న వరుస ఘటనలపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి పెట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు సరైన మౌలిక వసతులను కల్పించాలి.

– చంద్రశేఖర్, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్, శ్రీకాళహస్తి

తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,00,230
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,073
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,10,200
రిటైల్ వెండి గ్రాము	రూ.113.20

క్లుప్తంగా

సమ్మెకు తాత్కాలిక బ్రేక్

- రిలే దీక్షలు కొనసాగించనున్న స్విమ్స్ కార్మికులు

తిరుపతి తుడా : విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టిన స్విమ్స్ కార్మికుల దెబ్బకు అధికారులు దిగొచ్చారు. కార్మికులు సమ్మె చేస్తున్న ప్రాంతానికి గురువారం స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఏఎస్పీ మనోహరాచారి, ఆర్డీఓ రామ్మోహన్ చేరుకుని కార్మికుల డిమాండ్లు న్యాయ పరమైనవేనని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరవధిక సమ్మెను కార్మికులు తాత్కాలికంగా విరమించుకుని రిలే నిరాహార దీక్షను కొనసాగించనున్నట్లు ప్రకటించారు.

అత్తపై అల్లుడు దాడి

- అత్తకు తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్ : అల్లుడు మరో మహిళతో వివాహేతర సంబంధం గురించి అత్త ప్రశ్నించిదనే కోపంతో అత్తపై అల్లుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేట అరుందతీ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. అగ్రహారపేటకు చెందిన మహేశ్వరి, ఆమె కుమార్తె మునికుమారిని తాళ్లురు రవీంద్రనాథ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే రవీంద్రనాథ్ మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలుసుకుని అల్లుడిని అత్త నిలదీసింది. దీంతో అత్తపై కోపంతో బుధవారం రాత్రి అగ్రహారపేటలో అత్త మహేశ్వరి ఇంటి వద్దకు వచ్చి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమెను తిరుపతి వైద్యశాలకు తరలించారు. బాధితురాలి భర్త మునీంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబి తెలిపారు.

ఆటో బోల్తా..: వృద్ధుడి మృతి


మృతి చెందిన చెంచయ్య

గూడూరు రూరల్ : ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని విందూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు విందూరు ఎస్టీ కాలనీకి చెందిన చిల్లకూరు చెంచయ్య(69) సైదాపురం మండలం జోగిపల్లిలో పీర్ల ఉత్సవానికి మేళం వాయించేందుకు మరో నలుగురితో కలసి ఆటోలో బయలుదేరాడు. గ్రామ సమీపంలోని చర్చి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చెంచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గూడూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు చెప్పారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అందని పాఠ్య పుస్తకాలు

- టీటీడీ పాఠశాలల్లోనూ విద్యార్థుల అవస్థలు
- పుస్తకాలు లేక నామమాత్రంగా విద్యా బోధన

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని టీటీడీ పాఠశాలలు జూన్ 12వ తేదీన పునఃప్రారంభమయ్యాయి. అయితే ఎయిడెడ్ మినహాయించి అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు నేటి వరకు పాఠ్యపుస్తకాలను అందించలేదు. దీంతో విద్యార్థులకు నామమాత్రంగా విద్యాబోధన అందుతోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ టీటీడీ విద్యాశాఖ స్పందించకపోవడం గమనార్హం. ప్రతిష్టాత్మకమైన టీటీడీ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించడం అంటే సాక్షాత్తు కలియుగ దైవమైన శ్రీవారి సన్నిధిలో ఉన్నట్టుగా భావిస్తుంటారు. టీటీడీ విద్యాసంస్థల్లో చదువుకోవడం పూర్వజన్మ సుకృతమని సంతోష పడుతుంటారు. ఈ భావనతోనే తమ పిల్లలను టీటీడీ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపుతుంటారు. దీంతో టీటీడీ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ నెలకొంది.

తిరుపతిలో టీటీడీకి సంబంధించి 7 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2,600 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో మూడు పాఠశాలలు (హైస్కూల్) మాత్రమే ప్రభుత్వ గుర్తింపు (ఎయిడెడ్) కలిగి ఉన్నాయి. ఈ హైస్కూళ్లకు ప్రభుత్వం అందించే స్టూడెంట్ కిట్లు అందాయి. మిగిలిన నాలుగు ఉన్నత పాఠశాలలు, వాటిలోనే ఉన్న 7ప్రాథమిక పాఠశాలలకు పుస్తకాలు నేటికీ అందలేదు. దీంతో ఇక్కడ చదివే విద్యార్థులు పాఠ్యపుస్తకాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వం టీటీడీ పాఠశాలలన్నింటికీ పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎయిడెడ్‌కు మాత్రమే పాఠ్యపుస్తకాలు అందించి చేతులు దులుపుకుంది. ఇటు కూటమి ప్రభుత్వం, అటు టీటీడీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం ఏమిటో అర్థం కాలేదని తల్లిదండ్రులు అయోమయ స్థితిని ఎదుర్కొంటున్నారు. వెంటనే టీటీడీ యాజమాన్యం స్పందించి పాఠ్యపుస్తకాలను అందించాలని కోరుతున్నారు.

ఎయిడెడ్‌కు అందించాం

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన టీటీడీ ఉన్నత పాఠశాలలకు పాఠశాల తెరిచే నాటికే పాఠ్యపుస్తకాలను అందించాం. అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు టీటీడీ యాజమాన్యమే పాఠ్యపుస్తకాలను అందించాల్సి ఉంది.

–కేవీఎస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ), తిరుపతి

త్వరలోనే అందిస్తాం

టీటీడీ పాఠశాలలకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తుందని అనుకున్నాం. అయితే పాఠ్య పుస్తకాలను టీటీడీ కొనుగోలు చేసి పిల్లలకు అందించాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ కారణంతోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించడంలో జాప్యం నెలకొంది. త్వరలోనే పాఠ్యపుస్తకాలను అందిస్తాం.

–వెంకట సునీల్, టీటీడీ విద్యాశాఖాధికారి, తిరుపతి

వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడిపై దాడి

తీవ్రంగా గాయపడిన ప్రవీణ్ కుమార్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్ కుమార్

- కర్రలతో విచక్షణారహితంగా దాడిచేసిన టీడీపీ కార్యకర్త
- చంద్రగిరిలో క్షీణిస్తున్న శాంతి భద్రతలు

చంద్రగిరి: వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని మూడు రోజులుగా చంద్రగిరి మండలంలో టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారు. మహిళా సర్పంచ్ కుటుంబంపైన, ఆతర్వాత దళిత మహిళపై దాడి ఘటనలు మరువక ముందే దళిత నాయకుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడిపై టీడీపీ కార్యకర్త కర్రలతో దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండల పరిధిలోని నరసింగాపురానికి వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన భార్య ఎంపీటీసీ సభ్యురాలు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రవీణ్‌కుమార్‌పై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. గురువారం రాత్రి గ్రామంలో జాతర నిర్వహణపై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ప్రవీణ్, గ్రామంలోని వెంకటరమణకు ఫోన్‌చేసి జాతర వివరాలను అడిగారు. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్త అమ్మగుంట శీను, వెంకటరమణ వద్ద నుంచి ఫోన్ లాక్కుని ప్రవీణ్‌ను నానా దుర్భాషలాడాడు. ‘‘నువ్వు ఇక్కడు రారా.. ఇప్పుడున్నది మా ప్రభుత్వం. నిన్ను ఇక్కడ చంపకపోతే చూడు రా.. నా...’’ అంటూ దుర్భాషలాడాడు. కాసేపటికి ప్రవీణ్ గ్రామ పెద్దల వద్దకు వెళ్లాడు. వెంటనే అక్కడే ఉన్న కర్రలతో అమ్మగుంట శీను ఒక్కసారిగా ప్రవీణ్‌పై దాడికి తెగబడ్డాడు. దీంతో ప్రవీణ్ తల పగిలి, తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానికులు శీనును నిలువరించి, ప్రవీణ్‌ను హుటాహుటిన చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలో ఉన్నాననే నాపై దాడి

వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేస్తుడడంతోనే తనపై టీడీపీ కార్యకర్త దాడికి తెగబడ్డాడని బాధితుడు ప్రవీణ్ వాపోయారు. టీడీపీ నేతలు తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ కూటమి ప్రభుత్వంలో నాయకులకే రక్షణ కరువైతే సామాన్య ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పిస్తారో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మెటీరియల్ సైన్స్ అనుసంధానంతో మార్పు

సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు

- తిరుపతి ఐఐటీలో ప్రారంభమైన 3వ అంతర్జాతీయ సమావేశం

ఏర్పేడు : మెటీరియల్ సైన్స్ అను సంధానంతో నిర్మాణ రంగంలో సుస్థిర మార్పు చోటు చేసుకుంటుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలోని లెక్చరర్ హాల్‌లో గురువారం ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణ సామగ్రి– నిర్మాణ రంగం–2025పై 3వ అంతర్జాతీయ సమావేశం ప్రారంభమైంది. దేశ, విదేశాల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని నిర్మాణ రంగంలో సాంకేతిక మేళ వింపుపై ప్రసంగించారు. వర్జీనియా టెక్ (యుఎస్ఎ), క్వీన్స్ యూనివర్సిటీ బెల్ఫాస్ట్ (యుకె), మోనాష్ యూనివర్సిటీ మలేషియా, ఐఐటీ బాంబే, ఎన్ఐటీ కాలికట్ వంటి ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. జాతీయ మౌలిక సదుపాయాల సవాళ్లను పరిష్కరించడంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం కీలక పాత్రను పోషిస్తోందన్నారు. డాక్టర్ బిజిలీ బాలకృష్ణన్, డాక్టర్ అలెగ్జాండర్ బ్రాండ్, డాక్టర్ నారాయణన్ నీతలత్, డాక్టర్ వెంకటేష్ కోడూర్, డాక్టర్ మైక్ షైచ్, డాక్టర్ కె.వి.ఎల్. సుబ్రమణ్యం వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన నిపుణుల ప్రసంగిస్తూ నిర్మాణ శాస్త్రం పురోగతిని గురించి వివరించారు. సమావేశంలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సురేష్‌జైన్, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

– భర్త, కుటుంబ సభ్యులే చంపారంటూ ఆందోళన

రోడ్డుపై ఆందోళ న చేస్తున్న శిల్ప కుటుంబ సభ్యులు

తడ : మండలంలోని అక్కంపేటలో గురువారం చిత్తూరు జిల్లా కుప్పానికి చెందిన వివాహిత శిల్ప(26) అనుమానాస్పదంగా ఉరివేసుకున్న స్థితిలో చనిపోయింది. తమ బిడ్డ మృతికి భర్త, అతని కుటుంబ సభ్యులే చంపి ఉరి వేసినట్టు చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. తొలుత అక్కంపేట గ్రామం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చెయ్యడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం తడ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని శిల్ప ఫొటోలతో ఆందోళన చేశారు. ఎస్ఐ కొండపనాయుడు ఆందోళన చేస్తున్న వారిని సర్దుబాటు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

కాలం చెల్లిన ఔషధాల పంపిణీపై ఫిర్యాదు

సత్యవేడు : సత్యవేడుకు చెందిన శోభారాణి బుధవారం రాత్రి ఓ క్లినిక్‌కు వెళ్లగా కాలం చెల్లిన మాత్రలు అంటగట్టారని డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. సత్యవేడులోని ఓ క్లినిక్‌కు వెళ్లి మెడికల్ షాపులో ఐదు రకాల మాత్రలు ఇచ్చారని, అందులో రెండు మాత్రలు కాలం చెల్లినవి ఉన్నాయన్నారు. దీనిపై శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

- సుపరిపాలన కార్యక్రమంలో ప్రమాదం

మునీశ్వర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తెలు

నాయుడుపేట టౌన్ : కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి షామియాన వేస్తున్న వ్యక్తి కందుకూరి మునీశ్వర్(45) విద్యుదాఘాతానికి గురై గురువారం మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నాయుడుపేట పట్టణంలోని మహాలక్ష్మమ్మ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. తుమ్మూరుకు చెందిన మునీశ్వరయ్య అక్కడ హైరర్స్‌కు చెందిన యజమానికి స్నేహితుడు కావడంతో మహాలక్ష్మమ్మ నగర్‌లో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికి షామియానా వేసేందుకు కార్మికులతో కలిసి వెళ్లాడు. లేదోటమ్మ ఆలయ సమీపంలో ఎమ్మెల్యే నిర్వహించే కార్యక్రమానికి షామియానా వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అప్పటికీ స్థానికులు అతడిని ప్రైవేట్ అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మునీశ్వరయ్య మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని మహాలక్ష్మమ్మ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మమ్మ కాలనీలో విద్యుత్ వైర్లు ఇళ్లపైనే వేళాడుతూ.. చేతికందే ఎత్తులో ఉన్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

పేద కుటుంబానికి చెందిన మునీశ్వర్‌కు భార్య లలిత, రోహిణి, బిందు అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మునీశ్వర్ ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో వారి బోరున విలపించారు. సంఘటన స్థలంతో పాటు వైద్యశాల వద్ద లే.. డాడి అంటూ కుమార్తెలు రోదించిన తీరును చూసి చలించిపోయారు.

అన్ని విధాలుగా ఆదుకుంటాం

ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మునీశ్వర్ మృతి చెందడం బాధాకరమని, ఆ కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందని అంత్యక్రియల కోసం రూ 50 వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు. అదే విధంగా మృతుడి ఇద్దరు కుమార్తెలకు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్ తదితరులు ఉన్నారు.

కూటమి ఉప సర్పంచ్‌కి హైకోర్టు షాక్

- చెక్ పవర్ రద్దు చేసి సర్పంచ్‌కి ఇవ్వాలంటూ ఆదేశాలు

చంద్రగిరి : కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో రామిరెడ్డిపల్లి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వెంకట రమణకు హైకోర్టు షాక్ ఇచ్చింది. కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారులు నిబంధనలకు తుంగలోకి తొక్కి ఉప సర్పంచ్‌కు చెక్కు పవర్‌ను ఇచ్చారు. దీనిపై రామిరెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశాడు. పరిశీలించిన హైకోర్టు ఉప సర్పంచ్‌కు చెక్ పవర్‌ను రద్దు చేయాలని, సర్పంచ్‌కు ఉన్న అధికారాలను యథావిధిగా కొనసాగించాలని తీర్పును వెలువరించింది. దీంతో గురువారం డీపీఓ సుశీలా దేవి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలంటూ చంద్రగిరి ఎంపీడీఓకు ఆదేశాలను జారీ చేశారు. దీనిపై సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్యాయంగా తన చెక్ పవర్‌ను రద్దు చేసిందని, కోర్టు ద్వారా తనకు న్యాయం జరిగిందని తెలిపారు.

బాలిక మృతితో అప్రమత్తం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్

చంద్రగిరి : ఇందిరమ్మ కాలనీ సమీపంలోని బాలిక (16) విష జ్వరంతో బుధవారం మృతి చెందడంపై గురువారం వైద్యాధికారులు స్పందించారు. ఇందిరమ్మ కాలనీలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ ఫీవర్ సర్వేను చేపట్టారు. అదే విధంగా ప్రతి ఇంటి వద్ద యాంటి లార్వా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతానికి ఇందిరమ్మ కాలనీలో ఎవరికి ఎలాంటి జ్వరాలు లేవని వైద్యాధికారులు నిర్ధారించారన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని కాచి, చలార్చి తాగాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, దోమ తెరలను వినియోగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, వేడి ఆహారం, మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి యా, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

అపస్మారక స్థితిలో ఉన్న కేశవులు

ఏర్పేడు : మండలంలోని గుండ్లకండ్రిగ ఎస్టీ కాలనీలో గురువారం ఓ వ్యక్తిపై మరొకరు కత్తితో నరికి తీవ్రంగా గాయపరిచాడు. క్షతగాత్రుడు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గుండ్లకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన సీతారాముడు మద్యం తాగి వీధిలో వెళుతూ, పక్కన కూర్చుని ఉన్న కేశవులు(45)ను మద్యం మత్తులో కత్తితో తలపై నరికాడు. తలపై బలమైన రక్తగాయం కావడంతో కేశవులు అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. పాత కక్షలేవైనా.. ఉన్నాయా.. మద్యం మత్తులో నరికాడా.. అనేది తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ఈఏపీసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియకు సాంకేతిక విద్యాశాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. దీంతో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశాల కోసం సుదీర్ఘకాలం వేచి చూసిన విద్యార్థులకు కాస్త ఊరట లభించింది. విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపునకు అవకాశం ఇస్తూ 18 వరకు వెబ్ ఆప్షన్లకు ఎంట్రీకి అవకాశం కల్పించనున్నారు. 22న సీట్ల కేటాయింపు జాబితాను విడుదల చేయనున్నారు. 23 నుంచి 26వ తేదీ వరకు సీట్లు కేటాయించిన కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగష్టు 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. మే 21 నుంచి 27 వరకు ఈఏపీసెట్ (ఎంసెట్) పరీక్షలు నిర్వహించగా జూన్ 8న ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలు విడుదలై సుమారు నెల రోజుల తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడుతుండటం గమనార్హం. ఇప్పటికే జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు అడ్మిషన్లు పొందిన విషయం తెలిసిందే.

ఏటీఎం కార్డు దొంగ అరెస్ట్

ఏటీఎం కార్డులు, పట్టుబడిన వ్యక్తితో సీఐ మంజునాథరెడ్డి

రేణిగుంట : ఏటీఎం సెంటర్ల వద్ద కార్డులు దొంగిలించి డబ్బులను విత్ డ్రా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ మంజునాథరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసులురెడ్డి జిల్లాలో పలు ఏటీఎంల వద్ద కార్డులను దొంగలించి, వారికి తెలియకుండా డబ్బులు విత్ డ్రా చేసేవాడని తెలిపారు. మే నెల 16వ తేదీ శెట్టిపల్లి ఎస్‌బీఐ వద్ద ఇదే తరహాలో దొంగతనం చేశాడని అన్నారు. ఎల్లమండ్యం ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా అతడు చేసిన నేరాలను ఒప్పుకున్నాడని తెలిపారు. అతడి వద్ద వివిధ రకాల ఏటీఎం కార్డులు ఒక స్వైపింగ్ మిషన్, మొబైల్ ఫోన్, రూ.6000 డబ్బులు స్వాధీనం చేసుకున్నామన్నారు. రిమాండ్ నిమిత్తం తిరుపతి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. సిబ్బంది మహేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ఏనుగుల గుంపు కలకలం

అటవీ ప్రాంతంలో నుంచి తిరుమల ఘాట్ రోడ్డులోకి వస్తున్న ఏనుగుల గుంపు

తిరుమల : తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డులోని ఏడవ మైలు వద్ద గురువారం రాత్రి ఏనుగుల గుంపు కలకలం సృష్టించింది. సుమారు ఐదారు ఏనుగులు ఒక్కసారిగా అటవీ ప్రాంతంలో నుంచి ఏడవ మైలు వద్ద రహదారిపైకి వచ్చేందుకు ప్రయత్నించాయి. దీంతో అటు వెళుతున్న వాహనాలన్నీ నిచిపోయాయి. వెంటనే వాహనచోదకులు టీటీడీ అటవీశాఖకు, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పెద్ద శబ్దాలు చేస్తూ ఏనుగుల గుంపును తిరిగి అటవీ ప్రాంతంలోకి పంపారు. ఈ సందర్భంగా ఏనుగులు అటవీశాఖ సిబ్బంది పైకి వచ్చేందుకు ప్రయత్నించాయి. వారు చాకచక్యంగా ఏనుగులను అడవిలోకి తరిమేశారు.

సర్వ దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,510 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,050 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటలు సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

- 10th Pass / Inter Fail అయిన విద్యార్థులు Nursing, MLT (Lab Technician) కోర్సులు చేసుకునే అవకాశం. సంప్రదించండి: 82474 57565.

Real Estate

PLOTS FOR SALE

- గేటెడ్ కమ్యూనిటీ తుడా అప్రూవల్ ప్లాట్లు ధర 3,50,000/- నుండి ప్రారంభం. సంప్రదించండి సెల్: 8333873430, 8297001234.
- నేషనల్ హైవేకి ఆనుకొని తిరుపతి IIT దగ్గర ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే. సంప్రదించండి సెల్: 9502774175, 7995992114.
- అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/డీటీసీపీ ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సెల్: 9114561456.
- తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు రోడ్డుకు 2వ ప్లాటు (రాస్ బిల్డింగ్ దగ్గర) 100 అంకణముల సెమి కమర్షియల్ ప్లాటు అమ్మబడును. సెల్: 95154 83527.

Wanted

- ప్రముఖ మ్యాట్రిమోనీ ఆఫీసుకు ఏదైనా Job లో 2 సం. అనుభవం గల స్త్రీలు, PRO & Tele Callers కావలెను. Quali: Any డిగ్రీ, Sal: 20 to 25K, Age: 35+, తిరుపతి, Contact Cell: 80193 05930.
- చిత్తూరు, తిరుపతి హెల్త్ ఇన్సూరెన్సులో జాబ్ చేయుటకు రిసెప్షనిస్ట్ అర్జెంట్‌గా కావలెను. అ: ఇంటర్, డిగ్రీ సెల్: 9640507055
- నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీ లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 20 to 25K, Q: Inter పైన, Age: 25 to 40Y, ఆసక్తిగల అభ్యర్థులు సంప్ర. సెల్: 91828 98446
- Wanted Civil Engineers to work at a well Reputed company in Tirupati Qual: Diploma/B.Tech/QC Engineer Min 2 yrs exp. Sal: 15K - 20K. Cont: 9542332862, 8985323604
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999
- Wanted Pre Primay , Primary & High School Teachers for a reputed School in Mangalam, Tirupati, Contact Cell: 81794 67247.
- Wanted for primary Teachers (Subject: English), depends upon skilss, Salary: Above 25K, Contact Cell: 7731809480
- ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర।। 99084 29239
- గూడూరు Phone Pay Company నందు పని చేయుటకు యువకులు కావలయును. అర్హత: 10th, శాలరి: 18,000/-, సంప్రదించండి సెల్: 9849141777.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

డిస్కౌంట్

SAKSHI MEDIA GROUP
99122 20586, 9951602971
Mail id: tptadvtsakshi@gmail.com

విద్యావ్యాపారం..!

ఇంటర్మీడియట్ విద్య కోట్ల ఆదాయాన్నిచ్చే వ్యాపారంగా మారింది. వివిధ బ్యాచ్‌ల పేరుతో దోపిడీ సాగుతోంది. - 8లో

ఎమ్మెల్యేలు డుమ్మా

వియనగరం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047' ప్రణాళిక, పీ–4 కార్యక్రమాల తొలి సమీక్ష సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. - 8లో

ఎస్..మేమంటే మేమే..!

నెల్లిమర్ల నియోజక వర్గం కూటమి నేతల్లో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడింది. - 8లో

ప్రభుత్వం మెడలు వంచుదాం..
హామీలు అమలు చేయిద్దాం

- పవిత్రమైన ఎన్నికల ప్రణాళిక అమల్లో కూటమి వైఫల్యం
- ప్రమాణాలు చేస్తున్నామంటూ ఇచ్చిన బాండ్‌లకు విలువ ఎక్కడ..?
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 5 వారాల బృహత్తర కార్యక్రమం
- హామీల అమలుపై ప్రజలతో చర్చించి చైతన్యవంతులు చేయండి
- పార్టీ శ్రేణులకు శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పిలుపు
- వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేతలు
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పాల్గొన్న పార్టీ నేతలు

విజయనగరం:

ఎన్నికలకు ముందు అధికార దాహంతో ఇచ్చిన హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధమని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఉద్ఘాటించారు. పవిత్రమైన ఎన్నికల ప్రణాళిక అమల్లో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. హామీల అమలుపై ప్రశ్నించేవారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఏడాది పాలనలో హామీల అమల్లో జరుగుతున్న మోసాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ప్రజలకు వివరించాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుచేస్తూ 5 వారాల బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ముందుగా నియోజకవర్గ స్థాయిలో సమన్వయకర్తల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని, అనంతరం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. అనంతరం మండల స్థాయి నాయకులు గ్రామగ్రామానికి వెళ్లి అక్కడి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేసిన అనంతరం ఆ గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి కూటమి పాలనను వివరించాలన్నారు. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడు ప్రజలే జగన్‌మోహన్‌రెడ్డి కావాలో.... చంద్రబాబు కావాలో నిర్ణయించుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన పూల్‌బాగ్‌లోని ఓ కల్యాణ మండపంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరిట ప్రజలను ఏ విధంగా కూటమి నేతలు వంచిస్తున్నారో వీడియోలు ప్రదర్శించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వివరించారు.

సమావేశానికి హాజరైన నాయకగణం

పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారునాయుడు, ఇప్పిలి అనంత్, అల్లాడ సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిరిపురపు జగన్ మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ, ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు పి.కృష్ణవేణి, యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి తూర్పటి వరలక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి తూముల అచ్యుత వల్లి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, జిల్లా ఉపాధ్యక్షురాలు మూకల కస్తూరి, జిల్లా అధికార ప్రతినిధులు సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ జెడ్పీ చైర్మన్ శోభా స్వాతిరాణి, పార్టీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, కందుల రఘుబాబు, రొంగలి జగన్నాథం, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండలాధ్యక్షుడు, నగరాధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఇంటింటికీ వంచన బుక్‌లెట్‌ను చూపిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

హామీలను విస్మరించడం దగా చేయడం కాదా..?



ఇంత వేగంగా పార్టీ శ్రేణులను కలవాల్సి వస్తుందని అనుకోలేదు. ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో ఎన్నికలకు రెండేళ్లు ముందు పార్టీ విధి విధానాలతో ప్రజల్లోకి వెళ్లడం ఆనవాయితీ. ఈ రోజు రాష్ట్రంలో అటువంటి పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యంలో పవిత్రమైన ఎన్నికల ప్రణాళికలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎన్నికల ప్రణాళికలను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబుల్‌గా భావించి అమలు చేశాం. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అలానే అమలు చేస్తుందని 5 కోట్ల మంది ప్రజలు నమ్మి మోసపోయారు. ఏడాది కాలం మాయమాటలతో పబ్బంగడిపేసింది. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యంలో బాధ్యత గల ప్రతిపక్షంగా అధికారం పక్షం ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను మెడలు వంచి అమలు చేసేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ అనే మేము మన రాష్ట్ర ప్రజలు మా సమష్టి నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని త్రికరణ శుద్ధితో ప్రమాణం చేస్తున్నామంటూ బాండ్ పేపర్లు ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి సమన్వయంతో పరస్పర సహకారంతో సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏడాదిగా ప్రతిజ్ఞను పక్కనపెట్టి మోసం చేస్తున్నారు. ఇది ప్రజలను దగా చేయటం కాదా అని ప్రశ్నిస్తున్నా.

– బొత్స సత్యనారాయణ, శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి

మోసగించినా నమ్ముతారనే భావనలో చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారంలోకి రావడం కోసం, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేయడం అలవాటైపోయింది. ఎన్ని మోసాలు చేసినా ప్రజల నమ్ముతారనే భావనలో చంద్రబాబు ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు అలాంటి పాలనే సాగించారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి బాధపడుతున్నారు. ఓడినా ప్రజల కోసం పోరాటం చేసేందుకు సిద్ధమైన జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యానికి సలామ్ చేయాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలి.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం

గ్రామాల్లో చేసిన వాగ్దానాలను ప్రశ్నించాలి

కూటమి నాయకులు ఎన్నికలకు ముందు గ్రామాల్లోకి వచ్చి చేసిన వాగ్దానాలపై ప్రశ్నించాలి. చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను చెప్పేందుకే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం. జగన్‌మోహన్‌రెడ్డి న్యాయంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే.. కూటమి నేతలు మాయమాటలతో పాలన చేస్తున్నారు. 150 హామీలు ఎక్కడ అమలు చేశారో... ఎవరికి చేశారో చెప్పాలి. ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ పేరిట భయపెడుతున్నారు. ఇటువంటి దుర్మార్గపు పాలనను ప్రజల్లో నిలదీయాలి.

– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం, సాలూరు

ప్రజల్లోనే సాగుదాం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడిచిన ఐదేళ్లు ప్రజల్లో ఉంటూ వారికి మంచి జరిగే కార్యక్రమాలు చేశాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నయవంచన పాలనను ప్రజలకు తెలియజెప్పేందుకు ప్రజలతో కలిసి సాగుదాం. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కలిసికట్టుగా పనిచేద్దాం. ఏడాది కాలంలో ధర్నాలు చేయడంతోనే కొన్ని పథకాలైనా అమలు చేశారు. లేకుంటే అవి కూడా అమలు చేయరు. కూటమి నేతలు సంపద సృషించడాన్ని మరిచి మందుబాబులను సృష్టిస్తున్నారు.

– బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, నెల్లిమర్ల నియోజకవర్గం

ప్రజల్లో తప్పుచేశామన్న భావన

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన చూసి ఓట్లేసి తప్పు చేశామన్న భావన గ్రామీణ ప్రజల్లో కనిపిస్తోంది. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అన్ని రంగాల్లో వైఫల్యం చెందారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి పేదలకు వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చారు. రాష్ట్రాన్ని మాఫియాగా దోచుకుతింటున్నారు. చివరికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం వేధింపులు తాళలేక వెళ్లిపోతున్నారు. గొంతెత్తి ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారు. వీటన్నింటిపైనా కలిసికట్టుగా పోరాటం సాగిద్దాం.

– డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం

భస్మాసురిడిలా లోకేశ్



ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేశ్ కూటమి ప్రభుత్వానికి భస్మాసురిడిలా తయారయ్యాడు. రెడ్ బుక్‌లో అందరి జాతకాలు ఉన్నాయంటూ చివరికి ఆ అస్త్రంతోనే కూటమి ప్రభుత్వాన్ని, తన పక్కనున్న వారిని భస్మం చేసే పరిస్థితి వస్తుంది. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్దాం. జగన్ మోహన్‌రెడ్డి ప్రజల్లో ఉన్న అభిమానం చెక్కుచెదరలేదు. 2029 ఎన్నికల్లో మళ్లీ క్లీన్‌స్వీప్ చేస్తాం.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు

కూటమి అధినేత చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాలి. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ ఉత్తుత్తివే అని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ అధికారంలోకి వస్తారన్న భయం కూటమికి పట్టుకుంది. అందుకే ఆయన పర్యటనలకు ఆంక్షలు విధిస్తూ అడ్డుకుంటున్నారు.

– డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్సీ

గడపగడపకు తీసుకెళ్దాం

కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీనాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహభరిత వాతావరణం కనిపించడం శుభ పరిణామం. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి. ఏడాది పాటు మాయమాటలతో పబ్బం గడుపుకున్నారు. నిరుద్యోగులను నట్టేట ముంచారు. బాబు, పవన్‌లు బాండ్‌ల పేరిట ప్రజలను నయవంచన చేశారు. వారి చేసిన మోసాలను గడపగడపకు తీసుకెళ్దాం.

– బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎమ్మెల్యే, గజపతినగరం నియోజకవర్గం.

కూటమి మోసాన్ని వివరిద్దాం

ఏడాది పాలనలో కూటమి నాయకులను నమ్మి ఓట్లేసిన ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని, మోసాన్ని వివరిద్దాం. జిల్లాకు చెందిన మంత్రి ఇచ్చిన పింఛన్ల అమలుకు మూడునెలలైనా దిక్కులేకుండా పోయింది. నియోజకవర్గ, మండల స్థాయిల్లో సమావేశాలు అనంతరం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమవ్వాలి. తద్వారా పార్టీని పునఃనిర్మించుకుందాం. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవాలి. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించేందుకు ఈ కార్యక్రమంతో నాంది పలుకుదాం. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటాం. రానున్న రోజుల్లో పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యమిస్తాం.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం

చంద్రబాబు కలవని పార్టీ లేదు.. చెప్పని అబద్ధం లేదు

2024 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు చంద్రబాబునాయుడు కలవని పార్టీ లేదు. చెప్పని అబద్ధం లేదు. ఎవరొస్తే వారి కాళ్లు పట్టుకుని సలామ్ కొట్టారు. కూటమిగా పోటీ చేశారు. దగాకోరు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారు. ఏడాదికి మూడు సిలెండర్లు ఇస్తామని ఒక్క సిలెండర్‌తో సరిపెట్టారు. ఎటు చూసినా కోతలు, వాతలే మిగులుతున్నాయి. సర్పంచ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి తల్లికి వందనం నిలిపివేయడం దుర్మార్గం. ఇప్పటికీ రైతన్నఖాతాకు పెట్టుబడి సాయం జమకాలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా స్కిల్ డెవెలప్‌మెంట్‌కు అనుసంధానం చేశామంటున్నారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని పీ–4కు అనుసంధానం చేశామని, ఎవరైనా డబ్బున్నవారు దత్తత తీసుకుంటే ఆ పథకాన్ని అమలు చేస్తామని చెబుతున్నారు. మరోవైపు పథకాలన్నీ అమలు చేశామని చంద్రబాబు ఎలా చెబుతున్నారో ప్రజలకే అర్థంకాని పరిస్థితి. ప్రజల తరఫున పోరాడే ధైర్యం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల్లో కొదవలేదు. కూటమి మోసకారి పాలనను వివరిద్దాం.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్

ప్రజల తరఫున పోరాడుదాం

రాష్ట్రం, జిల్లా ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేద్దాం. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరల తీసుకువద్దాం. కూటమి పాలనలో రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతోంది. అన్నదాత సుఖీభవ అమల్లో నిర్లక్ష్యం నటిస్తున్నారు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు దొరకని పరిస్థితి. ఖరీఫ్ ప్రారంభంలో పరిస్థితి ఇలా ఉండడం ఎన్నడూ చూడలేదు.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గం

న్యూస్‌రీల్

బ్లడ్ బ్యాంక్‌లకు షోకాజ్ నోటీసులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఐదు బ్లడ్ బ్యాంక్‌లకు ఔషధ నియంత్రణశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అధికారుల పరిశీలనలో బ్లడ్ బ్యాంక్‌ల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడం, కొన్ని నిబంధనలు పాటించకపోవడం వల్ల నోటీసులు జారీ చేసినట్టు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత తెలిపారు. విజయనగరంలోని న్యూ లైఫ్‌బ్లడ్ బ్యాంక్, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ , బొబ్బిలిలోని బొబ్బిలి బ్లడ్ బ్యాంక్, రాజాంలోని జీఎంఆర్ బ్లడ్ బ్యాంక్, నెల్లిమర్లలోని మిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లకు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు.

గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలకు జాతీయ అవార్డులు

సమావేశమైన రాజాం మండల సమాఖ్య సభ్యులు

గంట్యాడ / రాజాం: గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, సామాజిక సమీకరణ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించినందుకు గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలు ఆత్మనిర్భర్ అవార్డు–2024కు ఎంపికయ్యాయి. దీన దయాల్ అంత్యోదయ యోజన, జాతీయగ్రామీణ జీవనోపాధుల మిషన్ జాతీయ స్థాయిలో అవార్డులను ప్రకటించాయి. గంటాడ్య సమాఖ్య ఉత్తమ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్‌గా, రాజాం సమాఖ్య తృతీయ ఉత్తమ క్లస్టర్ ఫెడరేషన్‌గా అవార్డులను సొంతం చేసుకున్నాయి. వీటికి వరుసగా రూ.3 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు బహుమతి లభించనుంది. ఢిల్లీలో ఆగస్టు 15న జరిగే జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హాయంలో కూడా గంట్యాడ మండల సమాఖ్య 2022, 2023 సంవత్సరాల్లో జాతీయ స్థాయి అవార్డులను సాధించింది.

67 మందికి కారుణ్య నియామకాలు

విజయనగరం అర్బన్: వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి వారసులు 67 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం అందజేశారు. 63 మందికి జూనియర్ అసిస్టెంట్/టైపిస్టుగా, నలుగురికి ఆఫీస్ సబార్డినేట్లుగా ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా తోటపల్లి నీటి ప్రవాహం

తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద గురువారం సాయంత్రానికి 105 మీటర్ల లెవెల్‌కు గాను 104.5 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 3,558ల క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు ఒక గేటును ఎత్తివేసి 3వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకు గాను 2.216 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ ఏఈ కిశోర్ పర్యవేక్షిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీల శ్మశానవాటికలకు స్థలాలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్

హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్:

ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేనిచోట వెంటనే స్థలాలు కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. స్థలాలను గుర్తించే ప్రక్రియను వారంపది రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీఓలకు సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటిపై తీసుకున్న చర్యలు, అందించిన పరిహారం, ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లోని సమస్యలు, గత సమావేశపు అజెండాపై తీసుకున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులపై వెంటనే కేసులు నమోదు చేయాడంతో పాటు, బాధితులకు ప్రభుత్వపరంగా అందాల్సిన సాయాన్ని, పరిహారాన్ని అందించాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించి, పరిశుభ్రంగా తయారు చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ ఎస్.సేతు మాధవన్, ఇన్‌చార్జి డీఆర్వో మురళి, సాంఘిక సంక్షేమశాఖడీడీ ఎం.అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు బసవ సూర్యనారాయణ, సున్నపు రామస్వామి, చంపి సన్యాసిరావు, మజ్జి గణపతి, ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు.

మద్దువలస వంతెన రోడ్డుపై వెళ్తున్న ఏనుగుల గుంపు

రోడ్డుపై గజరాజుల హల్‌చల్

- ఆందోళనలో జనం
- సంగాం పొలాల్లో సంచారం

వంగర: మద్దువలస వంతెన సమీపంలో రోడ్డుపై ఏనుగుల గుంపు గురువారం ఉదయం హల్‌చల్ చేశాయి. రోడ్డుపై ఏనుగులు సంచరించడంతో వాహనచోదకులు, రైతులు భయంతో పరుగులు తీశారు. అటవీ సిబ్బంది, ట్రాకర్స్ ఏనుగులను పంటపొలాలు వైపు దారిమళ్లించారు. చెరకు, మొక్కజొన్న, పామాయిల్ పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడతున్నారు. ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయంతో రోడ్డుపై గుమిగూడిన ప్రజలు

సంగాంలో ఏనుగులు ధ్వంసం చేసిన చెరకు పంట

క్లుప్తంగా

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో తోట విజయ్ ఉత్తీర్ణత

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తోట విజయ్

విజయనగరం: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఆధ్వర్యంలో గత నెలలో అహమ్మదాబాద్‌లో నిర్వహించిన బీసీసీఐ అంపైర్ల పరీక్షల్లో విజయనగరానికి చెందిన తోట విజయ్ ఉత్తీర్ణత సాధించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అంపైర్ల పరీక్షల్లో జిల్లా చరిత్రలో తోట విజయ్ అంపైర్ సర్టిఫికేషన్ పొందిన తొలి వ్యక్తిగా గుర్తింపు సాధించారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అర్హత పొందిన ఏకైక అభ్యర్థి కూడా ఆయనే. ఆయన సాధించిన విజయం విజయనగరం క్రికెట్‌కు గర్వకారణమే కాకుండా భవిష్యత్ అంపైర్లకు ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పటికే విజయ్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు స్కోరర్‌గా వ్యవహరిస్తున్నారు. తోట విజయ్ బీసీసీఐ అంపైర్ల పరీక్ష ఉత్తీర్ణత కావడంతో ఇకనుంచి దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు, రంజీ ట్రోఫీ, ఐపీఎల్, అంతర్‌రాష్ట్ర క్రికెట్ మ్యాచ్‌లకు ఎంపైరింగ్ చేసే అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా విజయ్‌కు జిల్లా క్రికెట్ అసోసియేషన్, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ ప్రతినిధులు, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

పీఎం జుగా నిధులతో పాఠశాలలకు భవనాల నిర్మాణం

- సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురం/మక్కువ: పీఎం జుగా, పీఎం జన్‌మన్ నిధులు మంజూరైన వెంటనే పాఠశాలలకు భవనాలను నిర్మిస్తామని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు గురువారం (జూలై 3న) ''సాక్షి'' దినపత్రికలో ''గిరిజన బిడ్డల చదువుల కష్టాలు'' శీర్షికన ప్రచురితమైన కథనం పట్ల ఆమె స్పందిస్తూ మక్కువ మండలంలోని ఎర్ర సామంతులవలస స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గిరిజన ప్రాథమిక పాఠశాల చిలకమెండంగిలో 8మంది విద్యార్థులు చదువుతున్నారని, రేకుల షెడ్డులో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 8 మండలాల్లో 352 పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 58గిరిజన ప్రాథమిక పాఠశాలలకు భవనాలు లేనందున పీఎం జుగా, పీఎం జన్‌మన్ కింద పాఠశాలల భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆమె స్పష్టం చేశారు.

వర్షాలకు కూలిన పెంకుటిళ్లు

జామిలో కూలిన పెంకుటిళ్లు

జామి: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం జామి లో రెండు పెంకుటిళ్లు గురువారం కూలిపోయాయి. గ్రామానికి చెందిన రాజాన సీతారాం, సీరెడ్డి సింహాచలంల పెంకుటిళ్లు వర్షాలకు నానడంతో కూలిపోయాయని గ్రామస్తులు, బాధితులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తైక్వాండో విజేతలకు సత్కారం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం సత్కరించారు. అనంతపురం జిల్లా, తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ తరపున ఉత్తరఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జూన్ 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో అండర్ 25 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన షణ్ముఖ్ సిద్ధార్థ నాయుడు, అండర్ 48 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బుగత హర్షవర్ధన్, మహిళల విభాగంలో అండర్ 32 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ఇజ్జాడ వైష్ణవిదేవిలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

విద్యావ్యాపారం..!

- అడిగినంత ఇస్తేనే సీటు
- బెంబేలెత్తిస్తున్న ఇంటర్ ఫీజులు
- రకరకాల పేర్లతో ప్రైవేట్ కళాశాలల వసూలు
- 105 కళాశాలల్లో 13 వేల మంది ఫస్ట్‌ఇయర్ ప్రవేశాలు



ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల వసూలు ఇలా..	
ఎంపీసీ, బైపీసీ కోర్సులకు :	రూ.35,000 నుంచి 1,50,000
వాహన సౌకర్యం :	రూ.12,000
పుస్తకాలు :	రూ.8,000 నుంచి 10,000
యూనిఫాం (రెండు జతలు) :	రూ.1,600 నుంచి రూ.2,000
వసతి గృహం, భోజన సౌకర్యం :	రూ.6,000 (నెలకు)
ఐఐటీ, ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ :	రూ.50,000 నుంచి 1,00,000
ఏసీ గదికి అదనం :	రూ.12,000

విజయనగరం అర్బన్: ఇంటర్‌మీడియట్ విద్య కోట్ల ఆదాయాన్నిచ్చే వ్యాపారంగా మారింది. జిల్లా కేంద్రంలోను, జిల్లాలోని వివిధ పట్టణాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల పేర్లతో విద్యార్థుల నుంచి ఎడాపెడా దోచుకుంటున్నాయి. నీట్, జేఈఈ, ఎంసెట్ ఆశలు రేకెత్తిస్తూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజుల వసూళ్లకు తెగబడుతున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటే చాలని వారు చెప్పిన ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు రెండేళ్ల తరువాత లబోదిబోమంటున్నారు. అటు నీట్, జేఈఈ ర్యాంకులు రాక ఇటు ఇంటర్‌లో మార్కులు లేక మోసపోయామంటూ అధికశాతం కన్నవారు వాపోతున్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉంటోంది. పదో తరగతి ఫలితాలు రావడమే ఆలస్యం విద్యార్థుల ఇళ్ల ముంగిట వాలిపోతున్న యాజమాన్యాలు ర్యాంకుల పేరుతో ఊదరగొడుతున్నాయి. రూ.లక్షల్లో వసూలు చేసి పెద్ద ఎత్తున ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. వసతి గృహాల్లో ఎక్కువ మంది చేరుతుండగా ఇరుకుగదుల్లో కుక్కేస్తున్నారు. ఎక్కువ భాగం సొంతభవనాలు లేకపోయినా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆటస్థలాలు పూర్తిగా కరువయ్యాయి.

తాయిలాలకు తలొగ్గిన తనిఖీ అధికారులు

జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 105 ప్రైవేట్ కళాశాలలో ప్రతి ఏడాది 23 వేల మంది వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలుంటున్నాయి. ఇందులో ప్రైవేట్ కళాశాలల్లో ప్రతి ఏడాది చేరిన వారు 13 వేల మంది వరకు ఉంటున్నారు. వారి నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఐదు నుంచి పదిరెట్లకు పైగా వసూలు చేస్తున్నారు. కళాశాలల గుర్తింపు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో పెద్ద ఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోనే రీజనల్ అధికారి కార్యాలయం ఉన్నప్పటికీ అందులోని అధికారులు ప్రైవేట్ కళాశాలల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఉత్తుత్తి తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదులతో పాటు తాయిలాలతో సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బట్టీ చదువులతో సరి

నిరంతరం బట్టీ చదువులు తప్పితే ఏ అంశంలోనూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టి సారించడం లేదు. మెటీరియల్ రూపొందించి ఆ అంశాలనే విద్యార్థులతో వల్లెవేయిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఊసెత్తడం లేదు. అధ్యాపకుల ఏర్పాటులో వివక్ష చూపుతున్నారు. అందరి నుంచి ఒకే ఫీజు వసూలు చేసినా ఒకట్రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు మాత్రమే రూ.లక్షల్లో వేతనాలు చెల్లించి తరగతులు చెప్పిస్తున్నారు.

> **నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు**
>
> ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. అందుకు తగిన రసీదులు ఇవ్వాలి. విద్యాశాఖ నిర్దేశించిన ఫీజులకు వ్యతిరేకంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. విశాలమైన భవనాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తప్పక ఉండాలి. ఎటువంటి లోపాలున్నా నోటీసులు ఇచ్చి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కళాశాలల గుర్తింపు రద్దు చేస్తాం.
>
> ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ, విజయనగరం

ఆర్‌జేడీకి పీఆర్‌టీయూ నాయకుల వినతి

ఆర్‌జేడీ భాస్కరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పార్వతీపురం: పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై రీజనల్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కరరావుకు పీఆర్‌టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు పార్వతీపురం జీజే కళాశాలను ఆర్‌జేడీ సందర్శించిన సందర్భంగా వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత కూడా పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక బోధనకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆర్‌జేడీని కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు వి.తవిటినాయుడు, కె.విజయ్, ఎ.సూర్యనారాయణ, జె.రామినాయుడు, జి.రావినాయుడు, శంకరరావు, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ బలోపేతానికి కృషిచేయాలి

పార్వతీపురం: పీఆర్‌టీయూ బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషిచేస్తున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం ఆదేశాలమేరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని అందుకు అందరు ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం మండలాల నుంచి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా నివారణకు తనిఖీలు

- పలు శాఖల సమన్వయంతో రైళ్లలో సోదాలు
- ఏఎస్పీ అంకిత సురానా

డాగ్ స్క్వాడ్‌తో ప్రయాణికుల లగేజీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురం రూరల్: ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించే రైళ్లలో గురువారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఈగల్ స్పెషల్ ఫోర్స్, లోకల్ పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ సమన్వయంతో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి తనిఖీలు చేపట్టినట్లు పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ముందుగా ప్లాట్‌ఫాంపై వేచిఉన్న ప్రయాణికుల లగేజీలను పలు శాఖల పోలీస్ అధికారులతో కలిసి డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. అనంతరం గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బోగీల వారీగా ముమ్మరంగా విజయనగరం వరకు సిబ్బంది తనిఖీలు చేశారు. ఎప్పటికప్పుడు మాదక ద్రవ్యాల నివారణకు ఈగల్ బృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పోలీసు శాఖలో పలు బృందాల సహకారంతో విస్తృతంగా తనిఖీలు చేపటుతున్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, సాగు, వినియోగం లేకుండా చేయడమే ఈగల్ బృందం ప్రధాన లక్ష్యమన్నారు. తనిఖీల్లో క్రైమ్‌స్టేషన్ సీఐ అప్పారావు, పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, మరికొంతమంది ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు డుమ్మా

మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047' ప్రణాళిక, పీ-4 కార్యక్రమాల తొలి సమీక్ష సమావేశానికి విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు మినహా మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఇది అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ విజన్ ప్రణాళిక అమలులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధి సాధించాలన్నదే లక్ష్యమన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యాన, వాణిజ్యపంటల సాగుకు రైతులు ఆసక్తిచూపేలా చూడాలన్నారు. సర్వీస్ సెక్టార్ కింద పర్యాటక రంగంలో సన్‌రే రిసార్ట్స్ రూ.150 కోట్లు, జీఎంఆర్ రూ.150 కోట్లు, ఆదాని గ్రూప్ రూ.100 కోట్లతో హోటళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయన్నారు. పీ-4లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని 264 పోలింగ్ బూత్‌ల నుంచి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు, రఘురాజు, ఎమ్మెల్యేలు అధితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జేసీ సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్, సీపీఓ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు శక్తియాప్ రక్షక కవచం

మహిళలకు రక్షక కవచంగా శక్తియాప్ నిలుస్తుందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో జరిగిన సమావేశంలో శక్తి యాప్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ తొలిత శక్తి యాప్ విధి విధానాలను పీపీటీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల, ఆడపిల్లల రక్షణ కోసం రూపొందించిన ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతరకు 1.2 కోట్ల మంది వినియోగిస్తున్నారని, ప్రతి మహిళ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాపం పశువులు

ట్రాక్‌పై మృతిచెందిన పశువులను తరలిస్తున్న రైల్వే సిబ్బంది

ఏటీఎంలో మృతి చెందిన ఆవు

పార్వతీపురంటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడ్స్ ఢీకొని 8 పశువులు మృతిచెందాయి. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలంలోని పరశురాంపురం గ్రామం నుంచి పార్వతీపురం సంతకు పశువులను తరలిస్తుండగా పార్వతీపురం సమీపంలో గల రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో రాయపూర్ పైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొనడంతో 8 పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. వెంటనే గూడ్స్‌ను డ్రైవర్ ఆపి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ఉన్న పశువులను పక్కకు తొలగించారు. ఈ విషయమై జీఆర్పీ సిబ్బందిని వివరాలు అడగ్గా ఎటువంటి ఫిర్యాదు అందక పోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఏటీఎంలో ఆవు..

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం కేంద్రంలో ఒక ఆవు మృతిచెందింది. రెండు రోజుల క్రితమే ఈ ఆవు మృతిచెంది ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఉదయం ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా తీసేందుకు వెళ్లిన బ్యాంకు ఖాతాదారులు విషయాన్ని గుర్తించి, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన గోవును పారిశుద్ధ్య కార్మికుల ద్వారా ఏటీఎం కేంద్రంలోంచి బయటకు తీసుకొచ్చి డంపింగ్ యార్డు వద్ద ఖననం చేయించారు. రాజాం రోడ్లపై ఇటీవల ఆవులు అధికంగా సంచరిస్తున్నాయి. వర్షానికి ఏటీఎంలోకి ఆవు చేరి ఉంటుందని, కాలుజారి పడడంతో మృతిచెంది ఉంటుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అనుమానం వ్యక్తం చేశారు.

పాము కాటుతో యువకుడి మృతి

సీతంపేట: మండలంలోని పత్తికగూడ గ్రామానికి చెందిన నిమ్మక కిరణ్ (21) పాముకాటుకు గురై శ్రీకాకుళం రిమ్స్‌లో గురువారం మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు పరిశీలిస్తే..శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఫ్యాన్‌పై నుంచి విషసర్పం కిరణ్‌పై పడడంతో వెంటనే బయటకు విసిరివేశాడు. అప్పటికే పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి వెళ్లిన యువకుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు రమ, రాములు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్..మేమంటే మేమే..!

- కూటమిలో ముదురు పాకాన పడిన వివాదాలు
- నెల్లిమర్ల నియోజకవర్గంలో ఆధిపత్య పోరు
- జనసేన ఎమ్మెల్యే స్పీడుకు తమ్ముళ్ల బ్రేక్
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న టీడీపీ నేతలు
- ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన వాయిదాలో టీడీపీ నాయకుల పాత్ర



పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజక వర్గం కూటమి నేతల్లో ఆధిపత్య పోరుతో ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే స్పీడుకు బ్రేకులు వేయకపోతే టీడీపీ బలహీనపడుతుందనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు.. జనసేన పార్టీ పుంజుకోవాలంటే నియోజకవర్గంలో టీడీపీకి చెక్ పెట్టి పార్టీని పటిష్టం చేయాలని ఎమ్మెల్యే లోకమాధవి ఇలా ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. పూసపాటిరేగ మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసేందుకు హోంమంత్రి అనిత నిర్ణయించారు. ఈ విషయం రుచించని టీడీపీ నాయకులు టీడీపీ అధిష్టానం సిఫార్సులతో శంకుస్థాపన కార్యక్రమం వాయిదా వేయించారు. ఇలా జనసేన అవునంటే అంటే టీడీపీ కాదని, టీడీపీ అవునంటే జనసేన కాదన్న చందంగా ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుని నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేస్తున్నారు. పదిరోజుల క్రితం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు టీడీపీ నేతల సిఫార్సులతోనే జరిగాయనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే ఏరికోరి తీసుకువచ్చిన తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లను ఏడాది తిరక్కముందే నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు బదిలీ చేయించినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లోను ఇదేవిధంగా జరిగినట్లు తెలుస్తోంది.

నిలిచిపోయిన ఏఎంసీ చైర్మన్ నియామకం

రెండునెలల క్రితం పూసపాటిరేగ ఏఎంసీ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించడంతో చైర్మన్ అభ్యర్థి ఎంపికను జనసేన పార్టీ పూర్తి చేసింది. మరికొన్ని రోజుల తరువాత జనసేనకు చెక్‌పెట్టి అధిష్టానం టీడీపీకే చైర్మన్ పదవి కేటాయించినట్లు నెల్లిమర్లలో నియోజకవర్గ టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించడంతో ఆశావహుల మధ్య తీవ్రపోటీ నెలకొనగా..వర్గపోరుతో అప్పట్లో చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయకుండానే సమావేశం వాయిదా వేశారు. నెల్లిమర్ల నగరపంచాయతీలో ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే పాల్గొన్న సర్వసభ్య సమావేశానికి టీడీపీ కౌన్సిలర్‌లు వ్యూహాత్మకంగానే పార్టీ అధిష్టానం ఆదేశాలతో డుమ్మా కొట్టడంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. సంక్షేమ కార్యక్రమాల అమలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు టీడీపీ నాయకులకు సమాచారం ఉండడం లేదని టీడీపీకి చెక్ పెట్టేందుకే ఎమ్మెల్యే యోచిస్తూ అధికారులు సమాచారం ఇవ్వకుండా చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధిష్టానం ఆదేశాలతోనే టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జికి జిల్లా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు బలంగా ప్రచారం సాగుతోంది. జనసేన ఎమ్మెల్యేకు ఇప్పటికైనా చెక్ పెట్టకపోతే నియోజకవర్గంలో టీడీపీ నిర్వీర్యం అవుతుందని టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతోనే ఎమ్మెల్యేకు చెక్‌పెట్టడానికి ఆదేశాలు వచ్చాయనే ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికైనా ఆధిపత్య పోరును వదిలి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹92	₹154	₹164

చోరీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

వకుల్‌జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్/రామభద్రపురం: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు చోరీ కేసుల్లో మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన ముద్దాయి జోకాడ భగవాన్(22)కు ఐదేళ్ల 10 నెలల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ సాలూరు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. ఈ కేసుల వివరాల్లోకి వెళ్తే.. 2023లో రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామంలో వి.కాంతమ్మ ఇంట్లో వారు నిద్రిస్తున్న సమయంలోను.. 2024లో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్‌లోను జోకాడ భగవాన్ చొరబడి రూ.లక్షా 60వేల నగదు, తులం చెవిదిద్దులు, ఒక ల్యాప్‌టాప్ దొంగిలించాడు. అప్పట్లో బాధితులు ఇచ్చిన సమాచారంపై రామభద్రపురం పోలీసులు రెండు చోరీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారణ చేపట్టిన జడ్జి నేరం రుజువుకావడంతో గురువారం పైవిధంగా జైలుశిక్ష, జరిమానా విధించారు. కాగా జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు మాసాలు సాధారణ జైలుశిక్షను అనుభవించాలని సాలూరు జైఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పులో పేర్కొన్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు. ఈ కేసులో వాదనలు వినిపించిన వీహెచ్‌కే శర్మ, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాద్‌లు సకాలంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు.

రెక్కీ నిర్వహించి హత్య

- మహిళ హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, ఎస్సైలు

బొబ్బిలి: తన భార్య చనిపోవడానికి, బిడ్డ అనారోగ్యంతో ఉండడానికి తన పక్కింట్లో ఉంటున్న పిన్నే కారణమని అనుమానించి రెక్కీ నిర్వహించి మరీ ఆమెను హత్య చేశాడో ఓ యువకుడు. బొబ్బిలి పట్టణంలోని బండారు వీధిలో కరగాని పద్మ అనే మహిళ గాయాలతో బుధవారం ఇంటి గుమ్మం వద్ద పడి మృతి చెందిన ఘటన తెలిసిందే. కాగా ఇది హత్యేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయమై డీఎస్పీ జి.భవ్యారెడ్డి గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మహిళ మృతి చెందడానికి కత్తిపీటపై పడిపోవడమేనని కుటుంబసభ్యులు చెప్పిన మాటలపై నమ్మకం కలగక దర్యాప్తు చేపట్టామన్నారు. వంటిపై గాయాలుండడం, మెడికల్ రిపోర్ట్స్, క్లూస్‌టీమ్ వివరాలను సేకరించి హత్య అని నిర్ధారణకు వచ్చామని డీఎస్పీ చెప్పారు. హత్య చేసింది స్వయానా ఆమె బావ కుమారుడు కరగాని సంతోష్ కుమార్ అని తెలిపారు. సంతోష్ కుమార్ భార్య పావని ప్రసవ సమయంలో చనిపోయింది. అలాగే నెలన్నర రోజుల పసిబిడ్డ ఆరోగ్యం కూడా బాగాలేక ఆస్పత్రిలో చేర్చారు. ఈ రెండు సంఘటనలకు తన పిన్నే కారణమని భావించిన సంతోష్ గురువారం ఉదయం 11 గంటల సమయంలో రెక్కీ నిర్వహించాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో పిన్ని ఒంటరిగా ఉన్న సమయంలో పొడిచి హత్యకు పాల్పడినటుల డీఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు గురువారం అప్పగించామని, నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కె. సతీష్‌కుమార్, ఎస్సై ఆర్.రమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I Neha Agarwal (New Name) W/o Jeetesh Chandra Agarwal, previously called as Neha Rathi (Old Name), Resident of B1, Flat No. 402, Ananda Enclave, Opp.Three Temples, Fort Road, Vizianagaram, Andhra Pradesh -535002. Now changed my name from Neha Rathi to Neha Agarwal. Henceforth I will be called as Neha Agarwal (new name) for all purposes.

WANTED
- ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
పూల్‌బాగ్ బ్రాంచ్ (8480)
డి.నెం.214-1, పూల్‌బాగ్, విజయనగరం.
ఫోన్:08922-272186, 8331015676.

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

[illegible] రూ. 15,69,971.12 [illegible] 24.07.2025 [illegible]

ఇ-వేలం తేది & సమయం: 24.07.2025, మ॥ 3.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పీఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 24.07.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏవైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
షెడ్యూల్-ఎ: [illegible]
షెడ్యూల్-బి: [illegible]

రిజర్వు ధర: రూ.14,45,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,44,500/-

[illegible] www.canarabank.com [illegible] ఫోన్: 8331015676 / 9885281085
[illegible] (baanknet) [illegible] https://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 02.07.2025, ప్రదేశం: పూల్‌బాగ్ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 4 । జూలై । 2025

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

అభినందనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అన్యాయం చేశారు.. ఆదుకోండి

మచిలీపట్నం: దూర ప్రాంతాలకు తమను బదిలీ చేశారని సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీని కోరారు.

ఆ ఇళ్లకే సుపరిపాలన

- అన్ని ఇళ్లనూ సందర్శించని టీడీపీ ఎమ్మెల్యేలు
- ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీస్తారని ఆందోళన
- తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్తున్న వైనం
- సమస్యలు వద్దు.. సంక్షేమ పథకాలు అందాయా లేదా అంటూ దాట వేత

తిరువూరు 9వ వార్డులో టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద కరపత్రం అందజేసి ఫొటో దిగుతున్న ఎమ్మెల్యే కొలికపూడి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'ఇంటింటికీ వెళ్లి ప్రజలకు 'సుపరి పాలన'ను వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాం. వాటిని గాలికి వదిలేసి ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాం. సమస్యలు పరిష్కారం కాలేదంటూ అన్ని వర్గాల ప్రజలు రోడ్డుక్కుతున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు ఇలా ఎవరిని కదిపినా నిప్పులు చెరుగుతున్నారు. పింఛన్లను కుదించాం. అన్ని పథకాలకు మంగళం పాడేశాం. తల్లికి వందనంలో కోతలు పెట్టాం. ఇప్పుడు ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి? హామీలపై నిలదీస్తే వారికి ఏమని చెప్పాలి' అని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మొదలైన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారి ఇళ్లకే వెళ్లి మొక్కుబడిగా ముగిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజులు ఎలా నెట్టుకురావాలా అని తలలు పట్టుకొంటున్నారు.

దందాలపై నిలదీస్తారని భయం

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకుల దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు వారు చేయని దందా లేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాతో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఊరూరా బెల్ట్ షాపులు, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆక్రమణలు, కబ్జాలు ఇబ్బడి ముబ్బడిగా చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులతో వేధించారు. వీటన్నింటితో ఐదేళ్ల తరువాత కనిపించాల్సిన ప్రభుత్వ వ్యతిరేకతను ఏడాదిలోని మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ముందుకెళ్లేందుకు ముఖం చెల్లక కొంత మంది ఎమ్మెల్యేలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, నందిగామ ఎమ్మెల్యేలు అందుబాటులో లేరు. నందిగామ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని చిన్ని సుపరిపాలనలో భాగంగా కంచకచర్లలో పాల్గొన్నారు. తమకు అనుకూలమైన ప్రాంతంలో కేవలం నామమాత్రంగా కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి కార్యక్రమాన్ని గంటలోపే ముగించారు.

కృష్ణా జిల్లాలో..

- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మచిలీపట్నం 48వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. ఎంపిక చేసుకున్న ఇళ్లకు మాత్రమే మంత్రి వెళ్లి పథకాల గురించి వివరించారు. కొన్ని ఇళ్ల వద్ద ప్రజలు తమ ప్రాంతంలో నాలుగు నెలలుగా వీధిదీపాలు వెలగటం లేదని, తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదని మంత్రిని నిలదీశారు. పోతేపల్లి గ్రామంలో గురువారం ఇదే రీతిలో కార్యక్రమం సాగింది.
- అవనిగడ్డ నియోజకవర్గంలో మొక్కుబడిగా సుపరిపాలన కార్యక్రమం జరుగుతోంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కూడళ్ల వద్ద, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఈ కార్యక్రమంపై టీడీపీ నాయకులకు సైతం ఆసక్తి లేకపోవటం గమనార్హం.
- పామర్రు నియోజకవర్గంలోని పామర్రు టౌన్‌లో జరిగిన సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ప్రకటించిన విధంగా ప్రతి ఇంటికి వెళ్లకుండా వారికి అనుయాయులుగా ఉన్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారితోనే సమయం గడుపుతున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే ఆందోళనతో కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.
- గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడలో సుపరిపాలన కార్యక్రమం తూతూ మంత్రంగా జరుగుతోంది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కార్యక్రమం జరుగుతుందనే సమాచారాన్ని ఎవరికీ ముందస్తుగా ఇవ్వకుండా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి రెండు ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు మండలం కాటూరు గ్రామాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పర్యటించారు. ప్రధాన ప్రాంతాల్లో పర్యటించి టీడీపీ అనుకూల వ్యక్తుల ఇళ్లకు మాత్రమే వెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి 'మై టీడీపీ' యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కార్యక్రమం మొక్కుబడిగానే సాగింది.
- గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, రామవరప్పాడు గ్రామాల్లో సుపరిపాలన కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ కూడా టీడీపీ అనుకూల గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లి ఫొటోలు దిగి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. పెడన నియోజకవర్గంలో సైతం కార్యక్రమం మొక్కుబడిగా సాగింది.

సమస్యలు వద్దంటూ..

తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడికి సమస్యలతో ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. తిరువూరు మండలం, కోకిలంపాడులో రోడ్డు అధ్వానంగా ఉందని, మోకాలి లోతు గుంతలు, బురదతో నిండిందని, వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయని, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇప్పుడు వచ్చింది సమస్యల గురించి కాదని, సంక్షేమ పథకాల గురించి వచ్చామంటూ ఎమ్మెల్యే కొలికపూడి మాట దాటవేశారు. ఎమ్మెల్యే ముందు సమస్యల గురించి చెప్పకుండా జనాలను టీడీపీ స్థానిక నాయకులు వారించారు. గురువారం సైతం అదే తంతు జరిగింది. తిరువూరులోని తొమ్మిదో వార్డులో డ్రెయిన్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 'ఇప్పుడు సమస్యల గురించి వద్దు. మీకు తల్లికి వందనం వచ్చిందా? లేదా? అంటూ వారు అడిగిన సమస్యను ఎమ్మెల్యే దాట వేశారు. జగ్గయ్యపేటలో సైతం తమకు అనుకూలమైన వారి ఇళ్లకే టీడీపీ నాయకులు వెళ్లారు. విజయవాడ వెస్ట్‌లో ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలైంది. విజయవాడ ఈస్ట్, సెంట్రల్ నియోజకవర్గాల్లో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

న్యూస్‌రీల్

కార్తికేయుని సేవలో ప్రముఖులు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పాండిచ్చేరి మాజీ మంత్రి, ఆ రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, చెన్నై వాసి, టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి, అనురాధ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, వేద పండితులు, అర్చక స్వాములు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కృష్ణమూర్తి, అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ పూజలు చేశారు.

పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు లోపభూయిష్టం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు అత్యంత లోపభూయిష్టమని ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి, విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ అన్నారు. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తిప్పి పంపడం తాము ఊహించిందేనన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు నాయకుడు అక్కినేని భవానీప్రసాద్‌తో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందంగా వ్యవహరించకుండా విజ్ఞతతో పునరాలోచన చేయాలని సూచించారు. బనకచర్ల ప్రాజెక్టుతో కృష్ణా నదీ జలాలపై ఉన్న నీటి హక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేంతవరకు కొత్తవి చేపట్టకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. పోలవరం–బనకచర్లపై తమ వేదిక మీడియా ద్వారా ప్రభుత్వానికి తన అభిప్రాయాలను విన్నవించగా టీడీపీ అధికారిక యూట్యూబ్ చానల్‌లో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఆ చానల్ నిర్వాహకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రేపు బీఎస్‌ఎన్‌ఎల్ నేషనల్ లోక్ అదాలత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఈ నెల ఐదో తేదీన బీఎస్‌ఎన్‌ఎల్ నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని సంస్థ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం కోర్టుల్లో 'నేషనల్ లోక్ అదాలత్' జరుగుతుందని పేర్కొన్నారు. క్లోజ్ చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ ఫోన్ల తాలూకు వినియోగదారులకు న్యాయసేవాధికార సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చామని, వారు కోర్టుకు హాజరు కాకుండా ముందుగానే బకాయిలు చెల్లించొచ్చని సూచించారు. ఈ నెల ఐదో తేదీలోపు వడ్డీ లేకుండా బకాయిలు చెల్లించొచ్చని, పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత తగిన రాయితీ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. బకాయిల తీర్మానం జరిగిన తర్వాత సర్వీసులను పునరుద్ధరణ చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 0866–2444266/ 83338 98997/ 94901 88990/ 94901 45222 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కృష్ణా డీఎస్‌ఓ పార్వతి బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.పార్వతిని బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను తూర్పుగోదావరి జిల్లా డీఎస్‌ఓగా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. ఆమె స్థానంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివరామప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

ఈగల్ టీం ఐజీ రవికృష్ణ

గంజాయి చాక్లెట్లను చూపిస్తున్న ఐజీ రవికృష్ణ, డీసీపీ సరిత తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ టీం ఐజీ ఆరే రవికృష్ణ తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీం సభ్యులు, పోలీసులు, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా బిహార్ నుంచి చెన్నైకు గంజాయి చాక్లెట్లను తీసుకు వెళ్తున్న వ్యక్తిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గంజాయి కేసులకు సంబంధించి 80 శాతం ఒడిశా నుంచే ఇతర ప్రాంతాలకు రైళ్లలో సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, దీనిని అరికట్టేందుకు అన్ని రైల్వేస్టేషన్లలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సహకారంతో ఈగల్ టీంలు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాయని వివరించారు. డ్రోన్‌లు, శాటిలైట్ టెక్నాలజీని ఉపయోగించి అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను వదిలే ప్రసక్తే లేదని, వారి ఆస్తులను అటాచ్ చేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఇటువంటి తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సరిత, రైల్వే సీనియర్ డీఎస్పీ షణ్ముగ వడివేల్, జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు, సీఐలు జి.వి.రమణ, దుర్గారావు, ఆర్పీఎఫ్ సీఐ పతే అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

మేళతాళాలతో దుర్గమ్మకు సారె

అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మేళతాళాలు.. మంగళ వాద్యాలతో భక్తులు దుర్గమ్మ కొండకు తరలివస్తున్నారు. సకుటుంబ సమేతంగా అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. గురువారం సుమారు 40కి పైగా భక్త బృందాలు, 1200 మందికి పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సారెను సమర్పించేందుకు విచ్చేస్తున్న భక్త బృందాలు, భక్తులకు దేవస్థానం సకల సదుపాయాలను కల్పిస్తోంది. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి భక్తులు సారె సమర్పిస్తున్నారు. మహామండపం ఆరు, ఏడు అంతస్తుల్లో అమ్మవారికి సమర్పించిన పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, మిఠాయిలను మహిళలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటున్నారు. సారె సమర్పించిన భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాలతో పాటు ఉచిత ప్రసాదాలను దేవస్థానం అందించింది.

10వ తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు?

ఆషాఢం సారె, వారాంతం, శాకంబరీదేవి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసే యోచనలో ఉన్నట్లు ఆలయ ఈఓ శీనానాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం రోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీఐపీ దర్శనాలను ఈఓ నిలిపివేశారు. తాజాగా పదో తేదీ వరకు అంతరాలయ దర్శనం రద్దు చేయాలనే ఆలోచన చేయడం గమనార్హం.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

- కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన జీఓ 120ను రద్దు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కొల్లేరును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన 120 జీఓను రద్దు చేయాలని, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిని కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన గురువారం కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వారు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజలకు హానికరమైన ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. మూడో కాంటూరు నుంచి ఐదో కాంటూరు వరకు పది కిలోమీటర్ల దూరంలో సున్నితమైన పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలు విధించి మొత్తం కొల్లేరును పూర్తిగా అటవీ శాఖ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీని ప్రభావం ఏలూరు జిల్లాలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేటి ప్రాంతంలోని 89 గ్రామాలపై పడుతుందన్నారు. అధికారులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

నిద్రలేమి.. పట్టదేమి?

- యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్న మిడ్‌నైట్ కల్చర్
- అర్ధరాత్రి దాటే వరకూ స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం
- ఫలితంగా మానసిక, శారీరక సమస్యల దాడి
- అప్రమత్తం కాకుంటే దీర్ఘకాలిక సమస్యగా మారే ప్రమాదం

ప్రస్తుతం మిడ్‌నైట్ కల్చర్ బాగా పెరిగింది. అర్ధరాత్రి వరకూ రోడ్లమీదే ఎక్కువ మంది గడిపేస్తున్నారు. యువతీయువకులు స్మార్ట్‌ఫోన్లతో అర్ధరాత్రి దాటే వరకూ కాలక్షేపం చేస్తున్నారు. ఫలితంగా తీవ్ర నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నిద్రలేమి అనేక ఆరోగ్య రుగ్మతలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరానికి శక్తి కోసం ఆహారం ఎంత అవసరమో, మెదడుకు నిద్ర అంత ముఖ్యం. మెదడు సక్రమంగా పనిచేయాలంటే రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. నేటి యువతలో ఎక్కువ మంది నిద్రలేమి సమస్య ఎదుర్కొంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులతో పాటు, యువ ఉద్యోగులు సైతం అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకూ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయాన్నే నిద్రలేచి విధి నిర్వహణలో నిమగ్నమవుతున్నారు. నిద్రలేమి సమస్య ఉన్న ఉద్యోగులు విధినిర్వహణపై దృష్టి పెట్టలేకపోతున్నారు. చదివిన అంశాలు గుర్తుండక విద్యార్థులు సతమతమవుతున్నారు. అంతేకాదు వారు పలు శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారని ఇటీవలి అధ్యయనాల్లో వెల్లడైంది.

మంచి నిద్రపోవాలంటే..

- మనిషి శరీర తత్వాన్ని బట్టి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం.
- రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకేసమయానికి నిద్రలేవడం చేయాలి.
- ఒకేసారి ఏకకాలంలో నిద్రపోవాలి. నాలుగు గంటలకు ఒకసారి, రెండు గంటలు మరోసారి కాదు.
- మంచి నిద్రకోసం బెడ్‌రూమ్‌ను చీకటిగా ఉంచుకోవడంతో పాటు, శబ్దాలు లేకుండా చూసుకోవాలి.
- నిద్రలోనే మెదడులోని వ్యర్థాలు బయటకు వెళ్లి ఆరోగ్యంగా ఉండగలుగుతారు.
- విద్యార్థులకు సరిగా నిద్రలేక పోతే, రాత్రి చదివినవి ఉదయానికి గుర్తుండవు.

గుర్తించిన సమస్యలు ఇవీ..

- రాత్రివేళల్లో స్మార్ట్‌ఫోన్లు ఎక్కువ సేపు చూసే వారిలో కంటిలోని మెలకొనిన్ అనే పదార్థం కరిగిపోతుంది. అలాంటి వారికి నిద్రపట్టదు. క్రమేణా నిద్రలేమి దీర్ఘకాలిక సమస్యగా మారే ప్రమాదం ఉంది.
- నిద్రలేమికి గురయ్యే వారిలో కోపం, చిరాకు పెరిగిపోతాయి. నిస్సత్తువ ఆవహించి, తెల్లారి లేచిన తర్వాత పనిపై దృష్టి పెట్టలేరు. వేగంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతారు.
- పగలు చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తం కావాలంటే సరైన నిద్ర అవసరం. నిద్రలేమి సమస్య ఉన్న వారిలో చదివిన అంశాలు గుర్తుండని పరిస్థితి నెలకొంటోంది.
- ఒబెసిటీ ఉన్న వారు గురకతో రాత్రి వేళల్లో తరచూ తుళ్లిపడి లేస్తుంటారు. శ్వాసనాళాలు మూసుకుపోవడంతో గురకతో పాటు, ఒక్కోసారి గుండెపోటు, మెదడు పోటుకు కూడా గురయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి వారి ఆరోగ్య పరిస్థితిని స్లీప్ ల్యాబ్‌లో అధ్యయనం చేస్తారు.
- ప్రతి ఒక్కరికీ నాన్ రాపిడ్ ఐ మూమెంట్ (ఎన్‌ఆర్‌ఈఎం), రాపిడ్ ఐ మూమెంట్(ఆర్‌ఈఐ) అనే రెండు రకాల నిద్ర ఉంటుంది. ఇది గంటన్నరకు ఒకసారి సైకిల్ మారుతుంటుంది. కొందరికి రెండూ కలిసి పోవడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో నిద్రలోనే లేచి నడవడం వంటివి చేస్తుంటారు.

నిద్రలేమికి అనేక కారణాలు

నేటి యువత ఎక్కువగా నిద్రలేమి సమస్యతో బాధపడుతోంది. నిద్రలేమికి అనేక కారణాలున్నాయి. వాటిలో రోజూ ఒకే సమయానికి పడుకోకపోవడం, సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎక్కువగా టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు చూడటం, ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో పడుకోవడం, నిద్రలో గురక రావడం, నైట్‌స్లీప్ డిజార్డర్, రక్తహీనత వంటి కారణాలు ఉన్నాయి. నిద్రలేమి ఉన్న వారికి స్లీప్ ల్యాబ్‌లో స్టడీ చేస్తాం. ఆక్సిజన్ శాచురేషన్, బ్రెయిన్ యాక్టివిటీ, బాడీ యాక్టివిటీ, ఏ సైకిల్‌లో ఉన్నారో తెలుసుకుంటాం. నిద్రలేమికి కారణాలను అంచనా వేసి అవసరమైన వైద్యం చేయడం, సూచనలు ఇవ్వడమో చేస్తుంటాం. వైద్యుల సూచన లేకుండా నిద్రమాత్రలు వాడటం సరికాదు.

– డి.అనీల్‌కుమార్, న్యూరాలజిస్ట్

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలి

జాతీయ రహదారిపై గుంతలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

కేసరపల్లి(గన్నవరం): చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై గుంతలు పూడ్చి, రెండు వైపులా పచ్చదనం పెంపొందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేసరపల్లి వరకు జాతీయ రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. విమానాశ్రయం నుంచి అమరావతికి నిత్యం వీవీఐపీలు, విదేశీ ప్రతినిధులు వస్తుంటారని, ఈ నేపథ్యంలో జాతీయ రహదారిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు. రహదారిపై ఏర్పడిన గుంతలు, బుడమేరు కాలువ వంతనపై పగుళ్లను తక్షణం పూడ్చి రాకపోకలకు అనువుగా మార్చాలని ఆదేశించారు. సెంట్రల్ డివైడర్‌పై వెలగని ఎల్‌ఈడీ లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, రోడ్డుపైకి విస్తరించిన పొదలు, పిచ్చి మొక్కలను తక్షణం తొలగించి శుభ్రం చేయాలని, రోడ్డుకు రెండువైపులా పూల కుండీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించాలని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ విద్యాసాగర్, తహసీల్దారు కె.వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అగార్ ఉడ్ మొక్కల సాగుతో అధిక లాభాలు

త్రిపుర ప్రభుత్వ ఎన్‌టీఎఫ్‌పీ డైరెక్టర్ ప్రసాదరావు

మాట్లాడుతున్న త్రిపుర రాష్ట్ర ఫారెస్ట్ డైరెక్టర్ వడ్డరపు ప్రసాదరావు, జీవి శేషగిరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచంలోనే అత్యంత విలువైన చెట్టు అగార్ ఉడ్ అని, దీని సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని త్రిపుర ప్రభుత్వ ఎన్‌టీఎఫ్‌పీ డైరెక్టర్, ఐఎఫ్‌ఎస్ అధికారి ప్రసాదరావు అన్నారు. విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం మందిర డెవలపర్స్ ఆధ్వర్యంలో అగార్ ఉడ్‌పై వ్యవసాయ పెట్టుబడితో అధిక లాభాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాదరావు మాట్లాడుతూ అగార్ ఉడ్ ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదం, మెడిసిన్, సౌందర్య సాధనాలలో విరివిగా వాడుతున్నట్లు తెలిపారు. ఈశాన్య దేశాలలో పెరిగే అగార్ ఉడ్ మొక్కలను గత 10 నుంచి 15 ఏళ్లుగా కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో విరివిగా సాగు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమ్మకాలు ఎగుమతులు అన్ని క్లియరెన్సులు అందిస్తూ కొన్ని రూ. వేల కోట్లు బిజినెస్‌ను అంచనా వేస్తూ అగార్ ఉడ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మందిర డెవలపర్స్ చైర్మన్ జీవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

తిరువూరు: ఎ.కొండూరు మండలం పాతరేపూడి తండాలో గత నెల 26న కోట రాము అనే వ్యక్తిని హత్య చేసిన ఇరువురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తిరువూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరానికికు చెందిన ఆదూరి చార్లెస్‌కు, రెడ్డి గూడెం మండలం కూనపరాజు పర్వకు చెందిన బత్తు ల కుమారితో వివాహేతర సంబంధముంది. కొద్దికాలంగా కోట రాము కూడా కుమారిని తనతో వివా హేతర సంబంధం పెట్టుకోవాలని వేధిస్తున్నాడు.

అడ్డు తొలగించుకోవాలని..

కుమారి ఈ విషయాన్ని చార్లెస్‌కు చెప్పగా, ఇరువురూ కలసి రామును అడ్డు తొలగించుకోవాలని భావించారు. రామును కొత్త రేపూడి గ్రామశివారులోని మామిడి తోట వద్దకు కుమారి తీసుకురాగా, చార్లెస్ కర్రతో అతని తలపై బలంగా బాదాడు. రాము తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోగా.. కుమారి, చార్లెస్ పరారయ్యారు. తన భర్త మూడు రోజులుగా కనిపించట్లేదని హతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, 29న పాత రేపూడి మామిడి తోటలో లభ్యమైన మృతదేహం రాముదిగా గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. కుమారి, చార్లెస్‌పై వెంకటేశ్వరమ్మ అనుమానం వ్యక్తం చేయగా.. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని తెలిపారు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ

- రూ.13.56లక్షల విలువైన స్టాంప్‌లు అపహరణ
- గన్నవరంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు


కార్యాలయ తలుపు గొళ్లెం పగులకొట్టిన దొంగలు

విచారిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ, క్రైం పోలీసులు

గన్నవరం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీ చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి దొంగలు కార్యాలయంలోకి చొరబడి సుమారు రూ. 13.56లక్షల విలువైన నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు, తోక బిళ్లలను అపహరించుకుపోయారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక చింతలపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అధికా రులు, సిబ్బంది బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. తిరిగి గురువారం విధులకు హాజరైన సిబ్బంది కార్యాలయ తలుపు గొళ్లెం పగులకొట్టి ఉండడం గమనించి సబ్ రిజిస్ట్రార్ వీవీవీ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కార్యాలయానికి చేరుకున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డు రూమ్ తలుపులు తీసి ఉండి స్టాంపులు భద్రపరిచిన బీరువా పగులకొట్టి ఉండడటాన్ని గుర్తించారు.

ఆధారాల సేకరణ..

సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కార్యాలయాన్ని పరిశీలించారు. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ దొంగల వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ మూర్తి, డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐ బీవీ శివప్రసాద్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది నుంచి చోరీ ఘటనపై వివరాలు సేకరించారు. సీసీఎస్ సీఐ గోవిందరాజు నేతృత్వంలోని బృందం కార్యాలయ పరిసరాల్లోని సీసీ ఫుటేజ్‌లను సేకరించి దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనపై సబ్‌రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇవి మిస్సింగ్..

సుమారు రూ.13,56,300 విలువైన రూ. 50 నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు 3,600, రూ.100 ధర కలిగిన నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు 3,600, తోక బిళ్లలు రూ.50 ధర కలిగినవి 12,500, రూ.100 ఖరీదు కలిగినవి 4,609 చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలు ఆఫ్ చేసి ఉండడం పట్ల ఆఫీస్‌లో పనిచేసే ప్రైవేట్ సిబ్బంది వ్యవహారశైలిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు..

ఈ చోరీ ఘటన వల్ల గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. చోరీకి సంబంధించి పోలీసులు ఆధారాలు సేకరణ, విచారణ కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయినట్లు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ తెలిపారు. తిరిగి శుక్రవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన

వేప కొమ్మలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఇంజినీరింగ్(వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానిక్, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్) కార్మికులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. అర్ధనగ్నంగా మొలలకు వేప కొమ్మలు కట్టుకుని నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి నినాదాలు చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం తొమ్మిదో రోజుకు చేరుకుంది.

ప్రభుత్వంలో కదలిక..

మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయకుండా జీతాలు పెంచే విధంగా వెంటనే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో విజయవాడ ధర్నా చౌక్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జ్యోతిబసు, నగర కోశాధికారి స్టీఫెన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు వంశీ కృతజ్ఞతలు

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. తన సతీమణి పంకజశ్రీతో కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లిన వంశీ.. కష్టకాలంలో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వయస్సు 24.. చోరీలు 24

- నాలుగు నెలల్లో 12 దొంగతనాలు
- ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు
- రూ. 6లక్షలు విలువైన ఆభరణాలు స్వాధీనం

మాట్లాడుతున్న ఏసీపీ డీ దామోదరరావు, సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాలుగు నెలలో 12 చోరీలు చేసిన నిందితుడు ఉయ్యాల రాజేష్(24)ను గుణదల పోలీసులు అరెస్టు చేసి రూ. 6లక్షలు విలువ చేసే 60గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డి. దామోదరరావు తెలిపారు. స్థానిక గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అలా దొరికాడు..

గుణదల మురళీనగర్ కట్టమీద ఇటీవల చోరీ జరిగింది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుణదల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసిరెడ్డి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమానితులు, నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందానికి అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఒక యువకుడు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.

జల్సాలకు అలవాటు పడి..

విచారణలో నిందితుడు అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు ఉయ్యాల రాజేష్(24)గా గుర్తించామని ఏసీపీ చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన రాజేష్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడ్డాడన్నారు. ఈ క్రమంలో రాజేష్‌పై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేశామని చెప్పారు. 2024 సెప్టెంబర్‌లో దొంగతనం కేసులో గుణదల పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించామని తెలిపారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన రాజేష్ నేర ప్రవృత్తి మార్చుకోకుండా చోరీలకు పాల్పడ్డాడని.. నాలుగు నెలల వ్యవధిలో 12 దొంగతనాలు చేశాడని వివరించారు.

సాంకేతిక ఆధారాలు ఆధారంగా..

సాంకేతిక పరిజ్ఞానం, చోరీ జరిగిన ప్రాంతంలో వేలిముద్రలు పరిశీలించి పాత నేరస్తులతో పరిశీలించగా రాజేష్‌ను నిందితుడుగా గుర్తించామని ఏసీపీ చెప్పారు జరిగిందన్నారు. రాజేష్‌పై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్‌లలో 12 కేసులు ఉన్నాయన్నారు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజేష్ చోరీలు చేశాడని వివరించారు. నేరస్తుడుని అరెస్టు చేయటంతో పాటు అతని వద్ద నుంచి రూ.6లక్షలు విలువ చేసే ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

10 నుంచి సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు, ప్రయోక్త మల్లాది సూరిబాబు 80వ జన్మదిన వేడుకల సందర్భంగా సామగాన లహరి ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 10వ తేదీ గురువారం సాయంత్రం నుంచి నాలుగు రోజులపాటు జాతీయ సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మల్లాది బ్రదర్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు పాల్గొంటారన్నారు. 13న సంగీత విద్వాంసుడు మల్లాది సూరిబాబుకు సత్కారం ఉంటుందని వివరించారు. ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరారావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం సంగీత విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

వాగుల ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

కంచికచర్ల: నాగార్జున సాగర్, కాచేటి వాగులను ఆక్రమణకు గురయితే తక్షణమే తొలగించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల సమీపంలో గ్రామానికి చెందిన రైతులు నేషనల్ హైవే పక్కన ప్ల కార్డులు పట్టుకున్న రైతుల వద్దకు గురువారం కలెక్టర్ వెళ్లి విచారించారు. జిల్లా రైతు సంఘ నాయకుడు అబ్బూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పంట పొలాలు క్వారీ, క్రషర్ల సమీపంలో ఉన్నాయ ని, ఆ క్వారీల వల్ల పంటలన్నీ దెబ్బతింటున్నాయని చెప్పా రు. సాగునీటి కోసం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సాగర్ కాల్వను సైతం క్వారీ గుత్తేదారులు ఆక్రమించుకుని రోడ్డు వేశారన్నారు. రైతుల బాధను విన్న కలెక్టర్ సాగర్ కాల్వను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

STAFF WANTED
Required qualified and experienced English & Hindi high school staff
HOLY SPIRIT E.M. HIGH SCHOOL
Kuchipudi, Movva.
Cell : 96525 30580

WANTED P.E.T.s
A well reputed School at Kaikaluru, Eluru (Dist) requires the following vacancies.
P.E.T. Male (1), Female (1)
Salary: 20.000/- to 25,000/-
Interested candidates can come directly to School with resume with in seven days.
TVNRM NATIONAL SCHOOL
Kaikaluru, Eluru Dist, AP-521333 ✆ 6303 602 774

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

Real Estate

PLOT FOR SALE

■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' అడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర : ✆ 97034 34023, 96428 72122

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

Wanted

■ SBI Lifeలో పనిచేయుటకు Unit Managers కావలెను. Exp. Min. 2 yrs, Q : Any Graduate, Fixed Salary + PF + ESI + Travelling Allowance ✆ 98480 57524

■ క్లాస్ ఇన్‌ఛార్జెస్ (M) జీ : 12K హాస్టల్ వార్డెన్స్ (M), జీ : 10K వ : 25-45, అనుభవం గలవారు కావలెను. గౌతం డిగ్రీ కాలేజీ, మోడ్రన్ సూ.మార్కెట్ ఎదురు, బెంజ్‌సర్కిల్ ✆ 88971 72345

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ కేర్ ఆఫ్ హెల్త్ కార్డు ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000 + 2500 TA. సంప్రదించండి. ఫోన్: ✆ 70130 52798

■ విజయవాడ – తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60564, 72070 13418

■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : ✆ 88858 01357

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679

■ రామవరపాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M)లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: ✆ 98853 26279

■ ప్రముఖ కంపెనీవారి వ్యవసాయ ఉత్పత్తులు మండలాల వారిగా జీతం/కమీషన్‌పై పనిచేయుటకు అనుభవం ఉన్న అభ్యర్థులు కావలెను. Qly 10th-డిగ్రీ జీతం 10-20 వేలు. 88851 91948

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు 40 వేలు, ఫ్రీ రూం + భోజనం. Hyd 7993583999

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2 వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781

గమనిక

ఉయ్యూరు, కంకిపాడు 9010577706
గన్నవరం 9010210382
9010210386 9010201611 9505507329

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారతీనగర్ బ్రాంచి :
డోర్ నెం. 54-15-9/1, సర్వీస్ రోడ్డు, భారతీనగర్, రింగ్ రోడ్, విజయవాడ - 520008. ఎన్‌టీఆర్ జిల్లా.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారతీనగర్ బ్రాంచి ... బ్యాంకు వారిచే అమ్మబడును. ... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారతీనగర్ బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 30-07-2025న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. ...

ఇ-వేలం తేది & సమయం : 30-07-2025, మ॥ 12.00గం. నుండి సా॥ 05.00 గం. వరకు
(10 ని॥ల అపరిమిత స్వయం పొడిగింపులతో)

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : ఋణగ్రహీత : 1) శ్రీ నల్లా మహేంద్రనాథ్, డి.నెం. 26-11-19, హిందు వీధి, గాంధీనగర్, విజయవాడ, ఏపి – 520003. లేదా 2) శ్రీ నల్లా సురేంద్రనాథ్, ఫ్లాట్ నెం. 403, 3వ ఫ్లోర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, బైపాస్ రోడ్డు, గ్యాస్ గోడౌన్ దగ్గర, కంకిపాడు పేట, కృష్ణా జిల్లా, ఏపి – 522601
బకాయి మొత్తం : రూ. 15,64,000/– ... ది. 19-01-2022 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : షెడ్యూల్ –ఎ : కృష్ణా జిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్, కంకిపాడు గ్రామం & పంచాయితీ, సబ్ డివిజన్ తర్వాత ఆర్.ఎస్.నెం. 75/1బి & 82/1సి ... మొత్తం 4694.8 చ॥గ॥ల విస్తీర్ణంలోని ... 46.94 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము మాత్రమే. ...

[illegible]

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారతీనగర్ బ్రాంచి ... 08-04-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. ... తేది. 03-07-2025న ... స్వాధీనము చేసుకోవడమైనది. ...

తేది: 03-07-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 4 । జూలై । 2025

పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం 8లో

డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక డ్రైవ్ 8లో

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు 8లో

న్యూస్‌రీల్

పరశురాముడిగా జగన్నాథుడు

డాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో వేంచేసియున్న జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు బారులు తీరారు. దీంతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దశావతారాల్లో భాగంగా స్వామి పరశురామావతారంలో దర్శనమివ్వగా.. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రథయాత్రలో భాగంగా శుక్రవారం జగన్నాథ స్వామి శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

రైతు బజార్లలో స్టాళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: జిల్లాలోని రైతుబజార్లలో గడువు ముగిసిన డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలోని రైతు బజార్లలో ఉన్న 69 డ్వాక్రా స్టాల్స్, 29 దివ్యాంగుల స్టాళ్ల గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కొత్తగా ప్రారంభించిన చిట్టివలస రైతుబజార్‌లో రెండు స్టాళ్లు ఖాళీగా ఉన్నందున మొత్తం 100 స్టాళ్లకు (డ్వాక్రాకు 71, దివ్యాంగులకు 29) అద్దె ప్రాతిపదికన కేటాయింపులు జరుగుతాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11వ తేదీలోగా జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8–202/2, ఆర్.ఆర్.వి.పురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం–530029 చిరునామాలో అందజేయాలని జేసీ సూచించారు. మరింత సమాచారం కోసం 9959592474ను సంప్రదించవచ్చు.

నేటి నుంచి మత్తు మందు వైద్య నిపుణుల సదస్సు

మహారాణిపేట: మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజీ 40వ సౌత్ జోన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 30వ వార్షిక సదస్సు నిర్వహిస్తున్నట్లు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ కుచేల్ బాబు, చైర్మన్ డాక్టర్ డి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రవి, మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కూర్మనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షిక సదస్సుకు ఏడు రాష్ట్రాల నుంచి 1,500 మందికి పైగా మత్తుమందు వైద్య నిపుణులు హాజరవుతారని డాక్టర్ కూర్మనాథ్ తెలిపారు. రోగులకు శస్త్రచికిత్స సమయంలో మత్తు ఇంజెక్షన్లు ఇవ్వడంలో వస్తున్న నూతన పోకడలు, అధునాతన వైద్య విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు వెల్లడించారు. మత్తుమందు వైద్య నిపుణులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891–2560414, 2575046 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

కొత్త లేఅవుట్లకు.. మాస్టర్ స్ట్రోక్..!

బృహత్తర ప్రణాళిక పేరుతో కొత్త లేఅవుట్ల ప్లాన్లకు మోకాలడ్డు
కూటమి ప్రజాప్రతినిధుల కుయుక్తులు

- మాస్టర్ ప్లాన్–2041లో మార్పులకూ పట్టు
- మాస్టర్‌ప్లాన్ రోడ్లు వస్తాయన్న నెపంతో లేఅవుట్లకు అనుమతుల నిరాకరణ
- దరఖాస్తు చేసుకునే వారితో మంతనాలు
- తమ వాటాలు ఇవ్వకుంటే ప్లాన్లు రాకుండా చేస్తామని హెచ్చరికలు
- స్థిరాస్తి వ్యాపారానికి గుదిబండలా ప్రజాప్రతినిధుల నిర్ణయాలు

విశాఖ సిటీ : కూటమి ప్రజాప్రతినిధుల 'మాస్టర్ ప్లాన్' స్థిరాస్తి రంగం ఊపిరి ఆపేసేలా ఉంది. బృహత్తర ప్రణాళిక పునఃపరిశీలన ప్రక్రియ విశాఖ రియల్ ఎస్టేట్‌ను వెంటిలేటర్‌పైకి ఎక్కించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో భూక్రయ, విక్రయాల్లో స్తబ్దత కొనసాగుతోంది. రాజకీయ స్వలాభం, స్వప్రయోజనాల కోసం కూటమి ప్రజాప్రతినిధులు వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్–2041 సవరణలకు పూనుకోవడం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మరింత శాపంగా పరిణమించింది. ప్రధానంగా బృహత్తర ప్రణాళిక రహదారుల పేరుతో కొత్త అవుట్లకు మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది స్థిరాస్తి వ్యాపారులకు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతోంది.

లేఅవుట్లకు అనుమతులు నిరాకరణ?

వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక–2041 పునః పరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. వాస్తవానికి గత నెలలోనే ఫిర్యాదుల స్వీకరణకు గడువు ముగిసింది. ఈ ప్రక్రియలో వేల సంఖ్యలో అభ్యంతరాలు వస్తాయని కూటమి ప్రజాప్రతినిధులు భావించారు. కానీ అనూహ్యంగా కేవలం 755 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. దీంతో అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 17వ తేదీ వరకు గడువు పొడిగించారు. మాస్టర్‌ప్లాన్‌లో సవరణల పేరుతో ప్రజాప్రతినిధులు భారీగా లబ్ధి పొందేందుకు స్కెచ్ వేస్తున్నారు. ఒక వైపు తమ భూముల ధరలు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూనే మరోవైపు ప్రైవేటు లేఅవుట్లకు అనుమతులు రాకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బృహత్తర ప్రణాళిక రహదారులు వస్తాయన్న నెపంతో కొత్త లేఅవుట్లను అనుమతులు ఇవ్వకుండా హోల్డ్‌లో పెడుతున్నట్లు రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాటాల కోసం మంతనాలు

మాస్టర్ ప్లాన్ పూర్తయినంత వరకు కొత్తగా లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయకూడదని కూటమి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బృహత్తర ప్రణాళికను పూర్తి చేసేందుకు మరో మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. దీన్ని అడ్డుపెట్టుకుని వారి అనుచరులు రియల్ వ్యాపారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. తమ వాటాలు ఇవ్వకుండా లేఅవుట్లకు అనుమతులు వచ్చే అవకాశం లేదని బేరసారాలు చేస్తున్నట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న స్థిరాస్తి రంగం.. కూటమి నేతల కారణంగా మరింత పతనమయ్యే ప్రమాదముందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

మందగమనంలో స్థిరాస్తి రంగం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో స్థిరాస్తి రంగం కుదేలైంది. భూముల క్రయవిక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనూ ఫ్లాట్లు, వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,526 కోట్లు లక్ష్యంగా కాగా.. కేవలం 75 శాతం మేర ఆదాయం మాత్రమే సమకూరడమే జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందనడానికి నిదర్శనం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.వెయ్యి కోట్లు లక్ష్యానికి మించి రూ.1060.03 కోట్లు సమకూరింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా వెంచర్లు, నిర్మాణాలకు ఎవరూ సాహసించడం లేదు. గత ఏడాది కాలంగా కొత్త లేఅవుట్ల అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవడం జిల్లాలో స్థిరాస్తి రంగ పరిస్థితికి అద్దం పడుతోంది. గతంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో పదుల సంఖ్యలో కొత్త లేఅవుట్లకు దరఖాస్తులు వచ్చేవి. ఇప్పుడు కేవలం ముగ్గురు, నలుగురు వ్యాపారులు మాత్రమే లేఅవుట్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటికి కూడా బృహత్తర ప్రణాళిక పేరుతో అడ్డంకులు సృష్టిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

రేపు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

వేదిక రుషికొండలోని ఏ1 గ్రాండ్ హోటల్

సాక్షి, విశాఖపట్నం: రుషికొండలోని ఏ1 గ్రాండ్ హోటల్‌లో ఈ నెల 5న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. సమావేశంలో భాగంగా ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు 'బాబు ష్యూరిటీ.. మోసాలు గ్యారెంటీ' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎంపీ గొల్ల బాబూరావు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ని అన్ని నియోజవర్గాల సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, యువజన విభాగం అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

6న గిరిజన ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్ గిరిజన ఐక్యవేదిక సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 6న విశాఖ వేదికగా నిర్వహించనున్నట్లు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు లకే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి బాకురు కరుణాకర్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో పలు నూతన కమిటీలను ఎన్నుకోవడంతో పాటు గిరిజనుల సంక్షేమంపై చర్చించనున్నట్లు తెలియజేశారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒంద్రు రామ్మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొక్కుల రామారావు హాజరవుతారని తెలిపారు.

13 మంది క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న 13 మందిని నగర సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 57 మొబైల్ ఫోన్లు, 137 బ్యాంకు బుక్స్, 11 ల్యాప్‌టాప్‌లు, 132 ఏటీఎం కార్డులు, 4 సీసీ కెమెరాలు, 2 రూటర్‌లు, ఒక క్యాష్ కౌంటింగ్ మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్‌లో గురువారం సీపీ శంఖబ్రత బాగ్చి వివరాలు వెల్లడించారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా అమాయకులను తప్పుదోవ పట్టిస్తూ, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి మ్యూల్ బ్యాంకు అకౌంట్స్ సరఫరా చేస్తున్న కశింకోటకు చెందిన ఓ వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు ఇదివరకే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి రాబట్టిన సమాచారం మేరకు ఆధునిక సాంకేతిక సహాయంతో బెంగళూరు స్థావరంగా ఉన్న డెన్‌ను గుర్తించారు. దానిపై దాడి చేసి అక్కడున్న 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఒకరు, చత్తీస్‌గఢ్‌కు చెందిన 8 మంది, జార్ఖండ్, బిహార్‌లకు చెందిన చెరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. వీరంతా ఆన్‌లైన్ ద్వారా పరిచయమై, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వివిధ రాష్ట్రాల్లో ఉన్న వాళ్లతో ఆన్‌లైన్‌లో పరిచయాలు పెంచుకున్నారు. తద్వారా మ్యూల్ బ్యాంక్ అకౌంట్లను కొరియర్ ద్వారా సేకరించి వాటిని ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. అమాయకులైన వారిని బెట్టింగ్ ఊబిలోకి లాగి, అప్పుల పాలు చేస్తూ వారి నుంచి డబ్బులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. వీరితో రెడ్డన్న 462, బేటా బాయి 52 వెబ్‌సైట్‌లు నడుపుతున్నారన్నారు. ప్రతి టీంలో షిఫ్ట్‌కు ఇద్దరు చొప్పున 24 గంటలూ పనిచేస్తూ అమాయకుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారని వెల్లడించారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం http://www.cybercrime. gov. in లేదా 1930 లేదా 7995095799కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అమలు చేయాలి

కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ వినతి

కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు

మహారాణిపేట: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలు ఉచిత విద్యను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ప్రైవేట్ పాఠశాలలు ప్రవేశ తరగతిలో 25 శాతం సీట్లను సామాజికంగా వెనుకబడిన, ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు ఉచితంగా కేటాయించాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. పిల్లల నుంచి ఎటువంటి ప్రవేశ పరీక్షలు, ఫీజులు, దరఖాస్తు రుసుం వసూలు చేయరాదని, పాఠశాల యాజమాన్యాలు ఈ విధానాన్ని కచ్చితంగా పాటించాలని గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మీడియా ద్వారా డిమాండ్ చేశారు. అయితే చాలా పాఠశాలలు ఈ చట్టాన్ని పాటించడం లేదని కె.కె.రాజు అన్నారు. పేద కుటుంబాల పిల్లలు, దివ్యాంగులు, అనాథలు వంటి వారు ప్రవేశం కోసం దరఖాస్తు చేసినప్పటికీ.. వివిధ అడ్డంకులు కల్పించి తిరస్కరిస్తున్నారన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని, పేద పిల్లల విద్యా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి.. తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవి రెడ్డి, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ, సతీష్ వర్మ, పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు పద్మా రెడ్డి, శశికళ, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు అంబటి శైలేష్, పేడాడ రమణి కుమారి, శివరామకృష్ణ, సనపల రవీంద్ర భరత్, పులగం కొండారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లేశ్వరి, పార్టీ నాయకులు శేఖర్, సాగర్, సూర్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద రోగికి 'ఆసరా' కరువు

- కూటమి ప్రభుత్వంలో అటకెక్కిన ఆరోగ్య ఆసరా
- సాయం ఆగిపోవడంతో పేద రోగుల అవస్థలు
- వైఎస్సార్ సీపీ హయాంలో 1,69,836 మందికి రూ.98.43 కోట్ల సాయం

ఆసరా అందించిన ప్రయోజనం ఇదీ..

సంవత్సరం	రోగులు	పొందిన లబ్ధి
2020–21	18,160	రూ.12.04 కోట్లు
2021–22	33,749	రూ.21.23 కోట్లు
2022–23	29,737	రూ.17.73 కోట్లు
2023–24	58,839	రూ.32.43 కోట్లు
2024–25	29,351	రూ.15.00 కోట్లు

(కూటమి ప్రభుత్వం ఏర్పడిన వరకు)

మహారాణిపేట: ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న పేద రోగులు కోలుకునే సమయంలో ఆర్థిక భరోసా కల్పించే 'ఆరోగ్య ఆసరా' పథకం అమలు నిలిచిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దిగ్విజయంగా కొనసాగిన ఈ పథకం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటకెక్కింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకం కింద నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుండటంతో డిశ్చార్జ్ సమయంలో అందాల్సిన ఆర్థిక సాయం కోసం రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ నిరాశకు గురవుతున్నారు.

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స అనంతరం జీవన భృతి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని 2019 డిసెంబర్ 2న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగి కోలుకునే వరకు, రోజుకు రూ. 225 చొప్పున, నెలకు గరిష్టంగా రూ. 5,000 వరకు జీవన భృతిని అందించేవారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే రోజే ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. సాధారణ ప్రసవాలకు, సిజేరియన్లకు రూ. 5,000, గుండె సంబంధిత సర్జరీలకు రూ. 5,000 నుంచి రూ. 10,000 వరకు చికిత్సను బట్టి సాయం అందేది. ఆస్పత్రుల నుంచి ఇంటికి వెళ్లాక కోలుకునే వరకు కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు వారికి ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. జిల్లాలో మొత్తం 52 నెట్‌వర్క్ ఆస్పత్రులు, 20 డెంటల్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో మొత్తం 1,69,836 మందికి ఆసరా పథకం ద్వారా రూ.98.43 కోట్లు అందజేశారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసింది. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి పలు కార్యక్రమాలను అమలుచేసింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం ద్వారా, ఆపదలో ఉన్న పేదలందరికీ నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలిచారు. అనారోగ్య సమస్యల వల్ల పేదలు ఆర్థికంగా నష్టపోకూడదని, క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్యం.. పేదలకు క్రమంగా దూరమవుతోంది. ఆసరా పథకం కింద నిధులు విడుదల కాకపోవడంతో శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డిశ్చార్జ్ సమయంలో డబ్బులు వస్తాయని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. 'ఆసరా డబ్బులు ఎప్పుడు వస్తాయి?' అని వారు ఆసుపత్రి సిబ్బందిని అడుగుతుండగా, ఏమి సమాధానం చెప్పాలో తెలియక సిబ్బంది సైతం అయోమయంలో ఉన్నారు. విశ్రాంతి సమయంలో కుటుంబ పోషణకు ఉపయోగపడే ఈ సాయం ఆగిపోవడంతో.. పేద రోగులు ఆర్థికంగా మరింత కుంగిపోతున్నారు.

నగరాభివృద్ధి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: విశాఖ నగరాభివృద్ధి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బీచ్ సమీపంలోని స్మార్ట్‌సిటీ కార్యాలయంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విశాఖ నగరాభివృద్ధి దిశగా జీవీఎంసీ అన్ని జోన్లలో ఇప్పటికే ప్రతిపాదించిన రోడ్లు, యాన్యువిటీ మోడల్ ప్రతిపాదనలు, అభివృద్ధిపై సమీక్షించారు. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, కూడళ్ల అభివృద్ధి, మీడియన్లు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా నిర్వహణ, డిశాలినేషన్ ప్లాంట్ తదితర పనులపై దృష్టి సారించాలని వారిని ఆదేశించారు. పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పనులు వేగవంతం చేసి, ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, రుషికొండ వద్ద డ్రైనేజీ స్కీమ్ పనులపై కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. నగరాన్ని ఆకర్షణీయంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేకంగా దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజినీర్ పల్లంరాజును ఆదేశించారు. సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కార్యక్రమంలో భాగస్వామ్యమైన కలెక్టర్ జిల్లాలో చేపట్టిన చర్యలపై సీఎస్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను, మురుగు కాలువల పక్కన ఉండే పైప్ లైన్లను శుభ్రం చేయాలని చెప్పారు. డ్రెయిన్లలో పూడికలు తొలగించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. బాలసంజీవని పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అంగన్వాడీలు ఫేషియల్ అథెంటికేషన్ వేయాలని చెప్పారు. చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఆహారం అందజేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మరిన్ని ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్నా క్యాంటీన్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల అధికారులు వీసీలో పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులతోనే ఉన్నత పదవి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

విమానాశ్రయంలో మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గోపాలపట్నం: అమ్మ దీవెనలతో భారతీయ జనతాపార్టీలో ఇంత ఉన్నతమైన పదవి దక్కడం ఎంతో గర్వంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తరువాత తొలిసారిగా గురువారం విశాఖ చేరుకున్న ఆయనకు ఎయిర్ పోర్టులో పార్టీ నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని అగ్రగామిగా బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. విశాఖ వాసిగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను తాను సందర్శించానని, రాయలసీమ నుంచి శ్రీకాకుళం వరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తానని తెలిపారు. భవిష్యత్తులో బీజేపీని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా తయారు చేస్తానని మాధవ్ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం, ఆయన విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

బదిలీ చేసినా పోస్టింగ్ ఇవ్వలేదు

- వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల గగ్గోలు
- ఐటీడీఏ పరిధిలో పీహెచ్‌సీ సిబ్బంది బదిలీల ప్రక్రియ పూర్తి
- ఏజెన్సీలో సిబ్బందిని రిలీవ్ చేయకపోవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో వివిధ కేటగిరీల్లో 39 మంది ఉద్యోగులకు బదిలీలు పూర్తయ్యాయి. అయితే కొన్ని విభాగాల్లో ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకుండా, కొత్త వారిని విధుల్లో చేరనీయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో బదిలీలు పొందిన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలా కాలంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేసి, మైదాన ప్రాంతాలకు బదిలీ అయినవారిని, తమ స్థానాల్లో కొత్తవారు వచ్చేవరకు కూడా రిలీవ్ చేయడం లేదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. తమ స్థానాల్లో కొత్తవారు చేరే వరకు ప్రస్తుత స్థానాల్లోనే పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా, అధికారుల నుంచి సానుకూల స్పందన లేదని వారు వాపోతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాధారాణి బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఐటీడీఏ అధికారులు వాటిని అమలు చేయకపోవడంపై ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ కూడా ఐటీడీఏ పీఓలకు లేఖ రాసినా ఎటువంటి స్పందన లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు

- దళిత నేత న్యాయపోరాటానికి వాసుపల్లి రూ.10 వేల సాయం
- అజయ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి

దాబాగార్డెన్స్: చంద్రగిరిలో దళిత కుటుంబంపై జరిగిన అమానుష దాడిని మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షతో వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, అతని కుటుంబంపై పచ్చ ముఠాలు చేసిన దాడి అమానుషమన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద న్యాయపోరాటం చేస్తున్న అజయ్‌కుమార్ కుటుంబానికి వాసుపల్లి గణేష్‌కుమార్ తన వంతుగా ఫోన్‌పే ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళిత కుటుంబాన్ని అవమానించిన వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు దళితులంటే ఎప్పుడూ చిన్నచూపేనని, కూటమి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న వరుస దాడులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. చంద్రగిరిలో బాధితుడు అజయ్‌కుమార్ భార్యపై దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. పోలీసులు కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. దళిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వాసుపల్లి స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇటువంటి దాడులు జరగలేదని, చంద్రబాబు, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు టెండర్లు

గోపాలపట్నం : రైతుబజార్లలో వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వేలం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గలవారు రూ.10,000 ధరావత్తును 'సంయుక్త కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం' పేరిట డీడీ, లేదా చెక్కు రూపంలో జత చేయాలి. దరఖాస్తులను ఆగస్టు 5 నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందించాలని మార్కెటింగ్ శాఖ తెలిపింది. ఎంవీపీ కాలనీ రైతు బజార్ పార్కింగ్‌కు నెలవారీ లీజు రూ.1.05లక్షలు, గోపాలపట్నం రూ.80,671, మధురవాడ రూ 4,850, కంచరపాలెం రూ51,750 నిర్ణయించారు. వినియోగదారుల వద్ద వసూలు చేయాల్సిన ధరలు సైకిల్ రూ.2, ద్విచక్రవాహనాలకు రూ.5, ఆటోలకు రూ.10, కార్లకు రూ.20 వసూలు చేయాలని తెలిపింది. వివరాలకు 9959592474, 9030819082 సంప్రదించవచ్చు.

కల్తీ మద్యం తయారు చేయడానికి వాడుతున్న స్పిరిట్,రసాయనం

మీడియా ఎదుట ప్రవేశపెట్టిన కల్తీ మద్యం తయారు చేస్తున్న నిందితులు

పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం

బెల్టు షాపులకు చాటుమాటున సరఫరా

- హైదరాబాద్‌లో స్పిరిట్ కొనుగోలు.. పరవాడలో తయారీ
- అచ్యుతాపురం, పరవాడల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు
- 72 లీటర్ల స్పిరిట్, యంత్ర సామగ్రి స్వాధీనం
- ఇద్దర్ని అరెస్ట్ చేసిన యలమంచిలి ఎక్సైజ్ పోలీసులు

యలమంచిలి రూరల్: ఆస్పత్రుల్లో చేతులు శుభ్ర పరుచుకునేందుకు ఉపయోగించే స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. పరవాడలో స్థావరం ఏర్పాటు చేసుకుని కల్తీ మద్యం తయారు చేస్తున్నారు. బెల్టు షాపులకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు పలుచోట్ల దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల దగ్గరుండి 72 లీటర్ల స్పిరిట్, కల్తీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న యంత్ర సామగ్రి, ఖాళీ మద్యం బాటిళ్లు, స్టిక్కర్లు, రంగు కోసం కలిపే రసాయనం స్వాధీనం చేసుకున్నారు. యలమంచిలి ఎక్సైజ్ సీఐ పి.తేజో వెంకటకుమార్ గురువారం సాయంత్రం యలమంచిలిలో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేసిన వివరాలివి.. మాకవరపాలేనికి చెందిన రుత్తల రాము ఉపాధి నిమిత్తం అచ్యుతాపురంలో ఉంటున్నాడు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి కల్తీ మద్యం వ్యాపారం లాభదాయకంగా ఉంటుందని తెలుసుకున్నాడు. పరవాడకు చెందిన యలమంచిలి వెంకటేశ్వర్రావు అలియాస్ వెంకటేష్‌తో కలిసి కల్తీ మద్యం తయారీ చేస్తున్నాడు. ఇందుకోసం పరవాడలో అద్దెకు ఇంటిని తీసుకున్నారు. ఆ ఇంటిని స్థావరంగా చేసుకుని ఏసీ బ్లాక్ బ్రాండ్ కల్తీ మద్యం తయారు చేసి అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 2వ తేదీ బుధవారం సాయంత్రం అచ్యుతాపురంలో రుత్తల రాము అనే వ్యక్తిని అనుమానంతో అతని ఇంటి వద్ద తనిఖీ చేయగా 5 లీటర్ల కల్తీ మద్యం క్యాన్లు పట్టుబడ్డాయి. తర్వాత అతన్ని విచారించగా పరవాడలో ఒక ఇంటిలో కల్తీ మద్యం తయారు చేస్తున్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులు స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తున్నట్టు గుర్తించారు.

కల్తీ మద్యం తయారీకి వినియోగిస్తున్న యంత్ర సామగ్రి

హైదరాబాద్ టు పరవాడ

హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను 5 లీటర్ల క్యాన్లలో తెప్పించుకుని, దానిలో కారామెల్ అనే రసాయనం కలిపిన వెంటనే ఏసీ బ్లాక్ విస్కీలా రంగు మారిపోతుంది. దానిని మద్యం ఖాళీ క్వార్టర్ (180 మి.లీ.) బాటిళ్లలో వేసి అసలు విస్కీని పోలిన స్టిక్కర్లు, మూతలు పెట్టి సీల్ చేస్తున్నారు. ఇలా తయారు చేసిన బాటిళ్లను బెల్టు షాపులకు ఒక్కో బాటిల్ రూ.120 నుంచి రూ.130కి విక్రయిస్తున్నారు. దాన్ని బెల్టు షాపు వాళ్లు వినియోగదారులకు రూ.150 నుంచి రూ.180 వరకూ సరఫరా చేస్తున్నారు. ఈ కల్తీ మద్యం తయారీతో ఏడు రెట్లు లాభం పొందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 72 లీటర్ల స్పిరిట్, 455 ఖాళీ బాటిళ్లు, 1389 మూతలు, బాటిళ్లపై అతికించడానికి ముద్రించిన ఏసీ బ్లాక్ స్టిక్కర్లు, కారామెల్ రసాయనం, యంత్ర సామగ్రిని స్వాధీనపరుచుకున్నారు. నిందితులు ఒక లీటర్ స్పిరిట్ రూ.100కి కొనుగోలు చేస్తున్నారని, 5 లీటర్ల స్పిరిట్‌తో 27 కల్తీ మద్యం క్వార్టర్ బాటిళ్లు తయారు చేస్తున్నారని ఆయన తెలిపారు. కల్తీ మద్యం తాగితే కాలేయ సంబంధ వ్యాధుల బారిన పడతారని, చివరకు ప్రాణాంతకంగా మారుతుందని సీఐ తెలిపారు. ఇలాంటి కల్తీ మద్యం తయారీ ముఠాల సమాచారం తమకు అందించాలని ఆయన కోరారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఇంకా నిందితులెవరైనా ఉంటే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ మద్యం బాటిళ్లపై అతికించడానికి తయారు చేసిన స్టిక్కర్లు

నకిలీ సిగరెట్ల సరఫరా, విక్రయం కేసులో నలుగురి అరెస్ట్

పీఎంపాలెం: ప్రముఖ కంపెనీల బ్రాండ్ పేరుతో నకిలీ సిగరెట్లు సరఫరా, విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి. ఇంపీరియల్ టొబాకో కంపెనీ(ఐటీసీ) గోల్డ్‌ఫ్లాక్ కింగ్స్ తదితర సిగరెట్లను పలువురు డీలర్ల ద్వారా పాన్ షాపులకు సరఫరా చేస్తోంది. రుషికొండ ఐటీ హిల్స్ రోడ్డులో దుకాణం నడుపుతున్న ఎండాడకు చెందిన రాజు.. ఐటీసీ బ్రాండ్ సిగరెట్ల మధ్య నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సంస్థ ప్రతినిధులు దుకాణం వద్దకు వెళ్లి తనిఖీ చేయగా నకిలీ సిగరెట్ ప్యాకెట్లు లభించాయి. అతన్ని విచారించగా నగరంలోని శంకరమఠం ప్రాంతానికి చెందిన వెంకటరమణ, కోటేశ్వర గుప్తా తనకు నకిలీ సిగరెట్లు సరఫరా చేస్తున్నారని చెప్పాడు. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు వారి షాపుల్లో తనిఖీ చేయగా వారి వద్ద 280 నకిలీ గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ ప్యాకెట్లు లభించాయి. అదే సమయంలో పీఎంపాలెం ప్రాంతానికి చెందిన మరో దుకాణదారు పొట్నూరు శివ నకిలీ సిగరెట్లు కొనడానికి వారి వద్దకు వచ్చాడు. అతను కూడా నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సంస్థ ప్రతినిధులు తగిన ఆధారాలతో ఈ నలుగురినీ పీఎంపాలెం పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించగా, వారు మోసానికి పాల్పడినట్లు అంగీకరించారు. ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : కోరాపుట్–కిరండూల్ లైన్‌లో కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో శుక్రవారం విశాఖపట్నం నుంచి బయల్దేరే కిరండూల్ రైళ్ల గమ్యం కుదించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. 4వ తేదీన విశాఖపట్నం–కిరండూల్(58501)పాసింజర్ అరకు వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. గురువారం రాత్రి విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడిచింది. తిరుగు ప్రయాణంలో 4వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

బెంగళూరు-నారంగి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ఎస్ఎంవీ బెంగళూరు–నారంగి మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు–నారంగి (06559) స్పెషల్ బెంగళూరులో ఈ నెల 8, 15వ తేదీల్లో రాత్రి 11.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడకు, ఆ మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నారంగి చేరుకుంటుంది. నారంగి–ఎస్ఎంవీ బెంగళూరు(06560) స్పెషల్ ఈ నెల 12, 19వ తేదీల్లో ఉదయం 5.30 గంటలకు నారంగిలో బయల్దేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది.

డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక డ్రైవ్

ఏసీ కోచ్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు డీసీపీ–1 అనిత వేజెండ్ల తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లలో నగర పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ పి.రామచంద్రరావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, రైల్వే భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ కల్యాణి నేతృత్వంలో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై గురుదేవ్ ఎక్స్‌ప్రెస్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీలు, కోచ్‌లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ పరిధిలో నిరంతరం తనిఖీలు చేస్తామని జీఆర్పీ సీఐ తెలిపారు.

కొత్త పథకాలకు విశాఖలో శ్రీకారం

అల్లిపురం: కొత్త పథకాలకు శ్రీకారం చుట్టడంలో విశాఖ ఎల్లప్పుడూ మొదటి స్థానంలో ఉంటుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. హర్యానాలో గురువారం 'రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల మొదటి జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛభారత్, అభియాన్, మురుగునీటి నిర్వహణ, సోలార్ ఎనర్జీ, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టు, విశాఖ నగర సుందరీకరణ పనులు, పచ్చదనం పరిరక్షణ, ఇటీవల ప్రపంచ రికార్డు సాధించిన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ తదితర కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, యుఎస్‌డీపీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజమణి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు

- ఆలయ భూముల తాజా పరిస్థితిపై 20లోగా నివేదికలివ్వాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని దేవదాయ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో దేవదాయ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ భూముల తాజా పరిస్థితులను వివరిస్తూ ఈ నెల 20లోగా నివేదికలు సమర్పించాలని, సంక్లిష్ట పరిస్థితులకు సంబంధించి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ జిల్లా పరిధిలోని అంశాలను, ప్రత్యేకంగా జీవీఎంసీ పరిధిలోని సమస్యలను నివేదించారు. టైటిల్ డీడ్ నమోదు, ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, రీసర్వే నిర్వహించాల్సిన అంశాలను ప్రస్తావించారు. మ్యుటేషన్ల ప్రక్రియలో జాప్యాన్ని నివారించేందుకు రెవెన్యూ అధికారుల నుంచి సంపూర్ణ సహకారం అవసరమని కోరారు. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు సంబంధించి త్వరితగతిన దరఖాస్తులు సమర్పించాలని, దేవదాయ శాఖ నుంచి ప్రతినిధిని నియమించుకుని రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జీవీఎంసీ పరిధిలోని కొన్ని ఆలయాల సమీపంలో జరిగిన రోడ్డు విస్తరణ వల్ల కోల్పోయిన భూములకు టీడీఆర్‌లు తీసుకునేందుకు దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. పూర్ణామార్కెట్ కూడలి నుంచి సత్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకునే మార్గంలో కేజీహెచ్ వైపు రెండు ప్రైవేటు దుకాణాలు వెలిశాయని, వాటి వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా ఇటీవల ప్రమాదం కూడా చోటు చేసుకుందని అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ ప్రస్తావించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. పూర్ణామార్కెట్ ప్రాంతంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఒక పాడుబడిన భవనం ఉందని, అది భక్తులపై పడే ప్రమాదముందని ప్రస్తావించగా.. సంబంధిత భవన యజమానికి నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. దేవదాయ శాఖకు, ప్రైవేటు వ్యక్తులకు మధ్య భూములకు సంబంధించిన వివాదాలు ఉంటే రికార్డులను అనుసరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దక్షిణ నియోజకవర్గ ప్రాంతంలో దేవదాయ శాఖకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు విషయం చర్చకు రాగా.. సంబంధిత నివేదికలను రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించాలని భూ పరిపాలన విభాగం సూపరింటెండెంట్‌కు సూచించారు. భీమిలి లక్ష్మీనృసింహ స్వామి భూముల విషయంలో నెలకొన్న సందిగ్ధతపై విచారణ చేయాలని ఆలయ ధర్మకర్త విన్నవించగా.. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో డీఆర్వో బి.హెచ్.భవానీ శంకర్, విశాఖ, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, పలువురు తహసీల్దార్లు, సర్వే, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'తొలి అడుగు' బహిష్కరణ

డ్రైనేజీలు నిర్మించాలని గంటాను కోరుతున్న ప్రజలు

కొమ్మాది: రుషికొండలో నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టిపల్లి గోపి, ఆయన వర్గం బహిష్కరించింది. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా.. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చారు. అప్పటి వరకు ప్రజలు వర్షంలో తడుస్తూ ఆయన కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కాగా.. వార్డులో నెల కొంటున్న రాజకీయాల పరిణామాల నేపథ్యంలో గోపి వర్గం టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంది.

రవీంద్ర భారతి స్కూల్ భవనం జప్తు

విశాఖ సిటీ : కార్మిక రాజ్య బీమా సంస్థ అధికారులు ద్వారకానగర్‌లో ఉన్న రవీంద్ర భారతి స్కూల్‌ను జప్తు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ స్కూల్ ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించని కారణంగా పాఠశాల భవనాన్ని జప్తు చేసినట్లు రికవరీ ఆఫీసర్ జి.వేణుమాధవ్ తెలిపారు. ఈఎస్ఐ బకాయిలు వెంటనే చెల్లించి ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని ఆయన అన్ని సంస్థలకు సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME & DATE OF BIRTH

I, **PAVANI** Wife of JC-281182A Rank - Sub Maj Name **GANDREDDI RAMA KRISHNA**, Resident of Narava (V), Pendurthi (M), Visakhapatnam - 530027 (A.P). Have changed my Name from **PAVANI** (Old Name) to **GANDREDDI PAVANI** (New Name) and Date of Birth from **26 June 1982** to **26 October 1985** Henceforth She will be called as **GANDREDDI PAVANI** (New Name) for all purpose. Vide affidavit dated 23-06-2025 before Notary public Visakhapatnam, A.P.

CHANGE OF NAME & DATE OF BIRTH

I, **PENTAMMA** Mother of JC-281182A Rank - Sub Maj Name **GANDREDDI RAMA KRISHNA**, Resident of Narava (V), Pendurthi (M), Visakhapatnam - 530027 (A.P). Have changed my Name from **PENTAMMA** (Old Name) to **GANDREDDI PENTAMMA** (New Name) and Date of Birth from **01 July 1959** to **01 Janurary 1956** Henceforth She will be called as **GANDREDDI PENTAMMA** (New Name) for all purpose. Vide affidavit dated 23-06-2025 before Notary public Visakhapatnam, A.P.

CHANGE OF NAME

I, **GOTTUMUKKALA SARITHA** , W/o Bhaskara Raju Gottumukkala previously called Krishna Saritha Gottumukkala, Resident of Door No:50-1-41/16/1, Sree Krishnam Second Floor, ASR Nagar, Seethammadhara, Visakhapatnam-530013, Now changed my name from Krishna Saritha Gottumukkala To **GOTTUMUKKALA SARITHA**. Hence forth I will be called as **GOTTUMUKKALA SARITHA** for all purpose.

CHANGE OF NAME

I, **SRUNGARAPU SAI VINEELA** (Old name) W/O YELAMANCHI JAYADEV MOHAN PRASAD D. No. 39-4-6/2, 4th lane, Sector- 4, Murali Nagar, Visakhapatnam-7. I have changed my name as **YELAMANCHI SAI VINEELA** (New name). Hereafter my name is known as **YELAMANCHI SAI VINEELA** (New name)

Real Estate

RESTAURENT FOR SALE

■ **Excellent Running Hyderabadi** Non Veg. Restaurant (40 seating) for sale. Near Rama talkies, Visakhapatnam. Ph : 95733 37307 [V- 14053]

Services

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/– మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర।। 96032 16460/63007 25191. [V- 3577]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ విశాఖపట్నం టౌన్ నందు గడ్డి కటింగ్ చేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం: 15,000 / ESI, PF కలవు. సంప్రదించండి: 7993893331, 80744 34160. [SCA25005899]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ **Wanted Office Assistant Female** with Knowledge of Cash, Minimum Accounts and Computer Knowledge 8:30 am to 6pm. Cont : 93930 03003 [V- 14046]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

ఇ-వేలం ద్వారా మెషినరీ అమ్మకం (హైపోథికేషన్ ప్రకారం)

ఋణగ్రహీత: రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.30–83–19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం – 530046. **వేరొక చిరునామా:** రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం – 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.30–83–19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం – 530046. **వేరొక చిరునామా: శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం – 531036. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి: లేటు ఎస్. అప్పన్న, డి.నెం.30–83–19/1, కణితి ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం – 530046. **వేరొక చిరునామా: శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, గ్రౌండ్ ఎసిసి షెడ్, 3 మరియు 4వ అంతస్తు, గంధవరం గ్రామం, చోడవరం మండలం, విశాఖపట్నం – 531036. **శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, మేనేజింగ్ డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.2–38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా. **శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డైరెక్టర్ : రామ్‌దూత్ అప్పరెల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్,** తండ్రి : లేటు ఎస్. అప్పన్న, డి.నెం.2–38ఎ, రామాలయం వీధి, చౌడువాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

మెషినరీ వివరములు

వ.నెం.	ఐటమ్‌ల వివరములు	నెం.
1	Eastman EC-3NL	1
2	Eastman 629"8" Straight Knife Cutting Machine	1
3	Hashima HP - 450 ms Fusing Press	1
4	Jack JK - 8560 WPL Sewing Machine with Complete set	2
5	Juki MS 1190MF - AA Sewing Machine with Complete set and std ace	1
6	Kansai DFB 1404 PSF Industrial Sewing Machine with Complete set and std	1
7	SGPB - 06 Duo Auto Seam Generator	1
8	SGVT 125 x 80 N Potable Vaccum Iron Table	4
9	ES - 300 Silver Star	2
10	ES - 300 Teflon Shoe	2
11	Juki DDL - 8100 EB - AAP Sewing Machines with Complete set	30
12	JUki DDL - 900 BSWBK - AA Sewing Machine with Complets set	2
13	Juki DLM5200ND-ACP Sewing Machine with Complete set	1
14	Juki M06816SDE430HE35/SM55A/KE10A Sewing Machine with Complete set and std acces	2
15	Juki LK-1903BNSS301/MC672KNN-AA4 Sewing Machine with Complete set	1
16	Juki LBH-1790ANS/MC602KN Sewing Machine with Complete set and std acc	1
17	Juki LK - 1900BNSS000/MC672K NN-AA4 Sewing Machine with Complete set and std acc	1
18	Line Centre Table of size 8x2x2.5 ft.,	10
19	Stool Model ST 02 03 ft	42
20	Inspection Table 4x3x3 ft	2
21	Spreading Table 8.4" 1.8"09 mtr	1
22	END Line Checking Table	1
23	62.5 Kva KOEL Green DG Sets with acoustic enclouser Engine No:T4- 8907 - 1820514 Altmo: LBS3K18C40764 Kirloskar	1

రిజర్వు ధర : రూ.17,82,000/– ధరావత్తు : రూ.1,78,200/– బిడ్ పెంపుదల : రూ.10,000/–

ఇ-వేలం తేది : 21-07-2025 సమయం : ఉ।। 11.00 గం।।ల నుండి సా।। 04.00 గం।।ల వరకు

నియమ నిబంధనలు : 1) మెషినరీ ఖచ్చితంగా "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు " అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు మెషినరీ అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకతతో ఆధార్ కార్డు / ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. ఇవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 5) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 6) తేది. 05-07-2025 నుండి 20-07-2025 వరకు బ్యాంక్ పనివేళలలో మెషినరీ తనిఖీ చేసుకోగలరు. మెషినరీ తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 8099444378 & 9666909050. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 – 8291220220, Mail ID: support.baanknet@psballiance.comను సంప్రదించండి.

తేది: 03-07-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/– అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ׀ 4 ׀ జూలై ׀ 2025

అప్రమత్తతతో రక్తహీనత దూరం

రక్తహీనత వల్ల మేత మానేసి పశువులు బలహీనంగా మారతాయి. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి సూచిస్తున్నారు. 8లో ▸

ఆటో, బ్యాటరీల దొంగల అరెస్ట్

ఆటోలు, బ్యాటరీ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.23 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

దోమలపై దండెత్తరే?

వర్షపు నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమల విజృంభణతో విష జ్వరాల బెడద ఆందోళనకు గురిచేస్తోంది. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు భీమవరంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

చినమిల్లి వెంకటరాయుడు

భీమవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిన వైనాన్ని ప్రజలకు తెలియజేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు చెప్పారు. భీమవరం పట్టణంలోని ఆనంద్ ఇన్ ఫంక్షన్ హాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వెంకటరాయుడు పిలుపునిచ్చారు.

బడి ఈడు పిల్లలు తప్పక బడిలో ఉండాలి

మాట్లాడుతున్న డీఈఓ నారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి పాఠశాల పరిధిలో బడి ఈడు పిల్లలు తప్పక బడిలో ఉండాలని, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని డీఈఓ నారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల సమయానికే ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై ఇన్‌టైంలో అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సబ్జెక్టు వారీగా టీచర్ హ్యాండ్ బుక్స్ త్వరలోనే అందజేస్తామని, ఈనెల 10న జరగబోవు మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు తల్లిదండ్రులు అందరూ హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఎంఈఓలు వి.హనుమ, పీఎం కే జ్యోతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.సత్యనారాయణ, శ్రీనివాస్, కనకదుర్గ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆ ఫోన్ కాల్స్ నమ్మకండి

భీమవరం (ప్రకాశంచౌక్): కమిషనర్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు చెల్లించాలని ఫోన్ చేస్తే తక్షణమే వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీ ద్వారా పురపాలక సంఘ అధికారులకు గానీ పోలీసులకు తెలియజేయాలని పురపాలక సంఘ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భీమవరం పురపాలక సంఘ పరిధిలో గల కొన్ని వార్డుల్లోని కమర్షియల్ ప్రాంతాల్లో దుకాణాల యజమానులకు 91210 97923, కొన్ని ఇతర నెంబర్ల నుంచి కమిషనర్ పేరుతో ఫోన్ చేసి ఈ ట్రేడ్ లైసెన్సులు రుసుము చెల్లించాలని లేకుంటే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులు పాల్పడుతున్నారని, అటువంటి వాటిని నమ్మవద్దని తెలిపారు. చెల్లించాల్సిన ఈ–ట్రేడ్ లైసెన్స్ బకాయిలు నేరుగా భీమవరం పురపాలక సంఘ కార్యాలయము నందు గాని లేదా సమీప వార్డు సచివాలయం నందు గాని చెల్లించాలని కోరారు.

పరిశ్రమల స్థాపనకు వాట్సాప్ సేవలు

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గవర్నెన్స్ మనమిత్ర యాప్ 95523 00009 ద్వారా పరిశ్రమలకు సంబంధించి అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. జిల్లాలో మే 27 నుంచి ఇప్పటివరకు వివిధ శాఖల అనుమతుల కోసం 465 దరఖాస్తులు అందగా, వాటిలో 458 దరఖాస్తులను ఆమోదించామని, మరో 7 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు.

ఐచ్ఛిక సెలవుల కోసం వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు క్యాలెండర్ సంవత్సరం ప్రకారం ఐచ్ఛిక సెలవులకు అనుమతులివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు ఫ్యాప్టో నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 5వ తేదీన మొహర్రం, అక్టోబర్ 9న యజ్‌దహుకు షరీఫ్, నవంబర్ 5న కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 26న బాక్సింగ్ డేలను పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవులకు అనుమతులివ్వాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫ్యాప్టో ఛైర్మన్ జీ మోహన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బాబు వంచనపై పోరుబాట

దగాపై ధర్మాగ్రహం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరిట వైఎస్సార్ సీపీ నిలదీత
- నేడు జిల్లాస్థాయి సమావేశాలకు రీజనల్ కోఆర్డినేటర్ బొత్స హాజరు
- ఉదయం కొండలరావుపాలెంలో ఏలూరు జిల్లాస్థాయి..
- మధ్యాహ్నం భీమవరంలో 'పశ్చిమ' జిల్లాస్థాయి సమావేశం
- రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో ఆవిష్కరణ
- ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి ప్రభుత్వం వంచనపై ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాటకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలుగాని, సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయని వైనంపై ప్రజా క్షేత్రంలో నిరంతర ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీ పిలుపుమేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో ఉమ్మడి పశ్చిమగోదావరిలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా జిల్లాస్థాయి సన్నాహక సమావేశాలు శుక్రవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ రెండు జిల్లాలో జరిగే సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు.

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న కార్యక్రమంపై సన్నాహక సమావేశం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు భీమవరంలోని ఆనంద్ ఇన్‌లో నిర్వహించనున్నారు. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్ర, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు మేకా వెంకట ప్రతాప అప్పారావు, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, మామిళ్ళపల్లి జయప్రకాష్, కంభం విజయరాజుతోపాటు పార్టీ ముఖ్యులు, మండల నియోజకవర్గ నేతలు పాల్గొంటారు. అలాగే మధ్యాహ్నం పశ్చిమగోదావరిలో జరిగే సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుతో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నియోజకవర్గ సమన్వయకర్తలు గుడాల గోపి, చినిమిల్లి వెంకట్రాయుడు, పీవీఎల్ నర్సింహరాజుతో పాటు పార్టీ ముఖ్యులు హాజరుకానున్నారు.

దెందులూరులో టీడీపీ చిల్లర రాజకీయాలు

ఏలూరు జిల్లా స్థాయి సమావేశాన్ని అడ్డుకోవడానికి అధికార టీడీపీ చిల్లర రాజకీయాలకు తెరతీసింది. తొలుత పెదపాడు మండలంలోని వట్లూరులోని శ్రీకన్వెన్షన్‌లో సమావేశాన్ని ఖరారు చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి చిల్లర రాజకీయాలతో కన్వెన్షన్ నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చి సమావేశాన్ని అక్కడ జరగకుండా అడ్డుకున్నారు. అలాగే మరో రెండు ఫంక్షన్ హాల్స్‌కు కూడా ముందుస్తు హెచ్చరికలు జారీ చేసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో వేదికను పెదవేగి మండలంలోని కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో ఆవిష్కరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించడానికి వీలుగా రెండు జిల్లాల్లో జరిగే సమావేశాల్లో మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమం నిర్వహించాల్సిన తీరు విధి విధానాలపై శ్రేణులకు వివరించనున్నారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలు, రాష్ట్రస్థాయిలో లెక్కకు మించిన హామీలు, జిల్లా స్థాయిలో పదుల సంఖ్యలో హామీలిచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం, చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత రాజకీయాలు, ఎన్నికల సమయంలో ప్రతి పథకానికి ఎంత నగదు కుటుంబానికి జమ అవుతుందో వివరిస్తూ టీడీపీ ఇచ్చిన ఎన్నికల బాండ్ల మోసాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించేలా ఐదు వారాలు పాటు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా 4వ తేదీన దెందులూరు, 5న చింతలపూడి, పోలవరం, 6న నూజివీడు, 7న ఉంగుటూరు, 8న కైకలూరు, 10వ తేదీన ఏలూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా పార్టీ ముఖ్యులు నిర్ణయించారు.

తీరంలో తాగునీటికి కటకట

మర్రితిప్పలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

నరసాపురం రూరల్: నరసాపురం మండలం మరితిప్ప గ్రామంలో కాలనీలో గత 8 నెలలుగా తాగునీరు అందకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కౌరు పెద్దిరాజు విమర్శించారు. గురువారం ఈ సమస్యపై స్థానిక ప్రజలు కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ బలహీన వర్గాల కాలనీ ప్రజలకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతంలో ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. వర్షాకాలంలో కూడా తాగునీటి సమస్యను పరిష్కారం చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. తక్షణం తాగునీటి సమస్య పరిష్కారం కాకపోతే గ్రామ సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యురాలు గుబ్బల జయలక్ష్మి, నాగళ్ల వరలక్ష్మి, గుబ్బల లక్ష్మి, దాసరి పద్మ, గుబ్బల మౌనిక, గంగుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటన

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటనలో భాగంగా బృంద సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో డీపీఓ రామ్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణిని కలిసి మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ పంచాయతీలు ఎంపికలో భాగంగా జిల్లాలో 25 గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రోజుకి రెండు గ్రామాల చొప్పున జిల్లాలోని 25 గ్రామాల్లో 20 రోజులు ఈ బృందం పర్యటిస్తోందన్నారు.

బాబు ష్యూరిటీ అన్నారు.. మోసం గ్యారంటీ చేశారు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు మోసం గ్యారంటీ అన్నట్టుగా సాగుతున్న కూటమి ప్రభుత్వ ఏడాది మోసపూరిత పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్టు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమం అందిస్తామంటూ బాండ్లు పంపిణీ చేసి ప్రజల్ని నిఖార్సుగా మోసం చేశారని మండిపడ్డారు. అధికారమే పరమావధి అన్నట్లుగా ఇష్టానుసారంగా హామీలు గుప్పించి ప్రజల్ని నిట్టనిలువునా మోసం చేశారని, ఈ విషయం ప్రజలకు కూడా అర్థమైందని స్పష్టం చేశారు. అందుకే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం నుంచి కూటమి పాలన, కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సిద్ధమైనట్లు చెప్పారు.

అప్పులతో రాష్ట్రం అథోగతి

ఏడాది పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండానే మంగళవారం వస్తే చాలు గనులు, కార్పొరేషన్‌లు తాకట్టు పెట్టి అప్పులు చేసే స్థితికి ఆంధ్ర రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశారని కారుమూరి దుయ్యబట్టారు. ఏడాది కాలంలో రూ.1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఆ సొమ్మంతా ఏమైందని ప్రశ్నించారు. 93 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని దోపిడీ చేస్తున్నారని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాహాటంగా అన్నారని, ఈ విషయాన్ని పచ్చమీడియా కూడా చెబుతుందన్నారు. మద్యం, ఇసుక, బెల్టు షాపులు, పనికి ఆహార పథకంలో ఇష్టానుసారంగా దోపిడీకి పాల్పడుతూ అందిన కాడికి రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని అన్నారు. ప్రజల్లోకి వెళ్తున్నట్లుగా తూతూమంత్రంగా తిరుగుతున్నారని, కొందరు ఎమ్మెల్యేలు ఇతర దేశాలు వెళ్లిపోయారనే విషయం ప్రజలకు తెలుసన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల రూ.3.35 లక్షల కోట్లు అప్పుచేసి ప్రజలకు నేరుగా సంక్షేమాన్ని అందించారని, కూటమి ప్రభుత్వం చేసిన అప్పులతో ఒక్క సంక్షేమ పథకం కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కొత్తరకం దోపిడీలో భాగంగా పనికి ఆహార పథకం, ఇసుక, పేకాట క్లబ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లను ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా ఆదాయ వనరుగా చేసుకున్నారని అన్నారు.

తణుకులో ప్రాణాలు బలిగొంటున్నారు

తణుకు ఎమ్మెల్యే నియోజకవర్గంలో వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా దోపిడీకి మాత్రమే పాల్పడుతున్నామని కారుమూరి విమర్శించారు. ప్రతి పనికీ ఆర్‌కే ట్యాక్స్ వేస్తూ ధనార్జనే లక్ష్యంగా సాగుతున్నారన్నారు. ఒక పక్క పశువధ, మరోపక్క పనికి ఆహార పథకంలో మస్తర్ల మోళీ, మద్యంలో కమీషన్లు, పేకాట, బెట్టింగ్‌లు, గంజాయి మారకంలో కమీషన్లతో జోగుతున్నారని ఎద్దేవా చేశారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో సైతం ఆర్‌కే ట్యాక్స్ వేస్తున్నారని, ఏ కార్యాలయానికి వెళ్లినా ఎమ్మెల్యేని కలవాలని అధికారులు చెబుతుండటాన్ని టీడీపీ నాయకులే బాహాటంగా చెబుతున్నారన్నారు. సంక్రాంతికి రోడ్లు వేసేస్తామన్న కూటమి నేతలు తణుకులో ప్యాచ్ వర్కులు తప్ప మరేమీ చేయలేకపోయారని, గత ప్రభుత్వంలో టెండరు పూర్తయిన పనులే ప్రస్తుతం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉండ్రాజవరం జంక్షన్, ఉండ్రాజవరం రోడ్డులో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, రెండు రోజుల క్రితం ఓ తాపీమేస్త్రి జారిపడి లారీ కింద పడి చనిపోవడం బాధాకరమని, ఇలానే ఇటీవల మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. గోతులు ఇప్పుడు పూడుస్తున్నారని.. ముందు ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో టిక్‌టాక్‌లపై పెట్టిన శ్రద్ధ ప్రజలకు సుపరిపాలన అందించడంలో చూపించాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పార్టీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): కొల్లేరును 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉరితాడుగా మారిన 120 జీఓను రద్దు చేయాలని, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిని కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన గురువారం కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వారు కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజలకు హానికరమైన ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. మూడో కాంటూరు నుంచి ఐదో కాంటూరు వరకు పది కిలో మీటర్ల దూరంలో సున్నితమైన పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలు విధించి మొత్తం కొల్లేరును పూర్తిగా అటవీ శాఖ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేటి ప్రాంతంలోని 89 గ్రామాలపై పడుతుందన్నారు. అధికారులు తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

కాంట్రాక్టర్లకు బిల్లుల బెంగ

- కాంట్రాక్టర్లకు రూ.33.50 కోట్ల బకాయిలు
- అన్న క్యాంటీన్ ఆధునికీకరణ పనులకూ బిల్లుల్లేవు
- కొత్త పనులు చేసేందుకు ముందుకు రాని వైనం
- భీమవరం మునిసిపాలిటీలో కుంటుపడిన అభివృద్ధి

అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్న డ్రెయిన్

భీమవరం (ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఏడాది కాలంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలోనే పెద్ద మునిసిపాలిటీ, గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉన్న భీమవరం మునిసిపాలిటీకి పుష్కలంగా నిధులు ఉన్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. భీమవరం మునిసిపాలిటీలో రెగ్యులర్‌గా పనులు చేసే కాంట్రాక్టర్లు 30 మంది వరకు ఉన్నారు. ఒక్కొక్క కాంట్రాక్టరుకు రూ.లక్షల్లో బిల్లులు బకాయి ఉండడంతో మళ్లీ పనులు చేసే పరిస్థితి వారి దగ్గర లేదు. ఇక్కడ కాంట్రాక్టర్ల బిల్లులు బకాయిలు చూసి బయట కాంట్రాక్టర్లు సైతం భీమవరం మునిసిపాలిటీ అంటేనే బిల్లులు రావు అని భయపడుతున్నారు.

ఏడాదిగా చెల్లింపు నిల్

గత ప్రభుత్వంలో చివరి ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది కాలంలో ఒకటి రెండు పనులు కలుపుకుని భీమవరం మునిసిపాలిటీలో చేసిన 446 పనులకు సంబంధించి రూ.33.50 కోట్లు బిల్లుల బకాయి ఉంది. అందులో మునిసిపాలిటీ సాధారణ నిధులతో చేసిన 111 పనులకు సంబంధించి రూ.16 కోట్లు, మెయింటెనెన్స్ నిధులతో చేసిన 222 పనులకుగాను రూ.5 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన 7 పనులకుగాను రూ.2.5 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్లకు బిల్లుల బకాయిల చెల్లింపులో కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. దీంతో పట్టణంలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఆఖరికి డ్రెయిన్ల బాగుచేత పనులు సైతం జరగడం లేదు. వాటికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. పెండింగ్ బిల్లులు కోసం నిత్యం మునిసిపాలిటీ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు.

అన్న క్యాంటీన్ల ఆధునికీకరణ బిల్లులు లేవు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భీమవరం పట్టణంలో మూడు అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించడానికి వాటి ఆదునికీకరణ పనులను కాంట్రాక్టర్లు చేత చేయించింది. మూడు క్యాంటీన్‌లలో రెండు రూ.6 లక్షల చొప్పున, ఒకటి రూ.8 లక్షలతో అభివృద్ధి చేయించింది. వాటి బిల్లులు రూ.20 లక్షలు కూడా చెల్లించలేదు.

గత ప్రభుత్వంలో రూ.130 కోట్ల పనులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతకు ముందు టీడీపీ ప్రభుత్వంలో తీర్మానం చేసిన పనులకుగాను ఏడాది కాలంలోనే రూ.30 కోట్లు చెల్లించారు. సకాలంలో వారికి బిల్లులు చెల్లించడంతో గత 5 ఏళ్ల పాలనలో భీమవరం మునిసిపాలిటీలో రూ.130 కోట్ల పనులను కాంట్రాక్టర్లు పూర్తిచేశారు. ప్రస్తుతం భీమవరం మునిసిపాలిటీకి కోట్ల ఆదాయం ఉన్నా బిల్లులు చెల్లించడానికి కూటమి ప్రభుత్వానికి మనస్సు రావడం లేదు. ఇదే తీరు కొనసాగిస్తే మునిసిపాలిటీ అభివృద్ధి తిరోగమనం పడుతుంది. కాంట్రాక్టర్లు కడుపు మండి రోడ్డు ఎక్కే పరిస్థితి రాకముందే వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వారికి వెంటనే బకాయిలు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

అప్పుల ఊబిలోకి కాంట్రాక్టర్లు

బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

కూటమి ప్రభుత్వం బిల్లుల చెల్లించకుండా వ్యహరిస్తున్న తీరుతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వడ్డీకి అప్పు తెచ్చి చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోయేసరికి తీసుకున్న అప్పు తీర్చడానికి మరో అప్పు చేయడం ఇలా సతమతం అవుతున్నారు. కొందరు ఇంటిలో బంగారం, ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బుతో పనులు పూర్తిచేశారు. బిల్లులు రాకపోవడంతో తనఖా పెట్టిన బంగారం, ఆస్తుల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు.

పట్టిసీమ నీరు విడుదల

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం నీటిని విడుదల చేశారు. ముందుగా 24 పంపులకు పూజలు నిర్వహించి కుడి కాలువలోకి నీరు విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం రెండు పంపుల ద్వారా కుడి కాలువలోకి నీరు విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి విడుదలను క్రమేపీ పెంచే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు.

నేడు మునిసిపల్ కార్మికుల మహాధర్నా

ఏలూరు (టూటౌన్): విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న మహాధర్నాకు మునిసిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, పారిశుధ్య విభాగం వారికి 17 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఉదయం 10 గంటలకు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఈ మహాధర్నా జరుగుతుందని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

సోలార్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు

గుబ్బల మంగమ్మ గుడి వద్ద సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని ప్రసిద్ధ గుబ్బల మంగమ్మ గుడికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సోలార్ ద్వారా లైట్స్, ఫ్యాన్‌లు, సీసీ కెమెరాలతోపాటు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి కొర్సా గంగరాజు మాట్లాడుతూ తెల్లవారుజామునే ఇక్కడికి చేరుకునే భక్తులు చీకటిగా ఉండడంతో మంగమ్మతల్లిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో టెల్ టవర్స్ సోలార్ కంపెనీ ద్వారా మంగమ్మతల్లి ఆలయం వద్ద సోలార్ కరెంట్ సదుపాయం, సీసీ కెమెరా, ఫ్యాన్‌లు, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

14 నెలల తర్వాత బంగారం చోరీపై కేసు నమోదు

కైకలూరు: బంగారు గాజులు చోరీ జరిగిన 14 నెలల తర్వాత ఓ మహిళ కైకలూరు రూరల్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. రామవరం గ్రామానికి చెందిన సోము సీతామహాలక్ష్మి(62) భర్త ఆరేళ్ల క్రితం మరణించాడు. కుమారుడు ఇతర ప్రాంతంలో ఉంటాడు. ఆమె ఇంటి వద్ద కిరాణా దుకాణం నడుపుతోంది. అయితే 2024 ఫిబ్రవరి 13న ఆమె రెండు బంగారు గాజులు గల్లా పెట్టెలో వేసి స్నానానికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసుకునేసరికి కనిపించలేదు. కొన్నాళ్లు వెతికి ఊరుకుంది. ఇటీవల కుమారుడు ఇంటికి రావడంతో అతడికి విషయం చెప్పింది. దీంతో అతని సలహా మేరకు ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు రూరల్ ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై బ్లేడుతో దాడి

భీమవరం: స్థానిక టూ టౌన్ ఏరియా బైపాస్ రోడ్డు దగ్గర ఓ వ్యక్తిని బ్లేడుతో గొంతుకోసిన సంఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంకపేటకు చెందిన సీహెచ్ సాయిబాబు, ఎస్‌కే వినోద్ ఇద్దరూ ఓ చోట మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో ఇద్దరూ సరదా కబుర్లతో కోడిగుడ్లు విసురుకున్నారు. అంతలోనే వినోద్ కోపోద్రిక్తుడై బ్లేడుతో సాయిబాబు గొంతు కోసి పారిపోయాడు. బాధితుడు ప్రస్తుతం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ జి.కాళీచరణ్, పోలీసులు బృందాలుగా వెళ్లి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

దోమలపై దండెత్తరే?



పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో ఇండస్ట్రియల్ ఏరియా, చినరంగనిపాలెం, బందరుపుంత, గంగమ్మగుడి ఏరియా, హౌసింగ్‌బోర్డు కాలనీ, మెంటే వారితోట, టిడ్కో ప్లాట్లు తదితర డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల మురుగునీరు నిలిచిపోయి అపారిశుధ్యంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. తమ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని, వారం పది రోజులకు డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నిర్మూలనకు పురపాలక సంఘం రూ. 10 లక్షలు బడ్జెట్‌లో కేటాయిస్తుండగా నివారణ చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయంటున్నారు. దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

- ప్రతికూల వాతావరణంలో పడకేసిన పారిశుధ్యం
- గతంలో దోమలపై దండయాత్ర పేరిట హడావుడి చేసిన టీడీపీ ప్రభుత్వం

అండలూరులో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

సాక్షి, భీమవరం : ప్రస్తుతం రుతుపవనాల రాకతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా పట్టణాలు, పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ జరుగుతున్న దాఖలాలు లేవు. ఎక్కడికక్కడ డ్రెయినేజీలపై గడ్డి, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమల విజృంభణతో విష జ్వరాల బెడద ఆందోళనకు గురిచేస్తోంది. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాలు, ఆకివీడు నగర పంచాయతీల్లో దోమల నిర్మూలన పేరిట రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 409 పంచాయతీలు ఉండగా పెద్ద పంచాయతీల్లో రూ.రెండు లక్షలు వరకు, చిన్న పంచాయతీల్లో రూ. 25 వేలు నుంచి రూ. లక్ష వరకు వెచ్చిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రూ. 5 కోట్లకు పైగానే కేటాయిస్తున్నట్టు అంచనా.

కానరాని నిర్మూలన చర్యలు

దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా లార్వా దశలోనే వాటిని నిర్మూలించేందుకు డ్రెయినేజీలు, నీరు నిల్వ ఉండే ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయించి ఆయిల్ బాల్స్, కెమికల్స్ స్ప్రేయింగ్, సాయంత్ర వేళల్లో ఫాగింగ్ చేయించాలి. డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగునీరు పారే విధంగా ప్రతిరోజూ శుభ్రం చేయించాలి. క్షేత్రస్థాయిలో ఈ చర్యలు తూతూమంత్రంగానే ఉంటున్నాయి. నిధుల లేమితో పంచాయతీల్లో ఫాగింగ్ ఊసే ఉండటం లేదు. పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం పట్టణాల్లోనూ ఫాగింగ్ జరగడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో పట్టణాలు, గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దండయాత్ర ఊసేది?

'దోమలపై దండయాత్ర' అంటూ గతంలో టీడీపీ అధికారంలో ఉండగా సీఎం చంద్రబాబు హడావుడి చేసిన విషయం విధితమే. పట్టణాలు, గ్రామాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడం, తుప్పలు తొలగించడం, చెత్తను ఎత్తడం తదితర కార్యక్రమాలకు అప్పట్లో పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడికక్కడ ప్రచార ఆర్భాటంగానే దండయాత్ర సాగింది. పారిశుధ్య కార్మికులతో పనులు చేయించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీలు చేయించి మమ అనిపించడంతో అప్పట్లో ఈ కార్యక్రమంపై విమర్శలు వెల్లువెత్తాయి.

రోజుకు రూ.50 లక్షలకుపైగా ఖర్చు

జిల్లా జనాభా 18.48 లక్షలు. అర్బన్, రూరల్ ఏరియాల్లో నాలుగు లక్షలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. దాదాపు 4.62 లక్షల కుటుంబాలు నివసిస్తుండగా ఉపాధి కోసం ఒరిస్సా, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు మరో లక్షకు పైగా ఉంటారు. దోమల బెడద నుంచి ఉపశమనం కోసం కాయిల్స్, స్టిక్స్, కెమికల్స్ తదితర వాటిపై సగటున ఒక్కో కుటుంబం రోజుకు రూ.10 చొప్పున జిల్లావ్యాప్తంగా రూ.50 లక్షలకు పైగానే వెచ్చిస్తున్నట్టు అంచనా. ఇప్పటికైనా మున్సిపల్, పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ ద్వారా దోమల నిర్మూలన చర్యలు చేపట్టేవారు. డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్, స్ప్రేయింగ్ చేయించేవారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ జరిగేది. జ్వరపీడితులను గుర్తించేందుకు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందితో ఇంటింటా ఫీవర్ సర్వే చేయించి రోగులకు వైద్య సాయం అందించేవారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై వలంటీర్లతో ఇంటింటా అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు కానరావడం లేదని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

దోమల బెడద ఎక్కువగా ఉంది

భీమవరం టిడ్కో ప్లాట్లలో నివాసం ఉంటున్నాం. మా ప్రాంతంలో దోమలు బెడద ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంగాని, నివారణ చర్యలు తీసుకోవడం లేదు. దోమలతో రాత్రిళ్లు కంటిమీద కునుకు ఉండటం లేదు. రాత్రిళ్లు రెండు కాయిల్స్ వెలిగిస్తున్నా తర్వాత మామూలుగా వచ్చేస్తున్నాయి.

– వై.వీర్రాజు, భీమవరం

డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు

వర్షాకాలం కావడంతో ప్రస్తుతం దోమలు బెడద చాలా ఎక్కువగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వర్షాకాలంలో డ్రెయిన్లు శుభ్రం చేసేవారు. దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా చల్లేవారు. ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

– నలభ పోతురాజు, ఎ.ఆఆర్‌పీ అగ్రహారం

అగ్గిపుల్లపై అల్లూరి

ఏలూరు (టూటౌన్) : అల్లూరి సీతా రామరాజు జయంతిని పురస్కరించుకుని ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ అగ్గిపుల్లపై ఆయన చిత్రాన్ని నిర్మించి అబ్బుర పరుస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆయా నాయకుల చిత్రాలను తనదైన శైలిలో నిర్మించి నివాళులర్పించడం సురేష్‌కు పరిపాటి. ఈ క్రమంలోనే ఈ నెల 4వ తేదీ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని అగ్గిపుల్లపై నిర్మించి నివాళి అర్పించారు.

ఏలూరులో ఈగల్ టీమ్ తనిఖీలు

ఏలూరు రైల్వే స్టేషన్‌లోతనిఖీలు చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : గంజాయి, మత్తు పదార్థాల రవాణా అడ్డుకునేందుకు ఈగల్ టీమ్, రైల్వే పోలీస్, జిల్లా పోలీస్ సంయుక్తంగా గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవికృష్ణ స్వయంగా తనిఖీల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఈగల్ టీమ్ ఎస్పీ నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, అదనపు ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు ఉన్నారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో రైల్వే స్టేషన్‌లో క్షుణ్ణంగా తనికీలు చేశారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైళ్ళలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, రైల్వే పోలీస్ డీఎస్పీ రత్నరాజు, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలి

ఎస్వీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వనట చక్రవర్తి స్వర్గీయ ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ఎస్వీ ఆర్ సర్కిల్‌లో గురువారం ఎస్వీ రంగారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్వీఆర్ సేవా సమితి అధ్యక్షుడు భోగిరెడ్డి రాము మాట్లాడుతూ తెలుగు సినీ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పిన తొలి తెలుగు నటుడు ఎస్వీ రంగారావు అని కొనియాడారు. కాపునాడు అధ్యక్షుడు మాకా శ్రీనివాసరావు మాట్లాడుతూ అద్భుత నటనతో ప్రపంచాన్ని మెప్పించిన నటుడు ఎస్వీ రంగారావుకు తక్షణమే భారత రత్న అవార్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎస్వీ రంగారావు సర్కిల్ నుంచి ర్యాలీగా పోస్టాఫీస్ వరకు చేరుకున్నారు. భారతరత్న ఇవ్వాలనే విన్నపాన్ని రిజిస్టర్ పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ అడ్రస్‌కు పంపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, బండి రామస్వామి, గంధం రాజశేఖర్, జంగా రామ్‌రాయ్, పి.కుమార్‌స్వామి, సామినేటి రంగారావు, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బ్యాటరీల దొంగల అరెస్ట్

10 ఆటోలు, 65 బ్యాటరీల స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆటోలు, బ్యాటరీ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి సుమారు రూ. 23 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నటు ఏఎస్పీ వి భీమారావు చెప్పారు. గురువారం భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వీరవాసరం గ్రామానికి చెందిన కంచర్ల శ్రీరామ్‌కుమార్ లారీలను కిరాయికి తిప్పుతుంటాడు. ఈ క్రమంలో పట్టణంలోని మెంటేవారితోట బైపాస్ రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద జూన్ 14న తన మూడు లారీల పార్క్‌చేసి ఉంచగా వాటిలోని 6 బ్యాటరీలు దొంగిలించారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ కేసులో పట్టణానికి చెందిన తీగల నరేంద్రభవాని, పైలా రాకేష్, యలగడ కోదండశివసాయివెంకట సత్యనారాయణలను అదుపులోనికి తీసుకుని విచారించగా భీమవరం వన్ టౌన్, భీమవరం టూ టౌన్, కాళ్ల, ఆకివీడు, ఉండి, వీరవాసరం, పాలకోడేరు పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగిలించిన 65 బ్యాటరీలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. దీంతో వారి వద్ద నుంచి సుమారు రూ. 6 లక్షల విలువైన 65 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ భీమారావు చెప్పారు.

ఇద్దరు ఆటోల దొంగల అరెస్టు

భీమవరం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఇటీవల ఆటో దొంగతనాలు ఎక్కువ జరగడంతో భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 2న కృష్ణా జిల్లా మండవల్లి మండలం పేరికిగూడెం గ్రామానికి చెందిన పరస నాగరాజును అరెస్ట్ చేసి విచారించారు. విచారణలో భీమవరం పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ఆకివీడు, అమలాపురం, వైజాగ్ వన్‌టౌన్, టూటౌన్, మండవల్లి ప్రాంతాల్లో 13 ఆటోలను దొంగతనాలు చేశానని నేరం అంగీకరించారు. దీంతో నాగరాజుతో పాటు అనకాపల్లి మండలం సబ్బవరం గ్రామానికి చెందిన పోలిశెట్టి గణేష్‌లను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 17 లక్షల విలువైన 10 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ భీమారావు చెప్పారు. సమావేశంలో భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, ఎస్సై కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

WANTED P.E.T.s
A well reputed School at Kaikaluru, Eluru (Dist) requires the following vacancies.
P.E.T. Male (1), Female (1)
Salary: 20.000/- to 25,000/-
Interested candidates can come directly to School with resume with in seven days.
TVNRM NATIONAL SCHOOL
Kaikaluru, Eluru Dist, AP-521333 ✆ 6303 602 774

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005740]

Services
జ్యోతిష్యాలయం
■కేరళ భగవతీ భద్రకాళి మాంత్రిక జోతిష్యం ప: వి.ఫణికర్, స్త్రీ/పు వశీకరణం, ప్రేమ పెళ్ళి, సంతానం, శతృబాధ, ప్రేమలో మోసపోవడం మీ ఎటువంటి కఠిన నిఘూడ వ్యక్తిగత గుప్త సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573872341 [SCA25005839]

Wanted
■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]
■ప్రముఖ కంపెనీవారి వ్యవసాయ ఉత్పత్తులు మండలాల వారిగా జీతం / కమీషన్‌పై పని చేయుటకు అనుభవం ఉన్న అభ్యర్థులు కావలెను. Qly 10th-డిగ్రీ జీతం 10-20 వేలు. 8885191948 [SCA 25005848]
■ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-629]
■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి
www.sakshi.com

ఇంటి స్థలం వివాదం.. ఇద్దరిపై దాడి

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరొకరి చేతికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోనాల నాగేంద్రబాబు(34), బోనాల దశరథ రామాంజనేయులు ఇద్దరూ అన్నదమ్ములు. వీళ్లతో పాటు వాళ్ల బాబాయ్ బోనాల శ్రీనివాసరావులకు కలిపి ఏడు సెంట్ల ఇళ్ల స్థలం ఉంది. దీనిలో చెరి సగం కాగా బోనాల శ్రీనివాసరావు మొత్తం నాదేనంటూ బోనాల నాగేంద్రబాబు, దశరథ రామాంజనేయులను రానీయడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇళ్ల స్థలంలోకి వెళ్లగా బోనాల శ్రీనివాసరావుతో పాటు అతని కుమారులు, భార్య కలిసి నాగేంద్రబాబు, బోనాల దశరథ రామాంజనేయులపై కత్తితో దాడి చేసి కొట్టారు. దీంతో నాగేంద్రబాబుకు తలపై తీవ్ర గాయమైంది. దశరథ రామాంజనేయులకు చేతిపై దెబ్బ తగిలింది. దీంతో స్థానికులు వారిని హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

51 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం వద్ద నిందితుడు, విజిలెన్స్ అధికారులు

నూజివీడు: పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ట్రక్కు వాహనంలో తరలిస్తున్న అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. వారికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బైపాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో 51 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ బియ్యం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట ఏరియా నుంచి హనుమాన్ జంక్షన్‌కు రవాణా చేస్తున్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యాన్ని సీజ్ చేశారు. వాహన డ్రైవర్ నక్కా శివ, రేషన్ బియ్యం సరఫరాదారులు ధనికొండ గోపిరాజు, ధనికొండ గణేష్, వారికి సాయం చేస్తున్న ఖాసీంబాబు, వాహన యజమాని నక్కా నాగగోపాలకృష్ణలపై 6ఏ, 7(1)కేసులను నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్సై నాగరాజు, హెచ్‌సీ వెంకటేశ్వరరావు, సీఎస్ డీటీ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఉపాధ్యాయుడి మృతి

ఏలూరు టౌన్: నగరంలోని ఫిల్‌హౌస్ పేటకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నేతల చంద్రశేఖర్ ఆజాద్ (51) రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ తెలిపిన వివరాల ప్రకారం వన్ టౌన్ ఫిల్‌హౌస్ పేటకు చెందిన చంద్రశేఖర్ ఆజాద్ శ్రీపర్రు జెడ్పీ స్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి విజయవాడలోని తన సోదరుడి ఇంటికి వెళ్లేందుకు ఏలూరు రైల్వేస్టేషన్‌లో కాకినాడ–తిరుపతి రైలు ఎక్కాడు. రైలు వట్లూరు సమీపానికి వచ్చేసరికి రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆజాద్ విజయవాడ చేరుకోలేదని తెలియడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులను ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం రైల్వే గ్యాంగ్‌మెన్ ఓ మృతదేహాన్ని గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్సై సైమన్ మృతుడిని గుర్తించి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అప్రమత్తతతో రక్తహీనత దూరం

రక్తహీనతతో బాధపడుతున్న ఆవు

పాడి-పంట

జంగారెడ్డిగూడెం: రక్తహీనత అనేది మనుషులతో పాటు పశువులనూ ఇబ్బంది పెట్టే ప్రధాన వ్యాధి. పశువుల విషయానికి వస్తే ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గడం లేదా హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం వల్ల రక్తంలో ఆమ్లజనకం సరఫరా తగ్గిపోవడం వల్ల రక్తహీనత వేధిస్తుంది. రక్తహీనత వల్ల పశువులు మేత మానేసి, పనిలో బలహీనత ఉంటాయి. దీంతో ఆవులు, గేదెల రోగనిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. రక్తహీనత తగ్గించే చర్యలు చేపట్టి పాడి అభివృద్ధిని మెరుగుపరిచే సూచనలు, సలహాలు పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ వివరించారు.

రక్తహీనత లక్షణాలు

బలహీనత, అలసట, తెల్లబడ్డ లేదా పసుపు కొమ్ములు, మేత, నీరు తీసుకునే అలవాటు తగ్గిపోవడం, శ్వాసకష్టం, బరువు తగ్గడం, పని సామర్థ్యం తగ్గిపోవడం

చికిత్స విధానాలు

- అల్లోపతి విధానంలో : తీవ్ర రక్తహీనతకు రక్త మార్పిడి అవసరం కావచ్చు.
- ఐరన్ లోపం కారణంగా రక్తహీనత ఉన్నప్పుడు ఐరన్ సప్లిమెంట్స్ ఇవ్వాలి.
- కీటకాల నివారణ, పరాన్నజీవాల మీద కట్టడి చేయడం ద్వారా రక్తహీనత నివారించవచ్చు.
- బాక్టీరియా లేదా పకిటీరియా సంక్రమణకు యాంటీబయోటిక్స్ ఇవ్వాలి.

నేచురోపతి విధానంలో..

- పచ్చ కూరలు, ఆకుకూరలు, ఆహారంలో ఇనుము ఐరన్‌ను చేర్చాలి.
- హెర్బల్ చికిత్సా విధానంలో నెటిల్, స్పిరులినా వంటి ఐరన్ అధికంగా ఉన్న ఉత్పత్తులు ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి.
- ఆక్యు పంక్చర్ విధానంలో చికిత్స రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

హోమియోపతి విధానం

ఫెర్రఫోస్ఫోరికమ్ చికిత్సలో రక్తహీనత ప్రారంభ దశలో ఉత్పత్తి స్థాయిలు పెంచడానికి ఉపయోగపడుతుంది. చైనా ఆఫిసినాలిస్ చికిత్సలో రక్త పోత తర్వాత రక్తహీనత ఉన్న జంతువులకు ఇది ఇవ్వవచ్చు. నాట్రమ్ మురియాటికమ్ చికిత్సలో జిగురు తగ్గిన రక్తహీనతకు ఉపయోగపడుతుంది. ఆర్సెనికమ్ ఆల్బమ్ చికిత్సలో తీవ్ర బలహీనత, శ్వాస కష్టం ఉన్న రోగులకి ఇది ఇవ్వవచ్చు.

చికిత్సతో రక్తహీనత దూరం

రక్తహీనతకు సమయానుకూలంగా చికిత్స ఇవ్వడం చాలా ముఖ్యం. అల్లోపతి, నాచురోపతి, హోమియోపతి పద్ధతులను సమ్మిళితం చేసి, వెటర్నరీ డాక్టర్ సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే, రోగం నుంచి కోలుకోవడం సులభం.

– బీఆర్ శ్రీనివాసన్, పశు వైద్యాధికారి

దారి దోపిడీ కేసులో ముగ్గురికి జైలు

పాలకొల్లు సెంట్రల్: దారిదోపిడీ కేసులో ముగ్గురు వ్యక్తులకు పట్టణ కోర్టులో మూడేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం 2024 మే 22న నెక్కంటి నాగ వెంకట సత్య సాయిబాబు అనే వ్యక్తి యలమంచిలి వెళ్లడానికి దిగమర్రు బైపాస్ సెంటర్‌కు వచ్చారు. ఇంతలో నరసాపురానికి చెందిన పి.దుర్గాప్రసాద్, జి.సుబ్రహ్మణ్యం, ఆలమూరుకు చెందిన వి.పృథ్వీ అనే ముగ్గురు యువకులు సాయిబాబా వద్దకు వచ్చి ఎక్కడకు వెళ్లాలని అడిగారు. యలమంచిలి వెళ్లాలని చెప్పడంతో మేము డ్రాప్ చేస్తామని చెప్పారు. బండిపై ముగ్గురు ఉన్నారు కదా? అని అడగ్గా అందులో ఒకరు మిగిలిన ఇద్దరూ ముందు దిగిపోతారని చెప్పి ద్విచక్ర వాహనం ఎక్కించుకున్నారు. కొంత దూరం వెళ్లాక ఎవరూ లేని ప్రదేశంలో పొదల్లోకి తీసుకువెళ్లి సాయిబాబాను కొట్టి అతని వద్ద ఉన్న రెండు కాసులు బంగారు గొలుసు, ఐదు గ్రాముల ఉంగరం, ఒక మొబైల్ ఫోన్, రూ. 600 నగదు తస్కరించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై డి.హరికృష్ణ కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు గురువారం విచారణకు వచ్చింది. జడ్జి లక్ష్మీలావణ్య సాక్షులను విచారించి ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ అరుణకుమారి కేసును వాదించారు.

వృద్ధురాలిపై కుక్క దాడి

యలమంచిలి: మండలంలోని కొంతేరు లేతమామిడితోట ప్రాథమిక పాఠశాల వద్ద వృద్ధురాలు బొంతు మరియమ్మపై గురువారం కుక్క దాడి చేసింది. దీంతో ఆమెకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఉన్న పాఠశాల విద్యార్థులు, మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. నాలుగు నెలల క్రితం గ్రామంలో ఒక పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి సుమారు పది మందిని గాయపరచింది. వరుస సంఘటనల నేపథ్యంలో స్థానిక ఎల్ఎంటీ యూత్ సభ్యులు కుక్కను మట్టుబెట్టారు.

కారు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొండాడ గుప్త

పాలకొల్లు సెంట్రల్: కోనసీమ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లు పట్టణానికి చెందిన బొండాడ వీఎల్ నరసింహారావు గుప్త (51) మృతి చెందారు. గురువారం గుప్త మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం బొండాడ గుప్త పట్టణంలో ఎర్రవంతెన వద్ద దూది పరుపులు వ్యాపారం చేస్తుంటాడు. అతని భార్య దేవి ఇంటి వద్ద ఎంబ్రాయిడింగ్ డిజైన్ మెషీన్ వర్క్ చేస్తుంటారు. మెషీన్ మరమ్మతు రావడంతో రాజమండ్రిలో మరమ్మతు చేయించాలని భార్యాభర్తలిద్దరూ గురువారం వారికి తెలిసిన మిత్రుడి కారు తీసుకుని రాజమండ్రి బయలుదేరి వెళ్లారు. మార్గ మధ్యలో కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలోని ఈతకోట వద్ద కారు ముందు టైరు పంక్చర్ అవ్వడంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్ దాటుకుని ఎదురుగా వస్తున్న మరో కారుని ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో గుప్త అక్కడికక్కడే మృతి చెందగా భార్య దేవి, ఎదురుగా వస్తున్న కారులో వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో క్షతగాత్రులను రాజమండ్రి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా మెకానిక్స్ డే

టూవీలర్ సృష్టికర్త గాట్లెబ్ డైమ్లర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రపంచ టూవీలర్స్ మెకానిక్స్ దినోత్సవాన్ని వల్లీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అత్తిలిలో గురువారం ఘనంగా నిర్వహించారు. టూవీలర్ సృష్టికర్త గాట్లెబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న మెకానిక్‌కు సంఘం తరపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు యడ్లపల్లి నాగేశ్వరరావు, అధ్యక్షుడు వల్లి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోశాధికారి సాయి, కోమద్రు శ్రీను, సుబ్బారావు, రాము, ప్రసాద్, తలారి ప్రసాద్, ఆటోమొబైల్స్‌షాపు ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

నిత్యావసర వస్తువులు , ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సేవా సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక భాగ్యలక్ష్మి పేటలో గురువారం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి అపరేషన్ చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న, బెడ్ రెస్ట్‌లో ఉన్న కంచర్ల శ్రీరామ్‌చంద్రశేఖర్‌కు మానవత సభ్యులు నాలుగు రూపాయల వేలు నిత్యావసర వస్తువులు, రెండు వేలు నగదును అందజేశారు. మానవత అధ్యక్షుడు జనపనేని రాజేంద్ర కుమార్, సెక్రటరీ మిరియాల కిశోర్, బురిడి సతీష్, యెగ్గిన శరత్‌బాబు, పచ్చ వెంకటేశ్వరరావు, కంచర్ల నరసింహారావు, జి.రామకృష్ణ, కేవీ చలం, కర్రి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలను వినియోగించుకోవాలి

కొమ్ముగూడెం సొసైటీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: సహకార సంస్థల సేవలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొమ్ముగూడెం విశాల సహకార పరపతి సంఘం ఆవరణలో సొసైటీ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు సొసైటీలు తక్కువ ధరకు ఎరువులు, పురుగు మందులు, ఇతర నిత్యావసర సరుకులను అందిస్తుందని, రైతులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. సొసైటీల అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీసీసీబీ జనరల్ మేనేజర్ కే.శ్రీనివాస్, ఏజీఎం శంకర్ నారాయణ, పీఐసీ లక్ష్మీకాంతం, సొసైటీ సీఈవో సీహెచ్‌ఎస్‌వీ.కృష్ణ శర్మ, సహకార అధికారులు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.

నన్నయ్య క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ టి.అశోక్, తదితరులు

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్, ఎనలైటికల్ అండ్ ఫార్మస్యూటికల్ డెవలప్‌మెంట్స్ అనే అంశంపై ఈనెల 9, 10 తేదీల్లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలిపారు. దీనికి సంబంధించి గురువారం బ్రోచర్‌ను విడుదల చేశారు. రోవాన్ యూనివర్సిటీ నుంచి కేవీ.రామానుజాచారి, అమెరికా నుంచి డాక్టర్ ఎన్.నాగన్న , చైనా నుంచి ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు , నిట్ వరంగల్ నుంచి రాంబాబు రెడ్డి, నన్నయ్య విశ్వవిద్యాలయం వీసీ తదితరులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా!

ఉప్పరగూడెం - మోదుగ గుంట వెళ్లే రహదారి దుస్థితి

రామన్నగూడెం గ్రామంలో ఆరోగ్యకేంద్రం ఎదురుగా నిలిచిన వర్షపు నీరు

గుంతలు పడిన రహదారులతో ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్ : పూర్తి స్థాయిలో వర్షాలు ప్రారంభం కాకుండానే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రహదారులు అధ్వా నంగా తయారయ్యాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మోదుగ గుంట–ఉప్పరగూడెం, దండగర్ర– మాధ వరం, ఆరుగొలను – నవాబుపాలెం, పెదతాడేపల్లి –జగ్గన్నపేట, జగ్గన్నపేట–కడియద్ద, జగ్గన్నపేట– వెంకట్రామన్నగూడెం, మాధవరం–పట్టెంపాలెం తదితర గ్రామాల ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. పగటి మాట ఎలా ఉన్నా రాత్రి సమయాల్లో ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరే కదా అని ఏ మాత్రం ముందుకెళ్లినా గుంతల్లో వాహనాలు నిలిచిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అంతే కాకుండా రాత్రి సమయాల్లో ఈ రహదారుల్లో జనసంచారం ఉండని పరిస్థితి. ఏ మాత్రం గుంతల్లో వాహనాలు ఆగిపోయినా పట్టించుకునేవారు ఉండరని వాహనదారులు వాపోతున్నారు. రహదారులు ఇలా ఉంటే ప్రయాణం ఎలా చేయాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్పించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. కాగా, తాడేపల్లిగూడెం పట్టణం, మండల పరిధిలో గడచిన 24 గంటల్లో 17.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మాధవరం, జగన్నాథపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు మండలం సజ్జాపురం, రామకృష్ణ మఠం, సొసైటీ రోడ్డు, రైల్వే స్టేషన్, పాతవూరు, ఇరగవరం కాలనీ, శివబాలాజీ నగర్, హరిప్రియ నగర్, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, మునిసిపల్ కార్యాలయం, కొమ్మాయిచెర్వు, టి.వేమవరం, ఎన్జీవో కాలనీ, ఉమెన్స్ కళాశాల, డీమార్ట్, కొండాలమ్మ పుంత, ఎన్టీఆర్ పార్కు, జాతీయరహదారి, సాయి హాస్పిటల్ ప్రాంతాల్లోను, తణుకు రూరల్ పరిధిలో తేతలి, పైడిపర్రు, వడ్లూరు, పసలపూడి, ఇండస్ట్రియల్ సర్వీసెస్, వేల్పూరు, కొమరవరం, వీరభద్రపురం, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

- మాజీ మంత్రి కారుమూరి పిలుపు
- నేటి నుంచి 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'

తణుకులో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ అని ఎన్నికల ముందు ప్రజల్ని నమ్మించి నేడు మోసగించిన తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్ని మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ఆ విషయంలో ప్రజలకు మోసపోయిన అనుభవం ఉన్నప్పటికీ మరోసారి నమ్మి మోసపోయారని అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇంటింటికీ వచ్చి ప్రజల ఫోన్ నంబరు ద్వారా ఓటీపీ సేకరించి ఇచ్చిన బాండ్ల సంగతేంటో ప్రజల్లో చర్చ మొదలైందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ముందుగా బాబు చేసిన మోసంపై శుక్రవారం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో భీమవరంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో కార్యక్రమ సమావేశం నిర్వహిస్తున్నారని, తిరిగి 6వ తేదీన తణుకులో ఈ కార్యక్రమం జరగనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సబ్బితి రాజేష్, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మెహర్ అన్సారీ, ఉండవల్లి జానకి, నూకల కనకదుర్గ, మెట్ల కిరణ్మయి, జంగం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తణుకులో సీపీఐ ప్రదర్శనలో పాల్గొన్న భీమారావు తదితరులు

తణుకు అర్బన్: వచ్చేనెల 6,7 తేదీల్లో ఉండిలో నిర్వహించనున్న సీపీఐ 27వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన సీపీఐ తణుకు ఏరియా మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు విజయవంతం చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్, 10 గంటల పని విధానం రద్దు చేయాలని కోరుతూ జూలై 9 న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ముందుగా సీపీఐ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు వాకలపూడి వీరరాఘవులు ఆవిష్కరించారు. సీపీఐ సీనియర్ నాయకులు వాకలపూడి వీరరాఘవులు, వంక నాగమణిలను ఘనంగా సత్కరించారు. సీపీఐ నాయకులు చుండ్రు వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శిగా సికిలే పుష్పకుమారి

మహాసభలో తొమ్మిదిమందితో సీపీఐ తణుకు ఏరియా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శిగా సికిలే పుష్పకుమారి, కమిటీ సభ్యులుగా వై.నాగలక్ష్మి, సావారపు దేవి, మంగం పెంటయ్య, పంపన నరసింహమూర్తి, కౌరు శ్రీను, పెదపోలు వెంకట్రావు, సబ్బితి బ్రహ్మయ్య, బొక్కా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

సేవకులకు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సాయం

తణుకులో సేవకులకు బియ్యం బస్తాలు అందజేస్తున్న ఎన్‌సీసీ నాయకులు

తణుకు అర్బన్: డాక్టర్ కె. శ్యామ్‌పాల్ స్థాపించిన నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) ఆవిర్భావ దినోత్సవం, ఇండియన్ క్రిస్టియన్ డే పురస్కరించుకొని స్థానిక బేతేలు రిఫార్మ్ చర్చ్ బ్రదర్ జాషువా జూడ్ చర్చిలో గురువారం 20 మంది సేవకులకు ఒక్కొక్కరికి 26 కేజీలు చొప్పున బియ్యం విరాళంగా అందజేశారు. ఎన్‌సీసీ ఆవిర్భవించి 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తణుకు పరిసర ప్రాంతాలలో సేవ చేస్తున్న సేవకులకు సహకారంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎన్‌సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.మనోజ్ బాబ్, కార్యదర్శి బి.డేవిడ్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ.శ్యామ్‌బాబు, గౌరవ అధ్యక్షుడు ఆర్.సాల్మన్ జోసెఫ్, ఉపాధ్యక్షుడు ఇ.విజయ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.ఐజాక్ బ్రెన్హం, కార్యదర్శి కె.బ్లెస్సింగ్ రాజు, కె.డేవిడ్ బాబు, ఇరగవరం మండలం అధ్యక్షుడు పి.యేసు బాబు, గౌరవ అధ్యక్షుడు ఎ.ఆగమన రావు, తణుకు నియోజకవర్గ నాయకులు కె.యస్.రాజు, బి.యేసు రత్నం, ఎస్.కృపావరం, ఎన్.స్టీఫెన్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కార్మిక సమస్యల పరిష్కారానికై ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావులు పిలుపునిచ్చారు. జిల్లా సీఐటీయూ కమిటీ పిలుపులో భాగంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా జీపు జాతాను స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, అజేయకుమారి, హసీనా, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో...

ఇఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ కోరారు. రాష్ట్ర కమిటీ వేసిన కరపత్రాన్ని గురువారం స్థానిక శేషమహల్ సెంటర్‌లో విడుదల చేశారు.

పార్సిల్ కార్యాలయాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

తణుకులో పార్సిల్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: పార్సిల్స్ రవాణా సంస్థలు తమ వద్దకు వచ్చే అనుమానిత పార్సిల్స్ సమాచారం ఎక్సైజ్ శాఖకు ఇవ్వాలని తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. గురువారం తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోని పార్సిల్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్సిల్స్ ద్వారా మద్యం, స్పిరిట్, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను తరలించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పార్సిల్స్ సంస్థలు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నవత, ఎస్ఆర్ఎమ్‌టీ, క్రాంతి, బ్లూ డాట్, వీఆర్ఎల్, డెలివరీ డాట్ కం, శ్రావణి, ఎస్ఎల్ఆర్‌టీ, ఏపీఎస్ ఆర్టీసీ కార్గో, రైల్వే పార్సిల్ సర్వీస్‌లతో పాటు ఆయా గోడౌన్‌లను తనిఖీ చేశారు. పార్సిల్ నిర్వహణదారులు పార్సిల్ బుక్ చేసే సందర్భంతో పాటు డెలివరీ చేసే సందర్భంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. తణుకు ఎక్సైజ్ శాఖ ఎస్సైలు పాల్గొన్నారు.

ఆరవల్లి బాధితులకు మాజీ మంత్రి కారుమూరి పరామర్శ

ఆరవల్లిలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కారుమూరి

అత్తిలి: ఇటీవల ఆరవల్లి గ్రామంలో దాడికి గురైన బాధితులను మాజీ మంత్రి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తరతరాలు నుంచి అన్నదమ్ములగా కలిసి మెలిసి ఉంటున్నా వారి మధ్య కొందరు దుష్ట శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చులు పెడుతున్నారని, మన గోదావరి జిల్లాలో లేని సంస్కృతిని కొత్తగా తీసుకుని వస్తున్నారని, ఇది అత్యంత హేయమైన చర్య అని కారుమూరి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే రాష్ట్రంలో ఇటువంటి దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఘర్షణలో తీవ్రగాయాలు పాలైనా బాధితులను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆరవల్లి గ్రామ ఉప సర్పంచ్ వెలుగల అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యన్నారాయణ, దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్ కుమార్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సబ్బితి రాజేష్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెనుమాల రాజేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె

తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు

తణుకు అర్బన్: మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరింది. తణుకు మునిసిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరపు శ్రీను, ప్రధాన కార్యదర్శి గెల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. ఎన్నో రోజులుగా నిరసనలు తెలుపుతూ తాము విధుల్లో కొనసాగామని కానీ తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. ఏళ్ల తరబడి విధుల్లో ఉన్న తమకు వచ్చే వేతనాలతో ఇళ్లు గడవని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమతో చర్చలు జరిపి తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడాల దానం, సత్యనారాయణ, పిండి పెద్దిరాజు, రమణ, రాంబాబు, కాంతారావు, సూర్యలక్ష్మి, తేజ, రమణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలకు అభినందన సత్కారం

దివ్యాంగుల పిల్లలకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలం పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగుల పిల్లలకు బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అభినందన సత్కారం చేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలకు నూతన వస్త్రాలు అందజేసి పిల్లలను అభినందించారు. దివ్యాంగుల పిల్లలను శాలువలతో సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పెంటపాడు ఎంఈఓ టీవీ రామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వ పరీక్షలలోను, ఉద్యోగాలలోను రాయితీలు కల్పించిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను చదువు వైపు బాటలు వేయాలని కోరారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ మాణిక్యాల రావు, పుసుపులేటి రామచంద్రరావు, యెగ్గిన నాగబాబు, యర్రా ఆంజనేయస్వామి, కొడవటిగంటి వెంకట నరసింహచార్యులు, పైలు శ్రీనివాస్, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

6న ఉచిత యాంటీ రాబిస్ వ్యాక్సిన్

పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదిన ఉదయం 9 గంటల నుంచి మండలంలోని పట్టెంపాలెం పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా యాంటి రాబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు మండల పశువైద్యాధికారి టి.వి.విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అత్తిలి: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈనెల6వ తేదీన అత్తిలి పశు వైద్యశాలలో కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ కె శంకరభావన్నారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. అత్తిలి పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూనోసిస్ డే సందర్భంగా అవగాహన సదస్సు కూడా జరుగుతుందని ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మొక్కలు నాటుతున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులు పేర్కొన్నారు. డైమండ్స్ ఆధ్వర్యంలో గురువారం నిట్ కళాశాల రోడ్డులో ఎన్‌క్లేవ్ వద్ద పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆర్‌సీ సుంకర శ్రీనివాస్, జెడ్‌సీ షేక్ బాజీ, పేరిచర్ల మురళీ కృష్ణంరాజులు పాల్గొన్నారు. బి.ఎ.నరసింహరాజు, సాగి సీతారామరాజులు సహకారంతో 250 మొక్కలు నాటారు. మొక్కలు సంరక్షణ చేపడతామని చెప్పారు. వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యతిరేక, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి సునీల్ కుమార్, కార్తీక్ తేజ, మానవతా సభ్యులు బంగార్రాజు, ఎస్.సత్యనారాయణ, కుందుం వెంకటేశ్వరరావు, సాయిరాం భాను, మధుబాబు, పేరిచర్ల ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక 9వ వార్డు మసీద్ రోడ్డు మండల ప్రాథమిక పాఠశాల, యర్ర నారాయణ స్వామి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పవర్ మేక్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో గురువారం ఆయా పాఠశాలల స్కూల్ పిల్లలకు 350 నోట్ పుస్తకాలు, స్టేషనరీ కిట్స్, బిస్కెట్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్, సెక్రటరీ మండ బ్రహ్మాజీ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

హద్దులు

[illegible]

తాడేపల్లిగూడెం, సెల్ : 93469 60787

పత్రికా ప్రకటన

[illegible]

E.P.No.179/2011 O.S.No.637/2008

Between :

D.H.R.: K.M.L.V. [illegible]

And

J.D.R.: [illegible]

బహిరంగ ప్రకటన

[illegible]

D.H.R. Value - Rs.60,000/-
Amina Value - Rs.2,00,000/-
S.R.O Value - Rs.4,56,000/-
// By orders of Court //

B.Com.,B.L.,

తేదీ:8.07.2025

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, వధువు వరుడు శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం

తణుకు

90102 23729

90100 68395

90100 51493

Office mail : tpgadvt@gmail.com

సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం। 4। జూలై। 2025

తొలి అడుగు కాదు.. చివరి అడుగు

ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనకు తొలి అడుగు కాదని, చివరి అడుగేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. -8లో

మైదుకూరులో పట్టపగలే చోరీ

మైదుకూరులోని సర్వాయపల్లె రోడ్డులో పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. దుండగులు 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/26.7

వాతావరణం

జిల్లాలో గురువారం 26.7 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 24.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పదోన్నతి జాబితాలో సీఐలు

కడప అర్బన్: రాయలసీమ జోనల్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తూనే డీఎస్పీలుగా పదోన్నతుల కోసం వేచివున్న దాదాపు 48 మంది సీఐల జాబితా రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి వెళ్లింది. వీరిలో 1995 నుంచి 1996 బ్యాచ్‌కు చెందిన వారే అధికంగా వున్నారు.

7,8 తేదీల్లో జిల్లాలో షర్మిల పర్యటన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 7,8 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు గురువారం డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 7న కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో ఆయనకు నివాళి అర్పిస్తారని వివరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి

ఒంటిమిట్ట: మండల పరిధిలోని చింతరాజుపల్లి అటవీ ప్రాంతంలో గురువారం అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ బొడ్డే వెంకటయ్య (48)పై ఎలుగుబంటి దాడి చేసింది. చింతరాజుపల్లి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగు నాయక్ కథనం మేరకు దాసర్లదొడ్డి వద్ద బేస్ క్యాంపు నిర్వహిస్తున్న ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లలో ఒకరైన వెంకటయ్యపై ఎలుగుబండి దాడి చేసింది. వెంకటయ్య కుడి మోకాలుకు తీవ్రగాయాలయ్యా యి. ఆయనను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వెంకటయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని నాగు నాయక్ తెలిపారు.

రామిరెడ్డి ఫార్మసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

కేక్ కట్ చేస్తున్న కళాశాల యాజమాన్యం

చింతకొమ్మదిన్నె: ఊటుకూరు సమీపంలోని ప్రకృతినగర్‌లోగల రామిరెడ్డి ఫార్మసీ కళాశాలకు యూజీసీ ఈ సంవత్సరం నుంచి ఐదేళ్ల వరకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ నెల్సన్ తెలిపారు. నాక్ గ్రేడ్ సాధించినందుకు, మౌళిక వసతులు కల్పించడం, నిష్ణాతులైన ఆచార్య బృందం కలిగి ఉండడం వలన యూజీసీ వారు రామిరెడ్డి ఫార్మసీ కళాశాల కు స్వయంప్రతిపత్తి కల్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, కరస్పాండెంట్ గౌతంరెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నెల్సన్ కుమార్, కోఆర్డినేటర్ మనోహర్ లను ప్రత్యేకంగా అభినందించారు. కరెస్పాండంట్ గౌతంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులకు, తల్లితండ్రులకు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. నరసింహ,రాజారాం,సుచరిత,కల్పన,సలోమి,సుమలత, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాబు మోసాలను నిలదీద్దాం

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు

కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- బాండ్లు చూపి అమలును ప్రశ్నించండి
- అప్పులు తప్ప సంక్షేమం సున్నా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించిన ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలో వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ' పేరిట రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రదర్శించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు హామీలు అమలు చేయకుండా అందరినీ మోసగించారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల పేరిట ఎన్నికల సమయంలో ఇంటింటికి బాండ్లు పంపిణీ చేశారని, అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోతే నిలదీయండంటూ చెప్పారన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వం పేరిట వస్తున్న నాయకులను బాండ్లు తీసుకుని నిలదీయాలన్నారు. ఇందుకు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. పోలీసు భద్రత లేకుండా ఇంటింటికి వెళ్లి తమ సుపరిపాలన గురించి చెప్పే ధైర్యం టీడీపీ నేతలకు ఉందా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, ఇప్పుడు కొర్రీలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 19 నుంచి 59 సంవత్సరాల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామన్న హామి ఏమైందంటూ ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు తేవడం పట్ల సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న భృతి ఏమైదంటూ ఆయన నిలదీశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరిట ప్రజల్లోకి వెళ్లి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ దాసరి సుధ, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, నగర మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాష, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, కడప పార్లమెంటు పార్టీ పరిశీలకులు కొండూరుఅజయ్‌రెడ్డి, కమలాపురం పార్టీ ఇన్‌ఛార్జి నరేన్ రామాంజులురెడ్డితోపాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనకచర్లపై డైవర్షన్ పాలిటిక్స్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని అమలు చేయకుండా, తగుదునమ్మా అంటూ 'సుపరిపాలనకు తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచిపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా త్రికరణ శుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

బాబు, రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

పోలవరం–బనకచర్ల విషయంలో గురు శిష్యులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఈ సందర్భంగా అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా అన్నారు. ప్రజల్లో తమ పాలన పట్ల ఉన్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు బనకచర్ల అంశాన్ని ఇద్దరు వాడుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయాలన్న ఆలోచనే లేదన్నారు. 2014లో గోదావరి జలాలను పెన్నాకు తరలించే బృహత్తర కార్యక్రమాన్ని చేపడతామని హామీ ఇచ్చి మోసగించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై జగన్‌కు మాత్రమే చిత్తశుద్ధి ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు: పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీషు పోస్టు కసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీషు పోస్టు (గెస్ట్ ఫ్యాకల్టీ) అర్హులైన వారి నుంచి ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీషు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈనెల 8వ తేదీ డెమో క్లాసులు కళాశాలలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. డెమో క్లాసుల అనంతరం ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ రాజ్యలక్ష్మి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని మహిళా సర్పంచులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. గురువారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ మహిళా సర్పంచులు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు చైతన్యవంతులు అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ నాగభూషణం, డీఎల్‌డీఓ, మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

పురాతన ఆలయం.. సుమనోహర క్షేత్రం

- 5 నుంచి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు
- 11న కల్యాణోత్సవం
- 12న రోథోత్సవం
- భారీఎత్తున తరలిరానున్న భక్తులు

నందలూరు సౌమ్యనాథస్వామివారి మూలవిరాట్

నందలూరు: అన్నమయ్య జిల్లా నందలూరులోని సౌమ్యనాథాలయం ఎంతో పురాతనమైనది. దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ ఆలయంగా పేరుగాంచింది. సుందర మనోహర క్షేత్రం..శిల్ప సౌందర్య సోయగం స్వామి భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్నారు. తెలుగురాష్ట్రాలతోపాటు తమిళనాడులోనూ భక్తులు ఉన్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 4న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. 5న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలివాహనం, 6న ఉదయం పల్లకీసేవ, రాత్రి హంసవాహనం, 7న ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహవాహనం, 8న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హనుమంతు వాహనం, 9న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ రాత్రికి చంద్రప్రభ వాహనం, 11న ఉదయం కళ్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 13న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 14న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.బ్రహ్మోత్సవాలకు వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతల నుంచి భక్తులు వేల సంఖ్యలో రానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

ప్రత్యేకత: బ్రహ్మమానస పుత్రుడు, త్రిలోక సంచారి నారదుడు నందలూరు గ్రామంలో వెలసిన సౌమ్యనాథాలయలంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రతిష్టించారని శాసనాలు ధృవీకరిస్తున్నాయి.

కోర్కెలు తీర్చే దేవుడు

గర్భగుడి చుట్టూ 9 ప్రదక్షిణలు చేస్తే కోర్కెలు నెరవేరతాయనే విశ్వాసం భక్తుల్లో ప్రగాఢంగా ఉంది. కోర్కెలుతీరాక గర్భగుడి చుట్టూ 108 ప్రదక్షిణలు చేయడం క్షేత్ర సంప్రదాయంగా వస్తోంది. సంతానం కలగని వారు స్వామిని ప్రార్థిస్తే కలుగుతుందని భక్తులు నమ్ముతున్నారు.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి

నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో స్వర్ణాంధ్ర విజన్– 2047లో భాగంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 విజన్ సాకారానికి ప్రజా ప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రో యాక్టివ్ గా పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల అంశాలను సాధించడానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 78వేల బంగారు కుటుంబాలను గుర్తించామని నియోజకవర్గంలోని మండల వారీగా బంగారు కుటుంబాల మ్యాపింగ్ లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగం జిల్లాలో మరో ప్రధాన కీ రోల్ ప్లే చేస్తోందని మున్సిపల్ కమిషనర్లు అందరూ అనుమతులను సులభతరం చేసి రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వారంలో రెండు రోజులు రియల్టర్లతో ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించాలన్నారు. లేఔట్స్ బిల్డింగ్ నిర్మాణాల వంటి అనుమతుల్లో జాప్యం తగ్గించి త్వరితగతిన మంజూరు చేస్తే మున్సిపాలిటీలకు అధిక రాబడి వస్తుందని ఆ విధంగా మున్సిపాలిటీలు అభివద్ధి చెందుతాయన్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నియోజకవర్గంలో ఇండస్ట్రియల్, కన్స్ట్రక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి వృద్ధి సాధించాలన్నారు. రాయలసీమలోని కడప నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని అందుకు అనుగుణంగా ఎమర్జింగ్ ఏరియాలను గుర్తించి ఓపెన్ లేఔట్లు ట్రేడింగ్ లలో అనుమతులను సరళతరం చేయాలన్నారు. ముందుగా వ్యవసాయం, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, పశుసంవర్ధక, ఫిషరీస్ వంటి శాఖల్లో జిల్లా అధికారులు యాక్షన్ ప్లాన్ కనుగుణంగా లక్ష్యాల సాధనకు ఏ విధంగా కృషి చేస్తున్నారన్న అంశాలపై జిల్లా కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్యా, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, బద్వేలు ఆర్టీవో చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయి,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

సంతృప్త స్థాయిలో ప్రజాస్పందనలు

ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి స్పందన సానుకూలంగా, సంతృప్త స్థాయి పెరిగేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల జిల్లా అధికారులకు సూచించారు. గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ హాజరయ్యారు.

తెరపైకి నకిలీ పట్టాల వ్యవహారం

- పోలీసుల అదుపులో పలువురు అనుమానితులు?
- అనుమానితుల్లో ఓ వీఆర్‌ఓ
- నకిలీ పాసుపుస్తకాలు, సీళ్లు స్వాధీనం
- అక్రమార్కుల గుండెల్లో గుబులు

గతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పట్టాలు, సీళ్లు (ఫైల్)

బద్వేలు అర్బన్: వైఎస్సార్ కడప జిల్లాలోని బద్వేలు కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ పట్టాల వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చింది. తాజాగా ఓ మహిళ తన పేరిట ఉన్న ఇంటిపట్టాను ముగ్గురు వ్యక్తులకు అమ్మడం ద్వారా కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో భాగంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వారిలో బద్వేలు నియోజకవర్గంలోని ఓ తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే వీఆర్‌ఓ ఉన్నట్లు తెలిసింది. అనుమానితుల్లో కొందరి వద్ద నుండి నకిలీ పాసుపుస్తకాలు, సీళ్ళు స్వా. దీనం చేసుకున్నట్లు సమాచారం.

మళ్ళీ తెరపైకి నకిలీ పట్టాల వ్యవహారం

సుమారు మూడేళ్ళ క్రితం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బద్వేలు నకిలీ పట్టాల వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చింది. బద్వేలు కేంద్రంగా ప్రభుత్వ స్థలాలకు, డీకేటీ పట్టాలకు కొంత మంది వ్యక్తులు అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో భారీగా నకిలీ పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలకు పాల్పడ్డారు. దీంతో బద్వేలులో ప్రతినిత్యం రెవెన్యూ, పోలీసు కార్యాలయాలకు స్థలాల సమస్యను బాధితులు తీసుకెళుతుండేవారు. ఈ క్రమంలో అప్పటి రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకులవెంకటరమణ నకిలీ పట్టాలపై ప్రత్యేక దృష్టి సారించి కొందరు అనుమానితులను గుర్తించి వారిపై అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి నకిలీ పట్టాల వ్యవహారాన్ని బహిర్గతం చేశారు. 2022 మేలో అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నెం. 112/22 కేసులో 19 మందిపైన, 118/22 కేసులో 7 మందిపైన కేసులు నమోదు చేసి కొంత మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా పట్టణంలోని మార్తోమానగర్‌కు సమీపంలో 812 సర్వే నెంబర్‌లో తన పేరిట పట్టా ఉన్న ఓ మహిళ మొదట ఆ పట్టాను ఓ వ్యక్తి వద్ద కుదువకు ఉంచింది. తర్వాత అదే ప్లాట్‌ను నకిలీ పట్టాతో మరో వ్యక్తికి విక్రయించింది. అంతటితో ఆగక మరో నకిలీ పట్టాను పొంది మూడవ వ్యక్తికి సైతం స్థలాన్ని విక్రయించింది. విషయం తెలుసుకున్న బాధితులు అర్బన్ పోలీసులను ఆశ్రయించగా విచారించి సదరు మహిళతో పాటు అందుకు సహకరించిన వారిపై మూడు రోజుల క్రితం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

నకిలీ పట్టాలు సృష్టించి ముగ్గురికి విక్రయించిన ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సదరు మహిళకు నకిలీ పట్టాలు ఎవరు తయారు చేసి ఇచ్చారో తెలుసుకునేందుకు విచారణ వేగవంతం చేశారు. ఈ క్రమంలో గతంలో నకిలీ పట్టాల వ్యవహారంలో రిమాండ్‌లో ఉండి వచ్చిన పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో గోపవరం మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి వద్ద, నియోజకవర్గంలోని ఓ తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే వీఆర్‌ఓ వద్ద కొన్ని నకిలీ సీళ్ళు, నకిలీ పాసుపుస్తకాలు స్వా. దీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే నకిలీ పట్టాల తయారీలో వీరి ప్రమేయం ఏమైనా ఉందా అన్న కోణంలో విచారిస్తున్నారు. అందులో భాగంగా గతంలో నమోదైన రెండు కేసుల్లో ఉన్న ఐదు మందిని, బద్వేలు రూరల్ పరిధిలోని నందిపల్లె సమీపంలో గల ఓ గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో భాగంగా బుధవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సైతం అనుమానితులను విచారించినట్లు తెలిసింది.

అక్రమార్కుల గుండెల్లో గుబులు

2022 మే నెలలో నకిలీ పట్టాల వ్యవహారం వెలుగు చూసిన తర్వాత బద్వేలు పరిసర ప్రాంతాల్లో నకిలీ పట్టాల తయారీ సద్దుమణిగింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బద్వేలులో మళ్ళీ నకిలీ పట్టాల వ్యవహారం తెరపైకి వచ్చింది. విలువైన స్థలాలు ఉన్న ఎన్‌జీవో కాలనీ, నెల్లూరు రోడ్డు, మహమ్మద్‌కాలనీ, చెన్నంపల్లె తదితర ప్రాంతాలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్‌పర్పస్, రస్తా పోరంబోకు స్థలాలకు కొందరు అధికార పార్టీ నాయకులు నకిలీ పట్టాలు తయారు చేయించుకుని నిర్మాణాలు చేపట్టారు. అధికారం అండదండలతో ప్రశ్నించే వారు లేకపోవడంతో యదేచ్ఛగా తమ కార్యకలాపాలు కొనసాగించారు. అయితే ప్రస్తుతం నకిలీ పట్టాల వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చి కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తుండటంతో ఎక్కడ తమ పేర్లు బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

రేపు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లో సంప్రదించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ సి యామిని, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్.
కడప నగరము, కడప జిల్లా

ఖాళీ స్థలములు లీజు లైసెన్స్ హక్కునకు ఈ–టెండర్ మరియు సీల్డు టెండర్ (కం.)బహిరంగ వేలం ప్రకటన

కడప నగరములో నాగరాజు పల్లె (పాత బస్టాండ్ ప్రక్కన) వున్న శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప నగరములో నాగరాజు పల్లె సర్వే నెంబరు.6 లో గల 2 ప్లాట్స్ 1. ప్లాట్–A విస్తీర్ణం : (37.09 సెంట్స్ / 1,795 Sq. Yards), 2. ప్లాట్–B విస్తీర్ణం : (38.22 సెంట్స్ / 1,850 Sq. Yards) ఖాళీ స్థలములు 11 సంవత్సరముల కాలపరిమితికి లీజు హక్కులను పొందుటకు షెడ్యూలు ప్రకారము ఈ–టెండరు, సీల్డు టెండరు (కం.) బహిరంగ వేలము నిర్వహించబడును. ఈ టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేది. 17.07.2025. ఉదయం 10.00 గంllకు. మరిన్ని వివరములకు www.eprocurement.gov.in ను సందర్శించగలరు. సీల్డు టెండర్లు సోమవారం 14.07.2025 ఉదయం 10.00 గంllల నుండి బుధవారం 16.07.2025 సాయంత్రం 5.00 గంllల లోపల ప్రతి షెడ్యూలుకు రు.5,000.00 చెల్లించి శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ ఆఫీసు నందు (2) రెండు ప్లాట్స్ కు వేరు వేరు దరఖాస్తు ఫారాలు పొందగలరు. పూర్తి చేసిన సీల్డు టెండరు గురువారం 17.07.2025 ఉదయం 10.00 గంllలకు సదరు ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము వద్ద టెండరు బాక్సు నందు వేయవలెను.

బహిరంగ వేలము పాట గురువారం 17.07.2025 ఉదయము 10.00.గంllలకు శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప ఛారిటీస్ వారి లీజు ప్రాంగణము నందు జరుగును. ఇతర వివరములకు :+91 83318 90511 ను సంప్రదించగలరు.

వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు మరియు సెక్రటరీ
శ్రీ యాదాళ్ళ పిచ్చయ్య చెట్టి ఛారిటీస్ అసోసియేషన్, కడప.
ఆఫీస్ అడ్రస్ : ఫ్లాట్ నెం.301, 3rd ఫ్లోర్, 20/999-9-3-5, కొత్తలింగడ్డ హైట్స్, కో–ఆపరేటివ్ కాలనీ, సియర్ ACB ఆఫీస్, కడప–516001.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన భాను, షఫీలకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు స్థానిక సరస్వతి విద్యా మందిరం సమీపంలో నివాసముంటున్నారు. షఫీ వాటర్ సర్వీసింగ్ సెంటర్లో పని చేస్తూ తమ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాను క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్టుకున్న బియ్యం వద్ద విజిలెన్స్, రేషన్ అధికారులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో గోడౌన్లో అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ సీఐ శివన్న, సివిల్ సప్లయ్ డీటీ సుధీర్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. ఈ సందర్భంగా 221 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. వెంటనే పులివెందులలోని ప్రభుత్వ గోడౌనుకు తరలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయినాథ్రెడ్డి, వీఆర్ఓ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అయితే ఇదే గోడౌన్లో రెండు నెలల క్రితం అక్రమ రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అయినా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కలకడ : కలకడలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కలకడ ఇందిరమ్మ కాలనీకి చెందిన మేస్త్రీ కలాం తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఇందిరమ్మ కాలనీ నుంచి కలకడకు నడచి వెళ్తుండగా.. రాయచోటి నుంచి కలకడ వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని కలకడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

పట్టాలెక్కిన రైల్వేవన్ యాప్!

- స్పీడ్గా అన్ని రకాల సేవలు
- అందుబాటులోకి వచ్చిన యాప్
- ఐఆర్టీఎస్తో ఫుడ్ ఆర్డరింగ్
- నిమిషానికి 1.5 లక్షల టికెట్ల బుకింగ్ లక్ష్యం

రాజంపేట : భారతీయ రైల్వే ప్రయాణికులకు అన్ని రకాల సేవలందించేందుకు రైల్వేవన్యాప్ను రైల్వేశాఖ పట్టాలెక్కించింది. రైల్వేల ద్వారా మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు ఒకే యాప్ను డిజైన్ చేసింది. ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) పేరిట తీసుకొని.. ఈ యాప్ ద్వారా అన్ని సేవలను అత్యంత వేగంతో యాక్సిస్ చేసే వీలుంటుంది.

ప్రయాణికులకు అందే సేవలు

- టికెట్ బుకింగ్, రిజర్వేషన్, అన్ రిజర్వుడ్, ప్లాట్ఫాం టికెట్ బుకింగ్
- ప్లాన్మై జర్నీ టూల్ ద్వారా వివిధ తరగతులలో కోటాలో టికెట్ల బుకింగ్
- అన్ రిజర్వుడ్, ప్లాట్ఫాం టికెట్లపై 3 శాతం డిస్కౌంట్

రైలు స్థితి తెలుసుకోవడం ఎలా..

- రైలు స్థితి, ప్లాట్ఫాం నంబరు, ఆలస్యం తదితర వివరాలు
- కోచ్పొజిషన్ పీఎన్ఆర్ స్టేటస్, రీఫండ్
- ముందస్తు రిజర్వేషన్ టికెట్ ప్రస్తుత స్థితిగతులు, టికెట్ పీఎన్ఆర్ నంబరు ద్వారా సీటు కన్ఫర్మేషన్ స్టేటస్, రైళ్ల రద్దు, రిజర్వేషన్ రద్దు తదితర సేవలు

ఫుడ్ ఆర్డరింగ్..

- ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరజిం కార్పొరేషన్ లిమిటెట్ (ఐఆర్టీసీ) యాప్ ద్వారా వివిధ రైల్వేస్టేషన్లకు చేరుకునేందుకు ముందుగా.. నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం, రైల్వేస్టేషన్కు రైలు చేరుకున్నాక సీటు వద్దకే ఫుడ్ చేర్చడం

యాప్ ఎలా డౌన్లోడ్...

- ఆండ్రాయిడ్ ఫోన్లలోనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకునే వీలుంది.

httpr://pay.goofe.com/sotre/app/detair?orf.crir.akam

ఐవోఎస్ యాప్ నుంచి...

httpr://appr.appe.com/in/app.raione/id 6473384334

ఉపయోగించే విధానం..

- యాప్ను డౌన్లోడ్ చేశాక. రైల్కనెక్ట్ లేదా యూటీఎస్ యాప్ లాగిన్ వివరాలతో లాగిన్ కావాలి.
- కొత్త వినియోగదారులు మొబైల్ నంబరు, ఓటీపీ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి.
- mPIN లేదా బయోమెట్రిక్ ద్వారా సులభంగా లాగిన్ కావచ్చు.
- ప్లాన్ మై జర్నీ లేదా మై బుకింగ్ వంటి ఆప్షన్లను ఉపయోగించి సేవలను యాక్సెస్ చేయవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ఒకే యాప్లో ఐఆర్టీఎస్ రైల్ కనెక్ట్, యూటీఎస్, రైల్మదద్, ఎన్టీఈఎస్, ఫుడ్ ఆన్ ట్రాక్ వంటి సేవలు
- బహుళ యాప్ల అవసరం తగ్గించి, డివైస్ స్టోరేజి ఆదా చేసుకోవచ్చు.
- సరళమైన ఇంటర్ఫేస్, సింగల్ సైన్–ఆన్ ద్వారా ఉపయోగం సులభతరం
- 2025 డిసెంబర్ నాటికి కొత్త పీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.5 లక్షల టికెట్స్ బుకింగ్, 40 లక్షల ఎంక్వైరీలు నిర్వహించగల సామర్థ్యం.

దేవదాయ ఆస్తులను కాపాడుకుందాం

మాట్లాడుతున్న తిరుపతి మల్టీజోన్ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్

రాయచోటి టౌన్ : దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు చెందిన ఆస్తులను కాపాడుకొనేందుకు మార్గదర్శకాలు అమలు చేస్తున్నట్లు తిరుపతి మల్టీజోన్ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ చెప్పారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్లతోపాటు అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి జిల్లాల దేవదాయ శాఖ, తనిఖీ, కార్యనిర్వహణ అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి మార్గదర్శకాలు సూచించారు. వాటిలో ముఖ్యమైనవి కింది విధంగా ఉన్నాయి.

- కార్యనిర్వహణ అధికారుల ఆధీనంలో ఉన్న దేవదాయల ప్రాపర్టీ రిజిస్టర్లపై పరిశీలన
- రెవెన్యూ వివరాలు నమోదు కాని వివరాల పరిశీలన
- ఆర్ఓఆర్ చట్టం ప్రకారం సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు అప్పీలు చేయవల్సిన వివరాల పైన..
- 1బి. పట్టాదార్ పాస్ పుస్తకాలలో దేవాలయాల పేర్లు చేర్చడం, దాని కోసం మీ సేవ ద్వారా తహసీల్దార్లకు అర్జీలు ఇవ్వడం
- సంస్థల సర్వీస్ ఇనామ్ వివరాలు (ఐఎఫ్ఆర్/ఇనామ్–బి రిజిస్టర్/ఆర్ఎస్ఆర్ ప్రకారం
- సంస్థల భూముల లీజు/ షాప్స్, ఇతరత్రా లైసెన్స్ ఆమోదం ఉత్తర్వులు
- దేవదాయ చట్టం సెక్షన్ 83 కింద ఇప్పటి వరకు ఆక్రమణదారులకు జారీ చేసిన (ఎవికే షన్ నోటీస్) తొలగింపు నోటీసులు
- 11/33 ఏళ్ల లీజు ప్రతిపాదనలు
- జీవో 60 ప్రకారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన భూ రక్షణ కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాలు
- సామూహిక ఆక్రమణల (మాస్ ఎంక్రోచ్మెంట్) స్థితి వంటి విషయలపై చర్చించి అధికారులందరికీ మార్గదర్శకాలు జారీ చేశారు. వీటన్నింటినీ అమలు చేయాలని ఆదేశించారు.

తొలి అడుగు కాదు.. చివరి అడుగు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనకు తొలి అడుగు కాదని, చివరి అడుగేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. 1978లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో ప్రారంభమైన చంద్రబాబు రాజకీయ జీవితం 2028కి జగన్తో సమాప్తం కానుందని అన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రస్తుతం ఇంటింటా తిరుగుతూ గొప్పలు చెప్పుకొంటూ తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు దొరసానిపల్లెలోని శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్రెడ్డితోపాటు ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి హాజరవుతారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ అభిమానులందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. మూడు పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వంగా ఏర్పడి ఎన్నికల సందర్భంగా అలివిగాని హామీలు ఇచ్చారని రాచమల్లు వ్యాఖ్యానించారు. సుమారు 143 హామీలు ఇచ్చినా కేవలం నాలుగైదు మాత్రమే అరకొరగా అమలు చేశారని తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కూటమి నేతలు బాండ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ బాండ్లు ప్రామిసరి నోట్తో సమానమని, వీటిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునన్నారు.

ఎమ్మెల్యే వరద సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి వచ్చి ప్రజలకు సేవ చేయాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అస్వస్థతకు గురైన ఆయనకు బైపాస్ సర్జరీ చేసినట్లు ఆయన కుమారుడు కొండారెడ్డి తెలిపారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు రాగుల శాంతి, చింపిరి అనిల్ కుమార్, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్రెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్సీపీ రాజుపాళెం మండల కన్వీనర్ బాణా కొండారెడ్డి, వెంకటేష్, రామమోహన్రెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరులో పట్టపగలే చోరీ

15తులాల బంగారు, రూ.10 వేలు అపహరణ

చోరీ జరిగిన ఇంటిలో తెరిచిన బీరువా తలుపులు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో గురువారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. వేద వ్యాస హైస్కూల్ పక్కనే ఉన్న ములపాకు జంగంరెడ్డి చిన్న సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దుండగులు చొరబడి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయపల్లెకు చెందిన చిన్న సుబ్బారెడ్డి ఆరేళ్ల కిందట మైదుకూరులో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తెకు వివాహం కాగా, ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల ఉన్నారు. గురువారం చిన్న సుబ్బారెడ్డి భార్య మునెమ్మ వరి నాట్లకు వెళ్లగా, ఆయన గ్రామం వద్ద సాగు చేసిన పసుపు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు.. ఇంటి ప్రధాన ద్వారం తాళాన్ని గడెలతో సహా పెకలించి లోపలికి ప్రవేశించారు. ఇంటిలో కుడి వైపున బెడ్ రూమ్లో ఉన్న బీరువా తలుపులను పగులగొట్టి అందులో ఉంచిన 22 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న భార్యభర్తలు తలుపులు పగలగొట్టి ఉండటం చూసి.. ఆందోళనతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు వస్తువులు, నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని భావించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి బాధితుల ఇంటికి చేరుకుని పరిశీలించారు. కడప నుంచి వేలి ముద్రల నిపుణులను పిలిపించారు. వారు ఇంటిలోని బీరువా, ఇతర వస్తువులపై పడిన వేలి ముద్రలను సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పోలీస్స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లు

కమలాపురం : కమలాపురం మండలంలోని కంచన్నగారిపల్లె గ్రామ సమీపంలో పెన్నా నది వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. గురువారం ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్ఐ పోలీస్, రెవెన్యూ సిబ్బందితో కలసి పెన్నా నది వద్దకు చేరుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

మోటారు సైకిల్ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గాయపడిన ఈశ్వర్

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం కనంపల్లె – ఓదులపల్లి తండా గ్రామాల మధ్యలో గురువారం మోటార్ సైకిల్ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం ఉడుములకుర్తి నుంచి ద్విచక్ర వాహనంలో గంగరాజు తన కుమారులు ఈశ్వర్, దేవేంద్రతోపాటు భార్యతో కలిసి పులివెందులలోని సర్వజన ఆసుపత్రికి వస్తుండగా.. కనంపల్లె గ్రామ సమీపంలోని ఓదులపల్లె తండా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వర్, దేవేంద్రతోపాటు గంగరాజు, అతని భార్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు

వేంపల్లె : వేంపల్లె మండల పరిధిలోని తాళ్ళపల్లె – ముసల్రెడ్డిపల్లె మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాసం గంగరాజు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముసల్రెడ్డిపల్లెకు చెందిన గంగరాజు బైకుపై వేంపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని మోటార్ బైకులో గురువారం రాత్రి వేంపల్లె నుంచి గంగరాజు, దుగ్గన్నగారిపల్లెకు చెందిన బుసిరెడ్డి శివానందరెడ్డిలు ముసల్రెడ్డిపల్లెకు వెళ్తూ గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ వీరి మోటార్ బైకు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. దీంతో అక్కడికక్కడే బాసం గంగరాజు మృతి చెందాడు. బుసిరెడ్డి శివానందరెడ్డికి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన గంగరాజు, తీవ్రంగా గాయపడిన శివానందరెడ్డి

21 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వేంపల్లి : బద్వేలులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభల జయప్రదానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గారి చంద్ర కోరారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతోందన్నారు. పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా సీపీఐ పోరాడుతోందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ 2014 ఎన్నికల్లో నల్లధనం వెలికితీత, పన్నుల భారం తగ్గింపు, ధరల నియంత్రణ, ప్రతి అకౌంట్లో లక్షల డబ్బు జమ, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాలు ఇచ్చిందన్నారు. వాటి అమలులో వైఫల్యాన్ని సీపీఐ ఎండగడుతోందన్నారు. సంపద సృష్టిలో భాగస్వాములైన కార్మికులు, కర్షకులను దోపిడీ చేసే చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తోందన్నారు. విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరం పూర్తికి నిధులు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆర్థిక లోటు భర్తీ, విద్యా, వైద్య సంస్థల సాధనకై దశల వారీ పోరాటాలను సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, వేంపల్లి మండల కార్యదర్శి అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ

బిర్యాని సెంటర్ను తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని హోటళ్లు, బిర్యాని సెంటర్లు, చికెన్ పకోడ సెంటర్లను జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుచి, శుభ్రత, లైసెన్స్ లేకుండా హోటళ్లు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రొద్దుటూరులోని చిన్న, పెద్ద హోటళ్లపై పలువురు ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఖాదరబాద్లోని మహ్మద్ బిర్యాని సెంటర్, డీ మార్ట్ ఎదురుగా ఉన్న లక్ష్మీనరసింహా బిర్యాని సెంటర్, సాగర్ రెస్టారెంట్, బీజీఆర్ బార్ అండ్ రెస్టారెంట్, సుందరాచార్యుల వీధిలోని చికెన్ పకోడ సెంటర్లను తనిఖీ చేసినట్లు చెప్పారు. చికెన్ పకోడ తయారు చేస్తున్న వారు వినియోగించే ఆయిల్ బాగలేదని గమనించామన్నారు. కొందరికి నోటీసులు జారీ చేశామని, తీరు మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. టీపీసీ మీటర్తో ఆయిల్ను చెక్ చేశామన్నారు. మహ్మద్ బిర్యాని సెంటర్ నుంచి మటన్ బిర్యాని, చికెన్ కర్రీ ఐటమ్స్, బీజీఆర్ బార్ అండ్ రెస్టారెంట్లోని కొన్ని పదార్థాలను ల్యాబ్కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ శాంపిల్స్లో ఏమైనా రిమార్క్ వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ నడపకూడదన్నారు. తప్పనిసరిగా అనుమతులు తీసుకుని స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలన్నారు. ఆమె వెంట కొత్తపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల కార్యదర్శులు రామమోహన్రెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి హత్య

- రెండో భార్యపై అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ వెల్లడి

మృతి చెందిన చంద్రశేఖర

విచారణ చేస్తున్న సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె రూరల్ : భవన నిర్మాణ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు రెండో భార్య హత్య చేసిందంటూ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి మదనపల్లి మండలంలో వెలుగు చూసిన ఘటనకు సంబంధించి, కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం కొత్తవారిపల్లె పంచాయతీరెడ్డి గాని పల్లెకు చెందిన వీరభద్ర కుమారుడు వి.చంద్రశేఖర(42) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. పలమనేరుకు చెందిన మహిళతో వివాహం కాగా, కొంత కాలం క్రితం ఆమె చంద్రశేఖర్ను వదిలి వెళ్లిపోయింది. అనంతరం రమాదేవిని రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి దీక్షిత(9) చైతన్యకుమార్(5) సంతానం ఉన్నారు. ఈ క్రమంలో చంద్రశేఖర మద్యానికి బానిసై, పనులకు వెళ్లడం పూర్తిగా మానేశాడు. దీంతో కుటుంబంలో తరచు గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి వివాదం ఏర్పడి తీవ్ర గొడవ జరిగింది. గొడవ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన విషయం బయటకు తెలియలేదు. అయితే గురువారం రాత్రి చంద్రశేఖర ఇంట్లోనే మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. భార్య రమాదేవిని విచారణ చేస్తే సరైన సమాధానం ఇవ్వకపోగా, ఎప్పుడు చనిపోయాడు తనకు తెలియదంటూ సమాధానం దాటవేసింది. అంతేకాకుండా మృతుడి శరీరం, తలపై రక్త గాయాలు ఉండడంతో, అనుమానం వ్యక్తం చేస్తూ స్థానికులు వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తాలుకా సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర మృతిపై భార్య రమాదేవిని పోలీసులు ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు చంద్రశేఖర తమ్ముడు మహేష్ కుమార్ మాట్లాడుతూ... తన సోదరుడు మృతికి రమాదేవి కారణమని, మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కాగా వివాహేతర సంబంధం నేపథ్యంలోనే చంద్రశేఖర్ మృతి చెంది ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. అయితే మృతికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

విద్యార్థులపై మందుబాబు దాడి

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిన్నమండెం : విద్యార్థులపై తాగుబోతు దాడి చేసిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బోనమల ప్రభుత్వ పాఠశాలలో పలువురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాబు(పుష్ప) మద్యం తాగి.. ఆ విద్యార్థులపై మధ్యాహ్నం ఉపాధ్యాయులు లేని సమయం చూసుకొని దాడి చేశాడు. దీంతో గాయపడ్డ పలువురు విద్యార్థులను వెంటనే 108 వాహనంలో రాయచోటి ఆస్పత్రికి తరలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు లేనిది చూసి తమను తాగుబోతు చేతులు మడమ తిప్పాడని పలువురు పిల్లలు ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
గుంటూరు మరియు కర్ణాటక (బాగల్కోట్ జిల్లా ఇల్కల్) నందు పనిచేయుటకు
అకౌంటెంట్స్ - 4
మైనింగ్ ఫస్ట్ క్లాస్ మేనేజర్ మరియు సెంకండ్ క్లాస్ మేనేజర్ కావలెను.
జీతం : 18,000/- & భోజనం+ రూమ్ వసతి
సంప్రదించండి
Veera Bhadra Minerals PVT.LTD
Hyderabad
CELL : 9542801919,9490216064
Mail id's : vbmhyd@yahoo.com and vbmpvtltd@yahoo.com

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్ట్10th, Inter, (వయస్సు18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366.

SERIVCES
జ్యోతిష్యాలయం
■ ఉచిత జ్యోతిష్య పీఠం. ఏ రకమైన సమస్యలకైనా 3 రోజుల్లో శాశ్వత పరిహారం. స్త్రీ/పురుషుల గుప్త, కఠిన సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం. సంప్ర: వై.సురేష్ గురూజీ, 9177882922.

PERSONAL CARE
CHANGE OF NAME
■ I, BACHCHU VEERA RAGHVA S/O, BACHCHU VEERA BRAMHAIAH (OLD NAME) R/O. 18/285, SESHUGARI ST, PRODDATUR POST & MDL, YSR DIST, AP. Changed my Name as BACCHU VEERA RAGHAVA S/O, BACCHU VEERA BRAMHAIAH.
■ I, BACHCHU SUVARANA W/O, BACHCHU VEERA RAGVA (OLD NAME) R/O.18/285, SESHUGARI ST, PRODDATUR POST & MDL, YSR DIST, AP. Changed my name as BACCHU SUVARNA W/O, BACCHU VEERA RAGHAVA.
■ I, PORUMOMILLA SUSEELA D/o. PORUMOMILLA SUBBA RAO R/o. 20/28-5, Yerraguntla Road, Proddatur,have changed my name to PORUMOMILLA SUSEELA for all future purposes.

WANTED
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999
■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

గమనిక

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409